ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2013 Q1 జనవరి – మార్చి ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

**తెలుగు ముచ్చట్లు 01**
**తెలుగు ముచ్చట్లు 02**
చేటలో తవుడుందా..?
టిడిపి డేమేజి కంట్రోల్
ఇటాలియన్ మొగుళ్లు
**తెలుగు ముచ్చట్లు 03**
అక్బరుద్దీన్ ఆగ్రహభాషణం
**తెలుగు ముచ్చట్లు 04**
బాబు నోట ఎన్టీయార్ స్మరణ
విడాకుల వేదన నుండి బయటపడేందుకు – "డాన్స్ ఎగైన్"
**తెలుగు ముచ్చట్లు 05**
'శుభ్ర' తెలంగాణ
సమైక్య సదస్సు
రెండు అడిగితే మూడోది బోనస్..
**తెలుగు ముచ్చట్లు 06**
చివాట్లు తిన్నారా?
..ప్లస్ వన్ వేసుకోండి, కేకే గారూ
మానిఫెస్టోల కింత వేల్యూ వుందా!?
కిరణ్‌గారికి బహిరంగ లేఖ
వహ్వా! హెూం శాఖ!!
హతవిధీ అన్న గడ్కరీ
ఉండవల్లి వాస్తవాలన్నీ చెప్తారా?
అధిష్టానం మనోగతం
రాజీనామాలు చేస్తారా?
కాంగ్రెస్ ఖతమేనా?
రాజీనామాలు అడిగినదెవరు?
చంద్రోపాలంభం
ద్రవిడ మతం
కాంగ్రెసా, మజాకా?
కరివే(దనా)పాకు
మళ్లీ అవిశ్వాసం గోల
అ, ఆ.. లూ... అక్బర్, అసద్‌ల అరెస్టూ
సహకారం – హాహాకారం
తలల కన్నా తుపాకీలెక్కువ!
స.హ.కమిషనర్ల నియామకం

**కెసియార్ దృష్టిలో సమరం...**
**నానాటికీ తీసికట్టు, 'నాగం'భొట్లు**
**అఫ్జల్‌కి గురూ, నేనూ..**
**అఫ్జల్ ఉరి కబురు**
**గాలికి ఎదురుగాలి**
**అపరాధా? పారాహుషారీయా?**
**ఇదోరకం గజేంద్రమోక్షం**
**పాదయాత్రీ యిమేజి లాభమా? భారమా?**
**సూర్యనెల్లి చీకటినీడ**
**ఇరుకున పడ్డ అబ్దుల్లా**
**నషీద్ విషాదం**
**తెరపైనా 'రాయని భాస్కరుడు' – ముళ్లపూడి**
**యువరాజు బతకడు**
**దోశ వేసి చూడు...**
**రాజగోపాలం భజే...**
**రాజసులోచనజి**
**టిడిపికి అవిశ్వాసం తలనొప్పి**
**ఇదోరకం గజేంద్రమోక్షం**
**తమిళ వ్యాపారం వెర్సస్ రాజకీయర**
**చూసేవాళ్లూ దిగంబరమే..**
**ధిక్కారమును సైతునా...?**
**కిరణప్రచండం**
**26/11/2**
**సినిమా కులం**
**చారిత్రాత్మక సినిమాలకు మనం నోచుకోమా?**
**వారసత్వంగా నేరరాజకీయం**
**రివర్స్ గేర్‌లో కేరళ**
**టిప్పు పేరు పెట్టడం తప్పా?**
**రహదారి మూసుకుంది**
**ఎందరో మేనమామలు.. అందరికీ వందనాలు**
**ఉన్నమాటంటే ఉలుకు...**
**కర్ణాటక మునిసిపల్ ఎన్నికల పాఠాలు**
**ఒకనాటి సుఖం... జీవితమంతా దుఃఖం**

**2013 జనవరి 01** **ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 01**

పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నాకు అభినందనలు తెలిపిన, తెలపబోతున్న వారందరికీ విడిగా ధన్యవాదాలు చెప్పలేకపోతున్నాను. ఇవే ధన్యవాదాలు, అభివాదాలు అనుకోండి. కొత్తసంవత్సరంలో నా తీర్మానం – 'మొదలెట్టిన సీరియల్స్ అన్నీ శ్రద్ధగా క్రమం తప్పకుండా రాసి, పాఠకుల చేత చివాట్లు తప్పించుకోవాలి' అని. జనవరి 1 న డైరీ రాయడం మొదలుపెట్టి వారం రోజులు రాసి మూల పడేసినట్టుగా యీ తీర్మానం మూలపడకుండా చూడడానికి చెర్నాకోల పట్టుకుని నిలబడే పాఠకులు కొందరున్నారు. అది నా అదృష్టం. వారిని తలచుకుంటూనే యింకో సీరీస్ మొదలుపెడుతున్నాను. 2013 తెలుగు సంవత్సరంగా జరుపుకుందామని రాష్ట్రప్రభుత్వం అంది. ఆ సందర్భంగా తెలుగు భాషలోని కొన్ని పదాల గురించి, జాతీయాల గురించి, ప్రముఖుల ఛలోక్తులు, చెమక్కులు, చమత్కార సంభాషణల గురించి అప్పుడప్పుడు రాద్దామని కోరిక. ఏడాది మొత్తంలో యిన్ని రాస్తానని, వారం వారం

రాస్తానని కమిట్ కావటం లేదు సుమండి. ఇదొక లక్ష్యం అంటూ పెట్టుకుంటే ఆ దిశగా విషయాలు సేకరిస్తూ వుంటానని నాకు నేనే సంకల్పం చెప్పుకున్నాను.

తెలుగు మహాసభలు ఎలా జరిగాయి, ఏం సాధించారు, భోజనాలు ఎంత అధ్వాన్నంగా వున్నాయి – యిలాటి విషయాలు వదిలేశాను. ఇలాటి సభలు చిన్న స్థాయిలోనే (అంటే వెయ్యి మంది వచ్చేట్లు) నెలకు రెండు జిల్లాలలో జరుపుతూ ఏడాది పూర్తయ్యేసరికి అన్ని జిల్లాలలో జరపాలని నా ఆకాంక్ష. అప్పుడే తెలుగు గురించి మనలో ఒక స్పృహ వస్తుంది. మన గురించి మనం తెలుసుకోకపోతే ఎలా? ఎన్నేళ్ల క్రితం పుట్టింది, ప్రపంచ భాషల్లో దాని స్థానం ఏమిటి, యివన్నీ ఎకడమిక్ చర్చ. నా మట్టుకు నేను చూసుకునేదేమిటంటే – అది నా మాతృభాష. ఆలోచనైనా, మాటైనా మొదట తెలుగులోనే తడుతుంది. ఆ భాషలోని పదసంపద ఏమిటి, కొన్ని పదాలకు అర్థాలేమిటి, వాటి ఉచ్చారణ ఏమిటి – యివన్నీ తెలుసుకోవలసిన అవసరం వుంది. జర్మనీలో బిస్మార్కు గురించి, ఇటలీలో గారీబాల్డీ గురించి మార్కుల కోసం ఎలాగూ చదవక తప్పదు, చదివాం. ఇప్పుడు మనకోసం చదువుదాం.

ఇది చదివినంత మాత్రాన జాతిని రక్షించేస్తున్నాం, సంస్కృతిని కాపాడేస్తున్నాం, పిల్లలను తెలుగువాళ్లగా పెంచేస్తున్నాం అనుకోవడం లేదు. నేను రక్షించేదేముంది నా బొంద. వేలాది సంవత్సరాలుగా తెలుగు భాష వుంది, యునెస్కో వాళ్లు ఏం కూసినా యింకో వెయ్యేళ్లు వుంటుంది. నిండా వందేళ్లయినా బతకలేని నేను కాపాడేదేముంది నా తలకాయ! ఈ తెలుసుకోవడం నా కోసం. ఒబామా సవతి తండ్రి ఎవడో, ఎక్కడ పెరిగాడో, మోనికాతో బిల్ క్లింటన్ వ్యవహారం బయటపడినప్పుడు హిల్లరీ క్లింటన్ ఎంత నిబ్బరంగా వుందో – యివన్నీ తెలుసుకుంటున్నవాణ్ని కాస్తయినా నా తల్లి గురించి, తల్లిభాష గురించి తెలుసుకోవద్దా?

ఒకటి మాత్రం నిజం. ఇతర భాషల్లో ఏం చదివినా, హాస్యం మాత్రం మాతృభాషలోనే బాగా ఎంజాయ్ చేస్తాం. ఎదటివాణ్ని తిట్టినపుడు కూడా మాతృభాషలోనే తిడితేనే మనకు తృప్తిగా వుంటుంది. ఇంగ్లీషులో ఎంతో పండితుడైన కుశ్వంత్ సింగ్‌కు కూడా అంతేట. ఎదుటివాడికి అర్థం కావడానికి ఇంగ్లీషులో తిట్టినా, యింటికి వచ్చి పంజాబీలో తిట్టుకున్నపుడే కోపం చల్లారుతుందట. గంభీరమైన విషయాలకు వస్తే – సరళంగా రాస్తే తెలుగులో చదవడమే నా కిష్టం. వాక్యనిర్మాణం గందరగోళంగా రాస్తే మాత్రం దీన్ని పక్కన పెట్టి ఇంగ్లీషులోనే చదువుతాను. హిందీ పత్రికలు, పుస్తకాలు యిదివరలో చదివేవాణ్ని కానీ యిప్పుడు టైము చిక్కడం లేదు. అది యింకా స్లో. అయినా హాస్యరచన అయితే చదవడానికి రెడీ. హిందీ నుండి తెలుగులోకి కొన్ని అనువాదాలు చేశాను కూడా. ఎన్ని చదివినా తెలుగులో చదవడానికే ప్రాధాన్యత. తెలుగు గురించి ఎంత తెలుసుకుంటే అంత సరదా. ఎక్కడెక్కడో చదివి తెలుసుకున్న విషయాలు యిక్కడ రాస్తున్నాను. తప్పులుంటే చెప్పండి, సరిదిద్దుకుంటాను.

మొదటగా – "సాంబారు" పదం గురించి. అదేమిటో మనవాళ్లకు అన్యభాషాపదం అంటే భలే మోజు. పెళ్లిళ్లలో అన్నం వడ్డించమంటే వడ్డించరు. 'వైట్ రైస్' అని అడగాలి. వైట్ రైస్ అంటే తెటల్ల బియ్యం అని కేటరర్స్‌కు తెలియదు. వాళ్లు ఆ పేరుతో వడ్డించేది కుక్‌డ్ రైస్. అన్నం అంటే నామోషీ. పచ్చడి అనరు. చట్నీ అంటారు. అలాగే రసం పేరుతో వడ్డించేది, పళ్లరసం కాదు, 'చారు'! హొటళ్ల నుండి నేర్చుకున్న మాట అది. పులుసు చేసినా దానికి 'సాంబారు' అని పేరు పెడతారు, అదేదో తమిళపదం అనుకుని! 'చూశారా, మీకు అనేక ప్రాంతాల వెరైటీ ఫుడ్ పెడుతున్నాం' అని చెప్పడానికి ప్రయత్నం కాబోలు.

'సాంబారు' తమిళపదమా? కాదా? అని నేనడిగితే '..కాకపోవడమేమిటి, అరవ్వాళ్లను సాంబారు గాళ్లని ముద్దుగా ఓ పక్క పిల్చుకుంటూ..' అని ఆశ్చర్యపడుతూ అలా చూడకండి. సంభారః అనే సంస్కృతపదం దీనికి మూలం. వస్తు సముదాయం అని అర్థం. 'సంభారాలు సమకూర్చుకుని..' అంటే వస్తువులు పోగేసుకుని.. అన్న అర్థంలో వినే వుంటారు. పాకసంభారః అంటే వంటకు వుపయోగపడే వస్తు సముదాయం. క్రమేపీ 'పాక' ఎగిరిపోయింది. పోపుల పెట్టెను రాయలసీమలో సంభారపు పెట్టె అంటారు. అనేక శాకాలతో తయారయ్యే వంటకాన్ని 'సంభారః' అనేవారు. అదే సాంభారం. తమిళులు వత్తులు పలకలేరు కాబట్టి, చివర్లో హల్లు వాడడం పరిపాటి కాబట్టి దాన్ని సాంబార్ చేసుకున్నారు. మనది అజంత భాష కాబట్టి సాంబారు అంటున్నాం.

సాంబార్ తెలుగుపదమే అని తెలిస్తే కేటరర్స్ యింకో పదం గురించి వెతకగలరు. ఏ పేరు పెట్టినా వాళ్లు మనకు పెట్టేది మాత్రం – పప్పు పులుసే!

అసలు అరవం అనే పదం ఎలా వచ్చింది? మనం తమిళులను ఆ పదంతో పిలుస్తాం. తమిళులు మాత్రం ఆ పదంతో ఎప్పుడూ తమను తాము చెప్పుకోరు. తమ భాష 'తమిళం' అనే అనమంటారు. పోనీలే అనుకున్నపుడు తమిళులు అనీ, కోపం వచ్చినపుడు అరవ్వాళ్లు అనీ అంటూంటాం. అరవం అనేది తిట్టు పదమా? 50 ఏళ్ల క్రితం తమిళ సినిమాలు తెలుగునాట డైరక్టుగా రిలీజయినపుడు వాల్ పోస్టర్లపై 'అరవం' అని రాసేవారు. పూర్వం మనదేశంలో చాలా రాజ్యాలుండేవి. వాటిని దేశాలు అనేవారు. మొత్తం 56. 'అబ్ తక్ ఛప్పన్' సినిమా పేరు ద్వారా హిందీలో 56 కు ఛప్పన్ అంటారని మీరు గ్రహించేసి వుంటారు. దానికి మూలం సంస్కృతం. ప్రాంతాలన్నీ తిరిగి వచ్చాడు అనడానికి ఛప్పన్న దేశాలు చూసి వచ్చాడు అనేవారు. ఆయా జాతుల నివాసం చేత ఆ యా దేశాలకు పేర్లు వచ్చేవి. పాండ్యదేశం, చోళదేశం.. అలా. ఆంధ్రరాజులు ఏలిన దేశం కాబట్టి మనది ఆంధ్రదేశం. తెల్ అనే తెగవారు నివసించడం వలన తెలుగుదేశం అయిందని, అది క్రమంగా భాషావాచి కూడా అయిందని పరిశోధకులు అంటారు.

తెల్ తెగవారిలాగానే అరువల్ అనే ఒక తెగవారు వుండేవారు. వారు నివసించే అరువర్‌నాడు ప్రస్తుతం ఉత్తర తమిళనాడులో మన చిత్తూరు జిల్లా, కర్ణాటకలోని తుమకూరు, చిక్కమగుళూరు ప్రాంతాలను ఆనుకుని వుండేది. ఈజిప్టు రాజవంశీకుడైన యాత్రికుడు

టాలమీ మన దేశాన్ని సందర్శించినపుడు ఈ అరువనాడు వుంది. అతను దీన్ని 'అరోర్గాయి' అన్నాడు. వాళ్లని మన తెలుగువాళ్లు, కన్నడవాళ్లు అరువర్, అరవర్, అరవ – అని అన్నారు. వాళ్ల భాష తమిళమే అయినా, ప్రాంతం బట్టి మనం వారి భాషను అరవం అన్నాం. ఆ భాష మాట్లాడేవారందరినీ కలిపికట్టి అరవ్వాళ్లు అనేశాం. అలా ఎలా అనకండి. మనకు ఉత్తరాన వున్న రాష్ట్రాలవాళ్లందరినీ కలిసికట్టుగా భాషాపరంగా 'హిందీవాళ్లు' అనేస్తున్నాం. 'అబ్బే మేం మైథిలీ.., భోజ్‌పురి.., అవధి, మాగధి..' అని వాళ్లు మొత్తుకున్నా మనం వినం. (ఇవన్నీ హిందీలో మాండలికాలు అని ఎవరైనా చెప్పినా వినకండి. వాటి మధ్య కొన్ని మాటలు కలుస్తాయి తప్ప వేటికవే విడివిడి భాషలు –తెలుగు, తమిళాల్లా. ఎటొచ్చీ లిపి ఒకటే!) ఉత్తరాది వాళ్లలో మనకు ముందుగా తెలిసున్నవాళ్లు – మార్వాడీవాళ్లే. వాళ్లే మన ప్రాంతానికి వలస వచ్చారు కాబట్టి. అందువలన కాస్త తెల్లగా వుండి మనకు తెలియని భాష మాట్లాడేవాణ్ని 'మార్వాడీవాళ్లు' అనడం పరిపాటి అయింది. వాళ్లు రాజస్థాన్‌లో ఒక ప్రాంతానికి చెందినవాళ్లని కూడా మనకు తెలియదు.

ఈ అరువర్‌లు, తమిళులకు మనకు మధ్యన వుండేవారు. భాష ఒకటే అయినా చోళులు, పాండ్యులు కొట్టుకున్నట్టే అఱవలు, తమిళులకు మధ్య కొంతకాలం గొడవలు జరిగి వుంటాయి. ఓ చోట చదివాను – క్రీస్తు పూర్వం లేదా క్రీస్తు శకం 2 వ శతాబ్ది నాటి (తారీకుల విషయంలో వివాదానికి దిగకండి. తమిళులు తమకు సంబంధించిన ప్రతీదీ ప్రాచీనం అని క్లెయిమ్ చేస్తారు, అడిగేవాడు లేడు) 'తొల్‌కాప్పియం' పుస్తకంలో 51 వ సూత్రంలో యిలా వుందట – 'వివేకవంతులు ఆరుగురి జోలికి పోరాదు. వారు 'వడుగర్లు, అఱువాళర్లు, కరుంతార్లు, కాటి కాపర్లు, భూతాలు, దున్నపోతులు' అని. చివరి మూడిటి గురించి చెప్పనక్కరలేదు. మొదట చెప్పిన వడుగర్లు అంటే తెలుగువాళ్లమే. 'వడ' అంటే తమిళంలో ఉత్తరం. వాళ్లకు ఉత్తరాన వుండేవాళ్లం మనమే కాబట్టి మనని ఉత్తరాదివాళ్లు అంటారు. ఈ పదం యిప్పటికీ తమిళనాట వుంది. "మేం తెలుగువాళ్లమే" అని చెప్పుకుంటే అక్కడి తెలుగువాళ్లు "ఉత్తరాది (వడుగర్) వాళ్లా, దక్షిణాది వాళ్లా" అంటారు. అంటే కంచి, చెంగల్పట్టు, తంజావూరు, మధురై యిత్యాది ప్రాంతాల్లో అనాదిగా వుంటున్న తెలుగువాళ్లు దక్షిణాదివాళ్లన్నమాట. మనల్ని నమ్మకూడదు.. రైట్. ఇక కరుంతార్లు అంటే కన్నడిగులు.. వాళ్లనీ నమ్మవద్దు, రైట్‌రైట్. అఱువాళర్లు అంటే అఱవజాతి వారు. తెలుగువాళ్లు, కన్నడవాళ్లు అంటే వేరే భాష మాట్లాడేవాళ్లు, అఱవలు తమిళం మాట్లాడినా తమిళులు వారితో కొంతకాలం తగాదా పడినట్టు తేలుతోంది. ఇదంతా క్రీ.శ 2 వ శతాబ్దం నాటి ముచ్చట. **(సశేషం)**
**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 02 ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 02**

భేషజం అనే మాట వింటూ వుంటాం. తెలుగులో చెప్పాలంటే – పోజు కొట్టడమన్నమాట. ఈ మాట ఎక్కణ్నుంచి వచ్చిందో తెలుసా? భిషక్కుకి సంబంధించినది భేషజం! విదుషీమణికి వున్నది వైదుష్యం అయినట్టే భిషక్కు (వైద్యుడు) యిచ్చేది భైషజ్యం లేక భేషజం. అనగా మందు. దీనికి ఆరోగ్యకరం, రోగనాశకం, రోగాన్ని నివారించే మంత్రం, రోగనివారణ వలన కలిగే సుఖం అనే అర్థాలున్నాయి. వైద్యుడికి సంబంధించినది మందే కాదు, యింకా కొన్ని వున్నాయి. వాళ్లు చేసే ఆర్భాటం, ఆడంబరం, కరక్టుగా డయాగ్నైజ్ చేసినట్టు చేసే నటన – యివన్నీ కూడా. భేషజం అంటే యీ అర్థం కూడా వచ్చి చేరింది. పోజు కొట్టడం డాక్టర్లకు సంబంధించినదే అని పూర్వీకులు కూడా నమ్మారన్నమాట. కార్పోరేట్ ఆసుపత్రులు వచ్చాకనే యిలాటివి వచ్చాయని అనుకోవడం పొరబాటు. పాతకాలంలో కూడా వైద్యులను, వైద్యాన్ని విమర్శించే శ్లోకాలు చాలా వున్నాయి. వాటిల్లో ఒకటి చెప్తుంది – వైద్యుడు యముడి కంటె గొప్పవాడట. యముడు ప్రాణాలు మాత్రమే హరిస్తే వైద్యుడు ప్రాణాలతో బాటు ధనాన్ని కూడా హరిస్తాడట!

---

విజయవాడ ఎస్ఆర్ఆర్‌సివిఆర్ కాలేజీలో విశ్వనాథ సత్యనారాయణగారు తెలుగు లెక్చరర్‌గా పనిచేసే రోజుల్లో, ఇంగ్లీషు లెక్చరరుగా జొన్నలగడ్డ సత్యనారాయణగారు పనిచేసేవారు. ఇద్దరూ స్నేహితులే కానీ ఒకరి మీద మరొకరు విసుర్లు వేసుకునేవారు. ఓ రోజు జొన్నలగడ్డ వారు విద్యార్థులతో – "మీరు తెలుగేం నేర్చుకుంటున్నార్రా? సమ్ రాట్, (ఏదో చెత్త), అవునా?" అన్నారు. విశ్వనాథ గారికి కవి సామ్రాట్ బిరుదు వుంది కదా, దాన్ని విరిచి వెక్కిరించారన్నమాట. అది విశ్వనాథవారికి తెలిసింది.

తర్వాత క్లాసుకి ఆయన వచ్చి – శ్రీనాథుడు జొన్నలగడ్డ వారి యింటి పేరులో 'జొన్న'ను ఎద్దేవా చేస్తూ "శ్రీనాథుడు ఏమన్నాడో తెలుసా? జొన్న అంబలి, జొన్నన్నము, జొన్న పిసరు, జొన్నలె తప్పన్ సన్నన్నము సున్న సుమీ" అంటూ జొన్నలు తప్పలేదని చాలా బాధపడ్డాడురా. మనకీ తప్పటం లేదు.." అన్నారు.

---

మినహా – 'అది మినహా యింకేదైనా చెప్పు' అంటే 'అది కాకుండా.., దాన్ని తీసేసి.. చెప్పు' అని అర్థం. తెలుగులో చెప్పాలంటే – ఎక్స్‌సెప్ట్ దట్! మినహాయింపు అంటే డిస్కౌంట్, తగ్గింపు అని అర్థం. ఇది నిజానికి 'మిన్' (నుండి), 'హా' ('అది') అనే రెండు అరబిక్ పదాలు కలిపితే వచ్చింది. అంటే మొత్తంగా వున్నదాని నుండి యిది తీసేయి అని అర్థం అన్నమాట. ఒక ఊరి పొలాల

విస్తీర్ణం లెక్క వేసుకుని ఆ గ్రామం నుండి ఎంత ఆదాయం వస్తుందో లెక్కవేస్తారు. దాన్లోంచి ఆ ఏడాది సాగు చేయని పొలాల్ని, బీడు భూముల్ని, అడవుల్ని 'మినహా'యించి లెక్క వేస్తారు. ఇది రెవెన్యూ డిపార్టుమెంటు పదం. అక్బరు కాలంలోనే రెవెన్యూకి సంబంధించిన పద్ధతుల్ని స్టాండర్డయిజ్ చేశారు. అప్పటి ఉర్దూలో చాలా అరబ్బీ, ఫారసీ పదాలు వున్నాయి కాబట్టి యివన్నీ వచ్చి చేరాయి. మన దస్తావేజు (అది కూడా అలాటి పదమే) కనబడే పరిభాషంతా ఆ కాలందే. ఈ మినహా మాట తక్కిన సందర్భాల్లో కూడా వుపయోగించసాగారు.

---

మహాత్మ్యం – మనం మాట్లాడడంలో మహత్యం అంటాం కానీ రాయడంలో మహాత్మ్యం అని రాయాలని తెలుసు. ఎందుకో తెలియదు. 'మహత్యం చూపించాడు' అంటే 'మిరకిల్ చేశాడు' అనే అర్థంలో వాడుతూంటాం కాబట్టి. మహాత్ముడు అంటే తెలుసు కదా, అతని లక్షణం లేదా గుణం – మహాత్మ్యం. ఘనత, గొప్పతనం అని అర్థమన్నమాట. వేంకటేశ్వర మహాత్మ్యం అనే పేరుతో సినిమా వస్తే దాని అర్థం వెంకటేశ్వరుడి గొప్పతనం అని!

---

వాత్స్యాయనుడి "కామసూత్ర" యిప్పుడు విరివిగా అనేక భాషల్లో దొరుకుతోంది. కానీ కొన్నేళ్ల క్రితం అలాటి పరిస్థితి లేదు. సంస్కృతంలో మాత్రం దొరికేది. తెలుగులో చదివితే జనాలు చెడిపోతారని కొందరు పండితులు అనుకునేవారు. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు (1890–1951) సంస్కృత, ప్రాకృత, ఆంధ్ర సాహిత్యాల్లో పండితుడు. మద్రాసులో కొంతకాలం వుండి ఆంధ్రపత్రికలో పనిచేశారు. సంస్కృత గ్రంథాలను ప్రచురించారు. తర్వాత బరంపురం, కళ్లికోట రాజావారి కాలేజీలో తెలుగు పండితులుగా పనిచేశారు. కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని, గౌతముని ధర్మసూత్రాలను తెలుగు చేశారు. వ్యావహారిక భాషా ఉద్యమాన్ని సమర్థించారు. ఈయన దృష్టి వాత్స్యాయన కామసూత్రాలపై పడింది. అవి శృంగారానికి సంబంధించినవి మాత్రమే కావు. వాటిల్లో దేశచరిత్ర వుంది, ఆ కాలం నాటి ఆచారవ్యవహారాల సమాచారం వుంది. (ఆంధ్రుల పడకటింటి అలవాట్ల గురించి కూడా వుంది). ఈయన ఆ సూత్రాలను, వాటికి అనేకమంది పండితులు రాసిన వ్యాఖ్యానాలను తెలుగులో అనువదించారు.

అచ్చు వేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో తనే సొంతంగా అచ్చు వేయిద్దామనుకుని తను పనిచేస్తున్న బరంపురంలో ఓ ప్రెస్‌కి వెళ్లారు. ఒక ఫారం (8 పేజీలు) వేసేటప్పటికి అచ్చాఫీసతనిపై పండితుల ఒత్తిడి పెరిగింది. అతని మెడలు వంచి ఆపించేశారు. అక్కణ్నుంచి శ్రీకాకుళం వచ్చి వేయించబోతే అక్కడా ఒక ఫారం వేయగానే ఆపించేశారు. అక్కణ్నుంచి విశాఖపట్టణం వచ్చి మరో ఫారం... మళ్లీ ఆపుదల.. ఇలా ఊరికో ఫారం చొప్పున వేయించుకుంటూ, వాటిని తనతో బాటు తీసుకుని వస్తూ మద్రాసుకు వచ్చి అక్కడ ఆఖరి ఫారం వేయించి పుస్తకం పూర్తి చేసి విడుదల చేశారు. అప్పట్లో పండితులు అనధికార సెన్సారింగ్ చేసేవారని చెపుతూ పరిశోధకుడు రాంభట్ల కృష్ణమూర్తిగారు చెప్పారిది. "అంతెందుకు, రామదాసు అసలు చరిత్రను తవ్వి తీసిన చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖర శర్మగారి పుస్తకం తిరిగి అచ్చు కాలేదు. పాత గ్రంథాలయాల్లో ఆ పాత పుస్తకం కూడా కనిపించలేదు" అన్నారాయన. (రామదాసును జైల్లో పెట్టించిన రాజు వేరు, విడిపించిన రాజు వేరు అన్న సంగతి తెలుగువాళ్లలో నూటికి 90 మందికి తెలియదు. నాటకాల్లో, సినిమాల్లో చరిత్రను మార్చి పారేశారు) పంచాగ్నుల వంటి మహానుభావులు ఎందరో ఎన్నో కష్టాల కోరిస్తేనే విజ్ఞానం మనలాటి సామాన్యప్రజల ముంగిట్లోకి వచ్చింది. ముంగిట్లోకి రావడంతో మనలో చాలామందికి దానిపై ఆసక్తి పోయినట్టుంది. పుస్తకాలు చదవడం మానేశాం. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 03 వీక్లీకై** **ఎమ్బీయస్ : చేటలో తవుడుందా..?**

అఖిలపక్ష సమావేశం అని పిలుపు రాగానే తెరాస నాయకులు "చేట్లో తవుడు పోసి అందరి మధ్య కొట్లాట పెట్టారు.." అన్నారు. వాళ్లు ఉదహరించిన సామెతను యథాతథంగా ప్రస్తావించడానికి జంకుతున్నాను. ఆ భాష తెరాసవారికే తగును. సమావేశంలో ఎవరూ జుట్టూ జుట్టూ పట్టుకోలేదు కానీ సమావేశం నుండి బయటకు వచ్చిన ఉత్తరక్షణం నుండి కొట్లాటే కొట్లాట.

కాంగ్రెస్ వారు వైకాపాను తిట్టారు, టిడిపి వారు కాంగ్రెస్‌ను, వైకాపాను తిట్టారు, తెరాసవారు టిడిపి, వైకాపా, కాంగ్రెస్‌లను తిట్టారు. బిజెపివారు, సిపిఐవారు కాంగ్రెస్‌ను తిట్టారు. ఇలా అందరికందరూ తిట్టేసుకున్నారు. టిడిపి తన వైఖరి స్పష్టంగా చెప్పిందా లేదా అన్న అంశం ఆధారంగా వాగ్వివాదాలు అయిపోతున్నాయి. చెప్పింది అని సిపిఐవారు సర్టిఫికెట్టు యిచ్చారు. బాబు–నారాయణ ఎన్నికల బంధాన్ని దృష్టిలో పెట్టుకుని కాబోలు, కెసియార్ ఆ సర్టిఫికెట్టు తీసిపారేశారు. బిజెపివారిని తిట్టడం లేదు కానీ కలుపుకుని పోవడమూ లేదు. కోదండరామ్‌ను తప్ప జాక్‌ను లక్ష్యపెట్టడమూ లేదు.

తమాషా ఏమిటంటే యీ తిట్టుకునేవారందరూ తెలంగాణవారే... ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులే. జండాలు, అజండాలు పక్కన పెట్టి తెలంగాణకోసం పోరాడాలని పిలుపు నిచ్చేవారే. జండాలు పక్కన పెట్టడం మాట ఎలా వున్నా, ఆ జెండా కర్రలు పెట్టే

కొట్టుకుంటున్నారు. ఎందుకంటే ఎవరి ఎజెండా వారిది.

తర్వాతి రౌండ్‌లో కాంగ్రెస్‌వారు వారిలో తిట్టుకోవడం మొదలుపెట్టారు. కోమటిరెడ్డి ఉత్తమకుమార్ రెడ్డిని భిక్షగాడన్నారు, తెలంగాణకోసం తను రిజైన్ చేస్తే గోతికాడ నక్కలా కాచుకున్న ఉత్తమ్ కాజేసి, తెలంగాణ నాయకులు పదవుల కోసం ఆశపడేవారని హై కమాండ్‌కు అనిపించేట్లా చేశారని కోమటిరెడ్డి దుమ్మెత్తి పోశారు. ఉత్తమ్‌కుమార్ ఉత్తగా వూరుకోలేదు. నా కంటె జూనియర్ అయినా, చదువు తక్కువైనా కోమటిరెడ్డి వైయస్ ప్రాపకం వలన మంత్రి పదవి సంపాదించాడని, అయినా తనూ, జానారెడ్డి ఏమీ అనలేదని గుర్తు చేశారు. కోమటిరెడ్డి రిజైన్ చేసిన చాలా రోజులకు హై కమాండ్ తనకు యీ పని అప్పచెప్తే శిరసా వహించానని చెప్పుకుంటూ కోమటిరెడ్డిని కాంట్రాక్టుల పేరు చెప్పి తిట్టిపోశారు. వైకాపాలోకి దూకడానికి సిద్ధంగా వున్నాడని ఆరోపించారు. కొందరు వెధవలు.. అని అన్యాపదేశంగా కూడా అన్నాడు. తిట్లలో ఎవరూ వెనక్కి తగ్గలేదు. అందరూ తెలంగాణ ఉద్యమకారులే...

అఖిలపక్షానికి సురేష్ రెడ్డిని ఎంపిక చేసినందుకు పొన్నం ప్రభృతులు మండిపడ్డారు. కిరణ్‌కు సన్నిహితుడు కాబట్టే ఆయన్ని పంపారని వాళ్ల ఉద్దేశం. వెళ్లిన యిద్దరు కాంగ్రెస్ నాయకులూ రెడ్లే నని వి.హనుమంతరావు అభ్యంతరం. సమైక్యంగా వుంటే ఫర్వాలేదు కానీ విడిపోవడం అంటూ జరిగితే గ్రేటర్ హైదరాబాదువాసులకు సిక్స్ పాయింట్ ఫార్ములా వంటి ప్రత్యేక రక్షణ కల్పించాలని, లేకపోతే తక్కిన జిల్లాల తెలంగాణ వాసుల చేతిలో దోపిడీకి గురవుతారని ముకేష్ గౌడ్ అభ్యంతరం.

ఇక జాక్‌లో స్వామి గౌడ్ ఖాళీ చేసిన కన్వీనర్ పోస్టు కోసం దేవీప్రసాద్, శ్రీనివాస గౌడ్ బహిరంగంగా పోట్లాడేసుకున్నారు. కులాల ప్రస్తావన కూడా తెచ్చారు. మధ్యలో కోదండరామ్ పేరు కూడా యీడ్చారు. అన్ని పోస్టులూ అగ్రకులాలే ఎగరేసుకుని పోతున్నారని బిసి నాయకులు గగ్గోలు పెట్టారు.

తెలంగాణ కోసం ప్రాణాలనైనా త్యాగం చేస్తాం, ఎవరితోనైనా చేతులు కలుపుతాం అంటూ సభలో చేతులెత్తి కలిపి ఫోటో తీయించుకుంటారు. తెలంగాణ కోసం బొంతపురుగునైనా ముద్దాడతాను అంటారు కెసియార్. ఇవన్నీ వట్టి కబుర్లే. ఎవరూ ఎవరితోనూ కలిసిరారు. అందర్నీ కలుపుకోవాలని ఉద్యమించిన నాగం జనార్దనరెడ్డిని ఎవరూ కలుపుకుని పోవటం లేదు. ఇండిపెండెంట్‌గా వుంటే ఎవరితోనైనా కలవవచ్చనుకుంటూ తన యింటిపేరు కలిసి వచ్చేట్టు నగారా పెట్టుకుని ఎంత మోగించినా బధిరుడి ముందు శంఖారావంలాగే వుంది. కోదండరామ్‌ను తప్ప కెసియార్ వేరెవర్నీ దగ్గరకు రానీయటం లేదు. తెలంగాణ కేక్‌ను వాసన కూడా చూడనీయటం లేదు. అందువలన బిజెపి తెరాసతో ఎన్నికలలోనే డైరక్టుగా తలపడింది. ఇప్పుడు తిడుతోంది కూడా. వైకాపానుండి కొండా సురేఖ ఆత్మహత్యల ఛాలెంజ్ చేశారు, ఇప్పుడు ఆ వరసలో గోనె ప్రకాశరావు చేరారు. తను ఆత్మహత్య చేసుకుంటాడట, తనతో పాటు కెసియార్ కానీ, ఆయన కుటుంబసభ్యులు గానీ రావాలట. ఇక టిడిపి నాయకులైతే చెప్పనే అక్కరలేదు. కెసియార్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు.

ఎందుకు? ఎందుకంటే తెలంగాణ అంటూ వస్తే దాని ఫలం కెసియారే ఎత్తుకుపోతాడన్న భయం చేత! టిడిపియే కాదు అందరూ ఆయన నెగటివ్ సైడ్‌ను ఎత్తి చూపుతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక మిమ్మల్ని ఉద్ధరించదగినవాళ్లం మేము తప్ప యీ కెసియార్‌కు అంత పాటవం లేదు, యీయన నాయకుడే కాదు, తన కుటుంబక్షేమం తప్ప ఆయనకు మరేదీ పట్టదు – అని ప్రజల మెదళ్లలో ఎస్టాబ్లిష్ చేయడానికి తక్కిన పార్టీలన్నీ చూస్తున్నాయి. తెలంగాణ తేవడం యీ ఉపప్రాంతీయ పార్టీ వలన ఏమవుతుంది? మమ్మల్ని గెలిపించి ఢిల్లీకి పంపండి అప్పుడు చూడండి అంటుంది బిజెపి. కాంగ్రెస్‌వారు తెలంగాణ యిచ్చినా యివ్వకపోయినా ఓడిపోవడం ఖాయం అని బిజెపి దత్తాత్రేయ సెలవిచ్చారు. (అలా అయితే వాళ్లెందుకు తెలంగాణ యివ్వాలిట? ఇదో శల్యసారథ్యం)

2009 డిసెంబరు 9 వరకు తెలంగాణ అనేది ఏదో కెసియార్ గోలగానే వుండింది. దాన్ని పెద్ద ఉద్యమంగా ఏ పార్టీ ఫీలవలేదు. డిసెంబరు 9 ప్రకటనతో తెలంగాణ గురించి ఢిల్లీవారు సీరియస్‌గా వున్నారన్న సంగతి తెలియగానే అందరూ తెలంగాణ రైలు ఎక్కడానికి ప్రయత్నించారు. హఠాత్తుగా విభజన అంటే మనం స్టేషన్‌లోనే వుండిపోతామన్న భయం పట్టుకుని అందరూ 'జై తెలంగాణ' అనసాగారు. అన్నా కెసియార్‌కు వచ్చిన ఎడ్వాంటేజి వీళ్లకు రాలేదు. అందుకనే యీ సారి షిండేగారు నెల రోజుల్లో నిర్ణయం వస్తుందనగానే కంగారు పడుతున్నారు. తాము మాత్రమే తెలంగాణ తెచ్చామని, ఎదుటివాళ్లు యింకా ఊగిసలాడుతూనే వున్నారని, ఏకాభిప్రాయంతో వున్నవారు సైతం బలహీనులని, ఎవరినీ కలుపుకుని వెళ్లలేక పరిపాలనను కుంటుబరుస్తారనీ చెప్పాలని కంగారు పడుతున్నారు. అందువలననే యిన్ని గొడవలు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్‌తో విభేదించే పార్టీలు వుండేవి. కానీ అవన్నీ చాలా చిన్నవి. కాంగ్రెస్‌ని తిట్టినా ప్రయోజనం వుండేది కాదు. స్వాతంత్ర్యం కోసం ఎవరైనా గట్టిగా మాట్లాడితే చాలు జనాలు "మహాత్మా గాంధీకి జై" అనేవారు. ఆ ఉద్యమంతో ఆయన అంతలా ఐడెంటిఫై అయిపోయారు. ఆ గుడ్‌విల్ కనీసం 20 ఏళ్లపాటు దేశమంతా కాంగ్రెస్ ఏకచ్ఛత్రాధిపత్యం వెలిగించడానికి ఉపయోగపడింది. దానికి పునాది – గాంధీ అన్ని రకాల మెంటాలిటీ వున్నవాళ్లను లౌక్యంగా తనవైపు తిప్పుకోవడం. పైగా ఆయన తనను, తన కుటుంబాన్ని ముందుకు తీసుకురాలేదు. ఆర్థిక ప్రయోజనాల కోసం ఆశించలేదు. డెలిగేషన్ బాగా చేసి దేశమంతా నాయకుల్ని తయారుచేశారు. డిబేట్ చేసేవారు.

మరి ఇక్కడ ప్రత్యేక తెలంగాణతో ఐడెంటిఫై అయిన కెసియార్ పద్ధతి అది కాదు. తెలంగాణ సాకారం అవబోతున్నకొద్దీ ఆయనకు శత్రువులు ఎక్కువై పోతున్నారు. ఆయన ఒంటెత్తు పోకడ ఎక్కువై పోతోంది. అఖిలపక్ష సమావేశం తర్వాత మరీనూ..

కెసియార్ నిజరూపాన్ని చూపించడానికే కాంగ్రెస్ 30 రోజుల్లో నిర్ణయం విషయం లీక్‌గా విడుదల చేసిందేమోననిపిస్తుంది. హోం శాఖ విడుదల చేసిన పత్రంలో నెలలోపున నిర్ణయం లేదా ఫలితం అని ఎక్కడా లేదు. నెల గడువే లేదు. అందువలన కాంగ్రెస్ చేటలో తవుడు పోయనే లేదంటున్నాను. అది వెరిపై చేసుకోకుండానే అందరూ ఆ తవుడు కోసం కొట్లాడేసుకుంటున్నారు. ఇలాటి వీళ్లంతా కలిసి ఈజిప్టు తరహా వుద్యమం చేసి తెలంగాణ తెస్తారట!! కోదండరాం గారు భలే జోకులు వేస్తారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 04 వీక్షీకె ఎమ్బీయస్ : టిడిపి డేమేజి కంట్రోల్**

తెలంగాణ విషయంలో నాన్చి నాన్చి చివరకు టిడిపి ధైర్యంగా ఓ నిర్ణయం తీసుకుంది. ‘2008లో మేం యిచ్చిన లేఖపై చర్య తీసుకోండి’ అని 2012లో కూడా రాసి అఖిలపక్షానికిచ్చారు. మధ్యలో ‘అది పనికిమాలిన లేఖ’ అని వ్యాఖ్యానించిన యనమల చేతనే ఆ పునరుద్ఘాటన లేఖను షిండే కిప్పించారు. సమావేశంలో యనమల ఏమీ అనకుండా కడియం చెప్పినదానికి తలూపారు.

ఇంత చేసినా తెరాసవారు ‘ఇప్పుడిచ్చిన లేఖలో తెలంగాణ అనే పదం లేదు, యింత డొంక తిరుగుడు ఎందుకు, తెలంగాణ యిమ్మనమని అనవచ్చు కదా’ అంటున్నారు. ఒకవేళ అలా యిచ్చినా ‘హైదరాబాదుతో కూడిన తెలంగాణ...’ అని యివ్వలేదు కదా అని గోల చేస్తారు. ప్రత్యేక తెలంగాణకు సై అన్నా తెరాసవాళ్లు అడిగిన తీరుగా టిడిపి అడగలేదు. తెరాసవాళ్లకు కోస్తా, సీమల్లో ఓట్లు లేవు కాబట్టి ఆ ప్రాంతం వాళ్లను బూతులు తిట్టగలదు. ‘వాళ్లు మమ్మల్ని యిన్నాళ్లూ దోపిడీ చేశారు కాబట్టి వాళ్లకు ఒక్క పైసా కూడా యివ్వనక్కరలేదు. కొత్త రాజధాని కట్టుకోవాలంటే వెళ్లి కేంద్రాన్ని అడుక్కోమనండి’ అనగలదు. కానీ కోస్తా, సీమల్లో కూడా పార్టీ బతకాలనుకునేవాళ్లు అలా మాట్లాడలేరు. అంతెందుకు బిజెపి ఆంధ్రప్రాంతపు ప్రతినిథి అఖిలపక్ష సమావేశంలో ఏం చెప్పారు? ‘సమైక్య రాష్ట్రంలో నష్టపోతున్నది ఆంధ్రప్రాంతం, తెలంగాణ కాదు’ అంటూ ఉదాహరణలు యిచ్చారు. అంతా చెప్పి ‘‘..కావున విడిపోవాలి’’ అన్నారు. ఆ మాట వరకూ తెరాసకు సమ్మతమే తప్ప అంతకుముందు వినిపించిన వాదనలు ఒప్పుదల కావు.

ఇవాళ బిజెపి చెప్పినవిధంగానే రేపు టిడిపివారు కూడా వాదిస్తారు. ఎటొచ్చీ తెలంగాణ ఎనౌన్సు చేశాక వాదిస్తారు. 2008లోనే బాబును అడిగారు – ‘‘ప్రత్యేక తెలంగాణ యిచ్చేయమంటున్నారు కదా, మరి హైదరాబాదు ఎవరికి చెందాలి?’’ అని. ఆయన ‘‘అవన్నీ ఓ కమిషన్ నిర్ణయిస్తుంది. అన్నీ యిప్పుడే చర్చించవలసిన పని లేదు.’’ అని చెప్పారు. 2009 డిసెంబరు 9 ప్రకటన తర్వాత ఆయన ఆ ప్రకటనను వ్యతిరేకించడానికి కారణం ఏం చెప్పారు? ‘‘నిజమే, మేము తెలంగాణ యిమ్మనమని చెప్పాం. కానీ సంబంధిత వ్యక్తులందరితో మోడాలిటీస్ (విధివిధానాలు) చర్చించాకనే ప్రకటిస్తారని అనుకున్నాం. ఏ చర్చా, సంప్రదింపులు లేకుండా హఠాత్తుగా ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నాం.’’ అన్నారు. ఈ నెలాఖరులో ఒకవేళ కేంద్రం ‘తెలంగాణ యిస్తున్నాం’ అని ప్రకటిస్తే, బాబు పాత వాదనను ముందుకు తెస్తారు. ‘‘ఇప్పుడు రాజధాని విషయం తేల్చండి. రాజధాని పోగొట్టుకున్నందుకు సీమకు ఎంత నష్టపరిహారం యిస్తారో తేల్చండి. కొత్త రాజధాని ఎక్కడో చెప్పండి. తెలంగాణలో ఆంధ్రప్రాంతీయుల రక్షణకు చేపట్టే చర్యలు చెప్పండి.’’ అని డిమాండ్ చేస్తారు.

‘‘వీటిపై ముందు మీరు అనుకుంటున్నది చెప్పండి. దానిపై ఆలోచించి ఒక నిర్ణయానికి వస్తాం.’’ అని కాంగ్రెస్ పార్టీ అనవచ్చు. ‘‘లేదు, మీరు చెప్పాల్సిందే’’ అని టిడిపి అనవచ్చు. ఎందుకంటే రాష్ట్రం ప్రకటించగానే ముచ్చట తీరదు. ఆంధ్రప్రాంతీయులు తెలంగాణ నుండి చిప్పా, కర్రా చేతబట్టుకుని పోవాలని తెరాస, తెలంగాణ ఉద్యమకారులు కోరతారు. ‘అలా ఎలా పోతాం?’ అని ఆంధ్రప్రాంతీయులు అడుగుతారు. తమ డిమాండును సమర్థించని వారందరూ తెలంగాణ ద్రోహులనే తెరాస ప్రచారం చేస్తుంది. టిడిపి, కాంగ్రెస్ అప్పుడు యిరుక్కుంటాయి. ఆంధ్రప్రాంతానికి ఏమీ యివ్వనక్కరలేదని, నీళ్లు వదలనక్కరలేదని వాళ్లెలా అనగలరు? అంటే అక్కడ చావగొట్టి చెవులు మూస్తారు. అందువలన మోడరేషన్ ప్రతిపాదిస్తారు. కొంతైనా యివ్వాలంటారు.

‘కావాలంటే రాజధాని కట్టుకునే వరకు హైదరాబాదులో వాళ్ల రాజధాని ఓ ఐదేళ్లపాటు వుండనిస్తాం. అంతకుమించి ఏమీ యివ్వం.’ అని తెరాస పట్టుబడుతుంది. ఎందుకంటే వాళ్ల ఉద్యమం యొక్క మూలస్తంభమే అది. తెరాస ఆంధ్రప్రాంతానికి ఏ మాత్రం వెసులుబాటు యిచ్చినా లేకపోతే ‘‘ఆంధ్ర పెట్టుబడిదారులతో కెసియార్ కుమ్మక్కయ్యాడు’’ అని న్యూ డెమోక్రసీ వంటి సంస్థలు, తెలంగాణ ఉద్యోగులు (ఆంధ్రప్రాంతీయులు ఎంత త్వరగా వెళ్లిపోతే అంత త్వరగా తమకు ప్రమోషన్లు వస్తాయని వాళ్లకు ఆశ వుంటుంది) గగ్గోలు పెట్టేస్తాయి. తెరాస వైఖరి పోనుపోను కఠినమవక తప్పదు. ఇది పులిస్వారీ వంటిది.

టిడిపి ఎంతవరకు తెరాసను అనుసరించి పోగలదు? వాళ్ల కంటె ఒక్క అడుగు వెనకపడినా ‘తెలంగాణ ద్రోహి’ ముద్ర పడిపోతుంది. పోనీ పూర్తిగా తెరాస లైనే తీసుకుంటే తెలంగాణను స్వీప్ చేయగలదా? తెలంగాణలో టిడిపికి క్యాడర్ వున్నమాట వాస్తవమే కానీ పదేళ్లు అధికారానికి దూరంగా వున్న తర్వాత కూడా ఆ క్యాడర్ అలాగే నిలిచి వుందా? అధికారంలో వున్న కాంగ్రెస్‌కి 10 సీట్లు కూడా రావా? వైయస్ పేరు చెప్పి వైకాపాకు 15 సీట్లు కూడా రావా? తెలంగాణకోసం పోరాటం చేసిన బిజెపి, సిపిఐలకు ఐదైనా రావా? రాష్ట్ర ఏర్పాటుకై ఇంత చేసిన తెరాసకు 30 సీట్లయినా రావా? ఇలా హీనపక్షం లెక్కలు వేసుకుంటే కూడా టిడిపికి తెలంగాణలో 60 సీట్లకు మించి రావు. అధికారం కావాలంటే 90 సీట్లు కోస్తా, సీమల్లో గెలుచుకోవాలి. పూర్తిగా తెరాస లైను

తీసుకున్న టిడిపికి అక్కడ అన్ని ఎలా వస్తాయి? ఇంపాజిబుల్. పోనీ అలా అని కాస్త మోడరేట్ లైన్ తీసుకుంటే ఇక్కడ 60 రావు, దానిలో సగమో, మూడో వంతో వస్తాయి.

తెలంగాణ గురించి ముందడుగు వేసి టిడిపి తెలంగాణలో పొందిన దాని కంటె కోస్తా, సీమల్లో పోగొట్టుకున్నది ఎక్కువ తేలుతోంది. అక్కడ సమైక్యవాదం బలంగా వుందని అందరికీ తెలుసు. 2004 నుండి తెలంగాణ అంశం రోజూ పేపర్లలో కనిపిస్తూనే వున్నా 9 ఏళ్లపాటు రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచిన కాంగ్రెస్‌కే అక్కడ మార్కులు పడతాయి. 2009 డిసెంబరు 9 నాటి ప్రకటన చేసి, అప్పుడు మార్చి పరీక్షలో ఫెయిలయినా, రెండువారాల్లోనే పూర్తిగా విరుద్ధమైన ప్రకటన చేసి సెప్టెంబరు సప్లిమెంటు పరీక్షలో పాసయింది. ఆ తర్వాత కృష్ణ కమిటీ వేసి వాస్తవాలు బయటకు రప్పించి, తెలంగాణ ఉద్యమకారులు చెప్పేవన్నీ అసత్యాలని రుజువు చేయించింది. సమైక్యభావనకు ఒక స్పష్టమైన రూపు వచ్చేట్లు చేసింది. ఇవ్వకపోతే కాంగ్రెస్ ఛస్తుంది అని తెలంగాణవాదుల చేత రోజూ తిట్లు తింటూనే వున్నా ఇప్పటికి కూడా తెలంగాణ యిస్తామని అనకుండా దోబూచులాడుతూ వుంది. ఎవరేమనుకున్నా ఫర్వాలేదనుకుని కితం నెల అఖిలపక్షంలో కూడా నాటకాలాడింది. ఇదంతా దేనికి? రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడానికి ! ఎటొచ్చీ తెలంగాణ యివ్వం అని గట్టిగా చెప్పే ధైర్యం చేయలేకపోతోందంతే! అఖిలపక్ష సమావేశం తర్వాత కూడా గాదె వెంకటరెడ్డి, లగడపాటి, కావూరి అటువంటి ప్రకటనలు చేసి పార్టీలో యింకా మనగలుగుతున్నారంటే అది హై కమాండ్ ఊరుకోబట్టే కదా!

ఇక వైకాపా – అది అసలైన గోడమీద పిల్లి. జగన్ సమైక్యవాది అంటే ఎవరూ నమ్మని పరిస్థితి వచ్చింది. సోనియా ఆధ్వర్యంలో నడుస్తున్న యుపిఏ 2ను తండ్రిలా ఎప్పణ్నుంచి భావిస్తోందో తెలియదు కానీ జగన్ జైలువాసం కూడా తండ్రి వేసిన శిక్ష అనుకుని వూరుకుంటే సంతకాల సేకరణకై వినియోగించే కాగితాలు, సిరా మిగులుతాయి. విభజనలో అన్యాయం జరిగిందని ఆంధ్రప్రాంతీయులు వాపోతే 'అందరికీ న్యాయం చేయమని కోరాం' అని చెప్పి తప్పించుకుందామని చూస్తోంది. విభజన మోడాలిటీస్‌పై చర్చలు జరిగినపుడు యిదే తండ్రి–కొడుకు పాట పాడుతుందో, అత్తా–కోడలు పాట పాడుతుందో చూడాలి. అత్త చెప్పినదాన్ని కోడలు వ్యతిరేకిస్తే యిందాకా టిడిపి విషయంలో రాసినదే వీళ్లకూ జరుగుతుంది. 'కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం' అన్నట్టు ఇరుప్రాంతాల వాళ్లనీ ఒకేసారి మెప్పించడం అసాధ్యం. టిడిపి పడే అవస్థే వైకాపా కూడా పడాలి.

ఆంధ్రప్రాంతంలో సమైక్యవాదం విషయంలో కాంగ్రెస్‌కున్న ఎడ్వాంటేజి యీ రెండు పార్టీలకు లేదన్న విషయం చంద్రబాబు ఆలస్యంగానైనా గమనించినట్టున్నారు. అందువలన వేణుగోపాలరెడ్డి, నన్నపనేనిల చేత సన్నాయి నొక్కులు నొక్కించారు. ఇప్పటికి డామేజి కంట్రోలయిందని అనుకుంటున్నారు కానీ కాంగ్రెస్ సమైక్య నినాదాల హోరులో అవి వినబడటం లేదు. కాంగ్రెస్ గేమ్‌ను అడ్డుకోవడానికి యింకో నలుగురి చేత అలా మాట్లాడిస్తే వెంటనే తెరాస వారు "పార్టీ విధానానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న ఆ నాయకులను బాబు సస్పెండ్ చేయాలి. లేకపోతే ఆయనే వాళ్ల చేత అలా మాట్లాడిస్తున్నారని నమ్మవలసి వస్తుంది. ప్రత్యేక తెలంగాణ పట్ల ఆయన చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుంది." అని ప్రచారం చేస్తారు. ట్విట్టర్ ద్వారా లోకేష్‌కు మెసేజ్‌లు పంపిస్తారు. మరి బాబు యింకే స్ట్రాటజీ వర్క్ చేస్తారో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 05 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇటాలియన్ మొగుళ్లు**

ఇటలీలో భార్యలపై భర్తలు జరిపే హింసాకాండ పెరుగుతోంది. అనేక కేసులు బయటకు వస్తున్నాయి. ఒకావిడను భర్త అడుగు పొడుగున్న కిచెన్ నైఫ్‌తో పొడిచాడు. ఈమె అరుపులు విని పక్కింటావిడ పోలీసులను పిలవడంతో యీమె బతికింది కానీ ఆ గాయాలకు 50 కుట్లు పడ్డాయి. ఆవిడ ఆర్నెల్లుగా రోమ్‌లో ఓ మారుమూల దాక్కుంది. ఎక్కడుందో తెలిస్తే మొగుడు వచ్చి చంపుతాడని భయం. ఆమె వయసు 46. 20 ఏళ్ల పాటు యిలాటి హింస భరించింది. మూడుసార్లు ముక్కు పగిలింది. ఒళ్లంతా సిగరెట్టుతో కాల్చిన మచ్చలే. ఇంత జరిగినా ఆమె మొగుడి మీద కేసు పెట్టలేదు. ఇలా మొగుళ్ల చేత, మగస్నేహితుల చేత హింసించబడినవాళ్లలో నూటికి 90 మంది ఫిర్యాదు చేయరు. ఫిర్యాదు చేస్తే ప్రాణంతో మిగలమని భయం.

సిసిలీలో 20 ఏళ్ల వానెస్సా 34 ఏళ్ల ఫ్రాన్సెస్కోను అతని పేరు కాక మరో పేరు పెట్టి పిలిచింది. 'ఓహో, నువ్వు యింకో మగాణ్ని మరిగావన్నమాట' అంటూ వాడు డివిడి ప్లేయర్ వైరు తీసుకుని ఆమె మెడకు బిగించి ఉరి వేసి చంపేశాడు. ఇంతా చేస్తే వాడు మొగుడు కూడా కాదు, బాయ్ ఫ్రెండ్ మాత్రమే. ఇది జరిగిన నెలలోనే మిలాన్‌లో 64 ఏళ్ల లెడాను ఆమె భర్త పెట్రోలు పోసి తగలబెట్టేశాడు. ఆమె చేసిన నేరం – మొగుడుకి చెప్పకుండా షాపింగ్‌కి వెళ్లడం. ఆ పై వారం ట్యూరిన్‌లో 44 ఏళ్ల ఆల్ఫినాను ఆమె బాయ్‌ఫ్రెండ్ బాల్కనీలోంచి బయటకు తోసేశాడు. కారణం – అతను టీవీలో ఓ ప్రోగ్రాం చూద్దామనుకుంటే యీమె మరోటి చూద్దామంది. ఇంకో నెల పోయాక నేపుల్స్‌లో 52 ఏళ్ల కార్మెలా పాతికేళ్ల వైవాహిక జీవితంతో విసిగిపోయి భర్తనుండి విడాకులు కోరింది. వెంటనే భర్త ముక్తి ప్రసాదించబోయాడు – తుపాకీతో పొట్టలో కాల్చి!

ఇంచుమించు అదే సమయానికి రోమ్‌లో అన్నామారియా అనే 50 ఏళ్లావిడ తలను ఆమె భర్త తుపాకీతో పేల్చాడు. ఈమె రోజూ గంటల తరబడి చర్చిలో గడుపుతోందని అతనికి కోపం. చర్చిలో ఆమె వయసు ఆడవాళ్లందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ భర్తను నిలదీయడం నేర్పుతున్నారని అతనికి అనుమానం. మళ్లీ మిలాన్‌కి వస్తే ఓ అమ్మాయి ఒక బాయ్‌ఫ్రెండ్‌తో స్నేహానికి స్వస్తి చెప్పి

మరొకడితో తిరగ నారంభించింది. మాజీప్రియుడికి కోపం వచ్చి ఆమెను పట్టుకుని చావగొట్టి, ఆమె 'స్టిలెటో' (మడమ ఎత్తుగా, కోసుగా వుండే చెప్పు)తోనే ఆమె గుండెల్లో గుచ్చేశాడు. ఇలా ఒకప్పుడు ప్రేమించినవాళ్ల చేతిలోనే చనిపోయే ఇటాలియన్ మహిళల సరాసరి 2012లో – రోజుకొకరు! గత మూడేళ్లగా యిటువంటి హత్యలు ఏడాదికి 10% చొప్పున పెరుగుతూ వస్తున్నాయి. హత్యకు గురయ్యేవారిలో 70% మంది భర్త లేదా ప్రియుడితో కలిసి వున్న మహిళలే. తక్కిన 30% మందిని మాజీ భర్త, లేదా మాజీ ప్రియుడు చంపుతున్నారు.

ఇటాలియన్ మగవాళ్లు యింత క్రూరంగా మారడానికి కారణం ఏమిటి అని తరచిచూస్తే చాలా విషయాలు బయటకు వచ్చాయి. ఇటలీలో మహిళల స్థానం నానాటికీ బలపడడంతో మారుతున్న పరిస్థితులతో సమాధానపడలేని మగవాళ్లు చేస్తున్న అకృత్యాలే యివి అని తేలింది. వాళ్లు యిప్పటిదాకా ఆడదాన్ని ఒక వస్తువుగానే చూశారు. ఇప్పుడు ఆమె తనను తాను శక్తిమంతురాలిగా నిరూపించుకుంటోంది. దాన్ని తట్టుకోలేని పురుషాహంకారం యీ హత్యలకు పురికొల్పుతోంది. గతంలో ఇటాలియన్ చట్టాలు ఇటువంటి విషయాలను చూసీ చూడనట్లు వదిలేసేవి. 'డొమెస్టిక్ రేప్' (భార్య ఇష్టంతో ప్రమేయం లేకుండా బలవంతంగా రమించడం) యితర దేశాల్లో నేరంగా పరిగణించినా ఇటలీలో 1996 వరకు అది నేరం కాదు. తర్వాత మార్చారు. కోపంతో కాని, అసూయతో కాని భర్త భార్యను చంపివేస్తే 'క్రైమ్ ఆఫ్ ప్యాషన్' (భావోద్వేగాల వలన జరిగే నేరం)గా పరిగణించి వదిలేసేవారు. కానీ ఐదేళ్లగా చట్టాలు మార్చి శిక్షలు వేస్తున్నారు. నేరం జరిగితేనే కోర్టు, చట్టాల ప్రసక్తి వస్తుంది. మహిళ నిత్యం యింట్లో భర్త చేతిలో అవమానాల పాలు కావడాన్ని యివి రక్షించలేవు. ఇటాలియన్ మగవాళ్ల ప్రవృత్తి మారితే తప్ప పరిస్థితిలో మార్పు రాదు.

అనాదిగా ఇటలీలో మగవాళ్ల మాటే చెల్లుబాటు అవుతూ వచ్చింది. తాము మగవాళ్లకు సాటి రామని ఆడవాళ్లు ఎప్పుడూ అనుకుంటూ వచ్చారు. కానీ విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు పెరుగుతూ రావడంతో ఆడవాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగి వారి మాటల్లో, చేతల్లో ప్రతిఫలించసాగింది. అది మగవాళ్లకు మింగుడు పడటం లేదు. దానికి తోడు మీడియాలో ఆడవాళ్లను ప్రముఖంగా చూపించడం చాలా ఎక్కువైంది. ఇంటి వ్యవహారాల్లో, కంపెనీ వ్యవహారాల్లో ఆడవాళ్లే తెలివిగా నిర్ణయాలు చేస్తారని యాడ్స్‌లో చూపించడంతో మగవాళ్లు కంగారు పడుతున్నారు. బెడ్‌రూమ్‌లో వుండవలసిన ఆడదాన్ని కంపెనీ బోర్డు రూములో చూపించడం వలన ఆ యాడ్స్ చూసి తమ యింట్లో వున్న ఆడవాళ్లకు – తల్లి, భార్య, కూతురు, స్నేహితురాలు ఎవరైనా కావచ్చు– వీళ్లందరికీ కొమ్ములు మొలుస్తున్నాయన్న శంక పట్టుకుంది. కొమ్ములు విరిస్తే తప్ప వీళ్లను అణచి వుంచడం కష్టమని అనుకుంటూ యిలాటి హింసకు పాల్పడుతున్నారు. ఇన్నాళ్ల దాకా ఆడవాళ్లు పెళ్లయితే చాలు అన్నట్టు వుండేవారు. ఇప్పుడు మొగుడు తమతో ఆర్థిక వ్యవహారాలు కూడా సంప్రదించాలని కూడా కోరుకుంటున్నారు. ఆడవాళ్లలో వచ్చిన యీ మార్పును ఆమోదించడం మగవాళ్లకు అసాధ్యంగా వుంది.

మొగాళ్ల హింస పెరుగుతున్న కొద్దీ ఇటాలియన్ స్త్రీ పట్టుదల పెరుగుతోంది. గృహహింసకు గురయ్యే వారికి కౌన్సిలింగ్ అంటూ ఒకామె 25 ఏళ్ల క్రితం హాట్‌లైన్ ఏర్పాటు చేస్తే పెద్దగా ఎవరూ సంప్రదించేవారు కారు. 'ఇవన్నీ బయటకు చెప్పుకునేవి కావు' అనుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏడాదికి 1200 మంది సభ్యులుగా చేరి సలహాలు పొందుతున్నారట. ఇటాలీ దేశపు జాతీయ స్టాటిస్టికల్ ఏజన్సీ గణాంకాల ప్రకారం 16–70 ఏళ్ల వయసు మధ్యలో వున్న మహిళలలో 33% మంది గృహహింసకు గురవుతున్నారట. ఇవన్నీ బయటకు రావడంతో ఇటలీలో స్త్రీలు గృహహింసకు వ్యతిరేకంగా అక్టోబరు నుండి ఉద్యమిస్తున్నారు. వారికి ఎందరో పురుషులు కూడా చేయూత నిస్తూ వుండడం శుభపరిణామం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 06** **ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 03**

కెసియార్‌గారు తరచుగా వాడే సామెత ఒకటుంది – 'గాడిదకు మేత వేసి ఆవును పాలిమ్మంటే ఎలా?' అని. 2009 ఎన్నికల్లో తెరాసకు ప్రజలిచ్చిన సీట్లు 10. 'కానీ ఢిల్లీ కెళ్లి తెలంగాణ పట్టుకు రా' అని ఆయన్ని చంపుతున్నారు. ఒళ్లు మండి ఆయన యీ సామెత చెప్తూ వుంటారు. ఓట్లు మరో పార్టీకి వేసి, పని మాత్రం మాకు అప్పగిస్తే ఎలా అని ఆయన ఆక్రోశపు ప్రశ్న.

ఇలాటిదే 'అడవి పంది చేను మేస్తే ఊరపందికి చెవులు కోశారట' అనే సామెత వుంది. చేను మేసినదేమో అడవి నుంచి వచ్చిన పంది. దాన్ని శిక్షించాలంటే అది దొరకదు. ఊళ్లో తేరగా దొరికినది ఊరపంది. దానికి చెవులు కోసి శిక్షించారన్నమాట. ఇది కూడా మనం నిత్యజీవితంలో చూస్తాం. అడవి నుండి వచ్చిన మావోయిస్టులు పోలీసు స్టేషన్‌పై దాడి చేసి ఆయుధాలు పట్టుకుపోతారు. వాళ్లను పట్టుకోవాలంటే దొరకరు. వెతుకుతూ అడవికి వెళ్లినవాళ్లు తిరిగి రారు. అందుకని ఊళ్లో వున్నవాళ్ల మీద పోలీసులు పడతారు. మావోయిస్టులు వచ్చినపుడు అన్నం పెట్టారనో, పోలీసు స్టేషన్ ఎక్కడుందో ఆచూకీ చెప్పారనో నేరం మోపి వీళ్లను బాదతారు. అన్నం పెడితే వీళ్లు చంపుతారు, పెట్టకపోతే వాళ్లు చంపుతారు. అడవి సరిహద్దు గ్రామాల్లో పరిస్థితి యిది.

కాజ్ ఒకచోట ఎఫెక్ట్ మరో చోట అనే అర్థంలో హిందీలో 'చిరాగ్ కహాఁ, రోష్నీ కహాఁ' అనే సామెత వుంది. దీపం ఒక చోట వుంటే దీపకాంతి మరోచోట పడుతోందని అర్థం. ఒకింట్లో పుట్టిన పిల్లవాడు మరో చోట పెరగడం సబ్జక్ట్‌పై ఈ పేరుతో హిందీ సినిమా వచ్చింది. 'సుడి ఒకచోట – చురక ఒక చోట' అనే సామెత వుంది. పుట్టినపుడు తలపైనా, నుదుటిపైనా, అక్కడక్కడ

శరీరంపైనా సుడులతో పుడతారు కొందరు. కుడివైపు తిరిగి వున్నవి మంచివని, ఎడమవైపు తిరిగి వున్నవి చెడ్డవని అంటారు. తలపైన రెండు సుడులున్న మగవాడైతే గడుగ్గాయి అవుతాట్ట. ఆడపిల్లయితే చమత్కారి అవుతుందట. ఎడమకు తిరిగిన సుడితో ఓ పాప పుట్టిందిట. దాన్ని ఎటువైపు తిరిగిందో కనిపించకుండా చేద్దామని తల్లిదండ్రులు సుడిమీద ఓ చురక పెట్టిద్దామనుకున్నారు. పెట్టేవాడు ఎర్రగా కాల్చిన అట్లకాడతో వాత వేశాడు. అయితే అది వేయడంలో వేయాల్సిన చోట కాక పక్కన వేశాడట. సుడి పోలేదు సరికదా, దాని పక్కన కాలిన మచ్చ కూడా వచ్చి చేరింది – రోగానికి వేసిన మందు, రోగాన్ని తగ్గించకపోగా వేరే రోగం తెచ్చిపెట్టినట్టయిందన్నమాట!

---

మచ్చ అంటే గుర్తుకు వచ్చింది. మొక్కపాటి నరసింహశాస్త్రిగారి వద్దకు వచ్చి ఒక యువకవి "నా కవిత్వంతో తెలుగు సాహిత్యంలో నేను ఒక తీపిగురుతును వదిలి వెళదా మనుకుంటున్నానండి" అన్నాడట.

"గురుతుల మాట ఎలా వున్నా చాలామంది మచ్చలు వదిలివెళుతున్నారు" అన్నారట మొక్కపాటి అతని కేసి జాలిగా చూసి!

---

ఫలానా నాయకుడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు అనేమాట పేపర్లలో చదువుతూ వుంటాం. బ్రహ్మ కమలంలోనే కనబడతాడు ఆయనకు రథం వుందా అన్న సందేహం వస్తుంది. నిఘంటువులో చూస్తే 'చనిపోయిన సన్యాసులను తీసుకుపోయే వాహనం' అని వుంటుంది. మన నాయకులు నిఘంటువులు చూడరు కాబట్టి యీ వాడకాన్ని అనుమతిస్తున్నారని అనుకోండి. ఇక్కడ రూఢి అర్థం ఏమిటంటే – బతికి వున్న స్వాములను కానీ, చనిపోయిన స్వాములను కానీ ఊరేగించే రథాన్ని లేదా పల్లకిని మోయవలసినది బ్రాహ్మణులు మాత్రమే. బ్రాహ్మణుల చేత మోయించుకోవడం అంటే అది చాలా గొప్ప విషయం. నహుషుడి కథలో యీ విషయం మనకు తెలుస్తుంది.

అతను ఇంద్రపదవి పొందాక గత యింద్రుని భార్య అయిన శచీదేవి పొందు కోరితే ఆమె 'బ్రాహ్మణులు మోసే పల్లకిలో రా, కోరిక తీరుస్తాను' అంది. ఇతను అలాగే బయలుదేరాడు. ఆత్రం ఎక్కువగా వుందేమో పల్లకీ బోయిలలో ఒకడుగా వున్న అగస్త్యుణ్ని గబగబా నడవమని అదిలించాడు. అగస్త్యుడికి ఒళ్లు మండి 'భూలోకంలో సర్పంగా పడి వుండమ'ని శాపం యిచ్చాడు. అరణ్యవాసం టైములో అతని ప్రశ్నలకు సరైన జవాబులిచ్చిన ధర్మరాజు కారణంగా శాపవిముక్తి అయింది. శచీదేవి యిదంతా ఊహించే యీ షరతు పెట్టి వుండవచ్చు. దీనివలన తేలేదేమిటంటే – బ్రాహ్మణులచేత మోయించుకుని 'బ్రహ్మరథం పట్టించుకున్నాం' అని చెప్పుకోవడం గొప్పే కానీ దానితో బాటు ఆకాశం నుండి నేలమీద పడి పాక్కుంటూ తిరిగే రిస్కు కూడా వుంది.

---

మొన్న మా "హాసం క్లబ్"లో ఓ అబ్బాయి "సువర్ణసుందరి"లో 'హాయిహాయిగా ఆమని సాగె' పాట పాడాడు. కష్టమైన పాటైనా బాగా పాడాడు. వింటూ వుంటే దీనిలో వచ్చే తటిల్లత, మొయిలు, కనుగవ వంటి మాటల కర్థం యీ అబ్బాయికి తెలుసా? అని అనుమానం వచ్చింది. పాడిన తర్వాత మెచ్చుకుంటూ "పల్లవిలో వచ్చిన 'ఆమని' అర్థం తెలుసా?" అని అడిగాను. "తెలియదు" అని క్లుప్తంగా చెప్పి వేదిక దిగిపోయాడు. పల్లవే తెలుసుకోనప్పుడు చరణాల సంగతి అడగడం దేనికని ఊరుకున్నాను. ఈ విషయంలో మన పాఠకులు ఎలా వున్నారో చూద్దామన్న కోరిక పుట్టింది.

"రీడర్స్ డైజస్ట్"లోని 'వర్డ్ పవర్' నాకు చాలా యిష్టమైన శీర్షిక. పదం అర్థమేమిటని డైరక్టుగా అడిగితే చెప్పేయగలమేమో కానీ, మల్టిపుల్ ఛాయిస్ యివ్వడంతో కన్‌ఫ్యూజ్ అయిపోతాం. మనం అనుకున్నదానికి అన్నీ దగ్గరదగ్గరగా అనిపిస్తాయి. ఇతమిత్థమని తెలిసిచావదు. దాని స్ఫూర్తితో "హాసం" పత్రిక నడిపేటప్పుడు "మీ పదసంపద" అనే శీర్షికను ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగారి పేర నేను నడిపేవాణ్ని. ఆ సంచికలో వచ్చే పాటల్లోంచే మాటలు ఏరి యిచ్చేవాణ్ని. సందర్భం వెరిఫై చేసుకుని మరీ అర్థం చెప్పండి అంటూ నాలుగు మాటలు యిచ్చేవాణ్ని. ఏదైనా మాట తీసుకుని నిఘంటువు చూసి సరైన అర్థం యివ్వడం చాలా సులభం. కానీ పాఠకుడి ఆలోచనను తప్పుదారి పట్టించే తక్కిన మూడు మాటలూ కనిపెట్టడమే మహా కష్టం. 10 మాటలకు యిలా అర్థాలు , 'అనర్థాలు' తయారుచేయడానికి నాలుగైదు గంటలు పట్టేది. కానీ శీర్షిక చాలామందిని మెప్పించింది. "జింబో" పేరుతో కథలు రాసే ప్రఖ్యాత రచయిత, తెలుగులో తీర్పులు వెలువరించి భాషాభిమానం చాటుకున్న న్యాయమూర్తి ఎం.రాజేందర్‌కు చెప్పేవారు – "మీ పత్రిక రాగానే మొదట చూసే శీర్షిక అదే. నేనూ, మా ఆవిడా అర్థాల గురించి పందాలు వేసుకుంటున్నాం." అని.

"మీ పదసంపద" యిక్కడ మళ్లీ చేస్తున్నాను. సమాధానాలు వచ్చే వ్యాసంలో యిస్తాను. నాకు తెలుసు – మీరు గొప్పవారు. "ఎమ్బీయస్ కబుర్లు" చదివే టేస్టున్న తెలుగు పాఠకులు. పైగా అర్థం ఇంటర్నెట్‌లో సెకన్లలో వెతకగలరు. కాబట్టి 10లో మీరు కనీసం 9 కరక్టుగా చెప్పగలరు.. కదూ!?

మీ పదసంపద 01

1. కుళ్లాయి ("మల్లీశ్వరి"లో 'కోతిబావకు పెళ్లంట' పాటలో వస్తుంది) – ఎ.చెవిలో పువ్వు బి.కండువా సి.టోపీ డి.కుచ్చు
2. చెలువ ("మల్లీశ్వరి"లో 'పిలిచిన బిగువటరా' పాటలో వస్తుంది) – ఎ.కన్నెపిల్ల బి.స్త్రీ సి.అదృష్టదేవత డి.అందగత్తె
3. వంక ("మల్లీశ్వరి"లో 'పరుగులు తీయాలి' పాటలో వస్తుంది) – ఎ.చెరువు బి.సెలయేరు సి.జలపాతం డి.వంపులు తిరిగే కాలువ
4. మరులు ("మల్లీశ్వరి"లో 'ఔనా నిజమేనా' పాటలో వస్తుంది) – ఎ.కోరిక బి.మరపు సి.మాయ డి.మోసము
5. డోల ("మల్లీశ్వరి"లో 'మనసున మల్లెల మాలలూగెనే' పాటలో వస్తుంది) – ఎ.గుత్తి బి.జూకా సి.ఉయ్యాల డి.కొమ్మ
6. సురుచిరలీల ("బారిష్టర్ పార్వతీశం"లో 'ప్రేమయే జగతి' పాటలో వస్తుంది) – ఎ.మంచి రుచి గలిగినది బి.కాంతులీనునది సి.అందమైన క్రీడ డి.చాలాకాలము వుండే ఆట
7. కవ్వాలి ("నువ్వే కావాలి"లో 'అనగనగా ఆకాశం' పాటలో వస్తుంది) – ఎ.కవ్వించే పాట బి. భావగీతం సి.కవ్వం చిలకడం డి.ఉర్దూ బృందగానం
8. సయ్యాట ("నువ్వే కావాలి"లో 'అనగనగా ఆకాశం' పాటలో వస్తుంది) – ఎ.చిలిపి ఆట బి.ఆట ఆడడానికి సరేననడం సి.నాట్యం డి.వెక్కిరింత
9. వాటం చూసి ("కన్యాశుల్కం"లో 'చిటారు కొమ్మన...' పాటలో వస్తుంది) – ఎ.సరైన సమయం చూసి బి.అవకాశం చూసి సి.అవతలివారి తరహా చూసి డి.సులభమైనమార్గం చూసి
10. పసరు ("మల్లీశ్వరి"లో 'ఎందుకే నీకింత తొందర' పాటలో వస్తుంది) – ఎ.ఎగురు బి.వ్యాపించు సి.ఊగు డి.ఆడు

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 07** **ఎమ్బీయస్ : అక్బరుద్దీన్ ఆగ్రహభాషణం**

సాధారణంగా స్వామీజీలు అనుగ్రహభాషణం చేస్తారు. వాటి గురించి ఎవరూ అడగరు కానీ అక్బరుద్దీన్‌జీ దయచేసిన ఆగ్రహభాషణం మీద రాయమని చాలామంది కోరుతున్నారు. ఏం రాయాలో నాకూ తోచటం లేదు. అతని ఉపన్యాసంలోని భావాలు కానీ, పదాలు కానీ ఉటంకించడం నా స్థాయికి తగని పని. అతను మాట్లాడినది కల్తీ లేని చెత్త. దాని గురించి పదేపదే చెప్పుకుని వాటికి శాశ్వతత్వం కల్పించడం బుద్ర తక్కువ. అవి కోర్టు రికార్డుల్లో వుంటే చాలు, మనుష్యుల మెదళ్లలో వుండనక్కరలేదు. మరి దేని గురించి నువ్వు మథన పడుతున్నా?వ్ అంటే అతను ఎందుకిలా మాట్లాడాడు, దీని వెనక్కాల స్కీము ఏమిటి అన్న విషయమే నాకు అంతుపట్టటం లేదు. ఏదో ఆవేశంలో ముందూ వెనకా ఆలోచించకుండా నోటికి వచ్చినట్టు మాట్లాడేశాడు అనుకోవడానికి లేదు. ఒవైసీ సోదరులు చాలా తెలివైనవాళ్లు, మంచి వక్తలు. వాళ్లు అసెంబ్లీలో కాని, పార్లమెంటులో కాని ఆచితూచి గంభీరంగా మాట్లాడతారు. ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో దిట్టలు. ఉపన్యాసాల్లో పాయింటు వుంటుంది. మరి అలాటివాడు తను మాట్లాడుతున్నదేమిటో తెలియకుండా ఒళ్లు మరిచి మాట్లాడాడా? నో!

అసలు ఆవేశంగా మాట్లాడడానికి అక్కడ సందర్భం ఏముంది? అక్కడేమైనా మసీదు కూల్చారా? లేదా ఒక ముస్లిము అమ్మాయి హిందువు చేతిలో బలాత్కారానికి గురయిందా? రాముడు యిక్కడ పుట్టాడంటూ అక్కడి వక్ఫ్ భూముల్లో గుడి కట్టబోయారా? ఆవుమాంసం అమ్మకూడదంటూ అక్కడేమైనా ధర్నాలు చేశారా? హిందూ, ముస్లిములు మీరెంతంటే మీరని తలపడ్డారా? ఏమీ లేదు. ఉత్తిపుణ్యాన విరుచుకు పడి ఉపన్యాసం యిచ్చాడు. ఒక రంగస్థల నటుడు స్టేజి మీద నరసింహావతారం వేషం వేస్తూ, మధ్యలో గ్యాప్ వచ్చినపుడు వింగ్సులో సోడా తాగుతూ కబుర్లు చెప్పి, మళ్లీ స్టేజిమీదకు వెళ్లి ఉగ్రరూపం చూపినట్టు 8 వ తారీకున ఒక 'పెర్‌ఫామెన్సు' యిచ్చి మళ్లీ 14 రోజుల తర్వాత యింకో వూళ్లో యింకో 'పెర్‌ఫామెన్స్' యిచ్చాడు. మధ్యకాలంలో యీ ఆవేశాన్ని ఏం చేశాడో తెలియదు.

మజ్లిస్ పార్టీ స్వభావమే అంత అని నోరు చప్పరించడానికి లేదు. అదే వాళ్ల స్వభావం అయితే వాళ్లు రాజకీయపార్టీగా యింతకాలం మనగలిగేవాళ్లు కారు. పాతబస్తీలోనే కాదు, హైదరాబాదులో యితర ప్రాంతాల్లో కూడా వాళ్ల బలం వ్యాపిస్తోందని, కార్పోరేషన్‌లో తగినన్ని సీట్లు సంపాదించి మేయర్ పదవి పొందగలిగారని గుర్తుంచుకోవాలి. హిందువుల ఓట్లు పడందే యిది సాధ్యం కాదు. అందుకే హిందూ అభ్యర్థులను కూడా వాళ్లు నిలబెడుతున్నారు. పాతబస్తీలో ముస్లిములు పెద్ద సంఖ్యలో వుంటారు కాబట్టి ఛాందసవాదులుగా వున్నా చెల్లిపోయింది. ఇప్పుడు వాళ్లు తెలంగాణలోని యితర ప్రాంతాలకూ, రాయలసీమ ప్రాంతాలకూ విస్తరిద్దామని చూస్తున్నారు. అక్కడి ముస్లిములు ఛాందసవాదులు కాదు, హిందువులతో వారి సంపర్కం చాలా ఎక్కువ. అక్కడ మతకలహాల నేపథ్యం లేదు. హిందువుల ఓట్లు పడితేనే అక్కడ నెగ్గగలరు. హిందువులను యిలా పడతిడితే అక్కడ మజ్లిస్ ఆదరణ పొందలేదు. వాళ్ల అభ్యర్థిగా నిలబడడానికి ఎవరూ దొరకను కూడా దొరకరు.

విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దళ్ వాళ్లు కూడా యిదే తరహాలో మాట్లాడతారని మీడియాలో ఒక వర్గం రాస్తోంది. మాట్లాడితే మాట్లాడి వుండవచ్చు. అవి రాజకీయపార్టీలు కావు. వాళ్లకు ఓట్లతో పని లేదు. కానీ మజ్లిస్ ఎన్నికల్లో గెలవాల్సిన

అవసరం వుంది. హిందువులందరూ గట్టిగా పగపట్టి ఒకే అభ్యర్థిని నిలబెడితే మజ్లిస్‌కు రెండు, మూడు తప్పించి అసెంబ్లీ సీట్లు రావు. అప్పుడు వాళ్లను రాజకీయంగా తొక్కేస్తారు. వాళ్ల ఆస్తులపై విచారణ చేపడతారు, వాళ్లపై వున్న కేసులను తిరగతోడతారు. అందువలన మజ్లిస్ నాయకుల మెదళ్లో ఏమున్నా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడవలసిన అవసరం వుంది. మరి అవేళ అక్బరుద్దీన్‌కి యివేమీ తోచలేదా? తోచినా మాట్లాడాడు. అందుకే అతని ప్రవర్తన వింతగా వుందంటున్నాను.

అలాగే మజ్లిస్‌ను నిందించే కాంగ్రెస్, యితర పార్టీల ప్రవర్తన కూడా! డిసెంబరు 8న నిజామాబాద్‌లో అతను అలాటి వుపన్యాసం యిచ్చినపుడు ఎవరూ నిర్ఘాంతపోలేదా? కిందిస్థాయి పోలీసులకు అతని మాటల తీవ్రత అర్థం కాలేదన్నారు డిజిపిగారు. అసలు మన రాష్ట్రంలో ఉర్దూ అర్థం చేసుకునేవారు లేక కేసు నమోదు చేయడం లేటయిందన్నారాయన. ఆయన మాట్లాడినది తెలంగాణలోనే. ఇక్కడ హిందీ, ఉర్దూ ధారాళంగా అందరికీ వచ్చని, ఆ అసూయతోనే ఆంధ్రపాలకులు హిందీకి పాస్ మార్కులు తగ్గించేసి ప్రాధాన్యత లేకుండా చేసేశారనీ తెలంగాణ ఉద్యమ నాయకులు గగ్గోలు పెడుతూ వుంటారు. చూడబోతే తెలంగాణలోనూ ఉర్దూ అర్థమయ్యేవాళ్లు లేనట్టున్నారు. లేకపోతే డిసెంబరు 9 వ తారీకు తెలుగు పేపర్ల జిల్లా ఎడిషన్స్‌లో వీటి గురించి ఖండిస్తూ రాసి వుండేవారు. లోకల్‌గా ఉర్దూ పేపర్లు వుండి వుంటాయనుకోను కానీ హైదరాబాదునుండి వెలువడే ఉర్దూ పేపర్ల విలేకరులు కవర్ చేసే వుంటారు. హిందువులెవరూ ఉర్దూ పేపర్లు చదవరా? ఉర్దూ పేపర్లు చదివిన ముస్లిములెవరూ 'మా అక్బరుద్దీన్ మీ మతం మీద భలే పాయింట్లు లాగాడు' అని వేళాకోళంగానైనా అని వుండరా? అంత పెద్ద మీటింగు జరుగుతూంటే దారిన పోయే హిందూ దానయ్యలెవరైనా వినలేదా? విని యింకెవరికీ చెప్పలేదా?

ఇవేమీ జరగలేదనే అనుకోవాలి. జరగనందుకు అక్బరుద్దీన్ చాలా ఫీలై వుండాలి. కష్టపడి యింత స్పీచ్ యిస్తే బొత్తిగా ఎవరూ పట్టించుకోకుండా అయిపోయిందేమిట్రా అని. అందుకే రెండువారాల్లో డిసెంబరు 22 న నిర్మల్‌లో మళ్లీ స్పీచ్ యిచ్చాడు. ఎందుకైనా మంచిదని వీడియోలు తీయించాడు. అవే అతన్ని కాశాయి. పబ్లిసిటీ తెచ్చిపెట్టాయి. ఎందుకంటే నిజామాబాద్‌లో డిసెంబరు 9 న ఏం జరిగిందో డిసెంబరు 23న ఆదిలాబాద్ జిల్లా ఎడిషన్స్‌లోనూ అదే జరిగింది. ఎవరికీ అర్థమూ కాలేదు, ఎవరూ రిపోర్టూ చేయలేదు, ఎవరూ మాట్లాడుకోనూ లేదు. అక్బరుద్దీన్ చాలా నిరాశ పడిపోయి వుంటాడు.

ఇది వింతగా లేదా? ఇతని స్పీచ్ విని రక్తం ఉడుకెత్తిపోతూందంటూ రాష్ట్రమంతటా, విదేశాల్లో సైతం గంగవెర్రులెత్తుతున్నామే, మరి నిజామాబాద్, నిర్మల్ పట్టణవాసులెవరికీ యిలాటి పూనకం రాలేదెందుకు? వాళ్లు వినలేదు కాబట్టా? ఆ శ్రోతల్లో ఒక్క హిందువు కూడా లేడా? ఇలా మాట్లాడడం అన్యాయం అని ఫీలై బయటకు వచ్చి చెప్పిన ముస్లిము ఒక్కడూ లేడా? హిందూమతాన్ని, హిందువులను వేయి కళ్లతో రక్షిస్తున్నామని చెప్పుకునే వారు ఏం చేస్తున్నారు? అక్బరుద్దీన్ ఉపన్యాసానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తామంటూన్న పీఠాధిపతులు ఏం చేస్తున్నారు? హిందూ కార్యకర్తలు ఏం చేస్తున్నారు? ఎక్కడో ప్యారిస్‌లో హిందూమతం అంటే తెలియని చోట చెప్పుల మీద, హ్యాండ్ బ్యాగ్‌ల మీద ఆంజనేయుడు బొమ్మ వుందనో, వినాయకుడి బొమ్మ వుందనో యిక్కడ నిరసనలు వ్యక్తం చేసేవారు, మన రాష్ట్రం నడిబొడ్డున హిందువులు అత్యధికంగా వున్న చోట యిలాటి ఉపన్యాసాలు యిస్తూంటే మనకు తెలియలేదు, రేదర్ మనం తెలుసుకోలేదు. ఇదీ మన 'జాగృతి'! –

ఒకసారి విషయం బయటకు వచ్చిన తర్వాత మాత్రం అందరూ రంకెలేయడం మొదలు పెట్టారు. ఇవాళ ఎబివిపివారు అతని ఫ్లెక్సీ బొమ్మమీద అదే పనిగా పాదాలతో తొక్కుతూ ఒకరి తర్వాత ఒకరు ఫోటోలు తీయించుకున్నారు. వాటిని టెలికాస్ట్ చేశారు. ఒక ఎమ్మెల్యేకు అవమానం అంటూ వేరే ఎవరైనా కేసు పెడతారేమో, దాని పర్యవసానం ఏమిటో వేచి చూడాలి. జగ్గారెడ్డి వాగ్ధాటీ చూశాం. దానిమీదా ఎవరో కేసు పెట్టవచ్చు. నేనడిగేది యీ చైతన్యమంతా డిసెంబరు 8 నుండి మూడు వారాల పాటు ఏమైందని? నా అనుమానం – యిది యిలా జరగాలని మజ్లిసే డిజైన్ చేసిందేమోనని. యూ ట్యూబ్‌లో అతని ఉపన్యాసాలు పెట్టినదెవరు? అతని ఉపన్యాసంతో భగ్గుమన్న హిందువు కాదుగా! ఎవరో ముస్లిమే. బహుశా అతని అభిమాని కావచ్చు, మజ్లిస్ పార్టీ కార్యకర్త కావచ్చు. చూడండి ఎలా మాట్లాడాడో అంటూ నిందిస్తూ వ్యాఖ్య ఏమీ రాయలేదు.

తర్వాత యీ విషయానికి వెలుగులోకి తీసుకుని వచ్చింది కూడా ఢిల్లీవాసి ఐన ఒక ముస్లిం మహిళ. ఆవిడ పుట్టుపూర్వోత్తరాలు నాకు తెలియవు. గతంలో యిటువంటి పిల్ వేశారా? అక్బరుద్దీన్ యిలా మాట్లాడతాడని ఊహించి ఆవిడ యూ ట్యూబంతా వెతికిందా? ఆవిడ కేసు తర్వాతే జాతీయ మీడియాకు తెలిసింది. మన మీడియా అప్పుడు మేల్కొంది. ఇన్నాళ్లూ ఎందుకు రిపోర్టు చేయలేదో సంజాయిషీ యివ్వలేదు. తన బాధ్యత విస్మరించినందుకు క్షమాపణ చెప్పలేదు. 'ఇన్నాళ్లూ ప్రభుత్వం ఏం చేసింది, సభలో వున్న పోలీసులు ఏం చేశారు?' అంటూ ప్రభుత్వాన్ని నిలదీయడం మొదలెట్టింది. ప్రతిపక్షాల వారు సరేసరి, ముందే ప్రభుత్వాన్ని తప్పుపడతారు. ప్రతిపక్షాలన్నిటికీ నిర్మల్‌లో, నిజామాబాద్‌లో కార్యకర్తలున్నారు కదా, వాళ్లు ఏం చేస్తున్నారట? ప్రజల తరపున పోరాడుతున్నాం, ప్రభుత్వంతో పోరాడుతాం అని చెప్పుకుంటారు కదా, మరి యీ విషయం వాళ్లెందుకు బయటపెట్టలేదు? ఇదంతా చూస్తే అక్బరే కావాలని యీ గొడవను వెలుగులోకి తెప్పించాడేమో ననిపిస్తోంది. తనే కావాలని లీక్ లిచ్చి, ప్రజల్లో ఆందోళన చేయించి, ఆ సమయానికి లండన్ వెళ్లిపోయి, మళ్లీ తిరిగి వచ్చిన తర్వాత పెద్ద డ్రామా నడిపి అరెస్టయ్యాడేమో!?

అరెస్టయ్యా – కాంగ్రెస్‌కు మద్దతు వుపసంహరించినందుకే యీ అరెస్టు జరిగిందన్నాడు. కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కయ్యాయన్నాడు. బిజెపితో కుమ్మక్కు మాట పట్టించుకోనక్కరలేదు కానీ అసలు కాంగ్రెస్‌కు మద్దతు ఉపసంహరణ ఎందుకు జరిగిందో చెప్పమనండి.

అదే యిప్పటిదాకా నాకు అర్థం కాలేదు. ఎన్నికలు వస్తే కాంగ్రెస్‌తో అంటకాగితే ఓట్లు రావనే భయంతో దూరమయ్యారన్న వాదన నమ్మనక్కరలేదు. ఎందుకంటే వాళ్లు బహిరంగంగా కాంగ్రెస్‌తో ఎప్పుడూ పొత్తు పెట్టుకోలేదు. కూటమి ఏర్పరచలేదు. ఎన్నికలయ్యాక సపోర్టుగా నిలిచారంతే. ఆ పని రేపు ఎన్నికలలో ఎవరు గెలిస్తే వారికే చేస్తారు. ఎవరు నెగ్గినా 'స్వీప్' చేసే పరిస్థితి లేదు. ఏ 160 సీట్లతోనో గెలిచిన పార్టీకి/కూటమికి మజ్లిస్ తనంతట తానుగా వచ్చి మద్దతు యిస్తానంటే సరేలే అని తీసుకుంటారు. ఎందుకంటే నెగ్గాక కూటమి నిలుస్తుందో లేదో తెలియదు, సొంత పార్టీలోనే చీలికలు రావచ్చు. అందువలన యిప్పటికిప్పుడు మజ్లిస్ అర్జంటుగా విత్‌డ్రా కావలసిన పనే లేదు. పైగా ఎన్నికలకు ఓ ఏడాది గడువుంది. ఎన్నికలు ప్రకటించాక కూడా మద్దతు ఉపసంహరించవచ్చు.

ఇక రెండో కారణం – మహావీర్ ఆసుపత్రి స్థలం గురించి అంటున్నారు. దాని గురించి మజ్లిస్‌కు కోపం వస్తే వచ్చి వుండవచ్చు. కానీ హైదరాబాదులో అదొక్కటే స్థలమా? ఆ సైజు స్థలం పాతబస్తీలో తీసుకోండి అనవచ్చు కాంగ్రెస్. పాత బస్తీలో మజ్లిస్ వారు చార్మినార్ పట్టుకుపోయినా ఎవరికీ తెలియదు. రిపోర్టింగ్ సరిగ్గా జరగదు. చార్మినార్ పక్కన భాగ్యలక్ష్మీ దేవాలయం క్రమంగా యింతింతై.. వటుడింతయై.. అన్నట్లు పెరిగిపోతూ వుంటే మీడియా ఎందుకు రిపోర్టు చేయకుండా వుంది? ఇప్పుడు మజ్లిస్ గొడవ చేశాక 60 ఏళ్ల కితం అస్సలు లేదు, 30 ఏళ్ల కితం జానెడు వుండేది, 20 ఏళ్ల కితం మూరెడు వుండేది, 10 ఏళ్ల కితం బారెడు అయింది.. అంటూ లెక్కలు చెపుతున్నారే యివన్నీ అప్పుడే చెప్పలేకపోయారా? అందువలన మహావీర్ ఆసుపత్రి యిస్యూ పెద్ద కారణమే కాదనుకుంటాను.

అఖిలపక్ష సమావేశంలో కూడా మజ్లిస్ కిరణ్‌పై విరుచుకుపడడం దేనికి? అసలు ఆ సమావేశం ఉద్దేశం ఏమిటి, మజ్లిస్ రామాయణంలో పిడకలవేటకు పూనుకోవడం ఏమిటి? తాము కాంగ్రెస్‌కు వ్యతిరేకం, కిరణ్ తమకు పడదు అని లోకానికి చాటడం కోసమా? కావాలంటే అసదుద్దీన్ సోనియా ఎపాయింట్‌మెంట్ నిమిషాల్లో సంపాదించగలడు. వెళ్లి 'కిరణ్ మాకు నచ్చలేదు, మార్చే ప్రయత్నం చేయండి' అని డైరక్టుగా చెప్పవచ్చు. ఆవిడ మార్చినా మార్చకపోయినా 'సరే, ఆల్టర్నేటివ్‌కోసం చూస్తున్నా' అని నచ్చచెప్పి పంపించవచ్చు. అదేమీ కాకుండా సందర్భశుద్ధి లేకుండా అఖిలపక్ష సమావేశంలో కిరణ్ గురించి ప్రస్తావించడంలో కృత్రిమత్వం వుంది.

ఇక అరెస్టు గురించి కూడా ఎంత నాటకం జరిగిందో చూడండి. కేసు పెట్టడమే లేటుగా పెట్టారు. పోలీసుల్లో ఉర్దూ అర్థమైనవాళ్లు లేకపోయారట. హైదరాబాదులో ఉర్దూ ఎకాడమీ అవి వున్నాయి కదా, ఎవరిని పిలిచి వినిపించినా పావుగంటలో విషయం తెలుస్తుంది. అయినా అతన్ని అరెస్టు చేయడానికి కేసుల కోసం వెతకాలా? పాతవే చాలా వుండి వుంటాయి. కోర్టు సమన్లు పెండింగులో వుండే వుంటాయి. 'మనిషి కనబడుట లేదు' అని రాసి వాటిని కోల్డ్ స్టోరేజిలో పడేసి వుంటారు. అవి పైకి లాగవచ్చు. చివరకు కేసులు పెట్టారు – అవీ అతి తీవ్రమైన సెక్షన్లతో! దేశద్రోహం, కుట్ర మరోటీ అంటూ..! అంత తీవ్రమైన కేసుల్ని సాక్ష్యాలు చాలలేదంటూ కోర్టులు కొట్టేస్తాయి. పరమతదూషణ చేశాడన్న కేసు మాత్రమే పెట్టి వుంటే నిలిచేది. నెలో, రెండు నెలల శిక్ష పడినా అదో దారి. ఇప్పుడీ పెద్ద కేసు పెట్టడం వూరికే మనల్ని వూరించడానికే. ఆ తర్వాత 'లండన్ వెళ్లాడు, ఇంటర్‌పోల్ సహాయం కోరతాం' అన్నారు డిజిపిగారు.

లండన్‌నుండి తిరిగి వచ్చిన రోజున షంషాబాద్ ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేసి దొడ్డిదారిన తీసుకుని పోవచ్చు. ఇంటికి ఊరేగింపుగా వెళ్లనిచ్చారు. ఆ తర్వాత పోలీసులెటళితే ఒంట్లో బాగాలేదు అన్నాడు అక్బర్. అవతల మజ్లిస్ పార్టీ సమావేశం పెట్టుకుని పోరాడతాం తప్ప వెన్ను చూపం అని ప్రతిజ్ఞ చేసింది. అక్బర్ హైకోర్టులో పిటిషన్ వేశాడు. 'డర్‌నా నహీ, డరానా సీఖో' అని కార్యకర్తలకు ఉద్బోధించినవాడు అరెస్టు అవకుండా వుండడానికి బ్రహ్మప్రయత్నం చేసినట్టు చేశాడు. మర్నాడు పోలీసులు సకల వైద్యపరీక్షలు జరిపించి, అరెస్టు చేయదగ్గ ఆరోగ్యం వుందని లోకానికి చూపించి మరీ నిర్మల్ తీసుకెళ్లారు. ఒకలా చూస్తే యీ సున్నితమైన అంశంలో ప్రభుత్వం యిన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదే అయింది. ఏ మాత్రం తొందరపడినా యీ రాజకీయ ఘర్షణ మతఘర్షణగా పరిణమించే ప్రమాదం వుంది. ఘర్షణంటూ ప్రారంభమయ్యాక అది మజ్లిస్ చేయి కూడా దాటిపోవచ్చు. అందువలన యిప్పటివరకు పరిస్థితి కాంగ్రెస్, మజ్లిస్‌ల అదుపులోనే వుందని అనుకోవాలి. ఇద్దరూ తలపడినట్లుగా అనిపిస్తూనే ఒకరితో మరొకరు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్, మజ్లిస్ యిద్దరూ కలిసే యిదంతా చేస్తున్నాయా? అని అడిగితే నాకైతే అలాగే అనిపిస్తోంది.

అప్పుడు రెండో ప్రశ్న ఉదయిస్తుంది – ఎందుకు? అని. దీనికి సమాధానం చెప్పడమే కష్టం. ఆలోచించి చూస్తే ఒక క్లూ దొరుకుతోంది. తెలంగాణ సమస్య గురించి కాంగ్రెస్ హై కమాండ్ ఒక పరిష్కారం కోసం కసరత్తు చేస్తూన్న సమయం యిది. 'రాష్ట్రవిభజన చేయకూడదని, దానికి ప్రత్యామ్నాయాలు చూడాలని' కాంగ్రెస్ హై కమాండ్ 2012 జనవరిలోనే నిర్ణయించిందని, అయితే అది ప్రకటించే ధైర్యం చేయడం లేదని డెక్కన్ క్రానికల్ బ్యూరో చీఫ్ కృష్ణారావు అనేకసార్లు రాశారు, టీవీ చర్చల్లో చెప్పారు. ప్రకటించే సమయం గురించి కూడా అప్పుడే చర్చ జరిగి వుంటుంది. ఈ విధమైన ప్రకటన వలన తెలంగాణలో వ్యతిరేకత వస్తుందని, పరిస్థితి చల్లబడిన తర్వాత మాత్రమే ప్రకటన చేయాలని, ఓ ఏడాది గడువని అనుకుని వుంటారు. 'ప్రశాంత వాతావరణం యింకా రాలేదు, యింకా రాలేదు' అంటూ వాయిదా వేస్తూ వుండి వుంటారు. 2012 జనవరికి, 2013 జనవరికి చాలా మార్పు వచ్చిందని ఒప్పుకోవాలి. అప్పుడు శ్రీకృష్ణ కమిటీ ప్రత్యామ్నాయాలపై చర్చ జరుగుతూ వుంది. ఇప్పుడు అందరూ వాటిని మర్చిపోయారు. అయిదో ఆప్షన్ ఏమిటి, ఆరో ఆప్షన్ ఏమిటి అని జర్నలిస్టులను అడిగినా బుర్ర గోక్కునే పరిస్థితి.

ఏడాది గడుస్తున్న కొద్దీ కెసియార్ స్తబ్దంగా వుండసాగారు. విద్యార్థుల చదువు చెడిపోతుంది అంటూ మార్చి తర్వాత ఉధృతం చేస్తాం అని జనవరిలో అన్నారు. ఆ తర్వాత మరోటన్నారు. చివరకు మిలియన్ మార్చ్ నడుస్తూంటే ఢిల్లీలో వెళ్లి కూర్చున్నారు. ఆయన విశ్వసనీయతను, ఆయన సామర్థ్యంపై ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ దెబ్బ తీసింది. మిలియన్ మార్చ్ విఫలం చెందింది. తెలంగాణ ఉద్యమంలోని చీలకలను బయటపెట్టింది. అంతకుముందే ఉపయెన్నికలు జాక్‌ను చీల్చాయి. వైకాపా తెరాసకు పోటీదారుగా తేలింది. చంద్రబాబు, షర్మిల తెలంగాణలో ధైర్యంగా తిరగసాగారు. కిరణ్ కూడా కావలసిన చోటికి వెళ్లగలుగుతున్నారు. ప్రజల్లో కూడా 'తెలంగాణ యిప్పట్లో రాదులే, 2014లో ఎన్నికలకు ముందో, వెనకో ఓ ప్రకటన వస్తుందంతే' అని మానసికంగా సిద్ధపడసాగారు. తెలంగాణ ఉద్యమానికి ఏకైక సారథి – కెసియార్ అన్న పరిస్థితి మారిపోయి, అనేకమంది లీడర్లు తయారయ్యారు. ఓ అరడజను మంది కాంగ్రెస్ ఎంపీలు హడావుడి చేస్తున్నారు కానీ పార్టీ విడిచి వెళ్లే సాహసం చేయడం లేదు. తమను ఎదిరించకుండా వున్నవారికి కాబినెట్ పోస్టులిచ్చి, రాజ్యసభ ఎంపీల్ని చేసి హై కమాండ్ పరిస్థితిని అదుపులో వుంచుకుంది.

మొన్న అఖిలపక్ష సమావేశంలో హామీ యిచ్చినట్టు కాంగ్రెస్ నెల రోజుల్లో తన ప్రతిపాదన ఏమిటో చెప్పడానికి సిద్ధపడుతోందని అనిపిస్తోంది. దాగుడుమూతలకు స్వస్తి చెప్పి అన్ని ప్రాంతాలకూ ఒప్పుదల అవుతుందని తను అనుకునే ఫార్ములాను తెగించి ప్రజల ముందుకు తెచ్చి దానిపై చర్చ ప్రారంభించే సమయం ఆసన్నమైందని అనుకున్నట్టుంది. కాంగ్రెస్ ఏం చెప్పినా దాన్ని టిడిపి, వైకాపా రాజకీయం చేస్తాయి. రెండు ప్రాంతాల్లోనూ ఆందోళనలు వస్తాయి. తర్వాత చర్చలకు కూర్చుంటారు. ఏదో ఒక రాజీ ఫార్ములాకు వస్తారు. దీనంతటికీ ఒక ఏడాది పట్టవచ్చు. ఆవేశకావేషాలు చల్లబడతాయి. ఎన్నికలలో తెలంగాణ, సమైక్యం అనేది ఒక అంశంగా వుండకుండా వుంటేనే, యితర రాజకీయ కారణాల ఆధారంగా ఓటింగ్ జరుగుతుంది. సెంటిమెంటు ఆధారంగా ఎన్నికలు జరిగితే ఫలితాలు ఎటైనా తిరగవచ్చు. ఏదో ఒకటి తేల్చలేదని కాంగ్రెస్ వారినే అన్ని ప్రాంతాల వారూ తప్పుపడతారు. ఇప్పుడు కాంగ్రెస్ తన ఫార్ములాను బయటపెట్టేసి 'మాదేం తప్పు లేదు' అని తప్పించుకోవచ్చు. ఈ చర్చలు ఎప్పటికి తెమిలినా వాళ్లకు నష్టం వుండదు.

ఫార్ములా బయట పెట్టాలంటే అదేదో ఒకటి తయారవ్వాలి. దాన్ని ముందుగా మీడియాకు లీక్ చేసి, పబ్లిక్‌ను మానసికంగా సన్నిద్ధం చేయాలి. హైదరాబాదు–కర్ణాటక తరహాలో ప్యాకేజి యిస్తారని, హైదరాబాదును చండీగఢ్ తరహాలో ఉమ్మడి రాజధాని ప్లస్ యుటి చేస్తారని లీక్‌లు వస్తున్నాయి. ప్యాకేజి యివ్వడానికి కేంద్రం వద్ద నిధులుండాలి. అవి విడుదల కావాలి. ఇప్పటికే తెలంగాణకు చాలా యిచ్చేశారని, ఆంధ్రను ఎండగడుతున్నారనీ ఆంధ్రప్రాంతపు నాయకులు ఆరోపిస్తున్నారు. బిజెపి ప్రతినిధి కూడా అఖిలపక్షసమావేశంలో అదే ధోరణిలో మాట్లాడారు. రాయలసీమకు, ఉత్తరాంధ్రకు కూడా ప్యాకేజీలు యివ్వాలని, కృష్ణ కమిటీ రిపోర్టు ప్రకారం అవి కూడా వెనుకబడి వున్నాయనీ వాదనలు ముందుకు వస్తాయి. ప్యాకేజి ఎనౌన్సు చేయవచ్చు కానీ ప్రజలకు ఎంతవరకు చేరుతుందో తెలియదు.

అంతకంటె ఖర్చు లేని పని – హైదరాబాదును యుటి అనడం. దీన్ని ఆంధ్రప్రాంతపు నాయకుల్లో చాలామంది హర్షించవచ్చు. గ్రేటర్ హైదరాబాదు, దాని చుట్టుముట్టి వున్న జిల్లాల ప్రజలు స్వాగతించవచ్చు. హైదరాబాదు నాయకులైన దానం, ముకేష్ గౌడ్, తలసాని వంటివారు మెచ్చుకోవచ్చు. హైదరాబాదులో పెట్టుబడులు పెట్టిన యితర రాష్ట్రప్రజలూ, పెట్టుబడిదారులూ యుటి అనగానే వూపిరి పీల్చుకుంటారు. ఏమైనా కావాలంటే కేంద్రంలోనే మేనేజ్ చేసుకోవచ్చు, రాష్ట్రనాయకులతో వేగనక్కరలేదనుకుంటారు.

అయితే తెలంగాణ ఉద్యమకారులందరూ దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తారు. హైదరాబాదులేని తెలంగాణ గుండెకాయ లేని శరీరం అంటారు. అది బాగానే వుంది కానీ మరి అవతలివాళ్లను ఒప్పించడం ఎలా? అని అడిగితే వాళ్ల వద్ద సొల్యూషన్ లేదు. హైదరాబాదుకి బదులుగా భద్రాచలం యిస్తాం అన్నారు కెసియార్ ఓసారి. అది జోక్ అనుకుని వూరుకోవాలంతే. హైదరాబాదుకి, ఆంధ్రప్రాంతం ఆనుకుని లేదు కదా అన్న పాయింటు లాగుతారు కొందరు. నిజమే, ఆ మాటకొస్తే ఇండియా పాలనంతా కొన్ని వందల ఏళ్లపాటు ఇంగ్లండునుండి నడిచింది. మధ్యలో సముద్రాలే వున్నాయి. తూర్పు పాకిస్తాన్ పాలనంతా పశ్చిమ పాకిస్తాన్ నుండి నడిచింది. మధ్యలో విశాలమైన శత్రుదేశం వుంది. 'ఇప్పుడు ఆంధ్రప్రాంతానికి, దాని రాజధానికి మధ్య తెలంగాణ వున్నంత మాత్రంలో యిబ్బందేముంది? కమ్యూనికేషన్స్ యింత విస్తరించాక, భౌతికమైన దూరం పెద్ద లెక్కలోకి రాదు.' అనే ప్రతివాదన రావచ్చు. వీటిల్లో ఏవి సమంజసమైనవో, ఏవి కావో ఆ ప్రతిపాదన గట్టిగా వచ్చినపుడు ఆలోచించవచ్చు. అప్పటివరకు హైదరాబాదును యుటి చేస్తే రాజకీయంగా జరిగే పరిణామాలు ఏమిటి? అన్నది చూద్దాం.

తెరాస, టి–జాక్ పూర్తిగా ఆందోళనకు దిగుతాయి. టిడిపి, వైకాపా పైపైన ఓ రెండు మాటలు అని వూరుకుంటాయి. ఎందుకంటే ఆంధ్రప్రాంతంలో యీ ప్రతిపాదనకు సమర్థన వుంటుంది. సమైక్యంగా వుండడం ఎలాగూ కుదరలేదు కాబట్టి, కనీసం హైదరాబాదును కోల్పోకుండా వున్నాం, కొంతలో కొంత మేలు అనే వూరట వుంటుందక్కడ. 'దీన్ని కూడా వదులుకోవాలి, మొత్తం తెలంగాణకు ధారాదత్తం చేయాలి' అని టిడిపి, వైకాపా అంటే ఆంధ్రప్రాంతంలో వారికి నిలువనీడ లేకుండా పోతుంది. కాంగ్రెస్‌కు కూడా డిటో పరిస్థితే. దానిలోని విభజనవాదులు, సమైక్యవాదులు ఓ వారం పాటు అనాల్సినవి అనేసి, చివరగా 'హై కమాండ్ అన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకుని వుంటుంది. జాతీయ పార్టీగా మేం దేశంలోని యితర ప్రాంతాలలోని ఉద్యమాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి కదా' అనేసి చల్లబడతారు. తెరాసకు అలాటి పట్టింపు లేదు కాబట్టి ఉద్యమం గట్టిగానే చేస్తుంది. ఇక వాళ్లకు అండగా నిలిచే ఉద్యోగులలో చీలిక వస్తుంది. హైదరాబాదు యుటి అయితే వచ్చే లాభాలు కొందరు లెక్కలు వేసుకుంటారు. హైదరాబాదులో వున్న ఉ

ద్యోగులందరూ బయటి జిల్లాల వారు అక్కడకి రానక్కరలేకుండా సమైక్యమవుతారు.

తెరాసకు హైదరాబాదు, పరిసరప్రాంతాల్లో బలం తక్కువగా వున్నా ఉత్తర తెలంగాణలో గట్టిగానే ఉద్యమం నడపగలదు. హైదరాబాదులో కూడా నిరసనలు, ప్రదర్శనలు తప్పవు. వాళ్లను ఎదుర్కోవాలంటే వాళ్ల కంటె గట్టి ప్రత్యర్థిని ప్రభుత్వం నిలబెట్టాలి. అదే మజ్లిస్! హైదరాబాదు యుటి చేయగానే వాళ్లు అందరికంటె ముందుగా ఉద్యమాలు మొదలుపెడతారు. నగరంలో చాలా పట్టు వుంది కాబట్టి అందరి కంటె తీవ్రమైన ఆందోళన వాళ్లే చేయగలరు. ఆ విధంగా 'దే కెన్ స్టీల్ ద విండ్ ఫ్రమ్ టిఆర్ఎస్ సెయిల్స్'! తెరాస పూర్తిగా చప్పబడ్డాక, చివర్లో వాళ్లు ప్రభుత్వపాలసీతో కాంప్రమైజ్ కావచ్చు.

ఇది ఫ్యాక్టరీలలో జరుగుతూనే వుంటుంది. ఏదైనా యూనియన్ బలంగా వున్నపుడు మేనేజ్‌మెంట్ యింకొక ఔట్‌ఫిట్‌ను తయారుచేస్తుంది. వాళ్లు మామూలు యూనియన్ వాళ్ల కంటె తీవ్రవాద ధోరణి అవలంబిస్తారు. మేనేజ్‌మెంట్‌ను చడామడా తిట్టేస్తారు. అసలు యూనియన్ వాళ్లు జీతాల్లో 10% పెంపు అడిగితే వీళ్లు 20% అడుగుతారు. వర్కర్లందరూ వీళ్లవైపు వచ్చి ఎన్నికల్లో గెలిపిస్తారు. అప్పుడు వీళ్లు మేనేజ్‌మెంట్‌తో కుమ్మక్కయి, 20% పెంపు సాధిస్తారు కానీ దానికీ ప్రొడక్షన్‌కు లింకు పెట్టడానికి ఒప్పుకుంటారు. ఆ పాటికి వర్కర్లు లెంపలేసుకుని, సర్లే ఏదో ఒకటి కానీయ్, రెండేళ్లపాటు వీళ్లతోనే వేగాలి కదా అనుకుంటారు. ఈ రెండేళ్లలో అసలు యూనియన్ నాయకుల్లో – అధికారం పోయేటప్పటికి – లుకలుకలు ప్రారంభమవుతాయి. కొందరు రెండో యూనియన్‌కి జంప్ అవుతారు. మేనేజ్‌మెంటుది పై చేయి అవుతుంది.

ఇప్పుడు మజ్లిస్ కూడా యిలాటి ట్రిక్కే ప్లే చేయవచ్చు. హైదరాబాదు కేంద్రపాలితం చేస్తే కొంప మునిగిపోతుంది అంటూ పెద్ద అల్లరి చేసి, ఆ తర్వాత ప్రభుత్వంతో ఒప్పందం కుదిరాక తమ ఓటర్లతో 'నిదానంగా ఆలోచిస్తే యిదే మంచిది. ఎందుకంటే దీనికి ఒప్పుకోకపోతే వేరు తెలంగాణ అంటూ ఏర్పడి బిజెపి బలపడుతుంది. వాళ్లు మన ముస్లిములను నంజుకు తినేస్తారు. వాళ్లు అధికారంలోకి రాకపోయినా తెలంగాణలో ఏర్పడబోయే ప్రభుత్వం సంకీర్ణ ప్రభుత్వమే అవుతుంది. ఎవరికీ పూర్తి మెజారిటీ రాదు. నెగ్గినవాళ్లు బిజెపి మద్దతుపై ఆధారపడే పరిస్థితిలో మనకు ముప్పు వస్తుంది. కెసియార్ ఎప్పటికైనా బిజెపి సానుభూతిపరుడే. చండీయాగాలు చేస్తాడు, కేంద్రంలో ఎన్‌డిఏకు మద్దతు అంటాడు. బిజెపి అండతో నడిచే కెసియార్ ప్రభుత్వం మనల్ని హింసిస్తుంది. అదే యుటి అనుకోండి, కేంద్రం చేతిలో వుంటుంది. కేంద్రంలో యుపిఏగాని, థర్డ్ ఫ్రంట్ గాని అధికారంలోకి వస్తే మన ఒకటి, రెండు సీట్లతోనైనా వాళ్లకు అండగా నిలిచి మనను మనం కాపాడుకోవచ్చు. అక్కడ ప్రతీ ఎంపీ ఓటు విలువైనదే. అసెంబ్లీలో మనం బలమైన శక్తి కాదు. మనం మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వం పడిపోదు. మనం సమైక్యం అన్నాం, కుదరలేదు, రాయల తెలంగాణ అన్నాం, రాయలసీమవాళ్లే ఒప్పుకోలేదు. ఇక యిలాటి పరిస్థితిలో మన చేతిలో మిగిలినది యిదొక్కటే. మీరు అర్థం చేసుకోవాలి.' అని నచ్చచెప్పవచ్చు.

ఇవన్నీ కాంగ్రెస్ మిత్రపక్షంగా వుండి చేస్తే నమ్మరు. అందుకే తమను తాము కాంగ్రెస్‌కు వ్యతిరేకులుగా చిత్రీకరించుకుంటూ యిలాటి గేమ్ ఆడవచ్చు. జగన్‌తో మిత్రత్వం వలన యిలా చేస్తున్నారనీ, జగనే రాష్ట్రంలో మతకల్లోలాలు ప్లాన్ చేస్తున్నాడనీ.. యివన్నీ నేను నమ్మను. తను మైనారిటీ అని ప్రజలకు గుర్తురాకుండా వుండడానికే జగన్ చూస్తాడు. ఎప్పుడైతే మజ్లిస్‌కు మద్దతు అంటాడో అప్పుడు వెంటనే క్రైస్తవులు, ముస్లిములు ఏకమయ్యారన్నమాట పైకి వస్తుంది. ప్రతిస్పందనగా హిందువులందరూ ఏకమైతే వైకాపా–మజ్లిస్ కొట్టుకుపోతాయి. టిడిపి అదే ఆశిస్తోంది కాబట్టి 'బైబిల్ చేత్తో పట్టుకున్న విజయమ్మ, ముస్లిం ఛాందసవాదులైన మజ్లిస్ కలిసి..' అంటూ మతాన్ని ముందుకు తెస్తోంది. ప్రత్యేక తెలంగాణ అడ్డుకోవడానికే జగన్, మజ్లిస్ ఏకమయ్యారన్న కెటియార్ ఆరోపణ కూడా నేను నమ్మటం లేదు. గతంలోలా జగన్ సమైక్యవాదానికి కట్టుబడి లేడు. దానికోసం యిన్ని బేరాలూ అడడు. మజ్లిస్‌తో కలిసి ప్లాను చేస్తున్నది కాంగ్రెస్సే అని నా ఉద్దేశం.

వ్యాసం మొదట్లో చెప్పినట్టు – యివన్నీ నా వూహలు మాత్రమే. గందరగోళ పరిస్థితిలోంచి ఒక తర్కాన్ని లాగడానికి చేసే ప్రయత్నమే. నాకు ఏ అభిజ్ఞవర్గాలూ లేవు. ఎవరూ నాకేమీ చెప్పలేదు. అందువలన అల్టిమేట్‌గా యిలా జరగకుండా యింకోలా కూడా జరిగితే జరగవచ్చు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 11** **ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 04**

ఈ శీర్షికకు స్పందన బాగుంది. ఇది కొనసాగాలని మీ అందరితో బాటు నేనూ కోరుకుంటున్నాను. ఒక విన్నపం – మీ పదసంపద సమాధానాలు నాకు పంపకండి. మీకు మీరే సరిచూసుకోండి. సమాధానాలు చెప్పలేనంత కఠినమయినవి కావులెండి. కానీ మెదడులో ఎక్కడో చిన్న సందేహం వేళ్లాడుతూ వుంటుంది – అదా, యిదా అని. మీరు నిఘంటువు (ఇంటర్నెట్‌లోదే కావచ్చు) తిరగేస్తారు. దీనితో బాటు పక్కనున్న మరో రెండు చూస్తారు. ఆ మేరకు మీ తెలుగు సంపద పెరుగుతుంది. అది చాలు, నాకు.

కొన్ని కొన్ని పదాల విషయంలో మనకు అనుమానాలుంటాయి. తప్పుగా వాడేస్తూ వుంటాం. స్వాతి వీక్లీలో అలాటివి యిస్తూ వుంటారు. కానీ వాటిలో చాలాభాగం నాకు ముందే తెలిసినవే. నాకు కూడా తెలియనివి, నేను కూడా చేసే తప్పుల గురించి ఎక్కడైనా తారసిల్లితే రాసి పెట్టుకుంటాను. అలాటివి మీతో పంచుకుంటున్నాను. ఆంధ్రభూమి దినపత్రిక శనివారాల్లో, ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో

నడిచే 'తెలుగు పలుకుబడులు' శీర్షిక యిలాటివి చాలా ఉపయోగకరంగా వుంటాయి. ఆ యా రచయితలకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ వాటిని మీతో పంచుకుంటాను.

ఖచ్చితం అనడం కచ్చితంగా తప్పుట. కచ్చితమే ఒప్పు. దేనికైనా ప్రారంభోత్సవం జరిగితే 'అంకురార్పణ చేశారు' అని రాస్తుంటాం. అది అంకురారోపణట. అంకురం అంటే విత్తనం, మొలక. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించినపుడు ఓ చిన్న గొయ్యి తవ్వి దానిలో మొలకను వుంచి నీళ్లు పోయడం చూస్తాం. మొలకను అక్కడ వుంచడం (ఆరోపణం) జరుగుతోంది కాబట్టి అంకురారోపణ అనాలన్నమాట. అర్పించడం అంటే దాన్ని ఎవరికో వచ్చేసి వదిలించేసుకోవడం. మన రాజకీయనాయకులు సాధారణంగా చేసేది అంకురార్పణే అనుకోండి. ప్రాజెక్టుని ప్రారంభించేసి, చేతులు దులిపేసుకుంటారు. తర్వాత వచ్చే ప్రభుత్వమే దాన్ని పూర్తి చేయాలని వీరి భావం.

మనం గతంలో ఋ, ఱ వంటివి బాగానే వాడేవాళ్లం. తర్వాత తర్వాత వదిలేశాం. మధ్యమధ్యలో ఋషి లాటి పదాలు చూసి బాధపడి ఋ గుర్తుకు వచ్చి వాడుతున్నాం. అయితే ఒక్కోప్పుడు అతిగా కూడా వాడుతున్నాం. నిదర్శనం అనే అర్థంలో రుజువు అని ఎవరైనా రాస్తే నొచ్చుకుని 'ఋజువు' అని సవరిస్తున్నాం. అది తప్పు. 'ఋజు' అంటే తిన్నని, వంకరలేని.. (ఋజువర్తన అనేటప్పుడు రాసేది) అని అర్థం. ప్రూఫ్ అనే అర్థంలో వాడాలంటే రుజువు అనే రాయాలిట. దీనికి మూలం – ఉర్దూ పదం 'రుజూ' అని ఒక చోట చదివాను. ఉర్దూ నిఘంటువు చూస్తే రుజూ అంటే 'ప్రవ ృత్తి, అనురక్తి, తిరిగి రావడం, పునర్విచారణ' అనే అర్థాలున్నాయి. పెద్దలెవరైనా వివరం చెప్పాలి.

---

సామెతల గురించి, మాండలికమైన పలుకుబడుల గురించి చాలా పుస్తకాలున్నాయి. అవన్నీ చెప్పుకుపోతే ఏళ్ల తరబడి రాసుకుంటూ పోవచ్చు. మనకు పత్రికల్లో, వ్యాసాల్లో ఎదురయ్యే మాటల గురించి మాత్రమే రాస్తూంటాను. చాలామాటలు చదువుకుంటూ పోతాం, భావాన్ని వూహిస్తాం కానీ యితమిత్థమని తెలియదు. అలాటి వాటి గురించి రాస్తాను. వాటిలో ఒకటి – 'కాకతాళీయంగా..'! సంస్క ృతంలో 'న్యాయములు' అని కొన్ని వున్నాయి. అవి ప్రకృతి నుండి తీసుకున్న తర్కబద్ధమైన ఉదాహరణలు. వాటిలో ఒకటి కాకతాళీయ న్యాయం. ఓ కాకి వచ్చి తాటిచెట్టు మీద వాలింది, అది వెళ్లిన టైముకి తాటిపండు పడింది. తాటిపండు పడుతోంది కదాని కాకి అక్కడకి వెళ్లిందా? కాకి వస్తోంది కదాని తాటిపండు పడిందా? అబ్బే అలాటిదేమీ లేదు. రెండూ ఒకదానికి మరొకటి సంబంధం లేని సంఘటనలు. ఏకకాలంలో ఘటించడం చేత వాటి మధ్య సంబంధం వుందేమోనన్న సందేహం వస్తోంది. 'నిన్న బజారుకి వెళితే అక్కడ కాకతాళీయంగా ఓ మిత్రుడు తారసిల్లాడు' అనే వాక్యాలు కథల్లో చూసేవుంటారు.

---

విశ్వనాథ సత్యనారాయణగారి వద్దకు ఓ హరికథా భాగవతార్ వచ్చి "అయ్యా మీ వూళ్లో హరికథ చెప్తానండి" అన్నాట్ట.

"ముందు మీ ఊళ్లో చెప్పారా?"

"లేదండి, మా వాళ్లు చెప్పించుకోరు." అన్నాడాయన

"మరి మా వాళ్లు చెప్పుచ్చుకుంటారే!" అన్నారు విశ్వనాథ. (ధ్వని మిస్ కాకండి)

రాష్ట్రం – ఇది సంస్కృతపదం. హిందీలోకి, తెలుగులోకి వచ్చింది కానీ వేర్వేరు అర్థాల్లో వచ్చింది. హిందీలో దేశం (కంట్రీ) అనే అర్థంలో వచ్చింది. తెలుగులోకి (స్టేట్) అనే అర్థంలో వచ్చింది. రాష్ట్రభాష, రాష్ట్రపతి.. యివన్నీ హిందీ సంప్రదాయాన్ని అనుసరించి దేశం మొత్తానికి భాష, దేశం మొత్తానికి అధిపతి అనే అర్థంలోనే వాడుతున్నారు. తెలుగువాళ్ల దృష్టిలో రాష్ట్రం అంటే దేశంలో భాగం మాత్రమే. ఆరెస్సెస్‌వాళ్లు హిందీలో రాసిన పుస్తకాలను తెలుగులోకి అనువదించినపుడు 'రాష్ట్ర' పదాన్ని హిందీ అర్థంలో ఉపయోగించి గందరగోళ పరుస్తారు.

---

మీ పదసంపద 02

(మీ పద సంపద 01 సమాధానాలు – 1.సి 2.డి 3.డి 4.ఎ 5.సి 6.సి 7.డి 8.ఎ 9.డి 10.బి)

01. చెరలాడి ("పాతాళభైరవి"లో 'తీయని ఊహలు హాయిని గొలిపే..' పాటలో వస్తుంది) – ఎ.దగ్గరై బి.ఖైదు కాబడి సి.ఆటలాడి డి.ఎక్కువై

02. మోసులు వేసి ("పాతాళభైరవి"లో 'కలవరమాయె మదిలో ..' పాటలో వస్తుంది) – ఎ.కదిలించి బి.రగిలి సి.కబర్లు చెప్పి డి.మొలకలెత్తి

03. మలయానిలము ("పాతాళభైరవి"లో 'ఎంత ఘాటు ప్రేమయో..' పాటలో వస్తుంది) – ఎ.పున్నమినాటి గాలి బి.వేడెక్కించే గాలి సి.చల్లబరిచే గాలి డి.దక్షిణపు గాలి

04. వగలు ("పాతాళభైరవి"లో 'వగలోయ్ వగలు..' పాటలో వస్తుంది) – ఎ.విలాసము బి.మెరుపులు సి.నృత్యాలు డి.ఆభరణాలు

05. వేమరు ("పాతాళభైరవి"లో 'ప్రేమకోసమై వలలో పడెనే..' పాటలో వస్తుంది) – ఎ.అశ్విని దేవతలు బి.ప్రేమికులను కాపాడే దేవతలు సి.పలుమారులు డి.మరువలేని

06. చలము ("బాలరాజు"లో 'ఓ బాలరాజా..' పాటలో వస్తుంది) – ఎ.కదలిక లేకపోవుట బి. స్పందన లేకపోవుట సి. పట్టుదల డి. అలుక

07. కామిసిగ్గు ("అక్కాచెల్లెలు"లో 'పాండవులు పాండవులు తుమ్మెదా' పాటలో వస్తుంది) – ఎ.సిగ్గు బి.అలవిమాలిన సిగ్గు సి.పెళ్లివేళ పడే సిగ్గు డి. రతీదేవిలా పడే సిగ్గు

08. తనివి ("చూడాలని వుంది"లో 'అబబ్బా యిద్దూ' పాటలో వస్తుంది) – ఎ.తృప్తి బి.శరీరము సి.కోరిక డి. ఆకలి

09. జాలువారు ("డాడీ"లో 'వానవాన..' పాటలో వస్తుంది) – ఎ.జోలపాటు బి.జాలిపడు సి. ముంచెత్తే డి. స్రవించే

10. గోధూళి ఎరుపంటి ("ముత్యం"లో 'కృష్ణశాస్త్రిలో భావగీతమై..' పాటలో వస్తుంది) – ఎ.ఎఱ్ఱ గోధుమల ఎరుపువంటి బి. గోవులు యింటికి మరలే వేళ ఆకాశం లోని ఎరుపు లాంటి సి. ఒక రకమైన వజ్రానికి వుండే ఎరుపు లాటి డి. ఆవుల కాలిగిట్టల నుండి లేచే మట్టి రంగు లాటి **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 12 వీక్లీకై** **ఎమ్బీయస్ : బాబు నోట ఎన్టీయార్ స్మరణ**

చంద్రబాబు పాదయాత్ర మొదలుపెట్టి నూరు రోజులయిన సందర్భంగా ఎన్టీయార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదే రోజున 30 ఏళ్ల క్రితం ఎన్టీయార్ మొదటిసారి టిడిపి ప్రభుత్వాన్ని ఏర్పరచారని గుర్తు చేసుకున్నారు. ఎన్టీయార్ తొలి పట్టాభిషేకాన్ని టీవీలన్నీ ఒక గొప్ప సంఘటనగా పేర్కొని ప్రత్యేక కార్యక్రమాలు చేశాయి. నాకు తెలిసి మరే యితర ముఖ్యమంత్రికి యిటువంటి భోగం పట్టలేదు. ఎన్టీయార్‌కున్న గ్లామర్ అలాటిది. అందుకే దాన్ని వదులుకోవడానికి చంద్రబాబు సిద్ధపడటం లేదు. తను ఎన్టీయార్‌పై తిరుగుబాటు చేసి ముఖ్యమంత్రి పదవిని ఆయన నుండి లాక్కున్న సంగతి ప్రజలు మర్చిపోయి, తనను ఎన్టీయార్ వారసుడిగానే గుర్తు పెట్టుకోవాలని ఆయన ఆశ. కానీ జర్నలిస్టులు ఆ నాటి సంఘటనల గురించి బాబును, టిడిపి నాయకులను అడుగుతూనే వుంటారు. బాబు 'అది ఆనాటి చారిత్రక అవసరం. పార్టీని కాపాడుకోవడానికి అలా చేయవలసి వచ్చింది' అని చెప్పుకుంటారు. ఇతర టిడిపి నాయకులు 'పార్టీ వ్యవస్థాపకుడైన ఎన్టీయార్‌ను ఎదిరించి, కూలదోయడానికి మాకు మేమే చాలా నచ్చచెప్పుకోవలసి వచ్చింది. చివరకు రాముడి కంటె రామనామం గొప్పదనే సిద్ధాంతంతో అలా చేశాం' అని చెప్పుకుంటారు. అంటే 'రామాంజనేయ యుద్ధం' టైపన్నమాట. రామనామాన్ని జపిస్తూ ఆంజనేయుడు సాక్షాత్తూ రాముడితోనే తలపడడం అన్నమాట!

నిజంగా అదే జరిగిందా? ఎన్టీయార్ నామస్మరణ చేస్తూనే ఎన్టీయార్‌ను గద్దె దింపేశారా? 1995 నాటి వాస్తవాలు ఏమిటి? అనుకుంటూ పాత పత్రికలు తిరగేస్తే దిగ్భ్రాంతి కలిగించే విషయాలు బయటపడతాయి. ఈరోజు టిడిపి సభల్లో ఎన్టీయార్ విగ్రహానికి పూజ చేస్తున్న, ఉపన్యాసాల్లో ఎన్టీయార్ నామాన్ని జపిస్తున్న చంద్రబాబు అక్టోబరు 21, 1995 నాటి ఇండియా టుడేకై యిచ్చిన ఇంటర్వ్యూలో "ఎన్టీఆర్‌లో నైతిక విలువలు శూన్యం" అని ప్రకటించారు. హనుమంతుడు రాముణ్ని ఎప్పుడూ యిలా అనలేదు. కాంగ్రెస్‌వాళ్లు గాంధీగారి గురించి అలా అనలేదు. గాంధీ పేరు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చాక గాంధీ సిద్ధాంతాలను పక్కన పెట్టారు. ఆయన మాట వినడం, అమలు చేయడం కష్టంగా తోచింది. ఆయన ఎదుట సరేసరే అంటూనే తమకు వీలుపడిన ధోరణిలో ప్రభుత్వం నడిపారు. అంతేగానీ గాంధీగారిని "పోవయ్యా" అనలేదు. గాంధీని బహిరంగంగా తిట్టలేదు. జనతా పార్టీ వాళ్లు జయప్రకాశ్ నారాయణ్‌తో అదే చేశారు. "సంపూర్ణ క్రాంతి" పేరుతో ఆయన నడిపిన విప్లవాన్ని ఆధారంగా చేసుకుని అధికారంలోకి వచ్చి ఆయన లక్ష్యాలను విస్మరించారు. ఆయనను పట్టించుకోలేదు. కానీ ఆయనికి విలువలు లేవనీ, నీతి లేదనీ ఎన్నడూ అనలేదు. మరి బాబు ఎందుకన్నారు? ఆ నేపథ్యం ఏమిటి?

పార్టీలో లక్ష్మీపార్వతి ప్రాబల్యం పెరుగుతోందంటూ 1995 ఆగస్టులో బాబు ఎన్టీయార్‌కు ఎదురు తిరిగారనీ, అప్పుడాయనకు బావమరిది హరికృష్ణ, తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు అండగా నిలిచారనీ అందరికీ తెలుసు. సెప్టెంబరు 1 న బాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. (అశోక గజపతి రాజు, దేవేందర్ గౌడ్, మాధవరెడ్డి, కోటగిరి, హరికృష్ణ, అయ్యన్న పాత్రుడు, సింహాద్రి సత్యనారాయణ, తమ్మినేని సీతారాం, కడియం శ్రీహరి, నాగేష్ మంత్రులయ్యారు) 213 మంది టిడిపి ఎమ్మెల్యేలు ఎన్నికయితే వారిలో 143 మంది ఆగస్టు 24 న తనతో బయటకు వచ్చేశారని బాబు చెప్పుకుంటారు. నిజానికి మొదట్లో అంతమంది లేరని కొందరంటారు.

తనపై తిరుగుబాటు రాగానే ఎన్టీయార్ ఒక వ్యూహాత్మకమైన తప్పిదం చేశారు. అసెంబ్లీ రద్దు చేయమని సిఫార్సు చేశారు. (ఆయనకు ఆ సలహా యిచ్చిన అడ్వకేట్ నాలుగు రోజులు పోయాక చంద్రబాబు శిబిరంలో తేలారు) ఎన్నికలలో గెలిచి యింకా 8 నెలలు కూడా కాకుండానే సభ్యత్వం రద్దు అయిపోతుందని అనగానే ఊగిసలాడుతున్న ఎమ్మెల్యేలకు కూడా భయం వేసి బాబు వైపు దుమికారు. మొత్తం 165 మంది అయ్యారు. అది చూసి ఎన్టీయార్ నాలిక కరుచుకున్నారు. అబ్బెబ్బే ఎసెంబ్లీ రద్దు చేయను, వెనక్కి

వచ్చేయండి అని బుజ్జగించబోయారు. '1984 ఆగస్టు సంక్షోభంలో కొందరు ఎమ్మెల్యేలు నాదెండ్ల వైపు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చారు. ఎన్టీయార్ అప్పటికి వెనక్కి తీసుకున్నా శాసనసభను రద్దు చేసి 1985 మార్చిలో మళ్లీ ఎన్నికలకు వెళ్లారు. వీళ్లలో చాలామందికి టిక్కెట్లు యివ్వలేదు. ఇప్పుడు మీరు వెనక్కి వెళ్లినా అదే జరుగుతుంది. ఆయన మిమ్మల్ని నమ్మడు." అని భయపెట్టేశారు బాబు వర్గం వాళ్లు. ఇక దానితో వాళ్లు యిటే వుండిపోయారు. బాబు సెప్టెంబరు 7 న అసెంబ్లీలో బలపరీక్షలో నెగ్గారు. కమ్యూనిస్టులు 32 మంది బాబుకు వెన్నుదన్నుగా నిలిచారు.

అప్పుడు ఎన్టీయార్ 'చంద్రబాబుది అప్రజాస్వామికంగా గద్దె కెక్కిన ప్రభుత్వం, దాన్ని రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించాలి' అంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎన్టీయార్–బాబు గొడవ ఢిల్లీలో వున్న నేషనల్ ఫ్రంట్‌కు తలకాయనొప్పిగా తయారైంది. కేంద్రంలో వున్న పివి నేతృత్వంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 1996 మే లో రాబోయే లోకసభ ఎన్నికలలో గద్దె దించాలంటే టిడిపి మద్దతు అత్యవసరం. ఎవరిది అసలైన టిడిపిగా గుర్తించాలి అని వారి సమస్య. నేషనల్ ఫ్రంట్ ఆవిర్భావానికి కారకుడు, చైర్మన్ అయిన ఎన్టీయార్‌ను తీసి పక్కన పడేయాలంటే వారికి మనసు ఒప్పలేదు. కమ్యూనిస్టులు చూస్తే బాబుకి సపోర్టు. బాబు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టాడు సరే, ప్రజల మద్దతు ఎటుందన్నది చూసి వారికి మద్దతిద్దామని వాళ్లనుకున్నారు. ఈ లోగా ఎన్టీయార్ బిజూ పట్నాయక్‌తో మాట్లాడితే ఆయన "నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా మీరే కొనసాగండి" అన్నాడు. ఎన్టీయార్ వెంటనే "అయితే నా అధ్యక్షతన నవంబరులో నేషనల్ ఫ్రంట్ సమావేశం హైదరాబాదులో పెడదాం" అన్నారు. ఆ ఏర్పాట్ల సందర్భంగా రామ్ విలాస్ పాశ్వాన్ హైదరాబాదుకి వచ్చి "ప్రజల మద్దతు ఎన్టీయార్‌కే వుంది. ఆయనను సమర్థిస్తేనే బాబును కలుపుకుంటాం" అని చెప్పి వెళ్లాడు.

పార్లమెంటు ఎన్నికలలో కనీసం 25 ఎంపీ సీట్లు గెలిస్తే తప్ప తనకు మనుగడ లేదని బాబుకి భయం పట్టుకుంది. (ఫైనల్‌గా 16 గెలిచారు, అప్పటికి ఎన్టీయార్ మరణించారు) తనను నమ్ముకుని వచ్చిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు, యితర పదవులు యివ్వనారంభించారు. 1995న సెప్టెంబరు 1న ఏర్పరచిన మంత్రివర్గానికి అక్టోబరు 8 న మరో 16 మందిని (కోడెల, బాబూఖాన్, తుమ్మల నాగేశ్వరరావు, సుద్దాల దేవయ్య, వేణుగోపాలాచారి, ఎస్ వి సుబ్బారెడ్డి, బి వీరా రెడ్డి, కె జయరాం, సీతారామమ్మ, రమేష్ రెడ్డి, దుర్గా ప్రసాదరావు, తలసాని శ్రీనివాస యాదవ్, నాగం జనార్దనరెడ్డి, జి హనుమంతరావు, ఎల్ రమణ) చేర్చారు. వీరిలో వీరారెడ్డి, రమణ, దేవయ్య – యీ ముగ్గుర్ని ఎన్టీయార్ గతంలో సస్పెండ్ చేసి వున్నారు. వారిని యీయన మంత్రుల్ని చేశారు. రమేష్ రెడ్డి హరికృష్ణకు గట్టి మద్దతుదారు. ఎన్టీయార్ అభిమాన సంఘం అధ్యక్షుడు.

ఎమ్మెల్యేలను బాబు శిబిరానికి చేరవేసిన ఎర్రం నాయుడు (అప్పటి చీఫ్ విప్), బి గోపాలకృష్ణారెడ్డి (తన బంధువు ప్రభాకరరెడ్డికి చెందిన వైస్రాయ్ హోటల్‌లోనే బాబు శిబిరం నడిపారు), కెసియార్‌లకు పదవులు దక్కలేదు. అయినా వాళ్లు బాబుతో వున్నారు కానీ దగ్గుబాటి వెంకటేశ్వరరావుకి మాత్రం ఒళ్లు మండిపోయింది. మరో 14 మంది ఎమ్మెల్యేలతో సహా ఎన్టీయార్ వద్దకు వెళ్లిపోయారు. వెళుతూ వెళుతూ మరో 90 మంది ఎమ్మెల్యేలు ఎన్టీయార్‌వైపు రావడానికి సిద్ధంగా వున్నారని ప్రకటించారు. (ఆ తర్వాత మరో ముగ్గురు వెళ్లారు). 1996 ఫిబ్రవరి 2 న విజయవాడలో "సింహగర్జన" పేర మహాసభ ఏర్పాటు చేశారు. బాబు మోసాన్ని ఎండగట్టి లోకసభ ఎన్నికల్లో గెలవగలనన్న ధీమాతో వున్నారు.

ఇక ఎన్టీయార్ కుటుంబం సంగతికి వస్తే జయకృష్ణ మళ్లీ ఎన్టీయార్‌వైపుకి వెళ్లిపోయారు. 'మా నాన్నగారు కర్మయోగి, ఎలాటి పద్మవ్యూహాన్నయినా ఛేదించగలరు' అన్నారాయన. వెంకటేశ్వరరావు, పురంధరేశ్వరి కూడా అటు వెళ్లిపోయారు. బాలకృష్ణ తదితరులు సందిగ్ధంలో వున్నారు. హరికృష్ణ ఒక్కరే బాబుతో వున్నారు. బాబుకి ఎటు చూసినా యిబ్బందులే కనబడుతున్నాయి. తనపై ప్రభుత్వాన్ని నడిపే భారం, ఎమ్మెల్యేలను బుజ్జగించే భారం వుంది. అటు ఎన్టీయార్ పూర్తిగా తీరికగా వున్నారు. లోకసభ ఎన్నికలకై సర్వశక్తులూ సమీకరించుకుంటున్నారు. నేషనల్ ఫ్రంట్ కూడా ఆయన వైపే వుంది. పార్లమెంటు ఎన్నికలలో ఎన్టీయార్ కంటె ఎక్కువ సీట్లు గెలుచుకోకపోతే తనకు జనాకర్షణ శక్తి లేదని యీ ఎమ్మెల్యేలకు అనిపిస్తుంది. తనను విడిచి వెళ్లిపోతారు – అనే భయంతో వుండగా "ఇండియా టుడే"కు చెందిన అమరనాథ్ కె మీనన్‌కి యిచ్చిన యింటర్వ్యూ అది.

"వెంకటేశ్వరరావుకి ఉపముఖ్యమంత్రి పదవి యిస్తానని చెప్పి మాట తప్పారట కదా" అని మీనన్ అడిగితే "మా మధ్య అవగాహన ఏమీ లేదు. ఇద్దరమూ కలిసి రోజూ పార్టీ ఆఫీసుకి, అక్కడి నుండి సచివాలయానికి వెళ్లడానికి నేను ఒప్పుకున్నట్లు ఆయన చెపుతున్నారు. ఆయన తన చేతిలో రిమోట్ కంట్రోల్ వుండాలనుకున్నారు... తుదినిర్ణయం తీసుకునే ముందు వీలైనంత విస్తృతంగా సంప్రతింపులు జరిపి, అందరి అభిప్రాయాలు తెలుసుకుందామనుకున్నాను. అయితే, చివరకు నిర్ణయం తీసుకునేది మాత్రం నేనే!" అని చెప్పారు.

"మీ ప్రభుత్వం లోకసభ ఎన్నికల వరకు కూడా వుండకపోవచ్చునని ఎన్టీయార్ అంటున్నారే..." అని అడిగితే "ఎన్టీయార్‌కు నైతిక విలువలనేవే లేవు. తాను శాసనసభ రద్దుకు సిఫార్సు చేసిన తరువాత తనను వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయిన శాసనసభ్యుల్ని మళ్లీ వెనుకకు పిలవడం సమంజసమేనా? శాసనసభ్యులు మద్యానికి, డబ్బుకు లొంగిపోయారంటూ ఆయన దుర్భాషలాడారు. ఇప్పుడు వారిని ఎలా మళ్లీ వెనుకకు పిలువగలుగుతున్నారు? ఆయన ప్రేమంతా అధికారం మీదే. ఏదో విధంగా అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఆయనకు కావల్సింది. శాసనసభ్యులు కొన్ని విలువలకు, సిద్ధాంతాలకు కట్టుబడి వున్నారు కనుకనే నాతో వున్నారు. నా దగ్గరకు వచ్చిన శాసనసభ్యులకు మేము అధికారం చేపట్టబోతున్నామన్న ఆలోచన కూడా లేదు. ప్రతిపక్షంలో కూర్చోడానికి, ప్రజాజీవితం నుంచి తప్పుకోవడానికి కూడా సిద్ధపడి ఆగస్టు 24 న 143 మంది శాసనసభ్యులు నా దగ్గరకి వచ్చారు." అన్నారు బాబు.

దీనిపై స్పందించమని ఎన్టీయార్‌ను కోరారు మీనన్. ఆయన "నైతిక విలువంటే అర్థమేమిటి? మీ ద్వారా నేనీ ప్రశ్న ఆయనను అడగదలచుకున్నాను. ఒకరి దగ్గర్నుంచి పార్టీని, అధికారాన్ని లాక్కుపోవడం నైతికమా? మిమ్మల్ని నమ్మిన మామగారిని మోసగించడం నైతికమా? ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఓ రాజకీయపక్షాన్ని వంచించడం నైతికమా? నేనింకా ఏమైనా చెప్పాలా? (నవ్వి) త్వరలో న్యాయస్థానాలు తీర్పు చెబుతాయి. తరువాత ప్రజలు కూడా తమ నిర్ణయం వెల్లడిస్తారు." అన్నారు ఎన్టీయార్.

న్యాయస్థానాలు, ప్రజలు తమ తీర్పు వెల్లడించడానికి ముందే ఎన్టీయార్ అకస్మాత్తుగా జనవరి 18 న కన్నుమూశారు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 13 వీక్లీకై ఫిల్లర్ ఎమ్బీయస్ : విడాకుల వేదన నుండి బయటపడేందుకు – "డాన్స్ ఎగైన్"**

ఏడేళ్ల వైవాహిక జీవితం తర్వాత ఏప్రిల్ 2012లో మార్క్ ఏంథోనీతో విడాకులు తీసుకున్నాక గాయని-నర్తకి జెన్నిఫర్ లోపెజ్ తన వేదన మర్చిపోవడానికి "డాన్స్ ఎగైన్" అంటూ యిప్పుడు లోకాన్ని చుట్టివచ్చింది. ఎన్‌రిక్ ఇగ్లిసియాస్, పిట్ బుల్, రెడ్ వన్-ఎడ్ కలిసి రాసిన 'డాన్స్ ఎగైన్' పాట విని ఆమె ఎంతో ప్రేరణ పొందింది. విడాకులు తీసుకున్నాక బాధపడుతూ ఏ పనీ చేయకుండా పక్కమీద దొర్లే బదులు ఏదో ఒకటి చేస్తే బాగుండునని, ఈ కార్యక్రమం ద్వారా జీవితంలోకి మళ్లీ దూసుకు వెళ్లాలనీ అనుకుంది. ఆమెకు డబ్బుపరంగా లోటు లేదు. అనేక వ్యాపారాల్లో ఆమె పెట్టిన పెట్టుబడుల ద్వారా ఏడాదికి 50 మిలియన్ల డాలర్ల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం బాయ్ ఫ్రెండ్‌గా వున్న 25 సంఎల డాన్సర్ కాస్పర్ స్మార్ట్‌తో కలిసి ఆమె ఆ పేరుతో ఒక నాట్యకార్యక్రమాన్ని రూపొందించుకుంది. 6 నెలల వ్యవధిలో అనేక దేశాలు పర్యటిస్తూ మొత్తం 55 ప్రదర్శనలు యిచ్చింది. విడాకుల బాధ నుండి బయటపడడంలోనే కాకుండా, యిలా పునరుత్సాహం తెచ్చుకోవడంలో కూడా ఆమెకు కాస్పర్ ఎంతో సహాయకారిగా వున్నాడట.

జెన్నిఫర్‌కు మాక్స్, ఎమ్మె అనే కవలపిల్లలున్నారు. వాళ్లకు వచ్చేనెలలో ఐదేళ్లు నిండుతాయి. ప్రేక్షకులను రంజించేయడానికి తను చేసే నృత్యకార్యక్రమాలలో తను తల్లినన్న విషయాన్ని ఆమె దాచలేదు సరికదా, తన పిల్లల ఫోటోలను వేదికపై నుండే జెయింట్ స్క్రీన్‌పై చూపించేది. 43 ఏళ్ల వయసులో వున్న జెన్నిఫర్ డాన్సు చేస్తూంటే ఆమెకు పదేళ్లు వయసు తగ్గినట్టు అనిపించింది ప్రేక్షకులకు. మహిళలకు అంతర్గతంగా ఎంతో శక్తి వుంటుందని, కష్టకాలంలో దాన్ని వెలికిదీసి ఆత్మస్థయిర్యంతో ముందుకు సాగాలనీ అంటుందామె. ఒడిదుడుకులు లేని జీవితమే లేదని తన తల్లి బాల్యంలోనే చెప్పిందట. వాళ్ల కుటుంబం పోర్టోరికా నుండి న్యూయార్క్‌కు వచ్చింది. జెన్నిఫర్ తండ్రి నైట్ షిఫ్టుల్లో పనిచేసేవాడు. తల్లి స్కూల్లో పనిచేసేది. "నువ్వు స్వతంత్రంగా బతకడం నేర్చుకో. భర్త మీద పూర్తిగా ఆధారపడకు. భర్తే కాదు, ఎవరి మీదా ఆధారపడకుండా బతకడం నేర్చుకో." అని పిల్లలకు చెప్పేది.

జెన్నిఫర్ కళారంగానికి వెళతానన్నపుడు ఆమె చెప్పింది – "నీకు ఏం కావాలన్నా సాయం చేస్తాను. కానీ అన్నీ అనుకున్న ప్రకారం జరగవు. అలా జరగనప్పుడు నువ్వు ఏడ్చి రాగాలు పెట్టకూడదు." అని. జెన్నిఫర్ సరేనంది. కొంతకాలానికి ఆమె పని చేసే కంపెనీ బ్రాడ్‌వే మ్యూజికల్స్ చరిత్ర గురించి నృత్యనాటిక తయారుచేసి యూరోప్ తీసుకెళ్లింది. ఆ బృందంలో అందరికీ విడిగా సోలో డాన్సు చేసే అవకాశం వచ్చింది కానీ జెన్నిఫర్‌కి మాత్రం రాలేదు. అన్నీ బృందనృత్యాలే. ఆమెకు కష్టం తోచి తల్లికి ఫోన్ చేసి ఏడ్చింది. "షో బిజినెస్‌లో చేరాలన్న నిర్ణయం నీది. దానిలో యిలాటివి లక్ష జరుగుతాయన్న సంగతి నీకు ముందే తెలిసి వుండాలి. ఇప్పుడు వూరికే ఫోన్‌లో ఎక్కిళ్లు పెట్టి నన్ను విసిగించకు. నాకు తీరిక వున్నపుడు వచ్చి ఓదారుస్తానులే" అంటూ తల్లి ఫోన్ పెట్టేసింది.

జెన్నిఫర్ తల్లే కాదు, అమ్మమ్మ కూడా యిలాటి దృఢచిత్తురాలే. వాళ్ల పెంపకంలో పెరిగిన యీమె కూడా అటువంటి ఆలోచనాధోరణే అలవర్చుకుంది. ఏదైనా ఎదుర్కోవడం నేర్చుకుంది. ఇప్పుడు డాన్స్ ఎగైన్ షోలకు వెళ్లినపుడు తన కూతుళ్లతో బాటు తల్లిని కూడా తీసుకుని వెళ్లింది. లిస్బన్, ఇస్తాంబుల్, బెల్‌గ్రేడ్ యిలా రకరకాల ప్రదేశాలకు తీసుకెళ్లి తండ్రి దగ్గర లేని బాధ పిల్లలకు తెలియకుండా చేసింది. ఆ పిల్లలు యీమె బృందంతో కలిసి ఆడుకుంటూ తిరిగారు. తల్లిగా కూడా తన బాధ్యత నిర్వర్తించానన్న తృప్తితో వుంది జెన్నిఫర్. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో ఆమె సినిమాల వైపు దృష్టి మరలించింది. ఐదేళ్ల క్రితం గర్భవతి అయాక ఆమె సినిమా కెరియర్‌ను వెనక్కి నెట్టింది. ఇప్పుడు మళ్లీ సినిమాల్లోకి వస్తోంది. జేసన్ స్టథామ్‌తో కలిసి ఆమె వేస్తున్న "పార్కర్" సినిమా హిట్టయితే మళ్లీ నటనపై ఆమెకు ఆసక్తి కలగవచ్చు. – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)

**జనవరి 14 ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 05**

ఎవడైనా ఆచరణయోగ్యం కాని, తనే స్వయంగా అవలంబించని వేదాంతం చెపుతూ వుంటే 'మెట్టవేదాంతం చెప్తున్నాడు' అంటారు. మెట్ట అంటే మెరక భూమి. మాగాణి కాదు కాబట్టి శుష్కమైన భూమి. సాధారణంగా వాడకంలో లేనిది. మెట్ట వేదాంతం అంటే ఆచరణ సాధ్యంకాని శుష్కవేదాంతం అనే అర్థం రావడానికి యీ పదమే కారణమా? కాదుట. మెట్ట అనేది బౌద్ధమతంలో ఓ సూత్రం, ఓ సిద్ధాంతం. బౌద్ధమతం ప్రకారం నాలుగు ఉదాత్తమైన భావాలున్నాయి. అవి మెట్ట, కరుణ, ముదిత, ఉపేక్ష. వీటిని బ్రహ్మ విహారాలు అంటారు. మనిషికి వుండవలసిన పది పరామితులలో మెట్ట ఒకటి. ఏమిటీ మెట్ట? మెట్ట అనేది మైత్ర-మైత్త-మెత్త-మెట్ట..

యిలా వచ్చిందట. అంటే స్నేహభావం అన్నమాట. దీన్ని ఆచరణలో తెచ్చుకోవడం ఎలాగో ఆ పద్ధతి కూడా వివరించారు. దీన్నే మెట్ట వేదాంతం అన్నారు. బౌద్ధమతం క్షీణిస్తున్న దశలో బ్రాహ్మణమతం దాన్ని హేళన చేస్తూ ఆచరణయోగ్యం కాని వేదాంతం అనే అర్థంలో 'మెట్ట వేదాంతం' అనసాగారు.

---

ఆరుద్ర శ్రీశ్రీకి శిష్యుడుగా వుండేవారు. కొంతకాలం పోయాక యిద్దరికీ భేదాభిప్రాయాలు వచ్చాయి. ఆరుద్ర శ్రీశ్రీని పెద్దగా ఏమీ అనకపోయినా, శ్రీశ్రీ మాత్రం ఆరుద్రను ఏదో ఒకటి అంటూనే వుండేవాడు. ఓ సారి ఒకరు అడిగారు – ''మీ శిష్యరత్నం ఆరుద్ర ఎలా వున్నాడు?'' అని. శ్రీశ్రీ జవాబిచ్చారు – ''శిష్యుడంటే అతనొప్పుకోడు. రత్నమంటే నేనొప్పుకోను...'' అని.

---

నాడు – అనే మాటను రెండు రకాలుగా రాయవచ్చు. మధ్యలో అరసున్నా లేకుండా రాస్తే అది క్రియాపదం. నాటు, గుచ్చుకొను, బాధించు అనే అర్థాలున్నాయి. మధ్యలో అరసున్నతో (నాఁడు) రాస్తే – రోజు, సమయం, దేశం, ప్రదేశం, పల్లె అనే అర్థాలున్నాయి. అలా చూస్తే ''ఈనాడు'' పత్రికవారు ''ఈనాఁడు'' అని వేయాలన్నమాట. టిడిపివారు వాడుతున్న 'మహానాడు' పదానికి వీటితో సంబంధం లేదు. తమిళులు పెద్ద సమావేశం జరుపుకుంటే దాన్ని 'మానాడు' అని పిలుచుకుంటారు. వాళ్లు 'హ'ను వాడరు కాబట్టి 'మహ'కు బదులు 'మా' అని రాస్తారు. ('మహావీరుణ్ని'ను 'మావీరన్' అని అంటారు) అందువలన 'మానాడు'కి అసలు రూపం 'మహానాడు' అయి వుంటుందనుకుని ఎన్టీయార్ టిడిపి సమావేశాలకు ఆ పేరు పెట్టేశారు. నిజానికి అది దుష్టసమాసం. సంస్కృతపదాలను, తెలుగుపదాలను కలిపి రాస్తే వాటిని దుష్టసమాసం లేదా వైరి సమాసం అంటారు. పూలచెట్లు అంటాం. రెండూ తెలుగు పదాలే. పుష్పచెట్లు అంటే తప్పు, పుష్ప అనేది సంస్కృతపదం కాబట్టి. అలాగే ముసలితల్లి అంటాం, లేదా వృద్ధమాత అంటాం. వృద్ధతల్లి, ముసలిమాత అనడం తప్పు. మహానాడులో మహా అనేది సంస్కృతం. నాడు తెలుగు పదం. కానీ వినగా వినగా మనం అలవాటు పడ్డాం.

---

ఉలూఖల మర్దళ న్యాయం అని ఒకటుంది. ఒకళ్లు యిల్లు మారుతూ సామాన్లన్నీ కొత్త యింట్లో ఒకే గదిలో పడేసి పోయారట. పెరట్లో వుండే రోలు (కరక్టుగా రాయాలంటే ఱోలు అని రాయాలి), వాకిట్లో వుండే మద్దెల పక్కపక్కన పడి వున్నాయట. రోలు తన గోడు చెప్పడం మొదలు పెట్టిందట – 'నన్ను రోకలి పెట్టి ఎంత బాదుతారో తెలుసా, ఒళ్లు హూనం అయిపోతుంది' అని. అప్పుడు మద్దెల చెప్పిందట – ''నిన్ను ఒక పక్కనే బాదతారు, నన్ను రెండు పక్కలా బాదతారు. నా గోడు ఎవరితో చెప్పుకోను?'' అని. మనం ఎవరితోనైనా కష్టాలు చెప్పుకుందామని చూస్తే అదేం ఖర్మమో మనకు యిలాటి వాళ్లే తగులుతారు. ''నీ కంటె ఎక్కువ కష్టాలు పడుతున్నాను గురూ..'' అంటూ. ఱోలును సంస్కృతంలో ఉలూఖలం అంటారు, మద్దెలను మర్దళం అంటారు. ఆ పేర్ల మీద యీ న్యాయం వచ్చింది. తెలుగులో 'రోలు వచ్చి మద్దెలతో మొఱ ('మొర' అంటే పశువుల మూతి – మోర) పెట్టుకున్నట్టు' అంటారు.

---

**మీ పదసంపద 03**

(మీ పద సంపద 02 సమాధానాలు – 1.సి 2.డి 3.డి 4.ఎ 5.సి 6.సి 7.డి 8.ఎ 9.డి 10.బి)

01. మనవులుగా (''పెళ్లి చేసి చూడు''లో 'ఎవరో ఎవరో.' పాటలో వస్తుంది) – ఎ.మానవస్వభావంతో బి. కొత్తరకముగా సి. విన్నపములు డి. సొంతవారిగా భావించి

02. సద్దు (''పెళ్లి చేసి చూడు''లో 'ఏడుకొండలవాడ.' పాటలో వస్తుంది) – ఎ.కోపం బి. గొడవ సి. అల్లరి డి. చప్పుడు

03. చెర (''ఆనందం''లో 'ఎవరైనా ఎపుడైనా..' పాటలో వస్తుంది) – ఎ.కౌగిలి బి. దగ్గరితనం సి. నడిచేది డి. జైలు

04. పులుగు (''సంపూర్ణ రామాయణం''లో 'ఊరికే కొలను నీరు..' పాటలో వస్తుంది) – ఎ.పక్షి బి.జంతువు సి.పురుగు డి. చేప

05. పూలచేరు (''సంపూర్ణ రామాయణం''లో 'ఊరికే కొలను నీరు..' పాటలో వస్తుంది) – ఎ.పువ్వులు చల్లిన దారి బి. పువ్వుల రథం సి. పూలహారము డి. పుప్పొడి

06. మధురిమ (''ఆనందం''లో 'ఎవరైనా ఎపుడైనా..' పాటలో వస్తుంది) – ఎ.తేనె బి. మద్యము సి.తీపితనము డి. ప్రావీణ్యత

07. రాయంచ (''నువ్వు నాకు నచ్చావు''లో 'ఆ నీలి గగనాల' పాటలో వస్తుంది) – ఎ.రాతిబొమ్మ సి.మెట్టు సి.రాత్రి తిరిగే పక్షి డి. రాజహంస

08. జవరాలు ("నువ్వు నాకు నచ్చావ్"లో 'ఆకాశం దిగి వచ్చి..' పాటలో వస్తుంది) – ఎ.యవ్వనవతి బి. శక్తి కలిగినది సి. వరము నిచ్చునది డి. ప్రేమ కురిపించునది.

09. వేకువ ("స్నేహమంటే ఇదేరా"లో 'స్నేహమంటే..' పాటలో వస్తుంది) – ఎ.మెలకువ బి. వేడి సి. వెలుగు డి. తెల్లవారే సమయం

10. అనాది ("స్నేహమంటే ఇదేరా"లో 'స్నేహమంటే..' పాటలో వస్తుంది) – ఎ.ఆదిలో లేనిది బి. పాతకాలపుది సి. తనది కానిది డి. తల్లితండ్రులు లేనిది **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 15, 16 వీక్లీకై** **ఎమ్బీయస్ : 'శుభ్ర' తెలంగాణ**

రుషి కపూర్ హీరోగా వుండే రోజుల్లో అతన్ని యింటర్వ్యూ చేద్దామని ఓ హిందీ ఫిలిం జర్నలిస్టు ఎప్పుడు యింటికి ఫోన్ చేసినా "సాబ్ బాత్‌రూమ్‌లో వున్నారు" అని సమాధానం వచ్చేది. చూసి చూసి అతనికి ఒళ్లు మండి "ఈనాడు బాలీవుడ్‌లో అందరికంటె శుభ్రమైన నటుడు ఎవరో తెలుసా? రుషి కపూర్! అతను రోజంతా బాత్‌రూమ్‌లోనే వుండి కడుక్కుంటూ వుంటాడు." అని తన పత్రికలో రాసేశాడు. ఈ నాడు ఏ పార్టీకి చెందిన తెలంగాణ నాయకుణ్ని కదిపినా "ప్రత్యేక తెలంగాణ అని మా పార్టీ ప్రకటిస్తే చాలు తెలంగాణను 'క్లీన్ స్వీప్' చేస్తాం" అంటున్నారు. తెరాస, కాంగ్రెస్, టిడిపి, వైకాపా, బిజెపి.. యిన్ని పార్టీల నాయకులు స్వీప్ (తుడి)చేస్తే యిక తెలంగాణ శుభ్రపడక ఏమవుతుంది? తళతళలాడుతూ మెరిసిపోతుందన్నమాట!

టి–టిడిపి నాయకులు బాబుకి అదే చెప్పారు. 'తెలంగాణ మనకు ఒకప్పుడు పెట్టనికోట. 2009 డిసెంబరు 10 న మన ఆంధ్రప్రాంతపు నాయకులు ఆందోళన చేయడంతో, దరిమిలా 'మీరు ఆంధ్ర–తెలంగాణ' నాకు రెండు కళ్లు అనడంతో మనకు బలం పోయింది. మన స్థానంలో తెరాస పుంజుకుంది. మీరు ఒక కన్ను మూసేసి, శుక్రాచార్యుడై పోయి మళ్లీ విభజనకి జై అనండి, చాలు మనం క్లీన్ స్వీప్ చేస్తాం' అని. ఈయన సరే అన్నారు. అఖిలపక్ష సమావేశంలో సమైక్యవాది యనమలను నోరెత్తనీయకుండా ఏకరాగం వినిపించి వచ్చారు. 'తెలంగాణపై మా సానుకూల వైఖరి స్పష్టం చేసేశాం, ఎన్టీయార్ భవన్‌లో చప్రాసీ పోస్టు ఖాళీగా వుంది, గతంలో ఛాలెంజ్‌లు చేసినవారికి ప్రాధాన్యత యివ్వబడుతుంది..' అని లోకేశ్ చేత ట్వీట్ చేయిస్తున్నారు.

బాగుంది. టిడిపి ప్రత్యేక తెలంగాణకు సై అంది. మరి యిప్పుడు చెప్పండి – తెలంగాణను టిడిపి క్లీన్ స్వీప్ చేస్తుందా? 2009లో మహా కూటమి పేరుతో తెరాస, లెఫ్టిలతో కలిసి పోటీ చేస్తే ఏమైందో చూశాం. పాతికేళ్లగా గెలుస్తూ వచ్చిన సీట్లను కూడా కాంగ్రెస్ పార్టీకి అప్పగించారు వీళ్లు. 'అబ్బే అది 2009 డిసెంబరు 9 ప్రకటనకు ముందున్న స్థితి' అనవచ్చు మీరు. పోనీ అఖిలపక్ష సమావేశం తర్వాత బాబు పాదయాత్రకు పెద్ద పెట్టున వూపు వచ్చిందా? తెరాసకు వెళ్లిపోయిన వాళ్లందరూ మళ్లీ వెనక్కు వచ్చేశారా? లేదే! అంతకుముందు ఎలా వుందో యిప్పుడూ అలాగే వుంది. కాదుకాదు, పరిస్థితిలో మార్పు వచ్చిందని కడియం, ఎర్రబెల్లి మనల్ని నమ్మించదలచుకుంటే కరీంనగర్ లేదా వరంగల్‌లో ఓ బహిరంగసభ పెట్టి దానికి తెరాస లెవెల్లో జనాన్ని సమీకరిస్తే నమ్మవచ్చు.

ఇక వైకాపా – 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదని చెప్పాం. కాంగ్రెస్ హై కమాండ్ మాటే మాకు శిరోధార్యం అని చెప్పాం. తండ్రి మాట జవదాటని శ్రీరాముని వారసులం. తండ్రి హయాంలో జరిగినవాటికి కారాగారవాసం అనుభవిస్తున్నవారి అనుయాయులం. ప్రస్తుతం సోనియమ్మే మా తండ్రి, తల్లి, దైవం, సమస్తం – యీ విషయంలో మాత్రం! తెలంగాణ కోరుకునేవాళ్లు మమ్మల్ని తప్పుపట్టడానికి ఏమీ లేదు, పైగా వైయస్ ఉచిత విద్యుత్ పథకం వలన లాభపడిన తెలంగాణ రైతాంగం మా పక్షమే వహిస్తుంది. రెండు అంశాలూ కలిశాయి కాబట్టి తెలంగాణ స్వీప్ చేసేది మేమే' అంటున్నారు వాళ్లు. మరి పరకాల ఉపయెన్నిక సమయానికి కూడా యీ రెండు అంశాలూ వున్నాయి. ప్లస్ కొండా సురేఖ వంటి పాప్యులర్ కాండిడేట్ వుంది, అయినా వైకాపా ఓడిపోయింది. అఖిలపక్ష సమావేశంలో కూడా పాత పాటే పాడారు. దాని తర్వాత వైకాపా వైపుకి ఎవరూ దుమకలేదు. వాళ్లు పెద్ద సభా పెట్టలేదు. ఎన్నికలంటూ వస్తే ప్రతీ నియోజకవర్గంలోనూ సురేఖ వంటి అభ్యర్థులు దొరకరు. అందువలన వాళ్లెలా క్లీన్ స్వీప్ చేయగలరు చెప్మా?

ఇక టి–కాంగ్రెస్ నాయకుల మాట చెప్పనే అక్కరలేదు. తెలంగాణ యిస్తామని ప్రకటన చేస్తే చాలు, అందరూ మనకే ఓట్లేసేస్తారు, యావత్తు తెలంగాణ క్లీన్ స్వీప్ చేసేది మనమే అంటారు. మరి పుష్కరంపాటు పోరాటం చేసిన కెసియార్ మాటేమిటి? తెలంగాణ అంటే చప్పున గుర్తుకు వచ్చే ఆయనకేమీ రావా? అని హై కమాండ్ అడిగితే మనం తెలంగాణ అన్నాక కెసియార్ వేరే ఎక్కడుంటాడు, వచ్చి మనతో చేరిపోడూ? అంటారు. అలా చేరడానికి కెసియార్ ఏం డిమాండ్ చేస్తాడో అని వాళ్లు ఆశ్చర్యపడితే 'అవన్నీ మీరు చూసుకోండి, మాకు అనవసరం' అంటారు. కెసియార్ చేరినా, చేరకపోయినా తెలంగాణ స్వీప్ చేస్తాం అని అంటూనే ఎన్నికల ముందు తమ నియోజకవర్గంలో ఏ పార్టీకి వూపు ఎక్కువగా వుందని తోస్తే అటువైపు దూకేయనూ గలరు. ఇది తెలిసే కాంగ్రెస్ ఎటూ తేల్చకుండా నానుస్తోంది.

బిజెపి, సిపిఐ తెలంగాణకు జై అన్నాం కాబట్టి పదుల సంఖ్యలో సీట్లు గెల్చేస్తాం అని వాళ్ల పార్టీ హై కమాండ్‌లకు చెప్పుకోవచ్చు కానీ దాని వలన ఒరిగేదేమీ లేదని, వాళ్లు స్వీప్ చేయడం ఒట్టి మాట అనీ మనకు తెలుసు. అందువలన వాళ్లను వదిలేసి తెరాస గురించి ఆలోచిద్దాం. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తే తెరాస స్వీప్ చేయగలదా? లేదా?

ఇన్నాళ్లూ తక్కిన పార్టీలన్నీ అటూయిటూ వూగుతూండగా తెలంగాణకై అటలంగా, నిశ్చలంగా నిలిచి పోరాడిన పార్టీగా తెరాసకే తెలంగాణ ఉద్యమకారుల, సానుభూతిపరుల ఓట్లు పడాలి. తెలంగాణ ఉద్యమం బలంగా వున్న చోట అవి తెరాసను గెలిపించాలి కూడా. అయితే యిక్కడ వచ్చిన చిక్కేమిటంటే – తెరాస కష్టాలను ఉద్యమకారులు ఏ మేరకు అర్థం చేసుకుంటారన్నది చూడాలి. తెలంగాణ సాధనకై తెరాస అంతిమంగా రాజీ పడక తప్పదు. అడిగిన డిమాండ్లు అన్నీ నెరవేరడం ఎన్నడూ జరగదు. కొంత యిచ్చి కొంత పుచ్చుకోవాలి. తెలంగాణకు ప్యాకేజీ, ప్రాంతీయ బోర్డు వంటివి తెరాస ఎలాగూ తిరస్కరిస్తుంది. హైదరాబాదును యుటి చేస్తామన్నా తిరస్కరిస్తుంది. అప్పుడు తర్జనభర్జనలు సాగుతాయి. చివరకు – నాగేందర్ చెప్పినట్టు – హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా 15 ఏళ్లు వుంచుతాం అని కేంద్రం ప్రతిపాదన చేసిందనుకోండి. అక్కడ వస్తుంది చిక్కు.

''అమ్మో 15 ఏళ్లు ఉమ్మడి రాజధాని అంటే ఆ తర్వాతైనా ఆంధ్రప్రాంతీయులు వెళతారన్న గ్యారంటీ ఏముంది? చండీగఢ్‌ను హర్యానీయులు విడిచి పెట్టారా? ఆ పాటికి కెసియార్‌లా గట్టిగా నిలబడి పోరాడేవాళ్లు లేకపోతే పాతుకుపోరూ!? అందువలన వాళ్లను తక్షణం పంపేయాలి. కావాలంటే కర్నూలులో గతంలో గుడారాల్లో వున్నట్టు, యిప్పుడు కూడా ఏవైనా గుడారాల్లో వుండమనండి'' అంటారు తెరాసలోని అతివాదులు.

''అలా మాట్లాడితే వచ్చిన తెలంగాణ కూడా వెనక్కి వెళ్లిపోతుంది. ఇప్పటికిప్పుడు పొమ్మంటే వాళ్లు పోతారా? కేంద్రానికి కూడా మనపై సానుభూతి పోతుంది. ఐదేళ్లే మాగ్జిమమ్ అని చెప్దాం. మధ్యేమార్గంగా ఏ పదేళ్లకో కేంద్రం ఫిక్స్ చేస్తుంది.'' అంటారు మితవాదులు.

''సూదిమొన మోపనిస్తే దబ్బనం పెట్టే రకాలు వాళ్లు. అసలు ఎవరు ఆంధ్ర, ఎవరు తెలంగాణ. తేల్చడమే పెద్ద కష్టం. బయటినుండి వచ్చినవాళ్లు మనవాళ్ల కంటె హుషారుగా లంచాలు పెట్టేసి నేటివిటీ సర్టిఫికెట్లు సంపాదించేస్తారు. మన ఉద్యోగులే యిచ్చేస్తారు కూడా. దానికి తోడు పదేళ్లు, పదిహేనేళ్లు అంటే బ్యాక్ డేట్‌తో ముల్కీలు సంపాదించేసి, గడువు తర్వాత బయటకు పంపుదామంటే ఎవరూ కనబడరు. అందువలన ఏమాత్రం వెసులుబాటు యివ్వకూడదు'' అంటారు అతివాదులు. చర్చల్లో పాల్గొనే అవసరం అతివాదులకు పడదు. కానీ చర్చల్లో పాల్గొన్నవాళ్లకు గివ్ అండ్ టేక్ పాలసీ లేనిదే పని నడవదు. ఎదుటి వాళ్ల మాట వినాలి, మన మాట వినిపించాలి, చివరకు మధ్యవర్తి చెప్పిన మాటకు ఒడంబడాలి. ఈ బాధ్యత ఉద్యమసారథిగా కెసియార్‌పై వుంది. హరీష్‌రావుపై లేదు. అందువలన ఆయన అతివాదిగా కొనసాగగలడు. ఆయన యుఎస్‌పి (ప్రత్యేక ఆకర్షణ) – పట్టువిడుపు తెలియని, కరడుగట్టిన ఉద్యమవాదిగా వుండడమే. అందుకే యువతకు ఆయన ఆరాధ్యుడిగా ఎదిగాడు.

ప్రత్యేక తెలంగాణ యిద్దామని నిర్ణయించుకుని షరతులపై మాట్లాడడానికి యితర ప్రాంత నాయకులతో కలిసి కూర్చోవాలని తెరాసకు కేంద్రం సూచన చేస్తే వారి మాట కెసియార్ వినవచ్చు తప్ప హరీష్ వినరు. 'మాది రాజీ లేని పోరాటం' అని ప్రకటించి సమావేశంలోనుండి బయటకు వచ్చేస్తే యువత ఆయనకు బ్రహ్మరథం పడుతుంది. కెసియార్ మాట విని ఆయన రాజీపడడమో, లేక కాంగ్రెస్‌లో విలీనం కావడమో చేస్తే యువతకు ఆయన పట్ల గ్లామర్ పోతుంది. తన మాట మన్నించాలని కెసియార్ గట్టిగా పట్టుబడితే హరీష్ విడిగా బయటకు వెళ్లి పార్టీ పెట్టవచ్చు కూడా. అదే జరిగితే అతని వెంట పార్టీ క్యాడర్ చాలా వెళుతుంది. సానుభూతిపరుల్లో యువత అతని వెంట వెళుతుంది.

ఇదే జరిగిననాడు తెరాస బలం క్షీణించినట్లే. ఎన్నికలలో పోరాడడానికి నిధుల అవసరం ఎంతైనా వుంటుంది. ఉద్యమం పేరుతో కెసియార్ ఆర్థికంగా బలపడ్డారని అనేవాళ్లున్నారు తప్ప పార్టీకి నిధులు వచ్చి చేరాయని ఎవరూ అనడం లేదు. జిల్లాజిల్లాకు, తాలూకాతాలూకాకు ఆఫీసు, కార్యకర్తలను పోషించడానికి వనరులు, ఎన్నికలలో ఓటర్లను ఆకర్షించడానికి డబ్బులు – యివన్నీ తెరాసకు ఏ మేరకు వున్నాయో తెలియదు.

విధంగా ఆలోచిస్తే తెలంగాణను మొత్తంగా క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఏ పార్టీకి లేదని తేలుతుంది. అన్ని పార్టీలూ తలా కాస్త పంచుకోవచ్చు. వారిలో తెరాసకు అత్యధికంగా సీట్లు రావచ్చు. అది కూడా పార్టీ చీలిపోని పక్షంలో! చీలిపోతే 119 సీట్లను నాలుగు పార్టీలకు బదులు ఐదు పార్టీలు పంచుకుంటాయి. (సిపిఐ, బిజెపి, మజ్లిస్‌లను పక్కకు పెట్టి మాట్లాడుతున్నాను, వాటిని కూడా కలిపితే ఐదున్నర అనాలి) ఇవన్నీ తలా కాస్త పంచుకుంటే ఎవరు ఒంటిచేత్తో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలరు? రెండు, మూడు పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఎంతకాలం నడపగలరు? జార?ండ్ నడిగితే చెప్తుంది! మాటిమాటికీ ఎన్నికలు వస్తే, మాటిమాటికీ క్లీన్ స్వీప్ చేస్తామని అందరూ చెప్తే... శుభ్రతలో తెలంగాణకు ఏ రాష్ట్రమూ సాటి రాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 17 వీక్లీకై** **ఎమ్బీయస్ : సమైక్య సదస్సు**

కేంద్రం హోం మంత్రి నెల్లాళ్లలోగా అఖిలపక్ష సమావేశం ఫలితాలు వెల్లడిస్తామని లిఖితపూర్వకంగా కాకపోయినా, వాచ్యా అన్నారు. తెలంగాణపై పరిష్కారం వెల్లడిస్తారని ప్రచారం జోరుగా చేస్తున్నారు కానీ కనీసం ఒక ప్రతిపాదనతో ముందుకు వచ్చినా సంతోషమే. ఆ ప్రతిపాదన ఎటూ ఎల్లరకూ సమ్మతం కాదు, దానిపై తర్జనభర్జనలు సాగుతాయి. అది రాబోతోంది కాబట్టి అప్పటిదాకా

అందరూ సంయమనం పాటించండి అంటూ ప్రతీ పార్టీ ప్రతీ పక్కపార్టీకి చెపుతోంది. సభలో ''సైలెన్స్.. సైలెన్స్.. వక్త మాట్లాడేది వినబడాలంటే అందరూ నిశ్శబ్దంగా వుండకపోతే ఎలా?'' నిర్వాహకులు మైకులో చెపితే బాగుంటుంది తప్ప సభలో ఓ వందమంది అవే మాటలు చెపితే ఎలా వుంటుంది? అలాగే వుంది ప్రస్తుతం. 'తెలంగాణ యిచ్చేస్తామని మాకు తెలిసింది. ఇవ్వకపోతే మాత్రం రాజీనామాలు చేసి మా పార్టీకి గోరీ కట్టేస్తాం. ఇక దీనిపై 28 వరకు ఎవరూ మాట్లాడకండి' అని విభజనవాదులంటే 'సమైక్యంగానే వుంచుతామని మాకు తెలిసింది. అలా వుంచకపోతే మాత్రం రాజీనామాలు చేసి మా పార్టీకి గోరీ కట్టేస్తాం. ఇక దీనిపై 28 వరకు ఎవరూ మాట్లాడకండి' అంటూ సమైక్యవాదులు అంటున్నారు. ఎవరికి వారు సదస్సులు పెట్టేసుకుంటున్నారు, విందులు యిచ్చేసుకుంటున్నారు, గూడుపుఠాణీలు చేసేసుకుంటున్నారు. అవతలివాళ్లు కూడితే మాత్రం 'ఫౌల్, ఫౌల్' అంటున్నారు.

గురువారం నాడు సమైక్య కాంగ్రెస్ వాదులు సదస్సు పెడతామనగానే హత్తెరీ అంటున్నారు కొందరు తెలంగాణావాదులు. అదేదో దేశద్రోహ చర్య అన్నంత బిల్డప్ యిచ్చారు. అదే సదస్సు ఏ గుంటూరులోనే అయితే పట్టించుకునేవారు కారు. వాళ్లు హైదరాబాదులో పెడతానడడంతో వచ్చింది చిక్కు. 'తెలంగాణలో సమైక్యవాదులకు చోటు లేదు, నోరు లేదు' అన్న నినాదంతో దశాబ్దంగా ఏలుతున్నారు కదా. ఇప్పుడు యిలా పెడితే పరువు పోయినట్టు ఫీలవుతున్నారు. 'ఆంధ్రప్రాంతంలో విభజన సదస్సులు జరుగుతున్నాయి కానీ, తెలంగాణలో సమైక్య సదస్సులు జరగడం లేదు, దాన్ని బట్టే తెలుస్తోంది యిక్కడి భావోద్వేగాలు' అంటూ హై కమాండ్‌కు వీళ్లు కాన్వాస్ చేస్తూ వచ్చారు. ఎలా జరుగుతాయి, జరగనీయకుండా చేస్తే..? ఉద్యమకారులు పదిమంది వచ్చినా పోలీసులు మీటింగు ఆపేస్తున్నారు. ఉద్యమకారుల కంటె ముందు మీడియావాళ్లే హంగామా చేస్తారు.

ఇదే ఇదివరకు రోజుల్లా అయితే హై కమాండే మీటింగు కాన్సిల్ చేయించేది. ఇప్పుడు జరగనిచ్చారు. ఆ మేరకు ఆదేశాలు వచ్చి వుంటాయి. రోశయ్యగారైతే 'నాకెందుకు వచ్చిన గొడవ, మీటింగు వద్దు' అనేసేవారేమో, కిరణ్ తనను తాను స్ట్రాంగ్‌మ్యాన్‌గా చూపించదలచుకున్నారు కాబట్టి 'జరగనీయండి, ఏదైనా వస్తే నేను చూసుకుంటా' అని హై కమాండ్‌కు చెప్పి వుంటారు. మొదట్లో టిమంత్రులు అడ్డుకుంటారు అనుకున్నారు గానీ వాళ్లూ అడ్డం రాము అన్నారు. హై కమాండ్ కెసియార్ ద్వారా టి-జాక్‌ను కూడా మేనేజ్ చేసి వుంటుంది, కోదండరామూ జరగనీయండి అన్నారు. ఎవరూ ప్రొటెస్ట్ చేయకపోతే మ్యాచ్ ఫిక్సింగ్ అనుకుంటారనుకుని మధు యాష్కీ చేత ఓ స్టేటుమెంటు, కవిత చేత ఓ ప్రదర్శన, జాక్ చేత మౌన ప్రదర్శన కూడా స్టేజ్‌మేనేజ్ చేస్తున్నారు లాగుంది. కాంగ్రెస్ అటు ఆంధ్రప్రాంతపు నాయకుల చేత, యిటు తెలంగాణ నాయకుల చేత రాజీనామా బెదిరింపు స్టేటుమెంట్లు యిప్పిస్తూనే వుంది. ఈ మధ్యే కాంగ్రెస్‌లో చేరిన గంటా శ్రీనివాసరావు అంత లావు స్టేటుమెంటు యిచ్చాడంటే పైనుండి ఎంత భరోసా యిచ్చి వుంటారో మరి! ఇవాళ దానం, ముకేశ్‌ల చేత 'హైదరాబాదు యుటి అయితే ప్రజాప్రతినిథులు లేకుండా పోతారు, అందువల్ల ప్రత్యేక రాష్ట్రం చేయాలి' అనే ప్రకటన కూడా యిప్పించారు. ఈ హంగామాతో చూసేవాళ్లకు అబ్బ యీ సమస్య ఎలా తేలుతుందో అన్న భయం వేసేట్టు చేసింది.

ఏది ఏమైతేనేం, యిన్నాళ్లకు రాజధానిలో సమైక్యవాదులు గళం సవరించుకుంటున్నారంటే సంతోషమే. ఆంధ్రప్రాంతంలో బిజెపి వారి ప్రత్యేక సదస్సులు అడ్డుకోవడం ఎంత తప్పో, తెలంగాణ ప్రాంతంలో సమైక్య సదస్సులు అడ్డుకోవడం అంత తప్పు. ఒక ప్రాంతంలో వున్నవారందరికీ ఒకే రకమైన అభిప్రాయం వుండాలని ఎలా ఒత్తిడి చేయగలం? ఇండియాలో యావన్మందీ, పాకిస్తాన్‌లో యావన్మందీ విడిపోవాలని కోరుకున్నారని చెప్పగలమా? అదే విధంగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు ప్రాంతాలు విడిపోయినపుడు మద్రాసులో అందరూ తెలుగువాళ్లు వెళ్లిపోవాలని కోరుకున్నారని చెప్పగలమా? వాస్తవాలను ఆమోదిస్తూనే 'ఇలా వుంటే బాగుండేది' అని అనుకోవడంలో తప్పేముంది?

హై కమాండ్ యీ సదస్సు జరగనిచ్చిందని గట్టిగా నమ్మితే ఇంతకీ ఎందుకు జరగనిస్తోందన్న ప్రశ్న వస్తుంది. నా ఉద్దేశం, హై కమాండ్ అడిగి వుంటుంది - 'మీరు సమైక్యం కోరుతున్నారు సరే, ఏ కారణం చేతనైనా రాష్ట్రం విడగొట్టవలసి వస్తే మీరేం కోరతారు? ఏ మేరకు దిగివస్తారు? మీ షరతులు ఏమిటి? ఆలోచించి చెప్పండి' అని. మజ్లిస్ వారు సమైక్యం అంటూనే విడగొట్టవలసి వస్తే రాయల తెలంగాణ అన్నారు. రాయలసీమ నాయకులు కొందరు సమైక్యం అంటూనే విడగొడితే రెండుగా కాదు, రాయలసీమతో సహా మూడుగా విడగొట్టండి అన్నారు. దానం, ముకేశ్ సమైక్యం అంటూనే విడగొడితే హైదరాబాదుతో సహా మూడుగా విడగొట్టండి అన్నారు. ఇలాటి స్టేటుమెంటు ఏదో కోస్తా, సీమ నాయకులనుండి రావాలని హై కమాండ్ ఆశిస్తోంది కాబోలు. వీళ్లు సమావేశానంతరం 'సమైక్యానికే కట్టుబడుతున్నాం' అని తీర్మానం చేశామన్నారు కానీ ఆ తీర్మానం చేయడానికి రెండున్నర గంటల చర్చ అక్కరలేదు. వీళు కానీ ఒకవేళ రాష్ట్రవిభజన జరగాలని హై కమాండ్ ఆదేశిస్తే దాన్ని శిరసా వహిస్తూనే ఫలానా ఫలానా షరతులుండాలని కోరాలా, రాజీనామాలతో బెదిరించాలా..' వంటివి చర్చించి మెజారిటీ ప్రజల అభిప్రాయాల్ని ఢిల్లీ వెళ్లినపుడు హై కమాండ్‌కు లోపాయికారీగా చెప్పవచ్చు.

ఇదంతా గమనించిన వైకాపా సమైక్య వోట్లన్నీ కాంగ్రెస్‌కు పడతాయేమోనన్న భయం చేత తన ఎమ్మెల్యే చేత సమైక్యంగా వుంచకపోతే కల్లోలం సృష్టిస్తాం అన్న స్టేటుమెంటు యిప్పించింది. రేపో మాపో తెలంగాణ వైపు నుండి ఓ ఎమ్మెల్యే చేత కౌంటర్ స్టేటుమెంటు యిప్పించవచ్చు. టిడిపి తెలంగాణ నాయకులు ఎలాగూ స్టేటుమెంట్లు గుప్పిస్తున్నారు కదాని, యిప్పుడు ఆంధ్రప్రాంతం నుండి గందరగోళం సృష్టించడానికి నన్నపనేని చేత హైదరాబాదు మాటేమిటి? అనే స్టేటుమెంటు యిప్పించారు. ఇదంతా చూస్తే

ఒక విషయం స్పష్టమవుతుంది – ఇరు ప్రాంతాల నాయకుల చేత తోలుబొమ్మలాట ఆడించే కాంగ్రెస్ కళనే టిడిపి, వైకాపా అంది పుచ్చుకున్నాయని!

ఇవాళ్టి సమైక్యవాదుల సదస్సులో సమైక్యానికి ప్రత్యామ్నాయంగా ఏమేం కావాలని కాంగ్రెస్ ఏం చెప్పించిందో నాలుగురోజులు పోయాక లీక్స్ రూపంలో బయటపడవచ్చు. వాళ్లేం చెప్పించారో చూసి అప్పుడు వైకాపా, టిడిపి ఆంధ్రప్రాంత యూనిట్లు కూడా యించుమించుగా అలాటి కోరికలే మరింత ఘాటుగా కోరవచ్చు. చూదాం ఒక్క తెలంగాణ పేరు చెప్పి ఎన్ని తమాషాలు జరుగుతున్నాయో కదా! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 18 వీక్లీకై** **ఎమ్బీయస్ : రెండు అడిగితే మూడోది బోనస్..**

తెలంగాణ కోరేవాళ్లందరూ ఇన్నాళ్లూ 'తెలుగువాళ్లకు రెండు రాష్ట్రాలుంటే తప్పేముంది?' అంటూ వచ్చారు. 'రెండేమిటి, హాయిగా మూడు రాష్ట్రాల్లో వుండండి..' అంటూ హైదరాబాదు రాష్ట్రం ఆఫర్ కూడా వచ్చి పడింది. దానం, ముకేశ్ 'హైదరాబాదు యుటీగా వద్దు, విడిగా రాష్ట్రం చేసేయండి' అన్నారు. వెంటనే జగ్గారెడ్డి '.. మా వూరితో కలిపి..' అన్నారు. ఇక యీ డిమాండ్ వూపందుకుంటోంది. ఇవాళ ఎన్‌టివి వాళ్లు ఒపీనియన్ పోల్ పెడితే 77% మంది హైదరాబాదు రాష్ట్రం కా?వాలి అన్నారు. హైదరాబాదువాసు లందరూ ఈ ప్రతిపాదనకు జై అనడంలో ఆశ్చర్యం లేదు. ఆ మాటకొస్తే వరంగల్ రాజధానిగా వరంగల్ జిల్లాను రాష్ట్రంగా చేస్తాం అంటే వరంగల్‌వాళ్లు కాదంటారా? గుంటూరైనా డిటో, వైజాగైనా డిటో, కర్నూలైనా డిటోడిటో... కొత్త రాష్ట్రం అంటే కొత్త ముఖ్యమంత్రి, కొత్త గవర్నర్, కొత్త కాబినెట్, కొత్త రాజధాని, కొత్త కాంట్రాక్టులు...! తక్కిన రాష్ట్రాల విషయంలో మౌలిక సదుపాయాలు ప్రస్తుతానికి లేవు. ఏర్పడడానికి కొంతకాలం పడుతుంది. హైదరాబాదు రాష్ట్రానికైతే ఆ యిబ్బందే లేదు. అన్నీ వున్నాయి, కేంద్ర సంస్థలూ వున్నాయి. అందువలన హైదరాబాదు చుట్టుపట్ల వున్న జిల్లాలు కూడా మమ్మల్ని మీలో కలిపేసుకోండి అని హైదరాబాదుని అడిగినా ఆశ్చర్యం లేదు.

హైదరాబాదు రాష్ట్ర డిమాండ్ ప్రత్యేక తెలంగాణ కోరేవారి గొంతుకు అడ్డుపడుతోంది. ఇన్నాళ్లూ తెలంగాణ వాదులు ఆంధ్రప్రాంతీయులకు హితోక్తులు పలికారు – 'రాష్ట్రం విడిపోతే మీకే మంచిది. మీకు రాజధాని ఏర్పడుతుంది, హైకోర్టు ఏర్పడుతుంది, ఉద్యోగవకాశాలు పెరుగుతాయి. ప్రతీదానికీ హైదరాబాదుకి వచ్చే పని లేదు. ఇప్పటికే శాచ్యురేట్ అయిపోయిన హైదరాబాదు నుండి మీరు పిండుకునేది లేదు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కేంద్రం నుండి నిధులు వస్తాయి. అభివృద్ధి లేకుండా వున్న మీ ప్రాంతాలన్నీ కళకళ లాడతాయి. మీ భూములకు మంచి రేట్లు వస్తాయి, మీరు బాగు పడతారు. మీ నాయకులు రాష్ట్రవిభజనను అడ్డుకుంటున్నారంటే మీకు ద్రోహం చేస్తున్నారనే అర్థం' అని. ఇప్పుడు యివే పలుకులు తెలంగాణావాదులకు ప్రత్యేక హైదరాబాదు రాష్ట్రం కోరేవారు వినిపిస్తారు. సేమ్ టు సేమ్. ఆదిలాబాద్‌లోనో, మెహబూబ్‌నగర్‌లోనో రాజధాని పెట్టుకుంటే వెలిగిపోతారని చెప్తారు. ప్రస్తుతం తెలంగాణావాదులు వినిపిస్తున్న 'పాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాలుగా వుంటేనే మేలు', 'స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించాలి', 'బయటివారి పెత్తనాన్ని సహించం' – యివన్నీ ప్రత్యేక హైదరాబాదువాదులు కూడా వినిపించగలరు.

ఈ వాదనలను తెలంగాణవాదులు ఎలా అడ్డుకోగలరో నాకు అర్థం కావటం లేదు. జనాభాలో, విస్తీర్ణంలో హైదరాబాదు అనేక రాష్ట్రాలకంటె పెద్దది, స్వయంసమృద్ధి కలది. కేంద్ర డిఫెన్సు సంస్థలను కాపాడుకోగల సామర్థ్యం కలది. దీని సంస్కృతి దీనిదే. ప్రస్తుతం రాష్ట్రంలో వున్న అన్ని జిల్లాల వారికీ హైదరాబాదులో బంధువులున్నారు, ఆస్తులున్నాయి, బాంధవ్యం వుంది. వీరే కాదు, దేశంలోని యితర రాష్ట్రాల వారు కూడా హైదరాబాదును సొంతభూమిగా పరిగణిస్తూ వున్నారు. ఆస్తులు సమకూర్చుకున్నారు, ఇక్కడే సెటిల్ అవుదామనుకుంటున్నారు. పదేళ్లగా వాళ్లు చాలా గందరగోళంలో పడ్డారు. వాళ్లంతా యీ కొత్త ప్రతిపాదనతో వూపిరి పీల్చుకుంటారు.

'హైదరాబాదు తెలంగాణలోని జిల్లాలపై వచ్చిన పన్నులతో కట్టినది, విడిపోవడానికి వీల్లేదు' అని కొందరంటున్నారు. 'హైదరాబాదు కట్టి 400 ఏళ్లు దాటింది. దాని నిర్మాణానికి నిధులు సమకూర్చినది కేవలం తెలంగాణ జిల్లాలే కాదు, కొన్ని జిల్లాలు ప్రస్తుతం కర్ణాటకలో, మరికొన్ని మహారాష్ట్రలో వున్నాయి, ఇంకా కాస్త గతంలోకి వెళితే ఆంధ్రప్రాంతంలోని అనేక నగరాలు క్రీ.శ. 1800 వరకు నిజాం కిందే వుండేవి. ఆ పన్నులతోనే నగరం తయారైంది. మరి వాళ్లందరూ వచ్చి క్లెయిమ్ చేస్తే...? కలకత్తా, ఢిల్లీలు భారత రాజధానిగా వుండేటప్పుడు ప్రస్తుత పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి కూడా పన్నులు వసూలై వచ్చాయి. అంతమాత్రం చేత వాళ్లందరికీ ఢిల్లీపై, కలకత్తాపై హక్కులు వున్నాయంటే వూరుకుంటామా?

ప్రత్యేకరాష్ట్రంగా హైదరాబాద్ అనే ప్రతిపాదన యిప్పుడెందుకు వచ్చింది? అదీ కాంగ్రెస్ మంత్రుల నోట!? తెలంగాణ విషయంలో కాంగ్రెస్ హై కమాండ్ యిన్నాళ్లూ నింద మోస్తోంది. నిర్ణయం తీసుకునే స్థితిలో వుండి కూడా తీసుకోకుండా నాన్చి నాన్చి రావణకాష్టం చేసిందని. ఇప్పుడు సమస్య యొక్క విస్తృతరూపాన్ని, దీర్ఘ పరిణామాలను (వైడ్ రామిఫికేషన్స్) దేశప్రజల ముందు వుంచదలచింది. – 'తెలంగాణ కావాలి అనగానే చెట్టు నుండి కోసి యింద అని యిచ్చేసినట్టు కాదు, రాష్ట్రంలోని యితర ప్రాంత ప్రజలకు ఫలానా అభ్యంతరాలున్నాయి, అంతేకాదు, తెలంగాణ రాష్ట్రంలోనే ఉపరాష్ట్రం డిమాండ్ వుంది. వీరి లాజిక్కే వారి లాజిక్కూ. 'అన్నదమ్ముల్లా

విడిపోతాం, కలిసి వుంటాం, రెడ్ కార్పెట్లు ఆర్డరిచ్చాం, రాగానే పరుస్తాం, పొట్టకూటికోసం వచ్చిన వాళ్లనేమనం' యివే మాటలు వాళ్లూ చెప్తారు. హైదరాబాదుకి సరేనంటే రాయలసీమవాళ్లు మాకూ అంటారు, ఉత్తరాంధ్ర వాళ్లూ డిటోడిటో.. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోంచే ఐదు రాష్ట్రాలు చీల్చవలసి వస్తుంది. అంతేకాదు, దేశంలోని యితర రాష్ట్రాలలో దీని ప్రకంపనలు ఎదుర్కొనవలసి వస్తుంది, దేశం దానికి సిద్ధమయితేనే మేం నిర్ణయం తీసుకోగలం' అని చాటి చెప్పదలచి వుంది.

దేశంలోని యితర ప్రాంతాలపై పడే ప్రభావం వివరించడానికి మాయావతిని ఎంచుకుంది. ఆవిడ 'తెలంగాణ బిల్లుకు మద్దతిస్తాం' అంటూనే యుపిని నాలుగు ముక్కలు చేయడం గురించి ముడి వేసింది. ఆ ముడి పీటముడే, ఎందుకంటే తెలంగాణకు సై అంటున్న బిజెపి యుపి విభజనకు నై అంటోంది. ఇది ఒప్పుకుంటే అదీ ఒప్పుకోవాలి అని షరతు పెడితే కంఠం పెగలదు. ఇక ఎస్పీకి కూడా ప్రాణసంకటమే. మొత్తం యుపిని పాలిస్తున్న ఎస్పీ యుపిని నాలుగు ముక్కలు చేయడానికి ఎందుకు ఒప్పుకుంటుంది? యుపితో బాటు తెలంగాణకు లింకు వుందంటే రెండిటి విభజనను ప్రతిఘటిస్తుంది. 'వారి మద్దతు లేకుండా బిల్లు ఎలా పాసవుతుంది?' కాంగ్రెస్ నంగనాచి కబుర్లు చెపుతుంది. ఇక్కడ ఓట్లు వున్నాయి కాబట్టి యిలాటి డొంక తిరుగుడు కాంగ్రెస్‌కు అవసరం కానీ ఎస్పీకి కాదు. తెలంగాణను అడ్డుకుంటే నష్టపోయేది ఏమీ లేదు, మన రాష్ట్రంలో వాళ్లకు ఓట్లు లేవు కాబట్టి! కాంగ్రెస్ హై కమాండ్ రేపోమాపో గూరా? వాళ్ల చేత, విదర్భ వాళ్ల చేత కూడా స్టేటుమెంట్లు యిప్పించినా ఆశ్చర్యపడవద్దు.

'ఇఫ్ యూ కాన్ట్ కన్విన్స్, కన్‌ఫ్యూజ్..' అని సామెత. ప్రత్యేక తెలంగాణ అడిగేవారికి హై కమాండ్ నచ్చచెప్పలేకపోతోంది. ఇది పని కాదని ఈ హైదరాబాదు సమస్య, రాయలసీమ సమస్య పట్టుకుని వచ్చి ముందు పెట్టింది. టిజి వెంకటేష్ చూడండి 'విభజన దిశగా అడుగులు పడుతున్నాయి, మన రాయలసీమవాళ్లు మేలుకోవాలి, లేకపోతే నీళ్లు లేకుండా పోతాం' అని బెదరగొట్టసాగారు. ఇక రేపట్నుంచి రాయలసీమలో కూడా ప్రదర్శనలు, హైవే పై విందు భోజనాలు, ఉపవాసదీక్షలు ప్రారంభం కావచ్చు. హైదరాబాదులేని తెలంగాణ శిరసు లేని మొండెం లాటిది అని వారం రోజులపాటు అనిపించాక వరంగల్‌ను రాజధానిగా చేస్తారట అన్న చిన్న లీక్ యిచ్చారంటే చాలు, వరంగల్ రియల్ ఎస్టేటువాళ్లు రెచ్చిపోతారు. కాకతీయవైభవాన్ని గుర్తు చేసి వరంగల్‌ను రాజధాని చేయాలంటారు, వెంటనే కోటిలింగాలను, శాతవాహనులను గుర్తు చేసి కరీంనగర్ వాళ్లు తమది రాజధాని చేయాలంటారు. ఆంధ్రప్రాంతంలో విజయవాడ, గుంటూరు, వైజాగ్, కర్నూలు, తిరుపతి.. అంటూ చాలా పేర్లు వస్తాయి. రాయలసీమ విడిపోతే రెండు పేర్లు తగ్గినా తక్కినవాళ్లు గోలచేస్తారు. హైకోర్టు బెంచ్ కోసం గుంటూరు వాళ్లు అడగగానే అరడజను చోట్లనుండి అలాటి డిమాండ్లే వచ్చాయి. ఏకంగా రాజధాని అంటే యింకో డజను చోట్లనుండి వస్తాయి.

ఇలా రాష్ట్రమంతా రాష్ట్రమనో, రాజధాని అనో గొడవలు మొదలెట్టడమే హై కమాండ్‌కి కావాలి. 'చూశారా, యిది ఎంత పెద్ద సమస్యో! అందుకే కాస్త ఓపిక పట్టమన్నాం' అనేసి వాయిదా వేసేయవచ్చు. 'ఇంకెన్నాళ్లు యీ వాయిదాలు, చప్పున తేల్చేయక..' అని మీరూ నేనూ అనుకోవచ్చు. చేతిలో అధికారం వుండి వుంటే మనమూ తటపటాయిస్తాం. ఎందుకంటే నిర్ణయం తీసుకుంటే కలిగే లాభం ఏదీ అక్కడ కనబడటం లేదు. త్యాగం మనది, ఫలం యింకొకరిది.. అంటే మనం ముందుకు అడుగేస్తామా? కాంగ్రెస్సూ అంతే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 19** **ఎమ్బీయస్ : తెలుగు ముచ్చట్లు 06**

కాకతాళీయ న్యాయం అంత పాప్యులర్ కాని న్యాయం మరొకటి వుంది. అశోకవనికా న్యాయం అని! రావణుడు సీతను తీసుకెళ్లి అశోకవనంలోనే ఎందుకు వుంచాలి? అతని రాజమహలు లోని అనేక వనాలు, ఉపవనాలు, ఉద్యానవనాలు వుండి వుండవచ్చు. బాగా నీడ యిచ్చేవో, చల్లగా వుండేవో, ఏదో ఒక వనంలో పెట్టి వుండవచ్చు. కానీ అశోకవనంలోనే ఎందుకు వుంచాడు? అంటే యితమిత్థమని కారణం చెప్పలేం. సమానబలం గల అనేక సాధనాలు వుండగా వాటిలో ఏదో ఒక సాధనాన్ని ఎందుకు అవలంబిస్తాం? రాముడు, కృష్ణుడు, నారసింహుడు, శివుడు, గణపతి, హనుమంతుడు.. యిలా అనేకమంది దేవుళ్లు వున్నారు. కానీ వారిలో ఎవరో ఒకరినే మనం ఎక్కువగా యిష్టపడతాం. ఎందుకు? చెప్పలేం. అలాటి సందర్భాల్లో 'అశోకవనికా న్యాయం' అనే లాజిక్‌ను ఉ పయోగించవచ్చు.

ఇక్కడ అసందర్భంగానైనా కాస్త సమాచారం యిస్తాను – సీత అశోకవనంలో వుండేదని మనం విన్నాం, దానిలో ఏ చెట్టు కింద వుండేది? అశోకవనం అన్నారు కాబట్టి అశోకా చెట్టు కింద వుంటుంది అనుకుంటాం. అశోకా చెట్టు అంటే మనకు తెలిసినది – పెద్ద పెద్ద భవనాల పక్కన, పార్కుల్లో వేసే పొడుగాటి చెట్టు. దాని ఆకులు గుబురుగా ఏమీ వుండవు. దాని కింద కూర్చుంటే నీడ వుండదు. మరి దాని కింద సీత ఎలా కూర్చుంది, పైన గుబురుగా లేకపోతే హనుమంతుడు ఎవరికీ కనబడకుండా ఎలా కూర్చోగలిగాడు? అన్న సందేహం వస్తుంది. ఆవిడ కూర్చున్నది శింశుపా వృక్షం కింద. దానికి యింకో పేరు శింశపా, పిచ్చిలా.. ! తెలుగులో యిరుగుడు చెట్టు అంటారు. 'అశోకా' కు అమరకోశం యిచ్చిన నానార్థాలు – రోహిణీ, కటంభరా, కృష్ణభేదీ, వక్రాంగీ, శకులలాదనీ.. దాన్నే అశోకరోహిణీ అని కటుకరోహిణీ అనీ అంటారట. ఇంగ్లీషులో – హెల్లెబోర్. అశోకవనంలో అశోక చెట్లు కాకుండా శింశుపా చెట్లు వుండడమేమిటి? అనుకుంటూ వాల్మీకి రామాయణంలోని సుందరకాండ అనువాదం చూశాను –

అనేక పూలతీగెలు అల్లుకుని, విరగపూసి దట్టముగా ఆకులు కమ్ముకుని వున్న శింశుపా వృక్షం మీద దాగుని కూర్చున్న హనుమంతుడు అశోకవనం కలయ చూసి – ''ఈ అశోకవనం మహా రమణీయంగా వుంది. సంపంగి చెట్లూ, చందనపు చెట్లూ, పొగడచెట్లూ, కొండగోగి చెట్లూ, పొన్న చెట్లూ, ఏడాకుల అరటిచెట్లూ, విరిగి చెట్లూ.. ఎంతో శోభాయమానంగా వున్నాయి...వందలకొద్దీ అశోకవృక్షాలు విరగపూసి సూర్యోదయ కాంతులతో తేజరిల్లుతూ మండిపోతున్నవా అన్నట్టు కనిపించాయి. అవి మొదలునుంచి చివరివరకూ పూలు విరగపూసి వున్నాయి.'' అనుకున్నాడు – అని వుంది. అంటే అశోకవనంలో అశోకవృక్షాలు ఎక్కువగా వున్నా తక్కిన వృక్షాలు కూడా చాలా వున్నాయన్నమాట. మనం చూసే అశోకాకు పూలెక్కడుంటాయి అనుకుంటూ గూగుల్‌లో అశోకా అనీ హెల్లెబోర్ అని కొట్టి యిమేజెస్ చూస్తే వేరే వేరేవి కనబడ్డాయి. చివరకు నాకు తెలిసిన అశోకా చెట్టు వికీపీడియాలో 'ఫాల్స్ అశోకా' అనే పేరాలో కనబడింది. మనం అశోకా అనుకునే చెట్టు వేరు, అశోకవనంలో వున్న అశోకవృక్షాలు వేరు అని తెలిసి సందేహం విడింది.

---

ఏదైనా పరువు తీసే పని చేస్తే నామర్దా అంటాం. ఇది ఫార్సీ పదం 'మర్ద్' నుండి వచ్చినది. మర్ద్ అంటే మగవాడు. నామర్ద్ అంటే మగవాడు కాడు, నపుంసకుడు. మగవాడికి ధైర్యం వుండి తీరాలి కాబట్టి ధైర్యం లేని పిరికివాణ్ని కూడా నామర్ద్ అంటారు. మగవాడు చేయదగని పనిని నామర్దీ అంటారు.  మగతనం అనగానే గౌరవం, పరువు, ప్రతిష్ఠ గట్రా వుండి తీరాలి అనే భావనలోంచి తెలుగువాళ్లు 'నామర్దా'ను తీసుకున్నారు. గౌరవప్రదం కాని, అవమానకరమైన, సిగ్గుచేటు పని అనే అర్థాలు వున్నాయి యీ మాటకు. ఈ భావాన్ని 'జెండర్ స్పెసిఫిక్' చేయకుండా ఆడవాళ్లకు కూడా వర్తింపచేస్తున్నాం కాబట్టి ధైర్యం, పరువు, మానాభిమానాలు వగైరా ఆడవాళ్లకు కూడా వుంటాయనీ, వుండాలనీ ఒప్పుకున్నట్టే!

---

**మీ పదసంపద 04**

(మీ పద సంపద 03 సమాధానాలు – 1.సి 2.డి 3.డి 4.ఎ 5.సి 6.సి 7.డి 8.ఎ 9.డి 10.బి)

01. మనవాసి (''దేవదాసు''లో 'ఓ దేవదా...' పాటలో వస్తుంది) – ఎ.సిగ్గు బి. అభిమానం సి. మన గొప్పతనం డి. ధోవతి

02. వంత (''దేవదాసు''లో 'అంతా భ్రాంతియేనా...' పాటలో వస్తుంది) – ఎ.ప్రేమ బి. జ్ఞాపకము సి. సరే డి.సంతాపము

03. నెలవు (''దేవదాసు''లో 'చెలియలేదు..' పాటలో వస్తుంది) – ఎ.స్నేహము బి. అభిప్రాయము సి. దారి డి. ఉండేచోటు

04. లాయిరి (లాహిరి) (''దేవదాసు''లో 'కుడి ఎడమైతే...' పాటలో వస్తుంది) – ఎ.మైకము బి. సముద్రపు పోటు సి. నట్టనడుమ డి.నావ

05. పెన్నిధానము (''దేవదాసు''లో 'తానే మారెనా...' పాటలో వస్తుంది) – ఎ.నిజము బి.పెద్ద దానము సి.గొప్ప నిధి డి. నెమ్మది

06. వాదర (''కీలుగుఱ్ఱం''లో 'ఎంత కృపామతివే..' పాటలో వస్తుంది) – ఎ.పిడి బి.మొన సి. అంచు డి.కాంతి

07. ఉప్పెన (''నువ్వు నాకు నచ్చావు''లో 'ఒక్కసారి చెప్పలేవా' పాటలో వస్తుంది) – ఎ.పెద్దది బి. ఊపిరి సి.చిటికెడు డి. సముద్రపు పొంగు

08. ఊసులు (''ఆనంద్ం''లో 'ప్రేమంటే ఏమిటంటే..' పాటలో వస్తుంది) – ఎ.కాలక్షేపం కబుర్లు బి. ఊహలు సి. ఆటలు డి. ఆశలు

09. మిసిమిసి (''జాబిలి''లో 'రండి బాబూ..' పాటలో వస్తుంది) – ఎ.మెత్తని బి. నునుపైన సి. వంపులు తిరిగే డి. కాంతులీనే

10. ఇల (''జాబిలి''లో 'వయసు తలుపు..' పాటలో వస్తుంది) – ఎ.భూమ్యాకాశాలు కలిసే చోటు బి. భూమి సి. ప్రకృతి డి. ఆకాశం వంపు

(మీ పద సంపద 04 సమాధానాలు – 1.సి 2.డి 3.డి 4.ఎ 5.సి 6.సి 7.డి 8.ఎ 9.డి 10.బి) **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 20** **ఎమ్బీయస్ : చివాట్లు తిన్నారా?**

మీడియా రెండు, మూడు రోజులుగా ఒకటే పాట పాడింది – ఆంధ్రప్రాంతపు మంత్రులు వెళ్లినపుడు వాయలార్ రవి, ఢిల్లీ నాయకులు చీదరించుకున్నారు! 'తెలంగాణ యివ్వడానికి నిశ్చయించుకున్నాక యిప్పుడా మీరు రావడం? ఇవ్వకపోతే తెలంగాణలో పార్టీ కాపాడుకోవడం అసంభవం అంటున్నారు టి–కాంగ్రెస్‌వాళ్లు. ఇస్తే 15 సీట్లు వస్తాయంటున్నారు. మీరేమో వచ్చి ఇవ్వద్దంటున్నారు,

సరే యివ్వం, మరి కోస్తా, సీమల్లో మీరు ఎన్ని సీట్లు తేగలరు? వైకాపాను ఎదిరించగలరా? మీ దగ్గర ఉద్యమమే లేదు. మీరు ఢిల్లీ వచ్చి మా తలకాయ తినడం అనవసరం' అన్న ధోరణిలో చివాట్లేశారని ప్రచారం జరిగింది. దీనికి మూలం ఏమిటీ అంటే – టిజి వెంకటేశ్ 'తెలంగాణ యిచ్చేస్తారని మాకు అనిపించింది' అనడం. అసలు యిప్పటిదాకా ఆయన రాజకీయంగా ఒక్క తెలివైన మాట అనగా నేను వినలేదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారులను ఖండించడానికి ఆయన నోరు విప్పినప్పుడల్లా ఏదో ఒకటి అభావంగా మాట్లాడి అభాసుపాలు కావడం తప్ప జరిగింది లేదు. వాయలార్ ఏమన్నారో, టిజి ఏం విన్నారో వాళ్లకే తెలియాలి. మనకు తెలియదు కాబట్టి ఆ మాటలు అని వుంటారా లేదా అన్న విషయంపై ఆలోచిద్దాం.

'సమైక్యాంధ్ర వుద్యమం లేదు' అన్న పాయింటుకి వస్తే – అవును. లేదు. అక్కడ ఉప ఎన్నికలలో కూడా అది ఒక అంశంగా లేనే లేదు. జగన్‌కి ఓటేస్తే రాష్ట్రం విడిపోతుంది అని కాంగ్రెస్ నాయకులు భయపెట్టినా ఆంధ్రప్రాంతంలో జగన్ పార్టీకే సీట్లు ఎక్కువగా వచ్చాయి. విడిపోయినా ఫర్వాలేదు అనుకున్నారా? లేక విడిపోయే ప్రశ్నే లేదు, అంతదాకా వస్తే అప్పుడే చూసుకుందాం అన్న ధీమాతో వున్నారా? తెలియదు. ఆలోచిస్తే రెండోదానికే ఎక్కువ ఛాన్సుంది. ఎందుకంటే కృష్ణ కమిటీ వచ్చినపుడు ఆ ప్రాంతాలన్నీ సమైక్యానికే జై అన్నాయి కాబట్టి! విడిపోదు, విడిపోయే పరిస్థితి వస్తే మనకు ఏదో ఒకలా లాభం చేయందే విడగొట్టరు అన్న ధైర్యమే కోస్తా, సీమల్లో కనబడుతోంది. అలాటప్పుడు ఉద్యమం ఎందుకు చేస్తారు వాళ్లు? ఆ టైములో వేరే లాభసాటి పని చూసుకుంటారు. మార్పు కోరేవాడు ఉద్యమిస్తాడు కానీ యథాతథ పరిస్థితి కొనసాగాలని కోరేవాడు ఎందుకు ఉద్యమిస్తాడు? జార?ండ్, గూరా?లాండ్, బుందేల్‌ఖండ్, విదర్భ.. వీటన్నిటిలో అవి కావాలని కోరుకునేవారు ఆందోళన చేస్తున్నారు తప్ప, తక్కిన ప్రాంతాలవాళ్లు చేయటం లేదు కదా! గూరా?లాండ్ ఉద్యమ తీవ్రత తెలియాలంటే కలకత్తాలో ఏమీ తెలియదు. సిలిగుడికి వెళితేనే అక్కణ్నుంచి గూరా?వాళ్ల సైన్ బోర్డులు సైతం మార్చేసిన వైనం తెలుస్తుంది. అందువలన మీ దగ్గర ఉద్యమం ఎందుకు చేయడం లేదు అన్న ప్రశ్న అడిగి వుండకపోవచ్చు. అడిగినా వీళ్ల దగ్గర యీ సమాధానం రెడీగా వుంటుంది.

ఇక రెండోది – ఇన్నాళ్లూ ఏం చేశారు? అన్నది. ఏం చేస్తారు, ఏం చేయాలి? 'అంతా మాకు వదిలేయండి' అని హై కమాండ్ అంటేనే కదా వీళ్లు వూరుకున్నది. కోస్తా, సీమల నుండి ఎవరో ముగ్గురు నలుగురు నోరు చేసుకోవడం తప్ప తక్కినవాళ్లందరూ సంయమనం పాటిస్తూనే వున్నారు. 'నెల్లాళ్లలో ఫలితం చెప్తాము'ని షిండే గారనడం, వారానికే ఢిల్లీ ట్రిప్ కొట్టి వచ్చిన టి నాయకులు 'తెలంగాణ ఇచ్చేశారు, ఇక ఆంధ్ర ప్రాంతీయులు రాజధాని వెతుక్కోవడం ఒక్కటే తరువాయి..' అని చెప్పనారంభించడంతో వీళ్లు కంగారుపడి వెళ్లారు. అరిచ్చచ్చినా తెలంగాణ యివ్వరు అని లగడపాటి గొంతు చించుకుంటున్నా వీళ్ల భయాలు వీళ్లవి, కళ్లముందు డిసెంబరు 9 నాటి బర్త్‌డే కేక్ కోత కదలాడి వుంటుంది. అందుకని వచ్చి 'మరి మా సంగతేమిటి సార్?' అని అడగడానికి వెళ్లి వుంటారు.

ఇక మూడో అంశం – 'తెలంగాణ యిస్తే 15 ఎంపీ సీట్లు కొట్టుకొస్తాం' అన్న టి–కాంగ్రెస్ వారి హామీని హై కమాండ్‌వారు నమ్మారనుకోవడం. ఇలా చెప్పేవాళ్లలో గుత్తా, మందా వేరే మందలోంచి గుత్తగా కొట్టుకొచ్చారన్న సంగతి వాళ్లకీ గుర్తుండి వుంటుంది. అణు బిల్లు సందర్భంగా టిడిపి నుంచి గోడ దూకి వచ్చినవారు వారు. అంతే సునాయాసంగా ఇక్కణ్నుంచి తెరాసలోకి దూకగలరనీ తెలుసు. మధు యాష్కీకి రాజకీయంగా మూలాలే లేవు. ఎన్నికల వేళ విదేశాలనుండి దిగుమతి అయ్యారు. చచ్చినా బతికినా కాంగ్రెస్‌లోనే అనేటంత కమిట్‌మెంట్ ఏమీ లేదు. ఇక కేకే గురించి చెప్పాలంటే ఆయన మారిన పార్టీల సంఖ్య ఎంతో ఆయనే చెప్పలేరు. పొన్నం కూడా గతంలో యిండిపెండెంట్‌గా కాంగ్రెస్‌పై పోటీ చేసిన వ్యక్తే. వివేక్ తండ్రి కాంగ్రెస్‌వాదే అయినా తనను రాష్ట్రపతి చేయలేదని సోనియాను తిట్టిపడేశారు. వివేక్ కూడా రాజకీయాల్లోకి యీ మధ్యే వచ్చారు. వీళ్లందరూ కలిసి 'మేం తెలంగాణ గెలుచుకుని వస్తాం' హై కమాండ్ నమ్మేస్తుందా? సగం సీట్లు గెలిచే అవకాశం వున్న తెరాస లేదా? తెలంగాణకు జై అంటూ లేఖ యిచ్చిన టిడిపికి అస్సలు సీట్లు రాకుండా పోతాయా? బాబు పాదయాత్రకు, పార్టీ నిర్మాణవ్యవస్థకు, పార్టీల పట్ల బిసిలలో వున్న అభిమానం – వేటికీ ఓట్లు పడవా? 'కోస్తా, సీమల్లో జగన్‌ను ఎదిరించి ఎన్ని సీట్లు తేగలరు?' అని వయలార్ ఎద్దేవా చేశారంటున్నారు. జగన్‌కు తెలంగాణలో మాత్రం బలం లేదా? పరకాలలో తన తడాఖా చూపించలేదా? జనరల్ ఎన్నికల్లో అతని పార్టీకి తెలంగాణలో ఒక్క ఎంపీ సీటు కూడా రాదని టి కాంగ్రెస్‌వాళ్లు చెప్పడం, చెప్పినా దాన్ని హై కమాండ్ నమ్మడం – జరుగుతుందా?

టిజి వెంకటేష్ ఏం అర్థం చేసుకుని ఏం చెప్పారో తెలియదు కానీ దాని వలన కోస్తా, సీమల్లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఎలర్ట్ అయ్యారు. కండల ప్రదర్శన మొదలుపెట్టారు. ఏదో అయిపోతోందనుకుంటూ టిడిపి పక్షాన పయ్యావుల కేశవ్, సుధీష్ రాంభొట్ల వంటివారు కూడా గొంతెత్తారు. వైకాపా నుండి కూడా గుర్నాధరెడ్డికి తోడు శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ వంటి రెండు మూడు గొంతులు లేచాయి. బాధ్యతంతా కేంద్రానిదే, కానీ మా ప్రాంతానికి అన్యాయం జరిగితే వూరుకోం అంటున్నారు. అంతా కలిసి డిసెంబరు 10 నాటి స్థితికి తీసుకుని వచ్చేట్టున్నారు. అప్పుడు లేవనెత్తని కొత్త సమస్య – హైదరాబాదు స్వతంత్ర ప్రతిపత్తి కూడా కలిపారు. 'ఇలాటి సున్నితమైన పరిస్థితుల్లో ఏ నిర్ణయమూ తీసుకోలేం' అంటూ కాంగ్రెస్ వెనక్కి తగ్గవచ్చు. బహుశా అలా తగ్గడానికి సరైన కారణం సృష్టిద్దామనే ఢిల్లీ నాయకులు యిలా మాట్లాడేరేమో కూడా ఆలోచించాలి. జయపూర్‌లో తెలంగాణపై ఏదో ప్రకటన చేస్తారన్న వూహాగానాలు మీడియాలో వచ్చాయి. ఎజెండాలో లేదు కదా అన్నా, అబ్బే చివరి నిమిషంలో పెట్టవచ్చు

అంటూ వచ్చారు. వర్కింగ్ కమిటీలో కూడా చర్చే లేదు అన్నారు ఆజాద్. రెండు రోజులు గడిచాయి. ఈ రోజంతా రాహుల్ భజనతోనే సరిపెట్టి చివరిలో చప్పట్లు కొట్టేస్తారు తప్ప తెలంగాణ గురించి డిస్కస్ చేస్తారన్న నమ్మకం నాకు లేదు.

మరి జనవరి 28 న ఏం చేయబోతారు? ఏదో ఒక ప్రతిపాదన మన ముందు పెట్టి 'దీనిపై అన్ని పార్టీలన్నీ ఆలోచించి పెట్టుకోండి. దీనిపై అందరూ ఏకాభిప్రాయానికి వచ్చిన రోజున మళ్లీ కూర్చోవచ్చు' అనవచ్చు. ఇక మన మీడియా వాళ్లకు, నాయకులకు పండగే పండగ. హైదరాబాదు విడగొడితే ఏమవుతుంది? ...గొట్టకపోతే ఏమవుతుంది? ఆంధ్రకు రాజధాని ఏది? తెలంగాణకు రాజధాని ఏది? ముల్కీ రూల్స్ మళ్లీ తేవాలా? పోలవరం ఆపాలా?.. యిలా సవాలక్ష ప్రశ్నలతో ఎన్నికలు వచ్చేదాకా ఏదీ తేల్చకుండా టీవీలో చర్చలు.. నా బోటి వాళ్ల వ్యాసాలూ...! ఈ అంతులేని వింత కథ ఎంతకాలం సాగుతుందో కదా! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 21 ఎమ్బీయస్ : ..ప్లస్ వన్ వేసుకోండి, కేకే గారూ**

వెయ్యిమంది చావులకు బాధ్యత మాదే.. అన్నారు కేకే. తెలంగాణ అంశంపై శనివారం సిపిఐ ఏర్పాటు చేసిన సామూహిక ధర్నాలో మాట్లాడుతూ ఆయన యీ వ్యాఖ్య చేశారు. కేకే జోకులకు ప్రసిద్ధి కానీ అవేళ సమావేశంలో ఆయన్ని మించి కొందరు జోకులేశారు.

సిపిఐ నారాయణగారు వుండగా కేకే చాలరని అందరికీ తెలుసు. ఎవరికీ అర్థం కాకుండా మాట్లాడడంలో కేకే సమర్థులు. నారాయణ మాట్లాడేది అందరికీ అర్థమవుతుంది. అదీ బాధ. ఆయన ముతక భాష, తిట్లు, నీచోపమానాలు వెగటు పుట్టిస్తాయి. గతంలో కమ్యూనిస్టు నాయకులంటే వాగ్ధాటికి మారుపేరు. స్వయంగా ఎంతో మేధావులైనా కార్మికుల స్థాయికి, శ్రామికుల స్థాయికి దిగి వచ్చి ఎంతో క్లిష్టమైన విషయాలు సైతం అర్థమయ్యే భాషలో చెప్పేవారు. అటువంటి పార్టీలో యీ స్థాయికి ఎదిగిన నారాయణగారు ఎటువంటి భాష మాట్లాడుతున్నారంటే – ఏదో ఒక రోజున భాష కారణంగా అక్బరుద్దీన్‌పై పెట్టినట్టు ఆయన్నీ రాష్ట్రంలో పది ఊళ్లలో కేసులు పెట్టించి గడపగడపా కోర్టులు తిప్పాలి. కోర్టులో కూడా రెచ్చగొట్టించి ఆయన చేత ఏదో అనిపిస్తే కంటెప్ట్ ఆఫ్ కోర్టు కింద మరో కేసు కావాలి.

నారాయణగారి మీద ఆశ ఎప్పుడో వదిలేశాం కానీ అదే సభలో సురవరం సుధాకరరెడ్డి కూడా వింతగా మాట్లాడడం ఆశ్చర్యకరంగా వుంది. ఆయనకు 1956కు పూర్వం వున్న హైదరాబాదు కావాలట. శాస్త్రీయంగా రాజకీయాలు అధ్యయనం చేయని ఫ్లయ్ బై నైట్ రాజకీయ నాయకులో, ఆవేశంలో వున్న విద్యార్థులో యిలా మాట్లాడితే పోన్లే పాపం అనుకోవచ్చు. నోరెత్తితే గతితార్కిక భౌతికవాదం జపించే కమ్యూనిస్టు లీడరు గడియారాన్ని వెనక్కి తిప్పమని అడగడం ఏమిటి? జారు చక్రవర్తి వారసులు వచ్చి 1900 నాటి రష్యాను తనకు అప్పగించమని అడిగినా, బ్రిటిషు వాళ్లు వచ్చి 1945 నాటి ఇండియా కావాలన్నా, నిజాం వారసులు వచ్చి 1947 నాటి హైదరాబాదు రాజ్యం కావాలన్నా, తమిళనాడు వాళ్లు వచ్చి 1952 నాటి మద్రాసు రాష్ట్రం కావాలన్నా యీయన ఏమంటారు? 1956 నాటి హైదరాబాదు రాష్ట్రం కావాలట యీ పెద్దమనిషికి! వెళ్లి మహారాష్ట్రలో, కర్ణాటకలో కూడా ఆందోళనలు చేపట్టమనండి. పనిలో పనిగా గుజరాత్‌లో చేపట్టి 'వెళ్లి మహారాష్ట్రలో కలవండి' అని చెప్పమనండి.

అంతెందుకు 1956లో ఉన్నంత మంది కమ్యూనిస్టు శాసనసభ్యుల్ని, పార్లమెంటు సభ్యుల్ని తెచ్చుకోమనండి చూదాం. అప్పుడు మన రాష్ట్రంలో కాంగ్రెస్ తర్వాత బలమైన స్థానం కమ్యూనిస్టులదే. ఇప్పుడు! కాంగ్రెస్ కున్న స్థానాల్లో వందో వంతు కూడా స్థానాలు లేవు. సింగిల్ డిజిట్‌లో పడి కొట్టుకుంటున్నారు. మరి చూడబోతే ఈయన దేశస్థాయిలో పార్టీకి ప్రధాన కార్యదర్శి. తెలంగాణలో ఓ రెండు సీట్లు అదనంగా వస్తాయేమోనన్న దురాశతో యింత తర్కం తప్పి మాట్లాడడమా?

ఆయన చేసిన యింకో వాదం – మతకల్లోలాలు సృష్టించాలనే కుట్రతోనే హైదరాబాదులో రెఫరెండం ప్రస్తావన తెస్తున్నారనడం! రెండింటికి సంబంధం ఏమిటో నాకైతే అర్థం కాలేదు. రెఫరెండం జరుపుతారా లేదా అన్నది వేరే విషయం. కలిసి వుండాలో, అక్కరలేదో నిర్ణయించుకునే హక్కు తెలంగాణ ప్రజలకుందని వాదించేవారు, ఆ హక్కు హైదరాబాదు వాసులకు కూడా వుందని ఒప్పుకోవాలన్న అంశంతోనే రెఫరెండం మాట వచ్చింది. కెసియార్ దానికి రెడీ అన్నారు. అంటే ఆయన కూడా మతకల్లోలాలు సృష్టించాలని కుట్ర పన్నుతున్నారా? ప్రజాభిప్రాయ సేకరణకు రాజ్యాంగం ఒప్పుకోకపోయినా, అటువంటి ఆలోచనను సిద్ధాంతపరంగా ఎలా తప్పు పట్టగలం?

ప్రజల అభిప్రాయం పట్టించుకోనక్కరలేదు, పాలకుల అభిప్రాయమే వారిపై రుద్దాలి – అని వాదించడానికి మనదింకా కమ్యూనిస్టు రాజ్యం కాలేదు కదా. సురవరం, నారాయణ వంటి వారు ఆశించే, శ్రమించే కమ్యూనిస్టు పాలన వచ్చాక అప్పుడెలాగూ ప్రజాభిప్రాయ సేకరణ వుండదు. పట్టించుకోవడమూ వుండదు. ఎన్నికలూ వుండవు. వారిలాంటి పాలకులు మాట్లాడేదే వేదం. నారాయణగారి సూక్తులే మనకు పాఠ్యపుస్తకాలుగా వెలుస్తాయి. ఆ భాషే, ఆ బూతులే నిర్బంధవిద్యగా మన పిల్లలకు నేర్పుతారు. ఆ రోజు వచ్చేదాకా మనం కాస్త ఊపిరి పీల్చుకోవచ్చు కదా, యిలాటి వ్యాసాలు రాసుకునే వెసులుబాటు వుంది కదాన్న ఆశతో బతుకుతున్నాం. అందువలన రెఫరెండం అంటే కమ్యూనిస్టు వాళ్లలా మనం ఉలిక్కిపడవలసిన అవసరం లేదు. దాని వెనకాల మతకల్లోలాల

కుట్రలుంటాయని మనకు భయం వేయటం లేదు.

ఇక కేకే ! తెలంగాణ కోసం జరిగే ఆత్మహత్యలకు కారణం మీరంటే మీరని అందరూ అనుకుంటూ వుంటారు. కానీ కేకే గారు చెప్పేశారు – 'వారూ వీరూ కాదు, మేమే కారణం' అని. 'వెయ్యిమంది చనిపోవడానికి మేమే బాధ్యత వహించాలి' అన్నారు కేకే. ఈ మేమే 'తెలంగాణ నాయకులు' అని అర్థంలో కాదనుకుంటా. కాంగ్రెస్ పార్టీ అని భావం కాబోలు. అసలు అంకె అంటూ కరక్టుగా తేలితే దానికి బాధ్యులెవరో ఆలోచించవచ్చు. ఈ తెలంగాణ అమరవీరుల సంఖ్య అనేది హైదరాబాదు ఆటో మీటరులా అనుక్షణం పరుగులు పెడుతూ మారుతూనే వుంటుంది. పైగా ఏ రెండు ఆటో మీటర్లూ ఒకే ఫిగర్ చూపించనట్లు అమరవీరుల సంఖ్య కూడా నికరంగా యిది అని ఎవరూ చెప్పలేరు. మల్టిపుల్ ఛాయిస్ యిస్తే ఒక్కోళ్లు ఒక్కో అంకె దగ్గర టిక్ పెడతారు. నాకు తెలిసి అందరూ కష్టపడి ఆరువందల దాకా లాక్కుని వచ్చారు. ఆ తర్వాత ఒకటి రెండు చావులు రిపోర్ట్ కాగానే ఛటుక్కున ఏడు వందలకు జంప్ అయింది. ఏడు వందల తర్వాత ఎనిమిది వందలు, తొమ్మిది వందల స్టాప్‌ల వద్ద ఆగకుండా ఏకంగా వెయ్యి దగ్గరకు తీసుకుని వచ్చేశారు.

ఏదో సినిమాలో యిలాటి రౌండింగ్ ఆఫ్ మీద జోకుంది. రౌండ్ చేస్తున్నా అంటూ మరీ పెద్ద అంకె చెప్తాడు హీరో. అదేమిటండీ అని హీరోయిన్ అడిగితే 'దానిలో రౌండ్లు ఎక్కువున్నాయి కదండీ' అంటాడు. అలాగ వెయ్యిలో మూడు సున్నాలున్నాయన్న అంశం వీళ్లందరినీ బాగా ఆకట్టుకుంది. సోషియాలజీలో రిసెర్చ్ చేసేవారెవరైనా తెలంగాణ ఉద్యమం మొదలైన దగ్గర్నుంచి పేపర్లు చూసి ఆత్మహత్యలను సరిగ్గా లెక్కపెడుతూ వస్తే అసలైన ఫిగర్ తెలిసేది. కేకే గారికి, వారి అనుయాయులకు గాని (ఎవరైనా వున్నారంటారా?) అంతటి ఓపిక లేదు. 'తెలంగాణలో వెయ్యి చావులకు కారణం మేమే' అనేశారు. తెలంగాణలో జరిగిన హత్యల్నీ, రకరకాల ఆత్మహత్యల్నీ కూడా కలిపి లెక్క చెపుతూ వుంటే తమ యింట్లో జరిగిన సంఘటనను కూడా కలిపి వెయ్యినొక్కటి అంటే బావుంటుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 22 ఎమ్బీయస్ : మానిఫెస్టోల కింత వేల్యూ వుందా!?**

సమైక్యవాదులు ఢిల్లీ వెళ్లినపుడు షిండేగారు 'మనవాళ్లు మానిఫెస్టోలో ఏం చెప్పారు?' అని వాకబు చేశారని విని ఆశ్చర్యం కలుగుతోంది. చచ్చి ఏ లోకాన వున్నాడో కానీ బాల్ థాకరే అనేవాడు – మానిఫెస్టోలు వట్టి దండగ, తయారుచేసేవాళ్లూ చదవరు, ఓటేసేవాళ్లూ చదవరు, అందుకే నా పార్టీ తరఫున మానిఫెస్టోలు రిలీజ్ చేయను – అని. మానిఫెస్టో తయారుచేసే పని ప్రణబ్‌లా అర్థం కాకుండా రాయగలిగే యిద్దరు ముగ్గురు ఘనులకు అప్పగిస్తారు. ఎన్నికలలో నిలబడిన అభ్యర్థుల కెంతసేపూ మొదట్లో టిక్కెట్ల గోల, తర్వాత నియోజకవర్గంలో గెలిచే గోల. మధ్యలో మానిఫెస్టో చదువుతూ కూర్చోవడానికి టైమెక్కడ? ప్రచారానికి వెళ్లినపుడు ఓటర్లు ఏదైనా కోరితే 'ఆగండాగండి, మానిఫెస్టోలో వుందో లేదో చూసి, చదివి అప్పుడు ఔననో కాదనో చెప్తాను' అనే అభ్యర్థి ఎవడూ వుండడు. 'ఓకే, తప్పకుండా, చేసేద్దాం..' అనే అంటారు. ఇక ఓటర్లు – సభలో ఎవరైనా ఎడాపెడా వాగ్దానాలు చేస్తూ వుంటే 'సార్, యిది మీ మానిఫెస్టోలో లేదే. ఎలా అమలు చేస్తారు?' అని అడగడు. ఓటేశాక మీరెల్లి ఫలానా పార్టీకి ఓటెందుకు వేశావ్? అంటే 'మానిఫెస్టో చదివి...' అనడు. 'నేను ఆ పార్టీ అభిమానిని... సెంటిమెంటు.. జాలి... సేమ్ కులం... పాపం డబ్బిచ్చారు..సారా పోసారు... అయినా అవతలివాడు దొంగ... నమ్మకద్రోహి.. నాకు అసహ్యం...' ఇలాటి కారణాలే.

ఇలా ఎవరికీ అక్కరలేని మానిఫెస్టో యివాళ షిండేగారికి అక్కరకు వచ్చింది. ఎందుకంటే టి–కాంగ్రెస్ నాయకులు వెళ్లి 'తెలంగాణ యిస్తామని మన మానిఫెస్టోలో పెట్టాం కదా, ఇవ్వకపోతే ఎలా? సోనియా గారి పరువు పోదూ..!?' అని చెప్పారు. అక్కడకేదో మానిఫెస్టోలో పెట్టినవన్నీ అమలు చేసేసినట్టు, యిదొక్కటే మిగిలిపోయినట్టూ...! 'తెలంగాణ మాట సరే, మానిఫెస్టోలో తక్కిన అంశాలేమిటో చెప్పండి చూదాం' అని ఆయన అడిగి వుంటే వీళ్లు బిక్కమొగం వేసేవారు. అసలు ఎవరూ చదివే వుండరు. సరే ఏదో ఒకటి అన్నారు కదాని షిండేగారు అది పట్టుకుని ఆంధ్రప్రాంతపు నాయకుల్ని అడిగి వుంటారు. వచ్చిన చిక్కేమిటంటే – కాంగ్రెస్‌వాళు కానీ, టిడిపి వాళ్లు కానీ చేయవలసినది చేయడం లేదు. ఇరు ప్రాంతాల నాయకుల్నీ ఒకే చోట కూర్చోబెట్టి 'అభివృద్ధి, గత చరిత్ర, రాజకీయ పరిణామాలు, చివరకు రాజీమార్గం.. యిటువంటి వాటిపై చర్చించి ఓ నిర్ణయానికి రమ్మన'మని అడగాలి. అది చెయ్యరు. టిడిపిలో అయితే ఎమ్మెల్యేలు, ఎంపీలు చంద్రబాబుగారి దగ్గరకి వెళ్లి తమ అభిప్రాయాలు చెప్పబోతే 'అన్నీ నాకు తెలుసు, లాప్‌టాప్‌లో వున్నాయి. మీరు నాకు చెప్పేదేమిటి, మీ మొహం' అనేస్తారు. అందుకని టిడిపిలో యిలాటి మీటింగులుండవు. చేయాలంటే కాంగ్రెస్ చేయవచ్చు, కానీ చేయదు.

అందువలన యిరు ప్రాంతాలనుండి నాయకులు చలో ఢిల్లీ అని వెళ్లడం, ఒకళ్ల తర్వాత మరొకళ్లు అక్కడి నాయకులను కలిసి రావడం, స్వెట్టర్లేసుకుని ఫోటోలు దిగడం..! ఓ ప్రాంతం వాళ్లు ఒకరి గుమ్మం ఎక్కుతూ వుంటే, మరో ప్రాంతం వారు యింకోరి గుమ్మం దిగుతూ వుంటారు. వచ్చినవాళ్లతో ఏదో ఒకటి మాట్లాడాలి కదాని ఢిల్లీ వాళ్లు 'అవునూ, అవతలివాళ్లు మీ కంటె వెనకబడి వున్నామంటున్నారు... హైదరాబాదు మాటేమిటి అంటున్నారు.., నీటి తగాదాలు వస్తాయంటున్నారు..' అని యాథాలాపంగా అంటారు. వీటన్నిటి గురించి అంకెలతో సహా కృష్ణకమిటీ రిపోర్టు క్షుణ్ణంగా రాసి యిచ్చేసింది. కావాలంటే అదే చదువుకోవచ్చు. కానీ

పలకరింపుగా ఏదో అంటారు. వీళ్ల సమాధానం వింటారన్న నమ్మకం కూడా నాకు లేదు.

ఇక యీ నాయకులు బయటకు వచ్చి 'మేం చెప్పినవి విని హై కమాండ్ ఆశ్చర్యపడింది..' అని టీవీ కెమెరాల ఎదుట చెప్పేసి ఏదో సాధించినట్టు పోజు పెడతారు. జాతీయ మీడియా అసలు వీళ్లను పట్టించుకోనే కోదు. కనీసం పొరుగున వున్న సాటి దక్షిణాది మీడియా కూడా పట్టించుకోదు. ఎంతసేపు చూసినా వాళ్లకు, మనకూ కనబడేది తెలుగు టీవీ మైకులే! అది చూసిన నిలయవిద్వాంసులైన టీవీ విశ్లేషకులు, ప్రజల్లో కంటె స్టూడియోల్లో మసిలే నాయకులు – అమ్మయ్య, రేపటి టీవీలో చర్చకు టాపిక్ దొరికిందని ఆనందించి నిద్రకు ఉపక్రమిస్తారు.

షిండేగారు మన రాష్ట్రానికి గవర్నరుగా వున్నారు. రాజశేఖరరెడ్డిగారితో సన్నిహితంగా మెలిగారు. సమైక్యత పట్ల వైయస్ ఉద్దేశాలు తెలియనివి ఆయనకు కావు. మానిఫెస్టో చదవకపోయినా దానిలో ఏముంటుందో ఊహించలేనంత అమాయకుడూ కాదు. అందువలన 'మానిఫెస్టోలో వుందట కదా' అనడంలో అసలు వీళ్లు ఏమైనా చదివారో లేదో టెస్టింగ్ ఏమో. అలా అనగానే ఉండవల్లి, గాదె వెంకటరెడ్డి చిత్తా విప్పారు తప్ప తక్కినవాళ్లు కళ్లప్పగించి చూశారు. 'మానిఫెస్టోలో తెలంగాణ యిస్తామని వుంటే 'విడిపోతే హైదరాబాదు వెళ్లడానికి వీసాలు కావాలి' అని అన్న వైయస్‌ను ఎవరో ఒక జర్నలిస్టు నిలదీసి అడిగి వుండేవాడు కదా' అనుకున్నారేమో. తెలంగాణ యిస్తామని మానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ యిచ్చిందని చెప్పినవాళ్లను షిండే మళ్లీ పిలిచి అడుగుతారో లేదో చూడాలి మరి.

కాంగ్రెస్ తెలంగాణకు కమిట్ అయిపోయిందని చెప్పడానికి టి కాంగ్రెస్‌వాళ్లు చెప్పే కారణాలు బహువింతగా వుంటాయి. ఒకటి – '2004లో తెరాసతో పొత్తు పెట్టుకున్నామంటే అర్థం... తెలంగాణ యిస్తామనే!' మరి అదే సమయంలో లెఫ్ట్‌తోనూ పొత్తు పెట్టుకున్నారు. అంటే కమ్యూనిస్టుల్లాగే కార్మికరాజ్యం తెస్తామని కమిట్‌మెంటా? అసలు మార్క్సిజం అంటే స్పెల్లింగ్ కూడా కాంగ్రెస్ వాళ్లలో 90% మందికి తెలిసి వుండదు. మజ్లిస్‌తో లోపాయికారీ పొత్తు పెట్టుకున్నారంటే అర్థం వాళ్లలాగే అధికారులను చావగొడతామనా? పొత్తు పెట్టుకున్నంత మాత్రాన వారిదీ వీరిదీ ఒకటే ఎజెండా అయితే రెండు పార్టీలుగా వుండడం దేనికి, కలిసిపోవచ్చుగా! రాజకీయ అవసరాల కోసం పొత్తు పెట్టుకున్నంత మాత్రాన తెరాస లక్ష్యం, కాంగ్రెస్ లక్ష్యం ఒకటి కాదు.

రెండో కారణం – '2004లో తెలంగాణ యిస్తుందని ఒప్పుకుని ఆ మేరకు కాంగ్రెస్ తెరాసతో ఒప్పందం కుదుర్చుకుంది.' ఎక్కడ కుదుర్చుకుంది? వారిద్దరి మధ్య జరిగిన అంగీకారపత్రం ఓ సారి చదవమనండి. '..మొదటి ఎస్సార్సీని గౌరవిస్తూ రెండో ఎస్సార్సీ వేయడానికి తెరాస, కాంగ్రెస్ ఒప్పుకున్నాయి...' కాంగ్రెస్‌ది ఎప్పుడూ రెండో ఎస్సార్సీ పాటే! రెండో ఎస్సార్సీ వేయాలి, వాళ్లు తెలంగాణతో సహా అనేక రాష్ట్రాల డిమాండ్లను పరిగణించాలి, సూచనలు చేయాలి, వాటిని కాంగ్రెస్ ఆమోదించాలి... యింత తతంగం వుంది. తెరాస కోసం మొదటి ఎస్సార్సీని గౌరవిస్తూ.. అనే మాట కలిపారు. తెలంగాణను కొంతకాలం విడిగా వుంచాలన్న మొదటి ఎస్సార్సీ రికమెండేషన్ పట్ల మాకు గౌరవం వుంది అని చెప్పడమన్నమాట.

ఆ మొదటి ఎస్సార్సీ రిపోర్టు వచ్చి అప్పటికి 50 ఏళ్లయింది. చనిపోయిన వారికి నివాళి అర్పిస్తూ.. అన్నట్టుగా వుంది. పెద్దల పట్ల మనకు గౌరవం వుంటుంది కానీ వాళ్లు చెప్పిన ప్రతీ మాటా వినం. ఇదీ అలాగే. పైగా ఆ కమిషన్ ఏం చెప్పింది? తెలంగాణను కొంతకాలం విడిగా వుంచి.. అంది తప్ప ఎల్లకాలం విడిగా వుంచమనలేదు. ఇటువంటి క్లాజ్‌లతో వున్న ఒప్పందానికి తెరాస తలవొగ్గడం ఏమిటి? ఎందుకు వొగ్గింది అంటే తెలంగాణలో తనకు విడిగా పోటీ చేసే సత్తా లేదు అని గ్రహించింది కాబట్టే ఒప్పుకుంది. ఆ తర్వాత ఐదేళ్ల తర్వాత కూడా బలం పుంజుకోలేకపోవడంతో 2009లో టిడిపితో, లెఫ్ట్‌తో మళ్లీ పొత్తు పెట్టుకుంది. 2014 జనరల్ ఎలక్షన్‌లలో తెరాస విడిగా పోటీ చేస్తే అప్పుడు దాని కున్న అసలైన బలం తెలుస్తుంది.

మూడో కారణం – 'సోనియా ఎన్నికల సభల్లో మాట్లాడుతూ తెలంగాణ వారితో 'మీ మనసులో మాట నాకు తెలుసు' అంది. దాని అర్థం తెలంగాణ యిస్తానని మాట యిచ్చినట్టే. మాట నిలుపుకోవాలంటే యిచ్చి తీరాలి'. తెలంగాణ యిద్దామన్న ఉద్దేశమే వుంటే ఆ మాట డైరక్టుగానే చెప్పవచ్చు కదా, మీ మనసులో మాట నాకు తెలుసు అని చెప్పడం దేనికి? నిజం చెప్పాలంటే ఏకకాలంలో మన మనసులో, మెదడులో 300కు పై బాటి ఆలోచనలు వుంటాయట. 'ఈవిడ ఉపన్యాసం ఎప్పుడు ముగిస్తుందా, బిర్యానీ పొట్లం, సారా బుడ్డి పట్టుకుని త్వరగా యింటికి పోవచ్చు.' అనుకుంటున్నారేమో ఆనాటి సభలోని శ్రోతలు. అది గ్రహించి, 'నాకు తెలుసులే మీ వూహ' అన్న అర్థంలో ఆమె చెప్పిందేమో!

మహామహా మానిఫెస్టోలో రాసిన వాటికే దిక్కు లేదు. మద్యనిషేధం అమలు చేస్తాం అని రాసి, అధికారం రాగానే ఆర్నెల్లలో ఎత్తేసినవాళ్లున్నారు. ఇలాటి డొంకతిరుగుడు మాటలు ఒక వాగ్దానమా? అలాగే యింకోటి కూడా చెప్తారు – 'సోనియా తెరాస కండువా కప్పుకుంది. అంటే దాని అర్థం తెలంగాణ యిచ్చేస్తాం' అని. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురుద్వారాకు వెళితే కత్తి చేతిలో పెడతారు, మసీదు పక్కకు వెళితే టోపీ తొడుగుతారు, గిరిజనులైతే గొంగళి కప్పుతారు. అంతమాత్రం చేత ఆ నాయకులు శిక్కులు, ముస్లిములు, గిరిజనులు అయిపోరు. గులాబీ కండువా వేసినంత మాత్రాన సోనియా తెరాసలో సభ్యత్వం తీసుకున్నట్టు కాదు. పిడికిలి ఎత్తినంత మాత్రాన కమ్యూనిస్టు కాబోదు.

హైస్కూలు కుర్రాళ్లు క్లాసులో అమ్మాయిలను చూసి యిలాటి భ్రమల్లో పడతారు. 'జడలో గులాబీ పువ్వు పెట్టుకుని వచ్చింది, నాకు గులాబీ అంటే యిష్టమని తెలుసు కాబట్టి దీని అర్థం నన్ను ప్రేమిస్తోందని..' అని. 'పుస్తకానికి మహేశ్‌బాబు పోస్టరు అట్టగా వేసింది. నేను మహేశ్ ఫ్యాన్‌నని తెలుసు కాబట్టి దీని అర్థం నేనంటే కూడా యిష్టమని..' అనీ. కౌమార దశ కాబట్టి ఆ అమాయకత్వాన్ని

చూసి నవ్వుకుంటాం. గుండెలు తీసిన బంట్లయిన నాయకులు యిలా మాట్లాడితే వాళ్లు మనల్ని మోసగిస్తున్నారని అర్థం. ఇక 2009 మానిఫెస్టోలో ఏముందో వాళ్లకు నిజంగానే తెలియదా? తెలంగాణ యిస్తామని స్పష్టంగా వుండి వుంటే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తెరాసతో పొత్తు పెట్టుకోవాలని వైయస్‌పై, హై కమాండ్‌పై ఒత్తిడి ఎందుకు తెచ్చినట్టు? తెలంగాణ డిక్లేర్ చేస్తే తెలంగాణ అంతా క్లీన్ స్వీప్ చేస్తామని కదా వాళ్లు పదేపదే చెప్పేది. తెలంగాణ ప్రామిస్ చేస్తే తెలంగాణను ఊడ్చి పెట్టేయాలిగా. పైగా అప్పట్లో యీ వైయస్సే తెలంగాణకు అడ్డు అని ఎందుకన్నారు? మానిఫెస్టోలో తెలంగాణ అంశం వుంటే వైయస్ మాట ఎక్కడ చెల్లినట్టు? ఎక్కడ అడ్డుకున్నట్టు?

విభజనవాదులకు వచ్చిన చిక్కేమిటంటే – రాజధాని తమ దగ్గరే పెట్టుకుని వాళ్లు ప్రత్యేకరాష్ట్రం కోరుతున్నారు. అది జాతీయ నాయకులకు మింగుడు పడటం లేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఏర్పడిన కొత్త రాష్ట్రాలన్నీ రాష్ట్ర రాజధానికి దూరంగా వున్నవే. రాజధాని వున్నచోట అభివృద్ధి బాగా వుంటుందని అందరికీ తెలుసు. అందుకే అద్వానీగారు అధికారంలో వుండగా తెలంగాణ డిమాండ్‌ను తీసిపారేశారు. రాజధాని చుట్టూ వున్న ప్రాంతం విభజన కోరడమేమిటి, హవ్వ! అని. ఇప్పుడు అధికారం లేదు కాబట్టి రాగం మార్చారు. కొత్త రాష్ట్రం కోరేవారు రాజధాని పోగొట్టుకోవడం యిప్పటిదాకా జరుగుతూ వస్తోంది. అడిగినా, ఆందోళన చేసినా ఆంధ్రులకు మద్రాసు పోయింది, గుజరాతీలకు బొంబాయి పోయింది. అది గ్రహించే కాబోలు 1972 జై ఆంధ్రా వుద్యమకారులు హైదరాబాదు కోరలేదు. కానీ యిప్పుడు తెలంగాణ ఉద్యమకారులు హైదరాబాదు వదులుకోవడానికి సిద్ధంగా లేరు.

'మీకు రాజధాని వుంది, అభివృద్ధి వుంది, బెస్ట్ హాస్పటల్స్, కాలేజీలు అన్నీ మీ దగ్గరే వున్నాయి. ఢిల్లీ నుండి మేమే మీ హైదరాబాదుకి వచ్చి వైద్యం చేయించుకుంటున్నాం. బోల్డు కేంద్ర సంస్థలున్నాయి. మీకు వచ్చిన లోటేమిటి? ఇంకెందుకయ్యా వేరు రాష్ట్రం? ఊరికే మమ్మల్ని చంపుకుతినడం కాకపోతే..' అని ఢిల్లీ నాయకులు అడిగితే వీళ్లు 'సినిమాల్లో విలన్లకు మా యాస పెడుతున్నారు సార్' లాటి కారణాలు చెప్పలేరు కదా. 610 జీవో అమలు గురించి మాట్లాడితే 'ఉద్యోగుల్లో పితలాటకాలు ఎక్కడైనా వుండేవే. అమలు చేయవద్దని ఎవరు చెప్పారు? వేల సంఖ్యలో వుండే పోస్టింగు కేసుల కోసం కోట్ల సంఖ్యలో వున్న ప్రజలను విడగొడతారా?' అనగలరు.

అందుకని తెలంగాణ ఉద్యమకారులు ఎన్నో చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నారు. తెలంగాణ వెనకబడి వుందన్న కారణం చెప్పి రాష్ట్రవిభజన కోరారు. కృష్ణ కమిటీ రిపోర్టు వచ్చి వెనకబడి లేదని తేలడంతో అప్పణ్నుంచి 'ఇది అభివృద్ధి సమస్య కాదు, ఆత్మగౌరవ సమస్య' అనసాగారు. అంటే అప్పటిదాకా చెప్పిన వెనకబాటుతనం కబుర్లు వుత్తివే అని ఒప్పుకున్నట్టేగా! అలాగే 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కావాలంటే విడిపోవచ్చు' అని జవహర్‌లాల్ నెహ్రూ నిజామాబాద్‌లో హామీ యిచ్చారని వీళ్లు వెళ్లి సుష్మా స్వరాజ్‌కు చెప్పారు. ఆవిడ వీళ్ల మాట నమ్మి పార్లమెంటులో మాట్లాడేసింది. వెంటనే ఆంధ్రప్రాంతం నాయకులు ఆవిణ్ని నిలదీసి ఉతికేశారు. నెహ్రూ అలా అనలేదని నిరూపించారు. సుష్మా నాలిక కరుచుకుని మళ్లీ ఆ మాట ఎత్తలేదు. వీళ్ల కబుర్లు విని షిండేలు, వాయలార్లూ అవతలివాళ్లని నిలదీయబోతే ఆనక సుష్మా స్వరాజ్‌లాగానే నాలిక కరుచుకోవలసి వస్తుంది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 24, 25 వీక్లీకై ఎమ్బీయస్ : కిరణ్‌గారికి బహిరంగ లేఖ**

**కిరణ్‌గారూ,**

కొన్నేళ్లు పోయాక రాజకీయచరిత్రకారులకు వారికి మీ పాలన అనగానే తెలుగు మహాసభలు, రూపాయికి సన్నబియ్యం, ఉద్యోగ కిరణాలు వంటివి గుర్తుకు వస్తాయో రాదో కచ్చితంగా చెప్పలేను కానీ ఒవైసీ సోదరులతో మీరు వ్యవహరిస్తున్న తీరు మాత్రం గుర్తుండిపోతుందంటే నమ్మండి. రామజన్మభూమి గురించి కుళ్లు జోకులేసిన అక్బరుద్దీన్‌ను కృష్ణజన్మభూమికి పంపారు. రాముడు అరడజను చోట్ల పుట్టినట్టున్నాడు, ఎన్ని గుడులు కడతారు? అని అడిగి 'అడుగడుగున గుడి వుంది' అనే పాట మనకు గుర్తు చేసినందుకు రాష్ట్రంలో 'అడుగడుగున కోర్టు వుంది' అని అతనికి గుర్తు చేస్తున్నారు జనం. పాత కేసుల పాతర వెలికి తీయడంతో ఎక్కే కోర్టు, దిగే కోర్టు అయిపోయింది. లండన్‌నుండి టీ షర్టులో దర్జాగా దిగి చేతులూపిన అక్బరు యిప్పుడు టీవీలో కనబడినప్పుడల్లా పొట్ట చేత్తో పట్టుకుని దీనంగా కనబడుతున్నాడు. దేశానికి తిరిగి రాగానే పోలీసులకు సరెండర్ కాకుండా అనారోగ్యం సాకు చెప్పేసరికి, నిజంగా టెస్ట్ చేసి అతనికి హెర్నియాతో సహా అనేక రోగాలున్నట్టు, శరీరంలో యింకా తుపాకి గుండు వున్నట్టు వైద్యులు చాటి చెప్పేశారు. అదేమిటో అప్పణ్నుంచి అతను గ్లామరస్‌గా కనబడడం మానేశాడు నాకు.

అక్బరుకి రామాయణం ఏదో జోక్‌బుక్‌లా తోచింది కానీ మీకు రామాయణంలో వున్న భాతృప్రేమ గురించి అవగాహన వుంది. ఆ సోదరులు మీకు స్నేహితులు కాబట్టి వాళ్ల మధ్యనున్న రామలక్ష్మణ అనుబంధం గురించి మీకు ఐడియా వుంది. సోదరుల మధ్య పొరపొచ్చాలు రాకుండా అన్నగారి మీద కేసులూ తవ్వి తీయించారు. ఆయనకూ ఓ జెయిలు ఏర్పాటు చేశారు. ఇక ఆయనా ఊరూరూ జెయిలా, బెయిలా అంటూ తిరగవచ్చు. జగన్‌ను కలిసి మంతనాలు ఆడడానికి ప్రత్యేకంగా పని గట్టుకుని జైలుకి

వెళ్లనక్కరలేదు. అక్కడే ఓ సెల్లు చూసుకుని తిష్ట వేసి ఊసులాడవచ్చు. మీ దగ్గరున్న కేసుల లిస్టు అయిపోతే పాతబస్తీలో వున్న ముస్లింలనడగండి. వాళ్లే పట్టుకుని వచ్చి యిస్తారు. అక్కడి ముస్లింలలో మజ్లిస్ అభిమానుల కంటె విమర్శకులే ఎక్కువ. ఒవైసీలకు మీ అండ వుండడంతో యిన్నాళ్లూ వాళ్ల ఆగడాలను భరిస్తూ వున్నారు. వాళ్లకు భయపడి చాలామంది ఓటు వేయడం కూడా మానుకున్నారు. దశాబ్దాలుగా మజ్లిస్‌ను వాటేసుకున్న మీరు యిప్పటికైనా వారికి బుద్ధి చెప్పదలచుకున్నారని ప్రజలకు నమ్మకం చిక్కాలే కానీ అధికారులే పట్టుకుని వచ్చి బోల్డు సమాచారం యిస్తారు, దెబ్బలు తిన్న వాళ్ల శరీరాలు చూపిస్తారు. వచ్చే ఎన్నికల దాకా సోదరద్వయాన్ని తిప్పుతూనే వుండవచ్చు.

నిజానికి యీ పని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో చేయవచ్చు. ఎన్టీయార్ కాలంలో 'కుడా' అని పెట్టి రమణాచారి గారి నేతృత్వంలో పాతబస్తీని ఎంతో బాగు చేస్తే కాంగ్రెస్‌వాళ్లు అదంతా వెనక్కి తిప్పేసి పాతబస్తీని మజ్లిస్‌పాలు చేశారు. దేనికి? వాళ్లకున్న ఆరేడుగురు ఎమ్మెల్యేలకోసం, కార్పోరేషన్ పాలించడం కోసం! కానీ దానికి చెల్లించిన మూల్యం ఎంతో చూడండి! ఇన్నాళ్లకు వాళ్లకేం పుట్టిందో, మీకేం రగిలిందో కానీ వ్యవహారం చెడింది, ప్రజల జీవితాలు బాగుపడేట్లు కనబడుతోంది. ఈ ముచ్చట ఎంతకాలమో మాకూ తెలియదనుకోండి. కానీ సాగినంతకాలమైనా మమ్మల్ని ఆనందించనీయండి. ఈ ఘనతంతా మీకే కట్టబెడితే మీ కాబినెట్ కొలీగ్స్‌కి నచ్చదు. 'మా సోనియమ్మ చెప్పింది కాబట్టే చేస్తున్నాడు' అంటారు. సోనియమ్మ చెప్పే వుంటారు లెండి, కానీ చెప్పినా చేసే ముఖ్యమంత్రులెందరున్నారు? 'మీకేం పోయింది, గట్టిగా నిలబడు అని చెప్తారు, రేపు వీళ్లందరూ కలిసి సున్నితమైన అంశాన్ని చాకచక్యంగా చేయలేకపోయాడు అంటూ గోల చేస్తే గద్దె నుండి దింపేస్తారు. మధ్యలో పోయేది నేను. ఏదైనా మంచి జరిగితే దానికి క్రెడిట్ మీరు తీసుకుంటారు, చెడు జరిగితే తప్పంతా నా వ్యవహారశైలిపై నెట్టేసి నా తలకాయ తెగేస్తారు.' అని ఆదేశాలు పాటించకుండా తాత్సారం చేస్తారు.

అంతెందుకు మీ స్థానంలో రోశయ్యగారున్నా యిలా చేసేవారు కారు. రాజకీయజీవితం చరమాంకంలో అనుకోకుండా పదవి దక్కింది కదా, మన తడాఖా చూపిద్దాం అనుకోలేదాయన. నెలల సర్వీసు మాత్రమే మిగిలిన గవర్నమెంటు ఉద్యోగిలా ఏ రిస్కూ తీసుకోకుండా కాలక్షేపం చేసేశారు. మహానాయకుడు, ధీరోదాత్తుడు, తెలంగాణ విషయంలో హై కమాండ్‌ను సైతం బ్లాక్‌మెయిల్ చేయగలిగిన వైయస్ కూడా మజ్లిస్ విషయంలో మెతక వైఖరే అవలంబించారు. నిజానికి 2004-2009 మధ్య ఆయనకు మజ్లిస్ ఎమ్మెల్యేల మద్దతు అక్కరే లేదు. అయినా పాతబస్తీని వారికి ధారాదత్తం చేశారు. వాళ్లు అధికారులను కొడితే అధికారులపైనే కేసులు పెట్టారు. డాక్టర్లను కొడితే వదిలేశారు. రచయిత్రిని చంపబోయినా పట్టించుకోలేదు. వైయస్, రోశయ్యలతో పోలిస్తే మీరు వయసులో చాలా చిన్నవారు. ఎంతో రాజకీయజీవితం ముందు వుంది. తప్పుటడుగులు వేస్తే ఇరవై, పాతికేళ్ల కెరియర్ ఖతం. ఇంట్లో కూర్చుని ఆత్మకథ రాసుకోవాల్సిందే. అయినా రిస్కు తీసుకుంటున్నారు. మిలియన్ మార్చ్ విషయంలో కానీ, మరో దానిలో గానీ 'తిడితే తిట్టుకోనీయండి' అంటూ మొండిగా వ్యవహరిస్తున్నారు. ఇన్నాళ్లకి మజ్లిస్ వారి చేత కటకటాలు లెక్క పెట్టిస్తున్నారు. అందుకు ధన్యవాదాలు.'

ఇలా మేం మీకు ఘనత కట్టబెట్టబోయినా మీరు ..బెట్టించుకోరు. ఎందుకంటే యివాళ్టి క్రెడిట్ మీరు తీసుకుంటే రేపు పండగనాడు ఎక్కడైనా బంద్‌లు, అల్లర్లు జరిగితే వెంటనే పార్టీలో మీ ప్రతిపక్షులు 'కిరణ్ అనవసరంగా ముస్లిములను రెచ్చగొట్టారు. రేపు ఎన్నికలలో వాళ్లు మనకు వ్యతిరేకంగా జగన్‌కు ఓటేస్తే దానికి కారణం కిరణే తప్ప వేరొకరు కారు. ఆయన్ను దింపేయాలి..' అని గొడవ మొదలెడతారు. అందువలన మీరు 'మజ్లిస్ విషయంలో నేను చేసినదేమీ లేదు, మహారాజశ్రీ కోర్టువారే అన్నీ చూసుకుంటున్నారు. మంచైనా, చెడైనా వారినే అనాలి తప్ప నన్నేం అనవద్దు' అని వినయం చూపుతారు. మీరలా అన్నా మాకు తెలుసు సార్ - కోర్టులు చెప్తే మాత్రం అన్నీ జరుగుతున్నాయా? ఎప్పుడో 2005 కేసులో అసద్‌గారిపై కోర్టు సమన్లు వుంటే పోలీసులు యిన్నాళ్లూ ఏం చేస్తున్నట్లు? ఇదే కాదు, అనేక కేసుల్లో 'వారు కనబడుట లేదు' అని చెప్పేసి ఫైల్ అటకెక్కించేస్తారు. కనబడనివారిని కూడా వెంటాడి, వేటాడి కనిపెట్టవలసిన పోలీసులు రోజూ టీవీల్లో, బహిరంగసభల్లో, చట్టసభల్లో కనబడేవారిని 'కనబడలేద'ని చెప్పడమేమిటి? వాళ్ల కళ్లు తెరిపించాలంటే 'పొలిటికల్ విల్' వుండాలి. అది వుంటే పోలీసులకు అన్నీ కనబడతాయి, వినబడతాయి. లేకపోతే వాళ్లు గాంధీగారి కోతుల్లా కూర్చుంటారు.

ఉదాహరణకి ధర్మానగారి కేసు వుంది. చట్టం చెప్పినట్టే జరుగుతోందా? లేదే! ఆయన నిర్దోషి, ఆయనపై కేసు అక్కరలేదు అని మీ కాబినెట్టే తీర్మానించేసింది. మీరు తలచుకుంటే చట్టాన్ని తన పని తాను చేయనిస్తారు. లేకపోతే 'ఆగక్కడ' అంటారు. ఇప్పుడు జగన్ వున్నాడు. జైల్లో వుంచుదామనుకున్నారు. విచారణ ఎంతకాలం చేస్తారు? ఎప్పటికి పూర్తవుతుంది? అని కోర్టువారు సిబిఐను తాటిస్తున్నారు. 'ప్రభుత్వం సహకరించకపోతే మేమేం చేయగలం మహాప్రభో, వాళ్లు సమాచారం యిచ్చినపుడు కదా మేం విచారణ కొనసాగించేది, పూర్తి చేసేది..' అని సిబిఐవారు కోర్టులోనే మొరపెట్టుకున్నారు. అందువలన ఓ కేసును చురుగ్గా నడపాలన్నా, చొక్కా గుంజి వెనక్కి లాగాలన్నా అంతా మీ చేతిలో వుంది. ఇవాళ అసద్ తరఫు న్యాయవాది, నిందితుడు మిలాదున్నబీ నాటి సభకు వెళ్లడం ఎంతో ముఖ్యమనీ, కుటుంబ వ్యవహారాలు చూసుకోవాలనీ ఎంత ఎమోషనల్‌గా వాదించినా వినకుండా సంగారెడ్డి మేజిస్ట్రేట్ గారు బెయిల్ తిరస్కరించి, న్యాయస్థానాల సత్తా చూపగలిగారంటే ఆ దన్ను కలిగించినవారెవరు?

మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మీరు మంచి శక్తిసామర్థ్యాలు, గుండెధైర్యం వున్న వ్యక్తని నేను ఫిక్సయిపోయాను. అందుకని

పనిలో పనిగా కొన్ని కోరికలు కోరేస్తున్నాను. ఆ మధ్య లిక్కర్ లాబీ అనీ, ఇసుక లాబీ అనీ, ఎసిబి దాడులనీ యిలాటి వార్తలేవో పేపర్లలో వచ్చాయి. అదేమిటో గానీ ఆ కేసులన్నీ ఏమై పోయాయో తెలియకుండా పోయింది. ఇప్పుడెలాగూ చట్టాన్ని దాని పని చేయనిస్తున్నారు కాబట్టి ఆ కేసుల్లో కూడా – పనిలో పనిగా – పని చేయనిచ్చేయండి. వాటిలో మరీ ధాటీగా వెళితే బొత్సగారు మీకు ఢిల్లీలో ఎసరు పెడతారన్న భయం కొద్దీ అప్పట్లో వెనక్కి తగ్గారని కూడా జనం అనుకున్నారు. ఇప్పుడు మీరు మాంచి వూపు మీద వున్నారు కాబట్టి కేసులు దుమ్ము దులపమని ఆర్డరిచ్చేయండి. బొత్సగారు వచ్చి పేచీ పెట్టుకుంటే 'ఇప్పుడు నా ఆఫీసులో ఫైళ్లన్నీ తెలుగులో రాయమంటున్నానని తెలుసు కదా, తెలుగులో ఏదో రాసి పట్టుకుని వచ్చారు. ఏం రాశారో నాకు అర్థం కాక సంతకం పెట్టేశాను' అని చెప్పేయండి. నమ్ముతారు.

కేసులు పెట్టవలసిన కాండిడేట్స్ చాలామందే వున్నారు. మతం పేరు మీద విద్వేషాలు రెచ్చగొట్టడం ఎంత తప్పో, ప్రాంతాల పేర రెచ్చగొట్టడం కూడా తప్పే అని ఏవో సెక్షన్లు వుంటాయి. రక్తం ఏరులై పారించడాలు, అడ్డంగా నరకడాలు, భాగోలు, 'శాంతియుత' మిలిటెన్సీలు, గుడ్డలూడదీసి తంతామనడాలు, ఫలానా ప్రాంతంలోకి వస్తే మళ్లీ వెళ్లలేవనడాలు.. ఇవన్నీ కూడా సహించవద్దు. అలాగే ఆత్మహత్య చేసుకుంటా, ఉరి వేసుకుంటా, తగలబెట్టుకుంటా.. అనే వాళ్లని కూడా ఆత్మహత్యలకు పురికొల్పుతున్నారన్న కేసుల్లో యిరికించేయండి. 'ఫలానావాళ్లు అధికారంలోకి వస్తే మీ బతుకంతా చీకటే', 'మీ జేబులు ఖాళీయే' వంటి ప్రకటనలు చేసేవారిని వదంతులతో ప్రజలను భయభ్రాంతులను చేయడం సెక్షన్ కింద బుక్ చేయండి. ఇదే కాకుండా 'మగతనం వుంటే..' 'మీసమున్న మగాడివైతే..' 'గాజులు తొడుక్కుని కూర్చోలేదు'.. వంటి స్టేటుమెంట్లు యిచ్చేవారిని స్త్రీలను అవమానించే లింగ వివక్షత (జెండర్ డిస్క్రిమినేషన్) కేసుల కింద జైల్లో కూర్చోపెట్టండి.

ఇవన్నీ చప్పుచప్పున చేసేయండి. తెలంగాణ నాయకులను బుజ్జగించే యత్నాల్లో మిమ్మల్ని మార్చేయవచ్చు అని మీరు కుర్చీ ఎక్కినదగ్గర్నుంచీ చెప్తూనే వున్నారు. నాలుగో కృష్ణుడు తెరలో దాగుని వున్నాడేమో తెలియదు. రోశయ్యగారున్నపుడు మీరు అక్కడ దాగున్నట్టు మాకెవరికైనా తెలిసిందా? లేదు కదా! అందుకని దీపం వుండగానే యిల్లు చక్కబెట్టినట్టు, పదవి వుండగానే యీ అరెస్టులు చేయించేయండి. తెలుగు భాషను, సంస్కృతిని కాపాడడానికి మీరు నిర్వహించిన తెలుగు సభలు ఒకెత్తయితే, యిది రెండెత్తులు! ఇలాటి ప్రకటనల వలన తెలుగు భాష, తెలుగువారి సంస్కారం, సంస్కృతి అన్నీ మంట గలుస్తున్నాయి. ఈ కేసుల వలన ఆ పతనాన్ని ఆపగలిగితే తెలుగువారు మిమ్మల్ని కలకాలం.. అంటే నమ్మరేమో గానీ.. చాలాకాలం గుర్తు పెట్టుకుంటారు. ఇట్లు భవదీయుడు... **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 26 వీక్లీకై** **ఎమ్బీయస్ : వహ్వా! హోం శాఖ!!**

'మేడంటే మేడా కాదు...గూడంటే గూడూ కాదూ..' అన్న ధోరణిలో ఆజాద్‌గారు బుధవారం 'నెలంటే నెల కాద'ని చెప్పి తెలుగు మీడియా నోట్లో కరక్కాయ కొట్టారు. నిజానికి నెల్లాళ్ల క్రితం షిండేగారు ప్రెస్ మీట్‌లో ఏం చెప్పారు? 'ఈ సమావేశం ఫలితాన్ని నెల్లాళ్లలో చెప్తాం' అన్నారు. అంతే, సమస్యకు పరిష్కారం చెప్తామని అనలేదు. ఆ ముక్క కూడా హై కమాండ్‌కు రుచించలేదు. అందుకని సాయంత్రానికి యిచ్చిన ప్రెస్ నోట్‌లో నెల్లాళ్ల మాట ఎగరగొట్టేశారు. అప్పుడే మన మీడియా గుర్తించాల్సింది – యిదేమీ జరిగే వ్యవహారం కాదని! కానీ అలా చెప్తే వాళ్ల వ్యాపారం సాగడం ఎలా?

అందుకని 28 తారీకుకి భూనభోంతరాళాలు బద్దలవ్వబోతున్నాయని హంగు చేయడానికి పత్రికలు, టీవీ ఛానెల్స్ యిన్నాళ్లూ హంగు చేసి నిన్నటినుండి 'కౌంట్ డౌన్' అంటూ ప్రోగ్రాములు, చర్చలు సిద్ధం చేసుకున్నాయి. వస్తుందా? రాదా? వస్తే ఏం వస్తుంది? ఆ వచ్చినదానిపై అటేమంటారు? ఇటేమంటారు? ఎన్ని ఆత్మహత్యలు జరుగుతాయి? ఎన్ని రాజీనామాలు జరుగుతాయి? అని బోల్డు టెన్షన్లు బిల్డప్ చేసి బెట్టింగ్ వ్యాపారాభివృద్ధికి తమ వంతు కృషి తాము చేయబోయారు. 28 దాకా ఆగక్కరలేదు, 27నే ప్రకటన వస్తుందని, బంగ్లాదేశ్‌కి వెళ్తూ వెళ్తూ చెప్తారనీ, అలా చెప్పేముందు రాష్ట్రంలో కేంద్రబలగాలు పూటుగా నింపి ఆ పై చెప్తారని, అబ్బెబ్బే అప్పటిదాకా ఎందుకు, రిపబ్లిక్ డే ముందురోజు యిచ్చే రాష్ట్రపతి ఉపన్యాసంలో తెలంగాణ గురించి చెప్పేస్తారనీ .. యిలా కథనాలు వండి వార్చేస్తున్నారు. ఐదు రోజుల ముందే ఆజాద్ యిలా గాలి తీయడంతో మీడియా ఉసూరుమని పోయి తిట్టేసుకుని వుంటుంది.

ఆజాద్‌ను తిట్టినవారిలో మీడియా తర్వాత చెప్పుకోవలసినది టికాంగ్రెస్ ఎంపీలనే. 'సీమాంధ్రుల నుండి డబ్బు తినేసి' అలా చెప్పారన్నారు ఓ పెద్దమనిషి, అక్కడకి ఆజాద్‌దే అంతిమనిర్ణయమైనట్లు! 'పెద్దల నిర్ణయానుసారమే నేను ప్రకటన చేశాను బాబూ' అన్న అర్థంలో ఆయన తనను కలిసిన ఎంపీలకు చెప్పాడట. అయినా వీళ్లకు కోపం వచ్చింది, ఎందుకంటే ఆజాద్‌గారు వీళ్లకే లెక్చరు యిచ్చాడట. 'నియోజకవర్గాల్లో మొహం ఎలా చూపించగలం?' అంటే 'దీనికోసం వేరే మొహం కావాలంటే ఎక్కడ దొరుకుతుంది? మీరు నాయకులు, యిలాటివాటికి అడ్జస్టవాలి, అదే మొహంతో వెళ్లాలి.' అన్నాడట. 'చాల్లేవయ్యా చెప్పొచ్చావ్, నియోజకవర్గంలో మేం యిన్నాళ్లూ తిరక్కుండా వున్నామా ఏమన్నానా' అని అనుకుంటూ కాబోలు వీళ్లు బయటకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి ఆయన్ని, యితర ఢిల్లీ నాయకుల్ని తిట్టిపోశారు. 'షిండే దళితుడనా, ఆయన మాటకు విలువ లేకుండా చేశారు?' అని ఎస్సీ యాంగిల్

పట్టుకుని వచ్చారు మంద జగన్నాథం. దళితుడన్న చిన్నచూపే వుంటే హోం మంత్రిగా ఎందుకు చేస్తారు? నిజానికి షిండే మాటను డిసెంబరు 28 నాటి ప్రెస్ రిలీజ్‌లోనే కొట్టి పారేశారు కదా. అప్పుడే మంద గారికి యివన్నీ తోచి వుండాల్సింది. మూడు వారాలుగా మనల్ని ఊదరగొట్టి యిప్పుడు యిలా అంటే ఎలా?

ఇలా వెనకడుగు వేయడానికి కారణం ఏమిటి? కెవిపి లాబీయింగ్‌కు లొంగి పోయారంటున్నారు. కెవిపి అంటేనే కీ(కె)లెరిగి వా(వి)త పె(పి)ట్టే రకం. తెలంగాణపై నిర్ణయం తీసుకుంటే వచ్చే లాభం లేకపోగా, యిప్పటికిప్పుడు తిరుగుబాటు వచ్చి కిరణ్ ప్రభుత్వం పడిపోతుందని హై కమాండ్‌ను భయపెట్టారట. 'అబ్బే అలా ఏమీ పడదు, ఆంధ్రప్రాంతపు కాంగ్రెస్ నుండి బయటకు వెళ్లేటంతమందిని మేం తెలంగాణ నుండి సమీకరిస్తాం. మనం తెలంగాణ యిస్తాం అనగానే తెలంగాణ ప్రాంతంలోని అన్ని పార్టీల నాయకులూ మన వెంట నిలుస్తారు' అని తెలంగాణ నాయకులు హామీ యిస్తే అప్పుడు హై కమాండ్ వాళ్లు ఆలోచించేవారేమో. వీళు అలాటి హామీ ఏం యివ్వగలరు? తక్కిన పార్టీల వాళ్లను తీసుకురావడం మాట అలా వుంచి, తెలంగాణ ప్రకటించగానే వీళ్లే తెరాస వైపు దుమికేస్తారేమోనని హై కమాండ్ భయం.

అలాటి పరిస్థితిలో వీళ్లు ఆంధ్రప్రాంతం నాయకులకు 'మాకు తెలంగాణ రానీయండి, మీరు కిరణ్ ప్రభుత్వాన్ని పడగొట్టకండి. కావాలంటే మీకు అదిస్తాం, యిదిస్తాం' అని నచ్చచెప్పుకోవాలి. ఆ పరిస్థితే లేదు. మాట్లాడితే వాళ్లను తిడతారు. గుత్తా సుఖేందర్ రెడ్డిగారు బొత్తిగా అన్యాయంగా 'సీమాంధ్రులు ఢిల్లీ రేపిస్టుల కంటె ఘోరమైనవాళ్లు' అనేస్తున్నారు. ఓ పక్క యిలా అంటూ మర్నాడే 'అన్నదమ్ముల్లా విడిపోదాం' అంటే ఎవరు నమ్ముతారు? తెలంగాణ వస్తే తమ పరిస్థితి మరింత హీనం అవుతుందని భయపడి వాళ్ల జాగ్రత్తలు వాళ్లు పడుతున్నారు. ఎవరి జీవనపోరాటం వాళ్లది. ఈ రౌండ్‌లో సమైక్యవాదుల చేయి పైన అయింది. వచ్చే రౌండ్‌లో ఎవరిదవుతుందో వేచి చూదాం.

హై కమాండ్‌ను కెవిపి రాజకీయంగా ప్రభావితం చేస్తే, హోం శాఖ మరోలా ప్రభావితం చేసింది. తెలంగాణ యిస్తే గూరా?ల్యాండ్ వంటి సరిహద్దు ప్రాంతాల వాళ్లు వేరు రాష్ట్రాన్ని కోరతారని, అది దేశభద్రతకే ప్రమాదమనీ నోట్ తయారుచేసి పంపారట. దానితో బాటు నాగాలాండ్, విదర్భ, బుందేల్ ఖండ్. యిలా చాలా చోట్ల డిమాండ్లు మందుకు వస్తాయనీ భయపెట్టారట. మరి తెలంగాణ సమస్యకు పరిష్కారం? అని అడిగితే – ప్యాకేజీ ప్రకటించడం, గూరా?ల్యాండ్ తరహా స్వయంప్రతిపత్తి అథారిటీ, యథాతథ పరిస్థితి కొనసాగించడం – అనే మూడు ఆప్షన్లు ముందు పెట్టారట. వీళ్లు యిలా చెప్పడంతో నిర్ణయం వెనక్కి వెళ్లింది. పోనీ మూడు ఆప్షన్లలో ఏ ఒక్కదానినైనా ఆమోదించి అమలు చేశారా? అంటే అదీ లేదు. దానికి ధైర్యం చాలలేదు.

ఈ హోం శాఖ చూడండి, భలే తమాషాగా పనిచేస్తోంది. 2009లో యిదే శాఖ 'తెలంగాణ ప్రకటించకపోతే కొంప మునిగిపోతుంది, గంటాలస్యం అయిందంటే కెసియార్ హరీమంటారు, హరీష్ అగ్గిరాముడై విద్యార్థులతో సహా అసెంబ్లీ ముట్టడిస్తారు. తెలంగాణ భగ్గుమంటుంది. అందువలన విభజించేయండి' అని సలహా యిచ్చింది. రాష్ట్రంలో వేర్పాటువాదుల సంఖ్య ఎంత? 2004 ఎన్నికలలో, 2009 ఎన్నికలలో వేర్పాటువాదానికి పడిన ఓట్లెన్ని? వారికోసం రాష్ట్రాన్ని చీలిస్తే రాష్ట్రంలో సమైక్యవాదులు ఎలా మండిపడతారు? ఎంత తీవ్రంగా ఉద్యమిస్తారు? అన్న విషయాలపై ద ృష్టి పెట్టి పరిస్థితిని సరిగ్గా అంచనా వేసి చెప్పాలి కదా. చెప్పారా? లేదే! అడావుడి పెట్టేసి, ప్రణబ్ లేకుండా, ప్రధాని లేకుండా, రాజధాని గురించి వివరాలేవీ వర్కవుట్ చేయకుండా అప్పటికప్పుడు ప్రకటన చేయించేశారు. ఎందుచేత? ఎందుకంటే అప్పటి హోం మంత్రి చిదంబరం తెలంగాణ యివ్వాలనుకున్నారు. లేదా ఇస్తానని చెప్పి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసి తమిళనాడు కంటె వెనకబడేట్లా చేద్దామనుకున్నారు. హోం శాఖలో కార్యదర్శిగా ఆయన కంటె ఘనుడు పిళ్లయ్‌గారున్నారు. ఆయన హైదరాబాదుతో సహా తెలంగాణ యిచ్చేద్దామనుకున్నారు. ఆ విషయం బాహాటంగా చెప్పేశారు కూడా. దానిపై గొడవ జరగడంతో చిదంబరంగారు ఆయన్ను ఖండించవలసి వచ్చింది. చిదంబరంగారు, పిళ్లయ్‌గారు యిద్దరూ కలిసి సోనియాను తప్పుదోవ పట్టించడంతోనే డిసెంబరు 9 ప్రకటన వచ్చింది. ఆ తర్వాత దాన్ని దిద్దుకోవడానికి మూడేళ్లగా ఆవిడ నానా అవస్థా పడుతోంది.

ఇప్పుడు మళ్లీ అదే హోం శాఖ, అధిపతి మారడంతో బాణీ మార్చేసింది. తెలంగాణ యిస్తే గూరా?లాండ్ వాళ్లు కొత్త రాష్ట్రం కోరతారట, దేశభద్రతా సమస్య వస్తుందట. అసలు గూరా? ట్రిబ్యునల్ అథారిటీ ఏర్పాటు చేసినపుడే 'ఇది తాత్కాలిక ఒప్పందం మాత్రమే, మా అంతిమలక్ష్యం ప్రత్యేక రాష్ట్రమే' అన్నాడు గూరా? నాయకుడు. వాళ్లు ఎప్పుడూ అడుగుతూనే వుంటారు. తెలంగాణయే కాదు, ఏ కొత్త రాష్ట్రం యిచ్చినా అడుగుతారు, వాళ్లతో ఎలా డీల్ చేయాలో చూసుకోవాలి తప్ప వాళ్లకి యిచ్చేవరకు దేశంలో ఏ కొత్త రాష్ట్రమూ యివ్వం అంటే ఎలా? తెలంగాణ యిస్తే విదర్భ అడుగుతారు, సౌరాష్ట్ర అడుగుతారు, యుపిని ముక్కలు చేయమంటారు.. నిజమే! తెలంగాణ యివ్వకపోతే వాళ్లు అడగడం మానేస్తారా? ఇలా ఎన్నాళ్లు? తెలంగాణ డిమాండ్‌లో సబబు వుందా లేదా, ఏర్పడితే రాజకీయ సుస్థిరత వుంటుందా లేదా, మూడు నాలుగు పార్టీలతో కలగూర ప్రభుత్వం ఏర్పడి ఉగ్రవాదాన్ని అదుపు చేయలేక అభివ ృద్ధిని దెబ్బ తీస్తుందా? ఇలాటి విషయాలు పరిశీలించి చెప్పాలి తప్ప వీళ్లకిస్తే వాళ్లకీ యివ్వాలి, అందువలన ఎవరికీ యివ్వవద్దు అనడం ఏమిటి?

ప్రతీ రాజుకీ, ప్రతీ రాజ్యానికీ గూఢచారి వ్యవస్థ వుంటుంది. అయినా యుద్ధంలో ఒక రాజ్యం గెలుస్తుంది, మరోటి ఓడిపోతుంది. ఎందువలన? వాళ్ల గూఢచారి వ్యవస్థ యిలా అఘోరిస్తుంది కాబట్టే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 27, 28 వీక్లీకై** **ఎమ్బీయస్ : హతవిధీ అన్న గడ్కరీ**

హతవిధీ అంటే విధి చేత కొట్టబడినవాడు, హిందీలో 'కిస్మత్‌కా మారా..' ఈ విధి వుంది చూశారూ, టైము చూసి, సెంటర్ చూసి కొట్టింది గడ్కరీని! తన పదవీకాలంలో చేసిన ఘనకార్యం ఏదీ లేకపోయినా ఆరెస్సెస్‌వారిని మేనేజ్ చేసి రెండోసారి అధ్యక్షుడైపోయి, తద్వారా ప్రధాని పదవికి పోటీదారుల్లో ఒకడవుదా మనుకున్నాడు. ఎవరి చేతివాటమో కానీ బీరువా తలుపు తెరిచి, లోపలున్న అస్థిపంజరాలు జలజలా రాలేట్టు చేశారు.

గడ్కరీ ఆర్థిక నేరాలు చేసినట్లు యిప్పుడందరూ చెప్తున్నారు. ఆయన ఎప్పణ్నుంచో చేస్తూ వచ్చాడు కదా, యిప్పుడే బయటకు రావడమేం? ఆయన మొదటిసారి అధ్యక్షుడు అయినపుడు యీ విషయాలు, కనీసం పార్టీ పెద్దలకు, తెలియవా? తెలుసు.. కానీ ఊరుకున్నారు. ఇప్పుడు తమ మార్గానికి అడ్డు రావడంతో వీటిని బయటపెట్టారు. అద్వానీగారు దేశానికి హోం మంత్రిగా చేశారు. మంచి జ్ఞాపకశక్తితో ఆత్మకథ రాశారు. ఇలాటి వివరాలన్నీ ఆయన వద్ద భద్రంగా వుండి వుంటాయి. కానీ వూరుకున్నారు. గడ్కరీ మొదటిసారి పదవీకాలం చివర్లోనే అరవింద్ కేజ్రీవాల్ 'పూర్తి గ్రూప్' వివరాలన్నీ బయట పెట్టారు. నరేంద్ర మోదీగారి చలవ అన్నారు. అధ్యక్ష పదవినుండి దింపి యింటికి పంపుతారని అనుకున్నారు కానీ ఆరెస్సెస్ చక్రం అడ్డేసింది. పోన్లే మర్యాదగా దిగిపోనీ, రెండోసారి ఛాన్సు యివ్వవద్దు అనుకున్నారు గడ్కరీ ప్రత్యర్థులు. అప్పటికి సరే అన్న ఆరెస్సెస్ వేడి చల్లారడంతో రెండోసారి కూడా గడ్కరీయే అని పట్టుబట్టింది. రామ్ జెఠ్మలానీని బయటకు పంపింది. అతని కొడుకు మహేశ్ నామినేషన్ పడేస్తానంటే సాగనీయలేదు. అద్వానీగారు గింజుకున్నారు. సుష్మా స్వరాజ్ పేరు సూచించారు. కానీ ఈ పదవి తీసుకుంటే లోకసభలో పదవి వదులుకోవాలనడంతో సుష్మా వద్దు లెండి అనేసింది. అద్వానీ వెంకయ్యనాయుణ్ని చేద్దామనుకున్నారు. ఆయనా వద్దన్నాడు. ఆరెస్సెస్ వాళ్లు అద్వానీని యిక ఆగమన్నారు.

గడ్కరీ యిక రెండోసారి అధ్యక్షుడు అయిపోక తప్పదు అనుకుంటూండగా అద్వానీగారు చెప్పారో లేక కాంగ్రెస్‌వారికే తట్టిందో ఇన్‌కమ్ టాక్స్ దాడులు జరిగాయి. వెంటనే అద్వానీ 'నేను గడ్కరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించను, యశ్వంత సిన్హాను బలపరుస్తాను' అన్నారు. యశ్వంత సిన్హా అప్పటికే అప్లికేషన్ పడేశాడు. ఆరెస్సెస్ కళవెళపడింది. యశ్వంత్ ఆరెస్సెస్ నేపథ్యం నుండి వచ్చినవాడు కాడు. అందువలన గడ్కరీ లేకపోతే, కనీసం రాజ్‌నాథ్ సింగ్‌ను చేయండి అని బేరానికి వచ్చింది. ఆఖరి నిమిషంలో గడ్కరీ ఔట్, రాజనాథ్ ఇన్ అయ్యారు. గడ్కరీ నిష్క్రమణ వెనుక అతని అకృత్యాలను బయటపెట్టే కార్యక్రమం పకడ్బందీగా జరిగిందని అనిపిస్తుంది. బుధవారం నాడు ఎన్నికనగా గడ్కరీ కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ వారు అర్జంటుగా మంగళవారమే (జనవరి 22, 2013) దాడి చేయడమే వింతగా వుంటే ఐటీ దాడులను బిజెపి ఖండించడం మరీ వింతగా వుంది. వాళ్లు మొదట ఆ కంపెనీలకు గడ్కరీకి సంబంధం లేదన్నారు. తర్వాత ఆ దాడులు దురుద్దేశంతో కూడుకున్నవన్నారు. ఈ యిన్‌కమ్‌టాక్స్ విషయం అందరి దృష్టికీ వచ్చింది. గడ్కరీని యిరికించే ప్లానుల్లో భాగంగా వచ్చిన మరో కథనం ఎక్కువమంది గమనించి వుండరు.

గడ్కరీ ఎన్నిక వారం రోజులుందనగా "ద వీక్" పత్రిక 'యోగితా ఠాక్రే' మరణం కేసును తన జనవరి 20, 2013 సంచికలో వేసింది. నిజానికి యీ కేసు గురించి వార్తను "ద హిందూ" దినపత్రిక నవంబరు 2, 2012 సంచికలో వేసింది. అవేళ వేశారంటే దానికి అర్థం వుంది ఎందుకంటే ఆ వారంలోనే ఆ కేసు మూసేయాలంటూ సిబిఐ రెండోసారి అభ్యర్థించింది. ముందురోజే దాన్ని బాధితకుటుంబం ప్రెస్ మీట్ పెట్టి ఖండించింది. ఆ వార్తకు హిందూ పెట్టిన కాప్షన్‌లో "ఫర్ సెకండ్ టైమ్, సిఐడి సీక్స్ టు క్లోజ్ యోగితా ఠాక్రేస్ కేస్" అని వుంది తప్ప గడ్కరీ పేరు రాయలేదు. కానీ "ద వీక్" సంచిక ముఖచిత్రంపై 'గడ్కరీ అండ్ ద మిస్టరీ ఆఫ్ ఏ డెడ్ గర్ల్' అని వేసింది. లోపలి కథనానికి "రఫ్ జస్టిస్" అని కాప్షన్ పెట్టి ట్యాగ్‌లైన్ 'గడ్కరీ బంగళాలో చనిపోయిన బాలిక కుటుంబం ఆమె మరణం వెనుక నిజాన్ని తెలుసుకోవడానికి నిశ్చయించుకుంది' అని రాశారు. ఈ బాలికేమిటో, చావేమిటో, దానికీ గడ్కరీకి గల బాదరాయణ సంబంధమేమిటో – తెలియాలంటే వివరాల్లోకి వెళ్లాలి.

2009లో గడ్కరీ నాగపూర్ నివాసానికి దగ్గర్లో వున్న యిళ్లల్లో విమల్ ఠాక్రే అనే పనిమనిషి పాచిపని చేసేది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు. అందరి కంటె చిన్నదాని పేరు యోగిత. వయసు ఏడేళ్లు. వేసవికాలం సెలవులు కావడంతో యోగిత తల్లితో బాటు వచ్చేది. అక్కడున్న పెద్ద యిళ్ల కాంపౌండ్లలో ఆడుకునేది. ఆ రోజు మే 19. గడ్కరీది పెద్ద కాంపౌండు కాబట్టి అక్కడ ఆడుకుంటానని తల్లిని అడిగింది. కాపలా వున్న పోలీసువారిని విమల్ అడిగితే సరే ఆడుకోమన్నారు. పని పూర్తి చేసుకుని వచ్చి మా పాప ఎక్కడుంది అని అడిగితే ఏమో, ఎక్కడుందో చూడలేదు అన్నారు. అప్పుడు గడ్కరీ కారుడ్రైవరు మనోహర్ పాన్సే అనే అతను వచ్చి "పాప కారులో నిద్రపోతోంది. లేపకుండా ఎత్తుకుని యింటికి తీసుకుని పో" అన్నాడు. ఆమె అలాగే తీసుకెళ్లి చూస్తే పాప బట్టలు తడిగా వున్నాయి. తల మీద, చెవుల వెనక గాయాలున్నాయి. ఇంట్లో దింపుతూంటే నోటి నుండి రక్తం కారికనట్టు గమనించింది. మర్మాయవం వద్ద ఏదో ద్రవం వున్నట్టు గమనించింది. చనిపోయిందని గ్రహించగానే పోలీసులను పిలవడం, వాళ్లు ఆ రాత్రే పోస్టుమార్టం చేయించడం, మర్నాడే అంత్యక్రియలకు ఏర్పాటు చేయడం జరిగాయి.

గడ్కరీ, భార్య ఆ రోజు వూళ్లో లేరు. వారి సిబ్బందిలో ఎవరో కారులోకి తీసుకెళ్లి ఆ ఏడేళ్ల పాపపై అత్యాచారం చేసి వుంటారు. ఆ పాప శరీరంపై 17 గాయాలయ్యాయి. చివరకు చనిపోయింది. తప్పుచేసినవారిని దండించే క్రమంలో గడ్కరీ పేరు బయటకు

వస్తుందన్న భయంతో మహారాష్ట్ర పోలీసులు ఎలాగోలా కేసు మూసేయాలని చూశారు. బాలికపై అత్యాచారం జరిగిందని, సిబిఐ దర్యాప్తు జరిపించాలనీ ఠాక్రే కుటుంబం హై కోర్టుకి పిటిషన్ పెట్టుకుంది. 2010 మార్చి 5 న నాగపూరు బెంచ్ సిఐడి విచారణకు ఆదేశించింది. చనిపోయిన పాప పేద కుటుంబానికి చెందినది – సంఘటన జరిగింది జాతీయస్థాయి నాయకుడి యింట్లో ! అందువలన సిఐడి వారు రంగంలోకి దిగి పాప కాంపౌండులో ఆడుకుంటూ తనంతట తానే కారులోకి ఎక్కిందని, డోరు మూసుకుపోవడంతో ఊపిరాడక చచ్చిపోయిందని కథ అల్లారు. యాక్సిడెంటు కేసు అని రాసేసి మూసేయబోయారు. అసలు ఎఫ్ఐఆర్‌లోనే ఫియట్ కారులో శవం దొరికిందని రాశారు. అబ్బే తెల్ల హోండా కారులో దొరికింది అని తల్లి అంటున్నా వినిపించుకోలేదు. ఆ పాపకు గుండెలో రంధ్రం వుందని, రక్తహీనత వుందని రిపోర్టులు చూపారు.

"మా చెల్లెలు రెండు నెలల క్రితం జబ్బు పడింది. గుండెలో రంధ్రం వుందని డాక్టర్లు చెప్పారు కానీ దాని వలన ప్రమాదం ఏదీ లేదన్నారు. అది చనిపోయాక పోలీసులు ఆ డాక్టర్లను పిలిచి తన గుండె పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుందని చెప్పమన్నారు. ఆ విషయం డాక్టర్లే నాకు చెప్పారు." అంటోంది యోగిత అక్క కిరణ్ ఠాక్రే. "చెల్లి కారులో యిరుక్కు పోయి వుంటే తలుపు బాదుతూ కేకలు పెట్టేది కదా, పైగా తనకున్న జబ్బు వలన ఊపిరాడక చనిపోవడం అసంభవం అని డాక్టర్లు చెప్పారు." అని కూడా అంది. కేసు మూసేయబోతూ వుంటే ఠాక్రే కుటుంబం అడ్డుకుంది. పనివాళ్ల సంఘం తరఫున జమ్మూ ఆనంద్ వారికి అండగా నిలబడ్డారు. అతని డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసికి అనుబంధంగా పనిచేస్తుంది.

కేసు మూసేయాలని సిబిఐ కోర్టును అభ్యర్థించినపుడు విమల్ 10 ప్రశ్నలు సంధించింది. 'మా అమ్మాయి అండర్‌వేర్‌పై రక్తపు మరకలు ఎలా వచ్చాయి? అండర్‌వేర్‌ను ముంబయి ఫోరెన్సిక్ ఎనాలిసిస్‌కు ఎందుకు పంపారు? పంచనామా తిరగరాయించారా? ఆమె కారులో దూరుతూండగా ఎవరైనా చూశారా? గడ్కరీ కారు డ్రైవర్ల గతచరిత్ర ఎటువంటిదో వాకబు చేశారా?..' ఇలా. ఇవన్నీ కేసును పక్కదోవ పట్టించడానికే అని సిఐడి కొట్టి పారేసింది. పోస్టుమార్టమ్ చేసిన డాక్టర్లు కూడా తమ పాత స్టేటుమెంట్లు మార్చేశారు. దాంతో కోర్టు కేసు మూసేయడానికి ఒప్పుకోలేదు. "మా నోళ్లు మూయించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. 15 లక్షల రూపాయలు తీసుకుని వూరుకోమన్నారు." అంటోంది ఠాక్రే కుటుంబం. "ఇదంతా కట్టుకథ. వీళ్లింటికి బయటివాళ్లు వచ్చినట్లు సాక్షులు ఎవరూ లేరు." అంటారు పోలీసులు. "వాళ్లు రాత్రి 11 గం।।లకు వచ్చారు. ఇరుగుపొరుగు ఎలా చూడగలుగుతారు?" అంటారు వీళ్లు. పోలీసులు హంతకులెవరో పట్టుకునే ప్రయత్నం మానేసి బాధితకుటుంబాన్నే ప్రశ్నలతో వేధిస్తున్నారు.

ఇలా రెండేళ్లు గడిపి అక్టోబరు చివర్లో 2012లో కేసు మూసేయడానికి అనుమతి యివ్వమని మళ్లీ కోర్టును కోరారు. దాన్ని కుటుంబం అడ్డుకుంది. ఆ సందర్భంగానే "ద హిందూ" వార్త వచ్చింది. వీళ్ల అభ్యంతరాలను లిఖితపూర్వకంగా యిమ్మనమని మేజిస్ట్రేటు అడిగారు. ఆ కేసు వాయిదా జనవరి 12 న వస్తుంది అని సందర్భం కల్పించుకుని "ద వీక్" యీ కథనాన్ని వేసింది. కానీ కోర్టు అవేళ తీర్పు చెప్పకుండా ఫిబ్రవరి 20కు వాయిదా వేసింది.

కథంతా విన్నాక 'అయ్యోపాపం గడ్కరీ' అనిపిస్తుంది. వాళ్ల కాంపౌండులో జరిగిన ఘోరానికి ఆయన శిక్ష అనుభవించడమేమిటి? అనిపిస్తుంది. కానీ యిక్కడ చిన్న మెలిక ఒకటి వుంది. ఈ కేసులో ప్రత్యక్షసాక్షి నంటూ 'కారులో ఆ పాప తనే దూరింది, ఊపిరాడక చనిపోయింది' అని సాక్ష్యం చెప్పిన మనోహర్ పాన్సేకు గడ్కరీ బహుమతి యిచ్చారు. అదేమిటో తెలుసా? సంఘటన జరిగిన ఐదువారాలకు అనగా జూన్ 24, 2009 న తన పూర్తి గ్రూపుకి చెందిన 7 కంపెనీల్లో డైరక్టరును చేశారు. ఆ తర్వాత మరో మూడు కంపెనీల్లో కూడా డైరక్టరుగా, ఇంకో కంపెనీలో ఎడిషినల్ డైరక్టరుగా చేశారు. "కారు డ్రైవర్ మీద అంత ప్రేమ కారిపోతూ వుంటే అంతకుముందే చేయవచ్చు, అప్పుడే చేయడమేం?" అని అడుగుతున్నారు ఠాక్రే కుటుంబం, వారికి అండగా నిలిచిన జమ్మూ ఆనంద్. సమాధానం చెప్పవలసినది గడ్కరీయే! ఇప్పుడు అధ్యక్షపదవి కూడా ఊడిపోయింది కాబట్టి బోల్డు తీరిక చిక్కింది. సమాధానం చెప్తే బాగుంటుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 29** ఎమ్బీయస్ : ఉండవల్లి వాస్తవాలన్నీ చెప్తారా?

ఇవాళ (జనవరి 25, 2013) సాయంత్రం రాజమండ్రిలో ఉండవల్లి సభ పెట్టారు. "జై ఆంధ్ర" వుద్యమంలో ఆయన పాల్గొని 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ ఉద్యమం గురించి వివరిస్తారట. అప్పుడెందుకు విడిపోదామనుకున్నారు? ఇప్పుడెందుకు కలిసి వుందామనుకుంటున్నారు? అనేవి చర్చిస్తారు కాబోలు. ఈ సమావేశం వార్త రాగానే కొందరు తెలంగాణావాదులు ఉండవల్లి 'ప్రత్యేకాంధ్ర' ఉద్యమం మళ్లీ మొదలు పెట్టబోతున్నారనుకున్నారు. ఆయనకు శుభాకాంక్షలు కూడా చెప్పేశారు. అలాటిది ఏదీ వుండబోదని కచ్చితంగా చెప్పవచ్చు. పెట్టేది రాజమండ్రిలో.., హాజరు కాబోతున్నది కెవిపి వంటి పచ్చి సమైక్యవాదులు! అందుకని ఉండవల్లి అప్పటి వేర్పాటు ఉద్యమం గురించి చెప్పుకుని వచ్చి చివర్లో 'దాని వలన చాలా నష్టపోయాం. అందువలన వేర్పాటు ఉద్యమాలు మర్చిపోదాం, సమైక్య ఉద్యమాలు చేద్దాం' అని ముక్తాయించవచ్చు. సాయంత్రానికి ఏ విషయమూ తెలిసిపోతుందిగా!

ఇంతకీ ఉండవల్లి అన్నీ వాస్తవాలు చెప్తారా? చెప్పవచ్చు. ఆయన వద్ద గణాంకాలు అవీ గట్టిగా వుంటాయి. మంచి హోమ్ వర్క్ చేసుకుని మాట్లాడే మనిషి. మరి ఆయన వాస్తవాలన్నీ చెప్తారా? నాకు అనుమానమే. ఆయన నిజాయితీని శంకిస్తున్నానని అనుకోవద్దు.

ఆయన ఒక పార్టీకి సంబంధించిన నాయకుడు. అన్ని వేర్పాటు ఉద్యమాల్లోనూ దోషి ఆ పార్టీయే. మామూలుగా అన్ని వేర్పాటు ఉద్యమాలలాగానే జై ఆంధ్ర ఉద్యమానికి రాజకీయ కారణాలే మూలకారణాలు. దానికి తోడు ఆర్థిక కారణాలు తోడయ్యాయి. 'భూ సంస్కరణలు చేపట్టిన పివి నరసింహారావును దింపడానికి మా పార్టీ వారే ప్రాంతీయ భావాలు రెచ్చగొట్టి ఉత్తి పుణ్యానికి ఉద్యమం చేసి రాష్ట్రానికి ఎంతో నష్టం కలిగించారు. మా పార్టీయే వీటన్నిటికీ కారణం' అని చెప్పగలడా? చెప్తే పివి పట్ల సానుభూతి పెరగదా? పివి అంటేనే భగ్గుమనే సోనియా అది విని సహించగలదా? అందువలన ఆ భాగాలన్నీ యీయన ఎడిట్ చేసేస్తారు.

అసలు సిసలైన రాజకీయచరిత్ర తెలుసుకోవడానికి, రాయడానికీ యిదే యిబ్బంది. ఇప్పుడు జై ఆంధ్ర ఉద్యమమే తీసుకోండి. 1972-73లలో జరిగింది. ఆ ఉద్యమం గురించి ఒక వ్యక్తికి సరైన అవగాహన వుండాలంటే ఆ పాటికి కనీసం టీన్స్‌లో వుండి వుండాలి. అంటే వాళ్లకు యిప్పుడు షష్టిపూర్తి అయిపోయి వుంటుంది. ఇప్పటిదాకా వాళ్లకు రాజకీయాల్లో ఆసక్తి వుందో, లేక ఆధ్యాత్మిక చింతనలో పడ్డారో తెలియదు. ఆసక్తి వున్నా అప్పటి విషయాలు గుర్తుండాలి. మామూలుగా గుర్తుంటే లాభం లేదు, అప్పటి పత్రికల్లో, పేపర్ కటింగ్స్, ఆ నాటి విషయాల గురించి రాసిన పుస్తకాలో అందుబాటులో వుండాలి. పుస్తకాలు కొనో, లైబ్రరీలకు వెళ్లో పరిశోధన చేయాలి.

ఇంత కష్టపడితే లాభం ఏమిటి? అవి రాయడానికి వేదిక దొరకాలి. ఆనాటి విషయాలు ప్రస్తుతం యిబ్బంది కలిగిస్తాయనుకుంటే యీ నాటి మీడియా అచ్చు వేయకపోవచ్చు. ఆ విషయాల గురించి కుర్రకారుకి చెప్పబోతే 'ఎవడిక్కావాలి పాత విషయాలు? జగన్ గెలుస్తాడో లేదో చెప్పు చాలు' అంటారు. తన వయస్కుడితో ఎవరితోనైనా డిస్కస్ చేయబోతే 'ఏమోరా, వాటి మీద యింట్రస్టు పోయింది. అమెరికాలో వున్న మా పిల్లాడు చెమటోడ్చి పంపిన డాలర్లతో హైదరాబాదులో కొన్న స్థలం రేటు డౌనై పోయింది. వాడు ఒకటే గోల. ఈ తెలంగాణ గొడవ ఎప్పుడు తేల్తుందో, రియల్ ఎస్టేటు ఎప్పుడు పుంజుకుంటుందో అది చెప్పు చాలు" అంటాడు. కాబట్టి మామూలువాళ్లని ఎవర్ని కదిపినా 'ఏమో, కన్‌ఫమ్‌డ్‌గా చెప్పలేను' అనేస్తారు.

అందువలన ఆనాటి చరిత్ర గురించి తెలుసుకోవాలంటే పొలిటికల్ సైన్సెస్‌లో రిసెర్చి చేసినవాళ్లను, ఆనాటి చరిత్ర గురించి జర్నలిస్టులు రాసిన పుస్తకాలను తిరగేయాలి. ఈ పొలిటికల్ రిసెర్చి చేసేవాళ్లు సాధారణంగా స్టూడెంటు యూనియన్ లీడర్లయి వుంటారు. యూనివర్శిటీ ప్రాంగణంలో కాపురం పెట్టి కొత్తగా వచ్చే స్టూడెంట్లను తమ యూనియన్లలో చేర్పించడానికి అనువైనది రిసెర్చి స్టూడెంటుగా నమోదు చేయించుకుని ఎప్పటికీ పూర్తి చేయకపోవడమే! ఈ రిసెర్చికి ఫిజిక్స్, కెమిస్ట్రీ లాటివయితే కష్టం. ల్యాబ్‌కు వెళ్లాలి. పొలిటికల్ సైన్సు వంటి సోషల్ సబ్జక్టలయితే గైడ్‌ను బెదిరించి పని జరుపుకుపోవచ్చు. వీళ్లే కొంతకాలానికి రిసెర్చి పూర్తి చేసి ఆ యూనివర్శిటీల్లోనే ప్రొఫెసర్లు అయిపోతారు. తమకున్న రాజకీయ అభిప్రాయాలకు అనుగుణమైన కళ్లతో (మళ్లీ వీళ్లల్లో చాలామంది లెఫ్టిస్టులు) చరిత్రను చూసి పుస్తకాలు రాస్తారు, పత్రికల్లో వ్యాసాలు రాస్తారు, టీవీ చర్చల్లో రాజకీయ విశ్లేషకులుగా అవతారాలెత్తుతారు. అందువలన వీళ్లను చదివినప్పుడు, విన్నప్పుడు వాళ్లు చెప్పే చరిత్ర కంటె ముందు వాళ్ల చరిత్ర తవ్వి తీయాలి. వీళ్లకు కులాభిమానం, ప్రాంతీయాభిమానం, రాజకీయాభిమానం వుందేమో తెలుసుకుని వాటికి డిస్కౌంటు యిస్తూ మనం చదవాలి. ఇది పెద్ద తలకాయనొప్పి.

నేను మొదలుపెట్టిన సీరియల్స్ గబగబా పూర్తి చేయనని నా మీద కోపం వున్నవాళ్లందరూ యీ విషయాన్ని గుర్తించాలి. ఏదైనా సబ్జక్ట్ మీద పుస్తకం దొరికించుకున్నాక కూడా నేను వాళ్లు చెప్పిన ప్రతీ విషయాన్నీ శంకిస్తాను. (నిజానికి యిది చాలా వింతైన విషయం. గురువు వద్ద విద్య అభ్యసిస్తూనే ఆయన చిత్తశుద్ధిని అనుమానించడం వంటిది. కానీ తప్పదు. ప్రశ్నించకపోతే జ్ఞానం వెలికి రాదు. ఉపనిషత్ కానీయండి, మార్క్సిజం కానీయండి – ప్రశ్నలోంచే పుట్టింది) క్రాస్ చెక్ చేసుకుంటాను, నిదానించి ఆలోచిస్తాను, అప్పుడే కాగితం మీద పెడతాను. దానికి విరుద్ధమైన సమాచారం దొరికితే సవరించుకుంటానని విన్నవించుకుంటాను. సత్యాన్వేషణ అనేది అంత కష్టమైన పని.

వాస్తవాలు ఎంత వక్రీకరిస్తున్నారో సమీపగతాన్ని చూసినా తెలుస్తుంది. ఎన్టీయార్ పార్టీ పెట్టాక చంద్రబాబు వచ్చి చేరలేదని, ఎన్నికల్లో ఓడిపోయాకనే వచ్చి చేరారని ఈ రోజు దాదాపు అందరికీ తెలుసు. కానీ బాబు పట్ల వలపక్షం చూపించే జర్నలిస్టు ఒకాయన బాబు సలహా మేరకే ఎన్టీయార్ రాజకీయాల్లో చేరారని పుస్తకం రాసేశారు. పదేళ్లు పోయాక అదే చరిత్ర అయిపోతుంది. దాన్ని చూసి మరో పదిమంది అదే రాస్తారు. 'ఎన్టీయార్‌కి నైతిక విలువలు లేవు' అని బాబు అన్నారని నేను రాసిన వ్యాసం చదివి చాలామంది ఆశ్చర్యపడ్డారు. అంత ఘాటుగా అన్నారా? అని. ఆనాటి పేపర్ కటింగ్ దగ్గర పెట్టుకున్నాను కాబట్టి రుజువు చూపగలిగాను. ఇలా ఎంతమంది పెట్టుకుంటారు? పెట్టుకున్న వాళ్లకి రాసే నేర్పు వుండాలి, వేదిక దొరకాలి. ఇన్ని సంధానపడితే తప్ప వాస్తవం బయటకు రాదు.

ఇప్పుడు ఉండవల్లి అర్ధసత్యాలే చెప్పబోతారని నా నమ్మకం. ఆ ఉద్యమం గురించి వాస్తవాలు తెలియనివారికి యిప్పుడు కొన్ని చెప్తాను. సాయంత్రం ఉండవల్లి ఏం చెప్తారో గమనించండి. నేను విపులంగా రాయబోయే విషయాలు చదివే ఓపిక లేనివారి కోసం బుల్లెట్స్‌లా  చెప్పేస్తున్నా –

01. జై ఆంధ్రా ఉద్యమానికి కారణం కాంగ్రెస్‌లో జరిగిన ఆధిపత్య పోరు. అప్పటిదాకా అధికారం చెలాయించిన రెడ్డి, కమ్మ వర్గాలను అదుపు చేయడానికి ఇందిరా గాంధీ ప్రయత్నించడంతో వారు ఎదురు తిరిగి ఉద్యమం చేశారు.

02. ముఖ్యమంత్రిగా వున్న పివి నరసింహారావు తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పరచుకోవడానికి, బలహీనవర్గాలను ఆకట్టుకోవడానికి చేసిన భూ సంస్కరణల వలన ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటాయని భయపడిన భూస్వామి వర్గాలు ఆర్డినెన్సు శాసనసభలో బిల్లుగా మారబోతున్న తరుణంలో యీ ఉద్యమాన్ని లేవనెత్తి శాసనసభనే రద్దు చేయించారు.

03. 1972 అక్టోబరులో ముల్కీ రూలును సమర్థిస్తూ సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పు వాళ్లకు అనువుగా సమయానికి పనికి వచ్చింది.

04. ఉద్యమం మొదలుపెట్టాక ప్రతిపక్షం చేతిలోకి వెళ్లిపోవడం గమనించి, కాంగ్రెస్ వారే దానిలో చొరబడి, నాయకత్వాన్ని హస్తగతం చేసుకుని, ప్రజలను ఆవేశంతో కిర్రెక్కించి, నెలల తరబడి ఉద్యమాన్ని నడిపించి, చివరకు ఇందిరా గాంధీ కన్నెఱ్ఱ చేయడంతో అకస్మాత్తుగా నీరు కార్చేశారు. భూ సంస్కరణలు అటకెక్కాయి. ముల్కీ రూల్సు కూడా..! పివిని గద్దె దింపేసి, రాష్ట్రపతి పాలన పెట్టారు. పివిని మళ్లీ రాష్ట్రరాజకీయాల్లోకి రానీయలేదు.

05. దీనిలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతీయభేదాలు లేవు. పివిని గద్దె దింపినది కులరాజకీయాలు, భూస్వామివర్గాలు. పివి వ్యతిరేకుల్లో చాలామంది తెలంగాణ నాయకులే. వేర్పాటు ఉద్యమాలలో ప్రజలు ఆవేశాల్లో పడికొట్టుకుపోయినా 1956 నుండి మెజారిటీ జనం సమైక్యమే వాంఛించారు. 1969లో జై తెలంగాణ నడిచినపుడు ఆంధ్రలో సమైక్యమే కోరారు. 1972లో జై ఆంధ్రా నడిచినపుడు తెలంగాణలో సమైక్యమే కోరారు.

ఇప్పుడు ఓపికున్నవారికోసం 1972 నాటి రాజకీయాలు కాస్త విపులంగా చెప్తాను.

భారత రాజకీయాల్లో కాంగ్రెస్‌దే ప్రధానపాత్ర. స్వాతంత్ర్యం వచ్చేందుకు ముందునుండీ ప్రాదేశిక ప్రభుత్వాలు ఏర్పడినపుడు కాంగ్రెస్ వారే ఎన్నికలలో నెగ్గారు. పంచాయితీ ఎన్నికలు, మునిసిపాలిటీ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు.. యిలా అనేక స్థాయిల్లో వాళ్లు అధికారాన్ని మరిగారు. ఈ రాజకీయాల్లో కొన్ని కులాల వారే ముందున్నారు. ఒక్కో రాష్ట్రంలో కొన్ని కొన్ని కులాలు. జనాభాలో నిష్పత్తితో సంబంధం లేకుండా వీళ్లే సింహభాగం సీట్లు చేజిక్కించుకుని అధికారం చలాయించారు. జిల్లా స్థాయినుండి రాష్ట్రనాయకులయేవారు. ఈ రాష్ట్రనాయకులలో కొందరు జాతీయస్థాయికి వెళ్లి వెలిగేవారు. అక్కడ ఒక కూటమిలా ఏర్పడి ఢిల్లీలో చక్రం తిప్పేవారు. అప్పట్లో వాళ్లని సిండికేట్ నాయకులు అనేవారు. నెహ్రూ శకం వరకు యీ సిండికేట్ కాస్త అదుపులో వుండేది. ఆయన మరణం తర్వాత యీ సిండికేట్ లాల్ బహదూర్ శాస్త్రిని ప్రధానిగా చేసింది.

ఆయన హఠాన్మరణంతో ఇందిరా గాంధీని తీసుకుని వచ్చి కూర్చోబెట్టారు. నెహ్రూ కూతురుగా దేశమంతా తెలిసిన వ్యక్తి, రాజకీయాలు తెలియని మూగబొమ్మ అనే విషయాలు పరిగణనలోకి తీసుకుని ఆమెను కుర్చీలో కూర్చోపెట్టి వెనకనుండి వాళ్లు ఆడించేవారు. కొన్నాళ్లు అలా ఆడిన తర్వాత ఆమె వీళ్ల కంటె తెలివి ప్రదర్శించి వీళ్ల వ్యతిరేకులను చేరదీసింది. వాళ్ల సహాయంతో ఈమె బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటివి చేసి డైరక్టుగా ప్రజల మధ్య పాప్యులర్ అయిపోయింది. అప్పుడు ఈమె యీ సిండికేట్‌కు తన తడాఖా చూపించింది. కాంగ్రెస్‌ను చీల్చింది. 1971లో బంగ్లాదేశ్ నేర్పరచి, పాకిస్తాన్‌ను రెండుగా చీల్చడంతో ఆమె ప్రభ దివ్యంగా వెలిగిపోయింది. అపర దుర్గాదేవిగా కొనియాడారు. పార్లమెంటు ఎన్నికలలో దుమ్ము దులిపేసింది.

జాతీయ స్థాయిలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాక రాష్ట్రస్థాయి నాయకుల పని పట్టబోయింది. గతంలోలా రాష్ట్రస్థాయిలో బలపడి, జాతీయస్థాయికి వచ్చి తనను ఎదిరించే స్థితికి ఎవరూ రాకుండా మూలాలే నరక నారంభించింది. నాయకత్వ లక్షణాలున్నవారిని పక్కకు తప్పించేసి తనకు విధేయులైన వారినే రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా నియమించసాగింది. వీళ్లు తను కూర్చోమంటే కూర్చునేవాళు ్లు, లేది దిగి వెళ్లిపో అంటే వెళ్లిపోయేవారు. అప్పటిదాకా ఏలుతున్న కులాల వాళ్లను పక్కకు పెట్టేసి బ్రాహ్మణులను, ముస్లిములను, హరిజనులను, వెనకబడిన వర్గాల వాళ్లను ముఖ్యమంత్రులుగా చేసింది. 1972లో ఇందిర కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ముఖ్యమంత్రులుగా నియమించిన వారిని చూడండి.

ఒడిశాలో పట్నాయక్‌లు బలంగా వున్నారు కాబట్టి తీసేసి నందినీ శతపథి అనే బ్రాహ్మణిని పెట్టింది. ఉత్తరాదిన రాజ్‌పుట్‌లను తీసేసి ఉత్తర ప్రదేశ్‌లో కమలాపతి త్రిపాఠీని, మధ్యప్రదేశ్‌లో శ్యాం చరణ్ శుక్లా, బిహార్‌లో కేదార్ పాండే, గుజరాత్‌లో ఘన్‌శ్యామ్ ఓఝూ వీళ్లందరినీ పెట్టింది. వీళ్లందరూ బ్రాహ్మణులే. పశ్చిమ బెంగాల్‌లో సిద్ధార్థ శంకర్ రాయ్ అనే స్నేహితుణ్ని పెట్టింది. ఆయన తక్కిన బెంగాల్ రాజకీయనాయకుల్లా కాయస్థుడే కానీ రాజకీయాల్లో చురుకుగా లేడు. బారిస్టర్. స్వాతంత్ర్యయోధుల కుటుంబం నుండి వచ్చినవాడు. రాజస్థాన్‌లో బర్కతుల్లా ఖాన్ అనే ముస్లిమును పెట్టి, అతని తర్వాత హర్‌దేవ్ జోషి అనే బ్రాహ్మడికి యిచ్చింది. కర్ణాటకలో లింగాయతులు, ఒక్కళిగలు రాజకీయంగా బలవంతులుగా వున్నారు కాబట్టి వాళ్లిద్దరూ కాకుండా దేవరాజ్ అర్స్ అనే బిసిను ముఖ్యమంత్రి చేసింది.

ఇక ఆంధ్రప్రదేశ్‌కు వస్తే ఇక్కడ రెడ్డి, కమ్మ వర్గాలదే ప్రాబల్యం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి 1971 వరకు రెండు సంవత్సరాలు (1960-62) డి. సంజీవయ్యను తప్పిస్తే రెడ్లే పాలించారు. 1971 నాటికి 287 సీట్ల ఎసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 69 మంది రెడ్లు, 47 మంది కమ్మలు. ఈ రెండు వర్గాలను పక్కకు తప్పించడానికి నిశ్చయించుకుంది ఇందిర. 1969 నాటి జై తెలంగాణ ఉద్యమం తర్వాత చెన్నారెడ్డి తెలంగాణ ప్రజా సమితి (టిపిఎస్) ఏర్పరచారు. 1970లో సిద్దిపేట, ఖైరతాబాద్ ఉపయెన్నికలలో టిపిఎస్ అభ్యర్థులు గెలిచారు. 1971 లోకసభ ఎన్నికలలో టిపిఎస్ తెలంగాణలోని 14 సీట్లలో పోటీ చేసి 10 సీట్లు

గెలుచుకుంది. దేశం మొత్తం మీద ఇందిరా కాంగ్రెస్ భారీ మెజారిటీ సంపాదించింది. కేంద్రంలో ఊగిసలాడే ప్రభుత్వమైతే యీ 10 మందితో చెన్నారెడ్డి తెలంగాణ కోసం బేరాలాడేవారేమో తెలియదు. ఇప్పుడు యీ పదీ ఎందుకు పనికి రావని అర్థమయ్యాక చెన్నారెడ్డి తన పార్టీని 1971 సెప్టెంబరులో ఇందిరా కాంగ్రెస్‌లో కలిపేశారు. కలిపేస్తూ తన శత్రువైన బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రిగా తొలగించాలని పట్టుబట్టారు. 287 లెజిస్లేటర్లలో 220 మంది బ్రహ్మానంద రెడ్డిపై విశ్వాసం ప్రకటించినా ఇందిర ఆయనను రాజీనామా చేయమంది. ఆయన స్థానంలో తనకు విధేయుడు, రాజకీయంగా బలహీనుడు అయిన పివి నరసింహారావును 1971 సెప్టెంబరు 30 న ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టింది. పివి బ్రాహ్మణుడు.

ఇందిరా గాంధీ తల్లిదండ్రులు బ్రాహ్మణులు. ఆమె భర్త పార్శీ. తండ్రి నెహ్రూ ఉదారవాది. ఇందిర కులాభిమానం చేత పివిని కూర్చోబెట్టిందని అనుకోవడానికి లేదు. రాష్ట్రంలో పునాదులు లేకుండా రాజకీయంగా బలహీనంగా వుండి, విధేయులైన వాళ్లే ఆమెకు కావాలి. నిజానికి ఆమె వద్దకు ముగ్గురు తెలంగాణ నాయకులు వెళ్లారు – చొక్కారావు, వెంగళరావు, పివి. మొదటి యిద్దరూ వెలమలు. చొక్కారావు కరీంనగర్ జిల్లాను ఏలే రోజులవి. వెంగళరావు బ్రహ్మానంద రెడ్డి కాబినెట్‌లో హోం మంత్రిగా వుండి నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసి ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకున్నారు. (1969 తెలంగాణ ఉద్యమం విఫలమయిన తర్వాత నిస్పృహతో యువకులు వెళ్లి నక్సలైట్లుగా మారారని నేటి తెలంగాణ ఉద్యమనాయకులు చెప్పేది శుద్ధ తప్పు. 1969 నాటికే నక్సలైటు ఉద్యమం అణచివేయబడింది. పైగా అప్పట్లో ఉద్యమం అత్యంత తీవ్రంగా వున్నది శ్రీకాకుళం ప్రాంతంలో! అక్కడ ఏ వేర్పాటు ఉద్యమమూ లేదు).

వారిద్దరినీ కాదని పివిని ఇందిర ఎంపిక చేసింది. పివి తొలిసారి మంత్రి అయినది – 1962లో! సంజీవరెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి అయినపుడు గవర్నరుకు తీసుకెళ్లిన మంత్రుల జాబితాలో పివి పేరు లేదు. చెన్నారెడ్డి పట్టుదలతో లిస్టులో హయగ్రీవాచారి పేరు చేర్చారు. ఆఖరి నిమిషంలో హయగ్రీవాచారి పేరు తీసేసి పివి పేరు పెట్టారు. అప్పటినుండి ప్రతి కాబినెట్‌లోనూ మంత్రిగా వుంటూ వచ్చారు. అవైనా చిన్నవే. 1962–64 లా అండ్ ఇన్‌ఫర్మేషన్‌కి మినిస్టర్ ఆఫ్ స్టేట్‌గా వున్నారు. 1964–67 మధ్య లా అండ్ జైల్స్‌కు మినిస్టర్ ఆఫ్ స్టేట్, 1967–69 మధ్య లా అండ్ ఎండోమెంట్స్‌కు మినిస్టర్ ఆఫ్ స్టేట్. 1969–71 మధ్య విద్యామంత్రిగా కాబినెట్ ర్యాంక్. దీన్ని బట్టి అర్థమవుతుంది – ఆయన రాజకీయంగా ఎంత లైట్‌వెయిటో!

అలాటి ఆయన్ని పట్టుకుని వచ్చి ఏకంగా ముఖ్యమంత్రి చేయడంతో బలమైన వర్గాలన్నీ – రెడ్డి, కమ్మ, వెలమ – ఆయనపై కత్తి కట్టాయి. ఆర్నెల్లు పోయాక పివి ఆధ్వర్యంలో 1972 మార్చిలో అసెంబ్లీ ఎన్నికలయాక ఆయన్ని ఇందిర ముఖ్యమంత్రిగా కొనసాగిద్దామనుకుంటే అంజయ్య (అప్పట్లో ప్రదేశ్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు), నూకల రామచంద్రారెడ్డి, ఎస్.వెంకట్రామ రెడ్డి, ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి, చొక్కారావు ఢిల్లీ వెళ్లి 'పివి అసమర్థుడు, మళ్లీ ఛాన్సు యివ్వవద్దు' అని అభ్యంతరం చెప్పారు. (గమనించండి, వీళ్లందరూ తెలంగాణ నాయకులే. 'తెలంగాణవాళ్లు సిఎం కాగానే ఆంధ్రప్రాంతీయులు వాళ్లని దింపేదాకా నిద్రపోలేదు' అని చెప్పే కబుర్లన్నీ ఉత్తివి. ఇక్కడ ప్రాంతీయ విభేదాలు కాదు, రాజకీయాలే ప్రధానం, వీళ్లందరూ రెడ్లు ప్లస్ వెలమ).

పివిని ముఖ్యమంత్రి చేస్తూ బివి సుబ్బారెడ్డిని ఉపముఖ్యమంత్రి చేశారు. ప్రదేశ్ కాంగ్రెస్‌కు ప్రెసిడెంటుగా కాకినాడకు చెందిన మహమ్మద్ ఇస్మాయిల్‌ను, అంజయ్యను వైస్ ప్రెసిడెంటుగా చేశారు. కాబినెట్‌లో 5గురు రెడ్లు, 4గురు కమ్మ, ఇద్దరు బ్రాహ్మణ, ఇద్దరు క్షత్రియ, 1 ముస్లిం, 4గురు బిసిలు. మొదటిసారి కాబినెట్‌లో బిసిలకు ప్రాధాన్యత లభించింది. ఇంత జాగ్రత్త పడినా అసమ్మతి తప్పలేదు. అప్పటికి జాతీయస్థాయికి వెళ్లిన సంజీవయ్య, రఘురామయ్య కలిసి కాబినెట్‌లో బ్రహ్మానందరెడ్డి వర్గానికి (వారిలో విజయభాస్కరరెడ్డి ఒకరు) చోటు దక్కకుండా చేశారు. దీనిలోనే కాదు, 15 సభ్యుల ఎలక్షన్ కమిటీలో కూడా లేకుండా చేశారు. 1972 మార్చి ఎసెంబ్లీ ఎన్నికలతో ఆంధ్రప్రదేశ్ రాజకీయస్వరూపం మార్చేయడానికి ఇందిర దర్శకత్వంలో పివి ప్రణాళికలు రచించారు.

ఇక్కడ భూసంస్కరణల గురించి కొంచెం మాట్లాడుకోవాలి. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, సోషలిజం వంట బట్టించుకున్న కాంగ్రెస్‌వాదులు అందరూ ఆర్థిక అసమానతలు పోవాలంటే మిగులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పంచాలి అంటూనే వచ్చారు. ఆస్తిపరులు అంటే భూస్వాములే అని ఎందుకనుకోవాలి? అని నాకు ఆశ్చర్యం వేస్తూ వుంటుంది. ఇద్దరన్నదమ్ముల్లో ఒకడు తన వాటా భూమి అమ్మేసి ఫ్యాక్టరీ పెట్టినా, షేర్ మార్కెట్లో లేదా సినిమాల్లో పెట్టినా వాడిని ఏమీ అనరు. భూమిగా మిగుల్చుకున్నవాడి దగ్గర మాత్రం లాక్కుంటారు. ఇదేం న్యాయం? అని చాలామంది కమ్యూనిస్టులను కూడా అడిగాను. 'మన దేశంలో భూమి అనేది ముఖ్యమైన అంశం కాబట్టి, అది పంచితే సరిపోతుంది..' అని వాళ్లు కుంటి జవాబులు చెప్పేవారు. ఆలోచించగా నాకు ఒక సమాధానం తట్టింది. అది సరైనదో కాదో విజ్ఞులు చెప్పాలి –

ఇదంతా రాజకీయంగా కొత్త శక్తులను తీసుకుని వచ్చే ప్రయత్నం తప్ప ఆర్థిక అసమానతల గురించి చింత కాదు. మన దేశంలో 80% జనాభా గ్రామాల్లో వుండేవారు. గ్రామంలో భూస్వామిదే పెత్తనం. ఊళ్లో తక్కిన రైతులందరికీ అతనితోనే మొహమాటం. పాలేళ్లు, వెట్టి చాకిరీ వాళ్లు, వృత్తిపనుల వాళ్లు... యిలా అతని చుట్టూ ఎంతో పరివారం. ఎన్నికలు వస్తే అతను చెప్పినవాళ్లకే ఓటేయాలి. ఎవరైనా అధికారి వస్తే అతనింట్లోనే బస చేస్తాడు. సాధారణంగా భూస్వామి అగ్రకులానికి చెందినవాడే అయి వుంటాడు. ఆ గ్రామానికి అతను ఓ చిన్నపాటి మహారాజు. రాజకీయాలను శాసిస్తాడు. అతన్ని ఎదిరించి చిన్న కులస్తుడు కానీ, చిన్న రైతుగానీ

ఎదగడం కష్టం. గ్రామాల్లో భూస్వామి చలాయించిన అధికారం, పట్టణాల్లో ఫ్యాక్టరీ యజమానులు, సినిమా నిర్మాతలు – ఎంత డబ్బున్నా – చలాయించలేరు.

ఏ పార్టీకైనా కావలసినది రాజకీయ అధికారమే కాబట్టి భూస్వాముల మీదనే అస్త్రాలు ఎక్కు పెట్టింది. భూ సంస్కరణలు చేస్తాం, జమీందార్లనుండి మిగులు భూమి లాక్కుని పేదలకు పంచేస్తామని మానిఫెస్టోలు తయారు చేసేవారు. భూస్వాములు మార్పును సహించరు, రానీయరు. రాజరిక వ్యవస్థకు కొమ్ము కాస్తారు. నిజాంకు లేదా ఆంగ్లప్రభుత్వానికి తొత్తులుగా వుంటూ అధికారాన్ని పదిలం చేసుకుంటారు. సంస్కరణలను అడ్డుకుంటారు. స్వాతంత్ర్యపోరాట సమయంలో వీళ్లు జస్టిస్ పార్టీకి మద్దతు యిచ్చారు. కాంగ్రెస్‌కు బడుగుజీవులను పైకి తీసుకురావడానికి ప్రయత్నించింది కాబట్టి ! ఆంగ్లేయులు వెళ్లిపోయి, కాంగ్రెస్ పురోభివృద్ధిని అడ్డుకోలేమని గ్రహించాక కాంగ్రెస్‌లోనే చేరిపోయారు, తమ జమీందారీలను కాపాడుకున్నారు. కాంగ్రెస్ విధానాలను తమకు అనుకూలంగా మలచుకున్నారు.

పేదల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, పార్టీగా విస్తరించడానికి వీళ్లకు లొంగిపోయింది. అయితే నిజాయితీగల కాంగ్రెస్ వాదులైన ప్రకాశం పంతులు గారి లాటి వాళ్లు తమకు అధికారం రాగానే జమీందారీలను రద్దు చేసేశారు. అవి అమలు కాకుండా చూడడానికి వీళ్లు ఆయన్ను గద్దె దింపేసి, తమకు అనుకూలంగా వున్నవాళ్లను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. ఇలా కాంగ్రెస్ పార్టీ పైకి సోషలిజం వల్లిస్తూ, ఆచరణలో కాపిటలిస్టు విధానాలే అమలు చేసేది. ఇలా బలిసిన కాంగ్రెస్ నాయకులే ఇందిరా గాంధీ ఎదుగుదల నడ్డుకున్నారు. వీళ్లను అదుపు చేయాలంటే భూసంస్కరణలు నిజంగా అమలు చేయాలని ఆమె నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో భూస్వాములు చాలామంది వున్నారు కాబట్టి భూసంస్కరణలు పకడ్బందీగా అమలు చేసి, వాళ్ల ఆర్థికమూలాలను దెబ్బ తీసి, కొత్తతరహా రాజకీయవాదులను తయారుచేస్తే వాళ్లు తమకు పూర్తిగా విధేయులుగా వుంటారు కదాని ఆలోచన చేసింది.

నిజానికి బ్యాంకుల జాతీయకరణ ఉద్దేశం కూడా అదే. అప్పటివరకు బాంకులు సామాన్యుల నుండి డిపాజిట్లు వసూలు చేసి, ఆ డబ్బును డబ్బున్నవాళ్లకే ఋణాలుగా యిచ్చి లాభాలు ఆర్జించేవి. జాతీయకరణ చేశాక 'గరీబీ హటావో' అంటూ చిన్న తరహా వాళ్లకు కూడా ఋణాలు యివ్వమని ప్రభుత్వం ఆదేశించింది. కిరాణా దుకాణాలకు, ఆటో డ్రైవర్లకు, రిక్షావాళ్లకు అందరికీ బ్యాంకు ఋణాలు దక్కాయి. ఆర్థిక ప్రగతి వూపందుకుంది. వాళ్లందరికీ ఇందిరా గాంధీ 'ఇందిరమ్మ' అయిపోయింది. వారి హృదయాల్లో పీఠం వేసుకుని వుండిపోయింది. అందుకే పివిని ముఖ్యమంత్రి చేస్తూనే భూసంస్కరణల గురించి ఆలోచించమంది. ఒక పరిమితికి మించి భూమి వుంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలంది. నిజానికి యిది 1953లో ఆవడి(మద్రాసు)లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం. అప్పటినుండి దాని అతీగతీ పట్టించుకున్నవారెవరూ లేరు. ఇన్నాళ్లకు దానికి ఊపు వచ్చింది. పివి పుట్టుక చేత ధనిక భూస్వామి అయినా స్వతహాగా సోషలిజం అంటే యిష్టం కాబట్టి ఆయన వచ్చీ రాగానే భూ సంస్కరణలు ఎలా వుండాలి అన్న కసరత్తు మొదలుపెట్టారు.

దీనితో బాటు 1972 మార్చిలో రాబోయే ఎన్నికలలో టిక్కెట్లు యిచ్చేటప్పుడు పాత వర్గాలకు ప్రాధాన్యత తగ్గించి కొత్త వర్గాలకు యిస్తే వాళ్లు తమకు విధేయులుగా వుంటారనుకున్నారు. పివి, చెన్నారెడ్డి, అంజయ్య, ఇస్మాయిల్‌లతో సబ్‌కమిటీ ఏర్పడి 60% సీట్లు హరిజనులు, గిరిజనులు, బిసిలకు, మైనారిటీలకు యిస్తామని ప్రతిపాదించారు. యూత్ కాంగ్రెస్‌వారు మిల్లు ఓనర్లకు, బస్సు ఓనర్లకు, పారిశ్రామికవేత్తలకు టిక్కెట్లు యివ్వకూడదని పట్టుబట్టారు. యువరక్తాన్ని తీసుకురావడానికి 65 ఏళ్లు పై బడినవారికి కూడా యివ్వకూడదన్నారు. మనూభాయ్ షా అని ఢిల్లీ నుండి పరిశీలకుడు వచ్చి లిస్టు తయారుచేయడంలో సహాయపడ్డారు. జనవరి 1972లో ఢిల్లీ పంపారు. లిస్టులో రెడ్లు 47 (ప్రస్తుత సంఖ్య 69) కమ్మలు 29 (ప్రస్తుతం 47), యితర అగ్రకులాలు 49 (ప్రస్తుతం 53), బిసిలు 64, గిరిజనులు 9, హరిజనులు 39, మైనారిటీలు 40, స్త్రీ అభ్యర్థులు 30. దీన్ని రహస్యంగా వుంచుదామనుకున్నారు కానీ లీక్ అయిపోయింది. కమ్మలు, రెడ్లు గోల పెట్టేశారు. ఢిల్లీ వెళ్లి లాబీయింగ్‌లు చేశారు. ఏం చేసినా ఫైనల్ లిస్టులో 230 సిటింగ్ సభ్యుల్లో 116 మందికి మాత్రమే టిక్కెట్లు దక్కాయి. దాంతో తిరుగుబాటు సభ్యులు పుట్టుకుని వచ్చారు. 200 మంది కాంగ్రెస్‌వారు పోటీ అభ్యర్థులుగా నిలబడ్డారు(వారిలో 14 మంది సిటింగ్ ఎమ్మెల్యేలున్నారు).

తిరుగుబాటు అభ్యర్థులతో, వారిని సమర్థించేవారితో కాంగ్రెస్ కఠినంగా వ్యవహరించింది. 97 మందిని ఆరేళ్లపాటు బహిష్కరించారు. 300 మందిని పార్టీలోంచి శాశ్వతంగా బహిష్కరించారు. తీసేసినవారిలో మాజీమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ సభ్యులు, ఎమ్మెల్యేలు వున్నారు. బాధితుల్లో బ్రహ్మానందరెడ్డి గ్రూపు వారు ఎక్కువ. ఆయన సోదరుడు వెంగళరెడ్డితో సహా అనేకమంది జిల్లా పరిషత్ అధ్యక్షులు పార్టీ వ్యతిరేకకలాపాలకై సస్పెండ్ చేయబడ్డారు. కేంద్రంలో బ్రహ్మానందరెడ్డి నచ్చచెప్పుకోవడంతో వెనక్కి తీసుకున్నారు. కానీ వీరందరికీ లోపల కసి పెరిగింది. తర్వాతి కాలంలో జై ఆంధ్ర ఉద్యమం వచ్చినపుడు తమ తడాఖా చూపించారు. మామూలుగా అయితే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవాల్సిందే. కానీ అప్పట్లో గట్టి ప్రతిపక్షం ఏదీ లేదు. పైగా ఇందిర గాలి బలంగా వీస్తోంది. బలహీనవర్గాలన్నీ ఇందిర వైపు నిలిచారు. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో, 1971 పార్లమెంటు ఎన్నికలలో ఇందిరను, కేంద్రాన్ని తిట్టినవారందరూ అవన్నీ మర్చిపోయారు. దాంతో రాష్ట్రంలో యిక్కడా అక్కడా అన్న తేడా లేకుండా అన్ని చోట్లా కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. 219 సీట్లు గెలిచింది. (గత ఎన్నికల కంటె 11 తగ్గాయి) కాంగ్రెస్ నుండి బయటకు వచ్చి ఇండిపెండెంట్లుగా గెలిచినవారు 53 మంది! ఇందిరకు మద్దతు పలికిన సిపిఐకు 7, వ్యతిరేకించిన సిపిఎంకు 1, స్వతంత్ర పార్టీకు

2, జనసంఘ్, కాంగ్రెస్ (ఓ)లకు సున్న!

ఎన్నికలు కాగానే పివిపై అనేక ఆరోపణలు చేస్తూ ఆయనను మళ్లీ ముఖ్యమంత్రి చేయకూడదని తక్కిన నాయకులందరూ ఢిల్లీ చుట్టూ తిరిగారు. కానీ ఇందిరా గాంధీ పివియే ముఖ్యమంత్రి అని చెప్పడంతో వెనుదిరిగారు. 1972 మార్చి 20 న పివి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ సారి కాబినెట్‌లో కూడా బిసిలకు ప్రాధాన్యం లభించింది. మొదటిసారిగా కాబినెట్‌లో అగ్రకులాల, సంపన్న వర్గాల ప్రాతినిథ్యం తగ్గింది. పంచాయితీరాజ్ సంస్థలు భూస్వాముల జేబుసంస్థలుగా వున్న విషయం గ్రహించిన పివి జిల్లా పరిషత్‌లను, పంచాయితీ సంస్థలను రద్దు చేయడానికి ఉద్యమించారు. దాంతో అధికారం పోయిన జిల్లా కాంగ్రెస్ నాయకులందరూ పివిపై కక్ష కట్టారు.

ఇక సంస్కరణల విషయానికి వస్తే – దేశంలో ఓం ప్రథమంగా వ్యవసాయ భూముల అన్యాక్రాంతాన్ని నిషేధిస్తూ మే 3 న ఆర్డినెన్స్ తెచ్చింది. జులై 5 న అర్బన్ లాండ్ సీలింగ్‌కై ఆర్డినెన్స్ తెచ్చారు. భూ పరిమితిని నిర్ధారిస్తూ తయారుచేసిన భూ సంస్కరణల బిల్లును 1972 డిసెంబరు లోగా సభలో ఆమోదింప చేస్తామని పివి ప్రకటించారు. పంచాయితీరాజ్ వ్యవస్థ యీ అభ్యుదయకర చర్యలకు సాహసించకపోతే, సహకరించకపోతే ఆ వ్యవస్థ రూపురేఖలనే మార్చేస్తానన్నారు. భూ సంస్కరణల బిల్లు సెప్టెంబరులో సిద్ధమైంది. సెలక్ట్ కమిటీ నివేదిక వచ్చింది. ఉభయ శాసనసభలు అత్యధిక సంఖ్యలో దీనిని ఆమోదించాయి. స్వతంత్ర పార్టీ, జనసంఘం వారు బహిరంగంగానూ, కాంగ్రెస్‌లో భూస్వామి వర్గాల వారు లోపాయికారీగానూ యీ బిల్లును ఆపించే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఇక ఆ బిల్లు కూడా వచ్చేస్తే బలహీనవర్గాలకు మిగులు భూమి అందుబాటులోకి వచ్చేసి కొత్త రాజకీయశక్తిగా అవతరించి, తమను లక్ష్యపెట్టరని రాష్ట్రం మొత్తం లోని భూస్వామి వర్గాలు ఆందోళన చెందాయి. హైదరాబాదుతో సహా నగరాలలో వున్న పెద్ద పెద్ద నివేశ్న స్థలాలున్న ధనికులందరూ లబోదిబో మంటూ వున్నారు. అందరూ కలిసి యీ ప్రభుత్వం కూలిపోతే బాగుండును, యీ సంస్కరణలన్నీ ఆగిపోతాయి కదా అనుకున్నారు. కానీ ఎన్నికై ఆర్నెల్లయినా కానీ ప్రభుత్వం అప్పుడే ఎలా పడిపోతుంది? పైగా శాసనసభలో అంత మెజారిటీ వుండగా! ప్రజల్లో, ముఖ్యంగా బలహీనవర్గాల్లో అంత ఆదరణ వుండగా!!

ఇటువంటి సమయంలో వారికి దేవుడు పంపినట్టు అక్టోబరు 3 న ముల్కీ అంశంపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ హై కోర్టులో ముగ్గురు న్యాయమూర్తులు 1970 డిశంబరులో ముల్కీ రూల్స్ చెల్లుతాయని తీర్పు యిచ్చారు. దాని మీద అప్పీల్‌కి వెళితే 1972 ఫిబ్రవరిలో ఐదుగురు న్యాయమూర్తులు రద్దు పరిచారు. తెలంగాణలో దానిపై ఆందోళన చెందారు. వాళ్లను సంతృప్తి పరచడానికి పివి నేతృత్వంలో రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టుకి అప్పీల్‌కి వెళతానని ప్రకటించింది. సుప్రీం కోర్టు కూడా హైకోర్టు తీర్పుని బలపరిస్తే తప్పంతా కోర్టు మీద నెట్టేయవచ్చని ప్రభుత్వం ఆశించింది. కానీ అక్టోబరు 3 న సుప్రీం కోర్టు ముల్కీ రూల్స్ చెల్లుతాయని తీర్పు యిచ్చింది. ఇక్కడ పివి ఒక పొరబాటు చేశారు. కోర్టు తీర్పు శిరసావహిస్తాం అని వూరుకుంటే పోయేదానికి 'ఈ తీర్పు తెలంగాణ వారి హక్కుపై తుది తీర్పు' అన్నారు. పివిని ఎలా తప్పుపడదామా అని చూస్తున్నవారికి యీ వ్యాఖ్య అందివచ్చింది. 'అదిగో చూశావా, యీయన ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ముఖ్యమంత్రిగా కాకుండా ఒట్టి తెలంగాణకు ముఖ్యమంత్రిగా మాట్లాడుతున్నాడు' అని గోల చేశారు. భూపరిమితి చట్టం అమలు పరచకుండా వాయిదా వేయించడానికి యిదే అదను అనుకున్నారు.

ముల్కీ రూల్సు కారణంగా ఆంధ్రప్రాంతపు ఉద్యోగార్థులకు తెలంగాణలో ఉద్యోగాలు దక్కవు కాబట్టి వారు తమ సొంత రాష్ట్రంలోనే ద్వితీయశ్రేణి పౌరులుగా మారుతున్నారని ఆందోళన ప్రారంభించారు. 'స్క్రాప్ ముల్కీ ఆర్ డివైడ్ స్టేట్' అనే పోస్టర్లు వెలిశాయి. రెండు, మూడు వారాల్లోనే 'స్క్రాప్ ముల్కీ' అనే మాట తీసేసి రాష్ట్రాన్ని విభజించి తీరాలని పెద్ద యెత్తున ఆందోళన ప్రారంభించారు. విద్యార్థులను, ఉద్యోగులను రెచ్చగొట్టారు. విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలు మానేశారు. ఉద్యోగులు నెలల తరబడి కార్యాలయాలకు వెళ్లలేదు. మాట్లాడితే బంద్. ఈ విరామంలో భూస్వాములు భూపరిమితి చట్టం నుండి తప్పించుకోవడానికి అనేక ప్రయత్నాలు చేశారు. పిల్లల్లో మైనర్లను మేజర్లుగా చూపారు, ఆడపిల్లలకు హడావుడిగా పెళ్లి చేసి, వేరే కుటుంబం అన్నట్టు చూపారు, భార్యాభర్తలు విడాకులు తీసుకున్నట్టు, విడివిడిగా వుంటున్నట్టు చూపారు, పాలేళ్ల పేర, కూలివాళ్ల పేర భూములు రాసేసి తమ వద్ద పెద్దగా లేదని చూపించారు. కొందరు తమ భూములను ఉప్పుకొఠార్లుగా పేర్కొన్నారు. వీటిని అరికట్టడానికి, చెక్ చేయడానికి ప్రభుత్వ యంత్రాంగం అనేది లేకుండా చేశారు.

ఆంధ్ర ఉద్యమం మొదటి దశలో నాయకత్వం ప్రతిపక్షం చేతిలో వుంది. తెన్నేటి, గౌతు లచ్చన్న, వెంకయ్య నాయుడు, జూపూడి యజ్ఞనారాయణ యిటువంటివారు ఊరూరూ తిరిగి ఉపన్యాసాలు యిచ్చేవారు. అప్పుడు కాంగ్రెస్ వారు రంగంలోకి దిగి నాయకత్వాన్ని తమ చేతిలోకి తీసుకున్నారు. కమ్యూనిస్టులు తప్ప తక్కిన పార్టీలన్నీ రాష్ట్రవిభజనకు అనుకూలంగా మాట్లాడారు. రాష్ట్రం సమైక్యంగా వుండాలని వాదించిన వారి జీవితాలను విభజనవాదులు దుర్భరం చేశారు. ఆంధ్రప్రాంతమంతా ప్రజాజీవితం అస్తవ్యస్తమై పోయి, ఉద్యమాన్ని చురుగ్గా నడిపించవలసిన తరుణంలో కాంగ్రెస్ నాయకులు రెండు, మూడు వారాలకోసారి సమావేశమయ్యేవారు, అదీ విద్యార్థుల ఒత్తిడి తట్టుకోలేక! అధికారంలోనూ వారే, ఉద్యమంలోనూ వారే! అటు హై కమాండ్‌కి, యిటు ఉద్యమకారులకు మధ్య నలుగుతూ తెలంగాణ వచ్చి కూర్చునేవారు. ఇందిరా గాంధీ కచ్చితంగా చెప్పేశారు – 'మీరు ఎన్ని నెలలు ఉద్యమం చేసినా రాష్ట్రాన్ని విభజించబోయేది లేదు' అని. అరెస్టులు, కాల్పులు, చావులు.. అన్నీ జరిగాయి.

అయినా ఉద్యమం అదుపులోకి రాకపోవడంతో ఇందిర పివి ప్రభుత్వాన్ని 1973 జనవరి 18 న రద్దు చేసేసి రాష్ట్రపతి పాలన

పెట్టేశారు. ఎచ్.సి.శరీన్ గవర్నరుకు సలహాదారుగా వచ్చి నిర్దాక్షిణ్యంగా ఉద్యమాన్ని అణిచివేయసాగారు. ప్రభుత్వోద్యోగులందరూ ఉద్యోగాల్లో చేరారు. రాజకీయనాయకుల ఆటకట్టయింది. ఇందిర ఆహ్వానంపై ఫిబ్రవరి 7 న బివి సుబ్బారెడ్డి ఢిల్లీ వెళ్లి చర్చలు జరిపారు. కాంగ్రెసేతర నాయకులు సుబ్బారెడ్డి, యితర కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను ఖండించారు. కాంగ్రెస్, కాంగ్రెసేతర నాయకుల మధ్య విభేదాలు వచ్చేసి, ఉద్యమం బలహీనపడింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడకపోతే పదవులను తృణప్రాయంగా వదిలేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులందరూ పార్లమెంటుకి వెళ్లి బుద్ధిగా కూర్చున్నారు. మళ్లీ మార్చిలో చిత్తూరులో సమావేశమై కొత్త పార్టీ పెడతామని ప్రకటించారు. కానీ ప్రభుత్వోద్యోగులకు కాంగ్రెస్ నాయకుల చిత్తశుద్ధిపై నమ్మకం పోయింది, సమ్మె విరమించారు.

కొత్త రఘురామయ్య ఫిబ్రవరిలో కేంద్రమంత్రి పదవి కట్టబెట్టి, ఎన్‌జి రంగా వర్గాన్ని చేరదీసి ఇందిర కమ్మవర్గాన్ని చల్లార్చింది. బివి సుబ్బారెడ్డికి ప్రతిగా బసిరెడ్డిని దువ్వింది. ముల్కీ రూల్సుకి బదులుగా ఆరుసూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రపతి పాలన కారణంగా రాజకీయనాయకులందరూ నిరుద్యోగులై పోయారు. 'ప్రత్యేక తెలంగాణ లేదు, ప్రత్యేక ఆంధ్ర లేదు, ఎలాగోలా మళ్లీ ప్రభుత్వాన్ని నెలకొల్పి మాకు అస్తిత్వాన్ని కల్పించండి' అని బతిమాలుకున్నారు. అప్పుడు రాష్ట్రపతి పాలన ఎత్తేసి జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా 1973 డిసెంబరులో మళ్లీ ప్రజాప్రభుత్వం ఏర్పడింది. వెంగళరావుకు కమ్మకులస్తుల సపోర్టు వుందని చెప్పుకున్నారు. దాంతో జై ఆంధ్ర ఉద్యమం స్వస్తి. అప్పటినుండి యిప్పటివరకు మళ్లీ దాని మాట ఎత్తినవారు లేరు. ఇటీవల కాలంలోనే సన్నసన్నగా కొందరు అంటున్నా పట్టించుకునే నాథుడు లేడు.

ఇదీ క్లుప్తంగా జై ఆంధ్ర ఉద్యమ చరిత్ర. ఈ వేర్పాటు ఉద్యమానికి, ప్రస్తుతం నడుస్తున్న వేర్పాటు ఉద్యమానికి పోలికలు కనబడితే నేనేం చేయలేను. రాజకీయయజ్ఞంలో ప్రజలే సమిధలు. ఆవేశాలు రెచ్చగొట్టి బాగుపడేది నాయకులు, నష్టపోయేది సామాన్యప్రజలు. చదువులు పోతాయి, వ్యాపారాలు దెబ్బ తింటాయి, ప్రాణాలు పోతాయి.. కానీ నాయకులకు మాత్రం పదవులు, కాంట్రాక్టులు లభిస్తాయి. జై ఆంధ్ర ఉద్యమం భూ సంస్కరణలను విజయవంతంగా ఆపింది. ఇప్పటికీ మిగులుభూమి పంపకాలు పూర్తిగా జరగలేదు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 33 ఎమ్బీయస్ : అధిష్టానం మనోగతం**

ఇంకో గంటలో ఆజాద్ ప్రెస్ మీట్ పెట్టి తెలంగాణ గురించి ప్రకటన చేస్తారని టీవీలు హోరెత్తిస్తున్నాయి. ఏం చెప్పబోతారో చూదాం అంటూ గడగడగడ గుక్క తిప్పుకోకుండా ఢిల్లీ నుండి టీవీ రిపోర్టర్లు ఏవేవో చెప్పేస్తున్నారు. ఏదో అద్భుతం జరగబోతోందన్న నమ్మకం నాకైతే లేదు. తెలంగాణ గురించి ముఖ్యమైన ప్రకటన అయితే – షిండేగారు మాట్లాడాలి. ఆజాద్ గారెందుకు మాట్లాడడం? రాష్ట్ర విభజన అనేది హోం శాఖ కిందకు వస్తుంది కాబట్టి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినది, దాని ఫలితాన్ని నెల్లాళ్లలో చెపుతామని లిఖితపూర్వకంగా కాకపోయినా నోటిమాటగానైనా అన్నది – హోం మంత్రి. ఆజాద్ గారికి ఏం సంబంధం? ఉంటే గింటే కాంగ్రెస్ పార్టీ తరపున రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కాబట్టి కాంగ్రెస్ పార్టీ విధానం ఏమిటో చెప్పవచ్చు. అంతకుమించి ఏమీ చెప్పడానికి ఆయన తగడు. సరే కాంగ్రెస్ విధానమే అనుకోండి, ఏం చెప్తారు? తేల్చి చెప్పేస్తారా? తెలంగాణ యిచ్చేస్తాం అంటారా? ప్యాకేజీ అంటారా? గూరా?లాండ్ టైపు అథారిటీ అంటారా? అంత ధైర్యం వుందా? అదే వుంటే యిన్నాళ్ల సాగతీత ఎందుకు? కాంగ్రెస్ పార్టీ యింకా తీవ్రంగా ఆలోచించాలి అంటారు. అంతకుమించి ఏదైనా ఆశిస్తే అది అత్యాశే.

కాంగ్రెస్ వాళ్లకు కావలసినది – పార్లమెంటులో బజెట్ సమావేశాలు సజావుగా గట్టెక్కించడం. 28 తర్వాత కూడా ప్రకటన రాకపోతే ఏదో ఒకటి చేసేస్తాం అని టికాంగ్రెస్ ఎంపీలు అరడజను మంది అన్నారు కాబట్టి వాళ్లను బొత్తిగా పట్టించుకోకుండా 'ఉండే వుండండి, లేకపోతే పొండి' అని అంటే బాగుండదు కాబట్టి వాళ్లను కొద్ది రోజులపాటు వూరుకోబెట్టడానికి ఓ స్టేటుమెంటు చేస్తారు. అదెలా వుంటుంది? అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపు అభిప్రాయం ఏమిటో యిప్పటిదాకా బాహాటంగా బయటకు రాలేదు. షిండేగారు నా వాదన కూడా రికార్డు చేసుకున్నారు అని గాదె వెంకటరెడ్డి క్లెయిమ్ చేస్తున్నారు. 'తక్కిన పార్టీలన్నీ తమ అభిప్రాయాలను ఏదో ఒక వైపు చెప్పినా కాంగ్రెస్ మాత్రమే రెండు గొంతుకలతో మాట్లాడుతోంది' అని అందరూ అంటున్నారు కాబట్టి, 'లేదు కాంగ్రెస్ కూడా తెలంగాణ ఏర్పాటు చేయమని కోరింది' వంటి స్టేటుమెంటు ఏదో యిచ్చి ఆ సందిగ్ధత తొలగించడానికి చూడవచ్చు. ఆ స్టేటుమెంటు పట్టుకుని టికాంగ్రెస్ వాళ్లు తెలంగాణలో ధాటీగా తిరగవచ్చు. 'ఆజాద్ స్టేటుమెంటు యిచ్చాక కూడా మీరు కాంగ్రెస్‌లో కొనసాగడంలో అర్థం లేదు. మీరు పార్టీకి రిజైన్ చేసి తీరాల్సిందే' అని తెరాస వాళ్లు చేస్తున్న ఒత్తిడి ఎదుర్కోవడానికి యిది పనికి రావచ్చు. ఈ స్టేటుమెంటు చూపించి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలను పార్లమెంటులో బజెట్‌కు అనుకూలంగా ఓటేయమని హై కమాండ్ ఆదేశించవచ్చు. ఈ స్టేటుమెంటే కాంగ్రెస్ యివ్వబోయే పెద్ద కన్సెషన్. దీన్ని టి కాంగ్రెస్ ఎంపీలను వంచడానికి, పార్లమెంటు సమావేశాలకు ముందు వాడుకుంటారు. అది యిప్పుడే వాడేసుకుంటే అప్పుడు వాడుకోవడానికి ఏమీ వుండదు.

నేనింత స్కెప్టికల్‌గా మాట్లాడడానికి కారణం ఏమిటంటే – రాజమండ్రి సభ! అంతటి సభను ఉండవల్లి ఒంటిచేత్తో నిర్వహించారంటే ఎవరూ నమ్మరు. అధిష్టానం కనుసన్నలలోనే, వారి ఆదేశంతోనే అది నిర్వహించబడిందని సులభంగా గ్రహించవచ్చు. నలభై ఏళ్ల రీలు గిర్రున తిప్పుతూ, ఉండవల్లి తెలంగాణవాదులు చెపుతున్న అబద్ధాలన్నీ ఖండిస్తూ పోయారు. ఈ అబద్ధాలు పదేళ్లగా చలామణీలో

వున్నాయి. ఇన్నాళ్లూ కాంగ్రెస్ సమైక్యవాదులు యివన్నీ వింటూ ఎందుకు ఊరుకున్నారు? ఇలాటి చైతన్య వేదికలు, అవగాహనా సదస్సులు ఎందుకు జరపలేదు? హై కమాండ్ వద్దంది కాబట్టి ఆగినట్టున్నారు. ఇప్పుడు చేయమంది కాబట్టి చేస్తున్నారు. ఓ సారి గట్టు రామచంద్రరావుగారు చెప్పారు – డిసెంబరు 9 ప్రకటన తర్వాత ఆంధ్రప్రాంతంలో రియాక్షన్ చూడగానే అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించమని ఢిల్లీ నుండి గాంధీభవన్‌కు ఆదేశాలు వచ్చాయట. ఆయన అప్పుడు కాంగ్రెస్‌లోనే వున్నాడు కాబట్టి ఆ విషయం తెలుసు. ఇప్పుడు బయటకు వచ్చేశాడు కాబట్టి బాహాటంగా చెప్తున్నాడు. మళ్లీ డిసెంబరు 23 తర్వాత తెలంగాణ కాంగ్రెస్ నాయకుల రాజీనామాలను కూడా ఢిల్లీ వారే ఏర్పాటు చేశారని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ పరిస్థితుల్లో ఆజాద్ ఏదో చెప్పేస్తాడనుకోవడం భ్రమే. ఇది రాస్తూ వుండగానే యింకో న్యూస్ వచ్చింది – షిండే గారు 7 గంటలకు ప్రెస్ మీట్ పెడతారని! అసలాయనే సమావేశం పెట్టబోతూండగా మధ్యలో యీయనెందుకు, పసుపు గణపతిలా? షిండే నుండి పెద్దగా ఏమీ ఆశించకండి అని చెప్పడానికా ఆజాద్ ముందుగా మాట్లాడడం!?

ఉండవల్లి సభకు హాజరైనా పెద్ద తలకాయలను చూడగానే అర్థమౌతుంది – కాంగ్రెస్ హై కమాండ్ ఆమోదం లేకుండా వీళ్లు వెళ్లి వుండరని. ఆమోదం లేకపోయివుంటే యీ పాటికి వారిపై చర్యలకు ఉద్యమించేవారు. ఆ సభలో చూడండి – ఉండవల్లి తెరాస నాయకుల మీదనే అస్త్రాలన్నీ ఎక్కుపెట్టారు. కెసియార్ మాట్లాడినంత తీవ్రమైన పదజాలం వుపయోగించిన టికాంగ్రెస్ నాయకులు అనేకమంది వున్నా వారి జోలికి వెళ్లలేదు. దీనివలన తెలుస్తున్నదేమిటి? – కాంగ్రెస్ తెరాసనే విలన్‌గా నిలబెట్టదలచింది. విద్వేషాలను రెచ్చగొడుతున్నది తెరాసే అంటోంది. ఇలాటి పరిస్థితిలో తెరాసను విలీనం చేసుకుంటుందని ఎలా అనుకోగలం? బహుశా ఆ తలుపు మూసుకుపోయి వుంటుంది. 'తెలంగాణపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే తెరాసతో మంతనాలు చేయనిదే ఏదీ చేయదనీ, యిటీవల కాలంలో అలాటి మంతనాల సంకేతాలు లేవు కాబట్టి, కెసియార్ ఢిల్లీకి వెళ్లకుండా ఫామ్‌హౌస్‌లోనే వున్నారు కాబట్టీ – 28 నాటికి తెలంగాణపై ప్రకటన ఏదీ రాద'ని కొందరు వాదిస్తూ వచ్చారు. ఇప్పుడు చూడబోతే తెరాసతో ప్రమేయం లేకుండానే కాంగ్రెస్ తెలంగాణపై నిర్ణయం (తీసుకుంటే గింటే) తీసుకోవచ్చు అని అర్థమవుతోంది.

రాజమండ్రి సభ నిర్వహణ తర్వాత తెలంగాణలో వున్న కాంగ్రెస్ నాయకులందరికీ అధిష్టానం అభిమతం అర్థమయిపోయింది. అందువలన రాబోయే ఎన్నికల్లో టిక్కెట్లు ఆశించేవారందరూ ఉండవల్లిని తిట్టడానికి జంకుతున్నారు. ఇప్పటివరకూ ఉండవల్లిని, బొత్సను తిడుతున్న వారెవరో చూడండి – ఎమ్మెల్సీలు (ఆమోస్, యాదవరెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డి, ఇంద్రసేనా రెడ్డి), రాజ్యసభ సభ్యులు (హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్) ! వాళ్ల పదవి పదిలం. వీళ్లు కాక తిడుతున్నది గ్రూపుగా ఏర్పడిన టి–ఎంపీలు (పొన్నం, కేకే). వాళ్లు కాంగ్రెస్‌లో ఎప్పటివరకు వుంటారో, ఎప్పుడు తెరాసలోకి దూకుతారో ఎవరూ చెప్పలేరు. సోనియా చెప్పినా పార్లమెంటులో గోల చేసిన బ్యాచ్ అది. వీళ్లు మాత్రమే ఉండవల్లిని తిట్టారు. తెలంగాణ విషయంలో తాము కోరినది యుపిఏ యివ్వబోవటం లేదన్న గోడ మీద రాతని చదవగలుగుతున్నారు కాబట్టే యితర టి–కాంగ్రెస్ నేతలు నోరు విప్పటం లేదు.

ఆజాద్ మాట్లాడేశారు – అన్ని ప్రాంతాల నుండీ కాంగ్రెస్ నాయకుల్ని పిలిచి యింకా చర్చిస్తారట! ఇంకేం తెలుసుకోవాలి? ఇంకేం చర్చించాలి? తిరగండి నాయనా తిరగండి, మీ డబ్బయితేగా ! మా డబ్బుతో మాట్లాడితే ఢిల్లీకి వెళ్లి వస్తున్నారు.

కాంగ్రెస్ వాళ్ల చర్చలే యింకా పూర్తవలేదని ఆజాద్ చెప్పాక యిక షిండే చెప్పేదేముంది, నా బొంద! కాంగ్రెస్ చెప్పాక ఏ విషయం చెప్తాం అంటాడేమో, చూడాలి**! – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 34** **ఎమ్బీయస్ : రాజీనామాలు చేస్తారా?**

టి– కాం(గ్రెస్) నాయకులందరూ రాజీనామాలు చేయాలని ఉద్యమకారులంతా పట్టుబడుతున్నారు. కాంగ్రెస్ వైఖరి స్పష్టమై పోయింది కాబట్టి సిగ్గూ శరం వుంటే రాజీనామా చేసి ప్రజల్లోకి రావాలని అంటున్నారు. (ఇన్నాళ్లూ వీళ్లు ప్రజల్లో లేరన్నమాటేగా!) టికాం ఎంపీలు రాజీనామాలు చేశామన్నారు. టికాం మంత్రులు అవసరమైతే చేస్తానన్నారు. ఏ త్యాగానికైనా సిద్ధమే అంటూనే రాజీనామాలతో తెలంగాణ వచ్చే మాటయితే తక్షణం చేస్తానన్నారు.

చిన్నపిల్లలు చెప్పుకునే కథ వుంది – 'ఓ బావి దగ్గర కూర్చుని ఓ ముసలమ్మ సూది పెట్టి చీర కుట్టుకుంటోంది. అంతలో సూది బావిలో పడిపోయింది...' చెప్పేవాడు ఇక్కడ ఆగుతాడు. వినేవాడు "..ఊ.." అంటాడు – తర్వాత ఏం జరిగిందో చెప్పు అనే అర్థంలో.

చెప్పేవాడు – "ఊ అంటే సూది బయటకు వస్తుందా?"

వినేవాడు – "రాదు"

"రాదు అంటే వస్తుందా?"

"అబ్బ కథ చెప్పరా బాబూ"

"అబ్బ కథ చెప్పరా బాబూ.. అంటే వస్తుందా?"

"సూదేమైందో చెప్పకపోతే చంపుతా.."

"సూదేమైందో చెప్పకపోతే చంపుతా.. అంటే వస్తుందా?"

..ఇలా వుంటుంది కథ. కథలో సూది ఎప్పటికీ బయటకు రాదు. వినేవాడు జుట్టు పీక్కుని, చెప్పేవాడి జుట్టు పట్టుకుని వంచి వీపు మీద గుద్దేవరకూ కథ నడుస్తూనే వుంటుంది.

ఇప్పుడు తెలంగాణ కథ యిలాగే వుంది. రాజీనామా చేస్తే వస్తుందా? చేయకపోతే వస్తుందా? చేస్తానని అంటే వస్తుందా? ఉత్తుత్తి రాజీనామా చేస్తే వస్తుందా? స్పీకర్ ఫార్మాట్‌లో చేస్తే వస్తుందా? స్పీకర్ ఫార్మాట్‌లో చేసి స్పీకర్‌కు పంపకుండా సోనియాకు పంపితే వస్తుందా? ...స్పీకర్‌కు పంపితే వస్తుందా? ... ఇలా ఎడతెగని చర్చలు జరుపుకుంటూ వుండవచ్చు మన టీవీల్లో. వినేవాళ్లకు విసుగెత్తి టీవీని పగలగొట్టబోయి, టీవీ మనదని గుర్తుకు వచ్చి ఛానెల్ మార్చేసేవరకు యీ డిస?షన్లు సా...గుతూ..నే వుంటాయి.

రాజీనామాలు చేస్తే ఫలితం వుంటుందా? ఉంటుంది. ఎవరికి? తెరాసకు! 2009 నుండి రాజీనామాల ద్వారానే అది తన ఎమ్మెల్యేల బలాన్ని పెంచుకుంది. విన్నింగ్ మార్జిన్లను పెంచుకుంది. ప్రజల్లో దాని పట్ల విశ్వాసాన్ని పెంచుకుంది. ఢిల్లీలో బేరాలాడే శక్తిని పెంచుకుంది.

మరి నష్టపోయిందెవరు? టిడిపి, కాంగ్రెస్! ఎమ్మెల్యేలు తరిగిపోయారు. ఎన్నికల భయం పట్టుకుంది. అందుకనే రాజీనామా అంటే వాళ్లకు వణుకు. టిడిపి ఎమ్మెల్యేలు పార్టీకి వ్యతిరేకంగా ఓటేసినా, బాబు పార్టీ నుండి సస్పెండ్ చేయరు, స్పీకరుకి ఫిర్యాదు చేయరు. రాజీనామా ఆమోదిస్తే ఉపయెన్నిక వస్తుంది. దానిలో ఓటమి వలన పార్టీ క్యాడర్ నైతిక స్థయిర్యం దెబ్బ తింటుంది. కాంగ్రెస్‌దీ అదే పరిస్థితి. ఎమ్మెల్యేలు ఎంత అవిధేయంగా వున్నా నాయకత్వం కిమ్మనదు. ఇలాటి పరిస్థితిలో ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బావుకునేదేముంది? అధికార పార్టీలో వుంటే అటు దూకుతాదూకుతా అని బెదిరించి, బెల్లించి ఏ పదవైనా లాగవచ్చు. దూకేశాక యింకేముంది?

అందువలన టికాం వాళ్లు పదవి వున్నంతకాలం సౌకర్యాలు అనుభవిద్దామనే చూస్తారు తప్ప రాజీనామాలు చేసేద్దామని చూడరు. అయినా చేస్తే ఏమొస్తుంది? పేరు ముందు 'మాజీ' అనే బిరుదు తప్ప! కోమటిరెడ్డి చేశారు, జూపల్లి చేశారు.. ఏమొచ్చింది? వాళ్లకు గాని, ఉద్యమానికి గాని కలిగిన లాభం ఏమీ లేదు. ప్రభుత్వానికీ, ప్రజలకూ కలిగిన నష్టమూ లేదు. 'వాళ్లు రాజీనామాలు చేస్తే రాలేదు కానీ మేం చేస్తే తెలంగాణ వస్తుందా?' అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తారు. 'అదంతా మాకనవసరం. రాజీనామా చేయి, లేకపోతే కారు మీద రాళ్లేస్తాం' అంటారు తెరాసవారు, జాక్ వారు.

రాజీనామాల వలన ప్రభావం వుందా లేదా? డిసెంబరు 9 న ప్రకటన రాగానే 10 నుండి ఆంధ్రప్రాంతంలో రాజీనామాలు టపటపా చేశారు. రెండు వారాల్లో మొదటి ప్రకటన రివర్స్ అయిపోయింది. అంటే దానికి అంత శక్తి వుందన్నమాట. డిసెంబరు 23 న రెండో ప్రకటన రాగానే తెలంగాణ వైపు నుండి టపటపా రాజీనామాలు చేశారు. అన్ని పార్టీల వాళ్లూ కలిసి టి-జాక్ పెట్టారు. అయినా మళ్లీ మొదటి ప్రకటన రాలేదు. పైగా కథ మొదటికి తెస్తూ రాష్ట్రం సమైక్యంగా వుంచాలా అనే ఆప్షన్ కూడా పరిశీలించండి అంటూ కృష్ణ కమిటీ వేశారు. అంటే టి ఎమ్మెల్యేల రాజీనామాలు ప్రభావితం చేయలేక పోయాయన్నమాట. ఎందువలన? ఆంధ్రప్రాంతపు రాజీనామా లేమైనా బరువైనవా? ఇవి తేలికవా? నిజం చెప్పాలంటే రెండూ బోగస్‌వే. స్పీకర్ ఎదుట ఏదీ చెల్లలేదు. అందరూ ఉత్తుత్తి రాజీనామాలే చేశారు. ఎన్నికై ఏడాది కూడా కాకుండానే పదవి వదులుకోవడం ఎవరికైనా బాధాకరమే కదా.

ఇంతకీ ఆంధ్రప్రాంతపు రాజీనామాలకు స్పందించిన కేంద్రం తెలంగాణ ప్రాంతపు రాజీనామాలకు స్పందించకపోవడమేం? ఎవరైనా ఎమ్మెల్యేలే కదా! అంటే రాజీనామాల్లో ఏమీ లేదన్నమాట. కేంద్రమే తన ఆలోచనావిధానాన్ని మార్చుకుందన్నమాట. డిసెంబరు 9 నాటి ప్రకటన అనవసరంగా చేశామని, ఆ తప్పును దిద్దుకోవాలనీ అనుకుందన్నమాట. అందుకే అప్పటినుండీ దానికి దూరంగా జరుగుతూనే పోతోంది తప్ప ఆ దిశగా ఒక్క అడుగూ వేయలేదు. ఇచ్చిన మాట తప్పినందుకు టికాం వాళ్లు కోపగించుకుని మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే...? అన్న భయం కాంగ్రెస్‌కు లేదా? లేదేమో, ఎందుకంటే - అదే జరిగితే, ఆంధ్రప్రాంతం నుండి ఆ మేరకు టిడిపి ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడవచ్చన్న ధైర్యం! ఎన్నికలకు ప్రస్తుత టిడిపి సిద్ధంగా లేదని అందరికీ తెలుసు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజాధన దుర్వినియోగ నివారణ కోసం అంటూ పరిమిత మద్దతు యిస్తున్నాం.. అని చెప్పి అండగా నిలబడవచ్చు. గతంలో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఓ పక్కనుండి కాంగ్రెస్, మరో పక్క నుండి బిజెపి కొమ్ముకాసిన విషయం మనం మర్చిపోకూడదు.

అదే జరిగితే మూకుమ్మడి రాజీనామాల వలన టికాం వాళ్లు నష్టపోవడమే తప్ప లాభపడడం వుండదు. అయినా రాజీనామా చేసి వాళ్లు ఎక్కడికి పోతారు? పోతే తెరాసలోకి పోవాలి. కెసియార్ పంచన వుండి ఆయన చెప్పినట్టు ఆడాల్సిందే. కాంగ్రెస్‌లో వున్నంత స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు వుండవు. మహా అయితే రాబోయే ఎన్నికల్లో కెసియార్ తెరాస టిక్కెట్టు యివ్వవచ్చు. ఇవ్వకపోయినా చేసేదేమీ లేదు. 'నువ్వు రావడానికి ముందే ఆ నియోజకవర్గంలో పదేళ్లగా పనిచేస్తున్న తెరాస కార్యకర్త వున్నాడు, అతనికి యివ్వాలి' అని కెసియార్ అంటే వీళ్లేం చేయగలరు? టిక్కెట్టు యిచ్చినంత మాత్రాన 2014 ఎన్నికల్లో నెగ్గుతారన్న నమ్మకం ఎక్కడుంది? 2004, 2009 ఎన్నికల్లో నెగ్గిన తెరాస కాండిడేట్ల కంటె ఓడిన కాండిడేట్లు మూడు రెట్లున్నారు. 2014 నాటికి తెలంగాణ సెంటిమెంటు బలంగా వీస్తుందనుకున్నా అన్ని చోట్లా ఒకేలా వీస్తుందన్న నమ్మకం ఏముంది? ఆ పాటికి యింకెన్ని సెంటిమెంట్లు వస్తాయో!

తెరాసలోకి పోకుండా తెలంగాణ కాంగ్రెస్ అని కొత్త పార్టీ పెట్టుకుందాం అనుకుంటే దానికి నాయకత్వం ఎవరు వహిస్తారు?

అన్న ప్రశ్న వస్తుంది. వీళ్లలో ఎవరికీ తెలంగాణ స్థాయిలో కెసియార్‌ను ఎదుర్కునే స్టేచర్ లేదు. అందరూ జిల్లా స్థాయివాళ్లే. టికాం వాళ్లందరూ కలిసి జానారెడ్డినో, పొన్నాలనో తమ తరఫు ముఖ్యమంత్రి కాండిడేట్‌గా అంగీకరిస్తారా? 1969లో అయితే చెన్నారెడ్డి ఒక్కడే నాయకుడు. ఇప్పుడు జిల్లాజిల్లాకూ నాయకుడే. ఆ మాట కొస్తే నల్గొండలోనే నలుగురు నాయకులు తేలతారు. ఎవరి ఆధిపత్యాన్ని ఎవరు అంగీకరిస్తారు? పార్టీ నడపడం అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఎవరు తమ యింట్లో డబ్బు పట్టుకుని వచ్చి పెడతారు? మహామహా మెగాస్టారే పార్టీ నడపలేక గుడ్లు తేలేశాడు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అంటూ పెట్టాక వాళ్లు మొదటగా కెసియార్‌తో తలపడాలి. అతని కంటె మాకే చిత్తశుద్ధి వుంది అని చాటుకుంటూ ప్రజల్లోకి దూసుకుపోవాలి. కెసియార్‌కు పేపరుంది, ఛానెలుంది. వీళ్లకేముంది? పైగా చివరి నిమిషం దాకా వూగిసలాడుతూనే వున్నారన్న అపఖ్యాతి కూడా వుంది.

అందువలన వీళ్లు వేరే పార్టీ పెట్టడం అసాధ్యం. తెరాసతో కలిసిపోవడమూ కష్టమే. తెరాసతో కలిసినదాకా వుండి తెరాసే కాంగ్రెస్‌లో కలిసిపోతే మరీ చికాగ్గా వుంటుంది. పైగా యీ లోగా తమ నియోజకవర్గంలో కాంగ్రెస్ వేరే కాండిడేట్లను తయారుచేసుకుందంటే లేనిపోని తలనొప్పి. తెరాస బలం కూడా తెలంగాణ మొత్తంలో ఒకలా లేదని వీళ్లకు తెలుసు. తెరాస బలహీనంగా వున్నచోట వైకాపా, టిడిపి, కాంగ్రెస్‌లతో తలపడడమంటే గెలుపు గ్యారంటీ అనుకోలేరు. ఈ కారణాల వలన టికాం మంత్రులు ఎమ్మెల్యేలు రిజైన్ చేయరు. ఇక ఎంపీలలో – వేర్పాటు ఉద్యమం బలంగా వున్న నియోజకవర్గాల నుండి వచ్చిన పొన్నం, గుత్తా, బ్యాచ్ ఐదారుగురు రాజీనామా చేసి తెరాసలోకి వెళ్లడానికి అవకాశం ఎక్కువగా వుంది. కానీ అది అయ్యేదాకా నమ్మకం లేదు. ఎందుకంటే బజెట్ సమావేశాల్లో వీళ్లు ప్రభుత్వాన్ని యిరకాటంలో పెట్టబోతే ప్రభుత్వం వీళ్లను మరోలా యిరికించగల ప్రమాదమూ వుంది. గడ్కరీ బిజెపి అధ్యక్ష ఎన్నిక రోజునే ఆయనపై ఐటీ దాడులు జరిపించిన ప్రభుత్వం యిది. వీళ్లను ఎక్కడ నొక్కాలో అక్కడం వాళ్లకో పెద్ద విషయమా?

అందువలన టికాం వాళ్లు రాజీనామాలు చేయరనే ప్రస్తుతానికి సెటిలవుదాం. తప్పిదారి చేస్తే... అపుడే చూదాం. అందాకా యీ విషయంపై టీవీలో చర్చలు వస్తే ఛానెల్ మార్చేద్దాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 35 ఎమ్బీయస్ : కాంగ్రెస్ ఖతమేనా?**

'కాంగ్రెస్‌కో ఖతమ్ కరో, తెలంగాణారీ హాసిల్ కరో' అనే నినాదాన్ని మళ్లీ ఎత్తుకుంది తెరాస. 'కాంగ్రెస్ సమాధి – తెలంగాణా పునాది' అనుకోవచ్చు తెలుగులో! ఈ నినాదం పాతదే. ఇలా చెప్పి మళ్లీ కాంగ్రెస్‌లో చేరబోయింది తెరాస. బేరం బెడిసికొట్టింది. ఎవరి దుకాణం వారిదే అయింది. ఉండవల్లి సభతో, నిన్నటి ప్రకటనతో కాంగ్రెస్ వైఖరి స్పష్టమై పోయింది – 'ఇది తెలంగాణ యిచ్చేరకం కాదు. 2014 ఎన్నికల వరకు యిలాగే లాగిస్తుంది' అని. ఈ మాట నాయకులకు, తెలుగు మీడియాకు ఎప్పుడో తెలుసు, కానీ ప్రజల్ని మభ్యపెడుతూ వచ్చారు. నిన్నటితో ప్రజలకు కూడా కళ్లు విచ్చుకున్నాయి. ఇకపై ప్రజలను ఏమార్చడం కష్టమని కాంగ్రెస్ నాయకులకు కూడా అర్థమై పోయింది.

ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల ఎదుట రెండే మార్గాలున్నాయి – అధిష్టానానికి ఎదురు తిరగడం లేదా ఉద్యమకారులకు ఎదురు తిరిగి 'మా పార్టీ ఎప్పుడు యిస్తే అప్పుడు పుచ్చుకుంటాం, ఎప్పుడో ఒకప్పుడు యిస్తుందని మాకు నమ్మకం వుంది' అనడం. మన నడిగితే అధిష్టానానికి ఎదురు తిరగండి అంటాం. మనకేం పోయింది? కానీ వాళ్లకు పోయేందుకు పదవులూ, కాంగ్రెస్ గుడ్‌విల్ అవీ చాలా వున్నాయి కదా. కాంగ్రెస్‌లోనే వుండి రిస్కు తీసుకోవాలనే ప్రస్తుతానికి అనుకుంటున్నారు. అందుకని 'మాకు ఆశ వుంది, మేం రిజైన్ చేయం' అని మొండికేస్తున్నారు. కాంగ్రెస్ ఎలాగూ సర్వనాశనమై పోతున్నపుడు కాంగ్రెస్‌లో వుండడమెందుకు? దానితో బాటు దెబ్బ తినిపోవడమెందుకు? అని మనం ఆశ్చర్యపడిపోతున్నాం.

ఎందుకంటే తెలంగాణ యివ్వం అని దాదాపు స్పష్టంగా చెప్పడంతో కాంగ్రెస్ తెలంగాణలో తన గొయ్యి తనే తీసుకుందని, తన సమాధి తనే తవ్వుకుందని మీడియా అంతా చెప్పేస్తోంది. ఇక ఆంధ్రప్రాంతంలో జగన్ చేతిలో కాంగ్రెస్ చిత్తు కావడం ఖాయం కాబట్టి, యిక్కడా అక్కడ తిరుక్షవరమై పోతుందని లెక్కలు వేసేస్తున్నారు. ఈ లెక్కలు ఎంతవరకు కరక్టు?

మొదటగా ఆంధ్రప్రాంత చూద్దాం – అక్కడ సమైక్యవాదం బలంగా వుందని అందరికీ తెలుసు. రాష్ట్రవిభజన అనివార్యమైతే హైదరాబాదును తెలంగాణలో కలపకూడదని – కేంద్రపాలితంగా గానీ, విడి రాష్ట్రంగా గానీ వుంచాలని – అక్కడి వాళ్లు గట్టిగా అనుకుంటున్నారన్నది కూడా బహిరంగ రహస్యం. ఈ మాట వాళ్ల పక్షాన బలంగా వినిపిస్తున్నదెవరు? ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి నోరెత్తడం లేదు. రాష్ట్రవిభజనకు మేం సుముఖం అని అఖిలపక్ష సమావేశంలో తమ అభిప్రాయాన్ని నమోదు చేయించారు. హైదరాబాదుతో కూడిన తెలంగాణ యివ్వాలని టిటిడిపి నాయకులు చెప్తున్నారు. కోస్తా, సీమ టిడిపి నాయకులు దాన్ని ఖండించడం లేదు. రాష్ట్రవిభజన గురించి చర్చ పెట్టినపుడు అవన్నీ చూసుకుందాం అని ప్రజలకు చెప్పుకుంటున్నారు.

అంటే కేంద్రం 'విభజించడానికి ఒప్పుకున్నాం, కానీ రాజధాని ఏర్పాటు, హైదరాబాదును, జలవివాదాలపై ఓ కమిషన్ వేశాం' అని ప్రకటించాలా? అలా కమిషన్ వేస్తే అది మరొక కృష్ణ కమిటీ లాటిది అవుతుంది కదా! అ కమిషన్ వేయగానే టిటిడిపి నాయకులు 'కమిషన్ అనవసరం, హైదరాబాదుతో కూడిన తెలంగాణ యివ్వందే మేం ఊరుకోం' అంటారు కదా. కోస్తా, సీమ టిడిపి

వాళ్లు 'అలా ఎలా అంటారు? హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా వుండాలి, లేదా విడిగా రాష్ట్రం ఏర్పడాలి, మీకో రాజధాని, మాకో రాజధాని' అంటారు. ఇక అక్కణ్నుంచి తెలంగాణ రాజధాని మాకు కావాలంటే మాకు కావాలని ఐదారు జిల్లాలు పోటీ పడతాయి. కోస్తా, సీమల్లో కూడా ఆరేడు జిల్లాలు రాజధాని కోసం పోటీ పడతాయి. ప్రతీ చోటా ఆందోళనలు. ఆవేశాలు చల్లారాకనే విభజన జరుగుతుంది అనాల్సి వస్తుంది.

అందువలన 'కమిషన్ గిమిషన్ జాన్తానై, హైదరాబాదే మా రాజధాని, ఆంధ్ర రాజధాని ఎక్కడ పెట్టుకుంటారో వాళ్ల చావు చావనీయండి, మా కనవసరం. ముందు యిక్కణ్నుంచి ఖాళీ చేయమనండి' అని టిటిడిపి నాయకులు గర్జిస్తారు. కమిషన్ కావాల్సిందే అని ఆంధ్రప్రాంతపు టిడిపి నాయకులు..! మళ్లీ బాబు కలగజేసుకోవాలి. ఆయన ఆంధ్రప్రాంతపు నాయకుల మాట కాస్త విన్నట్టు కనబడినా, '..పోనీ కమిషన్ పెట్టవచ్చేమో..' అని నసిగినా, తెరాస పెద్ద గొడవ పెట్టేస్తుంది. 'అదిగో బాబు తన సమైక్యబుద్ధి చూపించుకున్నారు' అంటూ. 'మీరిలా ఊగితే యిప్పటిదాకా కష్టపడినదంతా యీనగాచి నక్కలపాలు చేసినట్టు అవుతుంది. మీరు కంప్లీట్‌గా యిటే వుండాలి. హైదరాబాదుతో కూడిన తెలంగాణ డిమాండ్‌కు అంగుళం తగ్గినా తెలంగాణలో పార్టీ దెబ్బ తినేస్తుంది' అని టిటిడిపి నాయకులు బాబుపై ఒత్తిడి తెస్తారు. సగంలోకి వచ్చాక... సా?మెత గుర్తుకు వచ్చి యిప్పుడు కాదంటే ఎటూ కాకుండా పోతామని బాబు తెలంగాణవైపే నిలుస్తారు.

ఇక వైకాపా వద్దకు వస్తే – వాళ్లదీ టిడిపి బాటే కదా! టివైకాపా నాయకులు కూడా తెరాస ధోరణిలోనే మాట్లాడుతున్నారు. కోస్తా, సీమ వైకాపా నాయకుల్లో యిద్దరు, ముగ్గురు కోస్తా, సీమ టిడిపి నాయకుల కంటె బలహీనంగా సమైక్యవాదం వినిపిస్తున్నారు. విభజన గురించి స్పష్టమైన అభిప్రాయాన్ని వెలిబుచ్చటం లేదు. సోనియా మాటే మా మాట అంటున్నారు. అయితే చిన్న రైడర్ పెట్టారు – 'అన్ని ప్రాంతాలకు న్యాయం చేకూర్చండి' అన్నారు.

ఈ మాటకు చాలా విస్తారమైన అర్థం వుంది. ఒక్కోళ్లు ఒక్కోలా చూడవచ్చు. 'వైయస్ కాంగ్రెస్‌కు సేవ చేశారు కాబట్టి ఆయన పోగానే వాళ్లబ్బాయికి అనుభవం వున్నా లేకపోయినా వెంటనే తీసుకుని వచ్చి సిఎం కుర్చీపై కూర్చోబెట్టడం..' అనేది వైకాపా ద ృష్టిలో న్యాయం. 'వైయస్ కాంగ్రెస్‌కు సేవ చేశారు కాబట్టి ఆయన పోయాక కొన్నాళ్లకి వాళ్లబ్బాయికి అత్యాశలు దిగాక పిలిచి కేంద్రమంత్రి పదవి యివ్వడం..' అనేది కాంగ్రెస్ ద ృష్టిలో న్యాయం. 'హైదరాబాదును తెలంగాణలోనే వుంచేసి కొత్త రాజధాని కట్టుకోవడానికి ఆంధ్రకు ఓ పదివేల కోట్లు యివ్వడం..' అనేది కేంద్రం ద ృష్టిలో న్యాయం, ధర్మం, సమతూకం.. కావచ్చు. వైకాపాలోని తెలంగాణ నాయకులకు కూడా డిటోడిటో కావచ్చు. కానీ వైకాపాలోని ఆంధ్ర నాయకులకు మాత్రం అది న్యాయం కాకపోవచ్చు. కాకపోయినా వాళ్లు కేంద్రానికి పవరాఫ్ ఎటార్నీ యిచ్చేశారు కాబట్టి నోరెత్తడానికి వీల్లేదు.

అందువలన సమైక్యవాదం అంశానికి వస్తే టిడిపి, వైకాపా రెండూ సమైక్యవాదులను నిరాశ పర్చినవే. సమైక్యవాదులు నమ్మదగని పార్టీలే.

సమైక్యవాదం విషయంలో కాంగ్రెస్‌కే ఫస్ట్ క్లాస్ మార్కులు (డిస్టింక్షన్ కాదు) పడతాయి. అజేయంగా కనబడుతూ, జ్యోతి బసులాగ పాతికేళ్లు పాలన చేస్తానని గాఢవిశ్వాసంతో ముందుకు సాగుతున్న చంద్రబాబును ఓడించడానికి కాంగ్రెస్ తెలంగాణ గేమ్ మొదలు పెట్టింది. ఎన్టీయార్ పదవిలో వుండగా రాయలసీమ ప్రాంతీయోద్యమం తీసుకుని వచ్చిన తరహాలోనే బాబు పదవిలో వుండగా వైయస్ తెలంగాణ ఎమ్మెల్యేలు కొందరిని పంపి తెలంగాణ కోసం అడిగించారు. 2004 ఎన్నికలు వచ్చాయి. బాబును ఓడించడమే ఏకైక లక్ష్యంగా టిడిపి నుండి బయటకు వచ్చి ప్రాబల్యం పెంచుకుంటూ వచ్చిన వేర్పాటు వాద పార్టీ తెరాసతో పొత్తు పెట్టుకుంది. అదే సమయంలో సమైక్యవాద పార్టీలైన సిపిఐ (అప్పటికి సమైక్యమే అంది, తర్వాత విభజన అంది), సిపిఎంలతో కూడా పెట్టుకుంది.

తెరాసతో పొత్తు పెట్టుకుంటూ నే కాంగ్రెస్ కొన్ని జాగ్రత్తలు తీసుకుంది. మొదటి ఎస్సార్సీని గౌరవిస్తూ (తెరాస డిమాండ్), రెండో ఎస్సార్సీ వేయాలని (కాంగ్రెస్ డిమాండ్) ఒప్పందం రాయించి తెరాసచేత సంతకం పెట్టించింది. విభజనకు ఒప్పుకుంటున్నట్టు విభజనవాదులను మభ్యపెట్టింది. కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో ఆ విషయం రాస్తూనే దానికి వంద ముళ్లు వేసింది. విభజనకు కాన్సెన్సస్ (బహుళాభిప్రాయం) వుండాలని మెలిక పెట్టింది. తెరాస వారిని మంత్రివర్గంలోకి తీసుకున్నట్టే తీసుకుని పొగబెట్టి బయటకు పంపింది. ధ ృతరాష్ట్ర కౌగిలిలో బంధించి దాని బలాన్ని సగానికి హరించి తనలో కలుపుకుంది. ఆ తర్వాత రాజీనామా చేసి ఉపఎన్నికలకు వెళ్లినపుడల్లా తెరాస సగం సీట్లు పోగొట్టుకునేట్లు చేసింది.

ఈ విధంగా 2009 వచ్చేటప్పటికి ఎవరో ఒకరితో పొత్తు పెట్టుకోకపోతే నిలబడలేని స్థితికి తెరాసను తీసుకుని వచ్చింది. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని తెరాస తహతహ లాడింది. కాంగ్రెస్‌లోని తన మిత్రులచేత సిఫార్సులు చేయించుకుంది. ఏం చేసినా కాంగ్రెస్ హై కమాండ్ లొంగలేదు. (లొంగకుండా చేసినది వైయస్. ఈ నాడు ఆయన కుమారుడికి సమైక్యం పట్ల ఆ కమిట్‌మెంట్ లేదు. సోనియా దయాధర్మానికి వదిలేశాడు) తెలంగాణకు అడ్డుగా నిలబడినది వైయస్సే అని విభజనవాదులు ఎంత గోల చేసినా, వైయస్ నేతృత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగింది. టిడిపి విభజనకు అనుకూలమని ప్రకటించి, తెరాసతో పొత్తుపొట్టుకున్నా తన వైఖరి మార్చుకోలేదు. నాలుగు పార్టీలు మహాకూటమి పేరుతో తలపడినా తను మాత్రం విడిగానే పోటీ చేసింది. దానికి ఫలితంగా తెలంగాణలో అప్పటిదాకా ఎప్పుడూ రానన్ని సీట్లు గెల్చుకుని, తెరాసకు ఐదు రెట్లు సీటు తెచ్చుకుని తెరాస మార్కు

విభజనవాదానికి తెలంగాణలో బలం లేదని నిరూపించి, సమైక్యవాదానికి వున్న బలానికి చాటి చెప్పింది.

వైయస్ మరణం తర్వాత కాంగ్రెస్ తడబడింది. తన పార్టీలోని విభజనవాదుల ఒత్తిడికి లొంగి, డిటెయిల్స్ ఏవీ వర్కవుట్ చేయకుండా, బేషరతుగా తెలంగాణ యిస్తామని 2009 డిసెంబరు 9 నాడు ప్రకటించింది. సమైక్యవాదం పక్షాన్నుండి చూస్తే కాంగ్రెస్ చేసిన ఘోరతప్పిదమిది. అయితే కాంగ్రెస్ మళ్లీ అలాటి తప్పిదాన్ని చేయలేదు. పైగా దాన్ని దిద్దుకోవడానికి శతథా ప్రయత్నిస్తోంది. రెండు వారాల్లోనే కంప్లీట్‌గా రివర్స్ నిర్ణయాన్ని తీసుకుంది. కృష్ణ కమిటీని వేసి ఏడాది గడిపేసింది. ఆ తర్వాత కమిటీ సూచనలపై చర్చలు అంటూ ఇంకో ఏడాది లాగించింది. పార్టీల అభిప్రాయాలు తెలుసుకోవాలంటూ యింకో ఏడాది.. ఇలా ప్రజల్లో ఉత్సాహాన్ని చల్లార్చింది. మీడియాలో తప్ప మామూలు ప్రజల్లో తెలంగాణ గురించి ఆదుర్దా లేకుండా చేసింది.

ఈ క్రమంలో వేర్పాటు వాదుల వలన కాంగ్రెస్ చాలా మాటలు పడింది. తన ఎమ్మెల్యేలు ఓడిపోయినా, వేరే పార్టీల వైపు గోడ దూకినా, అవమానాలు పడినా.. పడింది. సున్నితమైన యీ విభజన అంశంపై తాము పెదవి విప్పకుండానే కాంగ్రెస్ పార్టీని తెగ తిడుతున్న పార్టీలను కూడా భరిస్తూ వచ్చింది. టీవీ చర్చల్లో, బహిరంగసభల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడేవారు అందరి చేతా – ప్రోగ్రాం యాంకర్‌తో సహా – హేళనకు గురవుతున్నా చలించలేదు. సోనియాను రాక్షసి అన్నా, ప్రధానమంత్రిని చప్రాసీ కంటె హీనం అన్నా, కోర్ కమిటీలోని సభ్యులందరి గురించి హీనంగా మాట్లాడినా, దిష్టిబొమ్మలు తగలేసినా ఓర్చుకుంది.

తెలంగాణ అంశం సీరియస్‌గా ప్రారంభమై తొమ్మిదేళ్లు అవుతోంది. ఇప్పటిదాకా విభజనవాదులను సామదానభేదదండోపాయాలతో నిలవరించి, రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచిన పార్టీ అంటూ ఏదైనా వుందా అంటే – అది కాంగ్రెస్ ఒక్కటే ! తెలుగువారి సమైక్య నినాదంతో పుట్టిన టిడిపి కూడా 2004 నుండి 2008 వరకే సమైక్యవాదానికి కట్టుబడి వుంది. ఆ తర్వాతి నుండి కప్పదాట్లే. దాని నాయకత్వానికి తెలుగువారందరూ సమైక్యంగా వుండాలి అన్న మాట అనడమే మహాపరాధం అయిపోయింది. మాదేం లేదు, కాంగ్రెస్‌నే తిట్టండి, మమ్మల్ని అడక్కండి, మేం పార్టీ రక్షించుకోవాలి.. యివే మాటలు. చేతిలో అధికారం వుందనేనా రోజూ పాదయాత్రలో పదేసి వాగ్దానాలు చేస్తున్నారు. 'ప్రస్తుతం పదవిలో లేము కానీ పదవిలోకి వస్తే రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచుతాం' అనే మాట అనడానికే భయం!

ఇక వైకాపా మరీ అన్యాయం. దాని అధ్యక్షుడు కాంగ్రెస్‌లో వున్నంతకాలమే సమైక్యవాది. తర్వాత ఆయనకు రాష్ట్రం సమైక్యంగా వున్నా, విడిపోయినా ఖాతరు లేదు. ఆయన జైలు, బెయిలు, కేసులు... వీటి మీదనే ధ్యాస. వీటి కోసమే కోటి సంతకాల సేకరణ. పేపర్లో నిత్యం శోకగాథలు. ఓదార్పు యాత్రలు, పాదయాత్రలు, ప్రార్థనలు, గోడదూకుళ్లు... వీటిపై పెట్టే శ్రద్ధలో వందోవంతు కూడా తెలుగువారందరూ సమైక్యంగా వుండాలన్న అంశంపై పెట్టలేదు.

ఈ కారణంగా సమైక్యవాదులందరూ కాంగ్రెస్‌కు దణ్ణం పెట్టుకోవాల్సిందే. ఎన్నికలలో సమైక్యవాదం ఒక అంశంగా వుంటే కాంగ్రెస్‌కే వాళ్ల ఓట్లు పడతాయి. అయితే ఎన్నికల అంశంగా వుంటుందా? ఉంటే దాని ప్రభావం ఎంత? అన్నదే ప్రశ్న. ఇది స్ట్రాటజీకి సంబంధించిన వ్యవహారం. దీన్ని ఎన్నికల అంశంగా చేసే నేర్పు కాంగ్రెస్‌కు ఉండాలి. తక్కిన పార్టీలు తాము యీ విషయంలో వీక్ అని గుర్తిస్తాయి కాబట్టి అవి పరిపాలనా సామర్థ్యం గురించి, మరో దాని గురించి మాట్లాడతాయి. కాంగ్రెస్ దీని గురించి మాట్లాడడానికి ప్రయత్నించాలి. అలా మాట్లాడితే తెలంగాణలో ఏమవుతుందోనన్న భయం చేత మాట్లాడక పోవచ్చు.

సాధారణంగా తెలంగాణలో పోలింగ్ పూర్తయ్యాక కోస్తా, సీమల్లో పోలింగ్ జరుగుతోంది. అందుకే 2009 ఎన్నికల్లో వైయస్సార్ 'హైదరాబాదుకు వీసా..' ఉపన్యాసం ధైర్యంగా యివ్వగలిగారు. 2004 ఎన్నికల్లో బాబు కూడా అదే పని చేశారు. నెగ్గారు కాబట్టి వైయస్‌దే హైలైట్ అయింది. బాబుది మర్చిపోయారు. వైయస్ తెలంగాణలో ప్రచారం చేసే రోజుల్లో కూడా 'ఆయన సమైక్యవాది' అని ఆయన ప్రత్యర్థులు (పార్టీలోనూ, బయటా) అంటూనే వున్నారు. అలా అంటున్నా, (లేక అలా అంటున్నారు కాబట్టేనేమో) వైయస్ తెలంగాణలో కూడా అధిక సంఖ్యలో ఓట్లు గెలిచారు.

ఆంధ్రప్రాంతంలో వేర్పాటు వాదులు (ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలని కోరేవారు – వీరు కూడా హైదరాబాదుని తెలంగాణకు అప్పగించాలని కోరుకోరు) అతి తక్కువ మంది వున్నారనిపిస్తుంది. ఉన్నవాళ్లు కూడా ఒకే నియోజకవర్గంలో గూడు కట్టుకుని లేరు. అందువలన ఏ నియోజకవర్గంలోనూ ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయలేరు.

ఇక తెలంగాణ ప్రాంతంలో సమైక్యవాదుల విషయానికి వస్తే – వీరు చాలా నియోజకవర్గాల్లో (నా అంచనా ప్రకారం సగానికి సగం, 60) చెప్పుకోదగ్గ సంఖ్యలో వున్నారు. వీరు ఫలితాలను తారుమారు చేయగలరు. తెలంగాణలో పోటీ చేసేవారందరూ ప్రత్యేక తెలంగాణ గురించి యిప్పటిలాగానే చెపుతూ పోవచ్చు. ఈ నియోజకవర్గాల్లో వేర్పాటువాదుల ఓట్లు మూడు, నాలుగు అటువంటి పార్టీల (తెరాస, బిజెపి, సిపిఐ, ప్రజలు నమ్ముతారో లేదో తెలియదు కాబట్టి టిడిపి, వైకాపాలను చేర్చటం లేదు) మధ్య చీలిపోగా సమైక్యవాదులందరూ మూకుమ్మడిగా ఒకరికే ఓటు వేస్తే వాళ్లే గెలుస్తారు. (బాన్సువాడ ఉపయెన్నికలో జరిగినది గుర్తు తెచ్చుకోండి)

కానీ అలా జరుగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే ఆచరణలో సమైక్యవాదిగా వున్న కాంగ్రెస్ కూడా పైకి విభజనవాదిగానే చెప్పుకుంటుంది. అది చెప్పుకున్నా ప్రజలను నమ్మరు. ఎందుకంటే తెలంగాణ యిప్పటిదాకా రాకపోవడానికి కారణం కాంగ్రెసేనని అందరికీ తెలుసు. అందువలన 'తెలంగాణ వచ్చినా మేం మిమ్మల్ని కాపాడుతాం' అనే తరహా నినాదంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లవచ్చు. ఇక్కడ కాపాడడం అన్న ప్రశ్న ఎందుకు వస్తోందంటే – తెలంగాణ రావడం వెనక్కి వెళ్లినకొద్దీ తెరాస స్వరం తీవ్రమౌతోంది.

కెసియార్, ఆయన పార్టీ సహచరులు సమైక్యవాదులను, ఆంధ్రప్రాంతీయులనూ తిట్టడంతో బాటు తమ సీట్లకు, ఓట్లకు అడ్డు వస్తున్నారని తెలంగాణలోని కాంగ్రెస్‌వారిని, టిడిపి వారిని, వైకాపా వారిని, బిజెపి వారిని ఘాటుగా తిడుతున్నారు. పోనుపోను భాష మరీ ముతక అవుతోంది. మూలాలు కోస్తా, సీమల్లో వుండి తెలంగాణలో స్థిరపడినవారికి కెసియార్ మరో బాల థాకరేగా కనిపించసాగారు. ఇన్నేళ్లగా శాంతియుతంగా సాగిన ఉద్యమం యిప్పుడు పక్కదారులు పట్టేట్లా కనబడుతోంది.

ఈ కారణంగా సమైక్యవాదం కోస్తా, సీమల్లో ఎన్నికల అంశం కాకపోయినా తెలంగాణలో ముఖ్యమైన అంశం కావచ్చు. ప్రత్యేక తెలంగాణ కోరుకునేవారందరూ కెసియార్‌ను మాత్రమే అభిమానించే పరిస్థితి లేదిప్పుడు. ఆయన పోకడలు రుచించనివారు కూడా గొంతు విప్పుతున్నారు. కిషన్ రెడ్డి, ఎర్రబెల్లి, కొండా సురేఖ, జానారెడ్డి.. వీరందరూ కెసియార్‌ను అదుపు చేయడానికి సాధ్యమైనన్ని ప్రయత్నాలు చేస్తారు. వీరందరి మధ్య పొత్తు కుదిరితే ఏమో కానీ (కుదిరేందుకు అవకాశాలు బహు తక్కువ) లేకపోతే తెలంగాణలో బహుముఖ పోటీలు తథ్యం. అభ్యర్థుల సంఖ్య పెరిగితే గెలుపోటములు నిర్ధారించడం కష్టం. ఐదువేల ఓట్ల తేడాతో కూడా ఫలితాలు తారుమారవుతాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ 25-30 సీట్లు తెచ్చుకున్నా ఆశ్చర్యపడనక్కరలేదు. ఎందుకంటే అధికారపక్షంగా దానికి వుండే సౌకర్యాలు దానికి వుంటాయి. ఎన్నికల సమయానికి యితర అంశాలు ఎన్ని తోడవుతాయో తెలియదు.

ఇక కోస్తా, సీమలకు వస్తే - జగన్ హవా నడుస్తోంది కాబట్టి అక్కడ కాంగ్రెస్ దిబ్బయిపోతుందని చాలామంది ఊహించేస్తున్నారు. ఎన్నికల క్రీడలో ఫలితాలు అంత సులభంగా చెప్పగలిగితే అంతకంటె కావలసినది ఏముంది? ఎన్నికలలో ఎన్నో అంశాలు వుంటాయి. 2012లో గుజరాత్‌లో మోదీ గతంలో కంటె తక్కువ సీట్లు తెచ్చుకుంటాడని ఎవరైనా ఊహించగలిగారా? జగన్ పార్టీకి ప్రజల్లో ఆదరణ వుందన్న మాట ప్రబలిన కొద్దీ అభ్యర్థులందరూ ఆ పార్టీ టిక్కెట్టు కోసమే ఎగబడతారు. నియోజకవర్గానికి ఒక్కరికే యివ్వగలరు కదా. ఎన్నికల ప్రకటన వచ్చాక ఆఖరి నిమిషంలో పార్టీలోకి ఫిరాయించే పెద్ద తలకాయలు కొన్ని వుంటాయి. అవతలిపార్టీలోనే కొనసాగుతూ లోపాయికారీగా సహాయం చేసేవారు కొందరుంటారు. మొదటినుండీ పార్టీని అంటి పెట్టుకుని వున్నవాళ్లుంటారు. ఈ వర్గాల్లో ప్రతీ నియోజకవర్గం నుండి కనీసం ముగ్గురు, నలుగురు ఆశావహులుంటారు. ఒక్కరికే టిక్కెట్టు దక్కుతుంది. నిరాశ చెందినవారు రెబెల్ కాండిడేట్స్‌గా నిలబడి, నిలబడినవాడి అవకాశాలు చెడగొడతారు.

జగన్ దగ్గర కుప్పలకొద్దీ డబ్బు మేటలు వేసుకుని వుందనీ, అభ్యర్థులకు సంచులు పంచిపెడతాడనీ ఆశపడి వచ్చేవాళ్లు చాలామంది వుంటారు. తనపై నిఘా చాలా తీవ్రంగా వుంటుంది కాబట్టి జగన్ మూట విప్పకపోవచ్చు, విప్పినా సన్నసన్నగా విప్పవచ్చు తప్ప దుళ్లదోపిడీలా పంచకపోవచ్చు. ఆ విధంగా అభ్యర్థికి నిరాశ కలుగుతుంది.

ఇంకో అంశం - ప్రచారం, తన పార్టీ అభిమానులను పోలింగ్ బూత్‌కు తీసుకుని రావడం ! వైకాపాలో అట్టడుగు వరకు పార్టీ నిర్మాణం ఎలా వుందో తెలియదు. జగన్ జైల్లో వున్నారు కాబట్టి బూత్ స్థాయి వరకు కమిటీలు ఏర్పడి ఓటర్లను తీసుకుని రాగలరో లేదో తెలియదు. పాతికేళ్ల క్రితం అయితే అన్ని పార్టీల్లో వివిధ స్థాయిల్లో నాయకులు వుండేవారు. ఇప్పుడు మీడియా ప్రబలిన తర్వాత అందరూ ప్రెస్‌మీట్ వీరులే అయిపోయారు. లేదా టీవీ చర్చల్లో కనబడడానికే ఎగబడుతున్నారు. క్షేత్రస్థాయిలో వెళ్లి పని చేయడానికి ఒళ్లు వొంగడం లేదు.

ఈ కారణంగా ప్రతీ పార్టీలోనూ అభ్యర్థి తన పార్టీ ముఖ్యనాయకుణ్ని, అనగా అధ్యక్షుణ్ని వచ్చి ప్రచారం చేయమని కోరుతున్నారు. 'మీరు ఎవరి నియోజకవర్గానికి వెళ్లినా వెళ్లకపోయినా నా దానికి రావాలి' అని పట్టుబడతారు. సినిమా తారలు కూడా ప్రజల్ని ఆకర్షిస్తారు కాబట్టి వాళ్లనీ రమ్మంటారు. కానీ సినిమా నాయకుడు డైలాగులు అప్పచెప్పేసి వెళ్లిపోతాడు. నియోజకవర్గంలోని నాయకులలో సయోధ్య లేకపోతే కుదర్చడం, స్థానికంగా ఏ అంశంపై దృష్టి పెట్టాలో చెప్పడం - యిలాటివి చెప్పలేడు. పార్టీ అధ్యక్షుడు వస్తే తప్ప అలాటి చిక్కులు తొలగవు. అందుని ఆయన రావాలనే అందరూ కోరతారు. పార్టీ అధ్యక్షుడు వచ్చేవరకూ ప్రచారం వూపందుకోదు. వచ్చి వెళ్లాక చప్పబడిపోతుంది. 'నిధులు చాలలేదు, ప్రచార సామగ్రి అందలేదు, హెడ్ క్వార్టర్స్ నుండి పంపండి' అంటూ వేడుకోవడం, ఫిర్యాదు చేయడం అభ్యర్థులకు పరిపాటి. ఒకవేళ ఓడిపోతే సంజాయిషీ చెప్పుకోవడానికి యివి పనికి వస్తాయి.

వ్యక్తుల మీద ఆధారపడి నడిచే పార్టీ అంటూ కాంగ్రెస్ పార్టీని తిట్టిన ప్రతిపక్షాలవారే నిజంగా అలా తయారయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఏ జిల్లాకు ఆ జిల్లాకే నాయకులు వుండడం చేత, పార్టీకి గ్రామస్థాయి వరకు మొదటినుండీ కొంత వర్గం అంటూ వుండడం వలన ఢిల్లీ నుండి, హైదరాబాదు నుండి నాయకులు నియోజకవర్గానికి వచ్చినా రాకపోయినా 20-25 శాతం ఓట్లు ఆటోమెటిక్‌గా పడిపోతున్నాయి. డీసెంట్రలైజేషన్ వలన కలిగే లాభం యిది. దీనిపైన అభ్యర్థి పట్టి, ప్రచారం పట్టి ఓట్లు పడుతున్నాయి. టిడిపిలో అధికారం, నిర్ణయాలు అన్నీ కేంద్రీకృతం. ప్రతీదానికీ చంద్రబాబు చెప్పాల్సిందే. ప్రతీ నియోజకవర్గానికీ చంద్రబాబు రావాల్సిందే, టిక్కెట్ల పంపిణీ పూర్తయితే తప్ప ఆయన కదలడానికి లేదు. అప్పటినుండి ఎన్ని తిరగగలరు? అందుకే అవకాశం వున్న చోట కూడా టిడిపికి ఓట్లు రావడం లేదు.

ఇప్పుడు వైకాపాకూడా అదే బాటలో నడుస్తోంది. ప్రతీ చోటకి జగన్ రావల్సిందే. ఇటీవల విజయలక్ష్మిగారు, షర్మిల కూడా తిరగసాగారు. వీళ్లు ఎన్నికల టైములో ఉపయోగపడవచ్చు. జగన్ ఆ పాటికి జైల్లోంచి బయటకు వస్తారని అనుకున్నా, ఆయన కదలికలపై పోలీసులు ఆంక్షలు పెట్టవచ్చు. మూడు నాలుగు కేసుల విచారణ ఆ పాటికి ప్రారంభించి కోర్టులో హాజరు కాక తప్పని పరిస్థితి సృష్టించవచ్చు. మొన్నటి ఉపయెన్నికలు జగన్ జైల్లో వుండగానే జరిగాయి. ఆయన పార్టీ ఘనంగా గెలిచింది. కానీ ఆ

సింపతీ ఎంతకాలం నిలుస్తుంది? కొంతకాలానికి 'జైల్లో జగన్' అనే వాస్తవానికి అలవాటు పడిపోతాం. కేసు విచారణ సందర్భంగా జగన్ అవినీతి గురించి కొన్ని సాక్ష్యాలు కూడా ప్రవేశపెట్టి యిమేజి మరింత మసకబారేట్లు చేయవచ్చు.

ఉపయెన్నిక ఫలితాల బట్టి సాధారణ ఎన్నికల ఫలితాలను లెక్కవేయలేం. ఇంతకింత అయితే అంతకింత అనుకోకూడదు. రాజకీయాల్లో రెండు ప్లస్ రెండు నాలుగు కాదు. అధికారంలో వున్న కాంగ్రెస్ శక్తిని, పార్టీ నిర్మాణాన్ని, తీవ్రమైన అభిమానులను కలిగిన టిడిపిని తక్కువగా అంచనా వేయకూడదు. ఏ నియోజకవర్గంలోనైనా జగన్ పార్టీకి గెలిచే అవకాశాలు ప్రస్ఫుటంగా కనబడితే కాంగ్రెస్, టిడిపి గుడ్లప్పగించి చూస్తూ కూర్చోవు. మొన్న ఉపయెన్నికల్లో చేసినట్లు లోపాయికారీగా ఒప్పందాలు కుదుర్చుకుని కొన్ని చోట్ల ఓడిస్తాయి.

వచ్చే ఎన్నికల్లో జగన్ రాష్ట్రాన్ని దున్నేస్తాడని అనుకునేవాళ్లు గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన పాయింటు – ప్రతి నియోజకవర్గంలో జగన్ అభిమానులు ఎందరున్నారో, వ్యతిరేకులూ అంతే సంఖ్యలో వున్నారు. వ్యతిరేకులు చీలిపోతే వైకాపా అభ్యర్థి గెలుస్తాడు. చేతులు కలిపితే ఓడిపోతాడు. ఇక్కడ రెండు అంశాలున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత, జగన్ వ్యతిరేకత! తెలంగాణ ప్రాంతంలో అయితే 50% నియోజకవర్గాల్లో తెలంగాణ సెంటిమెంటు అంశం కూడా కలపాలి. ఒక్కో అంశానికి పాయింట్లు వేసుకుని వెళ్లవలసి వస్తుంది. వీటన్నిటి వలన ఫలితాలు ఊహించడం మరింత క్లిష్టమవుతుంది. స్థానిక ప్రజాప్రతినిథి పెర్‌ఫార్మెన్స్ బాగుంటేనే ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకోగలడు. వైకాపా అభ్యర్థి స్వయంగా గట్టివాడైతేనే (కొండా సురేఖలా) జగన్ వ్యతిరేక ఓటును తట్టుకోగలడు. లేకపోతే జగన్ వ్యతిరేక ఓటు కాంగ్రెస్, టిడిపిలలో ఏ అభ్యర్థి గట్టిగా వున్నాడో చూసి అటు వెళ్లిపోవచ్చు. అవి కన్సాలిడేట్ అయ్యాయంటే వైకాపా అభ్యర్థి గట్టెక్కడు.

ఉరామరిగా లెక్క వేసి చూద్దాం. మొదటి స్టెప్‌గా చెప్పుకోవాలంటే కోస్తా, సీమల్లో కాంగ్రెస్, టిడిపి, వైకాపాలు మూడు సమానబలం కల పార్టీలు కాబట్టి సీట్లు సమానంగా పంచుకోవచ్చు. అంటే తలా 55 (తక్కినవి యిండిపెండెంట్స్, రెబెల్స్, యితరులు అనుకుందాం) అన్నమాట. అయితే స్వింగ్‌లు వుంటాయి కాబట్టి స్వింగ్ బలంగా వుంటే గెలిచే పార్టీ పక్క పార్టీలనుండి పదిహేనేసి సీట్లు గుంజుకోవచ్చు. ఆ ప్రకారం చూస్తే 85–40–40 అవాలి. మూడు సమానస్థాయిలో వుండవు, ఏదో ఒక పార్టీ ఎక్కువ నష్టపోతుంది అనుకుంటే 90–40–35 కావచ్చు. స్వింగ్ తక్కువగా వుండి పది సీట్లే తారుమారు అవుతాయనుకుంటే 75–45–45, లేదా 80–45–40 కావచ్చు. ఎలా చూసినా గెలిచే పార్టీ ఏదైనా కావచ్చు కానీ దానికి 90 కి మించి రావు, మూడో స్థానంలో నిలిచే పార్టీకి 35కి తక్కువ రావు.

ఈ థియరీని ఒప్పుకుంటే కాంగ్రెస్ పరిస్థితి ఎంత ఘోరంగా వున్నా కోస్తా, సీమల్లో కలిపి 35 సీట్లు, తెలంగాణ ప్రాంతంలో 20–25 వచ్చి 60 సీట్ల వరకు రావచ్చు. అత్యధికంగా సీట్లు తెచ్చుకున్న పార్టీకి కోస్తా, సీమల్లో 90, తెలంగాణలో 30–35 వచ్చి 125 సీట్ల వరకు రావచ్చు. (తెలంగాణలో తెరాసకు తప్ప యింకెవ్వరికీ 50 సీట్ల వరకు తెచ్చుకునే అవకాశమే లేదు) దీనర్థం సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు వున్నాయన్నమాట.

సంకీర్ణమంటూ ఏర్పడితే దానిలో టిడిపి వుండే అవకాశం లేదు. కాంగ్రెస్, వైకాపా, తెరాస – అందరూ దాని సహజశత్రువులే! కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలో యుపిఏ ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఏర్పడి దానికి జగన్ సపోర్టు చేస్తానంటే అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్–జగన్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుంది. ఎన్నికల ముందు ఆ పార్టీలు పొత్తు పెట్టుకోవు. పెట్టుకుంటే యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఓటు మొత్తం టిడిపికి వెళ్లిపోయి జగన్ పార్టీకి సీట్లు రావు. అప్పుడు జగన్ పార్టీతో కాంగ్రెస్‌కు పని పడదు. బేరం కుదరక కాంగ్రెస్–వైకాపా కలవకపోతే కాంగ్రెస్–తెరాస సంకీర్ణ ప్రభుత్వం రావచ్చు. ఎందుకంటే రాష్ట్ర విభజనపై నిర్ణయం కేంద్రస్థాయిలో జరుగుతుంది కాబట్టి అక్కడ ప్రభుత్వంలో భాగస్వామి అయిన జాతీయ పార్టీతోనే తెరాస పొత్తు పెట్టుకోవాలి. టిడిపి, వైకాపా కేంద్రంలో ప్రభుత్వానికి మద్దతు యిచ్చేవే కానీ ప్రధాన పార్టీలు కానేరవు.

ఎన్నికల వేళకి ఏదైనా వేవ్, లేదా సెంటిమెంట్ వస్తే మొత్తం పరిస్థితి మారవచ్చు. ఇప్పుడే కచ్చితంగా ఏమీ చెప్పలేం. అందుకని యివన్నీ కాకిలెక్కలే. ఏది ఏమైనా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా ఒక నిర్ణాయక శక్తిగా వుంటుంది తప్ప ఖతం అయిపోయి నుమరుగై పోదు. 2014లో పరిస్థితి బాగా లేకపోయినా 2019 కూడా వుంది. అది ఒక వ్యక్తి చుట్టూనే తిరిగే పార్టీ కాదు కాబట్టి స్టేయింగ్ పవర్ జాస్తి అని నా లెక్క. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 39, 40 వీక్లీకై** **ఎమ్బీయస్ : రాజీనామాలు అడిగినదెవరు?**

'ఎంపీ పదవి చిత్తుకాగితం లాటిది. రాజీనామా చేయడం అంటే చిత్తుకాగితాన్ని తీసి చెత్తబుట్టలో పడవేయడమే. ప్రస్తుతం అదే పని చేస్తున్నాం' అన్నారు మొన్న మధు యాష్కీ. 'పదవే ఏమిటి, అసలు ఎంపీయే చిత్తుకాగితం లాటి వాడు. చరిత్ర చెత్తబుట్టలోనే వుండవలసినవాడు' అని అనేక నియోజకవర్గాల ప్రజలు అనుకుంటూ వుంటారు. 'తెలంగాణ నుండి నీళ్లెత్తుకుపోతున్నారు, ఉద్యోగాలు ఎత్తుకుపోతున్నారు, ఇక్కడి నీళ్లు కలుషితం చేసేస్తున్నారు, ప్రభుత్వశాఖల్లో 610 జీవో అమలు కావటం లేదు, పరిశ్రమలు రాకుండా చేస్తున్నారు..' అంటూ ఎవరిమీదో ఆరోపణలు చేస్తున్న ప్రతీసారీ 'మరి యిన్నేళ్లగా మీరేం ఉద్ధరిస్తున్నారు స్వామీ?' అని అడగబుద్ధేస్తుంది. మిమ్మల్ని ఎన్నుకున్న దెందుకు? ఊరికే మాటిమాటికీ ఢిల్లీ వెళ్లి సొంత పనులు చక్కబెట్టుకుని రమ్మనమనా? ఈ

సమస్యల గురించి పార్లమెంటులో ఎన్నిసార్లు మాట్లాడావ్? గణాంకాలు వేసి నియోజకవర్గంలో మీటింగులు పెట్టి అందరినీ ఎడ్యుకేట్ చేశావ్? అధికారులను ఎక్కడ నిలదీశావ్? ఇవేమీ చేయకుండా ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడుతున్నాం అంటే సరిపోయిందా? ఇన్నాళ్లదాకా పడుక్కున్నవాడివి అప్పుడు లేస్తావా?' అని ప్రజలు అడిగితే ఎంపీల పని, ఎమ్మెల్యేల పనీ ఏమవుతుందో అనిపిస్తుంది.

నికార్సయిన నీచోపమానంతో తన పదవిని నిర్వచించుకున్న మధు యాష్కీగారు యివాళ 'అది చిత్తు కాగితం కాదు, కరెన్సీ కాగితం' అంటున్నారు. రాజీనామా చేయరట. చాకో గారి స్టేటుమెంటు తర్వాత ఆయనా, పొన్నం, రాజయ్య 'రాజీనామాలు చేసి ఏం ప్రయోజనం?' అని వాదించారు కాస్సేపు. మొత్తం తెలంగాణ ఎంపీలందరూ ఒకే గ్రూపుగా లేరు. ఏడుగురు మాత్రం ఒక బృందంగా ఏర్పడి తిరుగుతున్నారు. వారిలో మందా, వివేక్ – రాజీనామా చేసి తెరాసలోకి దూకడానికి రెడీగా వున్నారని, కోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి అన్నగారితో బాటు వైకాపాలోకి దూకవచ్చని, గుత్తాగారికి రెండు దార్లూ (తెరాస, వైకాపా) తెరిచే వున్నాయనీ పుకార్లున్నాయి. అందుకని ఆ నలుగురు రాజీనామాపై వెనక్కి వెళ్లడం గురించి గట్టిగా మాట్లాడలేదు. మధు యాష్కీ, పొన్నం, రాజయ్య మాత్రం ఊగిసలాడారు. ఎక్కడా డోరు తెరుచుకోలేదో, లేక బేరం కుదరలేదో! ముందు రోజు రాజీనామాల గురించి అంత ఘాటుగా మాట్లాడిన పొన్నం మర్నాటికల్లా జావకారడం, యింకా కొన్ని గంటలకు మళ్లీ రాజీనామా చేస్తాననడం – ఆయన ఉండవల్లిపై ప్రయోగించిన నీచోపమానాన్ని గుర్తుకు తెచ్చింది. (అంతకంటె ఎక్కువ ఆలోచించవద్దు లెండి, ఆయనకీ మనకీ తేడా లేకపోతే ఎలా?) చివరకు పొన్నం, రాజయ్యలకు ఎక్కడో డోర్లు తెరుచుకున్నాయిలా వుంది. మధు యాష్కీకి మాత్రం కాంగ్రెస్సే దిక్కయింది. రాజీనామా ఉపసంహరించుకున్నారు. ఆరుగురు రాజీనామా చేస్తామంటూ కూర్చుని మధు యాష్కీని తిడుతున్నారు. మధు గారు తమ మధ్య విభేదాలు తెచ్చినందుకు కెవిపిని తిడుతున్నారు (దీనిలో కెవిపి పాత్ర ఏమిటో ఆ లాజిక్ నా కర్థం కాలేదు సుమండి)

మధు యాష్కీ ఐడియా మారడానికి కారణం వాయలార్ రవి గారి ఫోన్‌ట. 'ఢిల్లీ రండి, సావకాశంగా మాట్లాడుకుందాం' అని ఆఫర్ యిచ్చారట. ఇచ్చారని మధు గారు చెప్పుకుంటున్నారు. వాయలార్ వేలూరు ఆస్పత్రిలో చికిత్సకై చేరారని, రెండు మూడు రోజుల తర్వాత డిస్చార్జ్ అవుతారని పేపర్లోనే చదివాను. ఇద్దరు వాయలార్ రవిలు లేరు కదా! లేకపోతే ఎవరైనా ఆయన గొంతును మిమిక్రీ చేసి మధుగారితో జోక్ చేస్తున్నారా? ఢిల్లీ వెళ్లేకంటె వేలూరుకి వెళితే దగ్గర కదా! స్వర్ణలక్ష్మీదేవి గుడి చూసినట్టు వుంటుంది! చివరకు మధు గారు ఢిల్లీ వెళ్లాక వాయలార్‌ను కలవనే లేదు. మంగళవారం వాయలార్ ఫోన్‌లోనే అడిగారట – 'అసలు రాజీనామా చేయవలసిన అవసరం ఏమొచ్చింది?' అని. "ప్రజలు ఒత్తిడి మేరకు.." అన్నారట యీయన. "మీ తెలంగాణ ప్రజలు ఎమ్మెల్యేలను వదిలేసి, మంత్రులను వదిలేసి, ఎమ్మెల్సీలను వదిలేసి, కేంద్రమంత్రులను వదిలేసి, తెలంగాణ ఎంపీలను మాత్రమే.. అదీ ఏడుగురు ఎంపీలను మాత్రమే రాజీనామా చేయమంటున్నారా? ఇదెక్కడి పక్షపాతం?" అని నిలదీశారట. ఇలా డైరక్టుగా అడిగితే వీళ్లు మాత్రం ఏం చెప్పగలరు? 'తక్కినవాళ్లకు తెరాస ఆప్షన్ లేదేమోనండి..' అనగలరా?

నిజమే, అసలు వీళ్లని రాజీనామా చేయమని అడిగినదెవరు? మామూలుగా అడగడం అంటె అది ఎన్నికయిన మరుసటి రోజునుండి ప్రతిపక్షాల వారు అడుగుతూనే వుంటారు. 'ఎన్నికల్లో అక్రమాలు చేశారు, అన్యాయంగా గెలిచారు, సిగ్గూ శరం వుంటే రాజీనామా చేయాలి' అని ప్రమాణస్వీకారం రోజునే ఓడిపోయిన అభ్యర్థి అంటాడు..! చేస్తారా? ఇంకో వారం రోజులు పోయాక "కుర్చీ ఎక్కి వారం రోజులైనా ధరలు తగ్గించలేదు, ప్రజలకు నీపై విశ్వాసం పోయింది. రాజీనామా చేయాలి" అంటాడు. చేస్తారా? "నువ్వు చెపితే అసలు నేనెందుకు వినాలి? నువ్వేమైనా ఓటేశావా?" అని అడిగితే "నేను వేయకపోవచ్చు. కానీ నీకు ఓటేసిన ప్రజలు అడుగుతున్నారు.." అని సమాధానమిస్తాడు. (అసలు ప్రజల అభిమతం ఏమిటో అంత బాగా తెలిస్తే ఓడిపోయేవాడివే కాదు. వాళు నిన్ను గెలిపిస్తారనుకునే కదా గోదాలోకి దిగావ్. తీరా చూస్తే వాళ్లు యింకోణ్ని గెలిపించారు).

అది మొదలు ప్రతీ నెలా అడుగుతూనే వుంటాడు – రాజీనామా చెయ్, చెయ్ అని...! ప్రజలు ఎన్నుకున్నది ఎందుకు? చీటికీ మాటికీ రాజీనామా చేయమనా? చేసి సాధించేది ఏముంది? నెహ్రూకి రాజీనామాల బెదిరింపు రోగం వుండేదిట. తను అనుకున్నదానికి తన పార్టీలోంచి గట్టి వ్యతిరేకత వస్తే 'నా మాట వినకపోతే నేను ప్రధానిపదవిలో వుండడం దేనికి? రాజీనామా చేస్తా' అనేవారు. 'అయ్‌బాబోయ్, మీరు రాజీనామా చేస్తే పార్టీ బతుకు బస్టాండే. మీ స్థానంలో కూర్చోగలిగే సమర్థుడు ఎటు చూసినా కానరాడు' అంటూ అందరూ ఆయన చెప్పే మాట వినేవారు. నెహ్రూగారు లేకపోతే దేశం నడవదన్న భయం వుండేది కాబట్టి ఆయన బెదిరింపు చెల్లుబాటయింది. మీరూ నేనూ రిజైన్ చేస్తామంటే ఎవడూ భయపడడు. 'నువ్వు కాకపోతే నీ బాబు లాటి వాడు వస్తాడు, వెళ్లిరా' అంటాడు. ఎందుకంటే వీళ్లవలన పార్టీ నడవదు. పార్టీ టిక్కెట్టు కోసం వీళ్లే ప్రదక్షిణాలు చేశారు తప్ప పార్టీ వీళ్ల చుట్టూ తిరగలేదు. అయితే ఉద్యమం వూపులో వుండగా వీళ్లు బెదిరిస్తూ వుంటారు. వీళ్లు రాజీనామా చేయడం వలన అక్కడ మళ్లీ ఎన్నిక వస్తే గెలిచే అవకాశం పార్టీకి పెద్దగా లేదు కదాని వీళ్ల ధైర్యం. అందుకని ప్రజలను అడ్డేసుకుంటారు. 'ప్రజల కోరికపై రాజీనామా చేస్తున్నాం, లేకపోతే నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి లేదు' అంటారు. ఇంతకీ ఎవరా ప్రజలు?

తెలంగాణ ఉద్యమం విషయంలో అయితే తెరాస, టి జాక్, బిజెపి – విద్యార్థి వర్గాలు అనుకోవాలి. ఈ వర్గాలేవీ నియోజకవర్గంలో జరగాల్సిన పనుల గురించి అడ్డుకోవా? కాంగ్రెస్ లేదా టిడిపి నుండి రిజైన్ చేసి, తెరాస ద్వారా ఎన్నికైతే చాలా? పనులు జరగకపోయినా ఫర్వాలేదా? ఈ కుర్రవాళ్లు యింకే అంశంపైన స్పందించరా? అయినా పేపర్లలో, టీవీల్లో చూస్తూనే వుంటాం. వాళ్ల సంఖ్య వందకు

లోపే వుంటుంది. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య లక్షల్లో వుంటుంది. ఈ వందమంది, అదీ టీవీ కెమెరాల ఎదుట విన్యాసాలు చేయగానే... రాజీనామా చేయాలా? టీవీలు వచ్చాక యీ నిరసనలు, ప్రదర్శనలకు విలువ లేకుండా పోయింది. టీవీవాళ్లు వచ్చేవరకూ మొదలు పెట్టరు. వాళ్లు వెళ్లాక ఎవరింటికి వాళ్లు వెళ్లిపోతారు. టీవీలో చూపించారా లేదా, మర్నాడు పేపర్లో ఫోటో వేశారా లేదా.. యిదే చింత. లేకపోతే టీవీ ఆఫీసుకెళ్లి గొడవ చేస్తారు. నిజంగా టీవీ వాళ్లు జూమ్ ఔట్ చేసి అక్కడున్నది ఇరవై మందే, ముప్ఫయి అని చూపిస్తే అప్పుడూ గొడవ చేస్తారు. మమ్మల్ని 'పలచన' చేశారు అని. సైకిల్ ర్యాలీ, మోటార్‌సైకిల్ ర్యాలీ అంటారు. గట్టిగా 20 వెహికిల్స్ కూడా వుండవు. మర్నాడు పేపర్లో 'భారీ ప్రదర్శన' అని హెడింగ్ పెట్టేస్తారు మీడియా వారు. ఇలాటి వారు కోరారంటూ రాజీనామాలు చేయబూనడం, చేస్తానని బెదిరించడం ఎంత వింతగా వుందో చూడండి.

గతంలో రాజీనామాలు చేసినవారందరూ ఏం చేశారు? అదే ఎసెంబ్లీ, అదే ఎమ్మెల్యే, అదే నియోజకవర్గం, అవే సమస్యలు. అప్పుడూ తీరలేదు, ఇప్పుడూ తీరలేదు. మరెందుకు రాజీనామా చేయడం అంటే తెరాస పార్టీ సంఖ్య పెంచడానికి! పోనీ అదేమైనా గొప్ప సంఖ్యా? ప్రభుత్వాన్ని కూలగొట్టగలిగే సంఖ్యా? లేదే! 11, 12, 15, 17..! పుష్కరకాలం ఉద్యమం చేస్తే చేరుకున్న సంఖ్య అది. 'దానితో ఏమీ చేయడానికి వీల్లేకుండా వుంది, అందుకే దాన్ని మూడంకెల సంఖ్య చేదాం' అని కెసియారే చెప్తున్నారు. మరి వీళు రాజీనామా చేసి ఏ గణనీయమైన మార్పు తెచ్చేస్తారనుకోవాలి? ఇది తెలిసే మామూలు ప్రజలెవరూ పట్టించుకోవడం లేదు. వీళ్లే ప్రజల పేరు చెప్పుకుంటున్నారు. అదే విషయం వాయలార్ రవి అడిగినట్టున్నారు. మధు యాష్కీకి ఆ వాదన నచ్చినట్టుంది. రాజీనామా వెనక్కి తీసుకున్నారు. తక్కిన వారి కథ ఎలా వుంటుందో వేచి చూదాం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 41 వీక్లీకై** **ఎమ్బీయస్ : చంద్రోపాలంభం**

ప్రబంధ నాయిక ఏ వనవిహారంలోనో నాయకుణ్ని చూస్తుంది. కోటకు తిరిగి వచ్చి విరహానికి లోనవుతుంది. వెన్నెల కురిపిస్తున్న చంద్రుణ్ని చూడగానే ప్రియుడు గుర్తుకు వస్తాడు. శీతల వాయువు ఆమెలో విరహాగ్నిని మరింత ప్రజ్వరిల్ల జేస్తుంది. మొగం వాడిపోతుంది. సొగసు క్షీణిస్తుంది. ఆమె అవస్థ చూసిన చెలికత్తెలు ఆమెకు శైత్యోపచారాలు చేస్తారు. వెన్నెల ద్వారా, శీతల వాయువు ద్వారా ఆమె విరహబాధను ద్విగుణీకృతం చేస్తున్న చంద్రుణ్ని, వాయుదేవుణ్ని, పూలబాణాలు వేసి తాపాన్ని పెంచుతున్న మన్మథుణ్ని – అందర్నీ తిడతారు. ఇటు నాయకుడు కూడా తిడతాడు. 'గురుపత్నివి కూడినవాడివి, కళంకితుడివి (మచ్చ వుంటుందిగా), మాలాటి వాళ్ల ఉసురు తగిలి రోజురోజూ క్షీణించిపోతున్నావ్, అయినా సిగ్గు రాలేదా?' అని చంద్రుడిపై నాలుగైదు పద్యాలు పాడందే ఏ ప్రబంధ నాయకుడు, నాయికా వూరుకోరు. ఈ ఘట్టాన్ని కావ్యభాషలో 'చంద్రోపాలంభం' అంటారు. ఉపాలంభం అంటే 'దూషణ, ఎత్తిపొడుపు, దెప్పుట' అని అర్థం. ప్రబంధానికి వుండి తీరాల్సిన లక్షణాల్లో యీ ఘట్టం కూడా ఒకటి.

ఇదెందుకు గుర్తుకు వచ్చిందంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రబంధంలోని ప్రతి నాయకుడుకి 'చంద్ర'శేఖర రావుని ఉపాలంభం చేయడం తప్పనిసరి అయిపోయింది. ఉద్యమం మొదలు పెట్టిన దగ్గర్నుంచి కెసియార్ ఆంధ్రప్రాంత ప్రజలను అడ్డమైన తిట్లూ తిడుతూ వచ్చారు. 2004 వరకు టిడిపిని బాగా తిట్టారు. ఆ తర్వాత నుండి కాంగ్రెస్‌ను పట్టించారు. శిఖరాగ్రంలో వున్న సోనియా మొదలు అట్టడుగు కార్యకర్త దాకా అందరూ ఆయనచేత తిట్లు తిన్నవారే. ఆ నాయకుడు దేశానికి ప్రధాని అయినా, హోం మంత్రి అయినా... ముఖ్యమంత్రి అయినా, హోం మంత్రి అయినా... పిసిసి ప్రెసిడెంటు అయినా, డిసిసి ప్రెసిడెంటు అయినా... తన కంటె భారీ మెజారిటీతో గెలిచిన ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా – అందరినీ యీయన తీసిపారేశారు. ఈయన చెప్పిన మాట వింటే – వాళు దేవతలు, మేధావులు, బొంతపురుగులు (ముద్దు పెట్టుకోదగినవారని తాత్పర్యం).. వినకపోతే – రాక్షసి, దెయ్యం, పిశాచాలూ, రక్తపిపాసులు, గుడ్డలూడదీసి తన్నదగినవారు.

కాంగ్రెస్ నాయకులను తిట్టేటప్పుడు కోస్తా, సీమ వాళ్లని సమైక్యవాదులనే పేరుతో తిట్టే కెసియార్, తెలంగాణ వాళ్లని తిట్టినపుడు సిగ్గూ, శరం చేయకుండా పదవులు పట్టుకుని వేళ్లాడేవాళ్లని తిడతారు. ఏం తిట్టినా కోస్తా, సీమ వాళ్లలో చాలామంది కిక్కురుమనలేదు. టిజి వెంకటేష్, లగడపాటి, రాయపాటి, కావూరి వంటి ఐదారుగురు మాత్రమే కాస్త రియాక్షన్ యిచ్చేవారు. ఇక తెలంగాణ నాయకుల్లో హర్షమే హర్షం. తమను తిట్టినకొద్దీ పొంగిపోయేవారు. వెనక్కి తిరిగి 'మా పార్టీ, మా విధానం, మా యిష్టం... నువ్వెవరు తిట్టడానికి?' అని అడిగినవాడెవడూ లేడు. జగ్గారెడ్డి ఒక్కడు మాత్రమే తిరిగి తిట్టేవారు. అందుకు తెరాస వాళ్లు అందరూ కలిసి విరుచుకుపడితే ఒక్క కాంగ్రెస్ వాడూ మద్దతుగా నిలిచేవాడు కాదు. కాంగ్రెస్‌వాళ్లందరూ కెసియార్ దృష్టిలో పాపాత్ములే – రాజీనామా చేసి తన పార్టీలో చేరేవరకూ! చేరాక పునీతులు అయిపోతారు.

ఇక ఉపయెన్నికలు వస్తే తెలంగాణ కాంగ్రెస్ నాయకులందరూ శల్యసారథ్యంలో ఒకర్ని మించి మరొకరు పోటీపడేవారు. ఎన్నిక ప్రకటన రాగానే 'మనం పోటీ చేయకూడదు, తెరాస వారికి బంగారు పళ్లెరంలో సీటు అప్పజెప్పాలి'తో మొదలు పెట్టేవారు. తర్వాత 'మేం ప్రచారానికి రాము', 'మన ఓటమి తథ్యం', 'ప్రజల వద్దకు ఏ మొగం పెట్టుకుని వెళతాం?'.. యిలాటి ప్రకటనలే! వీళ్లిలా అంటూనే వుంటారు, హై కమాండ్ నిలబడమని ఆదేశిస్తుంది. వేల సంఖ్యలో ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేస్తూనే వుంటారు. రోజులు పోయేకొద్దీ కాంగ్రెస్ ఓట్లు పెరగసాగాయి. అయినా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల ఆత్మనిందా, తెరాసస్తుతి పెంచుకుంటూ పోయారు.

తెరాస ఆవిర్భావం నుండి గణాంకాల పరంగా అబద్ధాలు చెప్తూనే వున్నారు. చరిత్రను వక్రీకరిస్తూనే వున్నారు. అప్పట్లో అధికారంలో వున్న టిడిపి కాని, తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కానీ, కోస్తా, సీమల్లో వున్న కాంగ్రెస్, టిడిపి నాయకులు కానీ – ఎవరూ వాటిని ఖండించలేదు. ప్రింట్ మీడియాలో ఏ సంపాదకీయమూ ఖండించలేదు. ఎక్కడో ఈజిప్టు పిరమిడ్‌ల రహస్యాలు, గ్రహాంతర వాసుల జీవనవిధానాల మర్మాలు సైతం చెప్పే టీవీ ఛానెళ్లు 'తెరాస ఆరోపణల్లో వాస్తవాల పాలు యిది' అని చెప్పలేదు. ఆంధ్రజ్యోతి, సాక్షి వంటి పత్రికలు అప్పుడప్పుడు ఖండించేవారి వ్యాసాలు ప్రచురిస్తూ వుంటాయి. విభజనవాదుల వ్యాసాలు పది వస్తే, వారి వాదాన్ని ఖండించేవారి వ్యాసం ఒకటి వస్తుంది. అదీ నిష్పత్తి. ఎంతో లైబ్రరీ వున్న ఈనాడు, ఈటీవీ యీ విషయంపై మౌనం వహిస్తాయి. వాస్తవాలన్నీ పుస్తకంగా వేసి రాష్ట్రమంతా పంచుతానన్న లగడపాటి ఏ కారణం చేతనో ఆ పనికి పూనుకోలేదు. ఋతువు మారినప్పుడల్లా ఓ సారి కనబడి వివాదాస్పద వ్యాఖ్యలతో హంగామా చేసి మాయమై పోతూ వుంటారు తప్ప రాష్ట్రప్రజల్లో విశ్వాసం పాదుకొల్పలేదు.

శ్రీకృష్ణ కమిటీ వచ్చింది. పాతలెక్కలన్నీ బయటకు లాగింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఏయే ప్రాంతంలో ఎంతెంత ప్రగతి జరిగిందో గణాంకాలు యిచ్చింది. రిపోర్టు వచ్చినపుడు ఓ పేజీలో క్లుప్తంగా యివ్వడం తప్ప పేపర్లు దాన్ని పట్టించుకోలేదు. ఎవరైనా అబద్ధాలు రాసినపుడు వాటిని ఖండించడానికి ఆ రిపోర్టు సమాచారాన్ని ఉపయోగించుకోవటం లేదు. నల్లమోతు చక్రవర్తి వంటి సమైక్యవాదులు తమ వాదన వినిపిస్తూ పుస్తకాలు రాసి విడుదల చేయబోయినపుడు పుస్తకావిష్కరణను విభజనవాదులు, మీడియావారు అడ్డుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాజధానిలో సైతం వారికి రక్షణ కూడా కల్పించలేదు.

ఎట్టకేలకు ఈ అజ్ఞానాంధకారాన్ని తొలగించడానికి సోనియా నిశ్చయించుకున్నారు. ఉండవల్లి చేత సభ పెట్టించారు. ఇన్నాళ్లూ దాచిన నిజాలన్నీ ఆయన ఒక్కసారిగా ఏకరువు పెట్టారు. బొత్సగారిని మీటింగుకి ఎందుకు వెళ్లావంటే ఉండవల్లి నుండి సమాచారం గ్రహించడానికి వెళ్లానన్నారు. అంటే యిప్పటివరకూ వీళ్లెవరికీ ఆ విషయాలు తెలియవన్నమాట! తెలియకుండానే తెలంగాణకు అన్యాయం జరిగిందన్న కన్‌క్లూజన్‌కి వచ్చేసి, రెండు రాష్ట్రాలుంటే తప్పేముంది అన్నారన్నమాట! ఆ రాత్రికి రాత్రి కాంగ్రెస్ వారందరికీ బుద్ధుడిలా జ్ఞానోదయం కలిగింది. ఇక మర్నాటి నుండి అందరూ కెసియార్‌ను తిట్టనారంభించారు. ప్రతిగా కెసియార్ రెచ్చిపోయారు. ఉండవల్లితో బాటు నెహ్రూ, ఇందిర, సోనియా.. యిలా వంశాన్నంతా సమరదీక్షలో తిట్టిపోశారు. అందర్నీ దిక్కుమాలిన వాళ్లన్నారు. దాంతో కాంగ్రెస్ వారందరికీ తెరాసను తిట్టడానికి లైసెన్సు లభించినట్టయింది. ఎడాపెడా తిట్టసాగారు. మొన్నటిదాకా కిమ్మనకుండా కూర్చున్న వీరందరికీ కెసియార్ బుద్ధి యివాళే తెలిసిందా? ఈ మాటల్లో కొత్తగా అన్నవేమున్నాయి? అయినా యివాళే మెదడు మార్చిడి అయినట్టు ప్రతీ నాయకుడూ చంద్రోపాలంభానికి పూనుకున్నారు. ఆయన భాష బజారుభాష అన్నారు. ఇలా తిడితే అవతలివాళ్లను ఒప్పించడం ఎలా? అని వాపోయారు. కెసియార్ కారణంగానే తెలంగాణ ఆలస్యమౌతోందన్నారు.

ఇదంతా పై నుండి వచ్చిన ఆదేశాల మేరకే జరుగుతోందని చిన్నపిల్లవాడైనా గ్రహించగలడు. దీని అర్థం – కెసియార్‌తో పొత్తు గానీ, విలీనం గానీ ఉద్దేశాలను కాంగ్రెస్ విరమించుకుంది అని! విలీనానికి కెసియార్ పెట్టిన షరతుల గురించి లీక్ కూడా యిచ్చారు. అవి నమ్మినవారికి కెసియార్ స్వార్థం కోసమే తెలంగాణ ఉద్యమాన్ని నడుపుతున్నారన్న అభిప్రాయం కలుగుతుంది. కెసియార్ యిమేజికి మసిపూసే ప్రయత్నం యిలా సాగుతూంటే అసలైన యిబ్బందంతా రాజీనామాలిచ్చిన ఆరుగురు కాంగ్రెస్ ఎంపీలకు వుంది. పదిమందితో బాటూ వాళ్లు కెసియార్‌ను తిట్టకపోతే 'ఓహో వీళ్లు తెరాసవైపు వెళ్లడం ఖాయం' అని స్పష్టంగా బయటపడిపోతుంది. కాంగ్రెస్‌లో వున్నంతకాలమైనా తిడదాం అని తిడితే కెసియార్‌కు కోపం వచ్చి పార్టీలోకి రానివ్వకపోవచ్చు. ఈ తిట్టే గ్యాంగ్‌కు నాయకత్వం జగ్గారెడ్డిదే కావచ్చు. నాయకుడు కాస్త హుందాగా, చూడబుల్‌గా వుండాలి – టీవీలో కవరేజి బాగా వస్తుంది కాబట్టి! అందువలన జూపల్లి చెప్పినట్టు ఆయన భాషతో బాటు రూపం కూడా సంస్కరించుకుని 'బూచి' లుక్ పోగొట్టుకుంటే మన కళ్లకు, చెవులకు హాయి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**జనవరి 42 వీక్లీకై** **ఎమ్బీయస్ : ద్రవిడ మఠం**

"మీకు వయసు పైన పడుతోంది కదా, రాజకీయాల్లో మీ వారసుడు ఎవరు? మీ తర్వాత ఎవరు పార్టీ అధ్యక్షుడు అవుతారు?" అని కరుణానిధిని అడిగినపుడు ఆయన మండిపడేవాడు. "ఇది శంకరమఠం కాదు, అక్కడ తన వారసుడెవరో పీఠాధిపతి నిర్ణయిస్తాడు. మా డిఎంకె ప్రజాస్వామిక రాజకీయ పక్షం. కార్యకర్తలే ఎన్నుకుంటారు." అనేవాడు. కానీ ఈ నెలలోనే ఆయన తనదీ మఠమే అని తేల్చేశాడు. తన వారసుడు ఎవరో స్పష్టంగా చెప్పేశాడు.

కరుణానిధి కొడుకుల్లో యిద్దరు ఆయన రాజకీయవారసత్వానికి పోటీ పడుతున్నారు. వారిలో పెద్దవాడు – అళగిరి! రఫ్ అండ్ టఫ్, మాస్ పొలిటీషియన్. తమిళం తప్ప వేరే భాష రాదు. మధురై కేంద్రంగా దక్షిణ తమిళనాడు యూనిట్లన్నిటినీ శాసిస్తాడు. బలప్రయోగంతోనైనా ఓట్లేయించగలడు. నగరాలలో ఓటర్లు పాలకపక్షంపై కినుక వహించి సాధారణంగా ప్రతిపక్షానికి ఓట్లేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో యిలాటి ఒడిదుడుకులు వుండవు. దశాబ్దాల తరబడి ఒకే పార్టీకి విధేయులుగా వుంటారు. అళగిరి అలాటి వారికి ప్రాతినిథ్యం వహిస్తాడు. నిధులు వసూలు చేయడంలో కూడా దిట్ట. అతని తమ్ముడు స్టాలిన్ అతనికి పూర్తిగా వ్యతిరేకం.

అతను నగరవాసి. ఇంగ్లీషు మాట్లాడగలడు. డిఎంకె స్టాండర్డ్స్‌లో చూస్తే మర్యాదస్తుడి కిందే లెక్క.

కరుణానిధికి 89 ఏళ్లు. ఆయన మరణం తర్వాత వీళ్లిద్దరూ తమలో తాము కలహించుకుని పార్టీని పాతిపెట్టేస్తారని డిఎంకె అభిమానులందరికీ భయం. అసలే ప్రతిపక్షంలో వుంది. పార్టీగా రెండుగా విడిపోతే దానిలో ఒక వర్గాన్ని జయలలిత చేరదీసి పార్టీని మట్టుబెడుతుందని అనుకుంటున్నారు. వీళ్లిద్దరి మధ్య సయోధ్య కుదర్చడం అసాధ్యం. ఎందుకంటే యిద్దరికీ పార్టీ అధ్యక్ష పదవి, నెగ్గితే ముఖ్యమంత్రి పదవి యిద్దరూ ఆశిస్తున్నారు. తను బతికుండగా ఎవరి వైపు వలపక్షం చూపించినా అవతలివాళ్లు తిరగబడతారేమో, తన కళ్ల ఎదుటే తన పార్టీ చీలికను చూడాల్సి వస్తుందేమోనని కరుణానిధి భయపడుతూ వచ్చారు. అందుకే వయసు మీద పడుతున్నా వారసత్వం గురించి మాట్లాడకుండా వాయిదా వేస్తూ వచ్చారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పార్లమెంటు ఎన్నికల్లో గెలిచాక, స్టాలిన్‌కు ఉపముఖ్యమంత్రి పదవి, అళగిరికి కేంద్రమంత్రి పదవి కట్టబెట్టారు. అళగిరికి ఢిల్లీలో ఏమీ తోచదు. హిందీ రాదు, ఇంగ్లీషూ రాదు. మాటిమాటికీ తమిళనాడు వచ్చేసి రాజకీయాలు చేస్తూ వుంటాడు.

ఇలాగే నెట్టుకొస్తూ వుండగా 2011లో అసెంబ్లీ ఎన్నికలు వచ్చి కరుణానిధి ఓడిపోయాడు. ఇప్పుడు స్టాలిన్‌కు ఏ అధికారమూ లేదు – పార్టీలో కోశాధికారి పదవి తప్ప! అళగిరికి కేంద్రమంత్రిత్వంతో పాటు డిఎంకె దక్షిణాది జిల్లాల ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదా వుంది. 2014 ఏప్రిల్‌లో పార్లమెంటు ఎన్నికలు రాబోతున్నాయి. దానికి ఒక నెల ముందుగా పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగి పార్టీ అధ్యక్షుణ్ని ఎన్నుకోవాలి. ఈ లోపుగానే పార్టీ కార్యకర్తల నమోదు, నిధుల సేకరణ ముగించుకోవాలి. ఆ సమావేశంలో ఎన్నిక గట్రా జరగాలి. అంటే అధ్యక్షుడిగా ఎన్నుకోబడే వ్యక్తి పానెల్‌లో అభ్యర్థులందరూ వివిధ పదవులకు ఎన్నికవాలి. అప్పుడే అధ్యక్షుడి స్థానం పదిలంగా వుంటుంది. డిఎంకె పార్టీ కార్యకర్తల నమోదు కార్యక్రమం ప్రారంభించింది. జిల్లా స్థాయి, గ్రామస్థాయి నాయకులు అళగిరి, స్టాలిన్‌లలో ఎవరి పక్షాన నిలబడాలో తెలియక గందరగోళంలో పడ్డారు. కరుణానిధి ఎవర్ని తన వారసుడిగా చేస్తారో తెలిస్తే ఆ ప్రకారం నడుచుకోవచ్చని ఎదురు చూస్తూ వున్నారు.

కరుణానిధి పరిస్థితి గమనించారు. తను ఎవరిని సిఫార్సు చేస్తున్నాడో అందరికీ తేటతెల్లంగా చెప్పవలసిన సమయం ఆసన్నమైందని గ్రహించారు. ఈ జనవరి 3న, వెల్లూరులో పిఎంకె పార్టీ నుండి రెండు వేల మంది దళిత యువకులు డిఎంకె పార్టీలోకి చేరడానికి ఏర్పరచిన సమావేశంలో మాట్లాడుతూ కరుణానిధి ''నేను దళితుల గురించి ఎంతో చేశాను. నేను బతికున్నంతకాలం యింకా చేస్తాను. మరి మీ తర్వాత ఏమవుతుంది అని మీరు ప్రశ్న వేయవచ్చు . దానికి సమాధానం – యిదిదో యిక్కడే వున్న స్టాలిన్! నా తర్వాత నా సేవను కొనసాగిస్తాడు.'' అన్నారు. వెంటనే మీడియా అంతా 'కరుణానిధి వారసుడు స్టాలిన్' వార్తలు వేసి, అళగిరి స్పందన కోరింది. ''డిఎంకె శంకరమఠం కాదని మా నాన్నే కాదు, స్టాలిన్ కూడా గతంలో అన్నాడు. ఇక్కడ నామినేషన్లు వుండవు, కార్యకర్తలు ఎవర్ని ఎన్నుకుంటే వారే నాయకులు.'' అన్నాడు అళగిరి.

'ఓహో, అళగిరికి పాఠం యింకా వంటబట్టినట్టు లేదన్నమాట' అనుకుని కరుణానిధి జనవరి 6 న ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి 'మీడియా తప్పుగా రిపోర్టు చేసింది. నేను స్టాలిన్‌ను వారసుడిగా పేర్కొనలేదు...' అంటూనే తన మనసులోని మాటను కాస్త విపులంగా చెప్పారు. ''మాది ప్రజాస్వామ్యబద్ధంగా నడిచే పార్టీ. ఎవరైనా అధ్యక్షుడు కావాలంటే ఎవరైనా వారి పేరును ప్రతిపాదించాలి. మరొకరు బలపరచాలి. ఒక వ్యక్తిగా అయితే నేను స్టాలిన్ పేరును ప్రతిపాదిస్తాను. మా పార్టీ జనరల్ సెక్రటరీ అన్బళగన్ స్టాలిన్ పేరును యిప్పటికే ప్రతిపాదించారు. నేను ఆ ప్రతిపాదనను బలపరుస్తున్నాను.'' అన్నారు. ఇంతకంటె కార్యకర్తలకు సూచన యింకేం కావాలి?

నిజానికి కరుణానిధి స్టాలిన్‌ను మొదటినుండీ వారసుడిగా తీర్చిదిద్దారు. అతనికోసం అప్పటిదాకా లేని యూత్ వింగ్‌ను తెరిచి, దానికి స్టాలిన్‌ను అధిపతి చేశారు. ఇప్పుడు స్టాలిన్‌కు 60 యేళ్లయినా యిప్పటికీ ఆ యూత్ వింగ్‌కు అతనే అధిపతి! 1996–2001 మధ్య అతను మద్రాసు మేయర్‌గా ఎన్నికయేట్లు చేశాడు. ఆ విధంగా అతని శక్తిసామర్థ్యాల ప్రదర్శనకు అవకాశం కల్పించాడు. 2006–2011 మధ్య కరుణానిధి కేబినెట్‌లో లోకల్ ఎడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖకు మంత్రిగా చేశాడు. 2008లో పార్టీ కోశాధికారిని చేశాడు. ఎన్నికలలో పార్టీ అభ్యర్థులకు నిధులు సమకూర్చేది అతనే కాబట్టి వారు అతనికి విధేయులుగా వుండేట్లు చేశాడు. 2011లో పదవి పోయాక స్టాలిన్ రాష్ట్రమంతా విస్తారంగా పర్యటిస్తూ అళగిరికి ప్రాబల్యం వున్న ప్రాంతాల్లోని వారిని కూడా తన వైపు తిప్పుకోగలిగాడు. స్టాలిన్ వారసత్వాన్ని గట్టిగా వ్యతిరేకించిన డిఎంకె నాయకుడు వీరపాండి ఆర్ముగం మూణ్నెళ్ల కితం మరణించాడు. కో.సి.మణి అనే యింకో నాయకుడు వ ృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనివలన స్టాలిన్ మార్గం సుగమం అయింది. ఇప్పుడు రెండు, మూడు జిల్లాల వాళ్లు తప్ప తక్కినవారంతా స్టాలిన్ ఎంపిక పట్ల హర్షం ప్రకటించారు.

అళగిరికి మాత్రం యిదేమీ నచ్చుబాటుగా లేదు. కానీ కుటుంబం యావత్తు – కనిమొళితో సహా – స్టాలిన్ వైపు నిలబడింది. మార్చిలో షష్టిపూర్తి (మణి విళా అంటారు) జరుపుకోబోతున్న స్టాలిన్‌కు యిది తండ్రి యిచ్చిన షష్టిపూర్తి బహుమతి అంటున్నారు. ప్రస్తుతానికి నోరెత్తకపోయినా అళగిరి అంత చేతకాని వాడేమీ కాదు. పార్లమెంటు ఎన్నికల వరకు అణగి వుండి జయలలితతో చేతులు కలపవచ్చేమో చూడాలి! ఏది ఏమైనా ఒకటి తథ్యం. కరుణానిధి తర్వాత డిఎంకె స్థితి యిప్పటిలా వుండదు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2013)**

**ఫిబ్రవరి 01** ఎమ్బీయస్ : కాంగ్రెసా, మజాకా?

"కాంగ్రెస్ ఖతమేనా?" అని నేను రాస్తే చాలామంది నమ్మి వుండరు కానీ, పాపం పైకి ఏమీ అనలేదు. కొంతమంది మాత్రం మొహమాటం లేకుండా తిట్టారు. నాకు మైండ్ పూర్తిగా పోయిందని జాలి పడ్డారు మరి కొందరు. కాంగ్రెస్ పని అయిపోయిందని వాళ్ల నమ్మకం. కోస్తా, సీమల్లో వైకాపా, తెలంగాణలో తెరాస దుమ్ము దులిపేస్తాయని, కాంగ్రెస్, టిడిపిలు దుకాణం మూసుకోవాల్సిందేననీ ఢంకా బజాయించి మరీ చెప్పారు.

ఇవాళ సహకార సంఘాల తొలివిడత ఎన్నికల ఫలితాలు వచ్చాయి. సీట్ల శాతం చూస్తే – కాంగ్రెస్‌కు 44% స్థానాలు, టిడిపికి 26%, వైకాపాకు 16%, తెరాసకు తెలంగాణలోనే 13%. 22 జిల్లాల్లో 14 జిల్లాల్లో కాంగ్రెస్‌కు తక్కిన వాటి కంటె ఆధిక్యత వుంది. టిడిపికి 3, వైకాపాకు 3, తెరాసకు 1, కృష్ణాలో కాంగ్రెస్, టిడిపి సమానంగా వున్నాయి. వైకాపా అనంతపురం (సగం సీట్లు), కడపల్లో (సగం సీట్లు) ఆధిక్యంలో వుంది. చిత్తూరులో పెద్దిరెడ్డి వర్గీయులను వాళ్లతో కలిపితే ఆధిక్యత వచ్చినట్టు లెక్క. వైకాపా హవా సీమలోనే కనబడింది. కోస్తాలో చాలా వెనకబడింది.

తెలంగాణలో తెరాసకు మెదక్‌లోనే స్పష్టమైన ఆధిక్యత. 45లో 17 గెలిచారు. దాని వెనక్కాలే కాంగ్రెస్ 16 సీట్లతో వుంది. తెరాసకు కంచుకోటలనుకునే వరంగల్, కరీంనగర్‌లలో దాదాపు సగం సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంది. వరంగల్‌లో తెరాసకు కేవలం 1 దక్కగా, కరీంనగర్‌లో 12 (ఆరోవంతు) గెలిచింది. ఇంకో కోట నల్గొండలో కాంగ్రెస్‌కు 61% సీట్లు దక్కగా తెరాసకు 0.5% సీట్లు వచ్చాయి. నిజామాబాద్‌లో తెరాసకు కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లలో సగం కంటె తక్కువ వచ్చాయి. రంగారెడ్డిలో 38 సీట్లుంటే అక్కడా తెరాసకు 1 మాత్రమే. కాంగ్రెస్, టిడిపి 17, 16 గెలుచుకున్నాయి.

ఈ ఫలితాలు రిపోర్టు చేయడంలో కూడా మీడియా తమాషాగా రిపోర్టు చేసింది. ఈ ఫలితాలకు కారణాలు యివీ అంటూ – 'అధికార పార్టీకి వెసులుబాటు వుంది, వ్యూహరచన చేశారు. ప్రతిపక్షాలు ఎన్నికలు జరుగుతాయో లేదోనన్న అపనమ్మకంతో అంత సీరియస్‌గా పరిగణించలేదు. వారిలో నాయకత్వ లేమి కారణంగా అధికార పార్టీ వ్యూహాలకు చెక్ పెట్టలేకపోయారు...' యిలా చెప్పుకొచ్చారు. పార్టీలూ యిలాగే మాట్లాడాయి – 'అధికారపక్షం డబ్బు ఖర్చు పెట్టిందని, రాత్రికి రాత్రి 11 లక్షల మందిని ఓటర్లుగా చేర్పించిందనీ..' యిలా. తెరాస నాయకులు 'ఉద్యమంలో పడి వీటిని పట్టించుకోలేద'ని అన్నారు, అక్కడికేదో ఉధృతంగా ఉద్యమం చేసేస్తున్నట్లు! ఈ రోజుల్లో వుద్యమం అంటే ప్రెస్‌ను పిలిచి ఓ పావుగంట మాట్లాడడం!

"సాక్షి" యీ ఫలితాలకు పెద్దగా విలువ యివ్వలేదు. వీటిని ప్రహసనం అని కొట్టి పారేసింది. ప్రజాస్వామ్యయుతంగా జరగడం లేదు కాబట్టి ఎన్నికల్లో పాల్గొనబోమని పార్టీ చెప్పినా పలు చోట్ల కొందరు పార్టీ అభిమానులైన రైతులు స్వచ్ఛందంగా పోటీలో నిలుచుని గెలిచేశారని రాసుకున్నారు! (మరి నిలబడి ఓడిపోయిన వారెవరో!) తక్కిన పేపర్లు కాంగ్రెస్‌కు యిన్ని సీట్లు, టిడిపికి యిన్ని సీట్లు అని రాస్తే సాక్షి మాత్రం చాలా నిక్కచ్చిగా (ఎన్నికలు పార్టీల పరంగా జరగలేదు కాబట్టి) 'కాంగ్రెస్ పార్టీ మద్దతుదార్ల'కు యిన్ని సీట్లు, 'టిడిపి మద్దతుదార్ల'కు యిన్ని సీట్లు ... అంటూ రాసింది. వీళ్ల పార్టీ అధికంగా గెలిచి వుంటే ఏం రాసేవారో మరి!

ఇవి పెద్ద ఎన్నికలే కావనీ, వీటి ఫలితాల బట్టి ఎసెంబ్లీ ఎన్నికల ఫలితాలు యిదే తీరుగా వుంటాయని అనుకోకూడదని వాదించేవారితో నేనూ ఏకీభవిస్తాను. కానీ యివి 'సూచికలు' అని నేనంటే వారు ఒప్పుకోకపోవచ్చు. 50 లక్షల మంది దాకా ఓటర్లు వున్నట్టున్నారు. 'వీరిలో యువత లేరు, మైనారిటీలు లేరు, దళితులు లేరు.. అందువలన వీటిని అస్సలు పట్టించుకో నక్కరలేదు' అని కొందరంటున్నారు. ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌లో యాంటీ – ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీలింగ్స్ కారణంగానో, అసంతృప్తి కారణంగానో అధికార యూనియన్ ఓడిపోతే ఆ ఫలితాలకూ ప్రాంతీయవాదానికి ముడి పెట్టి టీవీ చర్చల్లో విశ్లేషణలు చేసేస్తూ వుంటారు. మరి గ్రామాల్లో రైతులు, రైతు కుటుంబాలు ఒక ముఖ్యమైన సెగ్మెంటు కాదా? వారి అభిప్రాయాలకు యివ్వవలసినంత విలువ యివ్వవద్దా?

కాంగ్రెస్, టిడిపి కుమ్మక్కయ్యాయి అని "సాక్షి" అంటుంది. నూటికి నూరు శాతం నిజమే కావచ్చు.. ఎక్కడైనా, ఎప్పుడైనా అలాగే జరుగుతుంది. ఎవరైతే బలంగా వున్నారని తోస్తుందో వారిని ఓడించడానికి తక్కినవారందరూ ఏకమౌతారు. ఓ యూనివర్శిటీలో 'ఎ' కులం వారి డామినేషన్ ఎక్కువగా వుందనుకోండి, ఎ బి నుండి జెడ్ కులంవరకూ వున్న విద్యార్థులందరూ ఏకమై వారితో స్టూడెంటు ఎన్నికల్లో తలపడతారు. మరో యూనివర్శిటీలో 'బి' కులంవారి డామినేషన్ ఎక్కువగా వుంటే ఎ ప్లస్ సి టు జెడ్ వారందరూ ఏకమౌతారు.

తెలంగాణలో తెరాసను ఓడించడానికి తక్కిన పార్టీలన్నీ ఏకమయ్యాయన్నారు. అదే జరుగుతుంది. తెలంగాణలో తెరాస బలీయమైన శక్తి అనుకుంటున్నారు కాబట్టి దాన్ని అదుపు చేయడానికి తక్కినవారు ఏకమవుతారు. ఓ పార్టీ తరఫున గట్టి కాండిడేట్ నిలబడితే తక్కిన వాళ్లు నామ్‌కే వాస్తే బలహీనమైన అభ్యర్థులను పెట్టి, తమ వోటు బ్యాంకును అవతలివాడికి బదిలీ చేస్తారు. పరకాల ఉపయెన్నికలో తెరాసను ఓడించడానికి కాంగ్రెస్ తన ఓట్లను వైకాపాకు బదిలీ చేయడం చేతనే కదా, ఐదో స్థానానికి పడిపోయింది! అక్కడ వైకాపా లాభపడింది కదా! ఇలాటి కుమ్మక్కులు, లోపాయికారీ ఒప్పందాలు అసెంబ్లీ ఎన్నికల్లో మరింతగా జరగడం సహజం. అందుకే ఫలితాలు ఏకపక్షంగా వుండవనే నేను గట్టిగా చెప్తున్నాను.

ఈ ఎన్నికల్లో అధికార పార్టీ అధికార దుర్వినియోగం చేసింది.. అంటున్నారు. రేపు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే చేస్తుంది. దాన్ని

లెక్కలోకి తీసుకునే ఎన్నికల ఫలితాలను ఊహించుకోవాలి. ప్రతిపక్షాలు సీరియస్‌గా పట్టించుకోలేదు కానీ.. లేకపోతేనా.. అంటున్నారు. ఎందుకు పట్టించుకోకపోవాలి? చేస్తున్న పనేముంది? తమకు వచ్చిన ప్రతీ చిన్న అవకాశాన్నీ ఉపయోగించుకోవద్దా? ఉపయోగించుకునే వుంటారు, కానీ తంత్రం పని చేసి వుండదు. ఎందుకంటే సాధనసంపత్తి చాలి వుండదు. అది అంగబలం కావచ్చు, అర్థబలం కావచ్చు, అభ్యర్థి యోగ్యత కావచ్చు, పార్టీ విశ్వసనీయత కావచ్చు.

మొన్నటి వ్యాసంలోనే నేను రాశాను – కాంగ్రెస్‌కు జిల్లా స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో కూడా పాతుకుపోయిన వ్యవస్థ వుందని. గత 30 ఏళ్లగా టిడిపి కూడా అది బిల్డప్ చేసుకుంది. ఇది యీ ఫలితాల్లో స్పష్టంగా కనబడుతోంది. ఓ పాఠకుడు నా వాదనను ఖండిస్తూ 2014లో కాంగ్రెస్‌కు 6% ఓట్లకంటె రావని జోస్యం చెప్పారు. కొంతమంది అంకెలు చెప్పకపోయినా కాంగ్రెస్ ఓటు బ్యాంకంతా ఆటోమెటిక్‌గా వైకాపాకు వచ్చేసిందని కాంగ్రెస్ పని అయిపోయిందనే నమ్మకంతో వున్నారు. కాంగ్రెస్‌కు వున్న ఓటుబ్యాంక్ ఎంత? లెక్కలు చూదాం. టిడిపి ఆవిర్భావానికి ముందు కాంగ్రెస్‌కు సరైన ప్రతిపక్షం లేదు. అందువలన 1983కు ముందు అంకెలు వదిలేద్దాం. టిడిపి వంటి బలమైన ప్రతిపక్షం వచ్చాక కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లశాతం చూస్తే చాలు.

1983లో ఎన్టీయార్ 218 సీట్లు తెచ్చుకున్నపుడు, కాంగ్రెస్ కేవలం 51 సీట్లు మాత్రం తెచ్చుకున్నపుడు వారి ఓటింగ్ శాతం – 32%, నాదెండ్ల కారణంగా పదవీభ్రష్టుడైన ఎన్టీయార్‌పై 1985 ఎన్నికల్లో సానుభూతి వెల్లువెత్తి టిడిపికి 202, కాంగ్రెస్‌కు 50 వచ్చినపుడు ఓటింగ్ శాతం – 37%, 1989లో 181 సీట్లతో గెలిచినపుడు 47%, 1994లో 216 సీట్లు గెలిచిన టిడిపి చేతిలో చిత్తయిపోయి కనీవినీ ఎరగనంత చెత్త పెర్‌ఫార్మెన్స్ (26 సీట్లు) చూపినపుడు వచ్చిన ఓట్లు 34%, 1999లో టిడిపి సీట్లలో (180) సగం (91) తెచ్చుకున్నపుడు 40.6%, 2004లో తెరాస, లెఫ్టులతో పొత్తు పెట్టుకుని గెలిచినపుడు 38.6%, 2009లో ఒంటరిగా పోటీ చేసినపుడు 36.5%. ఈ 36%లో మొదటి 3 ఎగిరిపోయి చివరి 6% మాత్రం మిగులుతుందని ఎలా అనుకోగలం?

ఇలా కొందరు అనుకుంటున్నారంటే కారణం – వైయస్ పోయిన తర్వాత కాంగ్రెస్ కాంగ్రెస్‌లా లేదనుకోవడం! 2004కు ముందు వైయస్ కాంగ్రెస్‌లో పెద్ద లీడరు కాదే! జిల్లా స్థాయి నాయకుడే కదా! రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఆయనకు స్నేహగణం ఏర్పడ్డారంతే. మిగతా జిల్లాల వాళ్లు వైయస్‌ను చూసి ఓట్లేసే సీను లేదు. 30 ఏళ్లగా చూస్తే కాంగ్రెస్‌కు కనీసం 32% ఓట్లు వస్తున్నాయి కదా. వైయస్‌ను సిఎం కాండిడేట్‌గా చూపించాక 2004లో దానిపై 6.6%, 2009లో 4.5% ఓట్ల శాతం పెరిగింది. అంతే కదా! మరి వైయస్‌ను సిఎం కాండిడేట్ అన్నాక 1999తో పోలిస్తే 2% తగ్గింది, దానికేమంటారు?

వైయస్ కాంగ్రెస్ నుండి వచ్చినవాడు కానీ కాంగ్రెస్ వైయస్‌లోంచి రాలేదు. ఎన్టీయార్‌లో నుండి వచ్చిన టిడిపి కూడా ఎన్టీయార్‌తో బాటు కనుమరుగు కాలేదు. వైయస్‌కు ముందూ, వెనకా కూడా కాంగ్రెస్ వుంది. వైయస్ కుమారుడు కాంగ్రెస్‌ను విడిచాడు కాబట్టి యావన్మందీ కాంగ్రెస్‌ను విడుస్తున్నారని అనుకోవడం భ్రమ. వైయస్ బతికుండగా ఓ సారి కాంగ్రెస్ విడిచి తివారీ కాంగ్రెస్‌కు వెళ్లినా ఆయన వెంట ఎక్కువమంది వెళ్లలేదు. ఆయనే మళ్లీ వెనక్కి వచ్చేశాడు. వైయస్ మరణం తర్వాత అందరూ కాంగ్రెస్ ఎందుకు విడవాలి? వైయస్ మీద ప్రేమ చేతనా? శ్మశానవైరాగ్యం శ్మశానం దగ్గరే ఆగిపోతుంది. వైయస్ మిత్రులు, అనుచరులూ, చేరదీసినవారు ఆయన మరణం తర్వాత జగన్ వెంట రాలేదని గుర్తించండి. రాకపోతే ఫర్వాలేదు, వైయస్‌నే తిట్టిపోశారు. మరి యిలాటివారిని చేరదీయడంలో వైయస్ విజ్ఞతను ప్రశ్నించవద్దా?

నాయకులను, పార్టీ కార్యకర్తలను వదిలేయండి. ఓటర్లలో, సాధారణ ప్రజల్లో కూడా వైయస్ అభిమానులందరూ జగన్ అభిమానులు కారు. నెహ్రూను అభిమానించినవారు ఇందిరను అభిమానించలేదు. ఇందిర భక్తులు సంజయ్‌ను ఆమోదించలేదు. ఇందిర కొడుకుల్లో సంజయ్‌ది, రాజీవ్‌ది వేర్వేరు దారులు. కాంగ్రెస్ నాయకుల్లో కొందరు అటు, కొందరు యిటు. సంజయ్ చనిపోవడంతో అతని అనుచరులు విధిలేక రాజీవ్ వైపు వచ్చారు. వారసత్వం ఆటోమెటిక్‌గా వచ్చేయదు. చెన్నారెడ్డి గారికున్నంత ప్రజాభిమానం శశిధరరెడ్డికి వుందా? పివిపై వున్న గౌరవం పివి రంగారావుపై వుందా? ఎన్టీయార్ పార్టీ పెడితే ఓట్లు కురిశాయి. ఆయన కొడుకు హరికృష్ణ పెడితే ఒక్కటీ కురవలేదు. ఆయనే ఓడిపోయాడు. వైయస్ పోవడంతో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పని ఫినిష్ అయిపోయిందని ఎలా అనుకుంటాం? ''సాక్షి'' పేపరు ఆగిందా? ఇడుపుల పాయలో మొక్కలు ఎదగడం మానేశాయా?

అంతెందుకు జగన్‌ను తీసుకెళ్లి జైల్లో కూర్చోబెట్టారు. ఆయన పార్టీ వ్యవహారాలు కానీ, వ్యాపారలావాదేవీలు కానీ ఆగాయా? ఎన్టీయార్ పోతే టిడిపి మూసేశారా? ఎవరో వస్తారు, ఏదో ఒక స్థాయిలో నడుపుతారు. కరిజ్మా వున్న నాయకుడు వుంటే కథ వేరుగా వుంటుంది, లేకపోతే మరోలా వుంటుంది. ఒడిదుడుకులు వుంటాయన్న మాట వాస్తవమే కానీ పార్టీ పూర్తిగా మూతపడదని మాత్రం గ్రహించాలి. కాంగ్రెస్‌తో బాటు టిడిపిని కూడా పట్టించుకో నక్కరలేదని, కోస్తా, సీమల్లో వైకాపా గెలిచేస్తుందని, తెలంగాణలో తెరాస గెలిచేస్తుందని, యిద్దరూ రహస్యంగా చేతులు కలిపితే తక్కిన పార్టీలన్నిటినీ మూల కూర్చోబెట్టగలవని అంచనాలు వేయడం పొరబాటని అర్థమౌతుంది. వీళ్లిద్దరూ చేతులు కలిపితే అవతలివాళ్లు చేతులు ముడుచుకుని కూర్చుంటారా? వాళ్లు చేతులు కలపరా?

ఇవన్నీ మనం ప్రశాంతంగా కూర్చుని ఆలోచిస్తే మనకే తడతాయి. కానీ మీడియా మనల్ని ఆలోచింప నీయదు. ఊదరగొట్టేస్తుంది. అతిశయోక్తులు జోడించి, ఏదో హంగామా జరిగిపోతున్నట్టు చూపిస్తుంది. మన ప్రజాస్వామ్యంలో 51% ఓట్లు వచ్చినవాడు విజేత, 49% వచ్చినవాడు పరాజితుడు. కానీ ఎవరైనా నెగ్గగానే 'విజయదుందుభి మోగించాడు', 'అఖండ విజయం', 'మట్టి కరిపించాడు'.. వంటి హెడింగ్‌లు పెట్టేస్తారు, పేపరు వాళ్లు, టీవీ వాళ్లు. ఇక ఓడిపోయినవాడి గురించి 'ఘోరపరాజయం', 'కరుణించని ఓటరు',

'మళ్లీ నిరాశేనా?' వంటి కాప్షన్లు పెడతారు. పక్కన ఎప్పుడో ఎండలో మొహం మీది చెమట తుడుచుకుంటున్న ఫోటో సంపాదించి వేసేస్తారు. ఓటర్లలో సగానికి సగం మంది (కాస్త తక్కువగా) విజేతకు వ్యతిరేకంగా ఓటేశారన్న మాట విస్మరిస్తారు.

2004 ఎన్నికల్లో, 2009 ఎన్నికల్లో నెగ్గిన కాంగ్రెస్‌కు, ఓడిన టిడిపికి మధ్య ఓట్ల వ్యత్యాసం 1-2% మాత్రమే కదా. అంతమాత్రం చేత ఓడిన పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందని ఎలా అనగలరు? తుడిచి పెట్టుకుని పోతే యీ సహకార ఎన్నికల్లో టిడిపి యిప్పటివరకు 26% స్థానాలు ఎలా పొందగలిగింది?

2009 ఎన్నికల్లో యిలాటి లెక్కలే వేశారు. పీఆర్పీ ఆవిర్భావం వలన కాంగ్రెస్‌కు ఓట్లేసే కాపులందరూ చీలిపోయి పీఆర్పీకి వేస్తారని, టిడిపికి మాత్రం ఎప్పటిలాగా కమ్మ ప్లస్ బిసి వేస్తారని అందువలన టిడిపి గెలుపు తథ్యమని మీడియాలో రాశారు. 2004కు, 2009కు మధ్య కాంగ్రెస్‌కు 2% ఓట్లు మాత్రం దగ్గాయి. 2004లో లెఫ్ట్, తెరాస ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయనీ, 2009లో ఒంటరి పోరాటమనీ పరిగణిస్తే యీ తగ్గింపు కూడా లెక్కలోకి రాదు. ఎన్నికల తర్వాత టిడిపి గోల పెట్టింది – తమ ఓట్లను పీఆర్పీ పట్టుకుపోయిందని! ఎలా? సాటి ప్రతిపక్షంగానా? లేక అప్పటిదాకా టిడిపికి ఓట్లు వేసిన కాపులు చిరంజీవి రంగంపై రావడంతో అటు ఫిరాయించేశారనా? ఇదంతా సింప్లిస్టిక్ ఆన్సర్స్ వెతకడం వలన వచ్చే చిక్కు. చిరంజీవి కాపు కాబట్టి కాపులందరూ రాజకీయ ఉద్దేశాలను పక్కకు పెట్టి పీఆర్పీకే ఓటేస్తారని మీడియా ప్రచారం చేయడం వలన, దాన్ని నమ్మి సాధారణ ప్రజలు అనుకోవడం వలన యిలాటి భ్రమలకు లోనయ్యారు.

రాజకీయాలు చాలాకాలంగా గమనిస్తున్న వాడిగా చెప్తున్నాను – సినిమా జయాపజయాలు నిర్ణయించడం ఎంత కష్టమో, పార్టీల భవిష్యత్తు చెప్పడమూ కష్టమే. జాతకాలు హఠాత్తుగా తారుమారవుతాయి. ఇందిరా గాంధీతో తలపడి ఓడిపోయిన తర్వాత మొరార్జీ దేశాయ్ చరిత్ర ఫినిష్ అయిపోయిందనుకున్నారు. ఇందిర ఎమర్జన్సీ పెట్టడంతో కథ మారిపోయింది. రెండేళ్లు తిరక్కుండా మొరార్జీ ప్రధాని అయిపోయారు! జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరా గాంధీ చెత్తబుట్టలో పడిపోయిందనుకున్నారు. రాజ్ నారాయణ్ వంటి వాళ్లు అనేక కుళ్లు జోకులు కూడా వేశారు. మూడేళ్లు తిరక్కుండా ఇందిర వెనక్కి వచ్చేసింది. 32 ఏళ్ల తర్వాత కూడా ఇప్పటికీ ఆమె వారసులు దేశాన్ని శాసిస్తున్నారు.

ఎన్టీయార్ ఒక చిన్న అభ్యర్థి చేతిలో ఓడిపోతారని ఎవరైనా వూహించగలిగారా? మెగాస్టార్ చిరంజీవి సొంత జిల్లాలో ఒక సాధారణ అభ్యర్థి చేతిలో ఓడిపోతారని ఊహించగలిగారా? 2004 తర్వాత కెసియార్ అనేక రాజకీయ తప్పిదాలు చేసి వెనకపడిపోయారు. ఎమ్మెస్సార్, కేకేలు ఛాలెంజ్‌ల నాటకం ఆడి కరీంనగర్ ఉపయెన్నిక తెచ్చిపెట్టి కెసియార్‌కు మళ్లీ వూపిరి పోశారు. 2009లో వైయస్సార్ తెరాసతో పొత్తు పెట్టుకోవడానికి నిరాకరించి దాన్ని 10 స్థానాలకు కుదించేశారు. ఇంతలో ఆయన పోయాడు. డిసెంబరు 9 ప్రకటన వచ్చి తెరాస మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. ఇవన్నీ ఎవరైనా వూహించగలిగారా?

రాజకీయాల్లో ఎన్నో యిమ్‌పాన్డరబుల్స్ వుంటాయి. కచ్చితంగా, బల్లగుద్ది యిలాగే జరుగుతుంది అని దేని గురించీ చెప్పలేం. దేనికి ఎంత వెయిటేజ్ యివ్వాలో తెలియదు. అది తెలిసిపోతే ఓడిపోయేవాడు ఎన్నికల్లో పోటీయే చేయడు. ఓటింగు సరళిని లోతుగా అధ్యయనం చేయాలి. గణాంకాలను అనేక కోణాల్లో పరామర్శించాలి. ఇలాటి సహకార ఎన్నికలకు కూడా ప్రాధాన్యత యిచ్చి తమ ఆలోచనలను రివైజ్ చేసుకోవాలి. వీటిలో విజయం సాధించిన ఊపుతో కాంగ్రెస్ స్థానిక ఎన్నికలు తలపెట్టవచ్చు, నామినేటెడ్ పదవులు భర్తీ చేయవచ్చు. ఇవన్నీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతాయి. పార్టీ విడిచి వెళ్లేవాళ్లు పునరాలోచనలో పడతారు.

ఇలాటి అనేక అవకాశాలను మీడియా విశ్లేషించి మన ముందు పెట్టాలి. సినిమా హీరో వీరాభిమానిలా, గుడ్డెద్దు చేల్లో పడ్డట్టు హైప్ క్రియేట్ చేసి పార్టీ అభిమానులను, కార్యకర్తలను వెర్రెక్కించకూడదు. ఇవి చదివి 'ప్రజలంతా మన పక్షాన వున్నారు, గెలుపు ఎలాగూ ఖాయం' అనుకుని ప్రతిపక్షాల వాళ్లు కాళ్లు బారజాపుకుని కూర్చోవడం చేతనే యిటువంటి ఫలితాలు వస్తున్నాయి.

నాయకులు టీవీల ముందు, సభల్లో 'ఖతమ్ చేస్తాం' నినాదాలు యిచ్చి వెళ్లి విశ్రాంతి తీసుకుంటే ఎలా? బయటకు వచ్చి యిలాటి ఫలితాలతో క్రుంగిపోయిన కార్యకర్తలను ఉత్సాహ పరచవద్దా? శత్రువు బలబలాలను, శక్తియుక్తులను తన సైన్యానికి కరక్టుగా తెలియపరచవద్దా? 'ఉఫ్ మని వూదేస్తే ఎగిరిపోతాడు, ఉమ్మేస్తే మునిగిపోతాడు, మనది పోరాటాలగడ్డ, వీరభూమి, గతంలో వారి నెదిరించాం, వీరిని తోక ముడిచేట్లా చేశాం..' యిలా చెప్పి వూదరగొడితే ఏం లాభం? 'ప్రస్తుతం వున్న పరిస్థితి యిది. మీరంతా జాగ్రతంగా వుండాలి, ఉదాసీనత పనికిరాదు, యీ పోరాటం చాలాకాలం సాగుతుంది, మరీ ఎక్కువగా ఆశ పడకండి, విజయం సాధించకపోతే నిరుత్సాహ పడకండి, నిండుప్రాణం తీసుకోకండి..' అని స్పష్టంగా తమ క్యాడర్‌కు బోధించాలి. కాంగ్రెస్, టిడిపి పార్టీల వారు బలంగా పాతుకుని వున్నారని, వారిని పెకలించడం పగటికలలు కన్నంత సులభం కాదని గుర్తించాలి.

వైకాపావారు కూడా 'జగన్, యువత, యీ సారి విజయం ఖాయం..' వంటి నినాదాలు మాని, గ్రౌండ్ రియాలిటీని గుర్తించాలి. జగన్ అభిమానుల సంఖ్య కంటె వ్యతిరేకుల సంఖ్య ఎక్కువనీ, వాళ్లు నియోజకవర్గాల వారీగా చేతులు కలిపితే వైకాపాకు గెలుపు కష్టమనీ గుర్తించాలి. గ్రామీణ ప్రాంతాల్లో జగన్ పట్ల, అవినీతి పట్ల ఉదాసీనత వుండవచ్చు. కానీ నగర, పట్టణ ప్రాంతాల్లో జగన్ అవినీతిపై జరుగుతున్న ప్రచారం వారి విజయావకాశాలను దెబ్బ తీస్తుందని గ్రహించాలి. జగన్‌కు వున్న ఎడ్వాంటేజి – యూత్‌ఫుల్ యిమేజి! ఇబ్బంది – ఇప్పటిదాకా జగన్ చేసినదేమీ లేకపోవడం! టిడిపి, కాంగ్రెస్‌లు యిప్పటికే వివిధ పదవుల్లో పని చేసి పేరు తెచ్చుకుని, అనుయాయులను ఏర్పరచుకున్నారు. జగన్‌కు యిప్పటిదాకా పదవులు లేవు. సామర్థ్యం రుజువు చేసుకున్నది లేదు.

ఏదైనా మునిసిపాలిటీ గెలిచి చూపిస్తే వైకాపా వాళ్లు యిలా చేస్తారని అనుకోవచ్చు. వైయస్ చేసినట్లే జగన్ చేస్తారని నమ్మకం ఏమీ లేదు. వైయస్ పార్టీ వేరు, పరిస్థితులు వేరు, అనుభవం వేరు. జగన్ పరిమితులు వేరు. జగన్‌కి ఓటేస్తే వట్టి వాగ్దానాలు చూసే వేయాలి. అలా ఎంతమందిని ఆకర్షించగలరు? అనేదే ప్రశ్న. ఆ ప్రశ్నకు జవాబు వెతక్కుండా ఏవేవో గాలిమేడలు కడితే ప్రమాదం. (సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)

ఫిబ్రవరి 04 ఎమ్బీయస్ : కరివే(దనా)పాకు

ఆత్మజ్ఞానం వుండాలన్నాడు గీతాకారుడు. 'నో దై సెల్ఫ్' అన్నాడు ఆంగ్లేయుడు. కరివేపాకు తాను కరివేపాకునని గ్రహించాలి తప్ప తులసీదళాన్ని అనుకోకూడదు. తులసీదళాన్ని ఎండిపోయిన తర్వాత కూడా బయట పడేయడానికి దడుస్తాం. తులసికోటలోనే పెడతాం. కరివేపాకునో? నవనవ లాడుతూండగానే కంచంలోంచి తీసి పక్కన పడేస్తాం! అవసరం తీరాక పక్కన పడేశారని కరివేపాకు వేదన పడవచ్చు. అంతమాత్రాన పక్కన తీసి పడేయకుండా వుంటామా?

శంకరరావుగారు కాంగ్రెస్ పార్టీకి చాలా కావలసినవాడు – కొంతకాలం క్రితం ఆయన రాసిన ఉత్తరమ్ముక్క అమోఘమైన అస్త్రంగా పని చేసింది – జగన్‌పై కేసుల ప్రక్రియ ప్రారంభించడానికి, అంతిమంగా అతన్ని కారాగారవాసిగా చేయడానికి! పూర్వకాలం మహర్షులు కోపం వస్తే వంగి నేల మీది గడ్డిపరకను పెరికి, మంత్రం జపించి వదిలితే అది అస్త్రంగా మారేది, శత్రువులను వెంటాడేది. మీకు తెలిసే వుంటుంది – మంత్రం లేకుండా ప్రయోగించే ఆయుధం శస్త్రం! మంత్రపూరితమైన శస్త్రం అస్త్రంగా మారుతుంది. మామూలు వీరులు బాణాలు చేతబట్టి మంత్రం జపించి వదిలేవారు. మహర్షులు అధికారపార్టీలాటి వాళ్లు. వాళ్లకు బాణాలూ, గీణాలూ కూడా అక్కరలేదు. గడ్డిపరక కూడా చాలు. అంతమాత్రం చేత గడ్డిపరక తనే శత్రువులను నిర్జించానని అనుకుంటే ఎలా? శత్రువుతో పని అయిపోయాక అది ఏ మూలో పడివుండాలి కదా. ఎగిరెగిరి పడితే ఏమవుతుంది? కావాలంటే హోం మినిస్టర్‌ను కూడా నాశనం చేయగలనని గప్పాలు పలికితే ఏమవుతుంది? డిజిపి ఆఫీసుకి వెళ్లి ఛాలెంజ్‌లు చేస్తే ఏమవుతుంది?

జగన్‌పై లేఖ రాశాక శంకరరావుగారు యిదేదో బాగుందనుకుని చాలామంది మీద రాసి పంపించాడు. కానీ అవేమీ పని చేయలేదు. వెనక్కాల మంత్రం చదవాల్సినవాళ్లు చదవలేదు. అది గ్రహించకుండా యీయన వూరికే నోరు పారేసుకోసాగాడు. 'పరకా, నీ స్థానం యిదిగో' అని మంత్రి పదవి ఊడపీకి యింట్లో కూర్చోబెట్టారు. అప్పటికీ ఆయనకు ఆత్మజ్ఞానం కలగలేదు. పెనం మీది పేలంలా ఎగిరెగిరి పడసాగాడు. పాతకేసులు ఆయన్ని పట్టిపీడించాయి. ఎప్పుడో భూమి కబ్జా చేసిన కేసు. ప్రభుత్వభూమి అయి వుంటే గొడవయ్యేది కాదు, మధ్యతరగతి జనాభా అంతా కలిసి కలిసికట్టుగా ఎదిరించారు. సుప్రీం కోర్టుదాకా వెళ్లి పోరాడారు. కోర్టు ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఇలాటప్పుడైనా ఆయన అణగి వుంటే పోయిుండేది. తన ఘనత గతం అని గ్రహించి పోలీసు విచారణకు సహకరించి వుంటే సరిపోయేది. అబ్బే, ఆయన తనే చట్టం అనుకున్నాడు. పోలీసులు వచ్చినపుడు అనారోగ్యం అన్నాడు. ఆ తర్వాత డిజిపి ఆఫీసుకి వెళ్లి దమ్ముంటే అరెస్టు చేయండి.. అంటూ ఛాలెంజ్‌లు చేశాడు. హోం మంత్రికి వ్యతిరేకంగా ఉత్తరాలు రాశాను కాబట్టి ఆవిడ పగబట్టిందని యాగీ చేశాడు.

పోలీసుల దమ్ము మాట ఎలా వున్నా, బీపీ పెరిగి ఆయనే కళ్లు తేలేశాడు. అప్పుడే కాదు, మొన్న కూడా పోలీసులు తీసుకెళ్లగానే రక్తపుపోటు పెరిగింది, గుండె గతుక్కుమంది, సుగర్ డ్రాపయింది. ఇంత అర్భకదేహంతో అంతంత ప్రగల్భాలు అవసరమా? పోలీసులు వచ్చేవరకూ షంషేర్‌లా మాట్లాడారు. రండి సార్ విచారణ చేద్దాం అంటూ జీపెక్కించగానే వ ృద్ధాప్యం, అనారోగ్యం, శాసనసభ్యుడిగా సీనియారిటీ, కులం.. అన్నీ గుర్తుకు వచ్చేశాయి. మనకు లుంగీ ఫోటో ఒకటీ! మొన్ననే లగడపాటి లుంగీ ఫోటో చూశాం. ఇవాళ యీయనది. ఈయనది లగడపాటి కంటె దయార్ద్రహ ృదయం. పైన బనీను వేసుకుని పదమన్నాడు. వాళ్లమ్మాయి యింకా మంచిది కాబట్టి చొక్కా వేసుకో నాన్నా అని యిచ్చారు. అదే పోలీసులు యిచ్చి వుంటే ఠక్ అనేవారు. 'దుస్తులు వేసుకునే టైము కూడా యివ్వలేదు' అని కుటుంబసభ్యులు వెంటనే స్టేటుమెంటు యిచ్చేశారు. ప్యాంట్ వేసుకోండి మహాప్రభో అని పోలీసులు బతిమాలారుట. లుంగీ స్థిరత్వం గురించి వారి భయాలు వారివి. అయినా శంకర్రావుగారు వినలేదు. లుంగీ పబ్లిసిటీ లుంగీదే అని తెలుసు ఆయనకు.

కరుణానిధిగారు తను అధికారంలో వుండగా జయలలితను జైల్లో పెట్టించారు. అందుకని జయలలిత అధికారంలోకి రాగానే తనను పెట్టిస్తుందని ఎదురు చూశారు. ఎదురు చూసిన ఆ ఘడియ వచ్చింది. ఓ రాత్రి వేళ పోలీసులు ఆయన తలుపు తట్టారు. పగటివేళ వస్తే కరుణానిధి కార్యకర్తలందరూ అడ్డం పడతారని, శాంతిభద్రతల సమస్య వస్తుందని తెలుసు. అయితే కరుణానిధి ట్రిక్కులు వాళ్లకు తెలియవు. ఆయన సినిమా మనిషి. చిన్నప్పుడు నాటకాలు వేశాడు, తర్వాత సినిమా స్క్రిప్టులు రాశాడు. డ్రస్సు మార్చుకుని వస్తాను అని పోలీసులను ముందు గదిలో కూర్చోబెట్టి, లోపల్నుంచి మేనల్లుడు మురసొలి మారన్‌కు ఫోన్ చేశాడు. మారన్ అంటే సన్ టివి అధినేత (ఆయన పోయాక ఆయన కొడుకు నడుపుతున్నాడిప్పుడు) అంతే టీవీ కెమెరామన్‌లతో సహా ఆయన దిగడ్డాడు. అప్పుడు కరుణానిధి పదండి వెళదాం అన్నాడు. పోలీసులు ముందుకు వచ్చారు. కరుణానిధి వెంటనే కెమెరా ముందుకి వచ్చి, అటూ యిటూ వూగుతూ, లుంగీ జారిపోతూ వుండగా ''అయ్యో చంపకండి, చంపకండి..'' అని అరవ నారంభించాడు.

పక్కనున్న మారన్ ఏకంగా లుంగీ ఊడదీసేసుకుని చారల డ్రాయర్‌తో నటించేశాడు. పోలీసులు బిత్తరపోయారు – ఇప్పటిదాకా బాగానే వున్నాడు, ఇప్పుడేం వచ్చిందా అని. వీడియో షూట్ అయ్యాక కరుణానిధిని వెంటబెట్టుకుని వెళ్లిపోయారు.

అంతే, యిక సన్ టివి అవేళ తన కార్యక్రమాలను మొత్తం రద్దు చేసేసింది. రోజంతా ఇదే క్లిప్పింగ్ చూపిస్తూ 'దీనిపై స్పందించండి, ఒక వృద్ధుణ్ని, అర్ధరాత్రి హఠాత్తుగా దాడి చేసి..., బట్టలూడదీసి, రాక్షసంగా ఖైదు చేయడమా? ఖండించండి' అంటూ వూదర గొట్టేసింది. (యూ ట్యూబ్‌లో దాని లింక్ –నీశిశిచీ://గీగీగీ.గిళితిశితిలీలి.బీళిళీ/గీబిశిబీనీ?ఖీవ4ఐరీళితీశిఔఆఒనిరీ ) అంత హఠాత్తుగా ఖైదు చేస్తే యీ వీడియో ఎలా వచ్చింది? అని ఒక్కరూ ప్రశ్నించలేదు. అయ్యో, అయ్యయ్యో, అయ్యయ్యయ్యో... అంటూ ఒకటే మెసేజ్‌లు. శంకరరావుగారు కరుణానిధి జీవితచరిత్రలోంచి ఒకటి రెండు పేజీలు చింపుకున్నారు. అవే ట్రిక్కులు ప్రయత్నించారు. కానీ కరుణానిధి సంఘటన తర్వాత పోలీసులూ తెలివి మీరారు. వాళ్లే ముందుగా వీడియో తీసి పెట్టుకుంటున్నారు. శంకరరావుగారు 'సిఎం నవుతా, ముక్కలుగా నరుకుతా' అంటూ బండబూతులు తిట్టినవన్నీ రికార్డు చేసుకుని వుంటారు. రేపు కమిషన్ విచారణలో అవన్నీ బయటపెడతారు.

అయినా శంకరరావుగారికి తన స్థితి తెలిసి రావటం లేదు. పోలీసులు వచ్చినది, కోర్టు ఆదేశాల మేరకు. ప్రస్తుతం ప్రభుత్వం మాంచి వూపుమీదుంది. మహామహా మజ్లిస్ నాయకులనే జైలు జైలుకి తిప్పుతున్నారు. కెసియార్, కోదండరాములపై కూడా కాంగ్రెస్ నాయకులు కేసులు పెడుతున్నారు. రేపో మాపో పొన్నంను పాత రైల్వే కేసులో అరెస్టు చేయబోవచ్చు, హరీష్‌ను ఢిల్లీ ఎస్టీ కేసులో చేయవచ్చు, కెసియార్‌ను కూడా విచారణకు పిలవవచ్చు. గ్రహచారం బావుండకపోతే సరదాగా అరెస్టు చేయవచ్చు. పక్షపాతం లేకుండా లగడపాటిని కూడా – ఉస్మానియా విద్యార్థులను తాలిబన్లతో పోల్చినందుకు కేసు పెట్టించి అరెస్టు చేయవచ్చు. ఇప్పటిదాకా చేయలేదు కదా, యిప్పుడెందుకు చేయడం? అని అడగకండి. మజ్లిస్ వాళ్లు యిన్నాళ్లూ మన కళ్లెదురే వున్నా పోలీసులకు కనబడలేదు. ప్రస్తుతం గ్రహణం తొలిగిపోయి వాళ్లకు మనుష్యులు స్పష్టంగా కనబడసాగారు. మాయాబజారులో గుమ్మడి చెప్పినట్టు – కాలమహిమ!

శంకరరావుగారిలో మన నాయకులకు ఓ కబ్జాదారు కనబడలేదు. దళితుడు కనబడ్డాడు, అక్బర్‌లో కొందరికి ముస్లిమే కనబడ్డట్టు! ముస్లిములందర్నీ జైల్లో పెట్టలేదు కదా, అక్బర్‌నే ఎందుకు పెట్టారు? అలా చూస్తే ప్రతీ నేరస్తుడిలోనూ ఎవరో ఒకరు కనబడవచ్చు – మహిళో, ఎస్సీయో, బిసియో, వెనకబడిన ప్రాంతం వాడో, వయసు మీరినవాడో, పేదవాడో, రోగియో, తాగుబోతో... (ఈ మధ్య ఓ కోర్టు మద్యం మత్తులో రేప్ చేసినందుకు శిక్ష తగ్గించింది – నేరం నాది కాదు, నాటుసారాది అని వాదించాడు వాడు)! ఈ లెక్కన మనం ఎవర్నీ అరెస్టు కాదు కదా, పోలీసు స్టేషన్‌కు కూడా తీసుకెళ్లి విచారించనక్కరలేదు. ఎవడి పాటికి వాడు నేరాలు చేసుకుంటూ పోవచ్చు. కోర్టు ఆదేశాలంటారా, మనిషి కనబడలేదంటే సరి! శంకరరావు వంటి సీనియర్ ఎమ్మెల్యేను అరెస్టు చేయడమా (అరెస్టు కాదు మొర్రో అని పోలీసులు చెప్పినా వీళ్లు వినిపించుకోరు) అంటున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రులనే తీసుకెళ్లి జైల్లో కూర్చోబెట్టారు. అయినా యీయన కరుణానిధి కంటె లెజిస్లేటరుగా సీనియరా? సీనియారిటీ వస్తే జుడిషియల్ యిమ్యూనిటీ వస్తుందా?

దళితుడు కాబట్టి అంటూ కొందరు మంత్రులు, వివిధ పార్టీల దళిత నాయకులు, దళితేతర ప్రతిపక్ష నాయకులు చ్చొచ్చొచ్చొ అంటున్నారు. కొందరు నాయకులు బంద్ అంటున్నారు. మరి గ్రీన్‌ఫీల్డ్ బాధితుల్లో దళితులు వున్నారని బయటకు వస్తే వీళ్లేమంటారో చూడాలి. దళిత ముద్దాయా? దళిత బాధితుడా? ఎవరికి ఎక్కువ సింపతీ! పైగా శంకరరావు దళిత కార్డు విపరీతంగా వాడేశారు. ఆయనకు నచ్చిన ఫర్నిచరు యివ్వకపోయినా దళితుణ్ని కాబట్టి యివ్వలేదంటూ మినిస్టర్ కాబిన్‌లో పరుపులు పరిపించాడు. వివేక్ ఏకంగా షిండేకు ఫిర్యాదు చేశారు. కోర్టు ఆర్డర్లు పట్టించుకోవద్దని ఏ కేంద్ర హెూం మంత్రి అయినా చెప్తాడా? శంకరరావుగారి అమ్మాయి 'మా నాన్న పేరు చివర 'రెడ్డి' వుంటే యిలా చేసేవారా?' అని అడుగుతోంది. పేపరు చదవరు కాబోలు. జగన్ పేరు చివరా రెడ్డి వుంది. ఆయన అనుయాయులు అనేకమంది రెడ్లను విచారణ పేరుతో పిలిచి అరెస్టు చేశారు. అస్మదీయులా? తస్మదీయులా? అన్నది ఒక్కటే కన్సిడరేషన్. వీళ్లతో యింకా పని వుందా, లేదా అన్నదే పాయింటు. కెసియార్‌తో పని అయిపోయిందనుకున్నారో ఏమో, ప్రతీ ఛోటామోటా కాంగ్రెస్ లీడరూ ఆయన్ని తిట్టిపోస్తున్నారు. కేసులు పెట్టడానికి ఉరకలేస్తున్నారు.

ఇప్పుడు శంకరరావుగారితో పని అయిపోయింది. తీసుకెళ్లి కోర్టులకు, కేసులకు అప్పగించేస్తున్నారు. జరిగిన యీ సంఘటనపై విచారణ వేసారు. మూడొంతులు పోలీసులది తప్పు లేదంటారు. అయినా కాంగ్రెస్ నుండే దళితనాయకులు పట్టుబడతారు. ఓ పోలీసు అధికారిని బదిలీ చేస్తారు. అయిపోతుంది. తర్వాతి సారి ఏమవుతుంది? విచారణకు రానని శంకరరావు మొండికేయగలరా? మొదటిసారి వచ్చినంత పబ్లిసిటీ మళ్లీ వస్తుందా? ఈ సారి పోలీసులు టీవీ మీడియానే వెంటబెట్టుకుని వెళ్లవచ్చు. తను చాలా గొప్పవాణ్నని, సిఎం కాబోతున్నవాణ్నని శంకరరావుగారు ఎంతకాలం భ్రమలో వుంటారో చూద్దాం **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 05 ఎమ్బీయస్ : మళ్లీ అవిశ్వాసం గోల**

కిరణ్ సర్కారుపై అవిశ్వాస తీర్మానం పెట్టాలి అని మళ్లీ గోల ప్రారంభమైంది. ఆ పెట్టేదేదో టిడిపి పెట్టాలి అని వైకాపా యాగీ చేస్తుంది. అదేమిటో ప్రతీ పార్టీ అవతలిపార్టీ ఏం చేయాలో మానిఫెస్టోలు రాసేస్తూంటాయి. కాంగ్రెస్ సభ్యుల సంఖ్య తగ్గి ప్రభుత్వం

మైనారిటీలో పడింది కాబట్టి ప్రధాన ప్రతిపక్షంగా టిడిపి అవిశ్వాసం పెట్టాలి అని వైకాపా తీర్మానిస్తుంది. తెలంగాణ తేకపోతే చచ్చేది కాంగ్రెసే కాబట్టి చచ్చినట్టు తెచ్చి తీరాలి అని తెరాస చెపుతుంది. చావో బతికో కాంగ్రెసే చూసుకుంటుంది కదా మధ్యలో వీళ్లకెందుకు బాధ అనిపిస్తుంది. నిజంగా ఓ పార్టీ చచ్చిపోతే తక్కినవాళ్లు సంతోషించాలి, పోటీదారుల్లో ఒకరు తగ్గారని. వాళ్లు సజీవంగానే వుండి ప్రజాదరణ పొందుతూ వుండాలని వీళ్లకెందుకు చింత?

అలాగే వైకాపా చెప్తోంది – యిప్పుడు అవిశ్వాసం పెట్టకపోతే టిడిపి – కాంగ్రెస్ కుమ్మక్కయిపోయాయని ప్రజలు అనుకుంటారట, ప్రతిపక్షంగా తన బాధ్యత నెరవేర్చనందుకు క్షమించరట. అనుకుంటే అనుకోనీ, క్షమించకపోతే క్షమించకపోనీ, వీళ్లకెందుకు కడుపునొప్పి? ఏదో పొడిచేస్తామని మాటలు చెప్పి పరిపాలనే సవ్యంగా చేయని కాంగ్రెస్‌నే క్షమిస్తున్నారు. ఇక టిడిపిపై కోపం ఏం పెంచుకుంటారు? ఏం నిలదీయగలరు? గట్టిగా అడిగితే టిడిపి తిరిగి అడగవచ్చు – 'ఎన్నికల్లో మాకు ఓట్లేయడానికి చేతులు రాలేదు కానీ యిప్పుడు అడగవచ్చారా? మొదట గెలిపించి అప్పుడడగండి' అని. అయినా ప్రజలు టిడిపి పట్ల దురభిప్రాయం కలిగి వుండకూడదని, వాళ్లని క్షమించి ఓట్లేసేయాలనీ వైకాపా కోరుకుంటోందా? టిడిపిని క్షమించి ఆదరిస్తే వీళ్లకేం కలిసి వస్తుందట? టిడిపి–కాంగ్రెస్ లోపాయికారీ పొత్తు పెట్టుకున్నాయన్న బాధ వైకాపాకు వుండవచ్చు, ప్రజలకు వుండాలనేముంది? 'మీలో మీరు కొట్టుకుని జగన్ గెలిచేట్టు చేస్తున్నారు. మీరు చేతులు కలిపి అతన్ని నిలవరించండి' అని ప్రజలు కోరుకుంటున్నారేమో ఎవరికి తెలుసు? శత్రువు శత్రువు మిత్రుడు అన్న సూక్తి పురాణకాలం నుండి వుంది. ఇవాళ వీళ్లు కొత్తగా నీతి తప్పినట్టు వైకాపావాళ్లు నోరు కొట్టుకోవడం దేనికి? సందట్లో సడేమియా లాగ వాళ్లవైపు ఓ నలుగురు వస్తారేమోనన్న ఆశ తప్ప! అంటే కాంగ్రెస్ మామిడి చెట్టు మీద టిడిపివారు జబ్బలలిసేలా రాళ్లు విసిరి పళ్లు రాలిస్తే అవి వైకాపావాళ్లు ఏరుకుంటారన్నమాట! మేమెందుకు రాళ్లు విసరడం అని టిడిపివాళ్లు అడిగితే అది వీళ్లకు తప్పుగా తోస్తోంది. అవిశ్వాసం పెడితే నెగ్గమన్న భయం వుంటే గవర్నరు దగ్గరకు వెళ్లాలట, తనే విశ్వాస పరీక్ష పెట్టుకుని నెగ్గి చూపాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలట.

దీనికంతా కారణం ఏమిట్రా అంటే బొత్సగారు యిచ్చిన బహిష్కరణ స్టేటుమెంటు. దానంత ఫన్నీ ప్రకటన మరోటి లేదు. ఎవర్ని బహిష్కరించారో తెలియదు, ఎన్నేళ్లకు బహిష్కరించారో, ఎందుకు బహిష్కరించారో చెప్పలేదు. ఓ పెద్ద గుంపు దగ్గరకి ఒకడు వచ్చి 'మీలో ఓ అరడజనుమంది చచ్చిపోయారు' అని డిక్లేర్ చేస్తే పోయినవాళ్లెవరో, మిగిలినవాళ్లెవరో వాళ్లల్లో వాళ్లే డిసైడ్ చేసుకోవాలన్నమాట! డెత్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలన్నమాట, హౌ ఫన్నీ! బహిష్కరణకు ఓ పద్ధతి వుంటుంది. ఓ షో కాజ్ నోటీసు, దానికి సమాధానం, సమాధానంపై పార్టీ అసంతృప్తి, వుంటే విచారణ.., సస్పెన్షన్, మరీ దారికి రాకపోతే బహిష్కరణ! అదేమీ లేకుండా 'ఓ తొమ్మిది మంది యివాళ్టి నుండి మా పార్టీ సభ్యులు కారు' అంటే ఉన్నవాళ్లల్లో ఎంతమంది మర్నాటి నుండి పార్టీ ఆఫీసుకి రావాలి, ఎంతమంది రాకూడదు?

ఇలాటి వింతప్రవర్తనకు కారణం ఏమిటి? అని అందరూ ఆశ్చర్యపడుతున్నారు. కిరణ్‌ను దెబ్బ కొట్టడానికి యిది బొత్స కుట్ర అని కొందరి ఆరోపణ. ఇలా అయితే పార్టీ మైనారిటీలో పడిపోతుంది, తద్వారా కిరణ్ సర్కారు కూలిపోతుంది అని బొత్స భలే ఎత్తు వేశారు అంటున్నారు. నిజంగా అదే జరిగితే హై కమాండ్ బొత్సను తోలు తీసేయదా? తెలంగాణ విషయంలో నిత్యం నిందలు పడుతూ కూడా సోనియా యిప్పటిదాకా తేల్చకపోవడానికి కారణం – కిరణ్ ప్రభుత్వం అస్థిరం అవుతుందన్న భయంతోనే అని ఓ పక్కన అంటూ వుంటే, తీరికూర్చుని తమకు తామే కూలదోసుకుంటారా? కూలదోసినవాణ్ని సహిస్తారా? సోనియాకు తెలియకుండా బొత్స బహిష్కరణ నిర్ణయాన్ని ప్రకటిస్తారా? నేనలా అనుకోను.

కాంగ్రెస్ పార్టీ తన తడాఖాను చూపించడానికి చేసిన ప్రయత్నమే యిదని నా నమ్మకం. ఉండవల్లి చేత సభ పెట్టించడం, కాంగ్రెస్ సభ్యులందరి చేత కెసియార్‌ను తిట్టించడం జరిగాక సహకార సంఘ ఎన్నికలను సీరియస్‌గా పట్టించుకుని గెలిపించుకున్నారు. 'కాంగ్రెస్‌ను తీసిపారేయలేము, దాని ఖాతా ముగిసిపోలేదు, యింకా రికనింగ్‌లోనే వుంది, గట్టిగా ప్రయత్నిస్తే మళ్లీ గెలవవచ్చు' అన్న సంకేతాలు గట్టిగా పంపడానికే బొత్స చేత యీ ప్రకటన చేయించి వుంటారు. 'కాంగ్రెస్ డిఫెన్సులో పడిపోయింది కాబట్టి దాన్ని వదిలేసి వైకాపాలో చేరితే మంచిది, మునిగే నౌకను ఎంత త్వరగా వదిలితే అంత బాగు' అనుకునేవాకి మునిగే నౌక కాదని చెప్పాలంటే అఫెన్సు మోడ్‌లోనే చెప్పాలి. చెప్పడంలో తన నౌకను తనే ముంచుకోకూడదు. అందుకే ఫలానా ఫలానా అని చెప్పలేదు. పార్టీ వీడదామనుకుంటున్న వారికి మాత్రమే అర్థమయ్యేట్లా 'పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారెవరో మీకు తెలుసు' అని జర్నలిస్టుల ఊహకు వదిలేశారు బొత్స.

ఈ హెచ్చరిక తర్వాత ఎవరైనా తిరిగి వచ్చేద్దామనుకుంటే వచ్చేయచ్చు అని వెసులుబాటు యిచ్చారు. వచ్చేస్తే తొమ్మిదిలోంచి ఆ అంకె తగ్గుతుందన్నమాట. అయినా స్పీకరుకి చెప్పి, ఆయన ఆమోదించిన తర్వాత కదా తొమ్మిదో, ఎనిమిదో, పదో తేలేది. ఆ ప్రమాదం లేకుండా వొట్టి బెదిరింపులతోనే పని కానిద్దామని పార్టీ చూస్తుంది. టిడిపి కూడా అలాటి పరిస్థితిలోనే వుందని చూశాం. ఉపయెన్నికలంటే ఎవరికైనా భయమే. పైగా యిప్పుడు 2, 3 కోట్లు ఖర్చు పెట్టి గెలిచినా లాభం ఏముంది? గట్టిగా ఏడాది కూడా టెర్మ్ మిగలదు. బజెట్ సమావేశాల్లో ఎవరైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసి కూల్చేద్దామని చూస్తారేమో మేం కరవగలం జాగ్రత్త అని అధికార పార్టీ వారు నోరు తెరిచి పళ్లు ప్రదర్శించడం లాటిది బొత్స ప్రకటన. పళ్లు చూపినంత మాత్రాన కరుస్తారన్న గ్యారంటీ లేదు. కిరణ్ పట్ల బొత్సకు ప్రేమ కారిపోతోందని, పొంగి పొర్లిపోతోందని నేను అనను. కానీ ప్రస్తుతానికి కిరణ్ జమానా నడుస్తోందని,

నడిచినంతకాలం నడవనీ అనీ బొత్స అనుకుంటున్నారని నా ఐడియా. రెండేళ్లు దాటిపోయాక, యిప్పటికిప్పుడు అర్జంటుగా పడగొట్టేసి బావుకునేది ఏముంది? అధికధరల కారణంగా ఎన్నికల్లో పార్టీ గెలుస్తుందన్న నమ్మకం లేదు. ఆ టైముకి వున్న సిఎంగా ఓటమిని తలకు చుట్టుకోవాలి. ఐదేళ్లు కాదు, పదేళ్లు రాజకీయ అజ్ఞాతవాసం చేయాలి.

అంతకంటె పిసిసి అధ్యక్షుడిగా కొనసాగుతూ ఎన్నికల వేళ తన వాళ్లందరికీ టిక్కెట్లు యిప్పించుకోవచ్చు, వారికి పార్టీ నిధులు పంచవచ్చు. ఒకవేళ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు దక్కితే సిఎం పదవికి పోటీ పడినపుడు యిలా లాభపడిన వారందరూ తన పక్షాన నిలవవచ్చు. రాహుల్ గాంధీ ఒకవేళ 'ఒక నాయకుడు–ఒక పదవి' షరతు అమలు చేస్తానంటే యీ కారణాల చేతనే బొత్స పిసిసి పదవిని ఎంచుకుని, మంత్రి పదవి వదిలేస్తారని నా నమ్మకం. అలాటప్పుడు ముఖ్యమంత్రి పదవి ఆశించి కేవలం కిరణ్‌ను యిబ్బందుల్లో నెట్టడానికి యీ ప్రకటన చేశారనుకోవడం అసమంజసం. కాంగ్రెస్ బయాస్నీ చూపించడానికే, వైకాపాను సున్నితంగా ఛాలెంజ్ చేయడానికే యీ ప్రకటన! షర్మిల తెలంగాణ పాదయాత్ర తిరిగి ప్రారంభమవుతోంది కాబట్టి తెలంగాణ కాంగ్రెస్ నుండి కొన్ని పార్టీ ఫిరాయింపులు వుంటాయన్న సమాచారం వుండి వుండవచ్చు. ముఖ్యంగా కోమటిరెడ్డి సోదరుల వంటి వారు! అందుకే అర్జంటుగా ఖబడ్దార్ అని చెప్పారన్నమాట! – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)

ఫిబ్రవరి 06 ఎమ్బీయస్ : అ, ఆ.. లూ... అక్బర్, అసద్‌ల అరెస్టూ

కాప్షన్ చదివి నాకు మతి పోయిందని తీర్మానించేయకండి. రెండు వేర్వేరు సబ్జక్టులపై కబుర్లు రాయబోయి, కలగాపులగం చేసేశానని తిట్టుకోకండి. అసద్, అక్బరుద్దీన్‌ల అరెస్టు వెనక తెలుగును బలవంతంగా అమలు చేసే కుట్ర ఉందిట! నాకు తెలియదు, ఒక ప్రొఫెసర్‌గారు, మేధావిగా పేరుబడినవారు విలేకరుల సమావేశంలో అన్నారు. ఆ ముక్క ఆదివారం నాటి ఆంధ్రజ్యోతి పేపర్లో చదివి నేను మీకు చెపుతున్నాను. అంతేకాదు, ఉర్దూ, కన్నడ, మరాఠీ మాధ్యమ పాఠశాలల్లో ఆయా భాషలు మరుగున పడేందుకు తెలుగును బలవంతంగా రుద్దేందుకు కిరణ్ ప్రభుత్వం కుట్ర పన్నిందని కూడా సెలవిచ్చారు. తెలుగుకి యింత పవర్ వుందాని తెల్లబోయి, కాస్త కళ్లు తిరిగి వుంటాయి. కాస్త మంచినీళ్లు తాగి.. తమాయించుకుని, మళ్లీ చదవడం మొదలుపెట్టండి.

మోకాలికీ, బోడిగుండుకీ ముడి పెట్టగల యీ మేధావి ఎవరు అనుకుంటున్నారా? మహిషాసురుడికి, నరకాసురుడికి, బకాసురుడికి.. యిలా అసుర పదం చివర కనబడిన ప్రతీ పురాణపాత్రకీ కులం రంగు పులమగల పరిశోధకుడు వున్నారు మనకు. హిందూమతం అంటే పరమ అసహ్యం ఆయనకు. కానీ మన అందరి కంటె ఎక్కువగా వాటిని హిందూ పురాణాలని అధ్యయనం చేస్తారాయన. రంధ్రాన్వేషణ చేసి, దొరక్కపోతే రంధ్రాలు చేసి వాటిని మనకు సమర్పిస్తారు. ఇంత చెప్పినా మీకు తట్టకపోతే ఆయన నిర్వహించిన పెద్దకూర పండగ గురించి గుర్తు చేయవలసి వస్తుంది. య్యస్! ఆయనే ప్రొఫెసర్ కంచె ఐలయ్య. ప్రస్తుతం తెలుగు మీద పడ్డారు. సిటిజన్ ఫర్ సోషల్ జస్టిస్ అనే సంస్థకు చైర్మన్ హోదాలో పాఠశాల విద్య జాతీయ స్థాయి అంశమని సెలవిచ్చారు. ఇన్నాళ్లూ అది ఉమ్మడి జాబితాలో వుందని విన్నాను. కళ్లు తెరిపించారు, మహానుభావుడు. ఇందులో మార్పులకు రాష్ట్రప్రభుత్వానికి అధికారం లేదని హుంకరించారు. మరి తమిళనాడు స్కూళ్లలో తమిళం నేర్పమని, కర్ణాటక స్కూళ్లలో కన్నడ నేర్పమని.. ఆ యా రాష్ట్రప్రభుత్వాలు చెప్పకపోతే కేంద్రం చెపుతోందా? మరి అలా చెప్పిన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి తెలుగు నేర్చుకోకుండా డిగ్రీలు, పోస్ట్ గ్రాజువేషన్స్ చేసేయవచ్చని ఎలా చెప్తోంది?

నేర్పే భాషల్లో తెలుగు కూడా వుండాలని రాష్ట్రం ఉత్తర్వు వేసినా అది స్టేట్ సిలబస్‌కే వర్తిస్తుంది. సిబిఎస్‌ఇ వంటి కోర్సుల్లో ఇంగ్లీషు, హిందీలే నేర్పుతారు. తెలుగు చదివి తీరాలనరు. దేశవ్యాప్తంగా బదిలీ అయ్యే ఉద్యోగాలు చేసేవాళ్లు తమ పిల్లల్ని ఆ కోర్సుల్లో చేర్పిస్తారు. స్టేట్ సిలబస్‌లో చేర్పించినవారు పిల్లలు తెలుగు చదివితే ఐలయ్యగారికి వచ్చే నష్టం ఏముంది? తక్కిన రాష్ట్రాలన్నీ స్టేట్ సిలబస్‌లో స్థానిక భాషను నిర్బంధం చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం తెలుగుకి బదులు స్పెషల్ ఇంగ్లీషు తీసుకునే అవకాశం వుంది. అందువలన తెలుగు మొత్తం వదిలేస్తున్నారు. పుట్టినప్పటి నుండి చచ్చేదాకా పుట్టిన వూరు వదలని వాడు కూడా తెలుగు చదవడం, రాయడం నేర్చుకునే అవసరం, అవకాశం లేకుండా మన విద్యావిధానం ఏర్పరచారు మహానుభావులు. తెలుగు చదివి తీరాలని గతంలో కూడా జీవోలు వెలువడినా అమలు కాలేదు. ఇన్నాళ్లకు కిరణ్‌గారికి ఏం బుద్ధి పుట్టిందో ఏమో దాన్ని తలకెత్తుకున్నారు. ఇది అమలవుతుందో లేదో ఎవరైనా కోర్టుకి వెళ్లి స్టే తెస్తారో తెలియదు అనుకుంటూండగా ఆ పని తనే చేస్తానని బయలుదేరారు ఐలయ్యగారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తారట.

అసలు యీయన తెలుగు మీద ఎందుకు పగబట్టారో నాకు తెలియదు. ఈయన పేరు నేను మొదటిసారిగా విన్నది ఎపి టైమ్స్ అనే ఆంగ్ల దినపత్రికలో వ్యాసకర్తగా. హైదరాబాదునుండి వెలువడిన ఆ పత్రిక ఏడాదిపాటు నడిచింది. దానిలో యీయన పెద్దపెద్ద వ్యాసాలు రాసేవారు. దాన్నిండా తెలుగు వాక్యాలు రోమన్ లిపిలో రాయడం, వాటికి మళ్లీ ఇంగ్లీషు అర్థం రాయడం. పరమ విసుగు పుట్టేది. రెండు మూడు పేరాలు చదివి మానేసేవాణ్ని. ఆ విధంగా నాకు, ఆ మేరకు తెలుగు, ఇంగ్లీషు రాకుండా చేశాడీయన. యూనివర్శిటీలో బోధకుడిగా యిలా ఎంతమందిని ప్రభావితం చేశారో తెలియదనుకోండి. ఇప్పుడు ఆంగ్లంలో బోధన అందించాలన్న డిమాండ్‌తో గ్రామగ్రామాన పర్యటిస్తామని ప్రకటించారు. ఆ డిమాండ్‌తో పర్యటించడం ఎందుకు వృథాప్రయాస? తెలుగువాళ్లందరూ

చేస్తున్నదే ఆంగ్లవిద్యాభ్యాసం. కనుమరుగవుతున్న భాషగా యునెస్కో హెచ్చరించింది తెలుగు గురించి, ఆంగ్లం గురించి కాదు! మనకున్న ఆంగ్లభాషా వ్యామోహంతో మనం బావుకున్నది ఏమీ లేదని నేనంటే వినడానికి బాధగా వుంటుందేమో కానీ వాస్తవం అదే!

కాన్వెంటు స్కూళ్లు చిన్నపాటి పట్టణాలలో (లక్ష లోపు జనాభా) ప్రారంభించి 50 ఏళ్లు అవుతోంది. అప్పట్లో ప్రభుత్వ స్కూళ్లలో 1 నుండి 5 వ తరగతి వరకు మొత్తమంతా తెలుగులోనే. 6 వ తరగతి నుండే ఇంగ్లీషు, హిందీ నేర్పేవారు. కాన్వెంట్లు వచ్చాక 1 వ క్లాసునుండే ఎ,బి,సి,డి.. నేర్పారు. అంటే ఒక తరం తరం ఇంగ్లీషు చదువుతో పెరిగిందని అనాలి. మరి దాని వలన మన రాష్ట్రంలో ఇంగ్లీషు ప్రావీణ్యత ఏమైనా పెరిగిందా? ఎలా కొలుస్తాం? 50 ఏళ్ల క్రితం తెలుగువాళ్లు ఫిక్షన్ గానీ, నాన్-ఫిక్షన్ గానీ ఎన్ని యింగ్లీషు పుస్తకాలు రాశారు? ఇప్పుడెన్ని రాశారు? నాన్-ఫిక్షన్ గురించి ఎకడమిషియన్స్ ఎవరైనా చెప్పాలి.

ఫిక్షన్ రాసే తెలుగువాళ్ల గురించి మాత్రం చెప్పడానికి ఏమీ లేదు. ప్రస్తుతం జీవించివున్నవారిలో డైరక్టుగా ఇంగ్లీషులో కథలు రాసేవాళ్ల సంఖ్య ఒక చేతి మీద లెక్కించవచ్చు. వారిలో భవదీయుడూ వున్నాడని సవినయంగా, సగర్వంగా, స-సిగ్గుగా చెప్పుకుంటున్నాను. ఇంగ్లీషు జర్నలిజంలో వున్న తెలుగువాళ్లని చూడబోతే అప్పుడెంతమంది వున్నారో, యిప్పుడూ అంతేమంది వున్నట్టు తోస్తుంది. మహా అయితే ఏ పదిశాతమో పెరిగారేమో! తెలుగు కథలను ఇంగ్లీషులోకి తర్జుమా చేయగల సమర్థులైన అనువాదకులు కావాలి అని యిప్పటికీ అంటూనే వున్నారు. అంటే మనం ఇంగ్లీషులో ఎదగలేదని తేలిపోయినట్లే. ఇంగ్లీషు నేర్పుతున్నాం అంటున్నారు కానీ వ్యాకరణాన్ని పట్టించుకోవడం మానేశారు. చాలామంది తప్పులు రాస్తున్నారు. తప్పులు రాస్తున్నట్లు వాళ్లకే తెలిసిపోతోంది. మెయిల్స్ రాస్తూ – 'నాకు తెలుగులో రాయడం రాదు, నా ఇంగ్లీషు అంత బాగా వుండదు..' అని చెప్పుకుంటున్నారు. ఎందుకు బాగుండకపోవాలి? తెలుగూ రాక, ఇంగ్లీషూ రాక ఏం చేస్తున్నట్లు?

జరిగినదేమిటంటే – లాంగ్వేజెస్‌కు ప్రాధాన్యత తగ్గించేశారు. నేను బియస్సీ చదివినపుడు ఇంగ్లీషు ఫస్ట్ లాంగ్వేజ్, హిందీ సెకండ్ లాంగ్వేజ్. రెండేళ్లవరకు ఇంగ్లీషు, హిందీ నేర్పేవారు. మూడో ఏడాది కేవలం గ్రూప్. ఇంగ్లీషులో – షేక్స్పియర్ కామెడీ, ట్రాజెడీ, బెర్నార్డ్ షా డ్రామా, మిల్టన్ పొయెట్రీ, మోడర్న్ పొయెట్రీ సంకలనం, మోడర్న్ ప్రోజ్ సంకలనం, యివి కాక నాన్-డిటెయిల్డ్ కింద అతి కష్టమైన కార్లయిల్ రచన, మోడర్న్ నవల, మోడర్న్ వ్యాసాల సంకలనం. హిందీలో కూడా ఓల్డ్ పొయెట్రీ, న్యూ పొయెట్రీ, న్యూ ప్రోజ్, హిస్టారికల్ డ్రామా, మోడర్న్ నావల్, మోడర్న్ ప్రోజ్.. యిన్ని వుండేవి. రానురాను యివి తగ్గించేశారు. సైన్స్ స్టూడెంట్స్‌కే కాదు, హ్యుమానిటీస్ చదివేవాళ్లకు కూడా యింత సాహిత్యం అక్కరలేదన్నారు. గ్రూపు, గ్రూపు, గ్రూపు...! గ్రూపు చదివి, ఆ చదువువలన ఉద్యోగం తెచ్చుకుని దేహావసరాలు తీర్చుకున్నాక నేటి యువత (40, 45 ఏళ్ల వయస్కుల దాకా యీ గ్రూపులోకి వస్తారు) మానసిక అవసరాల కోసం సాహిత్యాన్ని ఆశ్రయించబోతే అక్కడ శూన్యం కనబడుతోంది. మంచి సాహిత్యం ఏదో తెలియదు – ఏ భాషలోనూ! ఎలాగోలా సంపాదించినా దాన్ని ఆస్వాదించడం తెలియదు. మనసుకు ఊరట లేనపుడు అది అశాంతికి లోనవుతుంది. వ్యక్తిగత అశాంతి సామాజిక అశాంతిగా రూపాంతరం చెందుతుంది.

కనీసం తెలుగు ఒక్కదానిపై శ్రద్ధ పెట్టినా మాతృభాష కాబట్టి అంది వంటబట్టేది. ఒక భాషలో పట్టు సంపాదించాక యితర భాషలు తెలుసుకోవడం అంత కష్టం కాదు. మాతృభాషలో చదివితే దాని ప్రభావం ఇంగ్లీషు ఉచ్చారణపై పడుతుందన్నది వాస్తవం. దాన్ని పరిహరించడానికి అవసరమైన సందర్భాల్లో రెండు, మూడు నెలలు ఏదైనా ట్రెయినింగ్ తీసుకోవాలి. ఆ అవసరం పడేది జనాభాలో ఏ పదిశాతం మందికో! దాని గురించి అందరూ మాతృభాషను వదులుకుని చెడిపోతున్నాం. కాలేజీలో చదివే రోజుల్లోనే మా హిందీ లెక్చరర్ ఓ సారి పాఠం చెపుతూ 'షడ్యంతర్' అనే మాట ఉపయోగించారు. అర్థం ఏమిటి అని అడిగాం. 'కాన్స్పిరసీ' అని ఇంగ్లీషులో చెప్పారు. అదీ అర్థం కాలేదు. అప్పుడు ఆయన నిట్టూర్చి – "హిందీ రాదు, ఇంగ్లీషు నేర్చుకుందామనుకుంటూ తెలుగు మర్చిపోతున్నారు" అన్నారు. ఏతావతా మనకు ఏ భాషా రావటం లేదని మాకు అర్థమైంది.

మేమేదో గవర్నమెంటు స్కూళ్లల్లో, కాలేజీల్లో చదివినవాళ్లం. తర్వాతి వాళ్లందరూ బోల్డు ఖర్చు పెట్టి ప్రయివేటు స్కూళ్లలో, కార్పోరేటు కాలేజీల్లో చదివినవాళ్లు. మరి వాళ్ల పరిస్థితీ యిలా ఏడుస్తోందేనని నా బాధ. టీవీ ఇంటర్వ్యూలో చూడండి – తెలుగులో మొదలుపెడతారు, సరైన మాట దొరకదు, ఇంగ్లీషులోకి వెళతారు, ఆ ఇంగ్లీషుకూడా తెలుగుయాసలో 'యూ ఆర్ నాట్ కమింగా? ఐ డోంట్ లైకండీ...' టైపులో మాట్లాడి, యింకో రెండు మాటల తర్వాత సరైన యింగ్లీషు పదం గుర్తుకు రాక తెలుగులోకి దిగుతారు.. 'వాట్ ఐ మీన్.. 'నవ్వలేక చచ్చానన్నమాట..' అంటూ!

ఇంగ్లీషే యింత అధ్వాన్నంగా వుంటే హిందీ సంగతి చెప్పనే అక్కరలేదు. పదేళ్లపాటు స్కూల్లో హిందీ చదివినవారు సైతం ఒక్క పేజీ తప్పుల్లేకుండా హిందీ రాయగలనని ఛాలెంజ్ చేసే తెలుగువాణ్ని నేను చూళ్లేదు. కచ్చాపచ్చా హిందీ మాట్లాడడం తప్ప చాలామాటలకు హిందీ పదాలు స్ఫురించక అభినయపూర్వకంగా (గిల్లాడు, దురద వేసింది, మీసం మెలేశాడు) ప్రదర్శిస్తారు. స్కూల్లోంచి బయటకు వచ్చాక ఒక హిందీ పేపరుగాని, మ్యాగజైన్ కానీ, నవల కానీ చదవగా చూళ్లేదు. కొందరు మార్కుల కోసం ఇంటర్‌లో సంస్కృతం తీసుకుంటారు. ఇంటర్ అయిపోయాక రామ శబ్దం అప్పజెప్పమంటే చెప్పలేరు. సంస్కృతంలో రెండు వాక్యాలు సరిగ్గా రాయలేరు. ఒక్క శ్లోకం అర్థం చెప్పలేరు. ఈ భాషల గురించి తెలుగు అడ్వాంటేజి వదులుకోవటం దేనికి? మీరు సర్వే చేసి చూడండి. ఈనాడు భారతదేశానికి వన్నె తెచ్చిన టెక్నోక్రాట్స్‌లో 50 ఏళ్లకు పై బడిన వాళ్లందరూ మాతృభాషలో చదివినవారే. జ్ఞానార్జనకు గాని, విదేశీయులతో వ్యాపారవ్యవహారాలకు గాని అది అడ్డు రాలేదు. వారి ఇంగ్లీషు ఉచ్చారణ అంత

బాగుండకపోవచ్చు. ఆ మాటకొస్తే వారితో వ్యాపారం చేసే ఫ్రెంచ్, ఇటాలియన్, జర్మన్, చైనీస్, జపనీస్, రష్యన్ దేశస్తుల ఇంగ్లీషు ఉచ్చారణ అంతకంటె మెరుగ్గా వుండదు.

ఇవన్నీ తెలుగు తలిదండ్రులకు అర్థం కాదు. తెల్లకార్డుదారులు కూడా అప్పులు చేసి పిల్లల్ని ఇంగ్లీషు మీడియంకు పంపిస్తున్నారు. ఏదో కిరణ్‌గారు ఏ కళనున్నాడో, తెలుగు ప్రావీణ్యతలో అందరూ తనలా తయారవకూడదని కంకణం కట్టుకున్నారో ఏమో, యిన్నాళ్లకు ఓ జీవో తెస్తే దాన్ని యీ ఐలయ్యగారు అడ్డుకుంటాడట. తన ఉద్యమానికి మజ్లిస్ వారి మద్దతు కూడగడదామని కాబోలు తెలుగు నేర్పడానికీ అక్బర్, అసద్‌ల అరెస్టుకీ లింకు పెట్టాడు. ఈ దేశంలో దళితులు, మైనారిటీలు తెగ అవస్థపడిపోతున్నారని యీయన ఇంగ్లీషులో వ్యాసాలు రాస్తూ వుంటాడు.

ఇలా కేసు బిల్డప్ చేస్తూ పోతే ఓ పదేళ్లు పోయిన తర్వాత అగ్రదేశమేదో ఒకటి ఇంటర్నేషనల్ పోలీసు వేషం వేసుకుని వచ్చి 'ఇండియాలో హిందువుల బారి నుండి మైనారిటీలను రక్షించవలసిన అవసరం వుంది, దానికి ప్రొ. ఐలయ్యగారి వ్యాసావళే సాక్ష్యం' అని మిష పెట్టుకుని తమ సైన్యాలను యిక్కడ తిష్ట వేయిస్తారు. ఆఫ్రో-ఏసియన్ దేశాల్లో జరుగుతున్నదదే! ఓట్లబ్యాంక్ రాజకీయాలకోసం మైనారిటీ నాయకులను ఊరికే నెత్తి కెక్కించుకుంటున్నారని (దానివలన మైనారిటీలు బాగుపడ్డదీ లేదు) మీరూ నేనూ అనుకుంటున్నాం కానీ మైనారిటీలు కష్టపడుతున్నారని చూపించాల్సిన డ్యూటీ ఐలయ్యగారిది. ఏ చిన్న పాయింటు దొరికినా ఆయన వదిలిపెట్టరు. అందుకే తెలుగు భాష అమలు కూడా మైనారిటీలను కష్టపెట్టడానికి, అరెస్టు చేయడానికీ ఉద్దేశించినదే అనే థీమ్ ఎత్తుకున్నారు. కానీయండి, మన ప్రజాస్వామిక దేశంలో ఏదైనా చెల్లుబాటు అయిపోతుంది. కొంతమంది టీవీ షోల్లోకి వచ్చి ఆయన మాట్లాడినది సబబే అని కూడా వాదించేస్తారు! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 08, 09 వీక్లీకై** **ఎమ్బీయస్ : సహకారం – హాహాకారం**

సహకార సమితుల ఎన్నికల ఫలితాలు పూర్తిగా వచ్చేశాయి. తొలివిడతలో కనబరచిన వూపు కాంగ్రెస్ మలివిడతలో కూడా చూపింది. మొత్తం మీద దాదాపు 3000 వుంటే 42% స్థానాలు కాంగ్రెస్‌కి, 25% టిడిపికి, 15% వైకాపాకి వచ్చాయి. కాంగ్రెస్ మోసం చేసి గెలిచిందని ప్రతిపక్షాలు హాహాకారాలు చేశాయి. చేస్తూనే సాటి అపోజిషన్ ఓడిపోయిన చోట ప్రజలు వారికి బాగా బుద్ధి చెప్పారని చంకలు గుద్దుకుంటున్నారు. తాము ఓడిపోయిన చోట డబ్బు గెలిచిందంటారు, సాటి ప్రతిపక్షం ఓడిన చోట ప్రజలు గెలిచారంటారు. నిలకడ లేని మాటలివి. వీళ్లిలా వుండగా విశ్లేషకులు మరోదానికి నోరు చప్పరిస్తున్నారు. 'ఓస్ యివో ఎన్నికలా? దీనిలో పెద్దగా ఓటర్లే వుండరు. సమాజంలో అనేక వర్గాలు యీ ఎన్నికలలో పాల్గొనవు. కాంగ్రెస్ అధికారంలో వుంది కాబట్టి ఎక్కువ సీట్లు గెలిచింది. అయినా సహకార ఎన్నికల్లో అధికార పార్టీ ఎప్పుడూ గెలుస్తూనే వుంటుంది. ఇదో పెద్ద విశేషం కాదు. ఇవి ఎసెంబ్లీ ఎన్నికలకు సూచికలూ కావు. గతంలో సహకార ఎన్నికలలో గెలిచినా సాధారణ ఎన్నికల్లో ఓడిపోయిన దృష్టాంతాలెన్నో వున్నాయి' అంటూన్నారు.

ఒకవేళ కాంగ్రెస్‌కి తక్కువ సీట్లు వచ్చాయనుకోండి అప్పుడెలా మాట్లాడేవారో వూహించండి. 'ప్రభుత్వపు అసమర్థపాలనపై ప్రజాగ్రహానికి యివి అద్దం పడుతున్నాయి. ఇప్పటిదాకా అధికార పార్టీ సహకార ఎన్నికల్లో గెలుస్తూ వచ్చింది. ఇవే గెలవలేనివాళ్లు అసెంబ్లీ ఎన్నికలు ఎలా గెలవగలరు? ఈ ఫలితాలు చూసి నివ్వెరపోయిన అధిష్టానం ముఖ్యమంత్రిని, పిసిసి చీఫ్‌ను మందలించింది. వీలైతే ఇద్దర్నీ, కనీసం ఒక్కర్ని మార్చిపారేస్తుంది. సమాజంలో రైతులు ఒక ముఖ్యమైన వర్గం. అందునా మన రాష్ట్రానికి గ్రామసీమలు, అన్నదాతలు వెన్నెముకలు. రైతు ఒక వ్యక్తి కాదు, అతని వెనుక కుటుంబం వుంటుంది. మనలో చాలామంది వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలనుండి వచ్చినవారమే. సమాజానికి రైతు మార్గదర్శనం చేయగలడు. పాలకపక్షంపై అతను కన్నెఱ్ఱ చేశాడంటే దాని అర్థం ప్రభుత్వం కూలిపోతుందనే..' ఇలా సాగేది.

తొలివిడత ఎన్నికల ఫలితాలప్పుడు ప్రతిపక్షాలు సీరియస్‌గా పట్టించుకోలేదు కాబట్టి అలా వచ్చాయన్నారు. మరి మలివిడతకు మేల్కొని వుంటారుగా. అప్పటి ఫలితాలూ తొలిదశ ఫలితాలలాగే వచ్చాయే! డబ్బు ప్రవహింప చేశారు కాబట్టి గెలిచారన్నారు. ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకు ఎన్నికల్లో డబ్బులు పారడం పాయింటు కాదు. ఎంత అన్నదే క్వశ్చన్. ఓట్లు కొనడానికి ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు కాబట్టే ధర పెరుగుతోంది. ఒక్కరే యివ్వవలసి వస్తే ఓటుకి వేలాది రూపాయలు ఎవరిస్తారు? అధికారపక్షం, ప్రతిపక్షాలు పోటీ పడ్డాయి కాబట్టే ఓటుకి అంత ధర పలికింది. డబ్బు యిచ్చినా ఫలితాలు అన్ని చోట్లా ఒకలా లేవని గుర్తించాలి. పార్టీ బలం కూడా ముఖ్యమైన ఫ్యాక్టరే.

ఓటింగు సరళి ఒక్కసారి గమనిస్తే ఏ పార్టీకి ఎక్కడ ఏ జిల్లాలో ఎక్కువ బలం వుందో అక్కడే ఎక్కువ గెలిచారని అర్థమౌతోంది. కడపలో వైకాపాకు 34, కాంగ్రెస్‌కు 15, టిడిపికి 4 రావడంలో ఆశ్చర్యం ఏముంది? వైకాపాకు కోస్తాలో వచ్చిన (16%) దాని కంటె రాయలసీమలో రెట్టింపు (32%) రావడంలో వింతేముంది? కృష్ణా, గుంటూరు, ఖమ్మంలలో టిడిపి కి అందరి కంటె ఎక్కువగా 39%, 41%, 42% సీట్లు రావడంలో ఆశ్చర్యం వుందా? రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్‌కు 54%, టిడిపికి 27%, తెరాసకు 8% రావడం సహజమే కదా! కరీంనగర్‌లో తెరాస 31% తెచ్చుకోవడమూ సహజమే. అలాగే వామపక్షాలకు ఖమ్మంలో 15 సీట్లు

రావడమూ, తక్కిన చోట పెద్దగా రాకపోవడమూ మామూలే.

అయితే యీ ఫలితాలు కొందరికి జీర్ణం కాకపోవడానికి కారణం ఏమిటంటే – మీడియా ప్రొజక్షన్స్‌కి, యీ ఫలితాలకు పొంతన కుదరలేదు. వైకాపా పార్టీ ఏర్పడ్డాక కోస్తా, సీమ ప్రాంతాల్లో వైకాపా, డిసెంబరు 9 ప్రకటన తర్వాత తెలంగాణలో తెరాస స్వీప్ చేస్తాయని బిల్డప్ చేస్తూ వచ్చింది మీడియా. వైకాపా తెలంగాణలో చొచ్చుకుపోతోంది కూడా అంటోంది. అది కాదు సుమా, గతంలో వున్న పరిస్థితికి యిప్పటి పరిస్థితికి పెద్దగా తేడా రాలేదు అని యీ ఫలితాలు చెపుతున్నాయి. వీటి ప్రకారం టిడిపికి కోస్తాలో 31%, సీమలో 13%, తెలంగాణలో 19% బలం వుంది. వైకాపాకు – సీమలో 32%, కోస్తాలో 16%, తెలంగాణలో 5%! కాంగ్రెస్‌కు – కోస్తాలో 41%, సీమలో 37%, తెలంగాణలో 47% వుంది. తెరాసకు తెలంగాణలో 13% బలం వుంది.

తెరాసకు అంత తక్కువ ఎలా వుంటుంది? అనుకునేవారు తెరాసకు పట్టణప్రాంతాల్లో వున్నంత బలం గ్రామాల్లో లేదని గుర్తించాలి. పైగా పార్టీ నిర్మాణవ్యవస్థ కూడా బలంగా లేదని గుర్తు పెట్టుకోవాలి. తెరాస నాయకులు విమర్శలు గుప్పించడంలో అగ్రగణ్యులు, సందేహం లేదు. కానీ నియోజకవర్గంలో కార్యదక్షులా, కాదా – అది తెలియదు. ప్రతీదానికీ యితర ప్రాంతీయులను దుమ్మెత్తిపోయడమే మనకు కనబడుతోంది. రాష్ట్రం విడిపోయే లోపునైనా కాంగ్రెస్‌ను బెదిరించో, బెల్లించో తమ ప్రాంతానికి నిధులు తెచ్చుకుని అభివృద్ధి పరుస్తున్నారా లేదా అన్నది నాకు డౌటు. గతంలో రాజీనామా చేసి ఉపయెన్నికలలో నిలబడినపుడు 2009 ఎన్నికలలో గెలిచినప్పటి కంటె ఎక్కువ ఓట్లు వచ్చాయి. కానీ దానికి కారణం – ఆశయం కోసం పదవీత్యాగం చేశారన్న సింపతీ, సెంటిమెంటు. అది కొంతకాలమే వుంటుంది. దాన్ని బట్టి లెక్కలు వేసుకుంటే దెబ్బ తింటాం. పైగా ఉద్యమం కూడా చాలాకాలం కొనసాగుతోంది కాబట్టి నాయకుల్లో, ప్రజల్లో ఒక రకమైన ఫాటిగ్ (అలసట) వచ్చేసి వుంటుంది. అవే మాటలు వినివిని విసుగెత్తి వుండవచ్చు. కొత్తలో వున్న వూపు క్రమేపీ తగ్గిపోయి, యథాతథ స్థితికి అలవాటు పడిపోవడం జరుగుతుంది. డిసెంబరు 9 కి ముందు తెరాస ఒక్కటే తెలంగాణ అనేది. ఆ తర్వాత దాదాపు అందరూ అదే పాట పాడి దాన్ని పలచన చేసేశారు. తెరాసకున్న ఎక్స్‌క్లూజివ్ ఎడ్వాంటేజి పోయి, తక్కిన అంశాలు పరిగణనలోకి వచ్చాయి. అందుకే మెహబూబ్‌నగర్, పరకాలలో తెరాసకు ఆశించిన ఫలితాలు రాలేదు. ఈ పోకడ గమనించకుండా తెరాస తెలంగాణ స్వీప్ చేస్తుందని అనుకోవడం, చేయలేదని ఆశ్చర్యపడడం అనవసరం.

అలాగే వైకాపా – ఆ పార్టీ విషయంలో కూడా యివన్నీ వర్తిస్తాయి. జగన్ మొదటిసారి జైలుకి వెళ్లినపుడు అయ్యయ్యో అనుకున్నారు. తర్వాత ఆ స్థితికి మానసికంగా అలవాటు పడి షాక్ తినడం మానేశారు. అక్బరుద్దీన్‌ను అరెస్టు చేసిన రోజు కలకలం. తర్వాత మజ్లిస్‌వాళ్లు కూడా అలవాటు పడ్డారు. ఇప్పుడు ఎక్కడున్నాడు? అని అడిగితే చటుక్కున ఎవరూ చెప్పలేరు. పార్టీ యిన్‌ఫ్రాస్ట్రక్చర్ యింకా ఏర్పడలేదు. వైయస్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాబట్టి అప్పటికే అందుబాటులో వున్న నిర్మాణాన్ని వాడుకోగలిగారు. కానీ జగన్ పుల్లా పుడకా తెచ్చి తన గూడు తను కట్టుకోవాలి. డబ్బుంది కదా, అదే వస్తారు అనుకోవడం సరికాదు. పార్టీ నిర్మాణం బృహత్కార్యం. ప్రతీ మండలంలోను విధేయులైన వారెవరో, సమర్థులైన వారెవరో చూసుకుని వారికి బాధ్యతలు అప్పగిస్తూ వెళ్లాలి. ప్రతీ వూరిలోను కనీసం పదిమంది పేర్లు గుర్తుండి పలకరించేట్లా వుండాలి. వైయస్ వున్నంతకాలం జగన్‌కు ఆ అవసరం పడలేదు. మహా అయితే కడప జిల్లా వరకు అలాటి పరిచయాలున్నాయేమో. ఇక తక్కిన జిల్లాలలో పార్టీని అట్టడుగు స్థాయినుండి నిర్మించాలంటే వెళ్లి తిరగాలి, మాట్లాడాలి. ఓదార్పుయాత్ర పేర జగన్ అదే చేశారు. చేస్తూండగానే తీసుకెళ్లి లోపల కూర్చోబెట్టేశారు.

జగన్ లేకపోతేనేం, తక్కిన నాయకులు వున్నారు కదా, వాళ్లు కష్టపడి పనిచేసి ఫలితాలు తేవచ్చు కదా అనుకుంటారు కొందరు. అది జరగదు. మానవస్వభావం ఏమిటంటే మనం చేసేది చిన్నపనే అయినా, అధినాయకుడి కళ్లల్లో పడాలని చూస్తాం. ఆఫీసులో చూడండి, టాప్ బాస్ యింటికి వెళ్లేదాకా ఎవరూ డెస్క్ వదిలి వెళ్లరు. బాస్ బయటకు వచ్చి చూసే టైముకి మనం అక్కడ కనబడకపోతే రోజంతా పని చేయలేదనుకుంటాడేమోనని భయపడతాం. ఆ రోజు క్లియర్ చేసిన ఫైళ్ల సంఖ్య బట్టి మన ఔట్‌పుట్‌ను ఆయన అంచనా వేయగలుగుతాడన్న నమ్మకం మనకుండదు. 'అదంతా చూసేటంత తీరిక వుండదు. మన యిమ్మీడియట్ బాస్‌ను మన గురించి అడుగుతాడు. ఈయన 'ఏమీ పని చేయడండీ, అతని పనీ నా పనీ నేనే చేస్తున్నాను' అని చెప్పి క్రెడిట్ కొట్టేస్తాడు' – అని మనకు అనుమానం. ఓ రకమైన నమ్మకం. అందువలన డెస్క్ నిండా ఫైళ్లు పడేసుకుని, చెమట్లు పట్టించుకుని టాప్ బాస్ కంట కనబడాలని ప్రయత్నిస్తాం. ఇదే ధోరణి ఎక్కడైనా కనబడుతుంది.

'ఫలానా నియోజకవర్గంలో గెలుపుకోసం ఎక్స్ చాలా కష్టపడ్డాడు' అని ఒకడు అధినాయకుడి దగ్గర చెప్తూ వుంటే, 'వాడి మొహం, కితం సారీ గెలిచాం, వీడు పొడిచేసిందేమీ లేదు' అని యింకోడు తీసి పారేయవచ్చు. 'కితంసారి గెలిచినంత మాత్రాన యీసారి గెలవాలని లేదు. అప్పుడు మన పార్టీలో వున్న ప్రముఖ నాయకుడు యిప్పుడు అలిగి అటువైపు వెళ్లిపోయాడు. అతని ప్రభావాన్ని నిలవరించడానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది' అనే వాస్తవాన్ని అధినాయకుడు గుర్తించాలంటే అక్కడ వుండాలి, లేదా అతనికి సరైన సమాచారం అందించేవాళ్లుండాలి, అధ్యయనం చేయడానికి అతనికి తీరికుండాలి. వైకాపా విషయంలో జగన్ జైల్లో వుండడం వలన వైకాపా గ్రామస్థాయి నాయకులకు అంత వుత్సాహం వుండదు. ఎంత చేసినా తమకు గుర్తింపు రాదన్న భయం చేత వాళ్లు యీసారికి కాంగ్రెస్‌ను గెలిపిద్దాం. జగన్ బయటకు వచ్చాక ఆయన కళ్లెదర మన శక్తిసామర్థ్యాలు ప్రదర్శిద్దాం అనుకుని వుండవచ్చు. ఈ అంశాలు లెక్కలోకి తీసుకోకుండా వైకాపా యితర పార్టీలను తుడిచి పెట్టేస్తుందని అనుకోవడమూ పొరబాటే.

కాంగ్రెస్ 13 డిసిసిబిలలో యిప్పటికే పాగా వేసిసింది. తిమ్మిని బెమ్మిని చేసి మరో అయిదారు బుట్టలో వేసుకోవచ్చు. స్థానిక

ఎన్నికలకు యీ ఉత్సాహం ఎంతో వుపయోగపడుతుంది. చెప్పవచ్చేదేమిటంటే కాంగ్రెస్, టిడిపిలకు నిరుత్సాహమూ అక్కరలేదు, వైకాపా, తెరాసలకు అత్యుత్సాహమూ అక్కరలేదు. క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించకుండా రాబోయే స్థానిక ఎన్నికలకు, ఆ తర్వాతి ఎసెంబ్లీ ఎన్నికలకు వెళితేనే అని పార్టీలకు మంచిది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 10 వీక్లీకై** **ఎమ్బీయస్ : తలల కన్నా తుపాకీలెక్కువ!**

అమెరికాలో మారణాయుధాల సంస్కృతి ఎక్కువై పోతోందని ఒబామా నిజంగానే ఫీలవుతున్నట్టుంది. దానికి సంబంధించిన ప్రక్రియ సీరియస్‌గానే ప్రారంభించాడు. మారణాయుధాల చలామణీని నియంత్రించడానికి ప్రజాభిప్రాయాన్ని కూడగడుతున్నాడు. ఇది రాష్ట్రాలకు సంబంధించిన అంశం కాబట్టి వారందరినీ విడివిడిగా ఒప్పించడానికి పర్యటనలు చేద్దామని అనుకుని తొలి మెట్టుగా ఫిబ్రవరి4 న మిన్నెసోటాకు వెళ్లాడు. ఫిబ్రవరి6 న అమెరికన్ సెనేట్‌లో ఇద్దరు రిపబ్లికన్లు, యిద్దరు డెమోక్రాట్‌లు నేరస్తులకు మారణాయుధాల సరఫరా గురించిన బిల్లును ప్రవేశపెట్టడానికి తొలి అడుగులు వేశారు. ఇదే వూపు కొనసాగితే అమెరికాలో కొద్దికాలానికైనా తుపాకీ అమ్మకాలు కాస్త తగ్గుతాయని ఆశ.

ప్రస్తుతానికి అమెరికాలో 30 కోట్ల జనాభా వుంటే వారి వద్ద చట్టప్రకారం వున్న తుపాకుల సంఖ్య 31 కోట్లు! సరాసరి చూస్తే మనిషికి ఒక తుపాకీ కన్న ఎక్కువ వుందన్నమాట. దీని అర్థం ప్రతీ మనిషీ తుపాకీ ధరించి వున్నాడని కాదు. 1980లో దేశంలో 29% మంది వద్ద తుపాకులున్నాయి. 2010 నాటికి 21% మంది వద్దే వున్నాయి. అంటే ఒకే మనిషి వద్ద చాలా తుపాకులుంటున్నా యన్నమాట! ఇన్నాళ్లూ యిలా నడిచిపోతుండగా యిప్పుడు హఠాత్తుగా తుపాకులను నియంత్రించాలన్న కోరిక ఎందుకు పుట్టింది?

అనేక సంవత్సరాలుగా మన దేశంలో బలాత్కారాలు జరుగుతున్నా ఢిల్లీలో నిర్భయపై జరిగిన దాడి మనల్ని మేల్కొల్పింది. బలమైన ఆర్డినెన్స్ వెలువడేట్లా చేసింది. అలాగే అమెరికన్ల అంతరాత్మను మేల్కొల్పిన సంఘటన ఏడువారాల క్రితం డిసెంబరు 14న కొనెక్టికట్ రాష్ట్రంలోని న్యూటౌన్ నగరంలో జరిగింది. ఆ పట్టణవాసుల స్థితిగతులు రాష్ట్రవాసులతో పోలిస్తే మెరుగ్గా వుంటాయి. నేరచరిత్ర కూడా తక్కువే. జనాభాలో 0.02% మంది మాత్రం నేరంచేత ప్రభావితులయ్యారంటే చూడండి, అక్కడ ఎంత శాంతియుత వాతావరణం వుందో! ఆ వూళ్లో 1711లో నెలకొల్పిన సాండీ హుక్ ఎలిమెంటరీ స్కూలులో ఆ రోజు ఘోరం జరిగింది. ఏడం లాంజా అనే 20 ఏళ్ల యువకుడు యింట్లో వాళ్ల అమ్మను కాల్చి చంపేసి, కారెక్కి, స్కూలుకి వచ్చి తలుపు బద్దలు కొట్టి బడిపిల్లలను చంపేశాడు. అతన్ని అడ్డుకుని పిల్లలను కాపాడబోయిన టీచర్లను కూడా కాల్చి చంపాడు. చివర్లో తుపాకీ తన తలకే గురి పెట్టుకుని కాల్చుకుని చచ్చిపోయాడు. మొత్తం మీద 20 మంది పిల్లలు, 7 గురు పెద్దల్ని చంపాడు. అతన్ని యింతటి ఘాతుకానికి ప్రేరేపించిన మానసికస్థితి ఏమిటో అతనికీ, అతని తల్లికీ తెలియాలి. ఇద్దరూ లేరిప్పుడు.

సంఘటన జరగగానే దేశం యావత్తు బిత్తరపోయింది. అమెరికాలో స్కూలుకి తుపాకీ తీసుకెళ్లి టీచర్లను కాల్చేయడం, ఉద్యోగం పోయిందని ఆఫీసులో కొందర్ని కాల్చేయడం, ప్రేయసి ధోకా చేసిందని సినిమా థియేటర్ కెళ్లి ప్రేక్షకులను కాల్చేయడం – యిలాటివి కొత్త కాదు కానీ యింతమంది బడిపిల్లలు ఒకేసారి యిలా చావడం మాత్రం 'అపూర్వమే' ! డిసెంబరు 17 న వాషింగ్టన్‌లో దీన్ని ఖండిస్తూ పెద్ద ప్రదర్శన జరిగింది. హత్యాకాండ వార్త వినగానే చలించిన ఒబామా "గత కొద్దేళ్లగా మనం యిలాటివి చాలానే భరిస్తూ వచ్చాం. ఇక దుస్సహం అయిపోయింది." అన్నాడు. 2012లోనే యించుమించు యిలాటి ఘటనలు 7 జరిగాయి. అమెరికన్లకు తుపాకీ కలిగి వుండడమనేది ప్రజాస్వామిక హక్కు కింద తయారైంది. ఇదే ఒబామా 2008 సెప్టెంబరులో ప్రజలకు హామీ యిస్తూ "మీ తుపాకీలను మీ నుండి లాక్కోను లెండి" అన్నాడు. అందరూ హర్షధ్వానాలు పలికారు. ఇప్పుడు వీరే యీ స్కూలు ఘటన తర్వాత ఉలిక్కిపడుతున్నారు. "వేరే దేశంలో ఎవరికైనా కోపం వస్తే అతని చేతులు ప్యాంటు జేబులోని సెల్‌ఫోన్ కేసి వెళతాయి, పోలీసునో, స్నేహితుణ్నో పిలవడానికి. అమెరికాలో అయితే అతని చేతులు ప్యాంటు జేబులోని తుపాకీపై పడతాయి." అంటాడో అమెరికన్ రచయిత. ఏడం లాంజా ఉపయోగించిన మూడు తుపాకీలు వాళ్ల అమ్మవి. ఆవిడ తన యిద్దరు కొడుకులకు తన వద్ద వున్న 12 తుపాకీలు ఎలా వాడాలో నేర్పింది. ఆ కొడుకుల్లో ఒకడు గురుదక్షిణ చెల్లించాడు – ఆమె ప్రాణం తీసి!

ఈ సంఘటన జరిగిన న్యూటౌన్ ఊరిలోనే నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ వుంది. దూరదేశాల్లో డ్రోన్ (అమెరికన్ బాంబర్లు)ల వాడకం గురించి, ప్రచారం చేసే ఫోర్‌కాస్ట్ ఇంటర్నేషనల్ సంస్థ కూడా వుంది. కొనెక్టికట్ రాష్ట్రం అమెరికన్ గన్ కల్చర్‌కు పురిటిగడ్డ. 1848 – 1852 మధ్య ప్రపంచంలో కల్లా పెద్ద గన్ ఫ్యాక్టరీ అక్కడే నెలకొల్పారు. ఆ తర్వాత అనేక ప్రముఖ గన్ కంపెనీలు అక్కడే వెలిసాయి. బాంబులు తయారీ చేసి అమ్మే వాడి యింట్లోనే బాంబు పేలడంతో యిప్పుడు వాళ్లకి దాని నొప్పి తెలిసివచ్చింది. అది కూడా అందరికీ తెలిసిరాలేదు. ఈ సంఘటన జరిగిన తర్వాత జరిగిన సర్వేలో 50% మంది మాత్రమే అమెరికన్ ఆయుధ చట్టాలు సంస్కరించవలసిన అవసరం వుందన్నారు. 29% మంది మార్చనక్కర లేదన్నారు. వీళ్లే నయం, 14% మంది చట్టాన్ని సులభతరం చేసి ఇంకా ఎక్కువమందికి ఆయుధాలు చేరేట్లు చూడమన్నారు.

వీళ్ల మాట ఎలా వున్నా ఒబామా ఏదో ఒకటి చేయాలని గట్టిగా పట్టబట్టి చేపట్టవలసిన చర్యలపై 2013 జనవరి 16 న ఒక ప్రణాళిక ప్రకటించారు. వీటిలో కొన్నిటికి కాంగ్రెస్ అనుమతి కావాలి. అవి – తుపాకీ అమ్మబోయేముందు కొనేవారి గతచరిత్ర

తెలుసుకోవడం, మారణాయుధులను నిషేధించడం, ఎమ్యూనిషన్ మ్యాగజైన్లను 10 రౌండ్స్‌కు పరిమితం చేయడం, కవచాన్ని కూడా చీల్చుకుని వెళ్లగలిగే బుల్లెట్లు దగ్గరుంటే శిక్షించడం, మానసిక ఆందోళనకు గురయ్యే యువకులకు మెంటల్ హెల్త్ కవరేజి స్కీము, స్కూళ్లలో రక్షణ పెంచడం ! కాంగ్రెస్ అనుమతితో సంబంధం లేకుండా పరిపాలనా వ్యవస్థలో భాగంగా చేయవలసినవి – తుపాకీల కొనుగోలుదారుల నేపథ్యం గురించి సమాచారసేకరణను పెంచడం, ఆయుధ సంస్కృతి వ్యాప్తి ఎందుకు జరుగుతోందో తెలుసుకునే పరిశోధనలకు నిధులు కేటాయించడం, రక్షణాధికారులను నియమించుకునే పాఠశాలలకు ప్రోత్సాహకాలు యివ్వడం, ఆయుధాల దురుపయోగం కేసుల్లో చట్టాలకు ఎక్కువ అధికారులు కల్పించడం !

వచ్చిన చిక్కేమిటంటే యీ చట్టాలన్నీ రాష్ట్రప్రభుత్వ పరిధిలోకి వస్తాయి. అందుకనే ఒబామా రాష్ట్రాల పర్యటన మొదలుపెట్టారు. మిన్నెసోటాలోని మినియాపోలిస్‌కు ఫిబ్రవరి 4 న వెళ్లి అక్కడి పెద్దలతో సమావేశమై గతంలో ఆ నగరం తీసుకున్న చర్యల వలన హింస ఏ మేరకు తగ్గిందీ చర్చించారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన బిల్లు ప్రతిపాదన నేరస్తులకు, నిషిద్ధులకు ఆయుధాల అమ్మకాన్ని నిషేధించడానికి ఉద్దేశించినది. అలా అమ్మితే జరిమానాలు విధించాలని సూచిస్తోంది. దీనివలన మామూలు పౌరులు ఆయుధాలను ధరించే 'హక్కు'ను కోల్పోరని ఊరడిస్తున్నారు సెనేటర్లు. అంటే ఎవరి తుపాకులు వాళ్ల దగ్గరే వుంటాయన్నమాట. పైగా డెమోక్రాటిక్ సెనేటర్లు దీనిపై వున్నంత పట్టుదలగా రిపబ్లికన్లు లేరు. ఇవి చట్టరూపంలోకి వచ్చేసరికి ఎన్ని మార్పుచేర్పులు చోటు చేసుకుంటాయో వేచి చూడాల్సిందే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

## ఫిబ్రవరి 11 ఎమ్బీయస్ : స.హ.కమిషనర్ల నియామకం

కిరణ్ ఢిల్లీ పర్యటనలో వున్నంతకాలం మన మీడియా హోరెత్తించేసింది – తెలంగాణ గురించి ఏదో జరిగిపోతోంది అంటూ! తెలంగాణ గురించి కాకపోతే యింతమందిని కలవాల్సిన పని లేదు అని వాదించింది. తెలంగాణ గురించయితే సోనియా తప్ప యింకెవర్నీ కలవనక్కరలేదు. చెప్పవలసినది, చర్చించవలసినది అన్నీ.. అందరి దగ్గరా.. అయిపోయాయి. ఢిల్లీ నాయకుల వద్దకు మనం వెళ్లి 'తె..' అంటే చాలు, వాళ్లే అప్పచెప్పేస్తారు – మన వాదనలేమిటో! నిర్ణయం ఒక్కటే బకాయి వుంది. ఆ నిర్ణయం సోనియమ్మగారు చెంగుకి ముడి వేసి పెట్టుకున్నారు. చెంగుముడి విప్పేవరకు మనకు సస్పెన్సే. సస్పెన్స్ బయటపడేవరకు మీడియాపాటికి మీడియా వూహాగానాలు చేసేసింది. తెలంగాణకు బోడో తరహా అథారిటీ ఏర్పాటుకి కిరణ్ ఓకే అన్నారని కూడా వార్త వచ్చింది. బోడో అథారిటీతోనే తల బద్దలు కొట్టుకుంటున్నారు. వాళ్లు ఎవరి మాటా వినటం లేదు. తమకు చిత్తం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఆయుధాలను నియంత్రించడం లేదు. అందుకే అసాంలో అన్ని గొడవలు జరుగుతున్నాయి. చిన్న ఏరియాతో అక్కడ చేసిన పొరబాటు కేంద్రం యింత పెద్ద ప్రాంతంతో యిక్కడా చేస్తుందా? పైగా హైదరాబాదును దాని అజమాయిషీ కింద తెస్తే యింకేమైనా వుందా? ఇన్ని డిఫెన్సు ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఏమవుతాయి? హైదరాబాదు లేకుండా... అంటే ఉద్యమకారులు వూరుకుంటారా? ప్రత్యేక రాష్ట్రానికి బదులు అథారిటీ, పైగా హైదరాబాదు లేకుండా... అంటే ఒప్పుకునే వ్యవహారమా? చివరకు తెలంగాణ గొంగళి అక్కడే వుండిపోయింది.

అసలు కిరణ్ అంతమందిని వేర్వేరు పనుల మీద కలిసి వుండవచ్చు. మంత్రివర్గ సహచరుల మార్పు, డిసిసిబి అధ్యక్షుల కొనుగోలు వ్యవహారాలు, స్థానిక ఎన్నికలలకు తను సిద్ధంగా వున్న వైనం.. యిలా చాలా వుండవచ్చు. వాటిలో ఒకటి బయటకు వచ్చేసింది. స.హ.కమిషనర్ల నియామకం విషయంలో గవర్నరుగారి అభ్యంతరం చెల్లకుండా చేసుకున్నారు. తన మాట నెగ్గించుకున్నారు. రాజకీయ నేపథ్యం వున్నవారిని యిలా నియమించకూడదంటూ అభ్యంతరాలు వెల్లువెత్తాయి. చట్టంలోని సెక్షన్ 15 (6) ప్రకారం అభ్యర్థికి రాజకీయాలతో ప్రమేయం వుండకూడదని మేధావులు సైతం వాదిస్తున్నారు, మీడియా కూడా అదే చెప్తోంది. నిజానికి ఎంపిక తర్వాత కమిషనర్లు రాజకీయాలతో సంబంధం పెట్టుకోకూడదని చట్టం చెపుతోంది తప్ప, అసలు రాజకీయ నేపథ్యమే వుండకూడదని చెప్పటం లేదు. అది కావాలని విస్మరిస్తున్నారు వీరు.

అసలు రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రముఖులు అవుతున్నారా? 'సంఘసేవకులు' కోటా కింద రాజ్యసభ, ఎమ్మెల్సీ యిత్యాది పదవుల్లో నియమించ బడేవాళ్లందరికీ రాజకీయాలతో బంధం వుంటూ వుండడం గమనిస్తున్నాం. సమాజం గురించి ఆలోచించి, సంఘసేవకై సంస్థ పెట్టేవాడికి ఏదో ఒక రాజకీయ దృక్పథం ఏర్పడడం సహజం. ఏదో ఒక పార్టీని అభిమానించడం, ఆ పార్టీ నాయకులతో సన్నిహితంగా మెలగడం సహజంగానే జరుగుతుంది. వాళ్లు అధికారంలో వుంటే యితని సంస్థకు ఆదరం లభిస్తుంది. పేరుప్రఖ్యాతులు వస్తాయి. బిరుదులు వస్తాయి. ఆదాయం (సక్రమమైనదే అనుకుందాం) వస్తుంది. ఇదంతా రాజకీయ నేపథ్యంలోకి రాదా? ఆ పార్టీ తరఫున అభ్యర్థిగా నిలబడితేనే రాజకీయాల్లో వున్నట్టు, లేకపోతే రాజకీయాలంటే వర్ణక్రమం తెలియనట్టు అర్థమా? నేటి వ్యవస్థలో ప్రతి విషయమూ రాజకీయంతో ముడిపడి వున్నదే! కావాలనుకున్నా, వద్దన్నా ఎంతోకొంత రాజకీయ అవగాహన ప్రతి వ్యక్తికి అలవడుతుంది. అయితే దాని ప్రభావం తన వృత్తిపై, చేపట్టిన పదవిపై పడకుండా చూసుకోవాలి. అలా చూసుకోనివారిని దండించాలి.

స్పీకరు పదవి వుంది. ఏదో ఒక పార్టీ తరఫున ఎన్నికవుతారు. కానీ ఒకసారి అసెంబ్లీకో, పార్లమెంటుకో స్పీకరయ్యాక అందర్నీ సమానంగా చూస్తూ, నిష్పక్షపాతంగా వుండాలి. రాజకీయ నేపథ్యం వుంది కదా, నువ్వు స్పీకరవకూడదంటే ఎలా? రాష్ట్రపతి పదవికి

ఎవరినైనా ఎంపిక చేయవచ్చు. రాజకీయాలతో సంబంధం లేని డా౹౹ రాధాకృష్ణన్‌ని చేద్దామని నెహ్రూ అంటే 'కాదు, రాజేంద్రప్రసాద్‌ను చేద్దామ'ని ఆయన సహచరులంతా పట్టుబట్టారు. మామూలు రోజుల్లో రాష్ట్రపతితో పేచీ లేదు. కానీ పార్లమెంటులో పార్టీల బలాబలాలు అటూయిటూగా వున్నపుడు ఆయన నిర్ణయమే కీలకం. అందుకని రాజకీయాలు తెలిసిన వ్యక్తి అయితే మంచిదని వారి అభిప్రాయం. చివరకు రాజేంద్రప్రసాద్ తొలి రాష్ట్రపతి, రాధాకృష్ణన్ తొలి ఉపరాష్ట్రపతి అయ్యారు. తర్వాతి కాలంలో కొందరు రాజకీయేతర వ్యక్తులు కూడా రాష్ట్రపతులయ్యారు.

జనతా ప్రభుత్వం ఏర్పడినపుడు సంజీవరెడ్డిని రాష్ట్రపతిని చేద్దామని పార్టీ నాయకులు ప్రతిపాదించారు. ఎందుకంటే గతంలో ఇందిరా గాంధీ ఆయన్ను కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టి తర్వాత లోపాయికారీగా కుట్ర చేసి ఓడించారు. ఆ సింపతీతో సంజీవరెడ్డిని చేద్దామంటే ఆయనంటే పడని మొరార్జీ అడ్డుపడ్డారు. రుక్మిణీ అరండేల్ అని భరతనాట్యం డాన్సర్‌ను చేద్దామన్నారు. అప్పుడు చో చమత్కరించాడు – "రాష్ట్రపతిగా వున్నవారు ప్రధాని చెప్పినట్టు ఆడాలన్న మాట వాస్తవమే కానీ, అంతమాత్రం చేత డాన్సు వృత్తిలో వున్నవాళ్లనే తీసుకోనక్కరలేదు." అని! (ప్రెసిడెంట్ హేజ్ టు డాన్స్ టు ద ట్యూన్ ఆఫ్ పిఎం, బట్ హీ ఆర్ షీ నీడ్ నాట్ బి ఏ ప్రొఫెషనల్ డాన్సర్!) చివరకు మొరార్జీ మాట చెల్లలేదు. కొన్నాళ్లు పోయాక మొరార్జీ, చరణ్‌ల మధ్య ఎవరికి మెజారిటీ వుందో తేల్చవలసిన తరుణం వచ్చినపుడు పాత పగతో సంజీవరెడ్డి దగా చేశారని మొరార్జీ వాపోయారు.

స.హ.కమిషనర్ల మాట వదిలేయండి, న్యాయమూర్తుల మాట ఏమిటి? వారు న్యాయవాదులుగా వుండగా ఏదో ఒక పార్టీ అభిమానులుగా వుండడం చూస్తున్నాం. కొంతకాలం పోయాక జడ్జిలుగా ఎంపికయ్యాక పాతపార్టీ నాయకులు యిరుక్కున్న కేసుల్లో వీళ్లు వలపక్షం ప్రదర్శిస్తామని అనుకోగలమా? చలమేశ్వర్‌గారు ఎన్టీయార్‌గారు టిడిపి పార్టీ పెట్టినపుడు ఎంతో చురుకైన పాత్ర వహించారని డా౹౹ వెంకటేశ్వరరావుగారు తన పుస్తకంలో చాలా చోట్ల రాశారు. అప్పుడాయన న్యాయవాది. తర్వాత జస్టిస్ చలమేశ్వర్ అయ్యారు. ఎవరూ ఆక్షేపించలేదే! ఆయన తీర్పుల్లో టిడిపి వారి పట్ల పక్షపాతం చూపించి వారికి అనుకూలమైన తీర్పులు యిచ్చారని తేలితేనే ఆయనను అభిశంసిస్తారు తప్ప అప్పటిదాకా ఆయన ఉద్యోగానికి ముప్పేమీ లేదు. అంటే సంసారిగా వున్నంతకాలం వుండవచ్చు. సంసారం వదిలేసి, ఓ సారి సన్యాసం తీసుకున్నాక మళ్లీ సంసారలంపటంలోకి దిగకూడదు. న్యాయమూర్తులు కూడా పదవీప్రమాణం చేసేటపుడు గతజీవితపు యిష్టాయిష్టాలు తన వృత్తిపై పడకకూడదని నిశ్చయించుకుంటారు. అదే విధంగా యీ కమిషనర్లు కూడా చేస్తారని ఆశిద్దాం. వారి నియామకం గురించి యాగీ చేయడం కంటె, నియామకం తర్వాత వారు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారా అన్నది గమనిద్దాం. అప్పుడేదైనా నీతి తప్పి వ్యవహరిస్తే ఎండగడదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 12** **ఎమ్బీయస్ : కెసియార్ దృష్టిలో సమరం...**

'తెలంగాణ యిస్తే సంబరం, లేకపోతే సమరం..' అని నినదించారు కెసియార్. గత ఏడాది అక్టోబరులోనో, ఆగస్టులోనో అంతకుముందో..! 'వారం అంటే ఏడు రోజులు కాదు, నెలంటే నాలుగు వారాలు కాదు' అని ఆజాద్ చెప్తేనే మనకు తెలిసిందనుకోనక్కరలేదు. ఆ నేతినేతి (నేతి – న యితి – యిది కాదు) వాదం, కెసియార్ మనకు ఎప్పుడో కలిగించారు. 'వచ్చే నెలలో తెలంగాణ...' అంటే పై నెలలోనే అని కాదు. ఎప్పుడో ఒకప్పుడు వచ్చే నెల అని అర్థం. 2004 నుండి యిలా చెపుతూనే నెట్టుకొచ్చారు. కెసియార్ నిఘంటువులో 'సంకేతం'కు కూడా కొత్త అర్థాలున్నాయి. స్వప్నసందేశాలు కూడా ఆయన పరిభాషలో సంకేతాలే! 'తెలంగాణ వచ్చేది లేదు, చచ్చేది లేదు, తియ్' అని జనాలు అనుకునే తరుణంలో యీయన యిలాటి ఓ ప్రకటన చేసి టీవీల్లో ఓ పదిహేనురోజులు చర్చ సాగేట్లు చేసి, టీవీ రేటింగ్స్ పడిపోకుండా చూస్తారు. అందుకే మీడియాకు కెసియార్ అన్నా అంత వలపు. లగడపాటి అన్నా కూడా అంతే వలపు. సోబర్‌గా మాట్లాడే పళ్లంరాజుగారి లాటి వాళ్లకు పెద్ద కవరేజి వుండదు. 'రాష్ట్రం విడిపోవడం వాస్తు ఒప్పదు' వంటి స్టేటుమెంట్లు ఎంత వినోదాన్ని కలిగిస్తాయో, ఎన్ని కార్టూన్లకు, యానిమేషన్ షోలకు ఎరువుగా వుపయోగపడతాయో ఆలోచించండి. అలాగే 'కెసియార్ సమరం అంటే సమరమేనా? మరోటా? అది ఏ రూపంలో వుండబోతుంది?' అని ఓ సాయంత్రం ఓ గంట చర్చ లాగించేయవచ్చు కదాని టీవీ వాళ్లకు ఎంత హుషారుగా వుంటుందో చూడండి.

తెలంగాణ యిస్తే సంబరం – ఆ స్కోప్ ఎక్కడా కనబడటం లేదు. అఖిలపక్ష సమావేశం పెట్టి నెల్లాళ్లలో ఫలితం చెప్తామన్నపుడు ఏమో ఏమో అనుకుంటూనే కొందరు ఆశగా చూశారు. జనవరి 27 న తేల్చేశారు – తూచ్ అని. ఇక సమరమే అన్నారు జాక్ వారు. కెసియార్ నెహ్రూ ఖాన్‌దాన్‌తో సహా యావన్మంది కాంగ్రెస్‌వారినీ రేవు పెట్టేసి యిక పోరాటమే అన్నారు. మా పార్టీ సమావేశంలో కార్యక్రమం ఫైనలైజ్ చేయబోతున్నాం అన్నారు. కోదండరాం తన పాటికి తను సడక్ బంద్‌లు చాటుకుంటున్నారు. ఈ బంద్ కార్యక్రమాలన్నీ ఒక రోజు ముచ్చటలే కదా. ఆ రోజు కొన్ని గంటల ట్రాఫిక్ నిల్చిపోతుంది. అరెస్టులు, ఖండనలు, బెయిలు, మళ్లీ మర్నాటి కల్లా ఎప్పటిలాగా వాహనాలు నడుస్తూనే వుంటాయి. కెసియార్ పార్టీ తరఫున ఏదైనా చేస్తారేమో, కాంగ్రెస్‌వారికి అల్టిమేటమ్ యిచ్చారు కదా, సాంఘిక బహిష్కారం వంటిది ప్రకటిస్తారేమో చూదాం అనుకున్నాం.

కాంగ్రెస్‌వారిలో ఎంపీలు మాత్రం – అదీ ఆరుగురే ఆరుగురు – రాజీనామాలు చేసి – సోనియాకు పంపారు, స్పీకరుకి కాదు. ఆవిడ స్పందన ఏమిటో తెలియదు. కాస్త ఆగండి అని ఎవరిచేతనైనా కబురు పెట్టారేమో తెలియదు. వాళ్లు తెరాసలో చేరిపోతారేమోనని

అందరూ ఊహించారు. అదీ జరగలేదు. నిన్న సమావేశం జరిగింది. దానికి వాళ్లు హాజరై సంఘీభావం తెల్పుతారేమో అనుకుంటే అదీ లేదు. వాళ్లు టి-జాక్‌లోనూ చేరలేదు. వారం రోజులుగా ఆ దిశలో బండి సాగలేదు. తెరాస సమావేశంలో యీ విషయాలేవీ కెసియార్ ప్రస్తావించలేదు. నిజానికి ప్రజలను ఉద్దేశించి ఆయన ఏమీ చెప్పలేదు. పార్టీ నిర్మాణం, సహకార ఎన్నికలు, రాబోయే మధ్యంతర ఎన్నికలకు సన్నాహాలు – వీటి గురించే మాట్లాడారు. పార్టీ నిర్మాణం అనుకున్న స్థాయిలో సాగటం లేదని బాధపడ్డారు. అందరికీ హెచ్చరికలు జారీ చేశారు. సహకార ఎన్నికలను పట్టించుకోలేదు కాబట్టి ఓడిపోయాం తప్ప మరోటి కాదని చెప్పారు. ఉద్యమకారులు ప్రతి చిన్న అవకాశాన్ని వినియోగించుకుంటారు కదా అని మనబోటి వాళ్లు అడిగితే కోప్పడతారు. సరే అనడం మేలు. 2009లో హైదరాబాదు మునిసిపల్ ఎన్నికలలో పోటీ చేయకపోవడం వలన 'హైదరాబాదు పరిసరప్రాంతాల్లో తెరాసకు పట్టులేదనుకోవాలి' అని నాబోటి వాళ్లు అంటున్నారు కదా. అవి చూశాకైనా సహకార ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవలసినది. అయినా ఆయన పార్టీ, ఆయన యిష్టం.

'మధ్యంతర ఎన్నికలు రాబోతున్నాయి, మనం సీట్లు బాగా గెలుచుకోవాలి' అని పార్టీ కార్యకర్తలకు బాగా ఉద్బోధించారు. అంటే ఎన్నికలకు ముందే తెలంగాణ ప్రకటిస్తారని, తెరాస కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని చేస్తున్న ప్రచారాన్ని ఆయనా నమ్మటం లేదన్నమాట. ఆయన మాటల వలన అర్థమైంది ఏమిటంటే – తెలంగాణ ఇప్పట్లో రాదు, 2014లోనో, 2013లోనో రాబోయే ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశంపై తెరాస పోటీ చేయబోతోంది. ఆ అంశంపై సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని వాటి సహాయంతో అధికారపక్షంతో బేరాలాడి తన లక్ష్యాన్ని సాధిస్తుంది. దీనిలో అభ్యంతర పెట్టవలసినది ఏమీ లేదు. దేనికైనా అధికారమే ముఖ్యం. ఓట్లున్నవాడికే గౌరవం, సీట్లున్నవాడి మాటే చెల్లుబాటు. దానికోసం మొదట చేయవలసినది – సాధ్యమైనన్ని సీట్లు గెలుచుకోవాలి. అయితే గెలవడం ఎలా?

ఇప్పుడు బాగా వినబడుతున్న మాట ఏమిటంటే – లగడపాటి సర్వేల ప్రకారం, కిరణ్ సేకరించిన యింటెలిజెన్సు వర్గాల నివేదిక ప్రకారం – తెలంగాణవాదం 70 నియోజకవర్గాలలో మాత్రమే బలంగా వుందట. (294 సీట్లలో 70 సీట్లు మాత్రమే అంటే 25% అన్నమాట). తెలంగాణలో వున్న 120 (కరక్టుగా చెప్పాలంటే 119) సీట్లలో 50 సీట్లలో తెరాసకు గెలిచే అవకాశాలు బాగా తక్కువ, 70 సీట్లలో బాగా ఎక్కువ. ఈ 70 సీట్లు నిలుపుకుంటూ ఆ 50లో సగం సీట్లు గెలుచుకుంటే తెరాస బలమైన శక్తిగా నిలుస్తుంది. ఈ 70 సీట్లలో తెలంగాణవాదం బలంగా వుంది అంటే అక్కడ తెరాసకే ప్రాధాన్యత వుండి తీరాలి. కానీ వుంటుందా? తెరాస ఒంటరిగా పోటీ చేయగలదా? ఇప్పటిదాకా చేయలేదు. రాజీనామా చేయగా వచ్చిన ఉపయెన్నికలను పట్టించుకోవద్దు. వాటిలో సింపతీ ఫ్యాక్టర్ వుంటుంది. తెలంగాణవాదానికి తెరాస అంత తీవ్రంగా కట్టుబడిన మరో పార్టీ బిజెపి వీటిలో నాలుగైదు, సిపిఐ రెండు, మూడు, న్యూ డెమోక్రసీ ఒకటి, నాగం వంటి యిండిపెండెంట్లు ఒకటి పట్టుకుపోగా 60 సీట్లలో తెరాసకు మంచి ఛాన్సు వుంది అనిపిస్తుంది. ఇక్కడ అది టిడిపి, వైకాపా, కాంగ్రెస్ వంటి మధ్యేమార్గ పార్టీలతో పోటీ పడుతుంది. కాంగ్రెస్‌కు అధికారపక్ష సౌకర్యం వుంది. టిడిపికి పార్టీ వ్యవస్థ వుంది. వైకాపాకు వైయస్ పరపతి, జగన్ మోజు వున్నాయి. వీరితో ఎవరితో పొత్తు పెట్టుకున్నా తెరాసకు యిమేజి పోతుంది. గత ఐదేళ్లగా వీళ్లందర్నీ నమ్మకూడదని ప్రచారం చేసి, యీ రోజు చేతులు కలిపితే ప్రజలు నమ్మరు. ఒంటరిగా పోటీ చేయాల్సిందే.

ఒంటరిగా పోటీ చేయాలంటే ఒక పార్టీకి వ్యవస్థ పటిష్టంగా వుండాలి. ఇన్నాళ్లూ తెరాస పార్టీ సెంటిమెంటుపై, భావోద్వేగాలపై నెగ్గుతూ వచ్చింది. పార్టీలో ఎన్నికలు నిర్వహించి, సమావేశాలు ఏర్పరచి కార్యకర్తలను తయారుచేసే పనిపై ద ృష్టి పెట్టలేదు. నాయకుల మధ్య భేదాభిప్రాయాలుంటే వారితో చర్చించి, సమన్వయం సాధించి, రకరకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను ఉత్తేజపరచాలి. పార్టీలో అలసత్వం కొట్టవచ్చినట్టు కనబడుతుంది. 'కెసియార్ ఢిల్లీ నాయకులతో మంతనాలాడి తెలంగాణ పట్టుకుని వచ్చేస్తారు. అప్పుడు మనం ఆటోమెటిక్‌గా నాయకులై పోతాం' అనే దిలాసా చొచ్చుకు పోయింది. పార్టీ నియోజకవర్గాల యిన్‌చార్జిలుగా వున్నవారు 40-50 మంది పనిచేయడం లేదని కెసియార్ అన్నారు. బూత్, గ్రామ, మండల స్థాయి కమిటీలను వేయడం చేతకానివారు నియోజకవర్గాల యిన్‌చార్జిలుగా వున్నారని కూడా అన్నారు. అంటే దాదాపు 40% మందన్నమాట. వారి నియోజకవర్గాల్లో కమిటీలు లేవన్నమాట. వారిని ఏప్రిల్‌లో చేపట్టే బస్సుయాత్రలో మారుస్తానన్నారు కెసియార్. (ఏప్రిల్ అంటే వేసవికాలం. ఆపసోపాలు పడుతూ కెసియార్ బస్సులో వెళ్లాలి. జరిగేదాకా నమ్మకం లేదు) ఇది పోవాలంటే స్థానిక ఎన్నికలలో చురుగ్గా పాల్గొనడం ఒకటే మందు. అప్పుడు తమ స్థితి ఏమిటో, తమ బలాబలాలేమిటో స్పష్టంగా తెలిసి వస్తుంది. పార్టీ అధినేతగా కెసియార్ వాంఛిస్తున్నదీ యిదే. అందుకే ఆయన పార్టీలో సమరోత్సాహం నింపడానికి చూశారు. మార్చి 6 లోగా మూడు జిల్లాలలో, మార్చి 21 లోగా తక్కిన జిల్లాలలో కమిటీలను పూర్తి చేయాలని ఆదేశించారు. కెసియార్ దృష్టిలో ప్రస్తుతం సమరం అంటే బయటిశక్తులతో కాదు, తన పార్టీ నాయకులలో పేరుకున్న బద్ధకంతోనే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 13** **ఎమ్బీయస్ : నానాటికీ తీసికట్టు, 'నాగం'భొట్లు**

పాతకాలం సామెత కాకపోతే మన నాగం జనార్దనరెడ్డిగార్ని చూసే యీ సామెత పుట్టిందని పొరపాటు పడి వుండేవాణ్ని.

నాగంగారు ఒకప్పుడు పెద్ద లీడరు. స్వయంగా మెడికల్ డాక్టరైన ఆయన టిడిపి హయాంలో హెల్త్ మినిస్టర్‌గా చేశారు. టిడిపి అధికారం పోయిన తర్వాత కూడా నాగం సొంత ప్రతిపత్తితో నిలిచారు. తెలంగాణలో దేవేందర్ గౌడ్ నెంబర్ టూగా వున్నపుడు కూడా యీయన మాటకు విలువుండేది. దేవేందర్ బయటకు వెళ్లిన తర్వాత మరీ వెలిగారు. వైయస్ వుండగానే ఓబుళాపురం గనుల్లో అక్రమాల గురించి అందరూ మెత్తబడినా, యీయన ఒక్కరూ విడిగా నిలబడి పోరాడారు. పిఏసి చైర్మన్‌గా వుండగా చాలా విషయాలు బయటకు లాగారు. ఆయన మాటకు విలువుండేది. అలాటిది ఆయనకు తెలంగాణవాదం తలకెక్కింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఘటన తర్వాత తెలంగాణ అంటే ఉస్మానియా విద్యార్థులే అనుకున్నారాయన. యావత్తు తెలంగాణ రాష్ట్రవిభజనకోసం అల్లాడుతోందనీ, రాష్ట్రం రావడం తథ్యమనీ, వెంటనే ఆ హోమంలోకి దూకకపోతే తనను పట్టించుకునే వాడుండడని ఫీలవసాగారు. తెలంగాణపై లేఖ అంటూ టిడిపిలోంచి బయటకు వచ్చారు. టిడిపిని తిట్టితిట్టి తెరాసచే శభాష్ అనిపించుకోవడంతో ఆయనలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇండిపెండెంట్‌గా గెలిచి అసెంబ్లీలోకి వచ్చి గవర్నరును సైతం అల్లరి పెట్టారు. తెలంగాణ ఉద్యమకారుణ్నని గర్విస్తున్నారు. ఇప్పుడాయన తెలంగాణ తప్ప మరొకటి మాట్లాడడం లేదు.

అంతా బాగానే వుంది కానీ తెలంగాణ రాక విషయంలో ఆయన లెక్క తప్పింది. ఇప్పటిదాకా రాలేదు. వచ్చి వుంటే ఆయన కేదైనా పదవి దక్కేదేమో. ఇప్పుడు ఒంటరిగా నిలిచారు. తెరాసలోకి వెళితే కెసియార్ కూర్చోమంటే కూర్చోవాలి, నిలబడమంటే నిలబడాలి. ఇది ఆయనకు కష్టం. స్థూలకాయం చేత కాదు. టిడిపిలో కెసియార్ యీయన కంటె చాలా జూనియర్ కదా అందుని! అందుకని దానిలో చేరలేదు. ఇండిపెండెంట్‌గా వుంటేనే ఎక్కువ గిరాకీ అనుకున్నారు. అందరికీ ఆమోదయోగ్యుణ్ని వుతాననుకున్నారు. తెలంగాణవాదులందరినీ ఒక జండా కిందకు తెస్తా అంటూ 'తెలంగాణ నగారా సమితి' అని పెట్టారు. ఆ జండా కింద ఆయనొక్కరే మిగిలారు. ఎవరైనా పిలిస్తే ఆ జండా పట్టుకుని ఆయనే వెళ్లాలి తప్ప వేరెవరూ ఆ జండా నీడన చేరలేదు. సమితి అంటే చాలామంది నాయకులున్నారన్న అర్థం వస్తుంది కానీ యీయన విషయంలో చూడ్డానికి అనేకుల్లా కనబడే ఆయనే ఏకైక నాయకుడు.

కొంతకాలానికి యిదేం బాగా లేదనుకున్నారు, అందర్నీ కలుపుకుపోతా అంటున్నా, కలవడానికి ఎవరూ రావటం లేదు కాబట్టి అప్పటికే తెలంగాణ ఉద్యమకారులందర్నీ పోగేసి నడుపుతున్నాం అనే జాయింటు ఏక్షన్ కమిటీలో చేరితో పోలా? అనుకున్నారు. వెళ్లి చెప్పారు. తనంతటివాడు వచ్చి చేరతానంటే ఎగిరి గంతేసి ఒప్పుకుంటారనుకున్నారు. కానీ ఏక్షన్ కమిటీ యీ విషయంలో యాక్ట్ చేయలేదు. ఎందుకంటే వెనక్కాల కెసియార్ డైరక్షన్ వుంటేనే అది యాక్టింగ్ చేస్తుంది. డైరక్టర్‌గారు నాగం గారికి 'కట్' చెప్పారు. అందువలన ఏడాదిగా 'చూస్తాం, మీ అప్లికేషన్ పరిశీలనలో వుంది, ఆగండి' అంటూ గుమ్మంలోనే నిలబెట్టారు. ఏడాది చూసిచూసి యిప్పుడు నాగం గళం విప్పారు. తనంతటి స్టేచర్ వున్న వ్యక్తి, తెలంగాణ పట్ల నిబద్ధత చాటుకున్న వ్యక్తిని ఎలా దూరం పెడుతున్నారో బహిరంగంగా చెప్పుకుని బాధపడ్డారు. కోదండరాం గారు కెసియార్ చెప్పినట్టు ఆడుతున్నారని మనందరికీ తెలిసిన విషయమే మరోసారి చెప్పి, కెసియార్ పద్ధతి బాగా లేదని విమర్శించారు.

కెసియార్ ద ృష్టిలో నాగం చేసిన పాపం ఏమిటి? నాగం టిడిపిని తిట్టారు, బాబును తిట్టారు, కాంగ్రెస్‌ను తిట్టారు, జగన్‌ను తిట్టారు, సమైక్యవాదులను తిట్టారు, ఆంధ్రప్రాంతీయులను తిట్టారు. ఇన్ని చేసి యింత పుణ్యం సంపాదించుకున్నా ఆ పాపమేదో తరగలేదు, కరగలేదు. ఏమిటా పాపం అంటే – తెరాసలో చేరకపోవడం, పైగా తెరాసకు ప్రత్యామ్నాయంగా అంటూ యింకో వేదిక పెట్టడం! కొండా లక్ష్మణ బాపూజీ వంటి పెద్దాయన, గద్దర్ వంటి ప్రజా వుద్యమకారుడు కూడా యిలాటి ప్రయత్నాలే చేసి కెసియార్ ఆగ్రహానికి గురయ్యారు. బాపూజీ అంత్యక్రియలకు కూడా కెసియార్ రాలేదు. అన్నీ చూసి కూడా నాగం తెరాసలో చేరకుండా విడిగా వుండడమేమిటి? నాగంతో బాటు బయటకు వచ్చిన యిద్దరు మిత్రులకు తెరాస నచ్చచెపితే వాళ్లకు సత్యం గోచరించింది. తెరాసలో చేరిపోయారు. కానీ నాగం మాత్రం యింకా స్వతంత్రుణ్ని అంటూ విర్రవీగుతున్నారు. స్వాతంత్ర్యం కోసం వెంపర్లాడుతున్నారు. తప్పు కదా!? పాపం కదా!?

కొన్ని మతాల్లో వుంటుంది చూడండి – 'ఆయనొక్కడే దేవుడు, ఆయన తప్ప అన్యదైవము లేదు, ఉన్నవాడెవడూ దైవము కాదు, దయ్యము' అన్నట్టు – తెరాస ప్రకారం తెలంగాణలో కెసియార్ తప్ప అన్యనాయకుడు లేడు, తెరాస తప్ప అన్యరాజకీయపక్షం లేదు, వుండకూడదు. బిజెపి జాతీయపక్షంగానే వుండాలి, తెరాసకు సాయపడాలి తప్ప రాష్ట్రంలో తన వునికికై పోరాడరాదు, తెరాసతో పోటీ పడరాదు. తెలంగాణ ఉద్యమం మొత్తం కెసియార్ కనుసన్నల్లోనే నడవాలి. జాక్‌లో రాజకీయేతర సంస్థలుండవచ్చు కానీ రాజకీయపక్షాలుండకూడదు. కాంగ్రెస్‌ను ఏడిపిస్తే వాళ్లే పోయారు. టిడిపివాళ్లు చూరు పట్టుకుని వేళ్లాడితే తరిమేశారు. బిజెపి వుండిపోయింది. తరమడానికి కారణం దొరకలేదు. ఎన్నికల్లో భాగస్వామ్య పక్షాలు తలపడితే తటస్థంగా వుండాలనుకున్నందుకు కోదండరాంకు శిక్ష పడింది. పరకాలకు వచ్చేసరికి పక్షపాతం చూపాల్సి వచ్చింది. ఇక న్యూ డెమోక్రసీ చిన్నది. అందువలన జాక్ అనేది కెసియార్ జేబుసంస్థగానే వుండాలి. ఇప్పుడు నాగాన్ని దానిలోకి దూరనిస్తే ఆయన స్వతంత్రభావాలు ప్రకటించవచ్చు. జాక్ సమావేశాలకు కెసియార్ రావాలి తప్ప, కోదండరాం కెసియార్ యింటికి వెళ్లి ఆదేశాలు తీసుకోకూడదు అని పట్టుబట్టవచ్చు. ఆయన్ని చూసి తక్కిన చీమలకూ వాయిస్ రావచ్చు. జాక్‌ను, యితర తెలంగాణావాద పక్షాలను బలహీనంగా వుంచడం చేత తెలంగాణ రావడం ఆలస్యం కావచ్చు, అసలు రాకపోవచ్చు, కానీ అవి ముఖ్యం కాదు. తెలంగాణ పేరుతో తెరాస బలపడాలి. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకుని బేరాలాడే శక్తిని పెంచుకోవాలి. తెలంగాణ వచ్చే పక్షంలో తెరాస తప్ప వేరే ఏ పార్టీ

అధికారంలోకి వచ్చే స్థితిలో వుండకూడదు. అందువలన ఏ నాయకుడైనా సరే తెరాస పతాకం పంచన వుండాల్సిందే, లేకపోతే వాడు పంచముడే, అస్పృశ్యుడే.

ఈ విషయం బోధపడేసరికి నాగం గారికి దుఃఖం వచ్చేసింది. మీడియాలో చెప్పుకుని బాధపడ్డారు. ఇంటర్వ్యూలు యిచ్చారు. ఇన్ని చేసినా జాక్ 'ఆప్ కతార్ మేఉ హైఉ' అంటోంది. తెలంగాణ కోసం బొంతపురుగుని సైతం ముద్దు పెట్టుకోవడానికి సిద్ధపడిన కెసియార్ దృష్టిలో యీయనికి ఆ స్థాయి కూడా లేదనుకున్నారేమో! చలించలేదు. నాగం ఆరోపణలకు స్పందించలేదు. నాగం వంటి నాయకుడికి కెసియార్ చేసిన యీ 'సత్కారం' వలన యితర పార్టీల నుండి రాజీనామా చేద్దామనుకుంటున్న నాయకులకు బలమైన సందేశం పంపినట్టయింది – 'బయటకు వస్తే కెసియార్ నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధపడే రండి. వేరే ఔట్‌ఫిట్ పేరుతో వ్యవహారం చేద్దామనుకుంటే నిలువనీడ లేకుండా పోతారు.' అని. కాంగ్రెస్ నుండి రాజీనామా చేయడానికి సిద్ధపడుతున్న అరడజను మంది ఎంపీలకు యీ సందేశం అత్యవసరం. 'బయటకు వచ్చి 'తెలంగాణ కాంగ్రెస్' అనో ఏదో ఓ పార్టీ పెడదామనుకున్నారంటే ఖబడ్దార్' అని చెప్పేశారు. రాజీనామాలకు ఉరకలేసి సోనియాకు లేఖలు పంపిన వాళ్లు యిప్పుడు ముందువెనకలాడడానికి కారణం యిదేనేమో తెలియదు. రాజీనామాల బెదిరింపుతో బజెట్ సమావేశాల్లో పార్టీపై ఒత్తిడి తెద్దామనుకున్నవాళ్లు యిలా నీరుకారడం తెలంగాణ ఉద్యమానికి ఏ విధంగా దోహదకారి అవుతుంది? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 14** **ఎమ్బీయస్ : అఫ్జల్‌కి గురూ, నేనూ..**

అఫ్జల్ గురుకి గురువూ, ఆదర్శప్రాయుడూ – వాళ్ల పెత్తల్లి కొడుకు డా॥ అబ్దుల్ అహాద్ గురు. అతను శ్రీనగర్‌లో ప్రఖ్యాతి చెందిన కార్డియాలజిస్ట్, కరక్టుగా చెప్పాలంటే కార్డియో వాస్క్యులార్ థొరాసిక్ సర్జన్. కశ్మీర్‌లో తొలి ఓపెన్ హార్ట్ సర్జరీ 1984లో చేసినది అతనే. బాగా డబ్బున్నవాడు. జీలం వ్యాలీ మెడికల్ కాలేజీ పెట్టాడు. రాష్ట్రంలో మంచి పేరుప్రఖ్యాతులు తెచ్చుకున్నాడు. అతన్ని చూసి యిన్‌స్పయిరైన అఫ్జల్ గురు అతనిలాగే డాక్టర్ అవుదామని ఆ కాలేజీలోనే చేరాడు. అబ్దుల్ గురు డాక్టరే కాక జెకెఎల్‌ఎఫ్‌కి సిద్ధాంత కర్త కూడా. భారత్‌నుండి కశ్మీర్‌ను విమోచనం చేయాలని కలలు కంటూ ఆ సంస్థకు సహాయసహకారాలు అందించాడు. అఫ్జల్ గురు అది కూడా పుణికి పుచ్చుకున్నాడు. ఆ అబ్దుల్ గురు నాకు తెలుసు. 1980 మేలో కశ్మీర్ వెళ్లినపుడు వాళ్లింట్లో భోజనం చేశాను. మర్నాడు షాపింగ్‌కు కూడా తీసుకెళ్లాడు!

...ఓపెనింగ్ అదిరింది కదూ! అదరగొట్టడానికో, స్వోత్కర్షకో యిది రాయడం లేదు. టెర్రరిజం ఎలా ఉద్భవిస్తోందో, ఏ వర్గాల్లో పాకుతోందో ఒక ఐడియా యివ్వడానికి, కసబ్‌కు అఫ్జల్‌కు గల తేడా వివరించడానికి డా॥ గురు గురించి విపులంగా రాస్తున్నాను. 1980 మేలో నా మిత్రుడు మంజునాథ్‌గారు తన కుటుంబంతో కశ్మీర్ పర్యటనకు వెళుతూ వుంటే నేనూ వారితో బాటు వెళ్లాను. మంజునాథ్ బాబాయి డా॥ ఎన్. గోపీనాథ్. 1963లో భారతదేశంలో తొలి ఓపెన్ హార్ట్ సర్జరీ చేసిన ప్రముఖ సర్జన్, పద్మశ్రీ బిరుదాంకితులు. మేం దారిలో ఢిల్లీలో దిగినపుడు ఆయన తన శిష్యులు డా॥ శర్మ జమ్మూలో, డా॥ అబ్దుల్ గురు శ్రీనగర్‌లో వున్నారనీ, వాళ్లు మాకు సాయపడతారనీ చెప్పారు. శ్రీనగర్‌లో దిగగానే డా॥ గురు తన అసిస్టెంటు ద్వారా మాకు బస ఏర్పాటు చేశాడు. మే 13 న వాళ్లింటికి డిన్నర్‌కు పిలిచాడు. కశ్మీరియత్ గురించి చాలా కబుర్లు చెప్పాడు. మర్నాడు శ్రీనగర్‌లో షాపింగుకి తీసుకెళ్లాడు. అప్పట్లో అతనికి 40 ఏళ్ల వయసైనా బట్టతల వచ్చేసింది. పొట్టివాడు.

కశ్మీర్‌లో కలప వ్యాపారానికి సోపోర్ ప్రసిద్ధి. అక్కడ చాలామంది ధనవంతులే. గురుకి సోపోర్‌లో చాలా యిళ్లున్నాయని విన్నాను. అతని శ్రీనగర్ యిల్లుకూడా చాలా పెద్దది. మొత్తం కలపతో కట్టినది. అతను బెంగుళూరు మెడికల్ కాలేజీలో 1963లో ఎంబిబియస్ చేశాడు, లక్నోలో ఎమ్.ఎస్. చేశాడు. 1977లో ఎఐఐఎమ్‌ఎస్‌లో పనిచేస్తున్న డా॥ గోపీనాథ్‌గారి వద్ద ట్రెయినింగ్ తీసుకున్నాడు. శ్రీనగర్‌లో ప్రాక్టీసు పెట్టుకుని బాగా గడించసాగాడు. గురువుగారు చెప్పారు కదాని మంజునాథ్‌కు ఆతిథ్యం యిచ్చాడు. వాళ్లతో బాటు సత్రకాయలా నాకూ...! మామూలుగా నేను డైరీ రాయను. కానీ ఏదైనా కొత్త వూరుకి వెళ్లినపుడు రాస్తాను. ఆనాటి డైరీ తిరగేస్తే తేదీలు దొరికాయి. దానితో బాటు నేను రాసుకున్న విషయమూ కనబడింది – 'వైల్ వి సప్‌డ్ విత్ డా॥ గురు, ఐ డిడ్ నాట్ ఫైండ్ హిమ్ ఆల్ దట్ లవబుల్' అని! మర్నాడు మే 14 న షాపింగ్‌కి వెళ్లినపుడు 'గురుతో వెళ్లినందుకు కిట్టుబాటుగా ఏమీ లేదు, ధరలు తగ్గించలేదు' అని కూడా రాసుకున్నాను. జమ్మూలో బ్రహ్మాండమైన ఆతిథ్యం యిచ్చిన డా॥ శర్మతో పోల్చి వుంటాను.

కొన్నాళ్లు పోయాక అతని గురించి పేపర్లో చదివినపుడు ఉలిక్కిపడ్డాను. 1989 డిసెంబరులో అప్పటి నేషనల్ ఫ్రంట్‌లో హోం మంత్రిగా వున్న ముఫ్తీ మహమ్మద్ సయీద్ కూతురు రూబియాను కాశ్మీరు తీవ్రవాదులు కిడ్నాప్ చేసి దానికి ప్రతిగా జైల్లో వున్న తీవ్రవాదులను కూడా విడుదల చేయాలని షరతు పెట్టినపుడు యీయన మధ్యవర్తిగా వ్యవహరించి అలా జరిగేట్టు చూశాడు. రూబియా అక్క, ముఫ్తీ రాజకీయవారసురాలు అయినా డా॥ సయీదా, డా॥ గురు వద్ద వైద్యం అభ్యసించింది కాబట్టి ఆ పరిచయం కొద్దీ యీ ఉపకారం చేశాడన్నారు. సయీదా సంగతి సరే, అటు తీవ్రవాదులు యీయన మాట ఎందుకు వినాలి? ఏమైనా కనక్షన్ వుందా? అనుకున్నాను.

ఇప్పుడు దేశంలో మావోయిస్టులు ఎక్కడ ఎవర్ని కిడ్నాప్ చేసినా మధ్యవర్తులుగా మన హరగోపాల్‌ను, వరవరరావును పిలుస్తారు.

ఎందుకు? వీళ్లు ప్రచ్ఛన్న మావోయిస్టులు కాబట్టి! వీళ్లు సభ్యసమాజంలో తిరుగుతూ మావోయిస్టులను సమర్థిస్తూ, వారికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని బిల్డప్ చేస్తూ వుంటారు, స్వయంగా నేరాల్లో యిరుక్కోరు కాబట్టి శిక్షించడానికి వుండదు. బినాయక్ సేన్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని దేశంలో మేధావులంతా చాలాకాలంగా గోల చేస్తున్నారు. ఈ మధ్యే పేపర్లో చదివాను – ఓ మావోయిస్టు నాయకుడు ఒప్పుకున్నాట్ట – బినాయక్ సేన్ మాకు కొరియర్‌గా చేశాడని! అలాటివి బయటపడేవరకూ వీళ్లంతా వామపక్షమేధావులుగానే చలామణీ అవుతారు. ఇప్పుడు వరవరరావుగారు అఫ్జల్ గురు ఉరికి వ్యతిరేకంగా నిన్న ప్రదర్శన నిర్వహించారు.

డా।। గురు కూడా యిలాటివాడే. ఓ పక్క డాక్టరుగా సంఘంలో పెద్దమనిషిగా వుంటూనే మరో పక్క కశ్మీర్ భారత్‌నుండి 'విముక్తి' చెందాలని సిద్ధాంతాలు చేశాడు. జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థ ఏర్పడడానికి బాటలు పరిచాడు. వారికి సహాయసహకారాలు అందించాడు. వారిని అణచడానికి కశ్మీర్ వచ్చిన భారతసైన్యం అత్యాచారాలు చేస్తోందని, మానవహక్కులు హరిస్తోందనీ ప్రచారం చేశాడు. విదేశీ పాత్రికేయులను, చరిత్రకారులను తన వద్దకు ఆహ్వానించి తన వెర్షన్ వినిపించి, ఫోటోలు తీయించి, వాళ్ల చేత మానవహక్కుల ఉద్యమకర్తగా కీర్తింపబడ్డాడు. కశ్మీర్ తీవ్రవాదులు హరించిన మానవహక్కుల గురించి, తరిమివేసిన పండిట్ల గురించి కిక్కురుమనలేదు, అచ్చం మన మావోయిస్టు సానుభూతిపరులైన మేధావుల లాగానే! మావోయిస్టులు కాళ్లు నరికినా, చేతులు నరికినా వీళ్లకు కనబడదు. పోలీసుల ఎన్‌కౌంటర్లు మాత్రమే వీళ్ల కంటికి ఆనతాయి.

మావోయిస్టులు వరవరరావు మాట మన్నించినట్టుగానే, జెకెఎల్ఎఫ్‌వాళ్లు డా।। గురు మాట మన్నించి రూబియాను విడిపించారు. జైల్లో వున్న తమ వాళ్లను విడిపించుకున్నారు. అప్పణ్నుంచి ఆ సంస్థకు కశ్మీర్‌లో పట్టపగ్గాలు లేకపోయాయి. దానితో బాటు యింకో సంస్థ కూడా హిజ్బుల్ ముజాహిదీన్ కూడా బలపడింది. అది పూర్తిగా పాకిస్తాన్ సహాయంతో నడిచేది. కశ్మీర్‌లో పాకిస్తాన్‌లో కలపాలని డిమాండ్ చేసేది. దాని కార్యకర్తలే డా।। గురును 1993 మార్చిలో కాల్చి చంపారు. 'కత్తితో వ్యవహరించువాడు కత్తితోనే మరణించును' అనే బైబిల్ వాక్యాన్ని నిజం చేస్తూ, డాక్టరుగారు వైద్యంతో ఆగకుండా తీవ్రవాదంతోకూడా చెలగాటం ఆడడంతో చివరకు వాళ్ల చేతిలోనే హతమారాడు.

'డా।। గురును చంపినది హిజ్బుల్‌వాళ్లు కాదు, పోలీసులే..' అని 2008లో హబిబుల్లా అనే ఐయేయస్ అధికారి ఆరోపించాడు. చెప్పినట్టు చేస్తే జైల్లోంచి విడుదల చేస్తామని ఓ ఖైదీతో ఒప్పందం కుదుర్చుకుని అతని ద్వారా డా।। గురును చంపించి, ఆ తర్వాత రహస్యం బయటపడకుండా ఆ ఖైదీని తన ప్రియురాలితో శయనిస్తున్న వేళ చంపేశారని చెప్పాడీయన. 'ఆ మాటకొస్తే రూబియా కిడ్నాపే ఓ పెద్ద డ్రామా, ముఫ్తీ సయీద్, డా।। గురు కలిసి తీవ్రవాదులను విడిపించడానికి ఆమెను ఎత్తుకుపోయినట్టు డ్రామా ఆడారు తప్ప ఆమె సురక్షితంగా డా।। గురు యింట్లోనే వుంద'ని మరొకళ్లు రాశారు. చందన్ మిత్రా అనే జర్నలిస్టు (ఎంపీ కూడా – ఎన్‌డి టివి చర్చల్లో కనబడే కళ్లజోడు లావాటాయన) డా।। గురు 'రా' (భారత గూఢచారి సంస్థ) ఏజంటుగానూ ఐయస్ఐ (పాకిస్తాన్ గూఢచారి సంస్థ) ఏజంటుగానూ కూడా పని చేశాడని రాశారు. చెప్పవచ్చేదేమిటంటే డా।। గురు కులీనవంశంలో పుట్టి, ఉన్నతవిద్య నభ్యసించి, సమాజంలో ఎంతో ఖ్యాతి సంపాదించినా తీవ్రవాదంవైపు మళ్లడంతో 53 ఏళ్లకే దుర్మరణం పాలయ్యాడు. డా।। గురును ఆదర్శంగా తీసుకున్న అఫ్జల్ గురు జీవితమూ అలాగే సాగింది.

అఫ్జల్ గురుది కూడా సోపోరే దగ్గరున్న సీర్ జాగీర్ అనే గ్రామం. జీలం నది ఒడ్డున వుంది. అతనిది డబ్బున్న కుటుంబం. అతని తండ్రి హబిబుల్లా ట్రాన్స్‌పోర్టు, కలప వ్యాపారం చేసేవాడు. దర్జాగా బతికేవాడు. అంబాసిడర్ కార్లో తిరిగేవాడు. ఇంట్లో టీవీ అదీ వుండేది. లివర్ సిరోసిస్‌తో చిన్నవయసులోనే పోయాడు. అప్పుడు అఫ్జల్ వయసు 10 సం।।లు. పెద్దన్న అయాజ్‌పై కుటుంబభారం పడింది. వెటర్నరీ డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తూ టింబర్ వ్యాపారం చేశాడు. తమ్ముణ్ని చదివించాడు. అఫ్జల్ బాగా చదువుకునేవాడు. అతని గురువులు కశ్మీరీ పండిట్లే. 1988లో తన కజిన్ డా।। అబ్దుల్ గురు సహాయంతో జీలం వ్యాలీ మెడికల్ కాలేజీలో చేరాడు. మెడికల్ కాలేజీలో వుండగా గజల్స్ పాడేవాడు. అతని పాటలు చూసి అమ్మాయిలు అతనంటే యిష్టపడేవారు. కష్టపడి చదివేవాడు కానీ మార్కులు సుమారుగానే వచ్చేవి. మొదటి సంవత్సరం అన్ని సబ్జక్టులు పాసయ్యాడు. తర్వాత ఊళ్లో గొడవలు జరుగడంతో కాలేజీ కొన్ని రోజులు మూసేశారు.

ఆ సమయంలోనే కశ్మీర్‌లో అలజడి ప్రారంభమైంది. సోపోర్‌లో, పరిసర ప్రాంతాల్లో తీవ్రవాదుల సంచారం ఎక్కువగా వుండేది. పాకిస్తాన్, అఫ్గనిస్తాన్, సుడాన్ నుంచి వచ్చిన విదేశీ మిలిటెంట్లు ఆ ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరిగేవారు. భారతసేనతో పోరాటాల్లో సంపాదించిన ఆయుధాలను బహిరంగంగా ప్రదర్శిస్తూ ఆ ప్రాంతాన్ని 'విముక్తప్రాంతం' గా పేర్కొనేవారు. అక్కడి యువకులందరికీ సరిహద్దులు దాటి పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లి కుటుంబాలు, ప్రాణాలు ఏవీ లెక్కచేయకుండా ముజాహిదీన్‌లుగా మారడం ఓ ఫాసినేషన్‌గా, ఓ సాహసంగా అనిపించేది. అఫ్జల్ కూడా చదువు మానేసి అదే బాట పట్టాడు. అతను జెకెఎల్ఎఫ్‌లో చేరాడు. వారిలో చాలామంది జమాతే ఇస్లామీ తీవ్రభావాలను వంటబట్టించుకుని హిజ్బుల్‌లోకి చేరారు. కానీ తను అటువైపు వెళ్లలేదని అఫ్జల్ చెప్పుకున్నాడు. అతను మెడిసిన్ వదిలేసి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లి మిలటరీ ట్రెయినింగ్ పొందాడు. తర్వాత వెనక్కి తిరిగి వచ్చాడు కానీ మళ్లీ మెడిసిన్‌లో చేరలేదు.

ఢిల్లీ వెళ్లి ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చేరదామనుకున్నానని చెప్పాడు. దానికోసం ఢిల్లీలో తన కజిన్ అయిన షౌకత్ గురుతో కలిసి వున్నాడు. అతను నవజ్యోత్ అనే సిక్కు అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి తర్వాత ఆమె మతం మార్చుకుని తన పేరు

అఫ్సాన్‌గా మార్చుకుంది. అక్కడ వుంటూ ట్యూషన్లు యిస్తూ కరస్పాండెన్సు కోర్సులో పొలిటికల్ సైన్స్ చదివి గ్రాజువేట్ అయ్యాడు. అప్పుడు తన తల్లి తరఫు బంధువైన తబస్సుమ్‌ను పెళ్లాడాడు. తన బంధువుల వద్ద ఉద్యోగం చేశాక కొన్ని రోజులకు శ్రీనగర్‌లో సర్జికల్ సామాన్ల వ్యాపారం మొదలుపెట్టాడు. ఢిల్లీకి తరచుగా వెళ్లి వస్తూ వుండేవాడు. 1999లో కొడుకు పుడితే అతనికి గాలిబ్ అని పేరు పెట్టాడు. ఆ పిల్లాడు యిప్పుడు ఎనిమిదో తరగతిలో వున్నాడు.

ఇలా వుండగా జైషే ముహమ్మద్ సంస్థవారు 2001 డిసెంబరు 13 న పార్లమెంటుపై దాడి చేశారు. దొంగ స్టికర్ అంటించిన కారులో ఐదుగురు మిలిటెంట్లు పార్లమెంటులోకి చొచ్చుకుని వచ్చి దాడి చేశారు. 45 నిఎంఎల పోరాటం తర్వాత వారందరినీ సెక్యూరిటీవాళ్లు చంపేశారు. ఏడుగురు సెక్యూరిటీ ఫోర్సు వాళ్లు మరణించారు. వారిలో ఒక సిఆర్‌పిఎఫ్ మహిళా కానిస్టేబుల్ కూడా వుంది. దాడి జరిగిన రెండు రోజులకే పోలీసులు అఫ్జల్‌ను, అతనికి ఆశ్రయం యిచ్చిన షౌకత్, అతని భార్య అఫ్సాన్‌ను ఖైదు చేశారు. వీళ్లతో బాటు ఢిల్లీ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా వున్న ఎస్ఏఆర్ గిలానీని కూడా. 2002 జూన్‌లో యాంటీ – టెర్రరిస్టు కోర్టులో ఫైల్ చేసిన కేసులో అఫ్జల్‌పై చేసిన ఆరోపణలు – దాడికి సూత్రధారిగా వ్యవహరించడం, ఆయుధాలను తన ఢిల్లీ నివాసంలో దాచడం, టెర్రరిస్టులని తెలిసి కూడా వాళ్లకు తన యింట్లో ఆశ్రయం యివ్వడం. 2002 డిసెంబరులో యాంటీ – టెర్రరిస్టు కోర్టు అఫ్జల్, షౌకత్, గిలానీలకు మరణశిక్ష విధించి అఫ్సాన్‌కు ఐదేళ్ల శిక్ష వేసింది. వాళ్లు ఢిల్లీ హైకోర్టుకి అపీలు చేసుకుంటే అఫ్సాన్‌ను, జీలానీని వదిలేసింది. సుప్రీం కోర్టుకి వెళితే 2005 ఆగస్టులో తీర్పు యిస్తూ అఫ్జల్‌కు ఉరిశిక్షను ఖాయం చేసింది. షౌకత్‌కు పదేళ్ల కఠిన శిక్ష వేసింది. అతన్ని యీ ఏడాదే వదిలేశారు.

అఫ్జల్ తరఫున అతని భార్య క్షమాభిక్ష కోరింది. అప్పటి రాష్ట్రపతి కలాం హోం శాఖకు ఆ లేఖను పంపారు. 2011 ఆగస్టులో హోం శాఖ ఉరి వేసేయమని సలహా యిస్తూ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్‌కు లేఖ పంపింది. కానీ ఆమె ఉరిని వాయిదా వేసింది. 2012 నవంబరు ప్రణబ్ మళ్లీ హోం శాఖను సంప్రదించారు. ఫిబ్రవరి 4 న హోం మంత్రి ఉరి సిఫార్సు చేశారు. చివరకు ఫిబ్రవరి 9 న రహస్యంగా ఉరి వేశారు. అఫ్జల్ పెద్దన్న అయాజ్ ఊరొదిలి చాలా ఏళ్లయింది. అతని తల్లి ఆయేషా బేగమ్ సెప్టెంబరులో మరణించింది. కసబ్‌కు ఉరి అమలు కాగానే యిక అఫ్జల్ వంతు అని తెలిసిపోయింది. అతని తమ్ముడు హిలాల్ ఊరొదిలి పారిపోయాడు. అఫ్జల్ అరెస్టు కాగానే అతని భార్య తబస్సుమ్ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె అక్కడ ఓ నర్సింగ్ హోమ్‌లో పని చేస్తోంది.

కసబ్‌కు, అఫ్జల్‌కు గల తేడా ఏమిటంటే – కసబ్ పాత్రధారి. నేరం చేస్తూ వుంటే దొరికిపోయాడు. అతను ఒక పరికరం మాత్రమే. అతన్ని ఆడించేవాళ్లు వేరేవాళ్లు వున్నారు. వారు దొరకలేదు, దొరకరు కూడా. కసబ్ ఒక పేదవాడు, తెలివి లేనివాడు. డబ్బుకోసం దీనిలోకి దిగాడు. అతన్ని శిక్షించడం సులభం. అయితే అఫ్జల్ సూత్రధారి. అతని నేపథ్యమే వేరు. అతన్ని నడిపించినది డబ్బు కాదు, సిద్ధాంతాలు! వాటిని అమలు చేయడానికి వెనక్కాల సూత్రధారిగా వుండి నేరాన్ని నిర్వహించాడు. ఖలిస్తాన్ ఉద్యమం విషయంలో కూడా అనేకమంది డబ్బున్న సిక్కులు వెనక్కాల వుండి ఉద్యమాన్ని నడిపించారు. అలాటి కేసుల్లో వాళ్ల ప్రమేయం గురించి ఆధారాలు దొరకవు. మేధావి కాబట్టి చట్టాలని ప్రశ్నించగలడు. అమాయకుడిలా నటించగలడు. అంతర్జాతీయ సంస్థల అభిప్రాయాలను మార్చగలడు. ఇక్కడ అతను ప్రత్యక్షంగా దాడిలో పాల్గొనలేదు. దాడి చేసేవాళ్లు దాడికి ముందు అతనికి ఫోన్ చేశారు కాబట్టి అతను అనుమానితుడయ్యాడు. పైగా అతను ఆ ఐదుగుర్ని గుర్తు పట్టాడు కాబట్టి వారికి యితనికి సంబంధం వుందని పోలీసులు అన్నారు.

అఫ్జల్ విషయంలో కేసు విచారణ సరిగ్గా జరగలేదని కొన్ని ఆరోపణలు వున్నాయి – ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారు విచారణలో చాలా లోపాలు ఎత్తి చూపారు. మామూలుగా అయితే అరెస్టు చేసిన వ్యక్తి పోలీసు కస్టడీలో యిచ్చిన నేరాంగీకార వాంగ్మూలం (కన్ఫెషన్) కోర్టులో మార్చవచ్చు. పోలీసులు తనను తన్ని అలా చెప్పించారని వాదించవచ్చు. కానీ అఫ్జల్‌ను పోటా చట్టం కింద అరెస్టు చేశారు కాబట్టి అటువంటి వెసులుబాటు లేదు. విచారణ జరుగుతున్నపుడు అఫ్జల్ తను ఒకప్పుడు మిలిటెంట్‌నన్న మాట వాస్తవమే కానీ తర్వాత లొంగిపోయానని, అప్పుడు యితర మిలిటెంట్ల పై నిఘా వేసే పని జమ్మూ కశ్మీర్ స్టేట్ టాస్క్ ఫోర్స్ అప్పగించిందని వాదించాడు. వాళ్లలో ఒక ఆఫీసరు తనను ఢిల్లీ వెళ్లి మొహమ్మద్ అనే ఒకతనికి ఆశ్రయం కల్పించమని చెప్పాడని అఫ్జల్ చెప్పుకున్నాడు. ఆ మొహమ్మద్ టెర్రరిస్టుల్లో ఒకడు. ఆ మొహమ్మద్ పారిపోయాడు. ఆ టాస్క్ ఫోర్స్‌ను యిప్పుడు రద్దు చేశారు. తన అఫ్జల్ రాష్ట్రపతికి రాసిన లేఖలో 'నేను నేరమే చేయనప్పుడు 'తప్పు చేశాను, క్షమించండి' అని ఎలా అడగగలను?' అని వాపోయాడు.

ఎమికస్ క్యూరీ (నేరస్థుడి తరఫున కోర్టుకి స్నేహితుడిగా వ్యవహరించే వ్యక్తి) అఫ్జల్ కేసు సరిగ్గా వాదించలేదని అఫ్జల్ లాయర్ అన్నారు. 'ఆయన సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేయలేదు. అఫ్జల్ ఆయన్ను మార్చాలని అనుకున్నాడు కానీ కోర్టు అంగీకరించలేదు' అన్నాడాయన. అఫ్జల్ ఏ తీవ్రవాద సంస్థలోను సభ్యుడిగా వున్నట్టు ఆధారాలు లేవని సుప్రీం కోర్టు అంది. అంటూనే యిలాటి కేసుల్లో ఆధారాలు దొరకడం కష్టం అని కూడా అంది. అఫ్జల్ వంటి తీవ్రవాదులు ప్రజాస్వామ్యాన్ని కూలదోయడానికి ఓ పక్క ప్రయత్నిస్తూనే మరో పక్క ప్రజాస్వామ్యం యిచ్చే హక్కులను వాడుకుందామని చూస్తారు. అతను నిజంగా ఏజంటో, కౌంటర్ ఏజంటో, డబుల్ ఏజంటో, లొంగిపోయిన మిలిటెంటో, చురుగ్గా వున్న మిలిటెంటో ఎవరికీ అర్థం కాకుండా కన్‌ఫ్యూజ్ చేయాలని చూశాడు. కోర్టు

యీ అంశాలన్నీ తీవ్రంగా చర్చించాకనే అతనికి కఠినమైన శిక్ష వేసింది కాబట్టి శిక్షార్హుడు అనుకోవచ్చు.

అయితే కశ్మీర్ ప్రజలకు యివన్నీ అర్థం కాదు. అఫ్జల్ అమాయకుడు, ప్రభుత్వం అతన్ని అన్యాయంగా ఉరేస్తుంది అన్న ప్రచారమే అక్కడ సాగుతోంది. అఫ్జల్‌ని హీరోగా చేయడానికి చూస్తున్నారక్కడ. అందుకనే అతని ఉరి రహస్యంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులకు తెలియపరచారా లేదా అన్నది వివాదమైంది. కశ్మీర్ ముఖ్యమంత్రి కూడా కేంద్రాన్ని తప్పుపడుతున్నాడు. బహిరంగంగా అతను అలా మాట్లాడక తప్పదు. ఎందుకంటే భావోద్వేగాలు అలా వున్నాయి. కరీంనగర్‌లో ప్రత్యేక తెలంగాణ అక్కరలేదు అని ఎవరైనా చెప్పగలరా? హైదరాబాదులో సమైక్యవాదులు అనేకమంది వున్నారని తెలుసు. కానీ సమైక్యవాదులు ఒక సభ పెట్టగలరా? 1972లో జై ఆంధ్ర నడుస్తుండగా సమైక్యవాదం అన్నవారిని తన్నబోయారు. ఈనాడు అదే చోట ప్రత్యేకవాదం అన్నవాళ్లను తన్నబోతున్నారు. పబ్లిక్ మూడ్ గమనించి నాయకులు ఏ రోటి కాడ ఆ పాట పాడతారు తప్ప కటువైన వాస్తవాలు చెప్పరు. అఫ్జల్‌ను ఉరి వేయడంతో ప్రభుత్వం తన దృఢత్వాన్ని చాటుకుంది. ఇలాటి కేసులు ఎన్నేళ్లు నానబెడితే అంత జటిలం అవుతాయి. ఎప్పటికైనా ప్రతిఘటన తప్పదు. త్వరగా ఉరేసేస్తే గొడవ వదిలిపోతుంది. లేకపోతే యితన్ని విడిపించాలంటూ ఏ విమానాన్నో హైజాక్ చేయడం, పది పదిహేనుమందిని చంపడం జరుగుతాయి. అఫ్జల్ గురించిన వాస్తవాలు కేంద్రం అందరికీ తెలియపరిస్తేనే మరి కొందరు అఫ్జల్‌లు తయారవకుండా ఆగుతారు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 16 వీక్లీకై** **ఎమ్బీయస్ : అఫ్జల్ ఉరి కబురు**

అఫ్జల్ గురు బతికున్నంతకాలం ఇంకా ఉరి తీయరేం? యుపిఏకు చేవ లేదా? ఉగ్రవాదంపై ఉదాసీనతా? మైనారిటీల బుజ్జగింపా? అంటూ ప్రతిపక్షాలు, మీడియా చంపుకుతిన్నాయి. ఎట్టకేలకు ఉరేశారు. ఇప్పుడు 'కోర్టు విచారణ సరిగా జరగలేదు', 'కుటుంబానికి కబురు స్పీడు పోస్టులో పంపడమేమిటి?', 'శవాన్ని కుటుంబానికి యివ్వకపోవడమేమిటి?' అంటూ ఏకేస్తున్నారు. మేధావులుగా పేరుబడిన వారు యీ చర్చలో ముందువరసలో నిలబడ్డారు. అవునుపాపం అనుకునేముందు కాస్త నిదానించి ఆలోచిస్తే చాలా విషయాలు తడతాయి.

మొదట అఫ్జల్ గురు అమాయకుడా కాదా? పార్లమెంటుపై దాడి కేసులో అఫ్జల్‌ను అన్యాయంగా యిరికించారన్న అర్థంలో ఫరూఖ్ అబ్దుల్లా కూడా మాట్లాడారు. విచారణ సమయంలో అఫ్జల్ 'నేను మాజీ మిలిటెంట్‌ను. ప్రభుత్వ అభ్యర్థనపై నేను ఆ మిలిటెంట్లకు ఆశ్రయం యిచ్చాను' అని వాదించాడు. ఇది నిజమో, కాదో తెలుసుకోవాలంటే ఒకటే ఆమ్లపరీక్ష. అఫ్జల్ గురు ఉరి పట్ల కశ్మీరు లోయలో, పాకిస్తాన్‌లో తీవ్రవాదులు ఏ విధంగా స్పందించారో చూడాలి. అఫ్జల్ గురు చెప్పుకున్నట్లు అతడు తీవ్రవాదం నుండి తప్పుకుని, తక్కిన తీవ్రవాదులను పట్టివ్వడానికి భారతప్రభుత్వానికి సహాయపడుతూ వుంటే అతన్ని వాళ్లు అసహ్యించుకుని వుండేవారు. అతని కుటుంబాన్ని వేధించి వుండేవారు. అతని మృతిని పండగగా చేసుకునేవారు. 'తీవ్రవాదం నుండి తొలగిపోతే అఫ్జల్‌కు పట్టిన గతే మీకూ పడుతుంది, భారతప్రభుత్వాన్ని నమ్మి లొంగిపోకండి' అని ఊగిసలాడేవారికి హెచ్చరికలు జారీ చేసి వుండేవారు.

కానీ అదేమీ జరగలేదు. పైగా అఫ్జల్ మృతి సంతాపసూచకంగా పాకిస్తాన్‌లో నిరాహారదీక్షలు, నిరసనలు జరిగాయి. కశ్మీర్ లోయలో శాంతిభద్రతల సమస్య ఏర్పడి కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. కశ్మీర్ ముఖ్యమంత్రి "నేటి యువతరం అఫ్జల్‌ను కలకాలం గుర్తుంచుకుంటుంది" అంటూ ప్రకటన యిచ్చాడు. ప్రతిపక్ష నాయకురాలు యింకా ఘాటుగా ప్రకటన యిచ్చింది. కశ్మీర్‌కు సంబంధించిన ఒక్క నాయకుడూ కూడా అఫ్జల్ మరణశిక్షను ప్రశంసించలేదు. ఏమిటి దీనర్థం? కశ్మీర్‌లో బలంగా వేళ్లూనుకుని వున్న తీవ్రవాదంలో అఫ్జల్ భాగస్తుడే. అతను తీవ్రవాదాన్ని వదలలేదు. అతను కోర్టులో చెప్పినవి అబద్ధాలు. విచారణ సరిగ్గా జరగలేదు అంటున్నారు, ప్రత్యేక న్యాయస్థానం, హై కోర్టు, సుప్రీం కోర్టు యిలా మూడు అంచెల్లో విచారణ సాగింది. ఇతను కాక తక్కిన వారి విషయాల్లో వారు చేసినది తీవ్రమైన నేరం కాదనుకుని న్యాయస్థానం విడిచి పెట్టేసింది. ఇతని విషయంలో మాత్రం యితను నేరస్తుడని కచ్చితంగా యిందరు న్యాయమూర్తులు నమ్మారు.

కంటితో చూసిన సాక్షులు వుంటే తప్ప శిక్ష వేయకూడదనుకుంటే లాడెన్ కూడా నిర్దోషిగానే తేలతాడు. అతను కూడా వెనకాల వుండి నడిపించాడు తప్ప స్వయంగా దాడుల్లో పాల్గొనలేదు. పాల్గొనివుంటే చచ్చిపోయి వుండేవాడు. అఫ్జల్‌కూడా అంతే. పార్లమెంటుపై దాడికి పంపినపుడే వాళ్లు ఛస్తారని తెలుసు. వాళ్ల బదులు తనే వెళితే ఆ ఒక్క దాడితోనే కథ ముగిసిపోతుంది. తనలాటి వాడు బయట వుంటేనే అలాటివాళ్లను నెలనెలా పంపి ఉద్యమం ఆగకుండా చూడగలడు. కసబ్ లాటి ఒకడికోసం వెతకబోతే వెయ్యిమంది దొరుకుతారు. అతనో తోలుబొమ్మ. డబ్బు పారేస్తే దొరుకుతాడు. కానీ అఫ్జల్ లాటి వాళ్లు తోలుబొమ్మలను ఆడించే తెరవెనుక కళాకారులు. వాళ్లు అరుదుగా దొరుకుతారు. పట్టుబడడమూ అరుదే. దొరికాక విచారణను తప్పుదారి పట్టించడంలో, సాక్ష్యాలు దొరకకుండా చేయడంలో వీళ్లు ఘనులు. అతని మరణం తర్వాత తీవ్రవాదుల స్పందన బట్టి అతను నిర్దోషి కాదని కచ్చితంగా తేలుతోంది.

ఇక అతని చావు గురించి కుటుంబసభ్యులకు చెప్పలేదేం? చెపితే ఏం చేసి వుండేవారు? అతను పట్టుబడగానే వాళ్లకు తెలిసి

వుంటుంది. ఇతను యిక బతకడ్రా అని. చేసినది చిన్న నేరమా? భారతదేశపు ప్రజాప్రతినిథులందర్నీ కట్టకట్టి చాపచుట్టుగా లేపేసే ప్రయత్నమది. ఒక్క దెబ్బతో కేంద్ర కాబినెట్ మాయమై పోయి వుండేది. దేశంలో నాయకుడు అనేవాడు లేకుండా పోయి, అరాచకం ప్రబలి వుండేది. ఆ సమయంలో పాకిస్తాన్ దండెత్తి పాలనను వశపరచుకుని వుండేది. అక్కడ లాగే సైన్యమే అన్నీ శాసించేది. కొందరు పుణ్యాత్ములు, సాహసికులు, విధినిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయనివారు వున్నారు కాబట్టి దేశం యింకా నిలిచి వుంది. ప్రజాస్వామ్యం బతికింది కాబట్టి యీ మేధావులిలా శాంతంగా కూర్చుని 'అది తప్పు, యిది తప్పు' అంటూ ప్రకటనలు దట్టించగలుగుతున్నారు. పాకిస్తాన్ ఏలుబడిలో వుంటే ఎలా వుండేదో ఊహించడానికే భయం వేస్తుంది. ఇంత ఘోరమైన నేరం చేసిన అఫ్జల్‌ను సజీవంగా పట్టుకుని కూడా పదకొండు ఏళ్ల పాటు తిండిపెట్టి పోషించడం మన దేశానికే చెల్లింది. అమాయకుడికి శిక్ష పడకూడదనే ద ృఢసంకల్పంతో రూపొందించిన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాం కాబట్టే యిన్ని చెక్స్ అండ్ బాలన్స్‌ల గురించి పట్టించుకుంటున్నాం. న్యాయప్రక్రియ ఎంత నెమ్మదిగా సాగుతున్నా భరిస్తున్నాం.

సుప్రీంకోర్టు ఉరిని ఖరారు చేశాక యిక ఆశ పెట్టుకోవడానికి ఏమీ లేదు. రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకోవడం ఓ లాంఛనం మాత్రమే. అది మన్నించాల్సిన అగత్యం రాష్ట్రపతికి ఏమీ లేదు. క్షమించదలచుకుంటే అఫ్జల్ భార్య పిటిషన్ పెట్టుకోగానే సరే అని వుండేవారు కదా! అసలు అఫ్జలే విసుక్కున్నాడు – 'వీళ్లు యింకా ఉరి తీయరేం? ఇదే అద్వానీ వుండి వుంటే చటుక్కున తీసేసి వుండేవాడు' అంటూ. కసబ్‌ను ఉరి తీయగానే అఫ్జల్ బంధువులకు తోచింది – ఓహో మనవాడి వంతూ వచ్చిందిరా అని. ఇక నెల్లాళ్ల తర్వాత తీస్తారా, మూణ్నెళ్ల తర్వాత తీస్తారా అన్నది అనవసర చర్చ. ఫలానా రోజున ఉరి తీస్తున్నాం అని చెప్పి వుంటే ఏం చేసేవారు? వాళ్లు వెంటనే ఓ టీవీ ఛానెల్‌కు ఫోన్ చేసి చెప్పేవారు. సెకన్లలో దేశమంతా, కాదు, ప్రపంచమంతా యీ వార్త పాకిపోయేది. పది నిమిషాల్లో వేలాదిమంది తీహార్ జైలు ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టేవారు.

ఢిల్లీ రేప్ జరిగినప్పుడు కొవ్వొత్తులు చేపట్టి 'రేపిస్టులను ఉరి తీయండి' అని వేలాదిమంది నినాదాలు యిచ్చినట్టే, 'ఉరి ఆపండి, అది అమానుషం, వందలాది దేశాల్లో ఉరిని రద్దు చేశారు' అంటూ నినాదాలు యిచ్చేవారు. శాంతిభద్రతల సమస్యగా పరిణమించేది. లాఠీచార్జి, బాష్పవాయుప్రయోగం, జలఫిరంగులు.. నలుగురు ప్రదర్శనకారులు, ముగ్గురు పోలీసులు మ ృతి...! ఇంటర్నేషనల్ మీడియా అక్కడే కెమెరాలు పెట్టుకుని కూర్చుని ప్రచారం కల్పించేది. ప్రభుత్వం జడిసిపోయి, ఉరి వాయిదా వేసేది. ప్రభుత్వం ఉరి తీయడంపై యీ స్థాయి వరకు తీసుకుని వచ్చిందని గ్రహించిన ఉగ్రవాదులు విమానప్రయాణీకులను హైజాక్ చేయడమో, కశ్మీర్ రాజకీయ నాయకుణ్ని కిడ్నాప్ చేయడమో చేసి, అఫ్జల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేసేవారు. ఇక రాయబారులు, మధ్యవర్తులు.. అఫ్జల్‌ను విడిచి పెట్టవలసి వచ్చేది. బయటకు వెళ్లి పార్లమెంటుతో బాటు పది అసెంబ్లీలపై దాడులు చేయించేవాడు. ఎవరు తీసుకుంటారండీ యింత రిస్కు? అందుకే స్పీడు పోస్టులో కబురు పంపారు. బావుండదని ఆగారు కానీ లేకపోతే పావురాయి టపా పంపి వుండేవారు.

ఇక శవాన్ని కుటుంబానికి అప్పగించలేదు, అంత్యక్రియలు సరిగ్గా జరిగాయో లేదో.. అన్న విమర్శలు. కబురు గానీ, యివి గానీ కేవలం అఫ్జల్ కుటుంబానికి చింత కలిగించే అంశాలు. అఫ్జల్ కారణంగా చనిపోయిన కుటుంబాల వెతలు ఎవరైనా విన్నారా? ఆ చనిపోయినవారి శవాలతో తీవ్రవాదులు సవ్యంగా వ్యవహరిస్తారా? శవాలను తొక్కుకుంటూ వెళ్లడాలు, కిటికీలోంచి విసిరేయడాలు చూడలేదా? వీళ్లేమైనా ధర్మయుద్ధంలో మరణించినవారా? నియమాలప్రకారం పోరాడినవారా? దేశాల మధ్య అయితే ప్రిజనర్స్ ఆఫ్ వార్‌తో ఎలా వ్యవహరించాలో ఒప్పందాలుంటాయి. వీళ్లు ఒప్పందాలకు, నియమాలకు బయట వ్యవహరించే వ్యక్తులు. రాజకీయాలతో సంబంధం లేని సామాన్యులను సైతం విచక్షణారహితంగా హతమార్చే రకాలు. హతుల కుటుంబాల గోడు గురించి ఒక్క క్షణం కూడా ఆలోచించని రకాలు. ఈ ధూర్తులతో వ్యవహరించినపుడు కూడా రాజ్యం కొన్ని నియమాలకు కట్టుబడి వుండాలని మేధావులు ఉద్బోధిస్తారు. రైటే, హంతకుడిని రాజ్యం హత్య చేయదు. విచారణ చేసి శిక్షిస్తుంది. కానీ కసబ్, అఫ్జల్ వంటి వారి విషయం వేరు. మామూలు హంతకుడైతే అతని సమాధి గురించి ఎవరూ పట్టించుకోరు. కానీ యిలాటివాళ్ల సమాధులకు ఎంతో ప్రాముఖ్యత లభిస్తుంది. తీవ్రవాదులు ఆ సమాధులను దర్శించి స్ఫూర్తి పొందుతారు. 'నీవు తలపెట్టిన పనిని మేం పూర్తి చేస్తాం' అని ప్రతిజ్ఞలు చేస్తారు. ఒక అఫ్జల్ స్థానంలో వెయ్యిమంది అఫ్జల్‌లు తయారవుతారు. అవసరమా? ఒక్క అఫ్జల్‌ను ఉరేయడానికి పుష్కరం పట్టింది. అంతమంది అఫ్జల్‌లతో ఎలా వేగుతాం? అన్నాళ్లూ శాంతియుత జీవనానికి మనం నోచుకోమా?

ఈ విషయాలు పాలన చేసే నాయకులందరికీ తెలుసు. కశ్మీర్ ముఖ్యమంత్రికి తెలుసు, అతని నాయనకూ తెలుసు, ప్రధానికీ తెలుసు. అయినా వాళ్ల రాజకీయ అవసరాలు వాళ్లచేత అలా మాట్లాడిస్తాయి. మనకు ఆ అవసరాలు లేవు. ఉన్నదున్నట్టు మాట్లాడుకోవచ్చు. మాట్లాడుకున్నాం. ఆపై 'దిసీజ్ పార్ట్ ఆఫ్ ద గేమ్' అనుకుని వూరుకుందాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 17 వీక్లీకై** **ఎమ్బీయస్ : గాలికి ఎదురుగాలి**

ఇవాళ చంద్రబాబుగారికి ప్రమాదం తప్పింది. అది నిజమనే నేను నమ్ముతున్నాను. పబ్లిక్ సింపతీకోసం తూలి పడబోయినట్టు యాక్షన్ చేశారని, పైనుండి వైర్లు ఏవో కట్టి, సినిమాల్లో యాక్షన్ సీన్లు తీసినపుడు చేసే హంగామా చేశారని – రేపు "సాక్షి" రాసినా

నేను నమ్మను. ఏ పనీ చేయకుండా యింట్లో కూర్చుంటేనే బాత్‌రూమ్‌లో జారి పడుతున్న యీ రోజుల్లో రోజులతరబడి, వందలాది జనం మధ్య మసలేటప్పుడు యిలాటి ప్రమాదాలు సామాన్యమని నమ్ముతాను. ఆ నమ్మకానికి వ్యతిరేకంగా వార్తలు వచ్చినపుడు మళ్లీ సందేహంలో పడే రకం కాదు నేను. 'అబ్బే యిదంతా గ్రాఫిక్, మార్ఫింగ్! అలా అని ఎవరో ఫేస్‌బుక్‌లో పెట్టారు, ట్విట్టర్‌లో పెట్టారు, దానికి బాబుగారు సమాధానం చెప్పాలి, పనులన్నీ మానేసి వాళ్ల శంకలు తీరుస్తూ కూర్చోవాలి, ప్రజాజీవితంలోకి వచ్చాక యిది ఒక బాధ్యత' అని టీవీల కెక్కి డిమాండ్ చేయను. అలా చేస్తే గాలిగారికీ, నాకూ తేడా లేకుండా పోతుంది.

గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు మంత్రిగా చేసినపుడు సమర్థవంతంగా తన శాఖలు నిర్వహించారని చెప్పుకుంటారు. కానీ ఆయనకు రాజకీయ స్థిరత్వం తక్కువ. అలాటి జాతకులు కొందరుంటారు. ఆల్వేజ్ ఆన్ ద రాంగ్ సైడ్! పోన్లెండి, దానికేం చేయలేం కానీ, ఆయనకు నోరెక్కువ. ఎంతమాట పడితే అంత మాట అనేస్తారు. అనడంలో చాలా ఘాటుగా అంటారు. షర్మిలకు ఆపరేషన్ జరగలేదని ఎవరో అనుమానం రేకెత్తించారాయనకు. 'చంద్రుడి మీదకు మనిషి కాలు పెట్టనే లేదు, నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టూడియో సెటింగ్‌లో చేసిన డ్రామా అది, అంతా అమెరికా వాళ్లు కల్పించిన మాయ' అని 40 ఏళ్ల తర్వాత కూడా యింకా కథలు, కథనాలూ వస్తూనే వున్నాయి. నేతాజీ యింకా బతికే వున్నాడనీ, హిట్లర్ బంకర్‌లో చావలేదని, బతికి బయటకు వచ్చి పెయింటింగ్‌లు వేసుకుంటూ బతికాడనీ.. యిలా ఎవరో ఒకరు రాస్తూనే వుంటారు. గతంలో మ్యాగజైన్లలో చోటు తక్కువగా లభించేది కాబట్టి యిలాటివి తక్కువగా వెలువడేవి. ఇప్పుడు యింటర్నెట్‌లో స్పేసే సేసు. నా బోటివాడు పుంఖానుపుంఖాలుగా రెండు చేతులా (కీ బోర్డుని రెండు చేతులతోనూ బాదతాంగా!) రాసుకుంటూ పోయినా తరగనంత చోటు. పైగా అడ్డేవాడు లేడు, అడిగేవాడు లేడు.

ఇలాటివి విన్నపుడు తమాషాగా వుందే అని వూరుకోవాలి. ఫేస్‌బుక్ వార్తలనే నిజమని నమ్మేసి గాలిగారు షర్మిల ఆపరేషనే చేయించుకోలేదు అంటూ రచ్చకెక్కారు. దానికి సాక్ష్యం ఏమిట్రా అంటే ఫోటోలుట. అదో పెద్ద సాక్ష్యమా? నొప్పి వున్న కాలుమీద ఎలా ఆనతారు? అనవచ్చు, ఆనాక అమ్మో అనుకుని బరువు యీ కాలుమీద మోపవచ్చు. అది పట్టుకుని అంత రెచ్చిపోతే ఎలా? జవాబుగా షర్మిల గారేమంది? ఆపరేషన్ జరిగిందని రుజువు చేస్తే వచ్చి కాళ్లు పట్టుకోవాలంది. జరగలేదని రుజువు చేస్తే తను పట్టుకుంటానంది. గాలిగారికి వడగాలి కొట్టింది. ఇంటర్నెట్ వార్తలు నమ్మేసి దూకుడు చూపకూడదని కాస్త ఆలస్యంగా అర్థమయ్యేలోపున షర్మిల యీయన గాలి తీసేసింది. ఈయనకు ఏం మాట్లాడాలో తెలియక 'మీరు జగన్ బెయిల్ కోసం సోనియా కాళ్లు పట్టుకోలేదా?' అంటూ అర్థం పర్థం లేకుండా మాట్లాడాడు. సోనియా కాళ్లు పట్టుకోవడం యీయన చూశాడా?

షర్మిల రాజకీయాల్లో స్థిరపడి వుంటే కాళ్లు పట్టుకోవడం గురించి మాట్లాడి వుండేది కాదు. ప్రతి వృత్తిలోనూ కొన్ని పరిమితులుంటాయి, వాడాల్సిన పరిభాష వుంటుంది, అన్వయాలుంటాయి. రాజకీయాల్లో ఎవరైనా అవినీతి ఆరోపణలు చేయగానే 'నువ్వు చేయలేదా? నీ కంటె నేను చేసినది తక్కువే' అని అనకూడదు. 'నేను అవినీతి చేసినట్టు నిరూపిస్తే ఆ డబ్బు వెనక్కి యిచ్చేస్తా..' అని కూడా అనకూడదు. '..రాజకీయ సన్యాసం తీసుకుంటా' అనాలి. దానివలన ప్రజలకు ఒరిగేదేముంది? కానీ అలాగే అనాలి. వీళ్లు యిలా అన్నప్పుడు అవతలివాళ్లు 'అంటే పట్టుకోవడానికి, నిరూపించడానికి వీల్లేని విధంగా చేశావా?' అని అడగకూడదు. 'ప్రజల కోర్టులోనే నిజానిజాలు తెలుస్తాయి. వాళ్లు చాలా తెలివైనవాళ్లు.' అనాలి. అంటే 'ఎన్నికల వరకు మనం యిలాగే ఆరోపణ-ప్రత్యారోపణ చేసుకుంటూ వుందాం' అని సందేశం అన్నమాట. అలాగే ఎవరైనా ఏదైనా అంటే 'క్షమాపణ చెప్పాలి' అనేసి వూరుకోవాలి. వాళ్లు చెప్పకపోయినా ఏమీ అనకూడదు. వాళ్ల పాపాన వాళ్లే పోతారు అని వూరుకోవాలి.

షర్మిల కొత్తగిత్త కాబట్టి యిలాటి మర్యాదలు తెలియవు. 'నాది తప్పయితే నేను కాళ్లు పట్టుకుంటాను, వాళ్లది తప్పయితే వాళ్లు కాళ్లు పట్టుకోవాలి' అని మీరూ నేనూ మాట్లాడినట్లు మాట్లాడేసిందావిడ. గాలి కూడా అదే ఎత్తి చూపారు. 'క్షమాపణ అడగవచ్చు కానీ కాళ్లు పట్టుకోమనడం ఏమిటి?' అని దెప్పి పొడిచారు - అక్కడికేదో క్షమాపణ మాత్రం చెప్పి కాళ్లు పట్టుకోవడం మాత్రం వాయిదా వేసినట్టు! 'ఫేస్‌బుక్‌లో కుర్రకారు చేసిన కామెంట్లు చూసి ఏదో అనేశాను, వదిలేయ్ తల్లీ ఏదో పెద్దముండావాణ్ని' అని వున్నా బాగుండేది. 'పట్టుకోవడానికి అవేమైనా గోల్డెన్ లెగ్సా?' అంటూ ఎదురు తిరగడం మరీ ఘోరంగా తోస్తోంది. 'గోల్డ్ అయితే పట్టుకుందును, వేల్యూ ముఖ్యం తప్ప, గౌరవం కాదు' అన్న ధ్వని వినిపిస్తోంది. గాలి వంటి సీజన్డ్ పొలిటీషియన్ యిలా కంగు తినడం వింతగా వుంది.

దీనిలో నీతి ఏమిటంటే - వెటరన్స్‌తో పేచీ పెట్టుకోవడం యీజీ, షర్మిల వంటి ఎమెచ్యూర్స్‌తో అయితే గుక్క తిప్పుకోవడం కష్టం!

**- ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 18,19 వీక్లీకై** **ఎమ్బీయస్ : అపరాధా? పారాహుషారీయా?**

హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌటాలా, తనయుడు అజయ్ కుమార్, టీచర్ల నియామకాల కుంభకోణంలో చెరో పదేళ్ల జైలు శిక్ష పడి జైలుకి వెళ్లారని తెలుసు. ఇలాటి అవినీతి భాగోతాలు మనకు కొత్త కాదు కాబట్టి పెద్దగా పట్టించుకోము. అయితే దానిలో సంజీవ్ కుమార్ అనే అధికారి పాత్ర గురించి ఒక ఆసక్తికరమైన కోణం వుంది.

1999లో అప్పటి హర్యానా ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా 3000కు పైగా ఖాళీలున్నాయని,

జూనియర్ బేసిక్ ట్రెయినింగ్ పొందినవారిని నియమిస్తామని ప్రకటించాడు. అసలు ఆ పని స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌ది. వాళ్లు తన మాట వినరేమోనని నియామకాలను ప్రైమరీ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు పరిధిలోకి తీసుకుని వచ్చాడు. టీచర్ పోస్టులకు పరీక్షలు నిర్వహించే పనిని డిపార్టుమెంటు వారు 18 జిల్లాల ప్రైమరీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు అప్పగించారు. వాళ్లు అవన్నీ పూర్తి చేసి కొంతమందిని ఎంపిక చేసి సెక్రటేరియట్‌లోని ప్రైమరీ ఎడ్యుకేషన్ విభాగానికి పంపారు. ఓం ప్రకాశ్‌కు కాండిడేట్లకు మార్కులు చాలా తక్కువగా వచ్చాయి. ఇంటర్వ్యూలోనైనా తన వాళ్లకు ఎక్కువ మార్కులు వేయించుకని గట్టెక్కించవచ్చు కదాని వాళ్లకోసం ఇంటర్వ్యూ మార్కుల శాతం 12.5% నుండి 20%కు పెంచేశాడు. అయినా వాళ్లు గట్టెక్కలేకపోయారు. ఫైనల్ జాబితాలు తయారయిపోయాయి. వాటిని అమలు చేయకుండా ఆపాడు. అంతకుమించి ఏదైనా చేయడానికి సంకీర్ణప్రభుత్వం నడుపుతున్నాడు కాబట్టి కుదరలేదు.

2000 ఫిబ్రవరి-మార్చిలో జరిగిన ఎన్నికలలో తన లోక్‌దళ్ పార్టీకి పూర్తి మెజారిటీ రావడంతో ధైర్యం వచ్చింది. అర్హతలతో సెలక్టయి జాబితాలకు ఎక్కిన వారిని పక్కన పడేసి తమకు డబ్బిచ్చినవారిని నియమించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇలాటి సందర్భాల్లో పాత పరీక్షను ఏదో సాకుతో రద్దు చేసి తమవాళ్ల చేత పరీక్ష రాయించి, తమవాళ్లనే యిన్విజిలేటర్లుగా వేయించి, తమవాళ్ల చేతనే దిద్దించి, మార్కులు ఎక్కువ వేయించి, సెలక్టు చేయించడం మామూలుగా అన్ని రాష్ట్రాలలో జరిగే తంతు. అయితే హర్యాణాలో యింత తతంగం అనవసరం అనుకున్నారు. తమ మనుష్యులను పరీక్ష పేరుతో కాస్సేపైనా కూర్చోబెట్టడం యిష్టపడలేదు. వీళ్ల పేరుతో ఓ జాబితా తయారుచేసి, పాత జాబితా స్థానంలో యిది పెట్టేస్తే సరి అనుకున్నారు. పాతవాళ్లంతా గంగలో దిగనీ, మనవాళ్లకు ఆటోమెటిక్‌గా ఉద్యోగాలు వచ్చేస్తాయి. దీనిలో పడాల్సిన కష్టమంతా - ఆ పాత జాబితా తీసిపారేసి కొత్త జాబితా ఒకటి సృష్టించేయడం! ఆ కొత్త జాబితాకై కలక్షన్ సాగుతూండగానే ప్రైమరీ ఎడ్యుకేషన్‌కు డైరక్టర్‌గా వున్న అర్ పి చందర్ గారు వచ్చి లిస్టు ప్రకారం ఉద్యోగనియామక పత్రాలు పంపించేద్దామని కూర్చున్నాడు. వాళ్లను వేయడం కాదు, యీయన్ని తీసేయడం అత్యవసరం అనుకున్నాడు ఓం ప్రకాశ్. 2000 ఏప్రిల్ 26 న ఆయన్ని బదిలీ చేసి పంపేశాడు.

అయితే ఆయన స్థానంలో వచ్చిన ఐయేయస్ అధికారిణి రజనీ సిబ్బల్ కూడా గట్టిపిండమే. అది తెలియక ఆవిడకు అపరిచితుల ద్వారా ఫోన్ కాల్ చేయించాడు - జాబితా మార్చేస్తే ఉద్యోగాల పేరు చెప్పి సేకరించిన డబ్బులో 5% యిస్తామని! ఆవిడ ఒప్పుకోలేదు సరికదా తిట్టింది. ఆవిడ జాబితాలు పెట్టిన బీరువా తాళం చెవి కోసం ఆవిడ యింట్లో దొంగలు పడ్డారు. ఎక్కడ దాచిందో ఏమో కానీ తాళం చెవి చిక్కలేదు. ఇక లాభం లేదని ముఖ్యమంత్రిగారే ఆవిణ్ని ఓ సమావేశానికి పిలిచి 'ఆ లిస్టులేమిటి? ఏం చేస్తున్నారు?' అంటూ మాట్లాడారు. అక్కడ ఆయనగారి పుత్రరత్నం అజయ్ చౌటాలా (అతనేమీ మాట్లాడలేదు కానీ అసలు అతనక్కడ వుండవలసిన అవసరం కూడా లేదు), ముఖ్యమంత్రిగారి రాజకీయ సలహాదారు షేర్ సింగ్ బాద్‌షామి (ఇప్పుడు ఎమ్మెల్యే), ముఖ్యమంత్రిగారి ఓఎస్‌డి (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ), ఐయేయస్ అధికారి విద్యాధర్ వున్నారు.

ముఖ్యమంత్రి ఎదుటే బాద్‌షామి రజనీతో 'లిస్టుల్ని మార్చండి' అన్నాడు. ఈవిడ కుదరదని చెప్పి వచ్చేసింది. పైగా 'ఈ జాబితాల ఆధారంగా అపాయింట్‌మెంట్ లెటర్లు తయారుచేయండి' అని తన క్రింది అధికారులను జూన్ 20 న ఆదేశించింది. అమ్మో, ఆర్డర్లు వెళ్లిపోతే గుక్క తిప్పుకోవడం కష్టం, యీ కొరకరాని కొయ్యను పంపేయకపోతే లాభంలేదు అనుకుని వెంటనే ఆవిణ్ని వెంటనే బదిలీ చేసేశారు. సంజీవ్ కుమార్ అనే మరో ఐయేయస్ అధికారికి ఆవిడ బాధ్యతను అదనంగా అప్పగించారు. అంటే ఆవిడ ఆ పదవిలో వున్నది రెండు నెలలు మాత్రమే! ఆవిణ్ని పంపేశాక జూలై 16 న రిజల్ట్ కమిటీ అని ఒకదాన్ని ఏర్పాటు చేసి 'వెంటనే ఫలితాలు ప్రకటించండి' అని ఆదేశించాడు ఓం ప్రకాశ్.

అయితే రజనిగారు వెళుతూ వెళుతూ ఏం చేసిందంటే 18 జిల్లాల లిస్టులు ఓ బీరువాలో పెట్టి తాళం వేసింది. దానికి గుడ్డలు చుట్టి ముడివేసి దాన్ని రూపాయి నాణెంతో సీలు చేసి మరీ చార్జి యిచ్చింది. తాళం చెవిని సీల్డ్ కవర్లో పెట్టింది. ఆమెను హఠాత్తుగా బదిలీ చేయడంతో అందరికీ అనుమానాలు వచ్చేశాయి. దాంతో కొత్తగా వచ్చిన సంజీవ్ కుమార్ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. 2000 సెప్టెంబరు 16న రిజల్ట్స్ కమిటీకి చెందిన ఆరుగురు సభ్యుల ఎదుట ఆ అలమారాను తెరవడం జరిగింది. ఆ సీలు ఊడదీసి, గుడ్డలూడదీసి, బీరువా తెరిచి దానిలో వున్న జాబితాల ప్రకారం ఇంకో నెలలో మొత్తం 3206 మందికి ఎపాయింట్‌మెంట్ లెటర్స్ పంపేశారు. అందరూ సంతోషించేశారు, ఒరిజినల్‌గా సెలక్టయినవాళ్లు తప్ప! అయితే అలాటివాళ్లకు నోరుండదు కనక, ఉన్నా ఎవరూ పట్టించుకోరు కనక కథ సుఖాంతం అనుకున్నారు.

అయితే వాటాల్లో ఎక్కడ తేడాలొచ్చాయో ఏమో సంజీవ్ కుమార్‌గారు 2003 జులైలో సుప్రీం కోర్టులో కేసు పడేశాడు - 2000 సంఎఐ నాటి 3206 టీచర్ల నియామకాల్లో అవినీతి చోటు చేసుకుందని! దానిపై కోర్టు నవంబరులో సిబిఐ విచారణకు ఆదేశించింది. సిబిఐ డిసెంబరులో ప్రాథమిక విచారణ ప్రారంభించింది. ఆర్నెల్ల తర్వాత 62 మందిపై అవినీతినిరోధక చట్టం కిందపెట్టింది. వారిలో సంజీవ్ కూడా వున్నాడు. ఇదంతా చౌటాలా చేస్తున్న కుట్ర అని సంజీవ్ గోల చేశాడు. "నేను వాళ్ల ఒత్తిడికి లొంగకుండా అసలు జాబితా ప్రకారం ఎపాయింట్‌మెంట్ లెటర్స్ జారీ చేసినందుకే నన్ను నెలలోపున బదిలీ చేశారు. మా యింట్లో దొంగతనం చేయించారు. రెండుసార్లు నాకు ప్రమోషన్లు రాకుండా చేశారు. సస్పెండ్ చేశారు, సస్పెన్షన్‌లో వుండగా యివ్వాల్సిన సగం జీతం కూడా యివ్వలేదు. నేను నా స్నేహితుల సహాయంతో బతుకుతున్నాను. నేను కేసు పెట్టాక నాపై ఒత్తిడి మరింత పెరిగింది. బెదిరింపు

ఫోన్ కాల్స్ వచ్చాయి. ఓ సారి నేను విసిగిపోయి ఎవడ్రా నువ్వు? అని అరిచినా ఇంకో రెండు రోజులకు చంద్రస్వామి సెక్రటరీ అంటూ ఎవడో ఫోను చేసి వచ్చి నన్ను కలవమన్నాడు.

''2003 అక్టోబరు 22 న చంద్రస్వామి నాతో 8 నిఎంఎలు మాట్లాడాడు. ''అవతలివాళ్లు చాలా గట్టివాళ్లు. నీ ప్రాణం తీయగలరు జాగ్రత్త.'' అని హెచ్చరించాడు. ఆ సంభాషణను నేను రికార్డు చేశాను. తర్వాత కొన్ని రోజులకు రెండో యింటర్వ్యూ జరిగింది. అప్పుడు నేను మా ఆవిడకు చెప్పి వెళ్లాను – 'ఓ గంటలో రాకపోతే పోలీసులకు చంద్రస్వామిపై ఫిర్యాదు చేయి' అని. అవేళ కూడా చంద్రస్వామి హెచ్చరిస్తూ వచ్చాడు. ''ఇంతకీ ఏం చేయమంటారు చెప్పండి..'' అని అడిగాను. ''రాజీపడు. ఈ టీచర్ల స్కాముపై డివిజనల్ కమిషనర్ చేత చేయించే విచారణ చాలని కోర్టులో చెప్పు.'' అన్నాడు. నేను సరే అన్నాను. అయితే కోర్టులో మళ్లీ సిబిఐ విచారణకే డిమాండ్ చేయడంతో వాళ్లు బిత్తరపోయారు. స్వర్ణచతుర్భుజి హైవే కంట్రాక్టుల విషయంలో జరిగిన అవకతవకలను బయటపెట్టిన సత్యదేవ్ దూబే అనే విజిల్ బ్లోయర్‌కు పట్టిన గతే (అతన్ని చంపేశారు) నాకూ పడుతుందని భయంగా వుంది.'' అంటూ డిసెంబరు, 2003 నాటి ఔట్‌లుక్ పత్రికకు యిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. అప్పుడు ప్రజలంతా సంజీవ్ ఎంత నిజాయితీపరుడో, నిజాయితీ కారణంగా ఎన్ని అవస్థలు పడుతున్నాడో అని జాలిపడ్డారు.

ఏం చేసినా 2004 నుండి నాలుగేళ్ల పాటు పరిశోధించి చివరకు 2008 జూన్‌లో 62 మందిపై సిబిఐ దాఖలు చేసిన చార్జిషీటులో ఓం ప్రకాశ్, అతని కొడుకు అజయ్ సింగ్, విద్యాధర్, బాద్‌షామిలతో బాటు సంజీవ్ కుమార్‌ను కూడా చేర్చారు. దీనికి సంజీవ్‌కుమార్ అభ్యంతరం తెలిపాడు. ''అవినీతి జరిగిందని లోకానికి చెప్పినది నేను. నేను అపరాధినైతే దాన్ని ఎందుకు బయటపెడతాను? నేను చెప్పకపోతే మీకు ఆధారాలు దొరికేవా? నేను విజిల్ బ్లోయర్‌ను. నాపై కేసు పెట్టడం అన్యాయం'' అని వాదిస్తున్నాడు. గూరా?వాడు ''పారాహుషార్'' అని కేకలు పెట్టి, యీల వూది, దొంగతనం జరగబోతోందని లేదా జరిగిందని గగ్గోలు పెట్టి అందర్నీ మేల్కొల్పినట్లు నేరాల విషయంలో అప్రమత్తం చేసేవారిని 'విజిల్ బ్లోయర్స్' అంటారు. తెలుగులో వాళ్లను పారాహుషారీ లనవచ్చేమో! నేరస్తులు వీళ్లపై పగబడతారు కాబట్టి వీళ్లకు కోర్టు రక్షణ కల్పిస్తుంది. తనకు అటువంటి రక్షణ కల్పించి, తనను మెచ్చుకోవాలని సంజీవ్ కుమార్ వాదన. అవునా? కాదా? అని సుప్రీం కోర్టు తీవ్రంగా చర్చించింది. సిబిఐను విచారించమంది.

సిబిఐ విచారణలో తేలినదేమిటంటే – సంజీవ్ కుమార్ తను చార్జి తీసుకున్న నెలలోపునే ఆగస్టు మధ్యలో ఆ బీరువా తెరిచి తన పిఏను, ఆఫీసు సూపర్నెంటులకు ఆ లిస్టులిచ్చి ''వీటిల్లో ఎస్సీ, బిసి కాండిడేట్లు ఎంతమంది వున్నారో చూడండి. వాళ్ల కోసం పెట్టిన కోటాను అధిగమించి, జనరల్ కోటాలో కూడా సెలక్టయ్యారేమో చూడండి.'' అన్నాడు. వాళ్లు ఆ కసరత్తు చేసి ఏదీ తేల్చలేక కుమార్‌కు ఆ లిస్టులు తిరిగి యిచ్చేశారు. అందువలన సెప్టెంబరులో కమిటీ ముందు సీలు తెరిచి బీరువా తెరవడం అనేది పెద్ద నాటకం అని ఖాయమై పోయింది. సంజీవ్ పాత లిస్టులు బయటపడేసి కొత్త లిస్టులు లోపల పెట్టేసి, బీరువాకు సీలు వేసి మళ్లీ కమిటీ ముందు తెరిచాడన్నమాట.

తమాషా ఏమిటంటే సంజీవ్ ఆ లిస్టులతో కోర్టును తప్పుదారి పట్టించడానికి చూశాడు. సెప్టెంబరులో బయటకు వచ్చిన లిస్టులే అసలైన జాబితాలని సంజీవ్ కోర్టులో వాదిస్తూ వచ్చాడు. సంజీవ్ ఎంత దేవాంతకుడంటే అతను తిమ్మిని బెమ్మి చేశాడు. పాత లిస్టును సుప్రీం కోర్టుకు సమర్పించి ''ఇదిగో యిది ఓం ప్రకాశ్ తయారు చేయించిన కొత్త నకిలీ లిస్టు. సెప్టెంబరులో నేను బీరువాలోంచి బయటకు తీసిన అసలైన పాత లిస్టును మార్చేసి దాని స్థానంలో దీన్ని పెట్టమన్నాడు. బెదిరించాడు. కానీ నేను ఒత్తిళ్లకు లొంగలేదు. అసలైన లిస్టునే అమలు చేశాను. దానితో ఓం ప్రకాశ్ నాపై పగబట్టి వేధించాడు.'' అన్నాడు. సిబిఐ వారు నిజానిజాల కోసం జాబితాలు పంపిన జిల్లా అధికారులని అడిగారు. ''సుప్రీం కోర్టుకు అధీనంలో వున్న పాత జాబితాలే అసలైన జాబితాలు. సంజీవ్ కుమార్ చూపిస్తున్న జాబితాలు ఆయన మా చేత కొత్తగా తయారుచేయించినవి. మాకు యిష్టం లేకపోయినా మమ్మల్ని సంజీవ్ కుమార్, విద్యాధర్, బాద్‌షామి బెదిరించారు. ఉద్యోగాలు పీకేయడమే కాక, మాకు, మా కుటుంబసభ్యులకు కూడా హాని చేస్తామని అడలగొట్టడం చేత మేమా పని చేశాం.'' అని చెప్పారు. అంటే యితను దొంగలిస్టులను అమలు చేసి, అసలు లిస్టులను ఓం ప్రకాశ్ చేయించిన లిస్టులుగా చూపిస్తున్నాడన్నమాట.

సుప్రీం కోర్టు తన తీర్పులో ఓం ప్రకాశ్‌కు, కొడుక్కి, యితరులకు శిక్ష వేస్తూ సంజీవ్ కుమార్ విజిల్ బ్లోయర్ (పారాహుషారీ) అవునా కాదా అన్న విషయం కూడా చర్చించింది. ''అవునూ, కాదూ కూడా. అవును – ఎందుకంటే పాత ఒరిజినల్ జాబితాను తన దగ్గర పెట్టుకుని కోర్టుకి సమర్పించి వుండకపోతే ఈ స్కామ్ వెలుగులోకి వచ్చేదే కాదు. కాదు – ఎందుకంటే అతను అసలును నకిలీగా, నకిలీని అసలుగా భ్రమపెట్టి విచారణను తప్పుదారి పట్టించడానికి చూశాడు. తనను ముద్దాయిగా కాకుండా ప్రాసిక్యూషన్ సాక్షిగా చేయలేదని అతని ఫిర్యాదు. అతను సాక్షి కాదు, నేరంలో పాలు పంచుకున్నవాడే అనే సిబిఐ వాదనతో మేం ఏకీభవిస్తున్నాం. ముద్దాయి అయినంత మాత్రాన అతని సాక్ష్యాన్ని పూర్తిగా నిరాకరించలేము. ఎందుకంటే నేరం ఎలా జరిగిందో అతని కంటె పూర్తిగా వేరెవరికీ తెలియదు. అందువలన అసలు, నకిలీ జాబితాల విషయంలో తప్ప తక్కిన విషయాల్లో అతని సాక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుంటూనే అతనికి పదేళ్ల శిక్ష విధిస్తున్నాం'' అంది కోర్టు.

మంచి సినిమా కథకు సరిపడా మెటీరియల్ వుంది సంజీవ్ కుమార్ కథలో. విలన్‌తో కలిసి నేరం చేసి, వాటాలు తెగక, తను పెద్దమనిషిగా బయటకు వచ్చి నేరాన్ని ఆపినట్టు, అందుకే విలన్ చేతిలో బాధలు పడినట్టు నాటకమాడి, దానికి సాక్ష్యంగా అసలునే

నకిలీగా, నకిలీనే అసలుగా చూపబోయిన ఘనుడతను! – ఎమ్బీయస్ ప్రసాద్ ష

**ఫిబ్రవరి 20, 21 వీక్లీకై** **ఎమ్బీయస్ : పాదయాత్రీ యిమేజి లాభమా? భారమా?**

చంద్రబాబుగారి పాదయాత్ర అవిశ్రాంతంగా సాగిపోతోంది. గణతంత్ర దినోత్సవంతో ముగియవలసిన యాత్ర ముగియలేదు. జనగణంతో కలిసి ముందుకు సాగుతూనే వుంది. దీనిలో తంత్రం ఏమిటో మాత్రం తెలియదు. ఇంట్లో పోరు వున్నవాడు ఆఫీసులోనే కాలమంతా గడిపేసినట్టు, బాబు పార్టీ యిరకాటాలను తప్పించుకోవడానికే అంతూ పొంతూ లేకుండా రోడ్లు కొలుస్తూ పోతున్నారని పత్రికల్లో రాస్తున్నారు.

ెడిపి భవనానికి వచ్చి కూర్చుంటే తెలంగాణ టిడిపి నాయకులు వచ్చి 'తెలంగాణకు అనుకూలం అని మనం గట్టిగా చెప్పినా జనం నమ్మటం లేదు. మళ్లీ ఇంకోసారి నిర్ద్వంద్వంగా ఓ ప్రకటన యివ్వండి' అని వచ్చి కూచుంటారు. సమైక్యవాదులు వచ్చి 'అలాటిదేదైనా యిస్తే ముందే చెప్పండి, తట్టా, బుట్టా సర్దుకుని అటు దూకేయడానికి రెడీగా వుంటాం' అంటారు. మధ్యలో మీడియావాళ్లు వచ్చి 'పార్టీ ఫిరాయింపుదారుల గురించి లోకేశ్ బాబు 420 లన్నాడు. అది వచ్చి మీకు తగులుతోంది. మీరెన్నడూ మీ గతచరిత్ర గురించి యింట్లో చెప్పలేదా?' వంటి ప్రశ్నలు గుప్పిస్తారు. పైగా 'పాదయాత్ర వలన మీ శరీరంలో అదనపు కిలోలు తగ్గివుంటాయి వాటితో బాటు పార్టీలో ఎమ్మెల్యేలు కూడా తగ్గారు, ఎందుకంటారు?' వంటివి అడిగి చికాకు పెడతారు. అందువలన బాబు పాదయాత్ర అలా అలా చేసుకుంటూ పోతున్నారు అని అంటున్నారు కొందరు.

ఆయన పాదాలు, ఆయన కష్టం యాత్ర చేయనీ, ఇంట్లోనే సైకిలు తొక్కనీ.. మనకేం పోయింది? దానివలన ప్రజల కష్టాలు తెలుస్తాయని బాబు అంటున్నారు. మంచిదే తెలిస్తే యీ సారైనా అసెంబ్లీ సవ్యంగా జరగనిచ్చి వాళ్ల కష్టాలను ఏకరవు పెట్టి, ప్రభుత్వాన్ని నిలదీయమనండి, వింటాం. ఈ పాదయాత్ర వలన బాబుగారి యిమేజి పెరిగి టిడిపికి లాభం చేకూరుతుంది అంటున్నారు. అక్కడే నాక్కొన్ని సందేహాలు వస్తున్నాయి.

సంస్థ గానీయండి, పార్టీ గానీయండి – దాని అధిపతి ఎప్పుడూ ఆరోగ్యంగా, చురుకుగా కనబడాలి. అప్పుడే మార్కెట్లో దానికి డిమాండ్. ఫలానా పారిశ్రామికవేత్తకు కాన్సర్‌ట అని ఓ పుకారు పుట్టించండి, రెండో రోజుకి ఆయన కంపెనీ షేరు పడిపోతుంది. ఎందుకు? నడిపేది ఆయన కాదు కదా, ఆయన దగ్గర పనిచేసే వేలాదిమంది ఉద్యోగులు కదా! వాళ్లపాటికి వాళ్లు పని చేసుకుంటూ పోతారు కదా, అది మూతపడుతుందని ఎందుకనుకోవాలి? అనుకుంటారంతే! ఫలానా పారిశ్రామికవేత్తకు, అధికార పార్టీకి చెడిందట, కేసులు పెట్టి జైల్లోకి తోస్తారట అని కబురు వస్తే చాలు, అతని కంపెనీల్లో పైసా పెట్టుబడి పెట్టరు. ఏం అతను జైల్లో వుంటేనేం, అతను వచ్చి మిషన్ నడిపిస్తాడా? మార్కెట్లోకి వచ్చి సబ్బులు అమ్ముతాడా? – అలా అనుకోరు. ధీరూభాయి అంబానీ జబ్బుపడ్డారు. సమర్థులైన, ఆయనవద్దనే శిక్షణ పొందిన కుమారులు ముకేష్, అనిల్ కంపెనీ పగ్గాలను చేతిలోకి తీసుకుని నడుపుతున్నారని తెలియచెప్పి వుండకపోతే అప్పుడే రిలయన్సు కంపెనీ షేరు మంచాన పడేది.

అదేవిధంగా ఓ ముసలాయన పార్టీ పెట్టారనుకోండి, నాలుగైదేళ్ల కంటె బతకడని తోచిందనుకోండి, కార్యకర్తలు ఆ పార్టీలో చేరరు. నాయకుడు యూత్‌ఫుల్‌గా, పదికాలాల పాటు కళకళలాడుతూ బతికేట్లా కనబడాలి. ఎందుకంటే రాజకీయజీవితం కూడా 30, 35 ఏళ్ల పాటు సాగే కెరియర్ లాటిది. అడుగు పెట్టాక అలాఅలా పైకి వెళ్లి సుఖంగా రిటైరవాలని కోరుకుంటారు కానీ అర్ధాంతరంగా ముగిసిపోవాలని ఎవడూ అనుకోడు. రాజరికపు రోజుల్లో యుద్ధాలు చేసేటప్పుడు రాజుగారు శారీరకంగా, మానసికంగా చురుగ్గా వుండి, యుద్ధంలో తమకు గైడెన్సు యిచ్చేట్లా వుండాలని సైనికులు, సైన్యాధిపతి కోరుకుంటారు. రాజుగారే యీసురోమని వుంటే, సైనికులు ఎప్పుడు పారిపోదామా అని చూస్తారు. ఆధునిక కాలంలో దేశాధిపతులు కూడా ఫిట్‌గా వుండకపోతే ద్వైపాక్షిక చర్చల్లో తమ దేశం తరఫున సరిగ్గా బేరాలాడలేరని కాబినెట్ భయం. నియంతలైతే మరీ జాగ్రత్తగా వుండాలి. లేకపోతే సైన్యం తిరుగుబాటు చేసి దింపేస్తుంది.

అందువలన అధినేతలుగా వున్నవారు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అనారోగ్యం వున్నా దాన్ని బయటపడకుండా చూసుకోవాలి. మొగలాయీ చక్రవర్తుల దగ్గర్నుంచి, యీనాటి కుటుంబపార్టీ నేతల వరకూ అందరూ ముంచుకుని వచ్చేదాకా రోగాన్ని బయటకు ప్రకటించరు. బయటపడితే వారసులు తొందరపడి తిరుగుబాటు చేస్తారని భయం. కార్యకర్తలు పార్టీ విడిచి పెట్టి పోతారని భయం. అందువలన ఎప్పుడూ యాపిల్‌పండులా కనబడడానికే పార్టీ నాయకులు ప్రయత్నిస్తారు. లోపల ఎన్ని జబ్బులున్నా ఫుల్ హేండ్స్ చొక్కాయో, లాల్చీయో, గల్లాబందో వేసి కవర్ చేసుకుంటారు. సోనియాకు కాన్సర్ అన్న సంగతి ఓ పట్టాన బయటకు వచ్చిందా? చికిత్స తర్వాత తిరిగి వచ్చాక కనబడిన కాస్సేపూ ఆవిడ చకచకా నడుస్తూనే కనబడతారు. రోజంతా యింట్లో కూడా అంత హుషారుగా వుంటారని అనుకోవడానికి లేదు. నీరసంగా గోడ పట్టుకుని కూడా నడుస్తూండవచ్చు, అది యింట్లో వాళ్లకే తెలుస్తుంది. కానీ బయటకు కనబడిన కాస్సేపూ హుషారుగా, రోగం అనేదే తెలియనట్టు కనబడాలి. అదీ ట్రిక్కు.

ఎన్టీయార్ రాజకీయాల్లోకి వచ్చినపుడు చూడండి. 60 ఏళ్ల వయసులో నిర్విరామంగా నెలల తరబడి చైతన్యరథంపై తిరిగారు. యూత్‌ను ఉత్తేజపరిచారు. ఒక సైనికుడిలా ఖాకీ డ్రెస్సులో ప్రచారం చేశారు. పదవిలో వున్నంతకాలం ఫ్రెష్‌గా కనబడ్డారు. రెండో

పెళ్లి చేసుకున్నాక రంగురంగుల దుస్తులు వేసుకుని 1994 ఎన్నికల ప్రచారంలో వేదికలపై భార్యతో కలిసి ఆడి 'ఇంకా యూత్‌ఫుల్‌గానే వున్నాను' అని చూపించుకున్నారు. ఆయన తనను తాను దీనంగా చూపించుకున్నది ఒకేసారి – అమెరికా నుండి హార్ట్ ఆపరేషన్ చేయించుకుని వచ్చిన తర్వాత. అది కూడా ఎందుకంటే నాదెండ్ల యీ టైములో వెన్నుపోటు పొడిచాడు, చూడండి ఎంత అమానుషమో అనే అంశం ప్రజల్లోకి గట్టిగా వెళ్లేటందుకు! నెల్లాళ్ల తర్వాత మళ్లీ పదవి చేపట్టాక ఆ దీనావస్థ లేనే లేదు.

చంద్రబాబుగారికి కూడా యిది తెలుసు. అందుకే ఆయన ఎప్పుడూ దేనికీ చలించనట్లు నిటారుగానే నిలబడతారు. మంచి హైట్ వుంది కాబట్టి పదిమంది మధ్య కొట్టవచ్చినట్టు కనబడతారు. అవసరానికి మించిన కొవ్వు ఎక్కడా కనబడదు. బొజ్జ వుండదు. యోగా చేయడం వలననే యిది సాధ్యం అని  తనే చెప్తారు. బాబులో స్పెషాలిటీ ఏమిటంటే ఆయన కళ్లజోడు కూడా పెట్టుకోరు. హ్రస్వద ృష్టి ముందే వచ్చినా రాకపోయినా 40 ఏళ్లు దాటాక మనుష్యులందరికీ చత్వారం వస్తుంది. కొంతమందిలో కాస్త లేటుగా వస్తుంది కానీ 60 ఏళ్లు దాటినా రాని వ్యక్తి బాబు. అలా అని పేపరు, ఫైళ్లు చదవరా? టీవీ చూడరా? వాటివలన ఆయన కళ్లు ఎఫెక్టవవా? ఎంత యోగా చేసినా కళ్లు ఎల్లకాలం ఒకేలా వుంటాయా? ఏమో, నా అనుమానం – ఆయన యింట్లో కళ్లజోడు వేసుకున్నా బయట మాత్రం కళ్లజోడు పెట్టుకోకుండా ఒక హెల్దీ యిమేజి కాపాడుకుంటున్నారని! ఆయన అదే ఎప్పటికీ కాపాడుకుంటేనే బాగుంటుంది. ఎందుకంటే ఆయన పార్టీలో యువతను తీసుకురావడం లేదు. 'యువత అవసరం ఏముంది? నా కంటె మించిన యూత్ ఎవరున్నారు? శారీరకంగాగాని, మానసికంగాగాని, కొత్త ఆలోచనల్లో కానీ నేను యూత్ కాదని ఎవరనగలరు?' అన్న ధోరణిలో వున్నారాయన.

ఆ యూత్‌ఫుల్ యిమేజికి యీ పాదయాత్ర అడ్డువస్తోందని నా ఘోష. అంతకుముందు పాదయాత్రలైతే చిన్నవే. చకచకా నడిచేసేవారు. చివర్లో కూడా ఉత్సాహంగా కనబడేవారు. ఇప్పుడు నెలల తరబడి చేయడంతో అలసట కనబడుతోంది. రోజులో కొన్ని గంటలపాటు మాత్రమే నడిచినా ఓపిక హరించిపోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. పైగా యాక్సిడెంట్లు. వేదిక కూలడం, మెట్లు కూలడం, తూలడం, మోకాలి నొప్పి, కాలు బెణకడం, డాక్టర్లు వద్దనడం, అయినా యీయన మొండికేసి నడవడం, కాస్సేపటికి ఆపేసి కూలబడడం, డాక్టర్లు వారం రోజుల విశ్రాంతి అంటే యీయన నాలుగు రోజులకే మళ్లీ తయారవడం, 'ఈ వయసులో కూడా యిన్ని అవస్థలు పడుతూ బాబు మనకోసం కష్టపడుతున్నారు' అంటూ పక్కనున్న నాయకుల ఓదార్పు మాటలు – అవసరమా యిదంతా? ఇదంతా చూస్తే ఆయనపట్ల జాలి కలుగుతోంది తప్ప స్ఫూర్తి కలగడం లేదు.

పాదయాత్ర అనగానే వైయస్ గుర్తుకు వస్తారు. వెంటనే పంచె ఎగ్గట్టి, కండువాను తలపాగగా చుట్టేసి, చెయ్యి వూపుతూ, నవ్వుతూ వెళ్లే యిమేజి కంటికి ఆనుతుంది. దానికి వ్యతిరేకంగా కాలు యీడుస్తూ నడిచే బాబు మనసుకు తోస్తే ఏం బాగుంటుంది? వైయస్‌కు – బట్టతల, కళ్లజోడు పెట్టుకుని బోల్డు ఫోటోలు, తాతగారిగా మనుమలు, మనుమరాళ్లతో ఫోటోలు – పోలిక చూసుకుంటే బాబు – తాత కాలేదు, బట్టతల లేదు, కళ్లజోడు లేదు.. యూత్‌ఫుల్‌గా యిమేజి మేన్‌టేన్ చేయవచ్చు. చేస్తూనే వచ్చారు.. యిదిగో యీ పాదయాత్ర దాకా. పాదయాత్రలో బాబు రోగిష్టిగా కనబడడం నాకు అస్సలు నచ్చటం లేదు. ఆయన సుగర్ లెవెల్స్ దగ్గర్నుంచి అన్నీ పేపర్లలో వచ్చేస్తున్నాయి. (సుగర్ వున్నా కళ్లు ఎఫెక్ట్ కాలేదంటే విశేషమే) వైయస్ పాదయాత్ర మధ్యలో వడదెబ్బకు చాలా రోజులు పడకేశారన్న సంగతి మనందరికీ గుర్తు వుంది. కానీ తర్వాత మళ్లీ పుంజుకుని కొనసాగించారు. పుంజుకునేదాకా అక్కడే మకాం పెట్టారు. బాబు పూర్తిగా పుంజుకోకుండానే నడవడమేల? జాలి పుట్టించే యిమేజి కలిగించనేల?

ఆలోచిస్తే బాబుకి జాలి పుట్టించే యిమేజి అచ్చి రాలేదు. అలిపిరి సంఘటన తర్వాత బాబు దాన్ని సొమ్ము చేసుకుందామని శాసనసభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ఆ ప్లాను ఘోరంగా చీదేసింది. ఎందుకంటే ఆ సంఘటన జరిగినది ఆయన ముఖ్యమంత్రిగా వున్న ప్రభుత్వంలోనే! అధికార పార్టీ టిడిపికి దాదాపు 60% సీట్లుండి కూడా తన అధినేతనే కాపాడుకోలేకపోయిన అసమర్థత ఆ ప్రభుత్వానిది. నాకింకా ఎక్కువ సీట్లు యివ్వండి, నక్సలిజాన్ని రూపుమాపుతా అనే నినాదంతో ఆయన రక్తసిక్తమైన దుస్తులతో ఫోటోలు తీయించుకుని పోస్టర్లలో వేయించుకుని ప్రచారం చేసుకున్నారు. ఫలితం అందరికీ తెలిసినదే. అయినా యీయన పాఠం నేర్చుకోలేదు. మోకాలినొప్పులతో నడవడాలు, కళ్లు తిరిగి పడడాలు  ఫోటోలు మీడియాలో వస్తున్నా ఈ పాదయాత్ర కొనసాగిస్తూనే వున్నారు. మెహబూబ్‌నగర్ జిల్లాలో వేదిక కూలిపోయి అందరూ దబ్బున పడిపోయిన దృశ్యాన్ని 2014 ఎన్నికల ప్రచారంలో వాడుకుంటారో ఏమో, ఏ సినిమా రచయిత చేతో – 'కూలుతున్నా, తూలిపడుతున్నా, నడుము'కుంటు'కుంటూ వస్తున్నా'.. అంతా మీకోసమే' అని పాట రాయించి నేపథ్యంలో వినిపిస్తారేమో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 22 వీక్లీకై**

## ఎమ్బీయస్ : సూర్యనెల్లి చీకటినీడ

'ఒక పదహారేళ్ల అమ్మాయిని ఓ ప్రియుడు యింట్లోంచి లేవదీసుకుని వచ్చాడు. తనివితీరా అనుభవించాక ఓ సెక్స్ రాకెట్‌కు అమ్మేశాడు. వాళ్లు ఆ అమ్మాయిని వ్యభిచారంలోకి దింపారు. 40 రోజుల్లో 40 మందిని తృప్తి పరిచిందామె. అప్పటికే బుద్ధి వచ్చినట్టుంది, యింటికి వెళ్లిపోతానని ఆ అమ్మాయి ఏడ్చింది. వదిలేస్తాం కానీ యీ విషయాలు బయటపెట్టావో నిన్నూ, నీ కుటుంబసభ్యుల్నీ చంపేస్తాం జాగ్రత్త అని బెదిరించారు వాళ్లు. ఆ అమ్మాయి సరేనంది.'

ఇలాటి కథలు కోకొల్లలు కాబట్టి దీన్ని కూడా యీ చెవితో విని ఆ వదిలేసి వుండేవారం. కానీ యీ కథ గురించి దేశమంతా

చర్చిస్తోంది – యీ కేసుతో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పి జె కురియన్ పేరు ముడిపడింది కాబట్టి! 1996 జనవరి–ఫిబ్రవరి నెలల్లో కేరళలో ఇడుక్కి జిల్లాలోని సూర్యనెల్లి అనే వూళ్లో యీ 40 రోజుల వ్యభిచారం (లేదా బలాత్కారం) నడిచింది. ఇడుక్కి ఎంపీగా, కేంద్రమంత్రిగా వున్న పిజె కురియన్ కూడా ఆ 40మందిలో వున్నాడని ఆ అమ్మాయి ఆరోపిస్తూ అందరి మీదా కేసు పెట్టింది. 1996 ఫిబ్రవరి 19 న కుమిళిలో గవర్నమెంటు గెస్ట్ హౌస్‌లో కురియన్ తనను బలాత్కారంగా అనుభవించాడని ఆ అమ్మాయి ఆరోపించింది.

అంతటి ప్రముఖుడి పేరు లాగడంతో కేసుకి ప్రాధాన్యత వచ్చింది. ఆగస్టు 1999లో స్పెషల్ కోర్టుని ఏర్పరచి విచారణ ప్రారంభించారు. కురియన్ ప్రతిక్షకులైన కమ్యూనిస్టులు దీన్ని రాజకీయ అస్త్రంగా మలచుకున్నారు. ఇది వాళ్లు చేస్తున్న కుట్ర అని, ఆ అమ్మాయి చెపుతున్న రోజున తను ఇడుక్కి జిల్లాలోనే అడుగు పెట్టలేదని, కుమిళీనుండి 150 కి.మీ.ల దూరంగా తిరువిల్లా, చెంగనాస్సెరీ ఊళ్లలో వున్నానని సాక్ష్యాలు చూపించాడు కురియన్. ఆ సాక్ష్యాలను కేరళ హైకోర్టు, సుప్రీం కోర్టు సాక్ష్యాలను నమ్మాయి. చార్జి షీటులో కురియన్ పేరు పెట్టలేదు. కానీ కోర్టులు చెప్పినది కురియన్ రాజకీయ శత్రువులు పట్టించుకోలేదు. కురియన్ అవేళ కుమిళీలో వున్నాడని ప్రథమ ముద్దాయి అయిన ధర్మరాజన్ చెపుతున్న విషయమే నమ్ముతున్నాం అంటూ కురియన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూనే వచ్చారు. దాని కారణంగా 1999 లోకసభ ఎన్నికలలో కురియన్ ఓడిపోయాడు.

స్పెషల్ కోర్టు తన విచారణలో ముద్దాయిలందరూ ఆమె యిష్టానికి వ్యతిరేకంగా బలాత్కరించారని అభిప్రాయపడి సెప్టెంబరు, 2000 నాటి తీర్పులో 35 మందికి కఠిన శిక్ష వేసింది. నలుగుర్ని వదిలేసింది. తీర్పు వచ్చిన కొన్ని రోజులకే ప్రథమ ముద్దాయి ధర్మరాజన్ పోలీసులకు దొరికాడు. అతనికి స్పెషల్ కోర్టు 2002 నాటి తీర్పులో జీవితఖైదు శిక్ష విధించింది. శిక్ష పడినవాళ్లు హై కోర్టుకి అప్పీలు చేసుకున్నారు. ఆ అమ్మాయి రేప్‌కు గురి కాలేదని, వ్యభిచారిగా ప్రవర్తించిందని అభిప్రాయపడిన హై కోర్టు 2005 జనవరిలో 35 మందిని వదిలేసి, ధర్మరాజన్ జైలుశిక్షను ఐదేళ్లకు కుదించింది. ఈ తీర్పు రద్దు చేయాలని కోరుతూ ఆ అమ్మాయి, ఆమెకు అండగా నిలబడిన రాష్ట్రంలోని వామపక్షప్రభుత్వం సుప్రీం కోర్టుకి వెళ్లాయి. సుప్రీంకోర్టులో కేసు పెండింగులో వుండగానే కురియన్ రాజకీయంగా పునరావాసం పొందాడు. నాయర్ సర్వీస్ సొసైటీ అండతో 2005లో రాజ్యసభకు ఎన్నికవడమే కాక, అక్కడ డిప్యూటీ చైర్మన్ కూడా అయ్యాడు.

ఎనిమిదేళ్ల తర్వాత జనవరిలో నెలలో సుప్రీం కోర్టు యీ కేసుపై తీర్పు చెపుతూ – హై కోర్టు 35 మందిపై కేసు ఎత్తివేయడం సరికాదంది. బాధితురాలి విజ్ఞప్తిని మళ్లీ ఫ్రెష్‌గా వినమని హై కోర్టుని ఆదేశించింది. అంతే కురియన్ శత్రువులు మళ్లీ గొడవ మొదలెట్టారు – కురియన్ రాజీనామా చేయాలి అంటూ..! ''చార్జి షీటులో కూడా నా పేరు లేదు కదా, తప్పించుకుని తిరుగుతున్న ఒక నిందితుడు చెప్పాడు కదాని నేను రాజీనామా చేయాలా? నేను రాజ్యసభ చైర్మన్ అయిన ఉపరాష్ట్రపతికి, సోనియాకు నా నిర్దోషిత్వం నిరూపించుకున్నాను.'' అని వాదిస్తున్నాడు కురియన్. కురియన్ తరఫున సుప్రీం కోర్టులో న్యాయవాదిగా వున్న అరుణ్ జైట్లీ సలహా మేరకు బిజెపి కూడా దీనిపై రచ్చ చేయలేదు. అయితే రాష్ట్ర బిజెపి ఊరుకోలేదు. కేంద్ర నాయకత్వంపై ఒత్తిడి తెచ్చించింది. దాంతో జాతీయస్థాయిలో బిజెపి, కురియన్ రాజీనామా చేయాలంటూ ఆందోళన చేస్తోంది. సిపిఎం మొదటినుండీ కురియన్‌ను దోషే అంటోంది. ఆ రెండు పార్టీలకు సంబంధించిన మహిళా సంఘాలు కురియన్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. వీటిపై 17 ఏళ్లగా మౌనంగా వున్న కురియన్ భార్య యిప్పుడు ప్రతిస్పందించారు – ''నా భర్త అమాయకుడని నాకు తెలుసు. నా భర్తపై అనవసరంగా బురద చల్లుతున్న మహిళాసంఘాలు ఆయనకు కూడా ఒక కుటుంబం వుందని గుర్తు పెట్టుకోవాలి.'' అన్నారు.

రాష్ట్రంలో వున్న కాంగ్రెస్ మిశ్రమ ప్రభుత్వం కురియన్ పట్ల ఉదారంగానే వుంది. ''సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేసును రీ–ఓపెన్ చేయడానికి ముగ్గురు న్యాయకోవిదులను సంప్రదించాం. అది సాధ్యం కాదని వారన్నారు. దీనిపై సందేహాలుంటే ప్రతిపక్షాలు హై కోర్టుకి వెళ్లవచ్చు.'' అన్నారు కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ. కేరళ కమ్యూనిస్టు పార్టీలో అచ్యుతానందన్, పినరాయి విజయన్ వర్గాల మధ్య పోరాటం సాగుతోంది. విజయన్ అవినీతిని బయటపెట్టినందుకు అచ్యుతానందన్‌ను పార్టీలో నుండి తొలగించాలని పార్టీ ఆలోచిస్తోంది. దానివలన జరిగే పరిణామాలు ఎలా ఎదుర్కోవాలా అని మథన పడుతోంది. ఇదంతా ప్రజలు చర్చిస్తున్నారు కాబట్టి కురియన్ గొడవ రాగానే వారి దృష్టి మరలించడానికి సిపిఎం కూడా పాట్లు పడుతోంది అంటున్నారు.

ఈ గొడవలో అనుకోకుండా యిద్దరు చిక్కుకున్నారు. 'తెలంగాణ ఎక్కడుంది?' అని చమత్కారం ఒలకబోసి అందర్నీ మండించిన వాయలార్ రవి మళ్లీ వాచాలతతో యిబ్బంది పడ్డారు. ఈ కేసు గురించి ఒక అడిగిన మహిళా విలేఖరితో ''మీకేమైనా వ్యక్తిగతంగా కురియన్‌పై కక్ష వుందా? అంతకుముందు ఏదైనా యిబ్బందికరమైన అనుభవం ఎదురైందా?'' అని జోక్ చేసి, జర్నలిస్టుల నిరసన తర్వాత క్షమాపణ చెప్పారు. అలాగే ''వయసు రావడానికి ముందే ఆ అమ్మాయిని వ్యభిచారంలోకి దింపారు.'' అన్న మాజీ హైకోర్టు జడ్జి ఆర్. బసంత్ పై కూడా దుమారం లేచింది. వ్యభిచారం చేసింది అంటే శిక్ష ఎక్కువ పడదు, వీళ్లంతా వెళ్లి రేప్ చేశారు అంటేనే ఎక్కువ శిక్ష పడుతుంది. అందుకని బసంత్ యిలా అనగానే సిపిఎం వారు ఆయనపై పెద్ద పెట్టున విమర్శలు చేశారు. ''నేను యివాళ కొత్తగా చెప్పేదేముంది. 2005 నాటి హైకోర్టు తీర్పులోనే ఆమె చైల్డ్ ప్రాస్టిట్యూషన్‌కు వినియోగించుకున్నారు.'' అని వుంది కదా'' అనేసారు బసంత్!

బలాత్కారాల గురించి దేశం మొత్తం ఆగ్రహం వ్యక్తమవుతున్న సమయంలో యీ తీర్పు రావడం కురియన్ దురదృష్టం. కేసు

వివరాలు పూర్తిగా చదివే ఓపిక లేని వారు కురియన్‌పై తిట్లవర్షం కురిపిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో అలా కురిపించినవారిపై కేసులు పెట్టారు కూడా. ఏమౌతుందో వేచి చూడాల్సిందే – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 23 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇరుకున పడ్డ అబ్దుల్లా**

అఫ్జల్ గురును యిప్పటికైనా ఉరి తీశారు, సంతోషం – అని మీరూ నేనూ అనుకోవచ్చు. కానీ ఆ వార్త కశ్మీర్ లోయలో కలిగించిన ప్రభావాన్ని ఎదుర్కుంటున్న ఒమర్ అబ్దుల్లా అలా అనుకోవడం లేదు. కశ్మీర్‌లో అఫ్జల్‌కు గాఢాభిమానులున్న సంగతీ, ఉరి తీయగానే వాళ్లంతా ఆందోళనలకు దిగుతారన్న సంగతీ అతనికి తెలుసు. అందుకే ఆ మధ్య ఢిల్లీ వచ్చినపుడు చెప్పాడట – ''అఫ్జల్‌ను ఉరి తీయదలచుకుంటే డిసెంబరు 20 ప్రాంతంలో తీయండి. అప్పణ్నుంచి నెలన్నరపాటు విపరీతమైన చలి. ఆందోళనకారులు కూడా బయటకు రావడానికి వణుకుతారు. చలి తగ్గేటప్పటికి యీ వార్తా పాతబడి ఆవేశకావేషాలు చల్లబడతాయి.'' అని. చావుకబురు చల్లగా చెప్పడం అనే దానిలోంచి ఇతను భలే అర్థం తీశాడు!

కానీ కేంద్రం అతని సలహా వినలేదు. ఆ చలికాలం అయిపోయాక ఫిబ్రవరి 9 న ఉరితీత నిర్వహించారు. అంతకుముందు మక్బూల్ భట్ అనే జెకెఎల్ఎఫ్ సంస్థాపకుడిని కూడా యిలాగే 1984 ఫిబ్రవరి 11న అదే తీహారు జైల్లో ఉరితీశారు. మక్బూల్ భట్ కోసం కశ్మీర్‌లో ఒక సమాధి తవ్వి వుంచారు – అతని శవాన్ని అక్కడ పాతిపెడదామని. కానీ ప్రభుత్వం అతన్ని తీహారు జైల్లోనే పూడ్చిపెట్టింది. ఇప్పుడు శ్రీనగర్‌లో మరో సమాధి తవ్వి పెట్టారు – అఫ్జల్ కోసం. 'షహీద్ ఎ వతన్ (దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు) 'షహీద్ మొహమ్మద్ అఫ్జల్ గురు' అని సమాధిఫలకం కూడా తయారు చేశారు. ఇవన్నీ ఊహించే భారతప్రభుత్వం అఫ్జల్‌ను కూడా తీహారు జైల్లో ఖననం చేసింది. చావు వార్త వినగానే కశ్మీరులో అనేకమంది మసీదులకు వెళ్లి అఫ్జల్ కోసం ప్రార్థనలు చేశారు. వేలాది మంది జనం అతని సొంతవూరుకి వెళ్లి చూసి వచ్చారు. సెక్యూరిటీ పోలీసులు వారి వాహనాలను ఆపితే కొందరు పడవలెక్కి వెళ్లారు. అలాటి పడవలను సెక్యూరిటీవాళ్లు వెంటాడితే, కంగారులో ఓ పడవ తిరగబడి యిద్దరు మునిగి చనిపోయారు కూడా.

ఇవన్నీ ఎవరో నాయకులు దగ్గరుండి ప్లాను చేయించినవి కావు. నిజానికి విభజనవాదులైన నాయకులెవ్వరూ ఆ రోజున కశ్మీరులో లేరు. గిలానీ, మిర్వాయిజ్ ఫరూఖ్ ఢిల్లీలో వున్నారు. జెకెఎల్ఎఫ్‌కు ప్రస్తుత నాయకుడు యాసీన్ మాలిక తన భార్యాబిడ్డలను చూడడానికి పాకిస్తాన్ వెళ్లాడు. కబురు తెలిసి అక్కడ ఇస్లామాబాద్‌లో ప్రెస్ క్లబ్ ఎదుట కాస్సేపు నిరాహారదీక్ష చేశాడు. వీళ్లంతా వుండి వుంటే యింకెలా వుండేదో! ప్రజాగ్రహం తట్టుకోలేక యిప్పటికి ఒమర్ అబ్దుల్లా 'దీనిలో నా ప్రమేయం ఏమీ లేదు. ఉరి తీసే ముందురోజు రాత్రే నాకు చెప్పారంతే! అయినా అఫ్జల్ కుటుంబానికి ముందుగా కబురు చెప్పకపోవడం కేంద్రం తప్పే' అని ప్రకటన యిచ్చాడు. ముఖ్యమంత్రిగా ముందుగానే కబురు తెలిసి వుంటుందన్నది అందరికీ తెలిసినదే. ఆర్మీ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, జమ్మూ-కశ్మీర్ పోలీసు – వీటిలోని ఉన్నతాధికారులకు ముందే చెప్పారు కాబట్టే ఉరికి కొన్ని గంటల ముందే యీ దళాలన్నీ కశ్మీరులో మోహరించాయి. శ్రీనగర్, బారాముల్లా, కుప్వారా, అనంతనాగ్ వంటి వూళ్లల్లో ముఖ్యదారులన్నిటిని ముళ్ల కంచెలతో మూసేశారు. కేబుల్ టెలివిజన్, ఇంటర్నెట్ కట్ చేశారు.

అఫ్జల్ తాను అమాయకుణ్నని, తీవ్రవాదం నుంచి తొలగిపోయానని, పోలీసుల ఆదేశాల మేరకే పార్లమెంటుపై దాడి చేసినవారికి ఆశ్రయమిచ్చానని కోర్టులో, తన క్షమాభిక్ష పత్రంలో వాదించాడు. అవి నమ్మి అనేకమంది మేధావులు ప్రభుత్వాన్ని తప్పుపడుతున్నారు. ఆగస్టు 2012లో అఫ్జల్ తన స్నేహితుడైన హురియత్ లీడర్, సయ్యద్ ఆలీ షా గిలానీకి రాసిన లేఖను ''ద వీక్'' ప్రచురించింది. అది చదివితే అఫ్జల్ నమ్మకాలలో ఏ మార్పూ లేదని ప్రస్ఫుటమౌతుంది. నా చావు తర్వాత దాడులు మరింత పెరుగుతాయి, ఉద్యమం మరింత ఉధృతమవుతుంది. నన్ను శ్రీనగర్ జైలుకి మార్చాలి, క్షమాభిక్ష అడగడం నేను చేసిన తప్పు...' యిలా సాగింది అతని లేఖ. అఫ్జల్ భావాలచే ఆకర్షింపబడి, అతని ఉరి పట్ల యిప్పటికే ఆగ్రహంతో వున్న కశ్మీర్ యువత, ఉరిని విమర్శించేవారి వ్యాసాలతో మరింత రెచ్చిపోయి ఒమర్ అబ్దుల్లాపై విరుచుకు పడుతున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో అతనిపై వ్యాఖ్యలు చేస్తున్నారు.

అతను వీటిని ఎలా ఎదుర్కోవాలో తెలియక ''అఫ్జల్ గురు కశ్మీరీ కాబట్టే భారతప్రభుత్వం యిలా వ్యవహరించిందన్న అభిప్రాయం యిక్కడ బలపడుతోంది. అది తొలగిపోవాలంటే రాజీవ్ హంతకులను కూడా వెంటనే ఉరి తీయాలి.'' అని డిమాండ్ చేస్తున్నాడు. ఏది ఏమైనా కశ్మీర్‌లోని మామూలు ప్రజలు అనుకుంటున్నది – ''తండ్రి మక్బూల్ భట్‌ను ఉరి తీయించాడు (మక్బూల్ ఉరి సమయంలో ఒమర్ తండ్రి ఫరూక్ అబ్దుల్లా కశ్మీర్ ముఖ్యమంత్రిగా వున్నాడు), కొడుకు అఫ్జల్‌ను ఉరి తీయించాడు'' అని! – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 24 వీక్లీకై** **ఎమ్బీయస్ : నషీద్ విషాదం**

మాల్దీవు మాజీ అధ్యక్షుడు ఇండియన్ హై కమీషన్ ఆఫీసులో తలదాచుకున్నాడని, ఆ ఆఫీసు చుట్టూ ఆ దేశపు పోలీసులు

మోహరించారని చదివినవారికి అసలు వాళ్ల గొడవలకు, మనకూ లింకేమిటని అనుమానం రావచ్చు. క్లుప్తంగా చెప్పుకోవాలంటే – మాల్దీవుల విషయంలో మన దేశం కొన్ని పొరపాట్లు చేసింది. 2008లో ఆ దేశంలో మొట్టమొదటిసారి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగాయి. అప్పటిదాకా అబ్దుల్ గయూమ్ అనే నియంత ఆ దేశాన్ని 30 ఏళ్ల పాటు పాలించాడు. ఆ పెద్దమనిషిపై సైనికదళాలు 1988లో తిరుగుబాటు చేసినప్పుడు మన ఢిల్లీ సర్కారు నావికాదళాలను పంపి ఆ తిరుగుబాటును అణచివేసింది. 'విదేశీ శక్తుల ప్రోత్సాహంతో కిరాయి సైనికదళాలు చేసిన తిరుగుబాటు కాబట్టి..' అని మన ప్రజలకు చెప్పారు. హిందూమహా సముద్రంలో ఆ దేశం కీలకమైన స్థానంలో వుంది కాబట్టి మనకు అనుకూలమైన ప్రభుత్వం అక్కడ వుండాలని అనుకోవడం ఆశ్చర్యం ఏమీ లేదు. అయితే అదే సమయంలో అక్కడ ప్రజస్వామ్యాన్ని అణచివేస్తున్న నియంతకు సాయపడ్డామన్న చెడ్డపేరు రాకుండా చూసుకోవాల్సింది. కానీ అది జరగలేదు.

2008 ఎన్నికలలో గయూమ్‌ను ప్రజలు తిరస్కరించారు. మహమ్మద్ నషీద్ అనే ప్రజానాయకుణ్ని గెలిపించుకున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తొలి నాయకుడతను. భారత్‌తో సత్సంబంధాలు పెట్టుకుందామని ప్రయత్నించాడు. మనమూ ఆదరించాం. జిఎంఆర్ వంటి మనదేశపు వ్యాపార సంస్థలు అక్కడ కాంట్రాక్టులు పొందాయి. భారతే కాదు, యూరోప్, అమెరికా.. అన్ని దేశాలూ కూడా ప్రజల సంక్షేమం పట్ల నషీద్ నిబద్ధతను గుర్తించాయి. ప్రోత్సహించాయి.

అయితే ఓడిపోయిన గయూమ్ వూరుకోలేదు. తన అనుచరుల ద్వారా నషీద్‌పై విషప్రచారం చేయించాడు. నషీద్ వద్ద ఉపప్రధానిగా వున్న మహమ్మద్ వహీద్‌ను తనవైపు తిప్పుకున్నాడు. వహీద్ చాలా తెలివిగా నషీద్ వెనక్కాల గోతులు తీశాడు. అతన్ని సమర్థిస్తున్నట్లు కనబడుతూనే అతని విరోధులతో కలిసి కుట్రలు పన్నాడు. నషీద్‌కు భారత్ ప్రోత్సాహం వుంది కాబట్టి తను చైనాతో స్నేహం నెరపాడు. ఇస్లామిక్ తీవ్రవాదులను దువ్వాడు. పోలీసులను, సైన్యాన్ని కలుపుకున్నాడు. ఇన్ని చేసి 2012 ఫిబ్రవరిలో 'మాకు యిందరి మద్దతు వుంది. రాజీనామా చేస్తావా? లేకపోతే సైనిక కుట్ర నిర్వహించి చంపేయమంటావా?' అని నషీద్‌ను బెదిరించాడు. భయంతో నషీద్ రాజీనామా చేశాడు. వెంటనే వహీద్ గద్దె కెక్కాడు.

భారత్ ప్రభుత్వం చేసిన పెద్ద పొరబాటేమిటంటే – ఈ వహీద్ అసలు స్వభావం తెలియకుండా వెంటనే అతని ప్రభుత్వాన్ని గుర్తించడం! మనం చేశాం కదాని యూరోప్, అమెరికా కూడా వహీద్‌కు మద్దతు యిచ్చాయి. రాజీనామా చేసిన నషీద్ 'నేను స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదు, కుట్ర చేసి నన్ను దింపేశారు' అని ప్రపంచ దేశాలకు ఫిర్యాదు చేశాడు. అప్పుడు అతని ఆరోపణల్లో నిజానిజాలు తేల్చడానికి కామన్‌వెల్త్ దేశాల ప్రతినిధి బృందం ఒకటి మాలె వెళ్లి 'అబ్బే లేదు, నషీద్ తొలగింపులో కుట్ర లేదు, వహీద్ పెద్దమనిషే, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైనవాడే' అని సర్టిఫికెట్టు యిచ్చింది. ఈ బృందానికి మన భారతదేశమే నాయకత్వం వహించింది!

ఇలా మన సర్టిఫికెట్టు పొందిన వహీద్ అతి కొద్దికాలంలోనే తన నిజస్వరూపం చూపించాడు. కీలకమైన పదవుల్లో అనేకమంది యిస్లామిక్ తీవ్రవాదులను నియమించాడు. హెూం శాఖను కూడా అలాటి వారిలో ఒకరికి అప్పగించాడు. ఇక చైనా వాళ్లు వచ్చి "వ్యాపారవిషయాలలో భారతదేశంతో పేచీ పడినా ఫర్వాలేదు. వాళ్ల కంటె తక్కువ ధరల్లో మా వ్యాపారస్తులు నీకు సాయపడతారు' అని హామీ యిచ్చారు. ఆ దన్నుతోనే ఎయిర్‌పోర్టు కాంట్రాక్టు వ్యవహారంలో ఏకపక్షంగా ఒప్పందాన్ని రద్దు చేసి జిఎంఆర్‌ను ఎలా ముప్పుతిప్పలు పెట్టారో చూశాం. ఆఖరికి సింగపూరు కోర్టు కూడా వహీద్ ప్రభుత్వ విధానాన్నే సమర్థించింది.

ఈ ఏడాది సెప్టెంబరులో మాల్దీవుల్లో ఎన్నికలు నిర్వహించాలి. వాటిలో నషీద్‌తో తలపడితే ఫలితం ఎలా వుంటుందో తెలియదు. అందుకని ఏకంగా పాల్గొనకుండా అనర్హుడిగా ప్రకటించేట్లు చేయాలని వహీద్ పంతం. దానికోసం అతన్ని, అతనితో సత్సంబంధాలున్న భారత్‌ను దుర్మార్గులుగా చిత్రీకరించడమే అతని లక్ష్యం. ఈ పరిస్థితుల్లో నషీద్ భారత్ వెళతానన్నాడు. "వెళ్లి ఫిబ్రవరి 9 లోపున వచ్చేయ్, ఫిబ్రవరి 10 న నువ్వు కోర్టులో హాజరవాలి కదా.." అంది వహీద్ ప్రభుత్వం. నషీద్ ఫిబ్రవరి 11 వరకూ యిక్కడే తచ్చాడి వెళ్లాడు. ఫిబ్రవరి 10 న కోర్టుకి రానందుకుగాను నషీద్‌పై ప్రభుత్వం కేసు పెట్టింది. ఆ కేసులో ఓడిపోతే నషీద్ ఏడాదిపాటు జైల్లో వుండాలి. అంటే ఎన్నికలలో పాల్గొనలేడు. అదీ కిటుకు.

అందుకని మాల్దీవులు రాగానే నషీద్‌పై అరెస్టు వారంటుతో వెంటపడ్డారు. అతను అరెస్టు తప్పించుకోవడానికి ఫిబ్రవరి 13 న మాలెలోని ఇండియన్ హై కమిషన్ ఆఫీసుకి వచ్చి బస చేశాడు. మనవాళ్లు వెళ్లిపొమ్మనలేరు కదా. ఉండమన్నారు. దౌత్యవిధానాల ప్రకారం మాల్దీవు పోలీసులు లోపలకి రాలేరు కాబట్టి హై కమిషన్ ఆఫీసు బయట చుట్టుముట్టి వున్నారు. "బయటకు వెళితే కేసు మాట అలా వుంచండి, నా ప్రాణాలకే ముప్పు" అంటాడు నషీద్. ఏం చేయాలో తోచక మనవాళ్లు తలలు పట్టుకున్నారు.

చివరకు ఫిబ్రవరి 23 న 11 రోజుల తర్వాత నషీద్ తనంతట తానే బయటకు వెళ్లిపోవడంతో హమ్మయ్య అనుకున్నారు. నషీద్ అనుచరుడు ఒకడు ఇండియా ప్రభుత్వం కలగజేసుకుని రాజీ కుదిర్చింది అని మీడియాకు చెపితే మాల్దీవు ప్రభుత్వం ఖండించింది – రాజీ లేదు, ఒప్పందమూ లేదు. చట్టం తన పని తాను చేసుకుని పోతుంది అని! ఇది ఒక ఘట్టం మాత్రమే, ముందుముందు ఏమౌతుందో మనవాళ్లు ఎంత తెలివిగా వ్యవహరిస్తారో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2013)**

**ఫిబ్రవరి 25** **ఎమ్బీయస్ : తెరపైనా 'రాయని భాస్కరుడు' – ముళ్లపూడి**

ముళ్లపూడి వెంకటరమణ గారి వర్ధంతి ఫిబ్రవరి 24 న. ఆయన సినీసంభాషణా చాతుర్యం గురించి నాలుగు మాటలు.

రమణ 1953 నుండి ఎనిమిదేళ్లపాటు ఆంధ్రపత్రిక వీక్లీలో సాహిత్యరంగంలోని అన్ని ప్రక్రియలలోనూ కదం తొక్కేసి, చటుక్కున చలనచిత్రరంగంలోకి మాయమై పోయారు. మళ్లీ ఎప్పుడో మూడున్నర దశాబ్దాల తర్వాత కొన్ని వ్యాసాలు రాశారు. అందువలన విమర్శకులు సాహితీరంగానికి సంబంధించినంత వరకు ఆయన్ని 'రాయని భాస్కరుడు' అని చమత్కరిస్తూ సినీరంగం ఆయన్ని ఎగరేసుకుని పోయిందని బాధ వ్యక్తం చేసేవారు.

నిజానికి రమణ సినిమారంగంలో కూడా 'రాయని భాస్కరుడే'! సినిమాకళను పూర్తిగా ఆకళింపు చేసుకుని, ఎంతో రాయగలిగి కూడా అతి క్లుప్తంగా సంభాషణలు రాశారు. ఆ రాయడం కూడా నాటకీయంగా కాకుండా, సహజంగా మాట్లాడినట్లే రాస్తూ, వాటిల్లో చమత్కారాన్ని నింపారు.

దీనికి కారణం ఏమిటంటే రమణ నాటక రచయిత కాదు. మన తొలి తెలుగు నాటకాలు, సినిమాలు పౌరాణికాలు. తర్వాత సాంఘికాలు వచ్చినా పౌరాణిక ధోరణిలోనే పొడుగు పొడుగు డైలాగులతో, హావభావాలు ఎక్కువగా చూపుతూ వచ్చారు. నాటకాలూ అలాగే వచ్చాయి. వాటిని సినిమాలుగా మార్చినపుడు అదే ధోరణి అనుసరించారు. నాటక రచయితలే సినిమాలకు పనికి వస్తారనే అభిప్రాయం బలంగా వుంది. అప్పట్లో దాదాపు అందరూ నాటక రచయితలే (సుంకర–వాసిరెడ్డి, పింగళి, నరసరాజు, ఆత్రేయ, అనిసెట్టి, పినిశెట్టి, బొల్లిముంత, దాసరి, గణేష్ పాత్రో, జంధ్యాల, భమిడిపాటి..).

సినిమారచన చేయడం మాటలు కాదు. నాటకీయత వుండాలి, కానీ సంభాషణలు నాటకీయంగా వుండకూడదు. సంభాషణలు పదునుగా వుండాలి, కానీ దృశ్యానికి ప్రాధాన్యత వుండాలి. నాటకరచనకు, సినిమారచనకు చాలా తేడా వుంది. ఎందుకంటే సినిమాలో కెమెరా కూడా ఒక పాత్ర ధరిస్తుంది. అది కూడా తన పద్ధతిలో మాట్లాడుతూ వుంటుంది. దానితో పాటు తక్కిన పాత్రలు కూడా మాట్లాడేస్తూ వుంటే 'అతి' అయిపోతుంది. ఫోటోగ్రాఫర్ రచయితను డామినేట్ చేసినా, రచయిత డైరక్టరును డామినేట్ చేసినా సరైన సినిమా రూపొందదు. విషయం పాతదే అయినా కొత్తగా చెప్పగలగాలి, అదే సమయంలో సామాన్యప్రేక్షకుణ్ని విస్మరించి నేల విడిచి సాము చేయకూడదు.

ఆ విషయాన్ని యీ నాటక రచయితలు క్రమేపీ గుర్తించి తమ సంభాషణలు తగ్గిస్తూ వచ్చారు. ముళ్లపూడి నాటకాలు ఎన్నడూ రాయలేదు. అందువలన నాటకరంగ ప్రభావం ఆయనపై లేదు. ఆయనకున్న అనుభవం పత్రికా రచన. ఏ సబ్జక్టనైనా అందరికీ అర్థమయ్యే తీరులో చెప్పగల నేర్పు ఆయన సొంతం.

1931 జూన్ 28 న తూర్పు గోదావరి జిల్లా ధవిళేశ్వరంలో జన్మించిన రమణ తండ్రి మరణంతో మద్రాసు చేరవలసి వచ్చింది. హైస్కూలులో వుండగానే బాపుతో పరిచయం ఏర్పడింది. ఆంధ్ర బాలానంద సంఘం సభ్యుడిగా, ''బాల''లో రచనలు చేసేవారు. స్కూలుఫైనల్ చదువై పోయాక ఆంధ్రపత్రికలో ఏడెనిమిదేళ్లు పనిచేశారు. అక్కడ ఉద్యోగం మానేసి ఫ్రీ లాన్సర్‌గా వుండే రోజుల్లో మూడు వెండితెర నవలలు (''వెలుగునీడలు'', ''భార్యాభర్తలు'', ''ఇద్దరు మిత్రులు'') రాసి, దర్శకుల దృష్టిలో పడ్డారు.

అప్పుడు ''దాగుడు మూతలు'' సినిమా ఛాన్సు యిచ్చారు డి.బి.నారాయణగారు. తను సినిమాలకు పనికి రాననుకున్న రమణను ఒత్తిడి చేసి మరీ రాయించారు. ఆయనకై పనిచేస్తున్న ''దాగుడు మూతలు'' (1964) నిర్మాణంలో వుండగానే ''రక్తసంబంధం'' (1962) ఆఫర్ యిచ్చారు డూండీగారు. హాస్యం రాసేవాడు సినిమాలకేం రాయగలడు? అని అందరూ పెదవి విరిస్తే కామెడీ రాయగలిగినవాడు ఏ సబ్జక్టయినా రాయగలడు అంటూ సాహసం ప్రదర్శించారు డూండీ. ''దాగుడు మూతలు'' కథా చర్చలు సాగుతూండగానే రమణ ప్రతిభను గుర్తించి ''మూగమనసులు'' (1962లో ప్రారంభమై 1964 లో రిలీజైంది) ఛాన్సు యిచ్చారు ఆదుర్తి సుబ్బారావు.

అలా నాటకాల రూటు పట్టకుండా రాయడం రాయడమే సినిమాలకు డైరక్టుగా రాశారు రమణ. 1962 లో విడుదలైన ''రక్తసంబంధం'' నుండి 29 సినిమాలు యితరులకు రాస్తే (కథ, సంభాషణలు, స్క్రీన్ ప్లే కలిపి) బాపుతో కలిసి చేసిన సినిమాలు 33. ఆఖరి సినిమా ''శ్రీరామరాజ్యం'' (2011). 13 సినిమాలలో ఆర్థిక భాగస్వామ్యం కూడా వుంది. తక్కువ సంభాషణలు రాయాలి అనే సిద్ధాంతాన్ని ఆయన విదేశీ చిత్రాల నుండి వంటబట్టించుకున్నారు. నిజానికి ఆ నాటి రచయితలందరిలోనూ పరభాషా చిత్రాలు, విదేశీ చిత్రాలు చూసే అవకాశం రమణకే వుంది. తక్కిన రచయితలందరూ పల్లెటూరి నేపథ్యం నుండి వచ్చినవారే.

రమణ మద్రాసు మహానగరవాసి. చిన్నప్పటినుండీ అక్కడే పెరిగారు. బాపు వంటి వారి సాంగత్యంలో ఇంగ్లీషు సినిమాలూ అవీ చాలా చూశారు. నిరుద్యోగిగా కాలక్షేపం కోసం చూడడమే కాదు, ఆంధ్రపత్రిక వారపత్రికలో సినిమా పేజీకి యిన్‌చార్జిగా, సినిమా సమీక్షకుడిగా రకరకాల భాషల సినిమాలు చూశారు, వాటిపై వ్యాసాలు రాశారు, వాటి కథలను పాఠకులకు చెప్పారు. నిజానికి కథారచనలో రమణ ''ఆకలీ–ఆనందరావు'' (1953) నగరనేపథ్యంలో వచ్చిన తొలి కథ అనుకోవచ్చు. మద్రాసులో పెరగడం వలన రమణకు విదేశీ చిత్రాల ఎక్స్‌పోజర్ కలిగి, సినిమారచనపై తక్కిన వారి కంటె విభిన్నమైన ధోరణి అవలంబించే సౌకర్యం ఏర్పడింది.

తన ధోరణి గురించి రాస్తూ ముళ్లపూడి – ''...సినిమా విజువల్ మీడియం. 'బొమ్మ ముందు.. శబ్దం తర్వాత' అన్నమాట. అందుకే నా స్క్రిప్టులో ఎక్కడ మాట అవసరమో అక్కడే వస్తుందన్నమాట. నేను మొదట్నుంచి అలాగే నేర్చుకున్నాను, పెద్దవాళ్లనీ, పాత క్లాసిక్స్‌నీ చూసి. అదే నాటకం వుందనుకోండి విజువల్ కన్నా ఆడియో.. శబ్దానికి ప్రాధాన్యం హెచ్చు. కారణం సినిమాలోలా

దూరంగా వున్నవారికి రంగస్థలం మీద నటులు సరిగ్గా కనిపించరు. అంచేత సంభాషణలు ఎక్కువగా వుండాలి. అదే సినిమాలో అయితే, ఒక విజువల్‌తో వందమాటలు పలికించవచ్చు. 'ఒక బొమ్మ వందమాటల పెట్టు' అంటారు చూడండి. అది జ్ఞాపకం పెట్టుకుని రాస్తాను. విజువల్‌గా, అందంగా ఎలా చెప్పడం అన్నది ఊహించి చూసినదానికి అప్పుడు మాటలు రాయడం అన్నమాట.." అని చెప్పుకున్నారు.

రమణ నాటకాలు కాదు కదా, నవలలు కూడా రాయలేదు. అప్పట్లో నవలలను సినిమాలుగా మలచేవారు. అందువలన కథలో అనేక పాత్రలూ, చాలా మలుపులు, మెలోడ్రామా వుండేవి. వారాల తరబడి సీరియల్ నడవాలి కాబట్టి సంభాషణలూ ఎక్కువగానే వుండేవి. సినిమాకు వచ్చేసరికి వాటిల్లో కొన్నయినా దిగుమతి అయ్యేవి.

రమణ రాసినవన్నీ కథలే. రమణ తొలి స్వతంత్ర రచన "దాగుడు మూతలు"కు ఆధారం "మిస్టర్ డీడ్స్ గోస్ టు టౌన్" అనే హాలీవుడ్ సినిమా. కానీ దాన్ని ఎంతో మార్చారు. "దాగుడు మూతలు" సినిమా చూస్తే అది తెలుగు కథ కాదంటే నమ్మం. ఆయనా, బాపు కలిసి తీసిన తొలి సినిమా "సాక్షి" (1967) రమణ రాసిన ఓ కథను ఆధారంగా తీశారు. దానికి స్ఫూర్తి నిచ్చినది "హై నూన్" అనే హాలీవుడ్ సినిమా. రమణ పాటించిన సూత్రం యిక్కడే కనబడుతుంది. స్ఫూర్తి పొందినది – విదేశీ చిత్రం నుండి, కానీ రూపొందించినది – గోదావరి ఒడ్డున పల్లెలో, సహజమైన వాతావరణంలో. సంభాషణలు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులోకి అనువదించినట్టు వుండవు. రమణ మద్రాసులోనే పెరిగినా, తన మూలాలు వున్న గోదావరీ ప్రాంతాన్ని, అక్కడి యాసను ఔపోసన పట్టారు.

"సాక్షి"లో హీరో బల్లకట్టు నడిపేవాడు. విలన్ లారీ డ్రైవరు. మునసబు, కరణం, కరణంగారి అల్లుడు, పూజారి.. వీళ్లందరూ వాళ్ల భాషలోనే, యాసలోనే మాట్లాడతారు. నాటకీయత కోసమో, చమత్కారం కోసమో, ప్రాస కోసమో, డైలాగు పదికాలాలపాటు గుర్తుండాలనో.. మరోలా మాట్లాడరు. సంఘటనలోంచి సంభాషణ తనంతట తానే ఉద్భవిస్తుంది. హీరోయిన్ అన్న ఐన విలన్ జైలుకి వెళుతూ, పారిపోయి వచ్చి హీరోని చంపుతానని ప్రతిజ్ఞ చేశాడు. అతను జైల్లో వుండగా హీరోయిన్ హీరోకి అన్నం పెడుతూన్న శృంగార సన్నివేశంలో హీరోకి పొలమారుతుంది. నెత్తిమీద కొట్టుకుంటూ 'ఎవరో తలచుకున్నారు' అంటాడు.

'మా అన్నేమో అంటుంది' హీరోయిన్ కొంటెగా.

భయస్థుడైన హీరోకి అతని బెదిరింపు గుర్తుకు వచ్చి కొయ్యబారిపోతాడు. హీరోయిన్ నవ్వేసి ఉత్తినే అన్నానులే అనే సముదాయిస్తుంది. హీరో పకపకా నవ్వుతాడు. ఓ పక్క శృంగార సన్నివేశాన్ని చూపుతూనే మరో పక్క హీరో ప్రాణానికి పొంచివున్న ప్రమాదాన్ని సూచిస్తాడు రచయిత ఒక చిన్న డైలాగుతో.

తొలి సినిమాలలో యింత క్లుప్తంగా, లాఘవంగా రాసే అవకాశం రాలేదు రమణకు. ఎందుకంటే "రక్తసంబంధం", "గుడిగంటలు" తమిళం నుండి రీమేక్ చేయబడిన హెవీ డ్రామాలు. వాటికి తగ్గట్టుగా

ఫ్యాక్టరీ యజమాని కార్మిక నాయకుడిని నిందించ్చేటప్పుడు – "నువ్వు నీ జీవితానికి పునాదులూ వాళ్ల పతనానికి గోతులూ తవ్వుతున్నావు" (రక్తసంబంధం),

హీరోకి సేవ చేసే హీరోయిన్ – "పెదవుల మీది చిరునవ్వు అల్పమైన సుఖానికి, సంతోషానికి పుడుతుంది. ఇట్టె చెరిగిపోతుంది. ఈనాడు మనసారా మీకు సేవ చేయటం వల్ల కలిగే ఆనందం గాఢమైనది. అది హృదయంలో పుడుతుంది. అక్కడే వుంటుంది. పెదవులదాకా రాదు." (గుడిగంటలు)

వంటి డైలాగులూ రాశారు. ఆయన స్వతంత్ర రచనలు "మూగమనసులు", "దాగుడు మూతలు" లో కొన్ని ఎమోషనల్ సీన్లు వున్నా, డైలాగులు యిలా హెవీగా వుండక పోగా, అచ్చమైన తెలుగు పలుకుబడులున్నాయి.

ఇంకో మూడేళ్లకే ఆయన నిర్మాత అయిపోయి సినిమాలు తీయనారంభించారు. ఆ తర్వాత రీమేక్స్ తీసినా, వాటిని తెలుగు వాతావరణానికి అనువుగా మలచుకున్నారు. సినిమా అంటే యిలా వుండాలి, యిన్ని కామెడీ సీన్లుండాలి, యిన్ని హెవీ డైలాగులుండాలి, యిన్ని పాటలుండాలి అనే ఫార్ములాను ఆయన అనుసరించి రాయలేదు.

"మంచి స్క్రిప్టు అంటే..?" అనే వ్యాసంలో ఆయన "కథ, సినిమా, నవల – ఏ మంచి రచనకైనా గ్రామర్ అవసరం లేదు. ఆ మంచి రచనని గ్రామర్ అనుసరిస్తుంది. నేనేదీ కొలబద్దలు పెట్టుకుని రాయను. 'ఇది యిలా రాయాలి' అనుకుంటే అలాగే రాశాను. అది రైటో, తప్పో అన్నది ఆలోచించలేదు. తప్పయినవి ఫెయిలవుతూంటాయి." అన్నారు.

హీరో హీరోయిన్లకు మంచి గంభీరమైన డైలాగులు వుండాలి, విలన్ గట్టిగా నవ్వితే చాలు, కమెడియన్‌కు ఊతపదం తప్పక వుండాలి వంటి ఫార్ములాలో వుండేవారు, ఆ నాటి రచయితలు. అసలు కామెడీ ట్రాక్ రాయడం నామోషీగా ఫీలయ్యేవారు అగ్రశ్రేణి రచయితలు. రమణకు సహాయకులు ఎవరూ లేరు, సహరచయితలూ లేరు. ("మూగమనసులు"లో ఆత్రేయ, "సంపూర్ణ రామాయణం"లో ఆరుద్ర తప్ప) సినిమాలో ఘట్టాలన్నీ ఆయనే రాసేవారు.

అందువలన సినిమా అంతా ఒకే 'ఫ్లో'లో సాగేది. అవసరాన్ని బట్టే పాత్రలకు సంభాషణలు అమిరేవి. "ముత్యాలముగ్గు"లో హీరోహీరోయిన్లకు సంభాషణలు తక్కువ. వాళ్ల ప్రేమఘట్టాలన్నీ వెనక్కాల మేండలిన్ వాయిద్యంతో కానిచ్చేశారు. డైలాగుల పరంగా హీరో – విలనే. అతను చాలా మాట్లాడాడు. ఆ మాట్లాడినవి తెలుగునాట నాటుకుపోయాయి.

ముత్యాలముగ్గు అనగానే గుర్తుకు వచ్చే డైలాగులు –

"మనిసన్నాక కుసింత కలాపోసన వుండాల..",

"ఆ ముక్క నేను లెక్కెట్టుకోవడానికి ముందు సెప్పాల..",

"డిక్కీలో తొంగోబెట్టేస్తాను",

"...అసలే మన యిస్టరీ అంతంతమాత్రం..",

"కరుసై పోతావు జాగర్త",

"ముసిలోడు రసికుడే.."

"నేను నీకు ఏం యిచ్చానన్నది కాదు కొశ్చిను, నువ్వు నాకు ఏం యిచ్చుకుంటావన్నది పాయింటు"–

ఇవన్నీ పలికిన కాంట్రాక్టర్ పాత్రతో ఓ క్లయింటు వచ్చి – కాలు తీసేయడాన్కిటతే ఎంత? చేతికైతే ఎంత? దానికీ దీనికీ కలిపి ఎంత? దీనిలో నా కమిషన్ ఎంత?– అంటూ ఆడిన బేరం యిప్పటికీ తెలుగు ప్రేక్షకులు మర్చిపోలేరు.

ఇవన్నీ రికార్డుల రూపంలో బయటకు వచ్చి రికార్డు సేల్సు రిజిస్టర్ చేశాయి. తమాషా ఏమిటంటే యిన్ని మాటలాడిన కంట్రాక్టరు పాత్ర కూడా "ఆకాశంలో మర్డరు జరిగినట్టు లేదూ" అనే ఓ విజువల్‌తో ప్రారంభమవుతుంది. అదీ రమణ సన్నివేశాన్ని వూహించి, కల్పించి, సంభాషణలు కూర్చే తీరు.

నిజానికి ముళ్లపూడి తెలుగునాట చిరంజీవులుగా నిలిచే అనేక పాత్రలను సృష్టించారు. అప్పులు చేసే అప్పారావు, ఆబాల'గోపాలా'న్ని అలరించే అల్లరి పిడుగు బుడుగు, నూతన దంపతులు రాధాగోపాళం, అందమైన తెలుగమ్మాయి రెండుజెళ్ల సీత, సినిమాపిచ్చి వున్న వరహాలరాజు – వీళ్లందరినీ సాహిత్యంలో ప్రయోగించి చూసి, తర్వాత సినిమారంగానికి లాక్కుని వచ్చేశారు. వాళ్లెంత పాప్యులరై పోయారంటే ఆ పేర్లతో సినిమాలు కూడా వచ్చేశాయి.

వీళ్లందరితో బాటు సినిమాలకి వచ్చాక సృష్టించిన కొత్తపాత్రలున్నాయి – తీ.తా.(తీసేసిన తాసిల్దారు), కనక్షన్ కన్నప్ప, కాంట్రాక్టరు, 'తుత్తి' గోపాలకృష్ణ, నైతాస్ (రాజాధిరాజు), 'పెట్టుగొప్ప' జెబి (అందాలరాముడు) వీళ్లందరికీ తమదైన వ్యక్తిత్వం వుంది, తమకంటూ 'పలుకు'బడి వుంది. ఒక్క డైలాగు వినగానే అది ఏ పాత్రపరంగా చెప్పారో చెప్పేయగల విధంగా సంభాషణలు రాశారు ముళ్లపూడి. "మిస్టర్ పెళ్లాం"లో బాస్‌ను ఉబ్బేసే ధర్మవరపు సుబ్రహ్మణ్యం డైలాగులతో నవ్విస్తే, "ముత్యాలముగ్గు"లో భజంత్రీలు డైలాగులు లేకుండా కూడా నవ్వించారు. అందుకే రమణ 'రాయని భాస్కరుడి'గా కూడా రాణించారు.

ముళ్లపూడి డైలాగులలో మేలిముత్యాలంటూ రాయడం మొదలుపెడితే పది పేజీలు పడతాయి. నాకు విపరీతంగా నచ్చిన డైలాగులు కొన్ని మాత్రం చెప్పి సరిపెడతాను –

"కాల్లో ముల్లు గుచ్చుకుంటే కంట్లో గుచ్చుకోలేదని సంతోషించు" (గోరంతదీపం)

"సిఫార్సులతో కాపురాలు చక్కబడవు, బతుకులు బాగుపడవు." (ముత్యాలముగ్గు)

"జీవితంలో చాలామందికి దొరికే బొమ్మలు నచ్చవు. నచ్చే బొమ్మలు దొరకవు" (అందాలరాముడు)

"డబ్బు చేసి 'పైకి' వెళ్లిపోయాడు" (మంత్రిగారి వియ్యంకుడు)

"ప్రేమంటే మీరిద్దరే మిగుల్తారు. పెళ్ళంటే కుటుంబమంతా వుంటుంది." (సుందరకాండ)

"చేత్తో చిన్న బెడ్డఏస్తే ఆ బెడ్డ సెరువు చివరకంటా పోద్ది. సూడూ మావా, మనద్దరం సెర్లో నీరంటాళ్ళం ఒక్క బొట్టు కదిలితే నీరంతా కదులుద్ది. మంచి మడిసిని కొడితే ఊరంతా తగులుద్ది. నిన్నుకాదని ఊరు బతకలేదు. ఊరుని కాదని నువ్వు పోలేవు. ఎంత దూరం పోయిన సెర్లో సాపల్లే సెర్లోనే... యాడికి పోయిన నువ్వు మడిసివే. మంచోళ్ళు సెడ్డోళ్ళు అంటూ విడిగా వుండరు మావాఉ , మంచి సెడ్డ కలిస్తేనే మడిసి." (సాక్షి)

"దేవుడు మనకి కన్నీల్లిచ్చింది మనకోసం ఏడవడానిక్కాదండి. ఎదటాళ్లకి బాదొచ్చినపుడు మనం కన్నీరు బెట్టాల. అందుకూ – అపుడాళ్లకి దైర్నం వస్తాది." (రాంబంటు)

"మా వదిన బతుకుబాటలో మా అన్నయ్య ఒక అపశ్రుతి. ఆయన భాషలో వదిన ఒక అచ్చుతప్పు" (వంశవృక్షం)

"దేవుడికి దయ తప్పడేమిటయ్యా? దయపేరే దేవుడు, మనకి దెబ్బతగలగానే ఆయన్ని అనేస్తే ఎలా? తప్పుచేసినప్పుడు బిడ్డను దండిస్తే తల్లికి దయ తప్పిందంటామా?" (శ్రీనాథ కవిసార్వభౌమ)

"శివుడి మూడోకంట భగ్గుమనే మంటా వుంది, ఓదార్చే వెన్నెలా వుంది. మనం తెలుసుకోవాలి. అసలూ మూడోకన్ను శివుడికే కాదు, జీవులందరికీ వుంది. మూడో కన్నంటే లోవెలుగు. మన లోపలి చీకట్లో వెలిగే చిన్నదీపం. నీ తప్పుని నువ్వు తెలుసుకో – ఎదుటివాడి గొప్పని ఒప్పుకో. అప్పుడు చీకటి చెదిరిపోతుంది, దీపం పెద్దదవుతుంది, దారి బాగా కనిపిస్తుంది. అప్పుడు నువ్వే శివుడివి. ఆ చూపే – మూడోకన్ను. ఆ కంటిసిరి నీ కండసిరి కన్న గొప్పది'." (భక్తకన్నప్ప)

రమణగారు వెళ్లిపోయారు. కానీ ఆయన సంభాషణలు మాత్రం జనంలో నిల్చిపోయాయి. కథారచనలో ఆయనను అనుకరించిన వారు కనబడతారు. కానీ సినీసంభాషణా రచనలో ఆయన వారసులు కనబడటం లేదు. ఆయన సంభాషణల్లో కనబడే ఆ చమత్కారం, లయ, సొగసు, నేటివిటీ, మెలోడ్రామా అనిపించని గాంభీర్యం – యితరులెవరూ యింకా పట్టుకోలేక పోయారు. **(సమాప్తం) –**

**మార్చి 01, 02 వీక్లీక్లై**

**ఎమ్బీయస్ : యువరాజు బతకడు**

ఎల్‌టిటిఇ నాయకుడు ప్రభాకరన్ కొడుకు బాలచంద్రన్‌ని ప్రాణాలతో పట్టుకుని శ్రీలంక సైనికులు చంపేశారని వార్త వచ్చింది. దాని తర్వాత రాజపక్షె తిరుపతి వస్తే అక్కడ నిరసనలు. ఇప్పుడు దానికి తరువాయిగా శ్రీలంకలో తమిళులకు అన్యాయం జరిగిపోతోందంటూ చెన్నయ్‌లో ఒకతని ఆత్మహత్యాయత్నం, లాయర్ల నిరసన, నిన్న నాలుగువేలమందితో డిఎంకె నాయకుడి స్టాలిన్ ఆధ్వర్యంలో ప్రదర్శన, ఇకపై తమిళనాడంతటా నిరసన కార్యక్రమాలట. చూస్తూంటే యివన్నీ ఒక గొలుసు సంఘటనల్లా అనిపించడం లేదూ..? మూలకారణం ఎక్కడో వుంది కదూ..!

కసబ్‌ను యింత త్వరగా ఉరి తీస్తారని ఉగ్రవాదులు అనుకోలేదు. ఇంకో రెండు మూడేళ్లు మేపుతారనే అనుకున్నారు. కానీ యుపిఏకి ఏదో పూనకం వచ్చినట్టయి, ప్రణబ్ రాగానే ఫైళ్లు చకచకా కదిపారు. క్షమాభిక్ష నిరాకరణ, ఉరితీత వెంటవెంటనే జరిగాయి. వెంటనే అంతకంటె పాతకేసైన అఫ్జల్ గురుకి మూడిందని అనుకోసాగారు. ఈ రెండూ జరిగాయంటే మరి రాజీవ్ హత్యకేసులో ఉరిశిక్ష పడినవారి సంగతేమిటన్న ఆలోచన వస్తుందనీ అనుకున్నారు. నిజానికి కశ్మీర్ ముఖ్యమంత్రి అన్నారు కూడా... అఫ్జల్‌ను మాత్రమే ఉరి తీసి, పాత నేరస్తులను ఉపేక్షిస్తే కశ్మీరువాసులకు ఒక న్యాయం, తక్కినవారికి మరో న్యాయం అని కశ్మీర్ యువత అనుకుంటుందని, అందుకని రాజీవ్ హంతకులకు కూడా వెంటనే ఉరి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈయన యిలా అడగబోతాడని ఎల్‌టిటిఇ సానుభూతిపరులకు ముందే తెలుసు. అందుకనే పావులు కదిపారు. శ్రీలంక తమిళులకు అన్యాయం జరుగుతోందంటూ రగడ మొదలుపెట్టారు. వారి స్నేహితులైన డిఎంకె అవునవును అంటుంది. లెక్కప్రకారం యిప్పుడు రాజీవ్ హత్యకు కుట్ర పన్నినవారి ఫైలు యీ పాటికి చురుగ్గా కదులుతూ వుంటుంది. దానిపై నిర్ణయం తీసుకోవడానికి అందరూ సిద్ధపడుతూ వుంటే డిఎంకె వచ్చి 'అబ్బే యిప్పుడు పరిస్థితి చాలా ఉద్రిక్తంగా వుంది. తమిళ పులుల పట్ల సానుభూతి పెరుగుతోంది. మీరు శిక్ష అమలు చేస్తే రాష్ట్రమంతా అతలాకుతలమై పోయి, అల్లరి అయిపోతుంది. ఉరి వాయిదా వేయండి' అని భయపెడుతుంది. ఇలా వాయిదాలు వేయించి వేయించి ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం మైనారిటీలో వున్నపుడు వాళ్ల మెడలు వంచి, క్షమాభిక్ష యిప్పిస్తుంది కూడా ! ఇలా చేయడానికే భూమిక తయారుచేసుకుంది. ప్రజల్లో ఫీలింగ్స్ రెచ్చగొట్టడానికే ఎల్‌టిటిఇ సానుభూతిపరులు కసబ్ ఉరి నుండి కథలు అల్లుకుంటూ వస్తున్నారు.

శ్రీలంకలో తమిళులు దుర్భరజీవితాన్ని గడుపుతున్నారంటూ, వాళ్లను అవస్థలు పెట్టేస్తున్నారంటూ రాజపక్షె వచ్చినపుడు తిరుపతికి వచ్చి కొందరు తమిళులు అల్లరి చేయబోయారు. వాళ్లను ఏమార్చడానికి రాజపక్షెను వేరే దారిలో తీసుకుని రావలసి వచ్చింది. దర్శనం అయిపోయాక ప్రెస్‌వాళ్లు రాజపక్షెను అడిగితే ఆయన ఒక్కటే అన్నాడు – ''శ్రీలంకనుండి యిటీవలి కాలంలో ఎవరైనా తమిళ శరణార్థులు మీ దగ్గరకు వచ్చారా?'' అని. అదొక్కటి చాలు, అసలు పరిస్థితి చెప్పడానికి! నిజంగా అక్కడ సమస్యలుండి వుంటే వాళ్లు రావడం ఎంతసేపు? హనుమంతుణ్ని తలుచుకుని గట్టిగా ఒక్క గెంతు గెంతితే యిటొచ్చి పడతారు. వాళ్లను ఆపడం ఎవరితరం కాదు. గతంలో చూశాంగా! పడవలకొద్దీ వచ్చి పడి తమిళనాడును అసాంఘిక శక్తులమయం చేసేశారు.

రాజపక్షె తమిళుల సమస్యలను రాజకీయంగానే పరిష్కరిస్తున్నాడు. తమిళభాషకు కూడా ప్రాధాన్యత యిచ్చి సాధారణ తమిళులు మామూలుగా బతికేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇంకా అది యివ్వలేదు, యిది యివ్వలేదని ఫిర్యాదు చేసేవాళ్లు ఎప్పుడూ వుంటారు. వీళ్లకు మరీ యిస్తే అటు సింహళీయులకు కోపం వచ్చి గద్దె దించేస్తారు. ఎలాగోలా తంటాలు పడి ఏవో విన్యాసాలు చేసుకుంటూ రాజ్యం చేసుకుంటున్నాడు. మనం వెళ్లి కెలికితే మీ సంగతేమిటంటారు. ..అంటారేమిటి? అనేశాడు కూడా సింహళ మంత్రి! అతన్ని మనవాళ్లు 'బాలచంద్రన్ విషయంలో హ్యూమన్ రైట్స్ వాళ్లు మిమ్మల్ని తప్పు పట్టారు కదా..' అంటే 'వాళ్లు మిమ్మల్నీ కశ్మీర్ విషయంలో తప్పుపట్టారు..' అని ఎత్తి పొడిచాడు. ఇంకా నయం, సమయానికి గుర్తుకు రాక అక్కడితో ఆగాడు కానీ లేకపోతే మనకు బ్లాక్ స్పాట్స్ చాలా వున్నాయి. నాగాలాండ్, మణిపూర్, అసాం, ఖలిస్తాన్ ఉద్యమం, 1984 సిక్కుల హత్యలు, గోధ్రా అల్లర్లు, గ్రీన్ హంట్.. యిలా ప్రతీ చోటా మానవహక్కులు హరించబడుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతూనే వుంటాయి. అంతర్జాతీయ సంస్థలు అడావుడి చేస్తూనే వుంటాయి.

ప్రభాకరన్ కొడుకు బాలచంద్రన్‌ను శ్రీలంక సైనికులు ప్రాణాలతో పట్టుకుని ఆ పై తీరిగ్గా చంపేశారని ఫోటోలు రిలీజ్ చేశారు ఎల్‌టిటిఇ సానుభూతిపరులు. మన మీడియావారు చాలా ఆవేశపడిపోయి కథనాలు గుప్పించేశారు – అయ్యో పాపం ముక్కుపచ్చలారని బాలుడు, రాజకీయాలకు బలై పోయాడు అంటూ. ఇక్కడ గమనించవలసిన అంశాలు కొన్ని వున్నాయి. అతను మామూలు బాలుడే అయితే యిన్ని కథనాలు వచ్చేవే కావు. ఇంతమంది పట్టించుకునేవారే కాదు. దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లలో చనిపోయిన వారిలో ఒక్కరి పేరు చెప్పండి చూదాం. గుర్తుండదు. కానీ బాలచంద్రన్ పేరు గుర్తు పెట్టుకున్నాం. ఎందుకు? అతను ఎల్‌టిటిఇ సంస్థ మూలవిరాట్ కొడుకు కాబట్టి, ఎల్‌టిటిఇని మళ్లీ వెలుగులోకి తేవాలని ప్రయత్నించేవారి ఆశాకిరణం కాబట్టి.

రాహుల్ గాంధీ, రాజీవ్ గాంధీ కొడుకు కాకపోతే అతనికి పెళ్లయిందా లేదాని పట్టించుకునేవారమా? తెల్లవారి లేస్తే ప్యారడైజ్

బిర్యానీ ఎంతమంది తినడం లేదు, రాహుల్ తిన్నప్పుడే పత్రికల్లో వార్త ఎందుకు రావాలి? రాహుల్‌కి అసలు జెడ్ క్యాటగిరీ ఎందుకు? ఆ మాట కొస్తే వాళ్ల నాన్న రాజీవ్‌కు మాత్రం ఎందుకు? ఎందుకంటే వాళ్లు ఇందిరా గాంధీ వారసులు కాబట్టి, ఇందిర వంశాన్ని తుడిచి పెట్టేయాలని ఖలిస్తానీలు పంతం పట్టి వున్నారు కాబట్టి! రాహుల్‌కి ప్రధాని అయ్యే ఛాన్సు ఎందుకుంది? ఎందుకంటే దేశంలోని కాంగ్రెస్‌వాదులందరికీ ఆ కుటుంబం ర్యాలీయింగ్ పాయింట్ కాబట్టి! వారు తప్ప దేశమంతా తెలిసిన కాంగ్రెస్ వంశం మరొకటి లేదు కాబట్టి!

అలా చూస్తే యీ రాజకీయవారసత్వం అనేది ప్రమాదంతో కూడుకున్న ఒక అవకాశం. బాలచంద్రన్‌కు కూడా అలాటి అవకాశమూ వుంది, దానిలో ప్రమాదమూ పొంచివుంది. అతను ప్రాణాలతో తప్పించుకుని వుండి వుంటే ప్రపంచంలోని ఎల్‌టిటిఇ వాదులందరికీ అతను ఆరాధ్యుడై వుండేవాడు. అతన్ని కేంద్రంగా పెట్టుకుని వాళ్లంతా మళ్లీ సమీక ృతమై వుండేవారు. ఎందుకంటే ఎల్‌టిటిఇ నాయకత్వాన్ని శ్రీలంక భూమిపై తుడిచి పెట్టారు కానీ మాదక ద్రవ్యాల, ఆయుధాల అక్రమ రవాణా ద్వారా అది ఏర్పరచుకున్న ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మూలించడం జరగలేదు. వాళ్లంతా ప్రస్తుతానికి స్తబ్దంగా, మందకొడిగా వుండవచ్చు. బాలచంద్రన్ వంటి కాండిడేట్ దొరికితే వాళ్లకు స్ఫూర్తి దొరికినట్టయి మళ్లీ పుంజుకుంటారు.

ఇది యితని విషయంలోనే కాదు, ఏ యువరాజు విషయంలోనైనా యిదే జరుగుతుంది. ఓడిపోయిన రాజుకి విశ్వాసంగా వుండేవాళ్లంతా ఆ రాజు కొడుకుని ముందు పెట్టుకుని తిరుగుబాటు చేస్తారు. ఇది ఊహించి, గెలిచిన రాజు  ఓడిపోయిన రాజుగారి వంశాన్ని సమూలంగా నిర్మూలించి వేస్తాడు. అగ్నిశేషం, శత్రుశేషం వుంచవద్దన్న సూక్తిని అక్షరాలా పాటిస్తారు. ఉయ్యాలలో వున్న పసిపాపను సైతం కత్తికి ఎఱ వేస్తారు. రాజు కొడుకులను మాత్రమే కాదు, రాజు సోదరులను, సోదరుల సంతానం సైతం బలి కావలసినదే. ఆ విధంగా చూస్తే రాజు ఓడిపోయిన సందర్భాల్లో యువరాజు ఎన్నడూ బతకడు. కేవలం జానపద సినిమాలలో మాత్రమే బతుకుతాడు. ఎవరో దాసి తన సొంత పిల్లవాణ్ని బలి యిచ్చి యితన్ని కాపాడేస్తుంది. వాడు పెరిగి పెద్దవాడై తన తండ్రికి విశ్వసనీయంగా వున్నవాళ్లని పోగేసి విలన్‌పై పగ తీర్చుకుంటాడు.

చరిత్రలో యిలా జరిగిన దాఖలాలు నాకిప్పటివరకూ కనబడలేదు. రాజుగారు పారిపోయి, మళ్లీ తిరిగి వచ్చి పోట్లాడిన సందర్భాలున్నాయి కానీ రాజు చచ్చిపోయి, వాళ్ల పిల్లల్ని ఎవరో బయటకు దాటించేయడం జరగలేదు. నిజానికి చాలామంది రాజసేవకులు ఎలాటి వాళ్లంటే అప్పటిదాకా వున్న రాజు చచ్చిపోయాడనగానే పార్టీ ఫిరాయించి కొత్తరాజుకి జై అనేస్తారు. పాతరాజు రహస్యాలన్నీ చెప్పేస్తారు. వాళ్ల మనుష్యుల్ని పట్టించేస్తారు. మంత్రుల దగ్గర్నుంచి అందరూ యిదే తంతు. ఇక తమ పిల్లల ప్రాణాలను పణంగా పెట్టేవాళ్లు ఎవరుంటారు? ఓడిపోయే రాజుకు గెలిచిన రాజు తన భార్యలను అనుభవించేసి, తన పరువు తీసేస్తాడని భయం. తన పిల్లలను ఖైదీలుగా తీసుకెళ్లి చిత్రహింసలు పెడతాడని భయం. అందుకని యుద్ధంలో ఓడిపోతూనే చేసే మొదటి పని – ఓ సైనికుణ్ని పంపించి అంతఃపురానికి నిప్పు పెట్టించేయడం. రాణులతో బాటు, దాసీలు, యువరాజులు అందరూ దగ్ధమై పోతారు. ఇక బతికే ఛాన్సు ఎక్కడ?

ఇది పాతకాలంలోనే కాదు, యిటీవలి కాలంలోనూ చూస్తాం. ఫ్రెంచ్ విప్లవం జరిగిన తర్వాత చక్రవర్తులను మిగిల్చారా? గిల్లెటిన్ దగ్గరకు తీసుకెళ్లి తలలు తెగ నరికారు. రష్యాలో జార్‌ల విషయమూ అంతే! చంపిపారేశారు. ఫ్రెంచ్ చక్రవర్తి వారసుడు ఒకడు తప్పించుకుని పారిపోయాడని ఓ పుకారు వుంది. అతనేమయ్యాడో ఎవరికీ తెలియదు. జార్ కుటుంబాల్లో ఒక చిన్నమ్మాయి అప్పుడు రాజమహల్‌లో వుండకపోవడం చేత బతికి పోయిందన్న కథా చదివాను. శత్రువుల లేదా, తిరుగుబాటుదారుల చేతుల్లో యీ రాజుల లేదా నియంతల వంశమంతా దుంపనాశనమవుతుంది. అసలు వాళ్లు వచ్చిపడుతున్నారని తెలియగానే వీళ్లే తనవాళ్లను చంపేస్తారు. హిట్లర్ చూడండి అనుచరులందరితో సహా చచ్చిపోయాడు.

ఎల్‌టిటిఇ వాళ్లు కూడా తమ క్యాడర్‌కు ఆదేశాలిచ్చారు – పట్టుబడగానే సైనైడ్ కాప్స్యూల్ మింగి చచ్చిపోవాలని. పట్టుబడితే శత్రువులు పీడించి రహస్యాలు బయటపెట్టిస్తారని అన్ని జాగ్రత్తలు తీసుకున్న ప్రభాకరన్ తన కొడుకు విషయంలో జాగ్రత్త పడడా? తను చనిపోయే పరిస్థితి ఏర్పడినపుడు తన కొడుకుని సజీవంగా శత్రువులకు అప్పగిస్తే తన మీద వున్న కసి అంతా అతని మీద తీర్చుకుంటారని అతనికి తెలియదా? తండ్రిగా అది భరించగలడా? అందుకని అతన్ని చంపాకనే తను చచ్చివుంటాడు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకునే తలిదండ్రులు పిల్లలని చంపి ఆ పై తాము ఎందుకు ఛస్తారు? తమ రక్షణ లేనిదే పిల్లల బతుకు దుర్భరమవుతుందని తెలిసే కదా!్క అలాగే యిక్కడా జరిగి వుంటుంది.

అయినా నా ఊహ – ప్రభాకరన్ ఒక్కడితో సైన్యం ముఖాముఖీ తలపడి వుండదు. అతని స్థావరం తెలిశాక దానిమీద విరుచుకు పడి ఎడాపెడా కాల్పులు జరిపి వుంటారు. ఆ సమయంలో బిబిసి రిపోర్టరు అక్కడ వున్నా అతనూ ఎగిరిపోతాడు. అందరూ చచ్చిపడి వున్నాక అప్పుడు ప్రభుత్వం కథనాలు అల్లుతుంది. ఎందుకంటే సభ్యసమాజానికి వాళ్లు జవాబుదారీ. 'లొంగిపోమని అడిగాం, అతను నిరాకరించి కాల్పులు జరిపాడు, గత్యంతరం లేక ఎన్‌కౌంటర్ జరిపాం. దానిలో పాపం దురద ృష్టవశాత్తూ చచ్చిపోయాడు' అని కహానీలు చెప్తారు. అదే ఎల్‌టిటిఇ వారు కానీ, మరో తీవ్రవాదులు కానీ వాళ్లకు యిలాటి కథలు చెప్పవలసిన అవసరం లేదు. సాధారణ పౌరులను, వాళ్ల పసిపాపలను యిష్టం వచ్చినట్టు చంపేసినా వాళ్లను అడిగేవాళ్లు లేరు. అడిగితే వాళ్లనూ మట్టుపెట్టేస్తారు. వాటిపై యీ మానవహక్కుల సమాజాల వాళ్లు కిక్కురుమనరు. ఇప్పుడు మాత్రం ఎగేసుకుంటూ వచ్చి పాపం, పాపం అంటూ

ప్రచారం చేస్తారు. శ్రీలంకలో ఎల్‌టిటిఇ జరిపిన హననంలో ఎంతమంది బాలచంద్రులు అమావాస్యలో కలిసిపోయారో వీళ్లు లెక్కపెట్టారా? ఇప్పుడు ఫోటో ఒకటి తయారుచేసి మనకు బ్రెయిన్ వాష్ చేద్దామని చూస్తున్నారు.

ంతకీ ఆ ఫోటో ఎలా వచ్చిందట? ఏముంది, యీ టెక్నాలజీ యుగంలో ఏదైనా సాధ్యమే! ఎప్పుడో చచ్చిపోయిన ఎన్టీయార్‌ను తెరమీదకు తెచ్చి మనుమడితో కలిపి డాన్సు చేయించారు. ఓ ఫోటో మార్ఫింగ్ పెద్ద బ్రహ్మవిద్యా? శ్రీలంక మంత్రి చెప్పినట్టు అది వాళ్లు తయారుచేస్తున్న డాక్యుమెంటరీకై సిద్ధపరచినది కావచ్చు. ప్రభాకరన్ పోయిన యిన్నాళ్లదాకా ఆ ఫోటో ఎక్కడుందట? ఇప్పుడే ఎందుకు తెచ్చారుట? ఎందుకంటే రాజీవ్ హంతకులను ఉరి తీస్తారన్న భయం కలిగింది కాబట్టి! వాళ్లు బతకడం ఎల్‌టిటిఇకి అవసరం. ప్రభాకరన్ వంశం నిర్మూలం అయిపోయింది కదా, యిప్పుడు ఈ రాజీవ్ హంతకులను కేంద్రంగా చేసుకుని ఎల్‌టిటిఇ మళ్లీ ఊపిరి పోసుకుంటుంది.

అలా ఊపిరి పోసుకోవాలంటే వీళ్లు బతికుండాలి. బతికుండాలంటే తమిళనాడులో అశాంతి స ృష్టించాలి. దానికోసం మొదటి మెట్టుగా యీ ఫోటో! వీటికి తమిళనాడు రాజకీయాలు తోడయ్యాయి. స్టాలినే తన వారసుడు అన్నాడు కరుణానిధి. ఏలడానికి రాజ్యం ఏమీ లేదు, జయలలిత దిగేట్టుగా లేదు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో బోల్డు సీట్లు తెచ్చుకుని కేంద్ర ప్రభుత్వాన్నే ఆడిద్దామని చూస్తోంది. ఆమెను ఎదిరించాలంటే ఓ పెద్ద ఉద్యమం నడిపి, తన ప్రత్యర్థి అళగిరి కంటె తనకు నాయకత్వ పటిమ ఎక్కువ వుందని చూపించుకోవాల్సిన అవసరం స్టాలిన్‌కు వుంది. అందుకే యీ శ్రీలంక అంశాన్ని తలకెత్తుకున్నాడు. రేపు రాజీవ్ హంతకులను ఉరి తీస్తే అది పెట్టుకుని రాష్ట్రమంతా గందరగోళ పరచడానికి ముందునుండి రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. రాబోయే రోజుల్లో తమిళనాడు రాజకీయాలు శ్రీలంక అంశం చుట్టూ తిరిగినా ఆశ్చర్యపడనక్కరలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 03 వీక్లీకై ఎమ్బీయస్ : దోశ వేసి చూడు...**

''తెలంగాణాయా? అదేమి? వర్ణక్రమం బెట్టిది?'' అని మనను అడిగి తెలుసుకున్న వాయలార్ రవి గారు దరిమిలా తెలంగాణను పూర్తిగా స్టడీ చేసేశారు. తెలంగాణ నాయకులను, వాళ్ల స్టయిల్‌ను బాగా పట్టేశారు. ఏదో ఒకటి అనేయడం, బొత్తిగా యిదేం భాష అంటే 'మా తెలంగాణ భాష యిలాగే వుంటుంది' అని దబాయించడం మన కెసియార్ తదితరులకు అలవాటు. ఇప్పుడు వాయలార్ కూడా దోశ కామెంట్‌కు తీవ్రస్పందన రాగానే 'అది మా కేరళ భాష లెండి' అనేశారు. ''మా కేరళలో ఏదైనా అతి సులభమైన పనిని దోశ వేయడంతో పోలుస్తాం. తెలంగాణ యివ్వడం అంత వీజీ కాదన్న అర్థంలో అన్నాను' అన్నారు. కేరళలో దోశ ఎడంచేత్తో చులాగ్గా వేసేస్తారేమో కానీ దోశ వేయడం సులభం కాదని, వేయడానికి ప్రయత్నించిన వారెవరైనా చెప్తారు. ముఖ్యంగా ఉత్తరాదివాళు 'అసలది అంత పల్చగా ఎలా వస్తుందబ్బా?' అని అడుగుతూంటారు. ఢిల్లీలో చాలా ఏళ్లుగా వున్న వాయలార్ నార్త్ యిండియన్ హొటళ్లలో దోశ రుచి చూసి వుంటారు. చూసినా అదేదో తేలికైన పని అన్నట్టు మాట్లాడడం దోశను కించపరిచినట్లే!

ఈయన కంటె ఆజాద్ బెటరు. ఆయన ఆ మధ్య రాష్ట్రవిభజన అంటే కేక్ కట్ చేసినంత యీజీ కాదు అన్నారు. కేక్ చేసినంత.. అనలేదు. కేక్ మెత్తగా వుంటుంది కాబట్టి చిన్నపిల్లాడైనా చాకుతో సర్రున కోసేయగలడు. కానీ కేక్ చేయడానికి చాలా తతంగం వుంది. ఇంట్లో చేయడం ఓ పట్టాన కుదరకే బేకరీలకు వెళ్లి కొంటాం. వాయలార్ కూడా దోశ నమిలినంత యీజీ అనో, దోశ ఆర్డరిచ్చినంత యీజీ (హొటల్లో అన్ని వేళలా లభ్యమయ్యేది దోశ కాబట్టి) అని వుంటే బాగుండేది. దోశ వేయడమంత యీజీ... అనడంతో అసలు వాయలార్ గారికి వంట వచ్చా రాదా అన్న అనుమానం వచ్చేస్తోంది. ఆయన్నో సారి దోశ వేసి చూపమనాలి.

నిజానికి కేక్ కటింగ్ ఉపమానంలో ఎంతో గూఢార్థం వుంది. కేక్ కట్ చేయడం యీజీయే అయినా అది నోట్లో పెట్టుకున్నాక పెదాలకు, ముక్కుకు, ఉంటే మీసాలకూ వెన్న అంటుకుంటుంది. అలా అంటుకోకుండా జాగ్రత్తగా తినేవాళ్లకు ఈ మధ్య మొహమంతా పూస్తున్నారు కూడా. పేపర్ నాప్‌కిన్ పెట్టి అదంతా తుడుచుకోవడం పెద్ద పని. చాకును కూడా జాగ్రత్తగా తుడవాలి. కట్ చేసి ప్లేట్లలో పెట్టే కేక్ ముక్క కూడా సరిగ్గా వుండాలి. మరీ పెద్దగా వున్నా నిలవదు, మరీ చిన్నగా వున్నా నిలవదు. సరైన షేప్‌లో, సరైన సైజులో ముక్కలు వుండేట్లు కోయడం ఓ పెద్ద విద్య. కేక్ కట్ చేసినంత సులభంగా రాష్ట్రాన్ని కట్ చేసినా ఆ తర్వాత మొహానికి పట్టించుకునేది వదిలించుకోవడం చాలా కష్టం సుమా అన్న ధ్వని, కేకు ముక్కల సైజు గట్రా చూసుకోవాలన్న ధ్వని వుంది ఆజాద్ వ్యాఖ్యలో!

వాయలార్ దోశ ఉపమానంలో ఆ ధ్వని లేదు. దోశ అట్లకాడతో వేస్తాం కాబట్టి పిండి ఎక్కువైతే అంటుకునేదేదో అట్లకాడకే అంటుకుంటుంది. అది పారేసి యింకోటి అందుకుంటాం. రాష్ట్రవిభజన విషయంలో అయితే ముఖ్యమంత్రే అట్లకాడ అనుకోవచ్చు. అందుకే దోశ వేయడం సులభమని వాయలార్ ఉద్దేశమన్నమాట. దోశ సరిగ్గా కుదరకపోతే యింకాస్త పిండి పోసి దానికి ఊతప్పమ్ అని పేరు పెట్టవచ్చు. రుచి కుదరకపోతే దానిపై యింత బంగాళాదుంపల కూరో, పన్నీరు మసాలాయో కుమ్మరించి దానికి మసాలా దోశ అనో, పన్నీరు దోశ అనో పేరు పెట్టవచ్చు. ఇంకా రుచి తక్కువైతే పచ్చళ్లు, సాంబారు అనుపానంగా పెట్టి దోశ లోపాలను కప్పిపుచ్చవచ్చు. తెలంగాణ విషయంలో యిలాటి డ్రెస్సింగులేవీ కుదరవన్న భయం వాయలార్‌కు వున్నట్టుంది. అందుకనే తెలంగాణ యివ్వడం దోశ వేయడం కంటె కష్టమన్న అభిప్రాయానికి వచ్చారు.

వాయలార్ మాటలకు కెసియార్ నొచ్చుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దోశ పిండిని రుబ్బేసినట్టు రుబ్బేస్తారని హెచ్చరించారు. అలా అంటూనే 2014 ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తుకు ప్రయత్నిస్తారని నా అనుమానం. 'మీది వట్టి సాదా దోశ, మాతో చేతులు కలిపితేనే మసాలా దోశ అయ్యి అమ్ముడుపోతుంది' అని ఢిల్లీ పెద్దలకు కేకే వంటి మిత్రుల చేత చెప్పించవచ్చు. అవన్నీ తర్వాతి కబుర్లు. ప్రస్తుతానికి మాత్రం గ్రహించవలసినది ఏమిటంటే కాంగ్రెస్ హై కమాండ్ పలువురు కేంద్ర నాయకుల చేత పదేపదే చెప్పిస్తున్నది ఏమిటంటే – 'తెలంగాణ యివ్వడం సులభం కాదు, చాలా యిబ్బందులు వున్నాయి, దీని ప్రభావం దేశంలో చాలా రాష్ట్రాలపై పడుతుంది. అందుకని నిర్ణయానికి చాలా టైము పడుతుంది, మీరు ఓపిక పట్టాలి, ఆశ విడిచి పెట్టకూడదు, అదే సమయంలో మమ్మల్ని వేపుకు తినకూడదు, సరైన సమయంలో సరైన నిర్ణయం వెలువడుతుంది..'.

సోనియాకు అత్యంత సన్నిహితుడైన ఆస్కార్ ఫెర్నాండెజ్ స్టాండింగ్ కమిటీల గురించి మాట్లాడడానికి వచ్చినపుడు దాదాపు యిదే విషయాన్ని మళ్లీ చెప్పారు. అయితే దోశ, వడ అంటూ ఉపమానాలు చెప్పలేదు. ఆయన మంగుళూరు ఆయన. ఆ ప్రాంతమంతా హెూటల్ పరిశ్రమకు పెట్టింది పేరు. దోశ వేయడంలో కష్టాలపై ఆయనకు ఒక అవగాహన వుండి వుంటుంది. వాయలార్ అంత తేలిగ్గా ఆయన దోశను తీసి పారేయలేదు – హెూటల్ పరిశ్రమపై ఆయనకున్న గౌరవం అలాటిది!

అంతా బాగానే వుంది కానీ తెలంగాణ సమస్య అంత వీజీ కాదని కాంగ్రెస్‌కు యిప్పుడే ఎలా తెలుస్తోందా అని సందేహం వస్తుంది. 2009 డిసెంబరు 9 నాడు, చిదంబరం గారు 'విడగొట్టడం దోశ వేయడం కంటె సులభమ'ని చెప్తే సోనియా నమ్మేశారు. ఇప్పుడు వాయలార్ గారు వచ్చి 'అబ్బే దోశ వేయడం కంటె కష్టం' అని చెప్తే అదీ నమ్మేస్తున్నారు. ఈ తిరకాసు దోశలో వుందేమో అనిపిస్తోంది నాకు. చెట్టినాడు దోశకు, ట్రావెన్కూర్ దోశకు వేయడంలో తేడా వున్నట్టుంది, కనుక్కోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 04,05 వీక్లీకై ఎమ్బీయస్ : రాజగోపాలం భజే...**

విజయవాడ ఎంపీ రాజగోపాల్ గారికి రాష్ట్ర పోలీసులు చేతులెత్తి దణ్ణం పెట్టుకోవాలి. పాడడం వస్తే 'గోపాలం భజే.. రాజగోపాలం భజే' అని కీర్తనలు కూడా పాడవచ్చు. హెూం మంత్రి కూడా వెనకేసుకుని రాలేని పరిస్థితుల్లో వున్న పోలీసులను ఆయన వెనకేసుకుని వచ్చారు, జాలి పడ్డారు.

దిల్‌సుఖ్ నగర్ పేలుళ్ల తర్వాత పోలీసులపై అందరూ మండిపడుతున్నారు. కేంద్ర హెూం శాఖ వారు మేం ముందే హెచ్చరించాం అంటూ పబ్లిగ్గా చెప్పేశారు. హెచ్చరించారు కానీ షరా మామూలే అనుకున్నాం అని డిజిపి గారూ, చెప్పేదేదో ఫలానా చోట అనీ, ఫలానా సమయంలో అనీ తిథివార నక్షత్రాలతో చెప్పలేదు, మేమేం చేయగలం? అని జూనియర్ బాసులు ప్రకటనలు చేసి అందరి చేత వెక్కిరించబడ్డారు. అనురాగ్ శర్మగారు అబ్బెబ్బే దిల్‌సుఖ్ నగర్ ప్రాంతంలో కూడా మేం తనిఖీలు చేశాం, క్యాజువల్‌గా ఏమీ తీసుకోలేదు అని నచ్చచెప్పబోయినా అది జనాలకు ఎక్కలేదు. పేలుళ్ల తర్వాత పోలీసులు యిప్పుడు అప్రమత్తంగా వుండండి, కార్లు అగి వుంటే తొంగి చూడండి అంటూ ట్రాఫిక్ సెంటర్లలో మైకులు పెట్టి హెూరెత్తించేస్తున్నారు. ఆదివారం దాకా రెడ్ ఎలర్టట. ఈ తెలివితేటలు యిప్పుడే ఎందుకు వచ్చాయట? అంతకుముందు కూడా దిల్‌సుఖ్ నగర్లో జరిగింది కదా, ఎక్కడ సిసిటివి కెమెరాలు పెట్టినా పెట్టకపోయినా కనీసం అక్కడైనా పెట్టవద్దా? పెట్టినవి పని చేశాయో లేదో చూసుకోవద్దా? అని మండిపడుతున్నారు.

2007లోనే 3 వేల సిసిటివిలు ప్రతిపాదించారట. అయితే 300 కొన్నారట. విప్రోవాళ్లు వెయ్యి యిస్తానని చెప్పినా ఆ అవకాశం వినియోగించుకోలేదట. ఆ యిచ్చిన 300ల్లో 90% సిసిటివిలు ట్రాఫిక్ వాళ్లే ఉంచేసుకున్నారట. బ్రాడ్ బ్యాండ్ కనెక్టవిటీ లేకపోవడం వలన వాటిలో అనేకం నిరుపయోగంగా వున్నాయట. విన్నకొద్దీ దిగులు వచ్చేస్తుంది. ఆరేళ్ల క్రితం 3 వేలు కావాలనుకుంటే యిప్పుడు ఎన్ని కావలసి వుంటాయో ఆలోచించండి. ఈ లోపున ఎన్ని వాహనాలు పెరిగాయి, ఎంత జనాభా పెరిగింది, ఎంత ఉగ్రవాదం పెరిగింది! కనీసం ఆరు వేలైనా వుంటే కాస్త మర్యాదగా వుంటుంది. అయినా పెట్టినవి పని చేయకపోవడమేమిటి? ప్రతి బట్టలషాపులో కెమెరాలు వుంటున్నాయి, పని చేస్తున్నాయి. వీళ్లవే పని చేయకపోవడమేం? దిల్‌సుఖ్ నగర్ లాటి వాళ్ల ఫేవరేట్ స్పాట్స్ వద్ద అన్ని కోణాల్లో కనబడేట్టు ఓ నాలుగు ఎక్కువ పెట్టాలి.

అవేమీ చేయలేదు. రూపాయికి బియ్యం యిస్తాం, అర్ధరూపాయికి పప్పు యిస్తాం – స్కీములకే డబ్బంతా పోతోంది. అసలిక్కడ ప్రాణమే నిలవటం లేదు, నీ పప్పేం చేసుకుంటాం? చస్తే అదో దారి, చావకుండా వెన్నెముక విరిగి, కాళ్లు తెగి, కళ్లు గుంటలు పడి... యిక ఉన్నంతకాలం యీసురోమని బతుకీడ్చే స్థితిలో పెడుతున్నారు యీ ఉగ్రవాదులు. ఈ ఉగ్రవాదులను అరికట్టడానికి డబ్బు పెట్టకుండా ఉప్పు, పప్పు స్కీములకు పెట్టడమేమిటని మన బాధ.

దిల్‌సుఖ్ నగర్‌లో సైకిలుకి బాంబులు పెట్టారట, అందువలన సైకిళ్లపై నిఘా వేస్తారట, కొత్త సైకిలు కొంటే ఐడెంటిటీ చూపించాలట, రిజిస్ట్రేషన్ కూడా చేయమంటారేమో! ఇదెక్కడి తుగ్లక్ ఐడియాయో నాకు అర్థం కాదు. సైకిలు అతి సామాన్య వాహనం. మనం కొన్నంత మాత్రాన మనమే వాడాలని లేదు. మన పనివాడు వాడవచ్చు, యింటి పక్కవాడు వాడవచ్చు. సైకిళ్లు యిప్పటికే అద్దెకు తిప్పుతారు, మెట్రో వచ్చాక హైదరాబాదులో మరింత విరివిగా అద్దె కిస్తారట. మరి గంట సేపటికి అద్దె సైకిలు కావాలంటే ఆధార్

కార్డు కుదువ బెట్టి వెళ్లాలా? పైగా సైకిళ్లు అతి సులభంగా చోరీ అవుతాయి. ఎవడైనా మన సైకిలు ఎత్తుకుపోయి యిలాటి బాంబు దాడికి ఉపయోగిస్తే మనల్ని జైల్లో పెడతారన్నమాట. సైకిళ్లపై నిఘా అనే ఐడియా రావడం వెనుక టిడిపి వారి ఎన్నికల గుర్తును బద్‌నామ్ చేయాలన్న కుట్ర వుందేమో ననిపిస్తోంది.

మరో అమోఘమైన ఐడియా కూడా వుందిట. ఇంటర్నెట్ టెలిఫోనీని నియంత్రిస్తారట. సైబర్ కఫేలలో ఓ పావుగంటసేపు మెయిల్స్ చెక్ చేసుకోవాలన్నా యికపై కష్టమేట. దాని నిర్వాహకుడు సిసిటివి పెట్టుకుని వచ్చిన ప్రతీవాణ్నీ ఫోటో తీసి, ఐడెంటిటీ కార్డు అడిగి నమోదు చేయాలట. డబ్బు ఖర్చని పోలీసులు మాత్రం సిసిటివి పెట్టుకోరు కానీ నాలుగు కంప్యూటర్లతో సైబర్ కఫే పెట్టుకున్నవాడు యీ సరంజామా అంతా పెట్టుకోవాలట. ఎందుకురా అంటే ఉగ్రవాదులు యింటర్నెట్ టెలిఫోనీ ద్వారా సందేశాలు పంపుకుంటున్నారట. పోలీసులు కళ్లు మూసుకుంటే ఆయుధాలు కూడా తెప్పించుకుంటారు. దానికోసం టెక్నాలజీ ఫలితాలు ప్రజలకు అందకుండా చేస్తారా? ఇంటర్నెట్ టెలిఫోనీని నిషేధిస్తే అత్యధికంగా దెబ్బ తినేది సామాన్యుడే. దాన్ని బంద్ చేయించడమేమిటి, నా బొంద!

కొన్ని రోజులు పోతే పోలీసులకు ఐడియా వస్తుంది – దిల్‌సుఖ్ నగర్ ప్రాంతాన్నే ఖాళీ చేయించి ఎడారిగా మార్చేద్దాం, అప్పుడు చంపడానికి మనుష్యులు దొరకరు అని! అసలు ముజిబ్‌ను సామాన్య హంతకుడిగా భావించి, జైల్లో సత్ప్రవర్తన కనబరిచాడంటూ వదిలేయడమేమిటి, జోక్ కాకపోతే! రాజకీయ ఒత్తిళ్లకు లొంగి వైయస్ క్షమాభిక్ష పెడతానంటే మాత్రం యీ పోలీసులు 'జైల్లో ఫలానా రకం మనుష్యుల్ని కలుస్తున్నాడండీ, వీడిది సత్ప్రవర్తన కాదు' అని చెప్పలేకపోయారా? వదిలేయ్ అంటే వదిలేయడమేనా? ఇప్పుడు వాడి వలన ఎంతమంది చచ్చిపోయారో చూడండి, యీ పాపంలో రాజకీయనాయకులతో బాటు పోలీసులకు భాగం లేదా?

పైగా వీళ్ల సామర్థ్యం చూడండి – కమాండోలంటే అబ్బో అనుకుంటాం, ఐయస్ఐ తరఫునుండి ఎవరో ఫోన్ చేసి హత్యాస్థలం వద్ద కమాండోల కదలికల గురించి వివరాలు అడిగితే ఓ కమాండో ఎవరు ఏమిటి అని అడక్కుండానే అన్నీ అప్పజెప్పేశాడట. అదేమిటి నాయనా అంటే 'ఎవరో పై అధికారి అనుకున్నాను' అన్నాట్ట. అంటే ఓ కోడూ, పాడూ ఏమీ లేదు, కాస్త గంభీరంగా అడిగితే చాలు, వీళ్లు వణికిపోయి అన్నీ చెప్పేస్తారన్నమాట. అవతలివాడు మంచితనంగా వూరుకున్నాడు కానీ లేకపోతే 'వెళ్లి ఓ నలుగురు కమాండోలను కాల్చేసి నాకు రిపోర్టు చేయి' అంటే 'యస్సర్' అని కాల్చేసేవాడేమో కూడా! ఇలాటి వాళ్ల చేతికి ప్రాణాలను అప్పగించి కూర్చున్నాం మనం! ఇదేం పోలీసు వ్యవస్థ అంటే 'విచారణకు ఆదేశించాం, అయినా అతను పెద్ద ముఖ్యమైన విషయాలేవీ చెప్పలేదు లెండి' అంటున్నారు పోలీసు బాసులు. వీళ్లను చూసి అందరం పళ్లు కొరుక్కుంటున్నాం. వీళ్లు ఎందుకు సరిగ్గా పనిచేయడం లేదని వ్యాఖ్యానిస్తున్నాం. నిందిస్తున్నాం.

ఇలాటి సమయంలో రాజగోపాల్‌గారు చక్రధారియై దిగి వాళ్లకు చక్రం అడ్డేశారు. పోలీసులు ఉగ్రవాదాన్ని అరికట్టేద్దురుట, కానీ తస్సదియ్య, యీ తెలంగాణ ఉద్యమం అడ్డు వచ్చేసిందట. వాళ్ల శక్తియుక్తులన్నీ ఉద్యమంపైనే కేంద్రీకరించడం చేత యిలాటి వైఫల్యాలు జరిగాయట. ఇంతకు మించిన జోక్ వుందా? అసలు తెలంగాణ ఉద్యమం చురుగ్గా లేదని, దానిపై ఎవరికీ ఆసక్తి లేదని, అందరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారనీ, ఉద్యమం ఉస్మానియా యూనివర్శిటీ దాటి వెళ్లలేదని రాజగోపాలే అంటూ వచ్చారు. ఇప్పుడు హఠాత్తుగా ఆ ఉద్యమమేదో పెద్ద జీవన్మరణ సమస్య అయినట్టు, దాన్ని హేండిల్ చేయడానికి పోలీసులు చాలా అవస్థలు పడిపోయి, ఆ క్రమంలో ఉగ్రవాద కదలికలపై తనిఖీలను వాయిదా వేసుకోవలసి వచ్చినట్టు మాట్లాడడం ఏం సబబు?

అయినా తెలంగాణ ఉద్యమం గురించి పోలీసులు చేయవలసినది, చేస్తున్నది ఏముంది? ఉద్యమకారులే వారిలో వారు ఘర్షించుకుంటూ బలహీనపరుచుకున్నారు. గట్టిగా ఏ బందూ జరగలేదు. తెలంగాణ ఉద్యమం నీరుకారిపోయిందని, రాష్ట్రంలో 90 శాతంమంది సమైక్యవాదులేననీ సర్వేఫలితాలను వెల్లడిస్తూ రాజగోపాల్ ఉద్యమకారుల నైతిక స్థయిర్యాన్ని దెబ్బ తీస్తూనే వున్నారు. ఇక పోలీసులు దేని గురించి చింత పడాలి? ఉగ్రవాదంపై నుండి దృష్టి ఎందుకు మరలించాలి?

దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లు జరగగానే కోదండరాం చేసిన మంచి పని – 'సడక్ బంద్' వాయిదా వేయడం! దానితో బాటే యింకోటన్నారు – 'తెలంగాణ ఉద్యమం అణచివేయడానికి చూపినంత శ్రద్ధ ఉగ్రవాదంపై చూపించి వుంటే అది ఎప్పుడో అరికట్టబడేది' అని. ఇప్పుడు రాజగోపాల్ దాన్నే ఎండార్స్ చేస్తున్నారు. 'ఐ లవ్యూ రాజగోపాల్' అని కెసియార్ అన్నారంటే మరి వూరికే అంటారా? తెలంగాణ ఉద్యమం ప్రజల మనసుల్లో వున్నా అధికార పార్టీ ఆదేశాల మేరకు పోలీసులు ఎంతో సమయం వెచ్చించి దాన్ని అణచివేస్తున్నారు – అనే సందేశాన్ని యిటు కోదండరాం, అటు రాజగోపాల్ యిద్దరూ కలిసి యిస్తున్నారు.

'తరచి చూస్తే పోలీసులు తెలంగాణ ఉద్యమాన్ని పట్టించుకోవడం లేదు, ఉగ్రవాదాన్ని పట్టించుకోవటం లేదు. నాయకుల పాదయాత్రల కాపలాకే పోలీసులు ఖర్చయిపోతున్నారు' అంటారు కొందరు. అది చాలనట్టు పాదయాత్రకు అడ్డు తగిలే రాజగోపాల్ లాటి వాళ్లని కట్టడి చేయడానికి ఎంతమంది పోలీసుల సమయం ఖర్చయిందో అదీ చూడాలి కదా – అంటాను నేను. ఇంట్లో వున్నారంటూ, బయట తాళం వేశారంటూ, యింకెక్కడో మారువేషంలో సంచరించారంటూ, అంతలోనే పోలీసులకు దొరక్కుండా తప్పించుకున్నాను చూశారా అంటూ బనీను లేకుండా లుంగీతో మీడియాకు పోజులిస్తూ.. యిలా పోలీసు ఫోర్సును తెగ వాడేసిన ఆయనవంటి వాళ్ల వలననే పోలీసులకు మతి తోచకుండా పోయి ఉగ్రవాదాన్ని సరిగ్గా అరికట్టలేకుండా పోయారని అనడం సబబాతి సబబు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 06 ఎమ్బీయస్ : రాజసులోచన**

నటీమణి రాజసులోచన మరణించారు. ఆమె జీవిత విశేషాలు, సినిమాల వివరాలు పేపర్లో చదివే వుంటారు. చేతికి దొరికిన సినిమా క్లిప్పింగ్స్‌తో టీవీలు వండి వార్చినవి చూసి వుంటారు. వాటి గురించి నేను కొత్తగా చెప్పేదేమీ లేదు. హీరోయిన్లలో ఆమె ప్రత్యేకత గురించి నా భావాలు పంచుకుందామని యిది రాస్తున్నాను. ఆవిడ తరంలోని హీరోయిన్లందరూ ఒకలాటి మూస పాత్రలే వేశారు. అత్తగారి చేతిలో తన్నులు తినడం, ఓర్పుతో, సహనంతో చెడ్డవాడైన భర్తను మంచిగా మలచుకోవడం – యిలాటివే. జమున ఒక్కరు మాత్రం గర్విష్టి పాత్రలు కూడా వేశారు. గర్విష్టి కాదు కానీ, ఆత్మాభిమానం మెండుగా వున్న పాత్రలు కృష్ణకుమారి వేశారు. ఎన్ని వేసినా వాటిలో వ్యాంపిష్ షేడ్స్ లేవు. రాజసులోచన వేసిన పాత్రల్లో అన్ని రకాలూ వున్నాయి. ఆమె హీరోయిన్ దగ్గర్నుంచి వ్యాంప్ దాకా, క్లాసికల్ డాన్సర్ నుండి కాబరే డాన్సర్ దాకా అన్ని పాత్రలూ వేశారు. కారెక్టర్ పాత్రల్లో కూడా రాణించారు. ఏ పాత్ర వేసినా సునాయాసంగా, అలవోకగా వేశారు. ఎక్కడా యిబ్బంది పడినట్టు తోచదు.

అసలు తెరపై రాజసులోచన మంచి హుషారైన వ్యక్తి. ఆమెలో ఒక రస్టిసిటీ వుంది. అంటే ముగ్ధలాటి పల్లెటూరి అమ్మాయిగా కాదు, కొంటెతనం, జాణతనం, ధైర్యం కలిసిన పాత్రలకు పెర్‌ఫెక్ట్‌గా మ్యాచ్. ''రాజమకుటం'' సినిమా చూస్తే నేను చెప్పదలచినది మీకు అర్థమవుతుంది. కళ్లు తిప్పుతూ రెచ్చగొట్టగలదామె. ఆమె గొంతు ఆమెకు పెద్ద ఎసెట్. అది హస్కీయా అంటే హస్కీ కాదు. అసలు కావాలని హస్కీ చేసుకుని మాట్లాడవలసిన పనే లేదు. ఆమె కంఠస్వరంలోనే గమ్మత్తయిన మత్తు వుంది. ఆమెను మిమిక్రీ చేయడానికి ఎవరూ ప్రయత్నించి వుండరు కానీ చేయడం కష్టమే. భానుమతి కంఠం లాగే ఆవిడది కూడా ఒక ప్రత్యేకమైన స్వరం.

ఆమె చిన్నప్పటినుండీ క్లాసికల్ డాన్సరే. దక్షిణాది తెలుగువాళ్లు. తండ్రి రైల్వే ఉద్యోగి కాబట్టి ఉద్యోగరీత్యా విజయవాడలో వుండడం చేత రాజసులోచన అక్కడ పుట్టారు. పుట్టినపుడు ఆవిడ పేరు రాజీవలోచన. వెంటనే మద్రాసుకి బదిలీ అయింది. బాల్యం, సినీజీవితమంతా అక్కడే గడిచింది. అందుకే ఆవిడ తమిళ ఉచ్చారణ పెర్‌ఫెక్ట్‌గా వుంటుంది. వాస్తవం చెప్పాలంటే తెలుగు ఉచ్చారణలోనే వొత్తుల దగ్గర అప్పుడప్పుడు తప్పులు వినబడతాయి. ''తోడికోడళ్లు''లో ఓ చోట 'కంసాలి' అనే బదులు 'కంసలి' అన్నారు. బి సరోజాదేవి తెలుగులాగ అది కూడా లబ్జుగానే వినబడిందిలా వుంది డైరక్టరు సరి చేయలేదు. కన్నడం కూడా బాగా వచ్చి వుంటుంది. కన్నడ సినిమాలు కూడా వేశారు. దండాయుధ పిళ్లై, వెంపటి చినసత్యం గార్ల వద్ద నాట్యం నేర్చుకుని గొప్ప డాన్సర్‌గా పేరు తెచ్చుకున్నారు.

ఇంత డాన్సు చేసినా ఆమెను సన్నగా చూసిన గుర్తు ఎప్పుడూ లేదు. పుష్టిగా కనబడడం వలన కాబోలు పల్లెటూరి అమ్మాయి యిమేజే నా మనసులో ముద్రించుకుపోయింది. ఆమె శరీరాకృతి ఆకర్షణీయంగా తోచలేదు కానీ మొహం, జుట్టు, కళ్లు, నవ్వు, మాట – వలన శృంగారమూర్తిగా తోచేది. శృంగారం కంటె ఎక్కువగా ఆమె వైబ్రన్సీ (చురుకుతనం), కిల్లాడీతనం బాగా ఆకట్టుకునేవి. ''పెళ్లినాటి ప్రమాణాలు''లో ఆమె నాగేశ్వరరావును ఏడిపించిన తీరు చూసి తీరాలి. దానికి మూలకథ ''సెవెన్ ఇయర్ ఇచ్''లో ఆ పాత్ర మేర్లిన్ మన్రోది. గౌను ఎగిరిపోతున్న మేర్లిన్ ఫేమస్ స్టిల్ ఆ సినిమాలోదే. గౌను కాదు కదా, పైట కూడా ఎగరకుండా రాజసులోచన ఆ పాత్రను మోస్ట్ సెడక్టివ్‌గా నిర్వహించారు. ''పాండవ వనవాసం''లో మూడు బాణీలుగా, మూడు రకాలుగా, నర్తించి తెరపై భీముణ్ని కాకపోయినా హాల్లో ప్రేక్షకులను సెడ్యూస్ చేశారు.

''పెంకి పెళ్లాం'' సినిమాలో పెంకెఘటం హీరోయిన్ పాత్రలు లాటివి వేయడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ''జయభేరి'' వంటి కొన్ని సినిమాల్లో హీరోని చెడగొట్టే పాత్రలూ అంతే సునాయాసంగా వేయగలరు. ''మాంగల్యబలం''లో రేలంగి పక్కన హాస్యపాత్ర వేసి, ''తోడికోడళ్లు''లో అతన్ని చెడగొట్టే దుష్టపాత్ర వేసి, ''ఇద్దరు మిత్రులు'' వచ్చేసరికి నాగేశ్వరరావు పక్కన హీరోయిన్ స్థాయికి ఎదిగిపోయారు. శోకపాత్రలు కూడా వేశారామె. అలాటివి తమిళంలో ఎక్కువగా చూశాను. తమిళంలో, తెలుగులో, కన్నడంలో అందరు అగ్రనటుల సరసన వేశారు. 35 ఏళ్ల వయసు వచ్చేసరికి ఆమెకు తెలుగులో హీరోయిన్ పాత్రలు రావడం మానేశాయి – స్థూలకాయం వలన కాబోలు! డాన్సు ఐటమ్ వుంటే చేస్తూండేవారు. 1971లో రిలీజైన ''మోసగాళ్లకు మోసగాడు'' సినిమాలో ఏకంగా జ్యోతిలక్ష్మి టైపులో నడుంకి గుడ్డ పీలికలు కట్టుకుని డాన్సు చేయడంతో బుర్ర తిరిగిపోయింది. జ్యోతిలక్ష్మి అయితే హెలెన్‌లా సన్నటి జఘనం కాబట్టి ఫర్వాలేదు, యీమె ఘన జఘనంతోనే, అప్పటిదాకా తనకున్న మంచి యిమేజి గురించి చింతించకుండా డేరింగ్‌గా చేసింది. నాకు ఎబ్బెట్టుగా తోచింది కానీ నేలక్లాసు ప్రేక్షకులు యీలలేశారు.

ఆ వూపుతో ఆ తరహా సినిమాలన్నిటిలోనూ విలన్ పక్కన ప్రియురాలిగా వేషాలు వెతుక్కుంటూ వచ్చాయి. మన తెలుగు సినిమా ప్రేక్షకుల టేస్టే యిలా వుందని వాపోవద్దు. ఆ సినిమాను గ్రీక్ భాషలో డబ్ చేసి విడుదల చేశారట. సినిమాను కుదించడానికి గ్రీక్ డిస్ట్రిబ్యూటర్ పాటలన్నీ తీసి పారేశాడు. అన్నీ తీసేశాడు కానీ రాజసులోచన డాన్సు మాత్రం విపరీతంగా నచ్చి అది వుంచేశాడు. ''మరి ఆ బాణీలో లిప్ సింక్ కుదిరేట్లా గ్రీకు భాషలో మళ్లీ పాట రాయించాలా?'' అని మనవాళ్లు అడిగితే, ''అబ్బే అక్కరలేదు, ఆ తెలుగుపాట అలాగే వుంచేయండి'' అన్నాడు. ''మరి అర్థం కాదు కదా'' అంటే ''ఏదో జిప్సీ భాష అనుకుంటారు మా వాళ్లు, డోంట్ వర్రీ'' అన్నాట్ట. అంటే కండపట్టి వున్నవాళ్లకు ఖండాంతరాల్లో కూడా డిమాండ్ వుందన్నమాట.

ఇలాటి వేషాలు వేస్తూనే సాంఘిక సినిమాల్లో గయ్యాళి అత్తగా వేశారు రాజసులోచన. ''తాత–మనుమడు''లో (1973) లో హీరోకి తల్లిగా, అత్తమామలను నిరాదరణ చేసిన కోడలిగా పాత్ర వచ్చింది. అలా చాలా పాత్రలు వచ్చాయి. ఇవి ఓ పక్కన వేస్తూనే

రంగస్థలంపై నాట్యప్రదర్శనలు జోరుగా యిచ్చారు. నాట్యపాఠశాల స్థాపించి ఎందరికో నేర్పారు. హిందీ సినిమాల్లో భగవాన్ మంచి డాన్సర్, హాస్యనటుడు. అతని డాన్సులకు చాలా పేరుంది. ఎవియంవారు "చోరీ చోరీ" సినిమా మద్రాసులో తీస్తూ భగవాన్ పక్కన జోడీగా రాజసులోచనకు వేషం యిచ్చారు. ఆమె అతనికి ఏ మాత్రం తీసిపోకుండా డాన్సు చేసి శభాష్ అనిపించుకుంది.

వ్యక్తిగత జీవితంలో చూడబోతే ఆమె మొదటి వివాహం భగ్నమైంది. సియస్ రావుతో జరిగిన రెండవ వివాహం కూడా చివర్లో చికాకుల్లో పడింది. వ్యక్తిగతంగా ఏం యిబ్బందులు పడినా వాటిని తట్టుకుంటూ ఆమె నటిగా, నర్తకిగా రాణిస్తూనే వచ్చారు. నటీమణిగా ఆమె వేసిన పాత్రల్లో నాకు బాగా గుర్తుండే యింకో పాత్ర "సువర్ణసుందరి". ఆ సినిమాలో హీరో పగటిపూట ఆడదానిగా మారిపోతాడు. ఆ వేషం వేసిన రాజసులోచన మధ్యమధ్యలో – మాయాశశిరేఖలా – మగపోకడలు చూపించారు. నటీమణిగా బాగా గుర్తుండి పోయేది 'పాడవోయి భారతీయుడా' ("వెలుగునీడలు") వంటి అద్భుతగీతానికి నర్తించడం! ఆవిడకు నివాళి అర్పిస్తూ.. – **ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 07.08 వీక్లీకై ఎమ్బీయస్ : టిడిపికి అవిశ్వాసం తలనొప్పి**

అధికారంలో వున్న పార్టీకి విశ్వాసపరీక్ష ఓ పెద్ద తలనొప్పి. ప్రతీ రెండు నెలలకూ ఓ సారి ప్రతిపక్షాల వారు 'ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది. రాజీనామా చేసి, ఎన్నికల బరిలోకి దిగాలి' అంటూంటారు. వాళ్ల మెజారిటీ కాస్త అంచుల్లో వుంటే 'తమ బలాన్ని అసెంబ్లీలో నిరూపించుకోవాలి' అని గవర్నరుకు మహజర్లు యిస్తూ వుంటారు. టిడిపికి అదేం ఖర్మమో కానీ అవిశ్వాసపరీక్ష ఓ పెద్ద తలనొప్పిగా పరిణమించింది. కనబడిన ప్రతీవాడూ 'అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా అవిశ్వాసం పెట్టడం టిడిపి బాధ్యత, పెట్టమనండి' అంటూంటారు.

అదేమిటో గానీ ప్రతీ నాయకుడూ ఎదర పార్టీ ఏం చేయాలో చెప్పేవాడే. 'తెలంగాణ యివ్వకపోతే కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయిపోతుంది, అందుకని వెంటనే కాంగ్రెస్ యివ్వాలి, యివ్వకపోతే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తమ పార్టీపై ఒత్తిడి తేవాలి' అంటారు కాంగ్రెసేతర తెలంగాణ నాయకులు. తెలంగాణ యివ్వక కాంగ్రెస్ భూస్థాపితం అయితే మీరు చంకలు గుద్దుకోవాలి కానీ కాంగ్రెస్ చేత తెలంగాణ యిప్పించి, దాన్ని నిలబెట్టే పని మీకెందుకు? పైగా వాళ్ల ఎమ్మెల్యేలు తమ పార్టీని ఒప్పించలేక ఫైనల్‌గా ఓటర్ల చేత ఛీత్కారం కొట్టించుకుంటారని మీరెందుకు వాపోవడం? ఆ పని జరిగితే మీకేగా లాభం? అదేవిధంగా తెరాస బిర్యానీ లాబీయింగ్‌లు మానేసి తెలంగాణ పల్లెల్లోకి వెళ్లి ఉద్యమపార్టీగా పాతుకుపోవాలని, ప్రజల్లోకి చొచ్చుకుపోవాలని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వాళ్లకు సలహాలిస్తారు. వాళ్లది ఉద్యమపార్టీయో, ఊకదంపుడు పార్టీయో వాళ్లు చూసుకుంటారు. మధ్యలో మీకెందుకు ఆ గోల? వాళ్ల అజెండా మీరెందుకు తయారు చేయడం?

ఇప్పుడు అందరూ టిడిపిపై పడ్డారు. అవిశ్వాసం పెట్టాలి, పెట్టాలి అంటూ. సరైన సమయంలో మేమే పెడతాం, మీరెవ్వరూ చెప్పనక్కరలేదు అంటోంది టిడిపి. కరక్టే కదా, సరైన సమయం యింకా రాలేదని వాళ్లకు తెలుసు. నిజానికి బయటనుండి చూస్తే యిదే సరైన సమయం అని మీరూ నేనూ అనుకుంటాం. ఇది అసమర్థ ప్రభుత్వం, అధికధరల ప్రభుత్వం, అంధకారాన్ని వ్యాప్తి చేసే ప్రభుత్వం, ప్రజలు రాళ్లు పుచ్చుకుని కొట్టదగిన, గొడ్డళ్లతో నరకదగిన ప్రభుత్వం, క్యాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది, ఈ క్షణంలో ఎన్నికలు జరిగితే టిడిపికి అధికారం తథ్యం – అని బాబు రోజూ చెపుతూంటే కాబోసనుకుంటున్నాం. వాళ్ల అబ్బాయి మరీ ధాటీగా చెప్తున్నారు – బాబు నడిచిన ప్రతి వెయ్యి కిలోమీటర్లకు ఢిల్లీలో భూకంపం, ఢిల్లీ పాలకులకు కంపం కలుగుతున్నాయని ! పాదయాత్రకు 50 కోట్లు పోతే పోయాయి కానీ ఢిల్లీ పాలకులను వణికించామంటే మన తెలుగు వాళ్లకు అదో తృప్తి.

ప్రభుత్వం అప్రదిష్టపాలయినపుడు ఆ లాభం ప్రతిపక్షాలకు కలుగుతుంది – సహజంగా! మన రాష్ట్రంలో టిడిపి కాక మరో రెండు ప్రతిపక్షాలున్నాయి. ఒకటి వైకాపా, దాని అధ్యక్షుడు జైల్లో మగ్గుతున్నాడు. పార్టీకి దశానిర్దేశకత్వం చేసే స్థితిలో లేడు. మరొక ప్రతిపక్షం – తెరాస. దాని అధ్యక్షుడు ఫామ్‌హౌస్‌లో సేద దీరుతున్నాడు. సహకార ఎన్నికలలో బాగా దెబ్బతిని వున్నాడు. ఇలాటి పరిస్థితి ప్రధాన ప్రతిపక్షమైన టిడిపికి మంచి అనువైనది. ఆలస్యం చేస్తే జగన్ జైల్లోంచి బయటకు వచ్చేయవచ్చు, కెసియార్ నిజంగా పల్లెబాట, బస్సుయాత్ర చేపట్టేయవచ్చు. అందుకని టిడిపి చప్పున అవిశ్వాసం పెట్టేసి, చప్పుచప్పున ప్రభుత్వాన్ని పడేసి, ఎన్నికలు తెచ్చేసి, బాబుకి యింకో ఏడాది వయసు మీరకుండానే మళ్లీ సిఎం అయిపోవచ్చు. పైగా యిక్కడ యింకో పాయింటు వుంది. పార్లమెంటు ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికలు కలిపి జరిగితే టిడిపికి నష్టం జరుగుతోందని బాబు లెక్క. ఇప్పుడే అసెంబ్లీ ఎన్నికలు వచ్చేస్తే ఆ భయమూ వుండదు. ఎంచక్కా స్థానిక సమస్యలే ఫోకస్‌లోకి వస్తాయి. బాబు సమర్థ పాలన వెర్సస్ కిరణ్ విద్యుత్ వైఫల్యాలు చర్చకు వచ్చి 'మళ్లీ మాకు సమర్థుడే కావాలి బాబోయ్' అంటూ తెలుగు ఓటర్లు బాబుకే పట్టం కడతారు – ఇదీ మనం అనుకునేది.

కానీ బాబు అలా అనుకోవడం లేదు. సరైన సమయం రాలేదు అనుకుంటున్నారు. బాబు మొదటినుండీ మెదడుతో బ్రతికే మనిషి. హృదయానికి పెద్దగా పని చెప్పరు. అంతా లెక్కలు, చదరంగపు ఎత్తులు, దూరపుచూపు, బుద్ధివిన్యాసం. అందువలన యిది సరైన సమయం కాదని బాబు అనుకుంటున్నారంటే దానిలో వాస్తవం వుందన్నమాట. మొన్న పంచాయితీ ఎన్నికలలో టిడిపికి బలం

వుందని తెలినా, అది అసెంబ్లీలో అధికారం తీసుకువచ్చే స్థాయిలో లేదని ఆయన గ్రహించారన్నమాట. పాదయాత్ర పుట్టించే జోష్ మరీ అంత కాదని, కిరణ్ వంటి అర్భక ముఖ్యమంత్రిని కూడా కదిలించలేదని తేల్చేసుకున్నారన్నమాట. అందుకే సరైన సమయం కోసం ఆగారు. నిజానికి వైయస్సార్ మరణం తర్వాత రాష్ట్రంలో టాలెస్ట్ లీడర్ చంద్రబాబే అని, ఆయనకు ఎదురు లేదని అనుకున్నాం. కానీ కాలం కలిసి రాక, కిరణ్‌ను కూడా ఓడించే స్థితిలో లేనన్న సంగతి బాబుకే తెలుస్తోందన్నమాట. ఇది బాధాకరం. ఇదే బాధాకరం అనుకుంటే తక్కినవాళ్లు 'అవిశ్వాసం పెట్టలేదు కాబట్టి కాంగ్రెస్‌తో కుమ్మక్కయినట్టే..' అనడం మరీ బాధాకరం. అలా అంటున్నారు కదాని 'కుమ్మక్కయి కాదు, ఎన్నికలలో నెగ్గుతామన్న నమ్మకం చాలక..' అని బహిరంగంగా చెప్పుకోలేరు కదా. అందుకని 'మా జోలి మీకెందుకు, కావాలంటే మీరే పెట్టవచ్చుగా..' అన నారంభించారు.

ఏదో మాటకు మాట సమాధానం చెప్పాలని అలా అన్నారే కానీ వాళ్లు పెట్టాలని కూడా టిడిపి ఉద్దేశం కాదు. పెడితే మళ్లీ ఎలా ఓటేయాలి అన్న సందేహం వుంది. పైగా వేర్వేరు వాళ్లు వేర్వేరు కారణాల చేత అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేసి, ఎన్నికలు తెచ్చి పెట్టేస్తే..! ఏదో యిలాగే మాటలతో కాలక్షేపం చేద్దామని చూస్తే తెరాస కొంపముంచింది. తను అవిశ్వాసం పెడతానంటోంది. 30 సభ్యుల బలం లేకపోయినా ఉత్తిపుణ్యాన పబ్లిసిటీ కొట్టేసింది. మేం ప్రయత్నాలు ప్రారంభించాం కాబట్టి టిడిపి మాకు మద్దతు యిచ్చి తీరాలి, యివ్వకపోతే కాంగ్రెస్‌తో కత్తు కలిపినట్టే అని యిరకాటంలో పెట్టింది. ప్రజాసమస్యలపై అవిశ్వాసం నోటీసు యిస్తే అదో దారి. ఆ సమస్యలనేవి ఎప్పుడూ ఎవర్‌గ్రీన్‌గా వుంటాయి. ఊరగాయలా ఎప్పుడైనా, ఎన్నిసార్లయినా వాడుకోవచ్చు. కానీ తెరాస తెలంగాణ అంశం ముందు పెట్టుకుని మరీ యిస్తోంది. అవిశ్వాసం నెగ్గి ప్రభుత్వం పడిపోతే తెలంగాణ యివ్వని కారణంగానే ప్రతిపక్షాల చేతిలో కాంగ్రెస్ చిత్తయి ప్రభుత్వం పోగొట్టుకుంది అనే మాట వస్తుంది. అప్పుడు గెలిచిన తెరాస పట్ల విభజనవాదులకు గర్వం, ఓడిన కాంగ్రెస్ పట్ల సమైక్యవాదులకు జాలి కలుగుతాయి. గణనీయమైన తమ ఓట్ల ద్వారా ప్రభుత్వాన్ని పడగొట్టిన టిడిపికి విభజనవాదుల మద్దతు దక్కుతుంది (తెరాసకు యివ్వగా మిగిలినది..) కానీ సమైక్యవాదులకు టిడిపి అంటే ఏవగింపు కలుగుతుంది. తెలంగాణ అంశంపై ప్రభుత్వాన్ని కూల్చేసింది – అని. పోనీ కూల్చకుండా ప్రభుత్వాన్ని అడలేసి వదిలేద్దామా అంటే మళ్లీ కాంగ్రెస్ విప్ ధిక్కరించి వైకాపాకు కొందరు ఓట్లేయవచ్చు. వారిని బహిష్కరించి ఉపయెన్నికలు నిర్వహించవచ్చు, ఉపయెన్నికలు అంటే టిడిపి మరీ అడలు. అసెంబ్లీ ఎన్నికలలోనే పూర్తి విజయం రాదన్నది సందేహం మాత్రమే. ఉపయెన్నికల్లో ఆ పాటి సంశయం కూడా లేదు. కచ్చితంగా ఓటమే. నాలుగేళ్లగా ఇప్పటిదాకా జరిగిన దాదాపు నలభై ఉపయెన్నికలలో ఒక్కటీ గెలవలేదు.

తెరాస తక్కిన ప్రతిపక్షాలతో అంటోంది – 'మేం తెలంగాణ సమస్యపై మూవ్ చేస్తున్నాం, మీకున్న వేర్వేరు కారణాల చేత తీర్మానానికి మద్దతివ్వండి. అందరం కలిసి పడగొడదాం' అని. పైకి అంటోంది కానీ వాళ్ల మర్యాద కాపాడుతూ అందర్నీ పిలిచి సంప్రదించి అప్పుడు ప్రకటించి వుంటే అదో దారి. కానీ తెరాసకు అది రుచించదు. ఎందుకంటే దాని లెక్క ప్రకారం తక్కిన పార్టీలు ఏ కారణాల చేత తన బిల్లుకు మద్దతు యిచ్చి గెలిపించినా, రాష్ట్రవిభజనే వెలుగులోకి వస్తుంది, తద్వారా ఆ క్రెడిట్ తెరాసకే పోతుంది. తక్కినవాళ్లతో పంచుకోవాల్సిన పని లేదు, తను తెలంగాణకు ఏకైక ప్రతినిథిగా వెలుగుతూనే వుండవచ్చు. అందుకనే తాను ముందుగా ప్రకటించేసి, మొక్కుబడిగా తక్కినవాళ్లకు లేఖలు పంపించి వూరుకుంది. తక్కిన ప్రతిపక్ష నాయకులతో మాటామంతీ కూడా లేదు. అవిశ్వాసం నెగ్గితే దాని వలన లాభం తెరాసకు, నష్టం టిడిపికి కలిగేది – తెలంగాణ అంశంతో ప్రభుత్వం పడగొట్టడాన్ని సమైక్యవాదులకు నచ్చచెప్పుకునే బెడద టిడిపి నెత్తిన పడుతుంది కాబట్టి! తీర్మానం నెగ్గకపోతే తెరాస – 'టిడిపి కలిసి రాకపోవడం చేతనే మా మాట నెగ్గలేదు. సమైక్యవాది కిరణ్‌తో మరో సమైక్యవాది బాబు చేతులు కలిపాడు' అని యాగీ ఎలాగూ తప్పదు.

ఈ బాధలన్నీ కళ్లారా చూడలేకనే బాబు అసెంబ్లీకే రాను పొమ్మంటున్నారు. 'ఇంటి కన్నా గుడి పదిలం అన్నట్టు, అసెంబ్లీ కన్నా నలుగుర్ని తిట్టుకుంటూ ఊళ్లు పట్టుకుని పాదయాత్రలు చేయడం సులభం. తలనొప్పి కన్నా పిక్కల పీకుడు బెటరు' అనే ధోరణిలో పడ్డారాయన. చివరకు తెగించి తెరాసవన్నీ డ్రామాలనీ, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడానికే అనీ దానికి నాలుగు అక్షింతలు వేసి అవిశ్వాసానికి మద్దతు యివ్వం అని తేల్చేశారు. టిడిపి అవిశ్వాసం పెడతామంటే మద్దతు యిస్తామంటూ చెప్పిన వైకాపావారికి కూడా తెరాసపై నమ్మకం తక్కువని తోస్తోంది. వాళ్ల ప్రకటనపై ఆధారపడకుండా, అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాక అప్పుడు చూసి, దానికి మద్దతు యిస్తామో లేదో చెప్తామన్నారు. చివరకు మేమూ పెడతాం అంటున్నారు.

ఈ లోపున కెసియార్ రెచ్చిపోయారు. బాబుని థర్డ్ రేట్ నాయకుడన్నారు. ఇంటిపేరు నారా కాదు, నయవంచన అన్నారు, కాంగ్రెస్‌తో కుమ్మక్కు అయ్యావు, బేరం ఎంతకు కుదిరింది (నిజానికి గతంలో కాంగ్రెస్‌కు ఓటేసిన ముగ్గురు ఎమ్మెల్యేలు తెరాస వారే, వారిపై యిప్పటిదాకా చర్యలు లేవు) కేసులు పెట్టకుండా చిదంబరం కాళ్లమీద పడ్డావు, నిర్లజ్జగా, నిస్సిగ్గుగా వున్నావు... అంటూ దారుణంగా తిట్టిపోశారు. మాది తోక పార్టీ అంటున్నావు, 2009లో పొత్తు పెట్టుకున్నపుడు తొండం పార్టీగా కనిపించిందా? అని కూడా అడిగారు. ఇదంతా చూస్తే కెసియార్ అవిశ్వాసం ప్రకటించినది కాంగ్రెస్ పైననా, లేక సాటి ప్రతిపక్షమైన టిడిపి పైననా అన్న సందేహం వస్తుంది. ప్రతిపక్షాలు యిలా విడిపోయాయి కాబట్టే కాంగ్రెస్ నెమ్మదిగా వుంది. నిజానికి టిడిపికి కాంగ్రెసుతో కుమ్మక్కు కావలసిన పనేముంది? సంగతేమిటంటే – ప్రస్తుతానికి టిడిపి, కాంగ్రెస్ తర్వాతి స్థానంలోనే వున్నట్టు పంచాయితీ ఎన్నికలు తేల్చాయి. స్థానిక ఎన్నికల ఫలితాలు చూశాక తెలుస్తుంది – కాంగ్రెస్‌కు, టిడిపిల బలాబలాలు ఎంతో. కాంగ్రెస్ కంటె ఎక్కువ సీట్లు గెలుచుకుంటే టిడిపి ఎవరి ప్రోద్బలం లేకుండా తనంతట తానే పెట్టేస్తుంది. అదే వాళ్ల దృష్టిలో 'సరైన' సమయం! ఆ 'మంచి'

సమయం వచ్చేవరకు టిడిపి యిలాటి మాటలు పడాల్సిందే! – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)

మార్చి 09 వీక్లీకై ఎమ్బీయస్ : ఇదోరకం గజేంద్రమోక్షం

సినిమాల్లో జంతువుల వాడకాన్ని నిషేధించడం చేత గ్రాఫిక్స్‌ను ఆశ్రయించడం జరిగింది. చూస్తూండండి – దేవాలయాల్లో కూడా ఏనుగులకు బదులు వర్చ్యువల్ ఏనుగుల లేజర్ షోలు దర్శనమిచ్చే రోజులు దూరంలో లేవు. ఎందుకంటే దేవాలయోత్సవాలలో ఏనుగులకు తిక్కరేగి జనాలపై విరుచుకుపడడం, కొంతమంది చనిపోవడం, మరి కొంతమంది గాయపడడం తరచుగా జరుగుతోంది. ఏనుగులు, దేవాలయాలు అనగానే కేరళ గుర్తు వస్తుంది. గత నెలలో కోచి వద్దనున్న పెరుంబవూరులో ఓ గుడిలో ఓ ఏనుగు ముగ్గురు స్త్రీలను తొక్కేసింది, 20 మందిని గాయపరచింది. 2008 లో ఏనుగుల కారణంగా చనిపోయినవారి సంఖ్య 26, తర్వాతి సంవత్సరాలలో 29, 33 కాగా 2011 నాటికి 75కి చేరింది. 2012లో కాస్త తగ్గి 49 అయింది. తిరగబడిన సంఘటనల సంఖ్య చూడబోతే 816! ఈ ఏడాది యిప్పటిదాకా 240 సంఘటనలు జరిగి 5 గురు పోయారు. గాయపడినవారి సంఖ్య చాలా ఎక్కువగా వుంది. ఇటీవల కేరళలో 'ఏనుగు కారణంగా హింసాత్మక సంఘటన' అన్న వార్త లేని రోజే లేదు. శతాబ్దాలుగా లేని సమస్య యిప్పుడు ఎందుకు వచ్చింది అంటే దానికి చాలా కారణాలున్నాయి.

తరతరాలుగా ఏనుగుల సంరక్షణ అనేది కేరళీయుల జీవితంలో ఓ భాగంగా వుండేది. ఏనుగులు కుక్కల వంటి పెంపుడు జంతువులు కావు. వాటిని బంధించి వుంచవలసినదే, అప్పుడప్పుడు అంకుశంతో అదుపు చేయవలసినదే. దాని దైహిక అవసరాలను గమనించి ఆ ప్రకారం మెలగవలసినదే. తిక్కపుడితే అవి సృష్టించే ఉత్పాతం యింతా అంతా కాదు. వాటికి చికాకు కలగకుండా ఆలయాలలో ఏనుగుకి, ఏనుగుకి మధ్య యింత దూరం అనేది తప్పకుండా మేన్‌టేన్ చేసేవారు. వాటిని విసిగించకుండా, మరీ అలసిపోకుండా చూసుకునేవారు. గతంలో నంబూద్రి బ్రాహ్మణుల యిళ్లల్లో ఏనుగులు వుండేవి. వాటి ఆలనాపాలనా చూడడానికి మావటులను నియమించేవారు. జీవితాంతం ఆ మావటి ఆ ఏనుగును చూసుకునేవాడు, అతని తర్వాత అతని కొడుకు చూసుకునేవాడు. అందువలన ఏనుగుకి, మావటికి అనుబంధం వుండేది.

ఇప్పుడు మొత్తమంతా వ్యాపారమయం అయిపోయింది. షోకు కోసమని పండగల సీజన్లో ఉత్సవ నిర్వాహకులు ఏనుగులను అద్దెకు తెస్తున్నారు. ఇది వరకు గుళ్లల్లో మాత్రమే ఏనుగులను తీసుకుని వచ్చేవారు. ఇటీవల చర్చిలు, మసీదులు కూడా ఏనుగులను తెప్పిస్తున్నాయి. దాంతో ఏనుగు యజమానులు అద్దెలు పెంచేస్తున్నారు. ఒక ఏనుగుకి తిండికోసం రోజుకి 1500 రూ.లు ఖర్చవుతుంది. మావటివాళ్ల జీతం వేరే. అద్దెకు తిప్పితే డిమాండ్‌ను బట్టి రోజుకి 8 వేల రూపాయల నుండి 50 వేల దాకా వస్తుంది. ఇంత డబ్బు వస్తోంది కదాని ఏనుగు యజమాని దాని కష్టం, సుఖం గమనించకుండా అవస్థ పెడుతున్నాడు. భరించి భరించి ఏదో ఒక రోజు అది తిరగబడుతోంది. ఉత్సవం చూడడానికి వచ్చిన జనం దాని కాళ్ల కింద నలిగిపోతున్నారు.

లారీ యజమాని లేదా అద్దె బస్సు యజమాని డ్రైవర్‌కి సరైన విశ్రాంతి వుందా లేదా అని గమనించకుండా బండి తోలమని పంపిస్తే యాక్సిడెంట్లు జరగడం గురించిన కథనాలు మనం అనేకం విన్నాం. ఏనుగు యజమానుల కథా యిలాటిదే. ఏనుగుల సంఖ్య బట్టి అద్దె వస్తుంది కదాని చిన్న వయసులోనే వాటిని అడవిలో పట్టుకుని తెచ్చేస్తున్నారు. ఏనుగులు క్రమశిక్షణ అనేది తమ గుంపులోని పెద్దల నుండి నేర్చుకుంటాయి. (వాల్ట్ డిస్నీ ''జంగిల్ బుక్'' సినిమాలో కెప్టెన్ హాథీ ఉదంతం గుర్తుకు తెచ్చుకోండి) ఆ 'విద్యాబుద్ధులు' నేర్చుకోకుండానే బయటకు తీసుకుని వచ్చేయడం వలన అవి డిసిప్లిన్ లేకుండా తయారవుతాయి. వాటిని అదుపు చేయడం మానవుల సాధ్యం కాదు.

పొడుగ్గా వున్న ఏనుగులకు డిమాండ్ ఎక్కువగా వుంటుంది. దేవుడి ఉత్సవ మూర్తిని దానిపై కూర్చోబెడతారు. అసాం, ఉత్తరాఖండ్, యుపి, బిహార్‌లలో ఎత్తయిన ఏనుగులు దొరుకుతాయి కదాని వాటిని కేరళకు తీసుకుని వస్తున్నారు. అక్కడి మనుషులు యిక్కడకు వస్తే ఎలా తబ్బిబ్బు పడతారో, ఏనుగులూ అలాగే తబ్బిబ్బు పడతాయి. ఇక్కడి మావటులకు, వారి భాషకు, వాతావరణానికి, తిండిలో మార్పుకు అవి అలవాటు పడడానికి చాలాకాలం పడుతుంది. కేరళలో పండగల సీజను నవంబరు నుండి ఏప్రిల్ వరకు వుంటుంది. సుమారు 35 వేల ఫంక్షన్లుంటాయి. అందుకని ఒక ఫంక్షన్ నుండి మరోదానికి వాటిని పరుగులు పెట్టిస్తారు. ఏనుగు తిండి తినడానికి 8–12 గంటలు తీసుకుంటుంది. ఈ ఫంక్షన్ల అడావుడిలో వాటికి అంత టైము యివ్వరు. అందువలన అవి ఆకలి తీరదు. అందువలన అవి చికాకుగా వుంటాయి.

పైగా ఆ సమయంలోనే అవి ఋతువులో వుంటాయి. మనుష్యులకైతే ఏడాది పొడుగునా సంభోగవేళే కానీ జంతువులలో అలా వుండదు. ఏడాదిలో కొన్ని నెలలు మాత్రమే సంభోగిస్తాయి. ఉత్సవాల పేరు చెప్పి వాటికి ఆ సౌఖ్యాన్ని దూరం చేయడంతో ఆ అకలి కూడా తీరక అవి పిచ్చెక్కి వుంటాయి. విశ్రాంతి నీయకుండా, కావలసినవి సమకూర్చకుండా వాటిని కష్టపెట్టి వాటిని మత్తులో జోకొట్టడానికి మందులు (సెడటివ్స్) యిస్తారు. నిద్రమాత్రలకు అలవాటు పడిన మనిషి మూడ్స్ ఎలా వుంటాయో తెలుసు కదా, ఏనుగులదీ అదే కథ. ఎటొచ్చీ మనిషి అరిచి అల్లరి చేస్తాడు. ఏనుగైతే తొండం ఎత్తి మావటిని విసిరి కొడుతుంది. ఎదుట వున్నవాళ్లను పాదాల కింద వేసి తొక్కి పడేస్తుంది.

ఈ ఫిబ్రవరి 7 న జరిగిన సంఘటనలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్‌లో ఎస్సయిగా పనిచేసే శ్రీధరన్ అనే ఆయన తన కూతుర్ని వెంటబెట్టుకుని మహావిష్ణు ఆలయోత్సవానికి వెళ్లాడు. ఉత్సవంలో ఏడు ఏనుగులు పాల్గొన్నాయి. గుడి ప్రాకారంలోనే వాటిని వరుసగా పక్కపక్కనే నిలబెట్టారు. చుట్టూ రెండు వేల మంది జనం. 'కాప్టివ్ ఎలిఫెంట్స్ యాక్ట్' ప్రకారం అంతమందిని అక్కడకు అనుమతించకూడదు. ఏనుగులను అంత దగ్గరగా నిలబెట్టకూడదు, జనాలకు అంత పక్కనే వుంచకూడదు. రూల్సు పట్టించుకున్నవాళు లేరు. ఇవి చాలనట్టు ఢంకాలు, భేరీలు వంటి చర్మవాయిద్యాలు భీకరంగా వాయించడం మొదలెట్టారు, ఏనుగుల ముందు దివిటీలు పట్టుకుని కొందరు నిల్చున్నారు. ఏనుగులకు అసహనంగా కదులుతున్నాయన్న సంగతి దేవాలయ అధికారులు కనిపెట్టలేకపోయారు. చిత్తెత్తిన రామచంద్రన్ అనే ఏనుగు అందుబాటులో వున్న శ్రీధరన్ పదహారేళ్ల కూతుర్ని తొండంతో విసిరి కొట్టి చంపేసింది. జనాలు కకావికలై పరుగులు పెట్టడంతో 20 మంది గాయపడ్డారు.

రామచంద్రన్ అనే మలయాళీ పేరు పెట్టినా యీ ఏనుగు బిహార్ నుండి వచ్చింది. గత 21 సంవత్సరాలలో అనేకసార్లు తిరగబడింది. ఉత్సవాల్లో దాన్ని తీసుకురాకూడదంటూ కేరళ హైకోర్టు కొన్నేళ్లు నిషేధం విధించింది కూడా. కేరళలో వున్న అన్ని ఏనుగుల కంటె ఎత్తయిన ఏనుగు కదాని దానికి డిమాండ్. దానిపైనే ఉత్సవమూర్తిని పెడతారు. అందువలన కేరళలో ఏనుగు యజమానులు ఎలిఫెంట్ ఓనర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి చట్టంలో లొసుగులు వెతికి వాటిని ఉత్సవాలకు తీసుకుని వచ్చేస్తారు. 'కేరళ కాప్టివ్ ఎలిఫెంట్స్ మేనేజ్‌మెంట్ అండ్ మేన్‌టేనెన్స్ రూల్స్, 2012' ప్రకారం ఎవరైనా మనిషిని చంపేసిన ఏనుగును 15 రోజుల పాటు బయటకు తీసుకురాకూడదు. దానికి మతిస్థిమితం వచ్చింది అని ముగ్గురు వెటర్నరీ డాక్టర్లు సర్టిఫికెట్టు యిస్తేనే మళ్లీ ఉత్సవాలలో పాల్గొనవచ్చు. డాక్టరు సర్టిఫికెట్లు ఎలా వస్తాయో అందరికీ తెలుసు. పైగా కేరళ కాబినెట్‌లో అటవీశాఖామాత్యులకే స్వయంగా ఏనుగు వుంది. అందుకని ఆయన యీ అసోసియేషన్ వాళ్ల పక్షానే నిలుస్తున్నాడు. ఈ రామచంద్రన్ అనే ఏనుగు విషయంలో దాన్ని ఓ గంటసేపు ఉత్సవంలో నిలబెట్టవచ్చు అని ఫారెస్టు డిపార్టుమెంటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్టు యిచ్చింది. తీసుకుని వచ్చాక గంటసేపు నిలబెట్టారో, గంటల సేపు నిలబెట్టారో ఎవరు చూడవచ్చారు?

నిజం చెప్పండి – ఇదంతా చదివాక మీకేమనిపిస్తోంది? మన వేడుక కోసం ఆ ఏనుగులకు ఏ సౌఖ్యమూ లేకుండా చేసి మనను ప్రమాదానికి గురి చేయడం ఎందుకు? అంతగా కావాలంటే ఉత్తర్ ప్రదేశ్‌లో మాయావతి చెక్కించి పాతేసిన అనేకానేక ఏనుగు బొమ్మల్లో ఒకదాన్ని పట్టుకుని వచ్చి గుళ్లో ప్రతిష్ఠాపించి దేవుణ్ని కాస్సేపు కూర్చోబెడితే చాలుకదా – అనిపిస్తోంది కదూ! అలాటిది ఏదో చేయకపోతే గజేంద్రమోక్షం అనే మాటను షష్ఠీ తత్పురుష సమాసం( గజేంద్రుని మోక్షం)గా కాక, పంచమీ తత్పురుష సమాసం (గజేంద్రుని చేత మోక్షం) గా భవిష్యత్తులో చెప్పుకోవాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 10 వీక్లీకై ఫిల్లర్ 1 ఎమ్బీయస్ : తమిళ వ్యాపారం వెర్సస్ రాజకీయర**

యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మార్చిలో జెనీవాలో సమావేశం కాబోతోంది. 47 సభ్యదేశాల్లో భారత్ కూడా ఒకటి. ఎల్‌టిటిఇపై శ్రీలంక జరిపిన యుద్ధంలో ఆఖరిదశలో మానవహక్కుల ఉల్లంఘన జరిగింది కాబట్టి ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకోవలసినదిగా శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. వారికి వత్తాసుగా కాలమ్ మాక్రే అనే ఒక బ్రిటిష్ సినీనిర్మాత "నో ఫయర్ జోన్ – శ్రీలంకాస్ కిల్లింగ్ ఫీల్డ్స్" అనే డాక్యుమెంటరీ తీసి చూపిస్తున్నాడు. ప్రభాకరన్ కొడుకు బాలచంద్రన్‌ను సజీవంగా పట్టుకుని హత్య చేశారని చూపిస్తున్న ఫోటోలు ఆ డాక్యుమెంటరీకోసం సృష్టించినవే అని శ్రీలంక ప్రభుత్వం అంటోంది. తీర్మానంపై ఓటింగ్ మార్చి 22 న జరుగుతుంది. ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటేయడానికి భారత్‌పై ఒత్తిడి పెరుగుతోంది. తమిళనాడు రాజకీయపక్షాలే కాక యూరోప్‌లో స్థిరపడిన తమిళబృందాలు కూడా శ్రీలంకకు వ్యతిరేకంగా భారత్ నిలవాలని పట్టుబడుతున్నాయి. తమిళనాడు పార్లమెంటు సభ్యులను శాంతపరుస్తూ సల్మాన్ ఖుర్షీద్ "శ్రీలంక చర్యలపై మనకు బాధ కలగవచ్చు, కానీ అదేదో శత్రుదేశం అన్నట్టు వ్యవహరించలేం కదా" అన్నారు. తమిళనాడులో కొన్ని వర్గాలైతే శ్రీలంకతో ఆర్థిక లావాదేవీలు బంద్ చేయాలని కోరుతున్నారు.

అయితే తమిళనాడులో వ్యాపారవర్గాలు మాత్రం అది జరగకూడదని కోరుకుంటున్నాయి. ఎందుకంటే శ్రీలంకతో భారతీయులు జరిపే ఏటా 5 బిలియన్ డాలర్ల వ్యాపారంలో సింహభాగం తమిళనాడు వ్యాపారస్తులదే. తమిళనాడునుండి శ్రీలంకకు వారానికి 100 ఫ్లయిట్లు వెళతాయి. అన్నీ ఫుల్. తమిళ రాజకీయవాదుల ఒత్తిడికి లొంగి భారత్ శ్రీలంక వ్యాపారరంగం నుండి తప్పుకుంటే ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి చైనా కాచుకుని వుంది... దాని వెనక్కాలే పాకిస్తాన్ కూడా. నిజానికి గత ఏడాది కూడా భారత్ శ్రీలంకకు వ్యతిరేకంగా ఓటు వేసింది. శ్రీలంక ప్రభుత్వం దానికి నొచ్చుకుంది కానీ భారత్‌తో వ్యాపారబంధాలు తెంచుకోలేదు. ఎందుకంటే యిది శతాబ్దాల బంధం. భారత్‌పై చర్య తీసుకుని చైనీయుల్ని ఆహ్వానిస్తే పొరుగున వున్న భారత్ చూస్తూ ఊరుకోదని కూడా శ్రీలంకకు కూడా తెలుసు. అందుకని మన వ్యతిరేకతను సహిస్తోంది. తమిళనాడులోని డిఎంకె–ఎడిఎంకె గొడవల మధ్యలో పడి మన ప్రభుత్వం శ్రీలంకపై ఏదైనా తీవ్ర చర్యలు చేపడితే మాత్రం అంతకంటె అవివేకం మరొకటి వుండదు.

ఎమ్బీయస్ ః చూసేవాళ్లూ దిగంబరమే..

వలువలు లేని వనితల సౌందర్యం ప్రదర్శించే చిత్రాలు, శిల్పాలు కోకొల్లలు. మగవారి శరీరం సైతం ఆచ్ఛాదన లేకుండా అందంగా వుంటుందని చాలామంది అనుకోరు. వియన్నాలోని సుప్రసిద్ధ లియోపాల్డ్ మ్యూజియం వారు అటువంటి అపోహ దూరం చేద్దామనుకున్నారు. అక్టోబరు 2012 నుండి మార్చి 2013 వరకు ''న్యూడ్ మెన్ ఫ్రమ్ 1800 టు టుడే'' అనే పేర ఎగ్జిబిషన్ పెట్టారు. నగ్నపురుషుల పెయింటింగ్స్, ఫోటోలు, డ్రాయింగులు, శిల్పాలు – అన్నీ కలిపి మొత్తం 300 సేకరించి ప్రదర్శనకు పెట్టారు. దిగంబరత్వంలోని సౌందర్యం గురించి, గ్రీకులు, ఈజిప్షియన్లు దానిని కళాకృతులుగా మార్చిన విధానం గురించి ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. ముగ్గురు దిగంబరయువకులతో తయారుచేసిన పోస్టర్లు ఊళ్లో అంటించారు.

ఎగ్జిబిషన్‌కు జనం బాగానే రాసాగారు. వచ్చాక చిత్రాలు, శిల్పాలు చూసి ప్రేరణ పొందిన కొందరు యువకులు అక్కడికక్కడ బట్టలు విప్పేసి బొమ్మలు చూడసాగారు. మ్యూజియం వాళ్లు అభ్యంతరం చెప్పలేకపోయారు. దానితో ఇక ఆడా మగా గుంపులు గుంపులుగా బట్టలు విప్పేసి రావడంతో ఓ పద్ధతి మొదలుపెట్టారు. తక్కిన రోజుల్లో బట్టలు వేసుకుని వచ్చినా సోమవారాలు మాత్రం దిగంబరంగానే రావాలని షరతు విధించారు. ప్రదర్శన హాలులోకి ప్రవేశించేముందు ఓ గదిలోకి వెళ్లి పాంటూ, చొక్కాతో సహా అన్ని వస్త్రవిశేషాలనూ అక్కడి అటెండెంట్‌కు అప్పగించి హాల్లో అడుగుపెట్టాలి. అయితే ఒక్కదానికి మాత్రం మినహాయింపు అన్నారు. ''అండర్‌వేర్‌కా?'' అని అడగకండి. వాళ్లు మినహాయింపు యిచ్చినది సాక్సులకు మాత్రమే. బూటులోపల వుండే సాక్సు యిప్పనక్కరలేదులెండి అన్నారు. ఇప్పటివరకు బట్టలతో, బట్టలు లేకుండా సందర్శించినవారి సంఖ్య లక్షకు పైనే!

మార్చి 11 వీక్లీకై ఎమ్బీయస్ ః ధిక్కారమును సైతునా...?

మమతా బెనర్జీకి విమర్శ అంటే పడదని అందరికీ తెలుసు కానీ ''కంగాల్ మలసత్'' (బిచ్చగాళ్ల ఆక్రోశం) అనే బెంగాలీ సినిమా వ్యవహారం చూశాక మరీ యింత యిదా? అనిపిస్తోంది. ఒకప్పుడు ఆమె అనుయాయిగా వుండి, ఆమె పార్టీలో ఎంపీ అయిన కబీర్ సుమన్ సహనిర్మాతగా, హీరోగా నిర్మించిన ఆ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్టు నిరాకరించబడింది. దానిలో మితిమీరిన సెక్స్ వుందనో, మరోటో అనుకుంటే పొరబాటు. ఆ సినిమాలో మమతా బెనర్జీ ప్రమాణస్వీకారాన్ని చూపించారని, సింగూర్‌నుండి టాటా మోటార్స్‌ను తరిమివేయడాన్ని ఒక సామాజిక విప్లవంగా కాక నెగటివ్‌గా చిత్రీకరించారని, మొత్తం సినిమాను ప్రభుత్వానికి, ప్రభుత్వాధినేతకు వ్యతిరేకంగా తీశారని, అశ్లీలపదాలు విపరీతంగా వాడారని సెన్సారు వారి అభ్యంతరం. దాని బోర్డు మెంబరు హరనాథ్ చక్రవర్తి (నిర్మాత కూడా) మమతకు అత్యంత ఆత్మీయుడు. ఈ అభ్యంతరాలతో బాటు రష్యన్ నియంత స్టాలిన్‌ను కూడా గౌరవంగా చూపించలేదని కూడా చేర్చారు. స్టాలిన్ మరణం తర్వాత రష్యాలో అతని వారసులే అతన్ని అతి క్రూరుడిగా తీసిపారేశారు. కరడుకట్టిన కమ్యూనిస్టయిన స్టాలిన్ పట్ల కమ్యూనిస్టు వ్యతిరేకి అయిన మమతా బెనర్జీ నడిపే ప్రభుత్వానికి యింత కరుణ ఏమిటి అంటే – తృణమూల్ పార్టీలో ఎంపీగా వుంటూ మమతాను ధిక్కరించిన కబీర్ సుమన్‌కు యీ విధంగా శిక్ష పడుతోందనుకోవచ్చు.

తమాషా ఏమిటంటే యీ సినిమా సిపిఎంకు వ్యతిరేకంగా ప్లాన్ చేసినది. ప్రసిద్ధ రచయిత్రి, మెగసెసే ఎవార్డు గ్రహీత మహాశ్వేతాదేవి కుమారుడు నబరూన్ భట్టాచార్య 2003లో రాసిన నవల – ''కంగాల్ మల్‌సత్''. 34 ఏళ్ల కమ్యూనిస్టు పాలనలో లోపాలను చూపుతూ రాసినది. దీన్ని నాటకంగా మలచి సుమన్ ముఖర్జీ అనే అతని దర్శకత్వంలో సిపిఎం అధికారంలో వుండగానే ప్రదర్శించారు. గాయకుడు, నటుడు అయిన కబీర్ సింగూర్–నందిగ్రామ్ ఆందోళన సమయంలో మహాశ్వేతా దేవికి, మమతా బెనర్జీకి దగ్గరయ్యాడు. ఆ ఉద్యమం 2011లో అధికారంలోకి రావడానికి తృణమూల్‌కు రాజకీయంగా ఎంతో ఉపయోగపడింది. మమత అధికారంలోకి వచ్చాక కబీర్‌తో చెడింది.

మహాశ్వేతా దేవి మాత్రమే కాదు, బెంగాలీ మేధావులు అనేకమంది గత ఎసెంబ్లీ ఎన్నికలలో మమతా బెనర్జీకి చాలా మద్దతు యిచ్చారు. చాలాకాలంగా వామఫ్రంట్ ప్రభుత్వాన్ని చూశాక దానిలో తప్పులు కనబడ్డాయి వాళ్లకు. దానికి వ్యతిరేకంగా వ్యాసాలు రాసి, ప్రసంగాలు చేసి, నాటకాలు ప్రదర్శించి తృణమూల్ అధికారంలో రావడానికి సహకరించారు. సింగూర్, నందిగ్రామ్‌లలో టాటా మోటర్స్‌వారి కోసం భూసేకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ జార్జి ఆర్వెల్ రాసిన ''ఏనిమల్ ఫామ్'' అనే కమ్యూనిస్టు వ్యతిరేక నవల ఆధారంగా తయారైన ''పశు ఖమార్'' అనే నాటకాన్ని ప్రదర్శించడానికి మార్చి 2011లో హుగ్లీ జిల్లాలో ఏర్పాట్లు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది వారాలు మాత్రమే వుంది. అధికారంలో వున్న వామఫ్రంట్ ప్రభుత్వం నాటక ప్రదర్శనకు అనుమతి నిరాకరించబోయింది. అప్పుడు ప్రతిపక్షంలో వున్న మమతా బెనర్జీ ఆ వామప్రభుత్వం సాంస్కృతిక పోలీసులా వ్యవహరిస్తోందని దుయ్యబట్టింది. ముఖ్యమంత్రిగా వున్న బుద్ధదేవ్ భట్టాచార్య స్వయంగా నాటకరచయిత కావడంతో మేల్కొని ప్రదర్శనకు అడ్డంకులు తొలగించాడు. అయినా మేధావులు కరుణించలేదు. మమతను అధికారంలోకి తీసుకురావడానికి శ్రమించారు.

ఏడాదిన్నర తర్వాత మమతా బెనర్జీ తనే సాంస్కృతిక పోలీసులా మారి ''తీన్ కన్యా'' అనే సినిమాను ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే స్టార్ థియేటర్లో ప్రదర్శించకుండా ఆపించింది. 2012 ఫిబ్రవరిలో కలకత్తాలోని పార్క్ స్ట్రీట్‌లో ఓ అర్ధరాత్రి పార్టీకి హాజరై

తిరిగి వస్తున్న ఆంగ్లో–ఇండియన్ యువతి సామూహిక బలాత్కారానికి గురైంది. ప్రభుత్వంపై విమర్శ రాగానే మమతా ఆ సంఘటన జరగలేదని బుకాయించింది. తీరా చూస్తే ఓ మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి ఒక నిందితుణ్ని బంధించింది కూడా. మమతా ఆమెను వేరే చోటికి బదిలీ చేయించింది. ఆ సంఘటన ఆధారంగా యీ సినిమా తయారైతే దానికి పబ్లిసిటీ యివ్వడం మమతకు ఎందుకు రుచిస్తుంది?

సింహాసనం అధిష్టించాక మమతా బెనర్జీకి మేధావులన్నా, చదువుకున్నవాళ్లన్నా పడడం మానేసింది. అసలు ఆవిడకు విమర్శ అంటే పడదన్నది బహిరంగ రహస్యం. కార్టూన్ వేసిన ప్రొఫెసర్ దుంప ఎలా తెంపిందో అందరూ చూశారు. విమర్శలకు యూనివర్శిటీలు పుట్టిళ్లు అని తెలుసు కాబట్టి, వాటిని అదుపులోకి తెచ్చుకోవాలని తన పార్టీ కార్యకర్తల ద్వారా ప్రయత్నిస్తోంది. 8వ తరగతి ఫేలయి మానేసిన అరబుల్ ఇస్లాం అనే తృణమూల్ కార్యకర్తను ఓ కాలేజీ గవర్నింగ్ బాడీలో సభ్యుడిగా వేసింది. వాడు 24 పరగణాల జిల్లాలోని ఓ కాలేజీలో ఓ ప్రొఫెసర్‌ను పట్టుకుని తన్నాడు. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు మేదినీపూర్ జిల్లాలోని ఓ కాలేజీలో ప్రిన్సిపాల్‌ను, స్టాఫ్‌ను పట్టుకుని చావగొట్టారు. ఇలాటివి జరిగినా మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేయదు.

మేధావులనే కాదు, వ్యాపారవర్గాలనూ పట్టించుకోదు మమత. హల్దియా బల్క్ టెర్మినల్స్ అనే ఓడ రవాణా నిర్వహణ సంస్థ హల్దియా పోర్టులో ఆపరేషన్స్ ఆపేస్తానంది. ఆ కంపెనీ అధికారులను కొందరు కిడ్నాప్ చేసి 'ఇక్కణ్నుంచి వెళ్లిపోకపోతే చంపేస్తామని' బెదిరించారు. మా ఉద్యోగులకు రక్షణ లేకపోతే ఎలా అని వాళ్ల బాధ. ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే ఏమీ జరగలేదు. తృణమూల్ నాయకుడు ఒకడికి రవాణా నిర్వహణా (కార్గో హేండ్‌లింగ్) సంస్థ వుంది. వీళ్లని తరిమేసి ఆ స్థానంలో తను వద్దామని అతని ప్లాను. దానికి మమతా బెనర్జీ మద్దతు. ప్రతిపక్షంలో వుండగా టాటా మోటర్స్‌ను తరిమేసింది సరే, అధికారంలోకి వచ్చాక కూడా పరిశ్రమలను యిలా తరిమివేస్తే నిరుద్యోగ సమస్య తీరేదెలా? 1980లలో బెంగాల్‌నుండి పరిశ్రమలన్నీ తరలి వెళ్లిపోయాయి, రాష్ట్రం వెనుకబడిపోయింది. బుద్ధదేవ్ భట్టాచార్య ఏదో చేసి పరిశ్రమలు తెద్దామంటే తృణమూల్ అడ్డుకుని వాళ్లను పంపించివేసింది. అయితే వాటిని ''కంగాల్ మలసత్''లో తెరమీద చూపిస్తే మాత్రం గగ్గోలు పెడుతోంది.

రాష్ట్ర సెన్సార్ బోర్డు తీర్పుకి వ్యతిరేకంగా కబీర్ సుమన్ ఎపెలేట్ ట్రైబ్యునల్‌కు వెళ్లాడు. దానికి చైర్మన్‌గా వున్న లలిత్ భాసిన్ సెన్సార్ బోర్డు లేవనెత్తిన అభ్యంతరాలలో చాలావాటిని కొట్టిపారేస్తూ కితం వారం తీర్పు యిచ్చాడు. స్టాలిన్ గురించి అభ్యంతరం ఎందుకన్నాడు. సింగూర్ అనే పేరు ఎత్తకుండా ఆ సంఘటనను చూపితే నష్టమేమన్నాడు. మమతా బెనర్జీ ప్రమాణస్వీకారం చూపించడం 'చరిత్ర వక్రీకరించడమే' అన్న సెన్సార్ బోర్డును కొట్టి పారేస్తూనే సినిమా నిర్మాతలతో ''ఇదేమీ డాక్యుమెంటరీ కాదు కదా, ఆ సన్నివేశం దేనికి తీసేయండి'' అన్నాడు. పాత్రోచిత సంభాషణ అంటూ సినిమాలో పెట్టిన 76 బూతులలో సగం తీసేయమన్నాడు. సిపిఎంకు వ్యతిరేకంగా సూటిగా చేసిన రాజకీయ వ్యాఖ్యలు మరీ ఘాటుగా వున్నాయి కాబట్టి కాస్త తగ్గించమన్నాడు. ఈ మార్పులు చేశాక రాష్ట్ర సెన్సార్ బోర్డు మళ్లీ ఒకసారి సినిమా చూసి రిలీజ్‌కు ఆమోదం తెలపాలి. అప్పుడు యీ పోలీసు మళ్లీ ఏం అడ్డంకులు కల్పిస్తుందో చూడాలి మరి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013) (ఫోటో – ''కంగాల్ మలసత్''లో ఓ దృశ్యం)**

**మార్చి 12** **ఎమ్బీయస్ : కిరణప్రచండం**

నిన్న అసెంబ్లీలో కిరణ్ చెలరేగిపోయారు. ప్రచండంగా వెలిగిపోయారు. పదిహేను నెలల క్రితం అప్పటి అవిశ్వాసతీర్మానాన్ని ఎదుర్కున్నపుడు యింత ఫోర్సు కనబడలేదు. కాస్త నెర్వస్‌నెస్ కనబడింది. ఈ సారి తీర్మానం ఎటూ ఓడిపోతుందన్న ధైర్యంతో కనబడినవాళ్లందరినీ శుబ్బరంగా తిట్టిపోశారు. ఈ విశ్వాసాన్ని ఆయనకు కలిగించినది ఆయన 'వాకింగ్ ఫ్రెండ్' చంద్రబాబు గారే! నువ్వు ఒకందుకు పోస్తే, నేను ఒకందుకు తాగాను అన్నట్టు బాబు తన కారణాల వలన అవిశ్వాసానికి దూరంగా వుంటాననడంతో కిరణ్ ఆ ఎడ్వాంటేజి బాగా తీసుకున్నారు. తీర్మానం ఓడిపోవడం తథ్యం కాబట్టి ప్రభుత్వానికి ఢోకా లేదన్న ధీమాతో హాయిగా కూర్చున్నారు.

నిజానికి అవిశ్వాసం పెట్టిన ప్రతిసారీ ప్రభుత్వం పడిపోదు, పడిపోనక్కరలేదు కూడా. గతంలో కాంగ్రెస్‌కు అసెంబ్లీలో, పార్లమెంటులో విపరీతమైన మెజారిటీ వుండేది. అయినా ప్రతిపక్షాలు అవిశ్వాసతీర్మానాలు పెడుతూ వుండేవి. ఎందుకంటే వాటి ద్వారా ప్రభుత్వం పని తీరుని సమీక్షించే అవకాశం వస్తుంది. మామూలుగా అయితే ఏదో ఒక బిల్లు గురించో, అంశం గురించో మాట్లాడి వూరుకోవాలి. అవిశ్వాసం తీర్మానమైతే అనేక వాటిపై ఏకకాలంలో మాట్లాడి ప్రభుత్వంలోని లోపాలను ఎంచవచ్చు, ప్రజల దృష్టికి తేవచ్చు. అందువలన ఏడాదికో, రెండేళ్లకో యీ క్రతువు నిర్వహించేవారు. కిరణ్‌కు నడిపేటంతటి మెజారిటీ లేకపోయినా ఎదుటివాళ్లకు పడగొట్టేటంత మెజారిటీ లేదు కాబట్టి ప్రభుత్వం నడుస్తోంది. అందువలన అవిశ్వాస తీర్మానం పెట్టగానే రిజల్టేమిటో అందరికీ తెలుసు. రిజల్టు పై సస్పెన్సు లేదు కాబట్టి తీర్మానంపై చర్చ ఎలా జరుగుతుంది అన్న దానిపైనే అందరి ఆసక్తి.

అపోజిషన్‌లో వున్న హేమాహేమీలు తమ మధ్య అన్ని అంశాలనూ పంచుకుని, ఒక్కో దానిపై ఒక్కోళ్లు ఉతికేస్తారేమోనని ఎదురు చూశాం. ఆ వుతుకుడుని ఎలా ఎదుర్కోవాలా అని కిరణ్ టెన్షన్ పడి వుంటారు. చివరకు చూస్తే చాకిరేవు కార్యక్రమం జరిగింది కానీ బట్టలు మారిపోయాయి. కిరణ్ ప్రభుత్వాన్ని బండకేసి బాదే బదులు ప్రతిపక్షాలు ఒకరి నొకరు బండలతో కొట్టుకున్నారు.

నిన్న ప్రతిపక్షం పెట్టిన విశ్వాసపరీక్షలో పాలకపక్షం నెగ్గింది, ప్రజలు పెట్టిన విశ్వాసపరీక్షలో ప్రతిపక్షం ఓడింది. నిజానికి ప్రభుత్వవైఫల్యాలు చాలా వున్నాయి. అధికధరలు, విద్యుత్ సంక్షోభం... యిలా అనేక విషయాల్లో ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీస్తాయని జనాలు ఆశపెట్టుకున్నారు. అదేమీ జరగకపోగా ప్రతిపక్షాలు చిన్నపిల్లల్లా తమలో తాము కొట్టుకుని సిఎం చేత అక్షింతలు వేయించుకున్నాయి.

ఎక్కడైనా సరే ప్రభుత్వ వ్యతిరేకత వుంటుంది. దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోవడానికి ప్రతిపక్షాలన్నీ కూడబలుక్కుని తాము కలిసికట్టుగా వున్నట్టు, ప్రజలకోసం త్యాగాలు చేయడానికి సిద్ధంగా వున్నట్టు ప్రజలను నమ్మించి ఓట్లేయించుకుంటాయి. ప్రభుత్వం పడిపోయిన తర్వాత, తిరిగి తమలో తాము కలహించుకుంటాయి. 2004 ఎన్నికలలో వైయస్సార్ తెరాస, లెఫ్ట్‌లతో చేతులు కలపడంలో, 2009 ఎన్నికలలో బాబు మహా కూటమి ఏర్పరచడంలో ఉద్దేశం యిదే. అయితే మహా కూటమి ఏర్పాటు అవుతూనే లెఫ్ట్ వాళ్లు చాలా పెద్ద సంఖ్యలో సీట్లు డిమాండ్ చేశారు, తెరాస అయితే టిడిపిని ముప్పుతిప్పలు పెట్టింది. మహాకూటమి టిక్కెట్ల పంపిణీలో చాలా గలభా జరిగింది. దానివలన ప్రజలు దాన్ని విశ్వసించలేకపోయారు. కూటమి చాలనట్టుగా ఓ పక్క చిరంజీవి, మరో పక్క లోకసత్తా జెపి పార్టీలు పెట్టి పాలకవ్యతిరేక ఓట్లను చీల్చారు. అధికారపక్షం ఎవరితో పొత్తు పెట్టుకోకుండా (లోపాయికారీగా మజ్లిస్‌తో తప్ప) వుండడం వలన వాళ్ల ఓట్లు వాళ్లకే పూర్తిగా దక్కాయి. ప్రతిపక్షం తలా కాస్త పట్టుకెళడంతో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చింది.

2014 ఎన్నికలలో మళ్లీ యీ కథ రిపీటయ్యేట్టు వుంది. అసెంబ్లీ సాక్షిగా టిడిపి, వైకాపా ఒకరి నొకరు దుమ్మెత్తి పోసుకున్నాయి. తెరాస సమైక్యవాద పార్టీలంటూ బిజెపిని తప్ప తక్కిన అందర్నీ దుమ్మెత్తి పోసింది. (అయినా ఎన్నికలలో బిజెపి తెరాసతో పొత్తు పెట్టుకుందని అనుకోవడానికి లేదు). టిడిపి వినా ప్రతిపక్షాలన్నీ ఒకే ఒక్క విషయంలో మీద ఏకతాటిపై నిలిచాయి. అదేమిట్రా అంటే – కాంగ్రెస్‌ని తిట్టడంలో కాదు, టిడిపిని తిట్టడంలో! ప్రధాన ప్రతిపక్షంగా ఏం చేయాలో, ఏం చేసి వుండాలో టిడిపికి యివి ప్రైయివేటు చెప్పాయి. అవి చేయలేదు కాబట్టి నువ్వు కాంగ్రెస్‌తో కుమ్మక్కయినట్టే అని తీర్మానించాయి. లేదు మొర్రో అని టిడిపి మొత్తుకున్నా వినలేదు. అసలు మొదటినుండీ తెరాస, వైకాపా టిడిపిని యిరకాటంలో పెట్టాలనే చూశాయి. ప్రధానప్రతిపక్షం అంటూ దానికి యిప్పుడు పెద్దపీట వేసి బాధ్యతల గురించి ఉద్బోధలు చేస్తున్నవారు అవిశ్వాసం ఆలోచన రాగానే 'ఏం చేద్దాం?' అని వచ్చి అడిగాయా? లేదే!

అయినా తెరాస కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వుంటుందని టిడిపి ఎలా అనుకోగలదు? నిన్న అసెంబ్లీలో హరీష్ వేలాదిమంది ప్రాణాలను పొట్టన పెట్టుకుందంటూ కాంగ్రెస్‌ను తిట్టని తిట్టు లేదు. ఇంతా తిట్టి – తెలంగాణ యిస్తానని ప్రకటిస్తే చాలు, కాంగ్రెస్‌తో కలిసిపోతాం అంటారు. ప్రకటిస్తాం మొర్రో అంటూన్న బిజెపితో చేతులు కూడా కలపరు, పైగా తిడతారు కూడా. కాంగ్రెస్ అధికారంలో వుంది కాబట్టి... అని తమ చర్యలు సమర్థించుకోవచ్చు కానీ కాంగ్రెస్ మోసకారి పార్టీ అని చెపుతూనే మళ్లీ వాళ్ల వాగ్దానాలను ఎలా నమ్ముతారు? కాంగ్రెస్‌ను 2014 ఎన్నికలలో ప్రజలు చిత్తుగా ఓడిస్తారని చెపుతున్నారు కదా, అది నిజమైతే బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏయే కదా అధికారంలోకి వచ్చేది! మరి దానితో సఖ్యంగా వుండవచ్చు కదా. ఉండరేం? తెరాస యిలా ప్రవర్తించడం చేతనే బాబు వాళ్లని – తోక పార్టీ అన్నారు. వీళ్లు కాంగ్రెస్‌ను ఓడిద్దాం అంటూంటే టిడిపి వాళ్లనెందుకు నమ్ముతుంది?

ఏతావతా టిడిపి యితర ప్రతిపక్షాలను నమ్మదు, ఇతర ప్రతిపక్షాలు టిడిపిని నమ్మవు. సిపిఐ ఒక్కటే టిడిపితో కోస్తా, సీమల్లో ఎన్నికల పొత్తు పెట్టుకుంటోంది. వాళ్లు కూడా అవిశ్వాసతీర్మానం విషయంలో టిడిపిని తప్పుపట్టారు. ఇవన్నీ లెక్కలోకి వేసుకునే యికపై ఎన్నికలలో మాది ఒంటరి పోరాటమే అని బాబు నిన్ననే ప్రకటించారు. సహజమిత్రులు అంటూ వామపక్షాల వారిని వాటేసుకోవడం కూడా వుండదన్నమాట. ఇక యితర ప్రతిపక్షాలలో ముఖ్యమైనవి తెరాస, వైకాపా. వాళ్ల మధ్య పొత్తు కుదిరిందని టిడిపి అంటున్నా ఆ లక్షణాలేమీ కనబడటం లేదు. వైకాపా కోస్తా, సీమలకు పరిమితమై తెలంగాణను తెరాసకు పూర్తిగా వదిలేస్తే పొత్తు కుదిరేదేమో, కానీ వైయస్ అభిమానులు పెద్ద సంఖ్యలో వున్న తెలంగాణను వైకాపా తెరాసకు ధారాదత్తం ఎందుకు చేస్తుంది? అందుకని వైకాపా, తెరాస కూడా తమలో తాము కలహించుకోవడం ఆశ్చర్యం కాదు.

ఇక తక్కిన పక్షాలు – మజ్లిస్ తప్ప – ఏకసంఖ్యపక్షాలు. లెక్కకు పనికి వస్తాయి తప్ప వారందరూ కలిసినా, (కలవరు లెండి, కుడి, ఎడమలు ఎలా కలుస్తాయి?) ఏమీ తేడా పడదు. నాగం తెరాసలో కలిసినా, బిజెపిలో కలిసినా, విడిగా వున్నా బ్రహ్మాండం బద్దలవదు. జెపి టిడిపికి మద్దతిచ్చినా, సిపిఎంకు మద్దతిచ్చినా, విడిగా వున్నా – కోయీ ఫరక్ నహీ అల్‌బత్తా! మజ్లిస్ ఒక్కటే చెప్పుకోదగ్గ పార్టీ. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కారణంగా త్రిశంకు సభ ఏర్పడితే అప్పుడది చెడుగుడు ఆడుతుంది. అయితే కాంగ్రెస్ మద్దతు లేని పరిస్థితిలో మజ్లిస్ ఎన్ని సీట్లు గెలుచుకుంటుందో వేచి చూడాల్సిందే!

ఈ భవిష్య దృశ్యాలు కళ్లముందు కదలాడుతూండడంతో కిరణ్ రెచ్చిపోయారు. అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానాన్ని అవలీలగా అంకెలతో ఎదుర్కొన్నారు. అపోజిషన్ వాళ్లను ఆటపట్టించబోయారు. హరీష్‌రావును 'నువ్వేమైనా రౌడీవా? మమ్మల్ని కాలర్ పట్టుకోవడమేమిటి?' అనేశారు. అదే వూపులో 'పైసా యివ్వను ఏం చేస్తావో చేసుకో పో' అని అనేశారు. అది అప్రజాస్వామికమే, కానీ తమాషా ఏమిటంటే ప్రజలకు అలాటి నాయకుడే నచ్చుతాడు. ఇందిరా, ఎన్టీయార్, వైయస్సార్ – వీళ్లందరూ నియంతృత్వ పోకడలు గలవారే. కానీ సాధారణ జనాలు వీళ్లని అభిమానించారు. గాలి జనార్దనరెడ్డి ఫ్యాక్టరీ ఎయిర్‌పోర్టుకి అన్ని ఎకరాలా? అని అపోజిషన్ వాళ్లంటే 'ఆట్టే మాట్లాడితే రెట్టింపు భూమినిస్తా' అని వైయస్ అనడం రాజరికపు పోకడకు పరాకాష్ట అనుకుని మధ్యతరగతి ప్రజలం విస్తుపోయాం. అయినా సామాన్యప్రజలకు దానిలో హీరోయిజం కనబడింది.

కిరణ్ పై నుండి సిఎంగా దిగుమతి అయినపుడు ఆయన నియోజకవర్గం మాట ఏమిటో గానీ, రాష్ట్రప్రజల్లో సంచలనం ఏమీ కలగలేదు. ఆనందమూ లేదు, విషాదమూ లేదు. ఏదో వచ్చాడు, కాస్సేపు కూర్చోబెట్టి దింపేస్తాడు అనుకున్నారు. కానీ చూస్తూండగానే పాతుకుపోయాడు. మొండివాడు, తన పదవి గురించి ఖాతరు చేయకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటాడు అని పేరుబడ్డాడు. ఆ విధమైన యిమేజి ఫలితాలు యిస్తోందని గుర్తిస్తున్న కొద్దీ మరింత ఆత్మవిశ్వాసం కనబరుస్తున్నాడు. ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసం కనబడడం రాష్ట్రానికి మంచిది. రోశయ్య ఎంత ప్రతిభావంతులైనా ఏం లాభం? నాకెందుకు వచ్చిన బెడద అనేట్టు వుండేవారు. అందువలన కాబినెట్ సహచరులకు కాని, అధికారగణానికి గాని ఉత్సాహం వుండేది కాదు. కొత్త పథకాలు పెట్టలేదు. ఉన్నవాటినే లాక్కుని వచ్చారు. రోశయ్యకున్న తెలివితేటలు, అనుభవం కిరణ్‌కు లేవు. అయితే పాలించాలనే కాంక్ష బలంగా వుంది. దానికి తెగింపు తోడయింది. రోశయ్యగారిలా మాటిమాటికీ లెక్కలేస్తూ కూర్చోకుండా ఏమైతే అయిందని ధైర్యంగా ముందుకు వెళుతున్నారు.

జగన్ జైలుపాలవడం కిరణ్‌కు కలిసి వచ్చింది. చంద్రబాబు తన గొడవల్లో తాను పడి అడ్డు రాకపోవడమూ మంచిదైంది. కిరణ్ అధికారంలోకి రాగానే జగన్ తిరుగుబాటు బావుటా ఎగరేసి, ఎమ్మెల్యేలను ఎగరేసుకుని పోసాగారు. ఆపగలిగినంతమందిని కిరణ్ ఆపగలిగారు. ఇప్పుడు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేసినవారిపై వేటు విషయంలో స్ట్రాటజీ అవలంబిస్తున్నారు. రెండు నెలలు ఆగి స్పీకరు చేత డిస్క్వాలిఫై చేయిస్తే వాళ్లు ఎటూ కాకుండా పోతారు. ఏడాదిలో సాధారణ ఎన్నికలు వస్తాయి కాబట్టి అక్కడ ఎన్నికలు జరపరు. అనర్హుడని ప్రకటించారు కాబట్టి ఎమ్మెల్యేకు ఏ విలువా వుండదు. ఆ లోపున ఆ నియోజకవర్గానికి పాలక పార్టీనుండి ఇన్‌చార్జిగా ఒకరిని పెట్టి వాళ్ల ద్వారా పనులు చేయించి వాళ్ల పరపతి పెంచవచ్చు. అది ఎన్నికలలో పనికి వస్తుంది. ఇది గ్రహింపుకు వచ్చేసరికి జగన్‌వైపు దూకుదామనుకునేవారు 2014 ఎన్నికలు వచ్చేవరకు ఆగుతారు.

మొత్తం మీద చూస్తే 2014 వరకు తనే అధికారంలో వుండబోతున్నానని కిరణ్‌కు ధైర్యం వచ్చేసింది. సోనియా, రాహుల్‌లకు కోపం తెప్పించకుండా వుంటేనే అనుకోండి, వాళ్లు మాత్రం ఎందుకు మారుస్తారు? ఏదో బండి లాక్కుని వస్తున్నాడు కదా అని వూరుకుంటారు. మార్చినా బొత్సను మార్చవచ్చు తప్ప కిరణ్‌కు ముప్పు లేదు. ఇలాటి ధైర్యాన్ని కిరణ్‌కు ప్రసాదించిన పుణ్యం మాత్రం ప్రతిపక్షాలదే. ఆ క్రమంలో తమను తాము వాళ్లు తగ్గించుకుంటున్నారు. ఇప్పుడు పెట్టకపోయినా అతి త్వరలో అవిశ్వాసం పెడతామని మోత్కుపల్లి అంటున్నారు. అది జరిగితే 'తోక పార్టీలు' టిడిపి తోక పీకుతాయి. అసెంబ్లీ సాక్షిగా టిడిపియే ఎక్కువ తిట్లు తినాల్సి వస్తుంది. టిడిపివాళ్లు ఎదురు తిడతారు. ఇలా ప్రతిపక్షం యింకా ముక్కలు చెక్కలవుతుంది. ఎందుకొచ్చిన రొష్టు? ఈ అవిశ్వాసం గోల వదిలేసి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తే మాకదే చాలు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 14** **ఎమ్బీయస్ : 26/11/2**

రాంగోపాల వర్మగారి "26/11 దాడి" సినిమా హాలుకెళ్లి చూశాను. ఈ సినిమా యిప్పుడే చూడడం మంచిదైంది. రెండు, మూడేళ్ల తర్వాత చూసి వుంటే సినిమాలో రీళ్లు కొన్ని సెన్సారయి పోయాయని కంగారు పడేవాణ్ని. హాల్లో చూసి వుంటే ప్రొజెక్టరు ఆపరేటర్ నిద్రమబ్బు గాడనీ, రీళ్లు ఎక్కడో గల్లంతు చేశాడని తిట్టుకునేవాణ్ని. సిడిలో చూసి వుంటే సిడి తయారీదారులు తమ సొంత ఎడిటింగ్ చేశారని తిట్టుకునేవాణ్ని. ఇప్పుడే చూడడం చేత – వర్మగారు యీ సినిమా యింతే తీశారని కచ్చితంగా తెలిసింది. నానా పటేకర్ కసబ్‌ను తిట్టే సీను తర్వాత హఠాత్తుగా ఉరి సీను రావడంతో హఠాత్తుగా బజెట్ అయిపోయిందా, లేక వర్మకు ఉత్సాహం మధ్యలో యిగిరిపోయి అయినంతవరకూ చాల్లే అనిపించిందా, లేక స్క్రిప్టుని బైండ్ చేయించిపెట్టకపోవడం చేత కొన్ని కాగితాలు ఎగిరిపోయాయా అని అనుమానం వచ్చింది. ఇప్పుడున్నదానికి కనీసం ఓ అరగంట ఆట కలిపితేనే యిది సినిమా అనిపించుకుంటుంది. లేకపోతే సగం సినిమాయే!

ఇది సినిమాయే కాదు, డాక్యుమెంటరీలా వుంది అని కొందరు విమర్శించారు. డాక్యుమెంటరీలా వుంటే మాత్రం ఏమైంది, మన మనసుల్ని కదిలించిందా లేదా? అది చూడాలి. ఆ నాటి దృశ్యాల్ని మన కళ్లముందు కట్టగలిగింది కదా! కసబ్ ఉరి, అఫ్జల్ ఉరి, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల వేడిలో వున్న మనకు సరైన సమయంలో యీ సినిమా తారసిల్లింది. బాగా కనక్ట్ అయ్యాం. కసబ్‌ను పోలీసులు లాఠీలతో చావమోదినపుడు, తన్నుతూ నానా పటేకర్ వద్దకు తీసుకుని వచ్చినపుడు హాల్లో జనమంతా యీలలు, కేకలు. ఇలా కదిలించే దృశ్యాలు ఎన్నో వుండే అవకాశం వున్న సినిమాను వర్మ పూర్తిగా ఎందుకు తీయలేదో ఆయనే చెప్పాలి. చూసినంతవరకు సినిమా బ్రహ్మాండంగా అనిపించింది. ఆ ఫోటోగ్రఫీ, ఆ నేపథ్యసంగీతం, ఆయా నటీనటుల నటనాపటిమ – వర్మను మాస్టర్ క్రాఫ్ట్స్‌మన్‌గా నిరూపిస్తున్నాయి. ఇంకాస్త తీస్తే ఆయన సొమ్మేం పోయింది అనిపించింది.

సినిమాలో కసబ్‌ను ఎక్కువగా ఫోకస్ చేశారని తెలుస్తూనే వుంది. తక్కిన వాళ్ల పేర్లు కూడా రిజిస్టర్ కాలేదు. తన సహచరుల చావు చూసి, నానా పటేకర్ స్పీచ్ విని కసబ్ దిగ్భ్రాంతి చెందినట్టు చూపించారు. మొదట్లో "మీకేం తెలుసు జిహాద్ గురించి.." అన్నవాడు నానా ప్రసంగం విని నోరుమూసుకుని మౌనంగా దుఃఖించాడు. తను చేసినది తప్పు అని ఫీలవుతున్నాడా అన్న అనుమానం వచ్చింది. అంతలోనే ఉరి ఘట్టం వచ్చేసింది. పశ్చాత్తాప పడినవాణ్ని ఉరి వేయడం అనవసరమేమో అన్న అనుమానం ప్రేక్షకుడికి కలిగేట్లా వుంది.

నిజానికి జైల్లో వుండగా కసబ్ చాలా వెధవ్వేషాలు వేశాడు. బిర్యానీలన్నాడు, మరోటన్నాడు, గడియకో మాట మార్చాడు. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఈ వెధవని యింకా మేపాలా అని దేశప్రజలు విసుక్కునే స్థితికి తీసుకుని వచ్చాడు. ఆ ఘట్టాలు కొన్నయినా చూపితే కసబ్ పట్ల జాలి కలిగేది కాదు. కసబ్ చావుకి ముందు చూపించిన యింటర్ కట్స్‌లో వాడు చేసిన ఘాతుకాలు చూపించి వాడి దుర్మార్గాన్ని గుర్తు చేశారు. వాటిని ఉరి ముసుగు వేస్తూంటే వాడు గింజుకుంటూన్నపుడు చూపాల్సింది. ముందుగానే చూపారు, పైగా కసబ్ కంటి వెంట నీరు కారుతూన్నట్టు చూపించారు. తను చేసిన పాపాలకు వాడు బాధపడుతున్నట్టు తోచింది. అప్పుడు పోనీ వదిలేస్తే.. అన్న ఆలోచన మనకు వస్తుంది.

కసబ్ గురించి అంత చూపించారు బాగానే వుంది, అతన్ని వట్టి చేతుల్తో వడేసి పట్టుకుని ప్రాణాలు పోతున్నా వదలని తుకారాం అనే పోలీసు కానిస్టేబుల్ గురించి కాస్తయినా చూపితే ఏం పోయింది? అతనికీ పెళ్లం, పిల్లలు వుంటారు, అవేళ యింటికి వచ్చాక ఏం చేయాలో ఏదో అనుకుని వుంటారు, భవిష్యత్తు గురించి ఏవో వూహలుంటాయి. అవి చూపించి వుంటే, అతని కుటుంబంతో మనం కనక్ట్ అయి చావుబాధను మనం కూడా అనుభవించేవాళ్లం. కమిషనర్‌గారు కోటేసుకున్న పెద్దమనుష్యులకు తుకారాం యింటి గొడవలు చెప్పలేదు కాబట్టి చూపలేదని చెప్పవద్దు. ఆ మాటకొస్తే మొదట్లో కనబడిన బోటువాడి రెండో కొడుకు పెళ్లి గురించి కళాసీలు మాట్లాడుకున్న మాటలు కూడా కమిషనర్ విని వుండడు. అది వూహించినపుడు, యిదీ వూహించాలి.

అవునూ, ఆ కోటువాళ్లెవరూ నోరు విప్పలేదేమిటండి? ఒక్క ప్రశ్న కూడా అడగలేదు. నానా యాక్టింగ్ చూసి ముగ్ధులై పోయి అవాక్కయిపోయి వుంటారా? 'ఆ క్షణంలో ఏం చేయాలో మాకు తోచలేదు. నా 26 ఏళ్ల సర్వీసులో సంఘటన అయిన తర్వాతనే ఘటనాస్థలికి వెళ్లాను తప్ప సంఘటన జరుగుతుండగా వెళ్లడం, ఏం చేయాలో ప్లాన్ చేయడం మాకు కొత్త' అని నానా కన్ఫెస్ చేశాడు కదా, దాన్ని వాళ్లు వేసిన ప్రశ్నకు జవాబుగా చూపించి వుంటే బాగుండేది.

అదే విధంగా 'కసబ్ కుక్కలాటి వాడు, అతన్ని ఆడించేవాళ్లు వేరే వున్నారు, వాళ్లింకా పట్టుబడలేదు' అన్నప్పుడు డేవిడ్ హెడ్లీని చూపించి 'టెర్రరిజంపై మన పోరాటం యింకా సాగుతోంది' అనే మెసేజ్ యిచ్చి వుంటే అర్థవంతంగా వుండేది. కమిషనర్ గందరగోళపడి నిస్తేజుడిగా నిలిచాడు కానీ మామూలు కానిస్టేబుళ్లు తమకు తోచినది చేసి ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించుకున్నారు. అలాగే ప్రాణాలకు తెగించి తక్కినవాళ్లు ఎక్కడున్నారో చెప్పడానికి నిరాకరించిన కామా హాస్పటల్ డాక్టర్ హీరోగా నిలిచాడు. కథను వీళ్ల ద్వారా చెప్పి వుంటే సామాన్యుడికి మరింత పులకింత కలిగేదేమో. సినిమా ప్రకారం చూస్తే కసబ్‌ను తన స్పీచ్‌తో అదలగొట్టడం తప్ప కమిషనర్ పొడిచేసినదేమీ కనబడలేదు. ఆయన చేసిన యిన్వెస్టిగేషన్ ఏదైనా వుంటే అది తెరమీద కనబడలేదు.

పోలీసు అధికారులు గబగబా అటూ యిటూ పరుగులు పెడుతూ వుంటే నేపథ్యంలో పాట లాటిది (నేను తెలుగు వెర్షన్‌కి వెళ్లాను) వినబడింది. మరాఠీ జానపదగీతమో, యుద్ధనినాదమో అనుకున్నాను. ఈ మధ్యకాలంలో నాకు తెలుగు పాటలు హాల్లో అస్సలు అర్థం కావటం లేదు. మొత్తం మీద నాలుగైదు తెలుగు పదాలు మాత్రం వున్నట్టు తోస్తుంది. ఈ పాటలో ఒక్క తెలుగుమాటా వినబడలేదు. కానీ ఆ సంగీతపు హెూరు వల్ల పోలీస్ టాప్ బ్రాస్ ఏదో చేద్దామనుకున్నారని మాత్రం బోధపడింది.

నిజానికి 26/11 హీరోలెవరంటే ఎన్ఎస్‌జి వాళ్లు. అది యావత్ భారతదేశ ప్రజకు తెలుసు. కార్గిల్ హీరోలెవరంటే చెప్పలేకపోవచ్చు, కానీ తాజ్‌మహల్ ఆపరేషనంతా టీవీల సాక్షిగా జరిగింది కాబట్టి ప్రజలందరికీ ఎన్ఎస్‌జి వారి సాహసకృత్యం తెలుసు. అయితే హెూటల్ లోపల ఏం జరిగిందో వివరంగా తెలియదు, కొన్ని కొన్ని కథనాలు తప్ప. సంఘటన జరగ్గానే వర్మ అక్కడకి వెళ్లి చూసి వచ్చి (మామూలుగా అయితే మర్చిపోయేవారమేమో కానీ సిఎం పదవికి ఎసరు రావడంతో అందరికీ గుర్తుండిపోయింది, ఆ లెక్కప్రకారం దాడి బాధితుల్లో దేశ్‌ముఖ్ పేరు మొదట చేర్చాలి, వర్మ సినిమాను ఆయనకు అంకితం యిచ్చి వుంటే బాగుండేది) ఆ యాంబియెన్సును తలకెక్కించుకుని, తెరపై మనకోసం ఆవిష్కరింప చేస్తారు కాబోలు అని ఆశ పెట్టుకున్నాను.

ఎందుకంటే అప్పటిదాకా మన ఇండియన్సుమి ఎంత చవటలమో తెరమీద కనబడింది. ఓ పదిమంది చులాగ్గా షికారుకు వచ్చినట్టు మన దేశ సరిహద్దుల్లోకి వచ్చేశారు. టపటపా ఎడాపెడా కాల్చి పారేస్తున్నారు. మన పోలీసుల దగ్గర వున్న ఆయుధాలేమిటంటే – లాఠీలు, కంకర రాళ్లు. ఈ నెగటివ్ యిమేజ్‌ను కౌంటర్ చేసేది – తాజ్ వద్ద కమెండోల సాహసం. సినిమా ముందుకు సాగినా అదేమీ కనబడకపోవడంతో భోరుమన్నాను. నిజానికి అది రెండో భోరు. ఇంటర్వెల్ ముందు ఓ పాప, కానిస్టేబుల్ కలిసి ఏడ్చారు చూడండి, అప్పుడు మొదటిసారి భోరు మన్నాను. ఎందుకంటే తంబాకూ సేవన్ గురించి హిందీ, తెలుగు భాషల్లో చెప్పి ఐదు నిమిషాలు తినేశారు. ఇక ముప్పావు గంట సినిమా గడిచిందో లేదో అప్పుడే యింటర్వెల్ అన్నారు. అప్పుడే యింటర్వెల్లా అని ఏడ్చుకున్నాను.

అంతలోనే ఓదార్చుకున్నాను – తాజ్ మహల్ హెూటల్ వద్ద సీన్లు 'టవరింగ్ యిన్‌ఫెర్నో' లెవెల్లో దృశ్యాలు చూపిస్తారు కాబోలు, ఆ పట్టు చెదిరిపోకుండా మధ్యలో విరామం యివ్వకూడదని యిప్పుడు ఇంటర్వెల్ యిచ్చి వుంటారు అనుకున్నాను. నిజానికి సంఘటన జరిగిన రోజుల్లో టీవీలో కమెండోలను చూస్తూ ఇలాటి వాళ్లు మనను రక్షిస్తూ వుండగా మనకు బతుకులకు ఢోకా లేదు అని భారతీయుడు తృప్తి పడిన రోజది. ఆ ఘట్టాన్ని యీ సినిమాలో చూపిస్తేనే నాలోపలున్న ఆశాజీవి తృప్తి పడేది. తీరా చూస్తే ఆ కమెండో ఆపరేషన్ మొత్తం లేపేశారు. అసలు అక్కడ టీవీ కెమెరాల సందడి, ఆఫీసులు మానేసి ప్రజలంతా టీవీల ముందు రెండు, మూడు రోజుల పాటు కూర్చోవడం అవన్నీ చూపిస్తారు కాబోలు అనుకున్నాను. అన్నీ విపులంగా చూపించకపోయినా కమిషనర్‌గారి

ముఖతః అక్కడక్కడ బిట్లుగా చెప్తారేమో అనుకున్నాను.

అక్కడ కొన్ని హ్యూమన్ యింట్రస్టు స్టోరీస్ వున్నాయి. ఒకావిడ 'వాళ్లు ఏ క్షణంలోనైనా వచ్చేస్తారేమో' అంటూ ఫోన్ చేస్తూండగానే వాళ్లు లోపలకి వచ్చి కాల్చేశారు. అవేళే ఉద్యోగంలో చేరినవాడున్నాడు. ఇలాటి డ్రామాకు వర్మ వ్యతిరేకం కాదు. ఎందుకంటే యిదే సినిమాలో కారులో చచ్చిపడి వున్నట్టు వున్న పోలీసు అధికారి యిచ్చిన సమాచారంతోనే కసబ్ ప్రయాణిస్తున్న కారును నిరోధించడం, అతనితో బాటు వున్న అధికారికి తండ్రినుండి కాల్ వచ్చి ప్రాణాంతకం కావడం, విటి స్టేషన్లో టిఫెన్లు తింటున్న ముస్లిము కుటుంబం, జనాలు ప్లాట్‌ఫాం కింద పట్టాల వద్ద దాక్కోవడం – యిలాటి ఘట్టాల్లో ఎంతో చక్కటి డ్రామా పండించారు.

మరి తాజ్‌మహల్‌పై శీతకన్ను ఎందుకో తెలియదు. బజెట్ సరిపోలేదంటే నమ్మను. తాజ్ లాంజ్ ఎలాగూ చూపించారు. హెూటల్ రూము యింటీరియర్ సెట్టుకి ఎంతవుతుంది పెద్ద! అదైనా ఫుల్‌గా వేస్తారా ఏమన్నానా, కొన్ని యాంగిల్స్‌లో కొంత చూపించి వూరుకుంటారు. ఇక బయటి టీవీవాళ్ల అడావుడిలో ఎన్ని రసాలైనా చూపించవచ్చు. లేడీ రిపోర్టర్లు ధైర్యంగా అక్కడకి వెళ్లి రిపోర్టు చేయడం దగ్గర్నుంచి వాంటేజ్ పాయింట్ల కోసం టీవీల మధ్య స్పర్ధ దాకా అన్నీ చూపవచ్చు.

పోనీ నారిమన్ హౌస్ దగ్గర సంఘటన చూపినా యూదులు ఫోకస్‌లోకి వచ్చేవారు. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లీషు సబ్ టైటిల్స్‌తో రిలీజ్ చేసినపుడు ఎడ్వాంటేజి అయ్యేది. కామా హాస్పటల్ వద్ద పార్శీలను ప్రముఖంగా చూపవచ్చు. ఉగ్రవాదులు యూదు మతాన్ని , జొరాష్ట్రియన్ మతాన్నీ కూడా వదలలేదని, టెర్రరిజం అన్ని మతాలకూ ప్రమాదమని ఎస్టాబ్లిష్ చేస్తే మరో పాయింటు వచ్చి చేరేది. అసలు హేమంత్ కర్కరే వివాదాన్ని కొద్దిగా స్పృశించి (పూర్తిగా ఎత్తితే సంఘీయులు గొడవ చేయవచ్చు) ప్రశ్నలు లేవనెత్తినా యీ సినిమా సీక్వెల్‌కు పునాది వేసి పెట్టుకున్నట్టు అయ్యేది. ఇవన్నీ చూపిస్తే సినిమా పొడుగై పోతుందండీ అనవద్దు. ఆ తుపాకీ పేలుళ్ల సీన్లు సగానికి సగం తగ్గించినా ఎఫెక్టుకి లోటు వచ్చేది కాదు.

ఇది వర్మ కమ్‌బ్యాక్ సినిమా అంటున్నారు. నాకేమో ఆయన సగమే తిరిగి వచ్చినట్టు అనిపించింది. ఈ భాగం యింత గొప్పగా తీసినవాడు యింకో అరగంట సినిమా తీసి జోడించి వుంటే, మనకు మరొక బెస్ట్ వార్ ఫిల్మ్ దక్కేది కదా, ఎందుకిలా సగం సగం తీసినట్టు!? 'వోడ్కా విత్ వర్మ' పుస్తకావిష్కరణ సందర్భంగా చూసిన బిట్లు – కసబ్ గ్యాంగ్ నావల్లోకి వచ్చే సీను, మంచినీళ్లు అడిగి కాల్చేసే సీను, నానా ఉపన్యాసం సీను, కసబ్ ఉరి సీను – చూసి విపరీతంగా ఊహించేసుకున్నాను. ఇంత కింతైతే అంత కెంత వుంటుందో అనుకున్నాను. అవేళే సినిమాలో మూడోభాగం చూసేశానన్న విషయం గ్రహించలేకపోయాను.

ఏమిటో యీ వర్మ మీద పూర్తిగా ఆశ పెట్టుకోలేం, అలా అని ఆశ విడిచి పెట్టుకోనూ లేం! భలే గొప్పగా సతాయిస్తాడు లెండి! **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

## మార్చి 16 ఎమ్బీయస్ : సినిమా కులం

తెలుగు సినిమారంగం కమ్మ కులస్తుల చేతిలో వుందని తరచుగా అంటూ వుంటారు, రాస్తూ వుంటారు. కొందరు దాన్ని ఒక ఆరోపణగా చెప్తారు, ఆ కులస్తుల్లో కొందరు అది గొప్పగా చెప్పుకుంటారు. కళ్లకు కనబడే నలుగురైదుగురు హీరోలను చూసి అటువంటి తీర్మానాలు చేసేస్తున్నారనిపిస్తుంది. ఇటీవలి కాలంలో అన్నీ హీరోపరంగానే ప్రస్తావించడం జరుగుతోంది. ఆ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాం. అందువలననే యీ గందరగోళం. చూపును ముక్కు అవతలకు దాటిస్తే చాలా విషయాలే కనబడతాయి, తోస్తాయి.

మొదటిగా సినిమారంగాన్ని మూడు విభాగాలుగా చూడాలి. 1. నిర్మాణం, 2. ఫైనాన్సు, పంపిణీ 3. ప్రదర్శన. మూడోది మొదటగా తీసుకోండి. సినిమా ప్రదర్శించే హాళ్లు రాష్ట్రమంతా వుంటాయి. స్థానికంగా ఆర్థికబలం, కండబలం (అవసరమైతే గూండాలను ప్రయోగించాలి) వున్న వాళ్లెవరో హాలు కడతారు. సినిమా జయాపజయాలలో వాళ్లకూ భాగం వుంటుంది. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు, ఆదిలాబాద్ నుండి చిత్తూరు వరకు కమ్మలే వుంటారా? వారికి ప్రాబల్యం వున్న రెండు, మూడు జిల్లాలలో కూడా ఊళ్లో సినిమా హాల్సన్నీ వాళ్లవే వుంటాయా? ఈ వ్యాపారంలో డబ్బులు వస్తూంటే తక్కినవాళ్లు దిగకుండా వుంటారా? వారిని వీరు ఆపగలరా? ఇటీవలి కాలంలో ఈ ఎగ్జిబిషన్ రంగంలోకి నాలుగు గ్రూపులు దిగి లీజుల పేరుతో గుత్తాధిపత్యం నెరపుతున్నారని ఆరోపణలున్నాయి. ఇది అంతకు ముందు లేదు కదా, భవిష్యత్తులో ఎంతకాలం సాగుతుందో తెలియదు కదా! సినిమా పుట్టి వందేళ్లు అయింది. దానిలో యీ అయిదు, పదేళ్ల లెక్కలోకి తీసుకుని యీ రంగంలో ఒకరి ఆధిపత్యం నడుస్తోందని ఎలా నిర్ణయిస్తాం? పైగా ఈ గ్రూపులన్నీ ఒకే కులం చేతిలో లేవు కదా!

రెండోది ఫైనాన్సు, పంపిణీ రంగాలు. సినిమా నిర్మాతకు వెన్నుదన్నుగా నిలిచి పెట్టుబడి పెట్టే ఫైనాన్షియర్లు, సినిమా విజయవంతం అవుతుందని లెక్కలు వేసుకుని డబ్బు చెల్లించి డిస్ట్రిబ్యూషన్‌కు తీసుకునేవాళ్లు. రిస్కు తీసుకునే వాళ్లు వీళ్లే. గతంలో ఏకీకృతమైన డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ వుండేది. వాళ్లలో ప్రముఖమైనవి పూర్ణా, చమ్రియా, వాణీ, విజయా, నవయుగ మొదలైనవి. వీటిలో విజయా, నవయుగ మాత్రమే కమ్మవారి వనుకుంటాను. (ఈ 'అనుకుంటాను' అనే మాట చాలా చోట్ల రావచ్చు. ఎందుకంటే ఎవరి కులం ఏదో ప్రత్యేకంగా గుర్తు పెట్టుకోలేదు మనం. ఈ పంపిణీ సంస్థల్లో కూడా ప్రధాన భాగస్వామి కులం ఒకటి కావచ్చు, తక్కిన

భాగస్వాములది మరొకటి కావచ్చు. ఎవరు ఏ యే కులాల వారో ఎవరికి తెలుసు? ఇంటిపేరు బట్టి ఫలానా కులం అనుకోకూడదు. ఒకే యింటిపేరు చాలా కులాల్లో వుంటుంది. అయినా ఈ మధ్యే ప్రతీదీ కులం కళ్లతో చూస్తున్నారు. అది అనవసరం అని చెప్పడానికి కులప్రస్తావన చేయవలసి వస్తోంది. కులం విషయంలో పట్టించుకోకపోవడం వలన, పక్కా డాటా సేకరించి పెట్టుకోకపోవడం వలన యీ జాగ్రత్తలు చెపుతున్నాను) పోనుపోను జిల్లాల వారీగా, ఊళ్ల వారీగా, హాళ్ల వారీగా హక్కులు కొనేసుకోవడం మొదలుపెట్టాక ఒక్కో సినిమాకు వందలాదిమంది డిస్ట్రిబ్యూటర్లు తయారయ్యారు. వారివారి కులాలు తెలుసుకుని పట్టీలు వేసుకుంటే తప్ప డిస్ట్రిబ్యూషన్ రంగంలో ఫలానాకులం వారిది హవా అనలేం.

సినిమారంగంలో సక్సెస్ రేటు 20% మాత్రమే అని అందరికీ తెలుసు. దీనిలో పెట్టుబడి పెట్టేవాళ్లకి ఒక రకమైన జూదరి స్వభావం వుండాలి. వస్తే పది రెట్లు వస్తుంది, పోతే కొంతలో తేలిపోతుంది అనుకుని డబ్బు తేవాలి. ఆ జూదరి స్వభావం ఒక కులం వారికి మాత్రమే వుంటుందని అనుకోవడం ప్రకృతి విరుద్ధం. పేకాట, గుఱ్ఱప్పందాలు, షేర్ మార్కెట్ – అన్ని కులాల వారూ ఆడతారు. అలా కాకుండా ఒకే కులం వారు మాత్రమే యీ 80% ఫెయిల్యూర్ రంగంలో పెట్టుబడి పెడుతున్నారు అంటే ఆ కులం వారిని చూసి మనం జాలి పడాలి – యింత పిచ్చేమిట్రా వీళ్లకు అని. ఇక ఫైనాన్సు యిచ్చేవాళ్లు కూడా డబ్బున్నవాళ్లయి వుండాలి. ఆ డబ్బు కూడా కష్టార్జితం అయి వుంటే సినిమారంగంలోకి చటుక్కున రాదు. వేరే రంగంలో (రియల్ ఎస్టేటో మరోటో) అనుకోకుండా డబ్బు వచ్చి పడి దానిలో నల్లడబ్బు శాతం ఎక్కువై పోతే సినిమా తీసి కాస్త వదుల్చుకుందామన్న యావ బయలుదేరుతుంది. ఇలాటి నల్లడబ్బు ఒకే కులంవారి వద్ద వుంటుందా? అబ్బే. రిస్కు తీసుకుని వ్యాపారం చేసే వారందరి దగ్గరా వుంటుంది. రిస్కు తీసుకోవడంతో బాటు, డబ్బు ఎగ్గొట్టే నిర్మాతలను తన్నించి, కేసులు పెట్టించి, బెదిరించి లాక్కునే దమ్మూ, ధైర్యం, తెగింపు కూడా వుండాలి. ఆ గుణాలు ఒకే కులస్తుల దగ్గర పోగుపడిందంటే నమ్మడం కష్టం.

ఇక నిర్మాతల దగ్గరకి వద్దాం. నిర్మాత అంటే టేస్టు, ధైర్యం, పలుకుబడి, ఓర్పు.. అన్నీ వుండాలి. నటీనటుల, సాంకేతిక నిపుణుల, స్టూడియో ఓనర్ల, ఫైనాన్షియర్ల విశ్వాసాన్ని చూరగొనాలి. నిజానికి సినిమా టైటిల్స్‌లో నిర్మాత పేరు చూసి వారొక్కరే నిర్మాత అనుకోవడానికి లేదు. సాధారణంగా ముగ్గురు, నలుగురు చేరి పెట్టుబడి పెడుతూ తమలో నిర్మాణదక్షత, పేరూ ప్రఖ్యాతి వున్నవారిని నిర్మాతగా పేర్కొంటారు. అలా పేరు వేసిన నిర్మాత కులం లెక్కలోకి తీసుకుని ఆ సినిమా ఆ కులం వారిది అని అనేయకూడదు. ఓపికుంటే సహనిర్మాతల, సమర్పకుల, నిర్మాణత–ల కులాలు కూడా ఏమిటో కనుక్కుని అప్పుడు ఆ కోణంలో ఆలోచించాలి.

నిర్మాణ సంస్థల పేర్లు కొన్ని – నాకు గుర్తున్నవి – వేసి చూశాను. ఎవిఎం, జెమిని, మోడర్న్ థియేటర్స్, ప్రతిభా, వాహినీ, శోభనాచల, భరణి, అంజలీ, రోహిణీ, వినోదా, పద్మశ్రీ, డివియస్, డిబియన్, విఠల్, బాబూ మూవీస్, నవతా, చిత్రకల్పన, రేఖామురళీ, గీతా ఆర్ట్స్.. వీరెవరూ కమ్మవారు కాదు. విజయాను ఎవరి ఎక్కవుంటులో వేస్తాం? ఒకరు రెడ్డి, మరొకరు కమ్మ. రాజశ్రీ ప్రొడక్షన్స్ అయితే ఒకరు మార్వాడీ, ఒకరు కమ్మ. కమ్మవారి సారథ్యంలో వున్న కంపెనీలు అంటే – అన్నపూర్ణ, ఎన్ఏటి, సారథి, ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్, జగపతి, సురేష్, పద్మాలయ.. యివే తడుతున్నాయి. గత 30 ఏళ్లగా యింకా అనేక కంపెనీలు పుట్టుకుని వచ్చాయి. టాక్స్ కారణాలుగా పేర్లు మార్చుకున్నాయి. నిర్మాణ సంస్థల పేర్లు అన్నీ వేసుకుని వస్తే వేల సంఖ్య దాటుతుంది. నేను చూపదలచిన దేమిటంటే కమ్మ సంస్థలదే రాజ్యం అని అనుకోవడానికి ఏమీ లేదు సుమా, నాన్–కమ్మ సంస్థల సంఖ్యతో పోలిస్తే వాటి సంఖ్య చాలా తక్కువే సుమా అని!

ఇప్పటిదాకా సినిమాలో పెట్టుబడి పెట్టేవారి గురించి ఆలోచించాం. ఇక సినిమా పరిశ్రమ ద్వారా లబ్ధి పొందుతున్న వారి గురించి చూదాం. ఈ మధ్య కొందరు హీరోలు, దర్శకులు కలిసి సినిమా బజెట్‌లో 50% దాకా తీసేసుకుంటున్నారు. వాళ్ల సంగతి పక్కన పెట్టి మాట్లాడుకుందాం. సాధారణంగా – సినిమా వ్యయంలో

1) 20% వాటా – హీరో, హీరోయిను, సెకండ్ హీరో, సెకండ్ హీరోయిన్, విలన్, కమెడియన్లకు
2) 10% కారెక్టరు నటులు, జూనియర్ నటులు, డాన్సర్లు వగైరాలకు,
3) 10% డైరక్టరుకు,
4) 10% రచయితలు, గీతకారులు, సంగీతకారులు, గాయనీగాయకులకు
5) 20% ఫోటోగ్రాఫర్, డాన్స్ డైరక్టర్లు, కళాదర్శకులు యిత్యాది సాంకేతిక నిపుణులకు,
6) 20% ఫిల్మ్, ప్రాసెసింగ్, సెట్లు, లొకేషన్స్, పబ్లిసిటీ వగైరాలకు,
7) తక్కిన 10% యితర ఖర్చులకు, వృథాఖర్చులకు పోతుంది అనుకుందాం. ఈ అంకెలు సినిమా బట్టి, వ్యక్తిని బట్టి మారతాయి. ఇది ఒట్టి అందాజా లెక్క. కాలగతిలో కొన్ని విభాగాలకు ఖర్చు ఎక్కువై మరి కొన్నిటికి తక్కువ అవుతూ వుంటుంది.

5 నుండి 7 ఖర్చులకు సినిమా ఖర్చులో 50% అవుతుంది. దానిలో ఫిల్మ్, ఎయిర్ టిక్కెట్లు, పెట్రోలు, తిండి, మద్యం వంటి కుల ప్రమేయం లేని ద్రవ్యాలకు వగైరాలకు పోగా జీతాలకై పనిచేసే వారిలో అన్ని భాషల వాళ్లూ, అన్ని కులాల వారూ వుంటారు. తెరమీద, తెర వెనుక పనిచేసే అనేకమంది తెలుగేతరుల విషయంలో కులప్రస్తావన రాదు కదా. వాళ్లను పక్కన పెట్టి లెక్కలేస్తే పూర్తి చిత్రం రాదు. అయినా తెలుగువారిని మాత్రం లెక్కలోకి తీసుకుని చూస్తే...4 వ విభాగంలో. రచయితలు – నాకు గుర్తున్న కొన్ని

పేర్లు చెపుతాను. – సముద్రాల (సీ ప్లస్ జూ), మల్లాది, శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, తాపీ, పింగళి, సదాశివబ్రహ్మం, డివి నరసరాజు, ముళ్లపూడి, భమిడిపాటి, గొల్లపూడి, గణేష్ పాత్రో, రాజశ్రీ, సత్యానంద్, జంధ్యాల, వెన్నెలకంటి, భరణి... యిలా చూస్తే కమ్మవారెవరూ కనబడటం లేదు. త్రిపురనేని మహారథి, పరుచూరి బ్రదర్స్, పోసాని – తప్ప! గీతరచయితల విభాగంలో – ఈ పేర్లలో కొన్నిటితో పాటు దాశరథి, సినారె, వేటూరి, సీతారామశాస్త్రి, రామజోగయ్యశాస్త్రి, జొన్నవిత్తుల, భాస్కరభట్ల, భువన చంద్ర, చంద్రబోస్.. యిలా చూస్తే ఒక్క కొసరాజు తప్ప కమ్మవారు నాకు తోచటం లేదు.

ఇక సంగీతకారుల్లో రాజేశ్వరరావు, పెండ్యాల, టివి రాజు, ఆదినారాయణరావు, ఘంటసాల, సత్యం, రమేష్ నాయుడు, రాజ్–కోటి, ఆర్‌పి పట్నాయక్, చక్రి,. యిలా అందరూ కమ్మేతరులే కనబడుతున్నారు. విశ్వనాథన్, మహదేవన్, ఇళయరాజా, రహమాన్.. వీళ్లు తెలుగువాళ్లే కాదు. తాతినేని చలపతిరావు, చక్రవర్తి, కీరవాణి మాత్రమే కమ్మవారిలో గుర్తుకు వస్తున్న పేర్లు. ఇక గాయనీగాయకులలో అయితే కమ్మవారెవరూ కనబడటం లేదు. ఘంటసాల, మాధవపెద్ది, పిఠాపురం, పిబి శ్రీనివాస్, భానుమతి, లీల, జిక్కి, సుశీల, జానకి, వాణీ జయరాం, చిత్ర, శైలజ, సునీత... కొత్త గాయకులలో తెలుగువారు తక్కువై పోయారు. తెలుగువారిలో బహుళ సంఖ్యలో పాడినవారు తక్కువే కాబట్టి ఆ పేర్లు రాయడం లేదు. వాయిస్ ఆర్టిస్టులను కూడా లెక్కలోకి తీసుకోవాలి. ఏది ఏమైనా యీ విభాగంలోనూ కమ్మ ఆధిపత్యం లేదు. అట్టే మాట్లాడితే తక్కిన కులాలవారి కంటె సంఖ్యాపరంగా బ్రాహ్మణుల సంఖ్య ఎక్కువగా వుంది. ఎగైన్, సంగీతదర్శకుడి కులం ఒక్కటీ లెక్కలోకి తీసుకోలేం. వందల సంఖ్యలో వాయిద్యకారులుంటారు. వారందరినీ పరిగణనలోకి తీసుకోవాలి.

మూడో విభాగమైన డైరక్టర్లు. – ఎచ్ ఎమ్ రెడ్డి, కెవి రెడ్డి, బియన్ రెడ్డి, కోదండరామిరెడ్డి, చంద్రశేఖర రెడ్డి, పుల్లయ్య, దాసరి, కోడి రామకృష్ణ, ఘంటసాల బలరామయ్య, వేదాంతం రాఘవయ్య, కమలాకర, రామకృష్ణ, విఠలాచార్య, ఆదుర్తి, విశ్వనాథ్, బాపు, రేలంగి నరసింహారావు, వంశీ, రాంగోపాల్ వర్మ.. యిలా అనేకమంది కమ్మేతరులు కనబడుతున్నారు. వారితో బాటు గూడవల్లి రామబ్రహ్మం, ఎల్వీ ప్రసాద్, కె యస్ ప్రకాశరావు, తాతినేని ప్రకాశరావు, ప్రత్యగాత్మ, తాతినేని రామారావు, రాఘవేంద్రరావు, తిలక్, వి మధుసూదనరావు.. వంటి కమ్మకులస్తులు కనబడుతున్నారు. చెప్పాలంటే దర్శ విభాగంలో కమ్మవారి సంఖ్య గణనీయంగా – 25% దాకా వుండవచ్చు. ఈ తరంలో అగ్రశ్రేణి దర్శకులుగా వెలుగొందుతూ భారీ ఫీజులు పుచ్చుకుంటున్న వారిలో పూరీ జగన్నాథ్, వివి వినాయక్, త్రివిక్రమ్ శ్రీనివాస్ – వంటి కమ్మేతరులు కూడా వున్నారు.

రెండవ విభాగమైన జూనియర్ నటీనటులు, డాన్సర్లలో ఏ కులంవారైనా వుండవచ్చు. కారెక్టర్ యాక్టర్ల లిస్టు చూడబోతే – నాగయ్య, సియస్సార్, కన్నాంబ, శాంతకుమారి, ఎస్ వరలక్ష్మి, జి వరలక్ష్మి, లింగమూర్తి, గోవిందరాజుల సుబ్బారావు, ధూళిపాళ, పియల్ నారాయణ, రమణమూర్తి, నూతన్ ప్రసాద్, గొల్లపూడి, సోమయాజులు, శరత్‌బాబు, ప్రకాష్ రాజ్, భరణి, శారద,నిర్మలమ్మ.. యిలా లిస్టు వేసుకుంటూ పోతే... గుమ్మడి, మిక్కిలినేని మాత్రమే కమ్మకులస్తులుగా గుర్తుకొస్తున్నారు. ఇక కమ్మ డామినేషన్ ఎక్కడ? వీరికి అనుసంధానంగా మొదటి విభాగంలోని హాస్యనటుల వద్దకు వద్దాం. శివరావు, బాలకృష్ణ, రేలంగి, రమణారెడ్డి, పేకేటి, పద్మనాభం, రాజబాబు, రావి కొండలరావు, అల్లు రామలింగయ్య, సూర్యకాంతం, గిరిజ, ఛాయాదేవి, గీతాంజలి, రమాప్రభ, శ్రీలక్ష్మి, రాళ్లపల్లి, ధర్మవరపు, బ్రహ్మానందం, బాబూ మోహన్, ఎమ్మెస్ నారాయణ, ఎవియస్, వేణుమాధవ్, సునీల్, ఎల్ బి శ్రీరామ్, రఘుబాబు... – కమ్మకులస్తులు ఒక్కరూ కనబడటం లేదు.

ఇక విలన్లు – ఎస్ వి రంగారావు, ఆర్ నాగేశ్వరరావు, రాజనాల, సత్యనారాయణ, నాగభూషణం, ప్రభాకరరెడ్డి, ముక్కామల, రావు గోపాలరావు, కోట శ్రీనివాసరావు, గిరిబాబు.. కమ్మ వారెవరూ కనబడటం లేదు. మోహన్‌బాబు, చలపతిరావు మాత్రం కనబడుతున్నారు. ఇటీవలి కాలంలో అందరూ హిందీ విలన్లే కాబట్టి వారి కులం గురించి ఆలోచించే పనే లేదు. తర్వాత చూడాల్సింది హీరోయిన్లను – అంజలి, భానుమతి, సావిత్రి, జమున, జానకి, కృష్ణకుమారి, కాంచన, వాణిశ్రీ, జయప్రద, జయసుధ, శ్రీదేవి.. వీళ్లెవరూ కమ్మవారు కాదు. దక్షిణాది హీరోయిన్లు, హిందీ హీరోయిన్లు చాలా మంది వున్నారు కాబట్టి వారి విషయంలో కులం ఎంచనక్కరలేదు.

ఇక ఆఖరిగా చూడవలసినది హీరోలు – ఈ విభాగంలో మాత్రం కమ్మవారు చాలామంది వున్నారు. ఎయన్నార్, ఎన్టీయార్, వారి వారసులు, జగ్గయ్య, కృష్ణ, ఆయన వారసులు, శోభన్‌బాబు, మోహనబాబు ఆయన వారసులు, బాలయ్య, మురళీమోహన్, వెంకటేశ్, రాజేంద్రప్రసాద్ , రామ్.. వీరి కారణంగానే సినిమారంగమంతా కమ్మవారి చేతుల్లో వుందన్న అభిప్రాయం కలుగుతోంది. కానీ కాస్త ఆలోచిస్తే కమ్మేతర హీరోలు కూడా గణనీయమైన సంఖ్యలో వున్నారు. కాంతారావు, హరనాథ్, చంద్రమోహన్, చిరంజీవి ఆయన వారసులు, రవితేజ, ప్రభాస్, .. యిత్యాదులు. కమలహాసన్, సుమన్, అర్జున్ వంటి తెలుగేతరులు చాలామంది వున్నారు. వీరు కాక చిన్న హీరోలు చాలామంది వున్నారు.

మొత్తం మీద చూస్తే సినీనిర్మాణంలో మొదటి విభాగానికి 20% అవుతుందనుకుంటే దానిలో సగం హీరోకి పోతుందనుకుంటే సినిమా రంగంలో హీరో వంతు 10% అన్నమాట. సగానికిసగం మంది కమ్మహీరోలనుకుంటే వారి వాటా 5%! డైరక్టర్ల వాటా 10% అనుకుంటే దానిలో 25% మంది కమ్మలనుకుని 3% కలిపితే మొత్తం 8% అయింది. తక్కిన విభాగాల్లో కమ్మవారున్నా మొత్తం మీద సినీనిర్మాణంలో వారి వంతు 12%–15% దాటదు. అలాటప్పుడు వారి డామినేషన్ వుందని ఎలా అనగలం?

డబ్బింగ్ సినిమాలను, మన రాష్ట్రంలో ఆడే హిందీ, ఇంగ్లీషు సినిమాలను లెక్కలోకి తీసుకోకుండా యీ లెక్కలన్నీ వేశాం. అవి కూడా లెక్కలోకి తీసుకుంటే యీ పర్సంటేజి మరింత తగ్గిపోతుంది.

చివర్లో కేవియట్ చెప్పి తీరాలి – ఇటీవలి మహేష్‌బాబు సినిమా బజెట్ తీసుకుని యీ లెక్కలన్నీ కొట్టి పారేస్తే నేనేం చేయలేను. హీరోకి విపరీతంగా పారితోషికం యిస్తున్న యీ ఫేజ్ తాత్కాలికమే అని నమ్మాలి. సినిమా పరిశ్రమ తను బతకడానికి త్వరలోనే కొన్ని కరక్టివ్ స్టెప్స్ తీసుకుంటుంది. చాలాకాలంగా వుంటున్న పరిశ్రమ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని యీ లెక్కలు వేశా! ఇక రెండవ జాగ్రత్త ఏమిటంటే – నేను యీ వ్యాసంలో కొందరి పేర్లే ప్రస్తావించాను. అవీ పాతవాళ్లవే. కొందరి కులం విషయంలో పొరపాట్లు కూడా దొర్లి వుండవచ్చు. వారి కౌశలంపై చూపిన శ్రద్ధ వారి కులం తెలుసుకోవాలని లేకపోవడం చేత యిది జరిగింది. ఎవరికైనా ఓపిక వుంటే యీ కసరత్తు పూర్తి స్థాయిలో చేయవచ్చు. చేసినా ఫలితం మాత్రం యిదే వస్తుంది – సినిమా రంగంపై ఎప్పుడూ, ఏ కులంవారి ఆధిపత్యం లేదని, టాలెంట్ వుంటేనే నిలదొక్కుకుంటారని! నటవారసత్వం గడప వరకే తీసుకెళుతుంది. వేదిక ఎక్కాక అతన్ని వుంచాలో, దింపాలో ప్రేక్షకులే తేలుస్తారు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

## మార్చి 18 ఎమ్బీయస్ : చారిత్రాత్మక సినిమాలకు మనం నోచుకోమా?

హైదరాబాదులో చారిత్రాత్మక సినిమాల వారోత్సవం జరుగుతోంది. ఆ జాబితా (తెనాలి రామకృష్ణ, బొబ్బిలి యుద్ధం, మహామంత్రి తిమ్మరుసు, అమరశిల్పి జక్కన, పల్నాటియుద్ధం, అల్లూరి సీతారామరాజు, చాణక్య చంద్రగుప్త) చూస్తే ఇంతేనా మన చారిత్రాత్మకాలు అని ఆశ్చర్యం వేస్తుంది. మనకు డిసెంబరులో తెలుగు మహాసభలు జరిగాయి. అక్కడా యివే సినిమాలనుకుంటా. అంతకుముందు ఓరుగల్లులో కాకతీయ ఉత్సవాలు ప్రారంభించారు. తెలుగుజాతి ఘనత ఉగ్గడించే కళారూపాలు ఏడాది పొడుగునా ప్రదర్శిస్తారని చెప్పారు. అంటే సినిమాలు, హరికథలు, బుర్రకథలు.. అన్నమాట. అక్కడా మహా అయితే యీ జాబితాలో ఒకటి రెండు మార్చి చూపిస్తారు తప్ప కొత్తవేమీ పట్టుకురారు. ఏడాది పాటు చరిత్ర గురించి చెప్పాలంటే మనకు బాగా తెలిసున్న కథలేవీ?

వేలాది సంవత్సరాలుగా వున్న జాతి మనది. మహాభారత కాలంలోనే ఆంధ్రజాతి వుందట (ఎక్కడో చదివాను, కౌరవుల పక్షాన పోట్లాడి సహదేవుడి చేతిలో ఓడామట – మనది ఎప్పుడూ లూజింగ్ సైడే). అంటే వేలాది సంవత్సరాలుగా వున్న జాతి మనది. మనకో చరిత్ర గట్రా వుండాలి కదా. దాన్ని నేటి యువతకు, భావితరాలకు అందచేయవలసిన బాధ్యత మనపై వుందని నాయకులు మాటిమాటికీ గుర్తు చేస్తూ వుంటారు. 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి కలవోడా' అనే పాట విన్నాను కానీ ఘనకీర్తి ఎలా గడించామో చాలామందితో బాటు నాకూ తెలియదు. మన పూర్వీకులు శాలివాహనులా? శాతవాహనులా? – ఇద్దరూ వేర్వేరా, లేకపోతే అచ్చుతప్పుపడి వేర్వేరుగా చదువుతున్నామా, వీళ్లలో శకం ఎవరి పేర వుంది? పూర్వీకుల్లో ఇక్ష్వాకులు అంటారు.., రాముడి వంశం ఇక్ష్వాకులు కదా, మన చరిత్రలోకి ఎలా వచ్చారు? చాళుక్యులు, చోళులు.. ఎవరు మనవాళ్లు? ఎవరు అరవ్వాళ్లు? ఏమో!

నీకు తెలిసున్న గొప్ప తెలుగురాజు పేరు చెప్పు అంటే కృష్ణదేవరాయలు పేరు చటుక్కున గుర్తుకు వస్తుంది. 'ఆయన తెలుగునేలను పాలించాడు కానీ అసలు కర్ణాటక వాడు కదా, తెలుగు రాజు పేరు చెప్పు' అని అడిగితే.. కాస్త ఆలోచించి 'రాజు తెలియదు కానీ రాణి – రుద్రమదేవి వుంది' అంటాం. ఆవిడ ఏ శతాబ్దంది, ఏం చేసింది అంటే 'శతాబ్దాల మాట అడక్కు కానీ గుఱ్ఱం ఎక్కి కత్తి చేత్తో పట్టుకుని వీపున పిల్లాణ్ని కట్టుకుని (వీపున పిల్లాడు, యీవిడా? ఝాన్సీ లక్ష్మీబాయా? అన్న సందేహం ఒకటి) యుద్ధం చేసింది' అంటాం. ఆ పిల్లాడెవరు? అంటే 'ప్రతాపరుద్రుడేమో, పాపం ఢిల్లీ సుల్తాన్ పట్టుకుపోతే యుగంధరుడు పిచ్చివాడిలా నటించి తీసుకుని వచ్చేశాడు' అని చిన్నప్పుడు విన్న పుక్కిటి పురాణం చెప్పేసి 'ఎనీవే, ఐ యామ్ నాట్ ష్యూర్, ఐ నెవర్ కేర్‌డ్ ఫర్ హిస్టరీ, ఐ యామ్ ఏ సైన్స్ గై..' అని తప్పుకుంటాం.

మనకు తెలిసిన యింకో రాజు – రాజరాజనరేంద్రుడు. నన్నయ్య చేత భారతం మొదలుపెట్టించడం తప్ప ఆయన చేసిన ఘనకార్యం మనకు తెలియదు. కాస్త పాతతరం వాళ్లకు మాత్రం సారంగధర కథలో ఆయన పాత్ర గురించి తెలుసు. తెలుగునాట జరిగిన రెండు యుద్ధాలు గురించి మనకు కాస్త తెలుసు. బొబ్బిలియుద్ధం, పల్నాటి యుద్ధం. దానిలో పాల్గొన్న రాజుల పేర్లు చెప్పమంటే చెప్పలేం కానీ యీ రెండింట్లో ఏదో ఒక దాంట్లో తాండ్ర పాపారాయుడు వస్తాడని, ఎస్వీ రంగారావు వాయిస్‌తో అదరగొట్టే డైలాగులు చెప్తాడనీ కచ్చితంగా తెలుసు. ఇన్ని వేల సంవత్సరాల తెలుగు చరిత్ర అంటారు, మరి మనకు తెలిసున్న రాజుల పేర్లు మూడో నాలుగో కంటె ఎక్కువ లేవేమిటి? వీళ్ల కంటె మొఘల్ చక్రవర్తుల పేర్లు చెప్పడం యీజీలాగుంది.

పురాణాల గురించి తెలుగువాళ్లకు కాస్తో, కూస్తో తెలుసు అంటే దానికి కారణం తెలుగులో తీసిన పౌరాణిక సినిమాలు. హిందీలో మంచి పౌరాణికాలు రాకపోవడం చేత వాళ్లకు మన కంటె తక్కువ తెలిసేది. టీవీ సీరియల్స్ వచ్చాక పరిస్థితి మెరుగుపడింది. మనకు చరిత్ర గురించి సినిమాలు రాకపోవడం వలన దాని విషయంలో మనం గుండుసున్న. వేలాది సంవత్సరాలుగా అస్తిత్వం వున్న తెలుగువాళ్లకు చరిత్ర లేదా? ఉన్నా మనం తెలుసుకోదగ్గది, పిల్లలకు చెప్పదగ్గదీ, నాటకాలుగా, సినిమాలుగా తీయదగ్గదీ, ఏమీ లేదా?

ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రపదం జాతిపరంగా వాడబడింది. మనం విశ్వామిత్రుడి కొడుకులమట. అతని చేత

శాపగ్రస్తులమయ్యామట. (వేరే చెప్పాలా?) రామాయణ భారతాలలో మన ప్రస్తావన వుంది. క్రీస్తు పూర్వం 6 వ శతాబ్ది నాటి జైన, బౌద్ధ గ్రంథాలలో మన ప్రాంతాల గురించి రాశారు. మన రాజులు వాటిని ఆదరించారు, అవలంబించారు. క్రీ.పూ. 4 వ శతాబ్దంలో మెగస్తనీస్ ఆంధ్రులు గొప్ప సైనికబలం కలవారని వర్ణించాడు. ఏరియన్ అనే మరో గ్రీకు రాయబారి ఆంధ్రులకు 30 రాజ్యాలున్నాయన్నాడు. కౌటిల్యుడు మన గురించి, వాత్సాయనుడు మన శృంగారపు అలవాట్ల గురించి రాశారు. అశోకుడి శిలాశాసనం (క్రీ.పూ.256) ఆంధ్రప్రాంతాన్ని మౌర్యసామ్రాజ్యంలో భాగంగా చెప్పింది. అశోకుని మరణానంతరం మౌర్యసామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతో క్రీ.పూ. 230లో శాతవాహన సామ్రాజ్యం వెలిసింది. తర్వాత మనం మౌర్యుల పైకే దాడి వెడలాం.

ఆ తర్వాత ఇక్ష్వాకులు, బృహత్ఫలాయనులు, శాలంకాయనులు, ఆనందగోత్రజులు, కళింగరాజులు, విష్ణుకుండులు – ఇలా అనేకమంది మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను ఏలారు. ఆ తర్వాత ముఖ్యంగా చెప్పుకోదగినవారు పల్లవులు (క్రీ.శ.280 నుండి 630 వరకు). ఆ కాలంలోనే రాయలసీమలో రేనాటి చోడులు వచ్చారు. పల్లవులు తగ్గుతూండగానే చాళుక్యయుగం వచ్చింది. తూర్పు చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, వేంగీ చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు – ఇలా వారు అనేక శాఖలుగా చీలి సంఘర్షించుకున్నారు. మధ్యన నొలంబులు, వైదుంబులు, రాష్ట్రకూటులు కూడా తమ వంతు పాత్ర తాము పోషించారు. ఆ తర్వాత వచ్చిన చాళుక్య–చోళ యుగంలో చాళుక్యులతో బాటు తెలుగు చోడులు, నెల్లూరు చోడులు, దుర్జయులు, హైహయులు, వెలనాటి రాజులు ప్రాముఖ్యానికి వచ్చారు.

ఆ తర్వాతది కాకతీయయుగం. మహావైభవంతో వెలిగింది. తెలుగువాళ్లందరినీ ఏకం చేసింది. క్రీ.శ.1323లో ప్రతాపరుద్రుని మరణంతో అంతరించింది. ఆ తర్వాత ఢిల్లీ సుల్తానుల, వారి సేనానులు పాలనలో వున్నాం. తర్వాత రెడ్డి – నాయక యుగం. ముసునూరి నాయకులు, పద్మనాయకులు, రెడ్డి రాజులు పాలించారు. వారితో బాటే కొన్ని ప్రాంతాల్లో విజయనగర రాజుల పాలనా సాగింది. కళింగ రాజుల పాలనా సాగింది. విజయనగర రాజ్యం పతనమయ్యాక ఆరవీటి రాజులు పాలించారు. ఆ పై నాయక రాజులు. తంజావూరు సామ్రాజ్యం. తర్వాత క్రీ.శ. 1500 నుండి కుతుబ్‌షాహీ యుగం. ఆ తర్వాత నిజాంల పాలన, ఫ్రెంచ్, ఇంగ్లీషువారి పాలన, ఆ తర్వాత భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మన పాలన.

మన ప్రాంతంలో యిన్ని రాజ్యాలుండేవి కదా, వేలాది సంవత్సరాలుగా వందలాది రాజులు పాలించారు కదా. వాళ్ల గురించి చెప్పడానికి కథలే లేవా? ఉన్నాయి. మహారాణి జైనమతస్తురాలై హింస వద్దంటే మహారాజు హిందూ మతస్థుడై యుద్ధానికి బయలుదేరి, సంఘర్షించుకున్న కథలు, రాజు కంటకుడైతే ప్రజలు తిరుగుబాటు చేసిన కథలు, దాయాదుల మధ్య కలహాలలో విదేశీయులను ఆహ్వానించిన ఘట్టాలు, రాజ్యం పోగొట్టుకుని వున్న రోజుల్లో పొరుగు రాజ్యాలకు వెళ్లి అక్కడ చక్రవర్తి కూతుర్ని పెళ్లాడి వచ్చిన సందర్భాలు ఎన్నో వున్నాయి. కానీ అవి మన సినిమావాళ్లకు ఆనవు. 'అబ్బే వాళ్లు పెద్ద రాజులు కాదండీ, చాలామంది చిన్నచిన్నవాళు ్లు, వీళ్ల సామ్రాజ్యాలు రెండు మూడు జిల్లాలకు మించి వుండవు, ఏం చెప్తాం?' అని అనవచ్చు. బొబ్బిలి ఏమంత పెద్ద వూరు? అక్కణ్నుంచి విజయనగరం ఎంత దూరం? గట్టిగా గంట ప్రయాణం కూడా వుందో లేదో! ఆ రెండు ప్రాంతాల మధ్య జరిగిన గొడవతో 'బొబ్బిలి యుద్ధం' కథను ఆసక్తికరంగా నాటకంగా, సినిమాగా మలచలేదా?

పలనాడు ఓ జిల్లాలో కొంతభాగం. 'పలనాటి యుద్ధం'పై శ్రీనాథుడు ద్విపద కావ్యం రాశాడు, నాటకాలు వేశారు, సినిమా తీశారు. 'అల్లూరి సీతారామరాజు' తిరుగుబాటు చేసిన ప్రాంతం కొన్ని తాలూకాలకు పరిమితం. మరి తెరమీద సినిమా స్కోప్‌లో చూపిస్తే అల్లూరి దేశం మొత్తానికి నాయకుడు అనిపించాడు. అయినా రాజ్యం ఎంత పెద్దదో చిన్నదో మనకు అనవసరం. కథలో పట్టు వుండాలి. డ్రామా వుండాలి. ఆసక్తికరమైన పాయింటు వుండాలి. వీరత్వం, శూరత్వం, ఔదార్యం, దేశం కోసం ప్రేమత్యాగం, వెన్నుపోటు, తిరుగుబాటు, – ఇలా ఏదో ఒక అంశం హైలైట్ అయితే చాలు, మన మనసులో ఆ కథ, ఆ రాజు పేరు, రాజ్యం పేరు రిజిస్టర్ అవుతుంది. ఇది మనసులో పెట్టుకుని మన సినీమావాళ్లు యీ దిశలో యిప్పటిదాకా ఏం చేశారో చూదాం. అప్పుడు యింకా ఏం చేయవచ్చో అర్థమవుతుంది.

చారిత్రాత్మిక సినిమాలుగా మనం పేర్కొంటున్న అనేక సినిమాలు పౌరాణిక యితివృత్తంతో ముడిపడి వున్నాయి. ఇప్పుడు రామదాసు కథ వుంది. ఆయన నిజంగా ఒక కాలంలో జీవించాడు. ఊహాజనితమైన వ్యక్తి కాదు. అయితే ఆయన పేరు నల్లుకుని కొన్ని మహిమలు కల్పించారు. అవి ప్రేక్షకులను అలరిస్తాయనుకుని ఆ కథను సినిమాలుగా తీశారు. 1933లో ఇంపీరియల్ వారు, ఈస్టిండియా వారు పోటీ పడి "రామదాసు" నిర్మించారు. (ఓ దాంట్లో రామదాసు ఆరణి సత్యనారాయణ, మరో దాంట్లో సియస్సార్) ఆ తర్వాత మూడు దశాబ్దాలకు నాగయ్యగారి రామదాసు, ఇంకో నాలుగు దశాబ్దాలకు నాగార్జునతో "రామదాసు". వీటన్నిటిలోను చరిత్రలో కనబడే వ్యక్తులు – అక్కన్న, మాదన్న, తానాషా, రామదాసు – కనబడతారు. కానీ అలా అని పూర్తిగా చరిత్రే అనలేము. త్యాగయ్య కథా అలాటిదే. ఆయన రామదాసు తర్వాత వున్న వ్యక్తి. అప్పటికే ఇంగ్లీషువాళ్లు మన గడ్డపై కాలు పెట్టారు. కానీ ఆయన జీవితాన్ని – 1946లో నాగయ్యతో, అర్ధశతాబ్ది తర్వాత సోమయాజులుతో) సినిమాగా తీసినపుడు మహిమలు చూపించారు. ఇక దాన్ని చారిత్రాత్మక చిత్రం ఎలా అనగలం?

తుకారాం మహారాష్ట్రలో శివాజీకి సమకాలికుడు. ఆయన గురించి తెలుగులో రెండు సార్లు సినిమా తీశారు. 1937లో సియాస్సార్ 1973లో ఎయన్నార్‌తో. దానిలోనూ మహిమలే. క్షేత్రయ్య కూడా చరిత్రలో వ్యక్తే. ఎయన్నార్ హీరోగా తీసిన ఆయన సినిమాలోనూ

మహిమలే. కాళిదాసు మన ప్రాంతం వాడు కాదు. కానీ కాళికాదేవి నాలిక మీద రాసే ఘట్టం వలన నాటకాలకు, సినిమాలకు భలే పనికి వచ్చాడు. ''భోజ కాళిదాసు'' (1940–అద్దంకి), ''మహాకవి కాళిదాసు'' (1960– ఎయన్నార్) రెండు సినిమాలు వచ్చాయి. జయదేవుడూ మన ప్రాంతం వాడు కాదు. అయినా 1938లో ఆర్ సత్యనారాయణతో, 1961లో ఎయన్నార్‌తో మరో సినిమా వచ్చాయి. కృష్ణుడే వచ్చి అష్టపదిని పూరించాడని మహిమ చూపించడంతో సినిమాలకు వేరే కలరింగ్ వచ్చింది. పోతన కవే. కానీ యిలాటి మహిమలతోనే 1942లో నాగయ్యతో, 1966లో గుమ్మడితో తీశారు. అలాగే అన్నమయ్య, మీరాబాయి (1940), సక్కుబాయి, – వీళ్లందరి మీదా తీసిన సినిమాలను హిస్టారికల్స్ లిస్టులో వేయడం కష్టమౌతోంది. గ్రంథస్తమైన చరిత్రలో వ్యక్తులకే యిన్ని మహిమలు పెడితే మరి వాల్మీకి లాటి వాడికి ఎన్ని పెట్టవచ్చు! వాల్మీకిపై రెండు సినిమాలు వచ్చాయి. వేములవాడ భీమకవి గొప్ప కవి. ఆయనపై ఎన్టీయార్ సినిమా తీసినపుడు చాటుపద్యాల ఆధారంగా మహిమలు చూపించారు.

కవుల సంగతే యిలా వుంటే యిక దైవాంశ సంభూతులుగా పేరుబడిన వారిపై సినిమాలు తీసినపుడు యిక చెప్పనే అక్కరలేదు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర, సాయిబాబా, ఏసుక్రీస్తు (కరుణామయుడు), కబీర్, సమ్మక్క–సారక్క – వీటన్నిటిలోనూ మహిమలే. వాటిని మన సినీవిమర్శకులు చారిత్రాత్మక సినిమాల జాబితాలో వేస్తారు. పౌరాణికాలు అనాలనే నా అభిప్రాయం. కవులపై తీసిన సినిమాల్లో – శ్రీనాథుడు, యోగి వేమన (1947లో నాగయ్యతో, విజయచందర్‌తో యోగివేమన చరిత్ర), కథానాయిక మొల్ల – మహిమలు చూపలేదని గుర్తు. ఎంతవరకు చరిత్ర, ఎంతవరకు కల్పన అనేది వేరే విషయం. ఇవి పౌరాణికాలు మాత్రం కావు.

''తెనాలి రామకృష్ణ'' సినిమా ఒక కవి కథే. 1941లో తీసినపుడు హాస్యస్ఫోరకంగానే తీశారు. 1956లో ఎయన్నార్‌తో తీసినపుడు రామకృష్ణుడు రాజకీయాల్లోకి కూడా చొరబడినట్టు చూపించారు. భానుమతి పాత్ర, రామకృష్ణుడు ఢిల్లీ సుల్తాన్‌ను కలవడం వంటి చరిత్రలో లేని అంశాలను చొప్పించి మన విమర్శకుల చేత 'చారిత్రాత్మక సినిమా'గా స్టాంప్ వేయించేసుకున్నారు. సినిమా మొదట్లో కాళికాదేవిని ప్రత్యక్షంగా చూపించి పౌరాణికత్వమూ సాధించారు! ఇది ఏ రకం సినిమా అనాలో నాకైతే బోధపడదు.

మనవాళ్లు చారిత్రాత్మక సినిమాగా చెప్పే యింకో సినిమా – ''అమరశిల్పి జక్కన''. కర్ణాటక ప్రాంతంలో జక్కణ అనే శిల్పి వుండేవాడన్న అంశం తప్ప ఆ సినిమా ద్వారా చరిత్ర ఏమీ తెలియదు. సినిమాలో ఓ రాజుంటాడు, హీరో హీరోయిన్ల మధ్య విలన్‌గా ప్రవర్తిస్తాడు. అంతకుమించి చారిత్రాత్మక అంశం ఏమీ లేదు. చారిత్రాత్మక సినిమాగా చలామణీ అయిపోయే యింకో నాటకం, దరిమిలా సినిమా – ''సారంగధర''. రాజరాజనరేంద్రుడు తన కొడుకు సారంగధరుడికై చిత్రాంగి అనే అమ్మాయిని చూడడానికి వెళ్లి ఆమె అందం చూసి భ్రమసి తనే పెళ్లాడేశాట్ట. ఆ తర్వాత ఆమె సారంగధరుణ్ని చూసి వలచడం, అతడు నిరాకరిస్తే రాజుకి చాడీలు చెప్పడం, అవి నమ్మి రాజు సారంగధరుడి కాళ్లూ, చేతులు నరికించడం – ఇదీ కథ.

ఇది ఎక్కడో మధ్యప్రదేశ్‌లో జరిగిన కథట. దాన్ని రాజరాజనరేంద్రుడికి అంటుకట్టేసి కథలు అల్లేశారు. రాజమహేంద్రవరానికి దగ్గర్లో సారంగధరమెట్ట అనే ప్రాంతాన్ని చూపిస్తారు. ఆ వూళ్లోనే 'చిత్రాంగి మేడ' (వెయ్యి సంవత్సరాల క్రితం దానిలా అస్సలుండదు) అని చూపిస్తారు. చరిత్ర ప్రకారం యిదంతా బోగస్. రాజరాజనరేంద్రుడి కొడుకు మేనమామల యింట పెరిగి కులోత్తుంగ చోళ చక్రవర్తిగా ఖ్యాతి గాంచాడు. అతనికి చిత్రాంగి అనే పేరున్న సవతి తల్లే లేదు. అయినా యీ సదరు కథలో సెక్స్, డ్రామా, పెథోస్ వున్నాయి కాబట్టి నాటకంగా ఆడి సక్సెస్ చేశారు. తర్వాత సినిమాకూడా తీశారు. అందువలన యిది చరిత్ర కాని చారిత్రాత్మక సినిమా!

సారంగధరుడి లాటి కథే ''అనార్కలి'' కథ! అనార్కలి కథకు ఏ ఆధారమూ లేదు. అబ్దుల్ హలీమ్ షరార్ అనే ఉర్దూ రచయిత (1860–1926) లాహోర్‌లో ఓ సమాధి చూసి ఎవరిది అని అడిగితే, ఇది అనార్కలిది అని చెప్పి, సలీంతో ప్రణయం నెరపితే అక్బర్ సజీవసమాధితో శిక్షించాడని 'స్థలపురాణం' వినిపించారట. అంతకుముందు కొందరు బ్రిటిషు చరిత్రకారులు కూడా దాని గురించి రాశారు. వాళ్ల ప్రకారం అనార్కలి అక్బరు భార్య, యువరాజు దానియేలు తల్లి. సలీం ఆమె (సవతి తల్లి)తో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అది తెలిసి అక్బరు ఆమెకు సజీవసమాధి శిక్ష విధించాడు. ఈ కథనాలను దగ్గర పెట్టుకుని షరార్ అనార్కలిని కన్యగా చేసి కథ అల్లాడు. ఆ పుస్తకం మొదటి పేజీలోనే 'ఇది కాల్పనిక రచన' అని రాశాడు. జనాలకు విపరీతంగా నచ్చేసి కథలు, నాటకాలు, సినిమాలు తీసి ఆమెను చరిత్రకు ఎక్కించేశారు.

తెలుగులో కూడా అంజలీ పిక్చర్స్ వారు ''అనార్కలి'' సినిమా తీశారు. తర్వాత కె. ఆసిఫ్ ''మొఘలే ఆజమ్'' తీస్తూ సమాధి నుండి అనార్కలిని అక్బర్ తప్పించేసినట్టుగా కల్పించేశాడు – ఎలాగూ కాల్పనిక వ్యక్తే కదా, మరి కొంత కల్పన జోడిస్తే అక్బర్ ఖ్యాతి పెరుగుతుంది కదాని. ఆ సినిమాలోనే అక్బర్, అతని కొడుకూ యుద్ధం చేసినట్టు చూపించాడు. దానికీ ఆధారం లేదు. జనాలు ఆ సినిమానూ చూశారు. ఎన్టీయార్ ఆ కథనే ''అక్బర్ సలీం అనార్కలి''గా తీశారు. మన విమర్శకులు వీటితో బాటు ''లైలా మజ్నూ'' సినిమాను కూడా చారిత్రాత్మక సినిమాల్లో కలిపేశారు. అది ఒట్టి జానపద ప్రేమకథ మాత్రమే.

ఉత్తరాది కథలతో తీసిన చారిత్రాత్మక సినిమాలు – ''సామ్రాట్ అశోక'', ''చాణక్య చంద్రగుప్త''. వీటిలో వాస్తవమెంత, కల్పన ఎంత అనే చర్చకు పోకుండా వీటిని హిస్టారికల్స్ అనవచ్చు. కర్ణాటక సార్వభౌముడైనా మనవాడే అనుకుంటాం కాబట్టి శ్రీకృష్ణ దేవరాయలి కథతో తీసిన ''మహామంత్రి తిమ్మరుసు'' ఒక మంచి హిస్టారికల్. అయితే దీనిలో కూడా కల్పనలు చాలా వున్నాయి.

మనకు అట్టే తెలియని చరిత్రకాలం గురించి తీసిన మరో హిస్టారికల్ – ''శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు''. దీనిలో కల్పన పాలు యింకా ఎక్కువ వుండి వుంటుంది. ఇక తెలుగు నేలపై జరిగిన చరిత్ర గురించి వచ్చిన సినిమాలు – ''పల్నాటి యుద్ధం'' (1947, 1966), ''బొబ్బిలి యుద్ధం'' (1964), ''తాండ్ర పాపారాయుడు'', ''విశ్వనాథ నాయకుడు'', ''అల్లూరి సీతారామరాజు'', ''కొమరం భీమ్''. ఈ సినిమాల్లో కథను రక్తి కట్టించడానికి కొన్ని 'పొయటిక్ లిబర్టీస్'' తీసుకుని వుండవచ్చు. కానీ నా దృష్టిలో అది తప్పుకాదు.

చారిత్రాత్మక సినిమాల లక్ష్యం ఏమిటి? ప్రేక్షకుడికి తన జాతి చరిత్రపై ఒక అవగాహన కల్పించడం. గతచరిత్రలోని మంచిని హైలైట్ చేసి ఆత్మగౌరవాన్ని పెంచడం, చెడును గర్హించేట్లా, తమ లోపాలను గుర్తించేలా చేసి జాతి సమైక్యతకు, ప్రగతికి ఏం చేయాలో ఆలోచించేట్లా చేయడం. చరిత్రను పాఠాల్లా చెపితే బోరు కొడుతుంది కాబట్టి వ్యక్తుల పరంగా, లేదా సంఘటనల పరంగా ఆసక్తికరంగా చెప్పడానికి కొన్ని సంఘటనలను కల్పించవచ్చు. మనకు లభ్యమవుతున్న చరిత్ర చాలా స్వల్పం. మనం సినిమాలు తీయాలి కదాని పాతవాళ్లు అన్నీ విపులంగా సినారియో రాసి పెట్టలేదు. పాతతరం వాళ్లకు ఆ దృష్టి లేదు. చాలామంది కవులు పెద్దపెద్ద కావ్యాలు రాసి కూడా తమ పేర్లు చెప్పుకోలేదు. కొందరు రాజులు శాసనాలు వేయించారు కాబట్టి కొంతైన చరిత్ర తెలుస్తోంది. అశోకుడు వేయించిన శాసనాల్లో తన పేరును 'దేవానాం ప్రియ'గా పేర్కొనడంతో ఆ రాజు వేరే వున్నాడనుకున్నారు. కొంతకాలానికి అశోకుడే – దేవానాంప్రియ అని తెలిసింది. శాసనాలు వేయించని, లేదా మనకు దొరకని రాజుల విషయంలో ఏం చేయాలి? కాస్త ఊహించాలి.

అప్పట్లో యిప్పుడున్నన్ని కమ్యూనికేషన్ సౌకర్యాలు లేవు. రాసినవి భద్రపరిచే విధానం లేదు. అసలు అక్షరాస్యతే తక్కువ. పుక్కిటి పురాణాలు, జానపదుల గాథల ద్వారా ఒక తరం నుండి మరో తరానికి సమాచారం వచ్చినపుడు మార్పులు చేర్పులు జరుగుతాయి. ఎవరైనా గ్రంథస్తం చేసినా తాళపత్రాలు చూసి రాసుకోవడంలో పొరపాట్లు దొర్లవచ్చు. విదేశీ యాత్రికులు వచ్చి రికార్డు చేసిన సందర్భాల్లో మన పేర్లు నోరు తిరక్క, బంధుత్వాలు అర్థం కాక (మేనమామ మేనకోడల్ని పెళ్లి చేసుకోవడం వాళ్ల వూహకు అందని విషయం), చెప్పేవాడు సరైన వాడు దొరక్క కొన్ని పొరపాట్లు దొర్లాయి. మళ్లీ వాళ్ల దేశంలో ప్రతులు తయారుచేయడంలో ఎన్ని తప్పులు దొర్లాయో!

దొరికిన చరిత్ర తక్కువ అయినపుడు, చరిత్రపై యింకా పరిశోధన సాగుతున్నపుడు పాత్రల ఔచిత్యం చెడకుండా కాస్త స్వేచ్ఛ తీసుకున్నా తప్పు లేదు. ''మాయాబజారు''లో లక్ష్మణకుమారుణ్ని హాస్యపాత్రగా చిత్రీకరించడంపై పింగళిని ఎవరో ప్రశ్నిస్తే ''మహాభారతంలో అతను శూరుడు, వీరుడు అని చెప్పలేదు. యుద్ధంలో ఒక్క రోజు పాల్గొన్నాడు, అవేళే చచ్చిపోయాడు. అతన్ని హాస్యంగా చూపించడం వలన ఔచిత్యభంగం కలగదు.'' అని జవాబిచ్చారు. ''మహామంత్రి తిమ్మరసు'' సినిమా రచన ఆయనదే. తిమ్మరసు చివరికాలంలో ఆయనకి, కృష్ణదేవరాయలుకి మనస్పర్థలు కలిగాయి అన్నది చారిత్రక సత్యం. 'ఆ విభేదాలు కల్పించినవాడు హంవీరుడు అనేవాడు, వాడు కళింగదేశపువాడు. తన రాజుని ఓడించిన కృష్ణదేవరాయలపై పగ సాధించడానికి యీ విధంగా కుట్ర చేశాడు' – అని పింగళి కల్పించారు. ఈ విధమైన కల్పనలు లేకుండా ఏ హిస్టారికల్ సినిమాను ఆసక్తికరంగా చెప్పలేం.

ఒక సేనాపతి రాజుపై కుట్ర చేసి తను గద్దె నెక్కాడు అన్నది చారిత్రక వాస్తవం అనుకోండి. కుట్ర ఎలా చేశాడు, ఎవరితో చేతులు కలిపాడు అన్న థీమ్‌ను ఏ యింగ్లీషు నవల నుండో తీసుకుంటే తప్పేముంది? విష్ణుకుండిన రాజు తన దాయాదిని అంతః పుర కుట్రలతో హతమార్చాడు అని మన చరిత్ర పుస్తకాల్లో వుంది అనుకోండి. అంతే వుంది, అంతకు మించిన వివరాలు లేవు. అప్పుడు ధీరేంద్రనాథుని ''మొగలాయీ దర్బార్ కుట్రలు'' నుండో, ద్విజేంద్ర లాల్ రాయ్ హిస్టారికల్ నాటకాల నుండో ఓ విషప్రయోగం సీను పట్టుకుని వచ్చి యిక్కడ చూపిస్తే చరిత్రకు అన్యాయం చేసినట్టు అవుతుందా? ప్రతాపరుద్రుణ్ని ఢిల్లీ సుల్తాన్ పట్టుకుని పోతే అతని పోలికలతో వున్న పేరిగాడు అనే చాకలిని రాజసింహాసనంపై కూర్చోబెట్టి అరాజకం కాకుండా యుగంధరుడు చూశాడు – అనే థీమ్‌తో పద్మనాభం గారు ''పేరిగాడు రాజంట'' అనే నాటకం ప్రదర్శిస్తే జనాలు విరగబడి చూశారు. అది చారిత్రక కల్పన. అయినా దాని ద్వారా కాకతీయ సామ్రాజ్యం, ప్రతాపరుద్ర చక్రవర్తి, ఢిల్లీ సుల్తాన్ చేతిలో ఓటమి .. అనే అంశాలు ప్రేక్షకుల మెదళ్లలో నాటుకున్నాయి కదా.

అయితే సినిమా విమర్శకులు కొందరు దీన్ని అర్థం చేసుకోరు. ఎవరైనా చారిత్రాత్మక సినిమా తలపెట్టగానే 'కథంతా మార్చేశారట, చరిత్రను మసిపూసి మారేడుకాయ చేశారట' అని మొదలెడతారు. అసలు నిర్దుష్టమైన, నిర్దిష్టమైన చరిత్ర ఏదైనా వుంటే కదా – దాన్ని ఆధారంగా పెట్టుకుని వీళ్లు విమర్శలు చేయడానికి! అయినా ఏదో ఒక గోల. ఒక వర్గాన్ని కించపరిచారనో, ఒక మతాన్ని తక్కువగా చూపించారనో.. యిలా ఏదో సణుగుడు మొదలుపెడతారు. ''ఛత్రపతి శివాజీ'' సినిమా తీస్తే ఔరంగజేబుకి వ్యతిరేకంగా పోట్లాడాడనే చూపించాలి. ఆ సినిమాలో శివాజీ హీరో అయితే ఔరంగజేబు, అతని మనుష్యులు విలన్లు అయితీరతారు. 'ఔరంగజేబు పాత్రను విలన్ వేషాలు వేసే నటుడికిచ్చి ముస్లిములను అవమానించారు' అని ఎవరైనా గొడవ చేస్తే...?

చేయవచ్చు కూడా. మొన్న ''విశ్వరూపం'' సినిమా రగడ చూశాం కదా ''ఉగ్రవాదులు కురాన్ పట్టుకున్నట్టు, నమాజ్ చేసినట్టు చూపించారు. దీనివలన ఇస్లాం హింసను ప్రేరేపిస్తుందన్న అర్థం వస్తోంది. ఆ సీన్లు తీసేయాలి'' అని గొడవ చేసి సినిమా ఆపించారు. దొంగతనం చేసేవాడు కూడా తన యిష్టదైవానికి దణ్ణం పెట్టుకుని వెళతాడు, అది చూపిస్తే ఆ దైవం దొంగతనం చేయమని చెప్పినట్టు అర్థం వస్తుందా? ఉగ్రవాదో, తీవ్రవాదో, మరొకడో – వాడు హీబ్రూ అయితే హీబ్రూ దేవుడికి, ముస్లిమయితే ఇస్లాం

దేవుడికి, హిందువైతే హిందూ దేవుడికి, క్రైస్తవుడైతే క్రైస్తవ దేవుడికి దణ్ణం పెట్టుకుని పోరాటం చేస్తాడు. మధ్యయుగాల్లో ముస్లిములమధ్య, క్రైస్తవుల మధ్య మతయుద్ధాల (క్రూసేడ్స్) లో వాళ్లు తమ దేవుళ్ల పేర యుద్ధనినాదాలు చేశారా? లేక అవతలివాళ్ల దేవుళ్ల పేర చేశారా?

"దశావతారం" సినిమాలో మొదటి సీనులో ఓ వైష్ణవపూజారిని విబూది పెట్టుకున్న రాజు విగ్రహంతో సహా ముంచేసినట్టు చూపించారు. శివభక్తులందరూ క్రూరులే అన్న అర్థం వస్తోందని ఎవరూ గోల చేయలేదు. మరి "విశ్వరూపం"కు మాత్రం గొడవ తెచ్చారు. ఈ గొడవ వస్తుందని వూహించే కమలహాసన్ డిటిఎచ్‌లో రిలీజ్ చేసేస్తే మంచిదనుకున్నాడు. గొడవ వచ్చేలోపున చాలామంది చూసేస్తారు కదాని ఆశపడ్డాడు. కానీ అది సాగనివ్వలేదు. దేశంలో ఏ ముస్లిములకూ కష్టం తోచలేదు కానీ తమిళనాడులో ముస్లిములకు మాత్రం కష్టం తోచిందట. తాలిబన్లు క్రీస్తు పేరో, రాముడి పేరో స్మరిస్తూ బాంబులేస్తున్నారని చూపించాలా? బాబ్రీ మసీదు కూలగొట్టిన దృశ్యాన్ని చూపించినపుడు భజరంగ దళ్ వాళ్లు 'అల్లా హెూ అక్బర్' అని నినాదాలు చేశారని చూపించాలా?

జరుగుతున్న చరిత్రను చూపిస్తూంటేనే యింత కష్టంగా వుంటే గత చరిత్రను చూపించడం ఎలా? శివాజీ సినిమాలో అతని సైన్యం 'హరహర మహాదేవ' అంటూ రణన్నినాదాలు చేయకూడదని, "అల్లూరి సీతారామరాజు" సినిమాలో రూథర్‌ఫర్డ్, అతని సేన శిలువను ప్రార్థించనట్టు చూపించకూడదని, "పల్నాటియుద్ధం"లో మంచివాడిగా ప్రొజక్ట్ అయిన బ్రహ్మనాయుణ్ని వైష్ణవనామాలతో, అతన్ని ఎదుర్కొని యుద్ధం తెచ్చిపెట్టిన నాగమ్మను విబూదికట్లతో చూపించకూడదని – యిలా ఆంక్షలు పెడుతూ పోతే..?

కొన్ని సమయాల్లో తెలుగురాజులు కళింగరాజుల చేతిలో, యింకోసారి తమిళ లేక కర్ణాటక రాజుల చేతిలో, మరోసారి మహారాష్ట్ర రాజుల చేతిలో ఓడిపోయారు. ఆ చారిత్రక సత్యాలను చూపిస్తే మేం ఒప్పుకోమని ప్రేక్షులలో ఓ వర్గం అంటే..? రాయలసీమలోని పాలెగాళ్లు ఇంగ్లీషువాళ్ల చేతిలో ఓడిపోయినట్టు చూపిస్తే రాయలసీమ పౌరుషం దెబ్బ తింటుందని వాదిస్తే...? "వీరపాండ్య కట్టబ్రహ్మన" సినిమాలో శివాజీ గణేషన్ వేశాడు కాబట్టి ఇంగ్లీషువాడు అతన్ని ఉరి తీయగలిగాడు. అదే మా ఎంజీయార్ వేసి వుంటే ఆ ఇంగ్లీషువాడికి అంత సాహసం చేసేవాడు కాదు. మా వాడు వాణ్నే ఉరి వేసేవాడు." అన్నాట్ట ఓ ఎంజీయార్ అభిమాని. ప్రేక్షకుల సౌలభ్యం కోసం బొంబాయి వాసులు తెలుగు మాట్లాడతారు – అని టైటిల్స్‌లో చూపించినట్టు 'అభిమానుల కోరికపై చరిత్రను మార్చాం. హీరోను చూసి భయపడి ఈస్టిండియా కంపెనీ వాడు ఇండియాను విడిచి పారిపోయినట్టు చూపించాం' అని చెప్తారు కాబోలు.

అసలే మన నిర్మాతలు చారిత్రాత్మక సినిమాలు తీయడం లేదు. హిస్టరీ వివాదాలు కూడా లేవనెత్తితే అస్సలు మానేస్తారు. ఇక "పోకిరి", "దేశముదురు", "దగుల్బాజీ", "పుండాకోర్", "ఇడియట్", "రాస్కెల్" వంటి సినిమాలే మనకు మిగులుతాయి. ఆ సినిమా స్టిల్సే ఫోటోలుగా మన యింట్లో అలంకరించుకోవాలి. విగ్రహాలుగా కూడళ్లలో స్థాపించుకోవాలి. ఎయిర్‌పోర్టులకు, స్టేడియంలకు ఇందిరా గాంధీ కుటుంబసభ్యుల పేర్లు మానేసి వీళ్లవి పెట్టాలి. చారిత్రాత్మక సినిమాలు తీయడానికి మనవాళ్లకు జంకు ఎందుకో తెలియదు. పైన అనేక రాజవంశాల గురించి చెప్పాను కదా, వాటిలోంచి కనీసం ఓ పాతికమంది మీద, లేదా వాళ్లను నేపథ్యంలో పెట్టుకుని చక్కటి సినిమాలు తయారు చేయలేమా? ఎంతసేపూ నేను గొప్పవాణ్ని, నా కులం గొప్పది, మా వూరు గొప్పది అనుకుని చంకలు గుద్దుకోవడమే తప్ప 'నా జాతి గొప్పది. నా జాతిలో మహనీయులు కొందరు పుట్టారు' అనుకుని, తెలుగేతరులచేత ఒప్పించాల్సిన పని లేదా?

"పోరంబోకు" అనే పేరుతో సినిమా తీయడానికి 50 కోట్లు ఖర్చు పెట్టి ఫారిన్ లొకేషన్స్‌లో తీయడానికి ముందుకు వస్తున్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా లను జయించి తన సామ్రాజ్యాన్ని పాటలీపుత్రం (నేటి పాట్నా) వరకు విస్తరింపచేసి క్రీ.పూ. 106–96 వరకు పాట్నాను పాలించిన రెండవ శాతకర్ణి (క్రీ.పూ. 152–96) గురించి ఓ 25, 30 కోట్లతో సినిమా తీయలేరా? పోనీ మహారాష్ట్రను తన పాదాక్రాంతం చేసుకున్న శ్రీముఖశాతవాహనుడి (క్రీ.పూ. 221–198) గురించి..? శ్రీలంక వరకు పాలించిన కులోత్తుంగ చోళుడి గురించి, లేదా తిరుమల నాయకుడి గురించి...? అసలు మనలో ఎంతమంది వీళ్ల పేర్లు విన్నాం? ఇంత సువిశాల రాష్ట్రంలో వాళ్ల విగ్రహాలు ఎక్కడైనా, ఎప్పుడైనా చూశామా? ఎంతసేపు చూసినా రాజకీయ నాయకుల విగ్రహాలు, సినిమా యాక్టర్ల కటౌట్లు తప్ప మరొకరివి కనబడుతున్నాయా?

'సినిమా తీద్దుము కానీ వాళ్ల గురించి పెద్దగా కథ దొరకలేదండి, సినిమాకు చాలదు' అనవచ్చు సినిమాకారులు. దీనికి ఒకటే ఉపాయం – ఆనాటి కాలంలో జరిగినట్టుగా ఒక కాల్పనిక వ్యక్తి గాథను తీసుకుని కథ రాసుకోవడం! ఫలానా రాజు ఫలానా గొప్ప పనులు చేశాడన్న విషయమూ ప్రజలకు తెలుస్తుంది, ఆధారాలు లేకుండా చరిత్ర సృష్టించేశారన్న అపప్రథ రాకుండా వుంటుంది. "బెన్‌హర్" సినిమా చూడండి. బైబిల్‌లో అతని కథ వుందా? లేదు కదా. ఏసు క్రీస్తు శిలువ మోస్తూంటే చూసినవారిలో అతను ఒకడు అని కల్పించారు. అతని కథ చెప్పారు. పనిలో పనిగా ఏసు క్రీస్తు ప్రజలకోసం శిలువ ఎక్కాడని, ఆ శిలువపైనుండి కారిన నీటితో కుష్టురోగం నయమయిపోయిందని చూపించి మతప్రచారం చేశారు.

తెలుగులో చారిత్రాత్మక సినిమాలనండి, రాజకీయ సినిమాలనండి – "పదండి ముందుకు", "ప్రజానాయకుడు", "మా భూమి" వంటి సినిమాలు వచ్చాయి. అవి ఫిక్షనే అయినా ఆ నాటి రాజకీయ పరిస్థితులను చూపించాయి. వేములవాడ భీమకవి కథలో అతని చేత శాపగ్రస్తుడై, మళ్లీ అతని అనుగ్రహం చేత రాజ్యం తిరిగి పొందిన రాజు కథ వుంది. భీమకవిపై ఎన్టీయార్ సినిమా తీసినపుడు

ఆ రాజు కథగా "రాజమకుటం" సినిమా కథను వాడుకున్నారు. ఎవరూ తప్పుపట్టలేదు, ఎందుకంటే ఆ రాజుగారి రాజ్యం ఎలా పోయిందో, మళ్లీ ఎలా వచ్చిందో చరిత్ర ఏమీ చెప్పలేదు.

హిస్టారికల్ సినిమాలు తీస్తే చూడరేమో అన్న భయం దేనికి? రసవత్తరంగా తీసే నేర్పు వుండాలే కానీ తప్పకుండా చూస్తారు. గతంలో అయితే సెట్టింగులకు ఎక్కువ ఖర్చు అవుతుందన్న భయం వుండేది. ఇప్పుడు గ్రాఫిక్స్ వచ్చేశాయి. డిజిటల్ ఎఫెక్ట్స్ వచ్చేశాయి. భారీతనం చూపడం సులభం. మనవాళ్లు యింత గ్రాండ్‌గా జీవించారు, ఏలారు అన్న ఫీలింగ్ కిక్ యిస్తుంది. ప్రేక్షకుడు ఐటెండిపై కావడం యీజీ. హాలీవుడ్‌లో యిటీవలి కాలంలో ఎన్నో హిస్టారికల్స్ వచ్చాయి. అవి ఆడలేదా? అక్కడి యూత్ చూడలేదా? "ట్రాయ్" వంటి సినిమాల్లో కథ మారిపోయినా వాళ్లు పట్టించుకోలేదు. గ్రీక్ వాళ్ల కథను అమెరికావాళ్లు కూడా ఆదరించారు.

మరి మన తెలుగునేల నేలినవాడి కథ చూపితే మనం చూడకుండా పోతామా? "ఆదిత్య 369"లో క ృష్ణదేవరాయలి ఎపిసోడ్ చూడగానే ఎంత పులకింత కలిగించి చెప్పండి. "తెనాలి రామకృష్ణ", "మహామంత్రి తిమ్మరసు" వంటి సినిమాలలో కృష్ణదేవరాయల్ని చూశాం కాబట్టే కదా ఆయన విగ్రహాలు కొన్ని చోట్లయినా వెలిశాయి! అవి ఎన్టీయార్ పోలికలతో వుండడం సహజం! అలాగే "అల్లూరి సీతారామరాజు" సినిమా హిట్ అయింది కాబట్టి క ృష్ణ పోలికలతో విగ్రహాలు వెలిశాయి. రేపు అనూష్క పోలికలతో "రుద్రమదేవి" విగ్రహాలు వెలవడం ఖాయం!

నేననేది – పోలికలు ఎవరివైనా కానీయండి. మన జాతిని తీర్చిదిద్దిన అనేకమంది విగ్రహాలు యింకా వెలియాలి. వాళ్ల గురించి మనమూ, మన పిల్లలూ తెలుసుకోవాలి. 2500 ఏళ్ల చరిత్ర కలిగి ఎనిమిదన్నర కోట్ల జనాభా వున్న తెలుగువాళ్లకు గట్టిగా పది చారిత్రాత్మక సినిమాలు కూడా లేవంటే సిగ్గుచేటు కాదూ! మనం యిలా ఉపేక్షిస్తే, చారిత్రాత్మక సినిమా ఆడుతుందా లేదా అని తటపటాయిస్తూ కూర్చుంటే ఏ హాలీవుడ్ వాడి కన్నో మన చరిత్ర మీద పడుతుంది. మన గాంధీగారిని జైల్లో పెట్టిన ఇంగ్లీషువాడే కొంతకాలానికి "గాంధీ" సినిమా తీసి ప్రపంచమంతా రిలీజ్ చేసి మనవాడి కథ మనకే అమ్మి సొమ్ము చేసుకుంటుంటే గుడ్లప్పగించి చూశాం. రేపు మన తెలుగువీరుల గురించి కూడా అదే జరుగుతుంది, చూస్తూ వుండండి. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 23 వీక్లీకై ఎమ్బీయస్ : వారసత్వంగా నేరరాజకీయం**

ఏడాది క్రితం అఖిలేష్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయినపుడు రాజకీయాల్లోకి యువనేత ృత్వాన్ని ఆహ్వానించాం. ములాయం సింగ్, అతని సోదరులు నడిపిన నేరరాజకీయాల నుండి సమాజవాది పార్టీని (ఎస్పీ) విముక్తం చేస్తాడని ఆశపడ్డాం. మనతోపాటు అఖిలేష్ కూడా ఆశపడ్డాడు. అందుకే యికపై నేరస్తులను తన పార్టీ సహించదని ప్రకటించాడు. కానీ మార్పు రావడం అంత సులభం కాదని అతనికి త్వరలోనే గ్రహింపుకి వస్తోంది. ఎన్నికల ఫలితాలు వెలువడుతూండగానే ఎస్పీ నాయకులు చెలరేగారు. తమ ప్రత్యర్థులపై దాడులకు దిగారు. మాయావతి పాలనలో తాము కష్టపడ్డామనీ, యిప్పుడు తమకు ప్రతీకారం తీర్చుకునే సమయం ఆసన్నమైందని అనుకున్నారు వాళ్లు. కానీ అఖిలేష్ వారిని వారించాడు. శిక్షిస్తామని బహిరంగంగా ప్రకటించాడు. కానీ ఎస్పీ వారు యితరులపై జరిపే దాడులు కానీ, యితరులు ఎస్పీలపై జరిపే దాడులు కానీ ఆగలేదు. ఎస్పీ మహిళా విభాగం నాయకురాలు షమ్మీ కోహ్లీ అఖిలేష్ ప్రమాణస్వీకారానికి హాజరు కావడానికి లక్నో వస్తూండగా హత్యకు గురైంది. రాత్రి భోజనానికై బస్సు నేషనల్ హైవేపై ఆగినప్పుడు ఆమె దిగకుండా నిద్రపోయింది. ఆమె శత్రువులు బస్సులోకి వెళ్లి సైలెన్సరు అమర్చిన పిస్టల్‌తో ఆమెను కాల్చేసి దిగిపోయారు.

ప్రమాణస్వీకారం వేళే హత్యతో ప్రారంభమైన అఖిలేష్ పాలన నేరరాజకీయాలతో వేగుతూ, రాజీపడుతూ ముందుకు సాగింది. కుండా నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన రఘురాజ్ ప్రతాప్ సింగ్ (రాజా భయ్యా) ని తన కాబినెట్‌లో ఫుడ్, సివిల్ సప్లయిస్ మంత్రిగా తీసుకున్నపుడు అతనిపై వున్న ఆరోపణల జాబితా గుర్తు చేసి యిదేమిటి అని అడిగారు పాత్రికేయులు. "అవన్నీ మాయావతి ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఆరోపించినవి..." అనేశాడు అఖిలేష్. 2002లో రాజా భయ్యాను మాయావతి పోటా (ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం) కింద అరెస్టు చేయించి జైల్లో పెట్టింది. 2003లో ములాయం ముఖ్యమంత్రి కాగానే ఆ కేసులన్నీ ఎత్తేసి జైల్లోంచి బయటకు తీసుకుని వచ్చాడు. అతని కొడుకు ఏడాది క్రితం మంత్రిని చేసి కూర్చోబెట్టాడు. అయినా వెనుకటి గుణమేల మాను..? అన్నట్టు రాజా భయ్యా తన కార్యకలాపాలు ఆపలేదు. కుండా డియస్పీ జియా ఉల్ హక్ హత్య కేసులో యిరుక్కుని రాజీనామా చేయవలసి వచ్చింది.

కుండా నియోజకవర్గంలోని ఆస్థాన్ గ్రామంలో రాజా భయ్యా అనుచరులు నన్హే యాదవ్ అనే గ్రామ పెద్దను చంపివేసినట్టు తెలిసి ఆ విషయమై విచారణ చేయడానికి 32 ఏళ్ల డియస్పీ హక్ మార్చి 3 న అక్కడకు వెళ్లాడు. ఆర్నెల్లుగా అతను రాజా భయ్యాపై, అతని కుమారుడిపై వున్న కేసులను లోతుగా పరిశోధిస్తున్నాడు. 47 కేసుల లిస్టు తయారైంది. డియస్పీ వెళ్లగానే మంత్రి అనుచరులు గుంపులను పోగేసి డియస్పీని రాళ్లతో కొట్టి చివరకు కాల్చి చంపేశారు. అతనితో బాటు గ్రామ పెద్ద సోదరుణ్ని కూడా ! డియస్పీ చుట్టూ వున్న ఎనిమిదిమంది పోలీసులు భయంతో పారిపోయారు. ఈ సంఘటనతో పోలీసులకు చాలా కోపం వచ్చింది. హక్

హత్యకు కుట్ర పన్నినందుకు మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

హక్ భార్య పర్వీన్ ఆజాద్ కూడా వివాదం చల్లారకుండా చూసింది. తన భర్త చావుకి కారణం రాజా భయ్యా అని లిఖితపూర్వకంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసింది. సిబిఐ చేత విచారణ జరిపించాలంది. యుపి కాకుండా వేరే రాష్ట్రంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టు నియమించి హంతకులకు శిక్ష పడేట్లా చేయాలంది. తన భర్త స్థానంలో తనకు డియస్పీ ఉద్యోగం యివ్వాలని డిమాండ్ చేసింది. వేరే ఉద్యోగం యివ్వబోతే ఆమోదించలేదు. ఏడాది పాలనాకాలంలో ఏడు మతకలహాలు జరగడంతో బాటు తన పార్టీకి అండగా నిలిచే ముస్లిము వర్గానికి చెందిన పోలీసు అధికారిని హత్య చేయించిన తన సహచరుణ్ని కాబినెట్‌లో కొనసాగించడానికి అఖిలేష్ బెదిరాడు. రాజీనామా చేయించి సిబిఐను విచారణకు పంపాడు. 10 సభ్యుల సిబిఐ టీము రంగంలోకి దిగి ఆనాటి సంఘటనను కళ్లారా చూసిన 300 మందిని సాక్ష్యం యివ్వమని కోరితే అందరూ మాయమై పోయారు. దీన్ని బట్టే తెలుస్తుంది రాజా భయ్యా ఎటువంటి రాక్షసుడో! డియస్పీ హత్యకు ఉపయోగించిన ఆయుధం చెరువులో దొరికింది. అతని సెల్‌ఫోన్ యింకా దొరకలేదు. మంత్రి అనుచరులిద్దరిని అరెస్టు చేశారు.

కేసుల విషయంలో రాజా భయ్యా ఒంటరి కాదు. ఎంటర్‌టైన్‌మెంట్ టాక్స్ మంత్రి అయిన తేజ్ నారాయణ్ (పవన్) పాండే పై హత్యాప్రయత్నంతో సహా ఎనిమిది కేసులున్నాయి. వ్యవసాయం, మతసంబంధిత వ్యవహారాల మంత్రి అయిన మనోజ్ కుమార్ పాండేపై కిడ్నాపింగ్‌తో సహా మూడు క్రిమినల్ కేసులున్నాయి. ములాయం ముఖ్యమంత్రిగా వుండే రోజుల్లో కూడా యిలాటి వాళ్లను మంత్రులుగా తీసుకున్నాడు. శాంతిభద్రతలు, అవినీతి ప్రధాన సమస్యలుగా దాపురించడంతో అతన్ని ఓటర్లు దింపేసి మాయావతిని పైకి ఎక్కించారు. ఆమె పార్టీ నాయకులు కూడా తక్కువ తినలేదు. కనీసం పన్నెండు మంది బియస్పీ నాయకులపై క్రిమినల్ కేసులున్నాయి. పురుషోత్తమ్ నారాయణ్ ద్వివేది అనే ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు, శేఖర్ తివారీ అనే ఎమ్మెల్యేపై ఓ పిడబ్ల్యుడి ఇంజనీర్‌ను చంపిన కేసు... యిలా చాలా వుండేవి. అందుకని ప్రజలు మాయావతిని దింపేసి అఖిలేష్‌ను ముఖ్యమంత్రిని చేస్తే అతనూ అదే వరస!

హింసారాజకీయాలకు పాల్పడకండి, అవినీతిపరులను ప్రోత్సహించకండి అని అఖిలేష్ చెప్పిన మాటలను అనుచరులే కాదు, పార్టీ అధినాయకత్వమే వినటం లేదు. ఉత్తర ప్రదేశ్‌లో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ పథకాల అమలులో 8000 కోట్ల రూపాయల గోల్‌మాల్ జరిగింది. యుపి ప్రభుత్వంలో ఆరోగ్యశాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేసిన ప్రదీప్ శుక్లా ప్రధాన నిందితుడు. అతన్ని దాస్నా జైల్లో పెట్టారు. ములాయం తమ్ముడు, కాబినెట్‌లో ఇరిగేషన్, పబ్లిక్ వర్క్స్ వంటి ముఖ్యశాఖలు నిర్వహించే మంత్రి అయిన శివపాల్ యాదవ్ జైలుకి వెళ్లి అవినీతిపరుడైన యీ అధికారిని కలిశాడు. ఇదేమిటి బాబాయ్ అని అఖిలేష్ అడిగితే "మీ చిన్నాన్నను చూసి నేర్చుకో" అని పబ్లిగ్గా కొడుక్కి సలహా యిచ్చాడు ములాయం. శివపాల్ కలిసిన కొన్ని రోజులకే శుక్లా జైల్లోంచి విడుదల అయ్యాడు. ప్రభుత్వం అతనిపై కేసులు ఎత్తివేయడమే కాక రెవెన్యూ బోర్డు మెంబరుగా చేసింది. సుప్రీం కోర్టుకి యీ వరసేం నచ్చలేదు. "ఆ 8000 కోట్ల రూ.ల స్కామ్ సంగతేమిటి?" అని యుపి ప్రభుత్వాన్ని నిలదీస్తోంది.

ఇలాటి పరిస్థితుల్లో శాంతిభద్రతల పరిస్థితి మెరుగు పడటం లేదు. ముత్తూట్ ఫైనాన్స్‌వారి లక్నో బ్రాంచ్‌ని దోపిడీ చేసి 6 కోట్ల రూ.ల క్యాష్, బంగారం ఎత్తుకుపోయారు. మర్చంట్ నేవీ చీఫ్ ఇంజనీర్ యింటిపై పట్టపగలే దోపిడీ జరిగింది. అఖిలేష్ పార్టీవారు కూడా క్షేమంగా లేరు. ములాయంకు సన్నిహితుడు, జ్యోతిష్కుడు అయిన డా. రమేష్ తివారీ అనే అతన్ని 2012 నవంబరులో ఊంచ్‌గాంవ్ అనే చోట కాల్చి చంపారు. బాలియాకు చెందిన ఎస్పీ నాయకుడు శివానంద్ చౌహాన్‌ను మర్నాడు యింకో గ్రామంలో చంపారు. వీటితో కాబినెట్ మంత్రులే విమర్శలకు దిగారు. రూరల్ ఇంజనీరింగ్ సర్వీస్‌కి మంత్రి అయిన రాజేంద్ర రాణా "పోలీసులు, క్రిమినల్స్ చేతులు కలిపి సామాన్య జనాన్ని పీడిస్తున్నారు." అని ప్రకటన యిచ్చాడు. ఈ వ్యాఖ్యలకు అఖిలేష్ బిత్తరపోతున్నాడట. "ఏ ఒత్తిళ్లకూ లొంగకుండా వ్యవహరించమని పోలీసులకు చెప్పాను కదా. కొన్ని చోట్ల వాళ్లు బాగానే చేస్తున్నారు, కానీ కొన్ని చోట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించి నాకు చెడ్డపేరు తెస్తున్నారు" అని తన సన్నిహితులతో వాపోతున్నాడట.

ప్రస్తుతం రాజా భయ్యాపై నేషనల్ మీడియా కన్ను పడింది కాబట్టి యివన్నీ ఒక్కసారిగా బయటకు వచ్చాయి. ఇప్పుడు చేసిన రాజీనామాతో రాజా భయ్యా రాజకీయజీవితం దీనితో ముగిసిపోయిందని అనుకోవద్దు. పార్టీ ఒత్తిళ్లకు అఖిలేష్ లొంగుతాడనేది సెకండరీ ఎడ్యుకేషన్ మంత్రి వినోద్ కుమార్ (పండిట్ సింగ్) ఉదంతం ద్వారా యిప్పటికే నిరూపితమైన వాస్తవం. అతను అక్టోబరు 2012లో గోండా జిల్లాలో ఎస్.పి.సింగ్ అనే చీఫ్ మెడికల్ ఆఫీసరును కిడ్నాప్ చేయించాడు. ఈ సంఘటన బయటకు రాగానే అఖిలేష్ అతన్ని కాబినెట్ నుండి తొలగించాడు. విచారణకు ఆదేశించాడు. విచారణ ముగియకుండానే మళ్లీ యిటీవలే కాబినెట్ విస్తరణ జరిపినపుడు వెనక్కి తీసుకున్నాడు. రాజా భయ్యా కూడా అతి త్వరలో కాబినెట్‌లో దర్శనమీయవచ్చు. ల్యాప్‌టాప్‌లిచ్చి యువకులను ఆకర్షిస్తే చాలని అఖిలేష్ అనుకోవచ్చు. కానీ అతని తండ్రి, చిన్నాన్న నేరగాళ్లమీదనే ఆశలు పెట్టుకున్నారు. ఆ వారసత్వం వదుల్చుకోవడం అఖిలేష్‌కు అంత సులభం కాదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 24 వీక్లీకై** **ఎమ్బీయస్ : రివర్స్ గేర్‌లో కేరళ**

కుజగ్రహం మీదకు తొలిసారిగా ఓ అమెరికన్ అడుగు పెట్టాడట. ''ఈ మొత్తం గ్రహం మీద నేనొక్కణ్నే కదా..'' అంటూ రొమ్ము విరుచుకుంటూ వుంటే ఓ మలయాళీ వచ్చాడట – ''చాయ్ రెడీగా వుంది, పట్టుకు రమ్మంటారా?'' అంటూ! మలయాళీవాళ్లు పొట్టకూటికై భూమండలంలో ఎక్కడికైనా వెళ్లడానికి వెరవరని, ఎక్కడి కెళ్లినా వాళ్లను తప్పించుకోలేమని చెపుతూ యీ జోక్ చెప్తారు. అయితే యిప్పుడు యీ కథ రివర్స్ గేర్‌లో నడుస్తోంది. కేరళకు యితర ప్రాంతాల నుండి లక్షల సంఖ్యలో వలస కార్మికులు వచ్చిపడుతున్నారు. ఏటేటా వారి సంఖ్య పెరుగుతూ సామాజిక సమస్యలు తెచ్చిపెడుతోంది. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రప్రభుత్వం వారిపై, వారి సమస్యలపై, వారి జీవనవిధానంపై ఒక అధ్యయనానికి ఆదేశించింది.

''డొమెస్టిక్ మైగ్రంట్ లేబర్ యిన్ కేరళ'' అనే పేర వెలువరించిన యీ రిపోర్టును కేరళ కార్మికశాఖ మంత్రి వారి అసెంబ్లీలో సమర్పించారు. దాని ప్రకారం 1990లలో ప్రారంభమైన వారి వలస ఏటేటా పెరుగుతూ వచ్చి యిప్పుడు 25 లక్షలకు చేరింది. అంటే కేరళ జనాభాలో 7–8% అన్నమాట. ఏటా 2.35 లక్షల మంది కొత్త పనివాళ్లు వచ్చి పడుతున్నారు. వీరిలో ముప్పాతిక మంది ఐదు రాష్ట్రాల నుండి వస్తున్నారు – ఒడిశా, బెంగాల్, అసామ్, బిహార్, ఉత్తర ప్రదేశ్! అందరూ 18 నుండి 30 ఏళ్ల వయసులోని యువకులే. సొంత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక యిక్కడకు వచ్చి ఏ పని దొరికితే ఆ పని చేస్తున్నారు. వీళ్లలో ఎవరికీ స్థానిక భాష రాదు. గతంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నుండి వచ్చే పనివాళ్లు కూలీలగా, అదీ పట్టణ ప్రాంతాలలోనే పనిచేసేవారు. కానీ వీళ్లు కనస్ట్రక్షన్, మాన్యుఫేక్చరింగ్, హొటలు రంగాల్లోకి ప్రవేశించి యిటీవలే వ్యవసాయంలోకి కూడా దిగారు. గ్రామాల్లోకి కూడా చొచ్చుకుపోతున్నారు.

విద్యావంతులైన కేరళ నిరుద్యోగులు అందరు వుండగా వీళ్లకు అవకాశాలు ఎలా వస్తున్నాయి అంటే దానికి చాలా కారణాలున్నాయి. 2011 లెక్కల ప్రకారం కేరళ జనాభా 3.38 కోట్లు. అక్షరాస్యత, దానివలన కుటుంబనియంత్రణ ఏటా పెరుగుతూండడంతో యువకుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. జనాభాలో 20–64 ఏళ్ల వయసులో వున్న మగవారి సంఖ్య 87 లక్షలు. వీళ్లలో సగం మంది మాత్రమే స్థానికంగా ఉద్యోగాల్లో వున్నారు. ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో అగ్రస్థానంలో వుండే కేరళలో యువత తక్కువ జీతాలకు పని చేయడానికి సిద్ధంగా లేరు. పైగా చిన్న వుద్యోగాలంటే చిన్నచూపు. ఆ ఖాళీలను యీ వలస కార్మికులు భర్తీ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు వీళ్లను ఆదరిస్తున్నారు. ఎందుకంటే వీళ్లు తక్కువ జీతాలకు పని చేస్తారు, షిఫ్టులలో పని చేస్తారు, ఏ వూరు వెళ్లమంటే అక్కడకి వెళతారు, రిస్కు తీసుకుంటారు, హక్కుల గురించి పోరాడరు, స్థానబలిమి లేనందున పేచీలకు దిగరు, చెప్పిన మాట వింటారు. కావాలంటే పెట్టుకోవచ్చు, నచ్చకపోతే తీసి పారేయవచ్చు. అడిగేవాడు లేడు. అందుకే వలస వచ్చేవారికి ఉద్యోగాలు దక్కుతున్నాయి. ఉద్యోగాలు ఆఫర్ చేస్తూ కేరళలో హిందీలో ప్రకటనలు వెలుస్తున్నాయంటే వీరికున్న గిరాకీ అర్థం చేసుకోవచ్చు.

వ్యవసాయకూలీల జీతాలు ప్రభుత్వం పెంచివేయడంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కాని పరిస్థితి వచ్చింది. అలాటి స్థితిలో యీ వలస కార్మికులు అక్కరకు వస్తున్నారు. వీళ్లు తమ సొంత రాష్ట్రాలలో వ్యవసాయం పనులు చేస్తారు. సీజను అయిపోయాక ఖాళీ కదా. అక్కణ్నుంచి మరో రాష్ట్రానికి వెళతారు. అక్కడ సీజను అయిపోయాక మరో రాష్ట్రానికి.. యిలా ఏడాది పొడుగునా పని చేయడం చేత తక్కువ కూలికి పని చేసినా వారికి గిట్టుబాటు అవుతుంది. తక్కిన చోట పని లేనప్పుడు కేరళకు వచ్చి తక్కువ జీతాలకు పోనిచేయడంతో కేరళ రైతులు వీళ్లని ప్రోత్సహిస్తున్నారు. ఈ విధంగా యీ వలస కార్మికులు కేరళ ఆర్థిక వ్యవస్థలో యిమిడిపోయి దానికి దోహదపడుతున్నారు. వాళ్లు కూడా బాగుపడుతున్నారు. సగటున ఏడాదికి 70 వేల రూపాయలు యింటికి పంపగలుగుతున్నారు.

ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు చూస్తే వీళ్లు కేరళ సమాజంలో కలవకుండా విడిగానే వుంటున్నారు. వీళ్ల మొహం చూసి యిళ్ల యజమానులు ఎక్కువ అద్దె అడుగుతారు కాబట్టి ఎక్కువమంది ఒకే గదిలో వుంటారు. పరిసరాలు ఖరాబు అవుతాయి. అది చూసి స్థానికులు చికాకు పడతారు. వచ్చేవాళ్లందరూ 30 ఏళ్ల లోపు యువకులే. తమ రాష్ట్రం నుండి వచ్చిన యితర యువకులతో కలిసి సరదాగా గడపడానికి, మానసికంగా ఉల్లాసం పొందడానికి ఎక్కడైనా గుమిగూడితే అది చూసి స్థానికులు మండిపడతారు. ఫిర్యాదు చేస్తారు. వచ్చిన వాళ్లందరూ ఒకే రాష్ట్రం వారు కాదు, ఒకే కులం వారు కాదు. వారిలోవారికి తగాదాలు రావచ్చు. స్థానికులకు యిదంతా తలనొప్పి వ్యవహారంలా తోస్తుంది. వీళ్లందరినీ తరిమివేయాలి అంటూ వుంటారు. ఈ వలస కార్మికులకు శారీరక అవసరాలు కూడా వుంటాయి. కుటుంబాలకు దూరంగా వుంటారు కాబట్టి వ్యభిచారానికి పాల్పడతారు. అది శాంతిభద్రతల సమస్యకు, అనారోగ్యవ్యాప్తికి దారి తీస్తుంది. కేరళ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీవారు సర్వే నిర్వహించి వీరిలో చాలామందికి ఎయిడ్స్ గురించి అవగాహన లేదని, కాండోమ్‌ల వాడకం గురించి కూడా తెలియదని తెలుసుకున్నారు. ఈ విషయాలపై వారిలో అవగాహన పెంచడానికి హిందీలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపచేస్తున్నారు.

ఇంకో పదేళ్లు పోయేసరికి కేరళ జనాభాలో 40 ఏళ్లు దాటిన వారు సగానికి పైగా వుంటారు. ఈ కార్మికుల వలస యిదే స్థాయిలో కొనసాగితే యువకులలో ఎక్కువ భాగం వీరే అవుతారు. వీరికి కేరళ యువతులతో స్నేహం కుదిరితే అది సామాజిక సమస్యలకు దారి తీస్తుంది. ఎయిడ్స్ రోగగ్రస్తులు పెరగవచ్చు. ఈ అంశాలు గుర్తించిన యీ అధ్యయనం వలస కార్మికులందరినీ రిజిస్టర్ చేయించాలని, వారికి మంచి వసతి కల్పించాలని, హక్కుల గురించి, బాధ్యతల గురించి వారి వారి భాషల్లో ఎఱుక కలిగించాలని సూచించింది. ప్రస్తుతం కేరళలో బోర్డులన్నీ మలయాళంలోనే వుంటాయి. ఇంగ్లీషు కూడా చాలా తక్కువగా కనబడుతుంది.

కానీ వీరి కోసమేనా కేరళలో యితర భాషల వాడకం పెరగవచ్చు, చూదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 25 వీక్లీకై ఎమ్బీయస్ : టిప్పు పేరు పెట్టడం తప్పా?**

మైనారిటీ వ్యవహారాలు చూసే కేంద్రమంత్రి కె. రహమాన్ ఖాన్ డిసెంబరులో పార్లమెంటులో ఒక ప్రకటన చేశారు – మైనారిటీలకై కర్ణాటకలో ఒక యూనివర్శిటీ పెడతామనీ, దానికి టిప్పుసుల్తాన్ పేరు పెడతామనీ. దానిపై కర్ణాటకలో ప్రస్తుతం రగడ జరుగుతోంది. టిప్పు పేరెందుకు అంటే యీ యూనివర్శిటీ అతని రాజధాని శ్రీరంగపట్నంలో పెడుతున్నారు కాబట్టి, అతను బ్రిటిషు వారిని ఎదిరించిన భారతయోధుడు కాబట్టి – అన్నారు. అది కర్ణాటకలోని మాండ్యా జిల్లాలో వుంది. కర్ణాటకను ఏలుతున్న బిజెపి ప్రభుత్వానికి యింత కంటె చికాకు తెప్పించే అంశం మరొకటి లేదు. శ్రీరంగపట్నానికి చెందిన బిజెపి ఎమ్మెల్సీ మధుసూదన్ ''టిప్పు అంటే ఆ కాలం నాటి ఒసామా బిన్ లాడెన్. కేరళలో అనేకమంది హిందువులను నిర్దాక్షిణ్యంగా వధించిన దుర్మార్గుడు. మామూలు ముస్లిము పాలకుడు కాదు, హిందూద్వేషి. అందుకే పాకిస్తాన్ వాళ్ల ఓడకు టిప్పు సుల్తాన్ పేరు పెట్టింది. అలాటివాడి పేర యూనివర్శిటీయా? ముస్లిమ్ యూనివర్శిటీ అంటూ యూపిలో ఆలీగఢ్ ముస్లిమ్ యూనివర్శిటీ పెట్టారు. ఆ ప్రాంతంలో మతవైషమ్యాలు పెంచారు. ఇప్పుడు కర్ణాటక శాంతియుతంగా వుందనా, యిక్కడ యింకో ముస్లిము యూనివర్శిటీ పెట్టడం?" అని మండిపడ్డాడు. 2006లో కర్ణాటక విద్యామంత్రిగా వున్న శంకరమూర్తి ''టిప్పు కన్నడభాషకు వ్యతిరేకి. పర్షియన్ భాషను అధికారభాషగా చేశాడు." అన్నాడు.

ప్పుడు కర్ణాటకలో రాజకీయనాయకులే కాదు, మేధావులు, చరిత్రకారులూ అందరూ టిప్పు మతసామరస్యం గురించి చర్చలు మొదలు పెట్టారు. యూనివర్శిటీకి టిప్పు పేరు పెట్టకూడదని వాదించేవారు చెప్పే వాదనలివి – 'ఇంగ్లీషు వారితో పోట్లాడాడు కాబట్టి టిప్పు స్వాతంత్ర్యయోధుడు అనడం తప్పు. ఆ పోరాటంలో ఫ్రెంచ్ వారి సహాయం తీసుకున్నాడు. టిప్పు ఓడిపోయాడు కాబట్టి ఇంగ్లీషువారికి బానిసలమయ్యాం, లేకపోతే ఫ్రెంచ్ వారికి వలసదేశంగా మిగిలేవాళ్లం. ఈస్టిండియా కంపెనీతో పోరాడే సమయంలో కేరళ తీరప్రాంతాలపై పట్టు సాధించాలని చూశాడు. ఆ ప్రయత్నంలో మలబారు ప్రాంతంలోని అగ్రవర్ణ భూస్వాములని చంపేశాడు, ముస్లిములుగా మార్చి బలవంతంగా సున్తీ చేయించాడు, ఆవుమాంసం తినిపించాడు.'

టిప్పు పేరు పెట్టినా తప్పు లేదని వాదించేవారు చెప్పేది – 'టిప్పు గురించి అతనంటే మండిపడే బ్రిటిషు చరిత్రకారులు చెప్పినది నమ్మి మనం తప్పుడు అభిప్రాయాలు ఏర్పరచుకుంటున్నాం. అతను బయటి రాజ్యాలలో హిందువులపై క్రౌర్యం చూపాడు నిజమే కానీ తన రాజ్యంలో తనతో విరోధం పెట్టుకున్న ముస్లిముల పట్ల కూడా క్రూరంగానే వున్నాడు. తన రాజ్యంలో తన మాట విన్న హిందువులపై ఆదరం చూపాడు. 156 గుళ్లకు ఏటా యీనాములు యిచ్చాడు. శృంగేరి శంకరాచార్యతో స్నేహం నెరపాడు. ఆ మఠంలోని విగ్రహాన్ని మరాఠాలు నాశనం చేయిస్తే యితనే పునఃప్రతిష్టాపించాడు. పొరుగు ముస్లిము రాజులతో సఖ్యంగా ఏమీ లేదు. కడప నవాబు, కర్నూలు నవాబులతో, నిజాం నవాబులతో యుద్ధాలు సాగించాడు. ఇక టిప్పు అత్యాచారాలంటారా? 1857లో సిపాయిల తిరుగుబాటు సమయంలో సిపాయిలు అత్యాచారాలు చేశారు. అంతమాత్రం చేత వారి స్వాతంత్ర్యపిపాసను విస్మరిస్తామా?" ప్రఖ్యాత కన్నడ నవలా రచయిత ఎస్.ఎల్.భైరప్ప యిటీవల హిందూవాదాన్ని తలకెత్తుకున్నారు. యూనివర్శిటీకి టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని ఆయన విమర్శించారు. ఇంకో రచయిత గిరీశ్ కర్నాడ్ ఆయనతో విభేదించి టిప్పును వెనకేసుకుని వచ్చాడు.

''అసలు టిప్పును ముస్లిముగా ఎందుకు గుర్తించాలి? ముస్లిములకు ఓ యూనివర్శిటీ పెట్టడం, దానికి టిప్పు పేరు పెట్టడం దేనికి? అతను ముస్లిములకు అంటూ ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. చేస్తేగీస్తే ఇంగ్లీషువారిని ఎదిరించి చరిత్రలో ఓ స్థానం సంపాదించాడనుకోవాలి." అని కొందరు మేధావులు విమర్శించారు. నిజానికి టిప్పు సైన్సు పరంగా దేశానికి చేసిన మేలు ఒకటి వుంది. ఆధునిక రాకెట్ విజ్ఞానాన్ని అతను అభివృద్ధి పరిచాడు. అతని తాత ఆర్కాట్ నవాబు వద్ద 50 మంది రాకెట్ సైనికులకు అధికారిగా వుండేవాడు. అతని తండ్రి హైదర్ అలీ మైసూరు రాజ్యం ఏర్పరచాక తన సైన్యంలో రాకెట్ విభాగం ఏర్పరచి 1200 మంది సైనికులను ఆ విభాగంలో వాడేవాడు. 1780 నాటి పుల్లిలూరు యుద్ధంలో హైదర్, అతని కొడుకు టిప్పు తమ రాకెట్లతో ఇంగ్లీషు వారిని భయపెట్టేశారు. ఇంగ్లీషు వారికి అప్పటికే రాకెట్లు తెలుసు కానీ యినుప తొడుగుల్లో పెట్టాలని వాళ్లకు తోచలేదు. హైదర్, టిప్పు చేసిన రాకెట్లలో కత్తులను యినుప సిలిండర్లలో యిమిడ్చి గాలిలోకి ఎగిరేట్లు చేసేవారు. అవి రెండు కి.మీ.ల దూరం వరకు వెళ్లేవి. లోపల మందుగుండు కూరి అది పేలేట్లు చేయడంతో శత్రువులు పెద్ద సంఖ్యలో నాశనం అయ్యేవారు. తండ్రి తర్వాత టిప్పు రాకెట్ల్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాడు. రాకెట్‌లు, మందుగుండు సామగ్రి తయారుచేసేందుకు తారామండల్ పేట అనే పేటను ఏర్పరచాడు. ''ఫతూల్ ముజాహిదీన్" అనే మిలటరీ మాన్యువల్ రాశాడు. టిప్పు సైన్యంలో 24 బ్రిగేడ్‌లు వుండేవి. ఒక్కో బ్రిగేడ్‌లో 200 మంది రాకెట్ వేసేవాళ్లు వుండేవారు. ఇది చూశాక ఇంగ్లీషువాళ్లు తాము కూడా తమ రాకెట్‌లను డెవలప్ చేసుకున్నారు.

అందుకని డిఆర్‌డిఓ (డిఫెన్స్ రిసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) వారు దేశంలోని తొలి ఆర్కియాలాజికల్ రాకెట్ మ్యూజియంను టిప్పు రాజధాని ఐన శ్రీరంగపట్నంలో నెలకొల్పబోతున్నారు. అతని పేర మైనారిటీ యూనివర్శిటీ పెట్టి వివాదాలు లేవనెత్తేబదులు శాస్త్ర ఆవిష్కర్తగా టిప్పును సంభావించడం ఎంతో తెలివైన పని. – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013) ఫోటో – పుల్లిలూరు యుద్ధంలో మైసూరు సైన్యం ఉపయోగించిన రాకెట్ విస్ఫోటనం చిత్రం

తిట్లు తినే దేవస్థానం – బాలాజీ వాచీలు, 21 ఇంచిల జుట్టుకి లడ్డూలు, వెబ్‌సైట్లు తప్పేముంది, ఎలాగూ యిస్తారు కదా, బలవంతం లేదు, సీనియర్ సిటిజన్లుకు చిన్నపిల్లల తల్లులకు కన్సెషన్, నడిచి వచ్చినవాడికి ఎందుకు యివ్వాలి, జుట్టు సెపరేట్ చేసుకోవాలి, విడిగా యిస్తే ఏరే పని తగ్గుతుంది. దర్శనంలో కన్సెషన్ లేదు కదా, నార్త్ వాళ్ల ఫిర్యాదు, గమ్యం చేరేవరకే తేడాలు. కొండమీదకు ఎలా చేరతావన్నది నీ యిష్టం, డోలీ, గు3రం, నడక.. డబ్బు సద్వినియోగం అవుతోంది కదా

**మార్చి 26** **ఎమ్బీయస్ : రహదారి మూసుకుంది**

చూస్తూంటే ఉద్యమబాటలో కూడా కంటకావృతం అయినట్టుంది. ఇదివరకు ఏదైనా కార్యక్రమం చేపడితే ప్రభుత్వమే సహకరించేది. 'బంద్' పిలుపు యివ్వగానే ఆర్టీసీవారు బస్సులు కాన్సిల్ చేసేవారు, యూనివర్శిటీవారు పరీక్షలు వాయిదా వేసేవారు, విద్యాశాఖ వారు చిన్నపిల్లల బళ్లు మూసేసేవారు. మర్నాటి పేపర్లో ''బంద్ విజయవంతం, స్తంభించిన ప్రజాజీవితం'' అని వార్త హెడ్‌లైన్సులో వచ్చేసేది. అది చదివి ఓహో అనుకోవాలి మనం. నిజానికి పాలు వచ్చేవి, పేపరు వచ్చేది, టీవీ వచ్చేది, సినిమాలు నడిచేవి, ఆఫీసులు, బ్యాంకులు అన్నీ వుండేవి. తెలుగువాళ్లలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు నమ్ముకునేవాళ్లు తక్కువ కాబట్టి రోడ్లన్నీ ఎప్పటిలాగా రద్దీగా వుండేవి. టీవీ కెమెరాలు నొచ్చుకుంటాయని ఉదయం 12 గంటల ప్రాంతంలో కొందరు కార్యకర్తలు దగ్గరుండి మూయించిన షాపులు సాయంత్రం 4 తర్వాత బార్లా తెరుచుకుని కనబడేవి. పాతబస్తీలో అయితే బందూ గిందూ జాన్తా నై.

ఇలాటి బందు పిలుపులిచ్చి 'ఉద్యమాల ద్వారా ప్రజలు తమ ఆకాంక్షను మరొక్కమారు చాటి చెప్పార'ని చెప్పుకునే అవకాశం ఉద్యమనాయకులకు వుండేది. వాళ్లు ఏ గన్ పార్క్ దగ్గరో అరెస్టయి వ్యాన్ ఎక్కేవారు. టీవీ వాళ్లు ఫోటోలు తీసుకునేవారు. పోలీసు వాళ్లు కంట్రోలు రూముకి తీసుకుని వచ్చి టీ లిచ్చి పంపేసేవారు. కేసులు పెట్టేవారో లేదో కూడా తెలిసేది కాదు. కిరణ్ తన సీటులో బలపడుతున్నకొద్దీ యిలాటి అవకాశాలు తగ్గిపోతున్నాయి. నిన్న సడక్ బంద్ తాజా ఉదాహరణ. పాల్గొన్న నాయకులపై ఏకంగా నాన్ బెయిలబుల్ కేసులు పెట్టేశారు. కోర్టువారు ఏప్రిల్ 4 వరకు జ్యుడిషియల్ రిమాండ్ అన్నారు కూడా. అంటే ఉత్తుత్తి అరెస్టులు కావన్నమాట. అరెస్టయినవారిలో శ్రీనివాస గౌడ్ వంటి ఉద్యోగులు కూడా వున్నారు. మరి యీ కేసులు వారి సర్వీసు రికార్డులో నోట్ చేస్తారో ఏమో ఖర్మ!

గతంలో తెలంగాణ ఎంపీలు యిలాగే రైల్ రోకో చేస్తే వాళ్ల మీదా కేసులు పెట్టారు. అవి యింకా తేలలేదు. కేసులు పెట్టినందుకు పొన్నం ప్రభాకర్‌కు కిరణ్‌కుమార్‌పై యింకా కోపం పోలేదు. అవకాశం వచ్చినపుడల్లా దెప్పుతూనే వుంటారు. విద్యార్థులపై పెట్టిన కేసులు యిదిగో ఎత్తేస్తాం, అదిగో ఎత్తేస్తాం అంటూ ఏళ్లూ పూళ్లూ పట్టించారు. ఇంకా కొందరిపై మిగిలి వున్నట్టున్నాయి. ఉద్యోగాలకు అప్లయి చేసినపుడు యిదో తలకాయనొప్పి వాళ్లకు. ఇప్పుడు ఎమ్మెల్యేలను కూడా అరెస్టు చేసి జిల్లా జైలుకి పంపారు. దాంతో యివాళ్టి న్యూస్ పేపర్లలో యీ న్యూసే ప్రముఖంగా వచ్చింది. 'సడక్ బంద్ ..విజయవంతం' అని కాదు. (ఈనాడు 'ఉద్రిక్తం' అంది, సాక్షి 'ప్రశాంతం' అని రాసింది, జగన్ జైలువాసం తప్ప వారికి మరేదీ ఉద్రిక్తం కాదు) 'చెరసాలకు కోదండ' అనీ కాప్షన్లు పెట్టారు. (అదీ హెడ్‌లైన్సుగా కాదు. ఆ గౌరవం సంజయ్ దత్ పట్టుకుపోయాడు) 'కోదండకు అరదండాలు' అని పెట్టి వుంటే కవితాస్ఫోరకంగా వుండేది. ముఖ్యమంత్రిగారే తెలుగు నేర్చుకుంటున్నారు, పాత్రికేయులు కవిత్వం నేర్చుకోకపోతే ఎలా?

'సడక్ బంద్' అని జాక్ ప్రకటించాక తెలంగాణ మంత్రులు దానికి అనుమతి కోసం ముఖ్యమంత్రిని అడిగారు. భలే ఫన్నీగా వుంది. జాతీయరహదార్లు మూసేయడానికి ఏ ప్రభుత్వమైనా అనుమతి యిస్తుందా? అలా మూసేయడం వలన సరైన సమయంలో వైద్యసహాయం అందక ఎవరో మరణించారు, ప్రభుత్వం దానికి బాధ్యత వహించాలి అని ఎవడైనా పిల్ వేస్తే...? ఇలాటి కేసులు ఉద్యమకారులపై వేసే ధైర్యం ఎవరూ చేయరు. చేస్తే ఉద్యమద్రోహిగా ముద్ర పడతారు. అయినా ఉద్యమంలో యిలాటి బంద్‌లు చేయక తప్పదు. చేయకపోతే ప్రభుత్వం పట్టించుకోదు. 'ఉద్యమం చప్పగా చల్లారి పోయింది, ఎవరి పనులు వాళ్లు చూసుకుంటున్నారు' అని గవర్నరుగారు, ఇంటెలిజెన్సు చీఫ్ నివేదికలు పంపుతారు. అన్ని పార్టీలలోని తెలంగాణ నాయకులకు ప్రత్యేక సౌకర్యాలు అంతరించి పోతాయి. నుక ఏదో ఒక హంగామా సాగుతూనే వుండాలి. ప్రజాస్వామ్య హక్కుల్లో యిది కూడా భాగమై పోయింది.

అదే విధంగా దీన్ని అడ్డుకోవడం కూడా ప్రభుత్వం హక్కుల్లో ఒకటి. అప్పుడెప్పుడో నెక్లెస్ రోడ్‌లో ప్రదర్శనకు అనుమతి యిచ్చారు కదా, యీ హైవే బంద్‌కు అనుమతి ఎందుకు యివ్వరు? అని పాత్రికేయులు కిరణ్‌ను అడిగారట. ఏదో ఒక చోట గుమిగూడడం వేరు, బొత్తిగా రహదారులు మూసేస్తాననడం వేరు అన్నారట కిరణ్. అప్పటిలాగే యిప్పుడూ పోలీసులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చేసినట్టున్నారు. అప్పుడు తెలంగాణ పాత్రికేయులను ఆపేశారు. ఇప్పుడు 57 కేసులట, 1177 అరెస్టులట. అరెస్టులు అప్రజాస్వామికం అని కొందరు నాయకులు నిరసిస్తూనే వున్నారు, మరో పక్క అరెస్టులు జరుగుతూనే పోయాయి. ఎవరి వ్యూహాలు వాళ్లు పన్నారు. మొత్తానికి ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు వాహనాలను ఆపగలిగినట్టున్నారు. ఆ తర్వాత యథావిధిగా రాకపోకలు సాగాయట.

బెంగుళూరు రోడ్డు పని పట్టాక, విజయవాడ రోడ్డు పని కూడా పడతామన్నారు జాక్ వారు. అసలీ కార్యక్రమమే అనుకున్న దాని కంటె లేటయింది. దిల్‌సుఖ్ నగర్ పేలుళ్లు, విద్యార్థుల పరీక్షలు, ఉద్యోగుల మార్చి అడావుడి... యిలా ఎన్నో అడ్డంకులు. మరీ వాయిదా వేస్తే ఎండలు ముదిరిపోతాయని భయపడి జరిపించేశారు. సాధారణంగా యిలాటి కార్యక్రమం పెట్టుకోగానే మర్నాడు

కూడా ఫాలో ఆన్ వుంటుందని కచ్చితంగా చెప్పవచ్చు. ఆందోళన కారులపై పోలీసులు అత్యుత్సాహం ప్రకటించారని, వారి వైఖరికి నిరసనగా యింకో బంద్ పాటించాలని పిలుపు నిస్తారు. ఆ ముచ్చట యివాళ జరుగుతోంది. విజయవాడ రోడ్డు బంద్ ముహూర్తం ఎప్పుడో మరి చూడాలి. ఇప్పుడు అరెస్టయినవాళ్లు బయటకు వచ్చాకన్నే జరుగుతుందనుకోవచ్చు.

మొత్తానికి ఒక కార్యక్రమం జరిపామన్న తృప్తి ఉద్యమకారులకు, చేతనైనంత ఆపగలిగామన్న తృప్తి ప్రభుత్వానికి మిగిలింది. మధ్యలో సామాన్యప్రజలు కొందరికి దెబ్బ పడింది. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడం, పోలీసులు వారిపై లాఠీ చార్జి చేయడం సహజం. వీరిది ఉద్యమధర్మం, వారికి ఉద్యోగధర్మం. పోలీసు జీపుల అద్దాలు పగలగొట్టడం, వాహనాల చక్రాల్లో గాలి తీసేయడం ఆందోళనకారుల జన్మహక్కు అయిపోయింది. కానీ ప్రయివేటు వాహనాల, లారీలు అద్దాలు పగలకొట్టడం, వాటిని ధ్వంసం చేయడం అన్యాయం కదూ! వాళ్లు ఏం పాపం చేశారు? బంద్ పిలుపు నిచ్చినా బయలుదేరి వచ్చారని వాళ్లపై కోపమా? వాళ్లకు శిక్ష? వాళ్లకు మాత్రం సరదానా? ఏం అర్జంటు పనులున్నాయో ఏమో! లారీలయితే వాళ్ల చేతిలో ఏమీ లేదు. ఎక్కడో దక్షిణభారతంలో బయలుదేరి ఉత్తర భారతానికి వెళుతూ వుంటారు. స్టాలిన్‌పై సిబిఐ సోదాకు నిరసన అనో, సంజయ్ దత్ తీర్పుకు నిరసన అనో దారిలో ఎవరైనా ఆపేస్తే ఆలస్యమై పోయి యిక్కడకు వచ్చేసరికి యీ వేళ అయి వుండవచ్చు. వెళ్లనిస్తే వెళదాం, లేకపోతే యిక్కడే ఆపసోపాలు పడదాం అని హైవే మీద వాహనాలు ఆపేసుకుని కూర్చుంటారు.

నాకూ అలాటి అనుభవాలు వున్నాయి. అనేక రాష్ట్రాలలో టాక్సీల్లో, లేదా సొంతకారులో తిరుగుతూ ఇలాటి ఆందోళనల కారణంగా ప్రయాణం ఆలస్యమై పోయి, రైలు మిస్ అయిన సందర్భాలూ వున్నాయి. భారతీయపౌరుడికి సహనం సహజాలంకారం కాబట్టి నోరు మూసుకుని కూర్చున్నాను. నాలా కూర్చున్న వాహనాలపై కూడా నిన్న దాడి చేసి ధ్వంసం చేశారట. ఇలాటి పనులు నాయకులు దగ్గరుండి చేయించారని చెప్పలేము. వాళ్లు కార్యక్రమం ప్రకటించగలరు కానీ కార్యకర్తలను అదుపు చేయలేరు కదా. వాహనాలు దెబ్బతిన్న వాళ్లు యిన్సూరెన్సు క్లెయిమ్ చేయాలన్నా కేసులు నమోదు చేయాలి. అప్పుడు యీ కార్యకర్తలు తప్పనిసరిగా కేసుల్లో యిరుక్కుంటారు. కొందరు గడుసువాళ్లు బయటపడగలరు కానీ అమాయకులు నష్టపోతారు. వీళ్ల గొడవలు పట్టించుకునే తీరిక నాయకులకు వుండదు. విద్యార్థులపై కేసుల విషయంలో చూశాంగా!

ఏది ఏమైనా యికపై ఉద్యమదారి రహదారి కాదని తేల్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 27** **ఎమ్బీయస్ : ఎందరో మేనమామలు.. అందరికీ వందనాలు**

జెసి దివాకరరెడ్డి చెప్పారు – ఆడపిల్ల తండ్రి పోతూ పోతూ తన కూతురి సంరక్షణ మేనమామకు అప్పగించినట్టు వైయస్ పోతూ పోతూ తన ప్రభుత్వ రక్షణ భారాన్ని చంద్రబాబుకి అప్పగించారని, ఆయన మేనమామ పాత్రను అద్వితీయంగా పోషిస్తున్నారని! కేంద్రంలో యిలా అప్పగింతలు జరిగాయో లేదో కానీ అక్కడి యుపిఏ ప్రభుత్వాన్ని కూడా పడిపోకుండా ఎవరో ఒకరు కాపాడుతూ వస్తున్నారు. యుపిఏ–1 పల్లకిని లెఫ్ట్‌వారు మోసి, మోసి వదిలేసి వాళ్లే దెబ్బతిన్నారు. యుపిఏ–2 పల్లకిని మమతా కొంతకాలం మోసింది. ఆవిడ తప్పుకుంటే ఓ పక్క ములాయం, మరో పక్క మాయావతి కాపాడుతూ వస్తున్నారు. డిఎంకె కాసినంతకాలం కాసి, యిప్పుడు తప్పుకుంది. వెంటనే సోనియా ములాయం మామకు వందనాలర్పించి 'నీదే భారం' అంది. సోనియా, ములాయంల మధ్య గౌరవమర్యాదల వివాదం చాలాకాలం నడిచినా యిప్పుడు ములాయం – పేరు ప్రభావం వలన కాబోలు – మెత్తబడ్డారు.

ఇంతకీ డిఎంకె కాడి పడేయడానికి కారణం ఏమిటట? అమెరికా తీర్మానాన్ని మనం మరింత ఘాటు చేర్చలేదని కోపంట. అసలు అమెరికాయే పరమ కిల్లాడి. ప్రపంచంలోని సైనిక నియంత లందరికీ కొమ్ము కాసే అమెరికాకు యితర దేశాలలో ప్రజాస్వామిక హక్కుల గురించి, మానవహక్కుల గురించి మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిది? ఎల్‌టిటిఇ ని మట్టు పెట్టిన సైన్యాధిపతి శరత్ ఫోన్‌సెకాను వెనకేసుకుని వచ్చినది అమెరికా కాదా? రాజపక్షె శరత్‌ను ఓడించడంతో అమెరికా యిప్పుడు యిన్నేళ్ల తర్వాత మానవహక్కుల సమస్య లేవనెత్తి రాజపక్షెను యిరకాటంలో పెట్టాలని చూస్తోంది. దానికి వత్తాసు పలకడమే మనం చేస్తున్న తప్పు. డిఎంకె దృష్టిలో అది చాలదట. ఆ తీర్మానానికి సవరణలు చేసి శ్రీలంకను యింకా పెద్ద దోషిగా నిలబెట్టాలట. డిఎంకె ప్రతిపాదించిన సవరణలు చూడండి – 'ఈలం తమిళులపై..' అంటూ. అసలు ఈలం ఎక్కడుంది? అక్కడున్నది శ్రీలంక మాత్రమే. ఈలం అన్నది శ్రీలంకను విభజించాలని కోరే తమిళ సంఘాల ఊహల్లో మాత్రమే వుంది. ఈలం తమిళులు అని అనగానే శ్రీలంకను మనమే విభజించినట్టు అయింది. కశ్మీరు భారత్‌లో భాగం కాదని, అది వేరే దేశమనీ ఎవరైనా యితర దేశాలవాళ్లు వర్ణిస్తే మనకు భగ్గుమనదూ?

ఇంకా.. జెనోసైడ్ జరిగిందని అనాలట. సింహళులు వేరే జాతి, తమిళులు వేరే జాతి అని ఒప్పుకుంటూ సింహళ జాతి తమిళజాతిని నాశనం చేసిందని మన నోటితో మనం ఎలా అనగలం? మాతృభాష వేరు కావచ్చు కానీ వాళ్లంతా సింహళ పౌరులు. వారిది వేరే జాతి అంటే ఎలా? 'మాది వేరే జాతి, భారత్ నుండి విడిపోతాం, ఖలిస్తాన్ ఏర్పరచుకుంటాం' అని సిక్కులు అంటే మనం ఒప్పుకున్నామా? 'మతాలు వేరైనా మనమంతా ఒకే జాతి... భరతజాతి.' అని చెప్పి ఖలిస్తాన్ ఉద్యమాన్ని అణిచివేశాం. శ్రీలంక సైన్యం ఎల్‌టిటిఇ ఆక్రమించిన ప్రాంతాలపై యుద్ధం చేసింది కానీ శ్రీలంకలోని మధ్యప్రాంతాలలోని తమిళులపై దాడి చేసిందా? యుద్ధప్రాంతాలలో వున్న సాధారణపౌరులు ఎప్పుడూ ధనప్రాణమానాలు నష్టపోతారు. ఎల్‌టిటిఇ వారూ వారి హక్కులకు భంగం

కలిగించారు, శ్రీలంక సైన్యం వారూ కలిగించారు. అటవీప్రాంతాలలో మావోయిస్టులను వేటాడేటప్పుడు సాధారణ గిరిజనులను మన ప్రభుత్వాలూ హింసిస్తాయి, మావోయిస్టులూ హింసిస్తారు. ఇవన్నీ అవతలివాళ్లు ఎత్తిచూపితే మనం ఎలా ఫీలవుతాం?

అంతెందుకు – అఫ్జల్ గురు ఉరిని ఖండిస్తూ పాకిస్తాన్ అసెంబ్లీ తీర్మానం పాస్ చేస్తే మనకు ఒళ్లంతా కారం రాసుకున్నట్టు లేదూ!? వారి ప్రవర్తనకు మనం అభ్యంతరం తెలిపామా లేదా? కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్ ప్రస్తావించినప్పుడల్లా 'అది భారత్ అంతర్గత వ్యవహారం. అడ్డమైనవాడూ వచ్చి మాట్లాడబోతే కుదరదు' అని ఖరాఖండీగా చెప్పటం లేదా? అలాటప్పుడు శ్రీలంక విషయంలో తగుదునమ్మా అని మనం తీర్మానాలు చేయడమేమిటి? కితం ఏడాది కూడా శ్రీలంకకు వ్యతిరేకంగా ఓటేశాం. ఈ ఏడాదీ అదే చేశాం. అది చిన్న దేశమని అలుసా? పాకిస్తాన్, చైనా శ్రీలంకకు అనుకూలంగా ఓటేసి వాళ్ల దగ్గర మంచి మార్కులు కొట్టేశాయి. చైనా శ్రీలంకతో వ్యాపారావకాశాలను అంది పుచ్చుకుని భారత్‌ను అక్కణ్నుంచి తరిమేసేందుకు మనమే మార్గం చూపిస్తున్నాం.

ఇదంతా దేని కోసం? డిఎంకెను సంతుష్టపరచడానికా? అసలు డిఎంకె చిత్తశుద్ధి ఎలాటిది? వీళ్లంటున్న హింసాకాండ జరిగే రోజుల్లో శ్రీలంక తమిళులకోసం డిఎంకె ఏం చేసిందట? కరుణానిధి ఆమరణ నిరాహారదీక్ష అంటూ మూడు గంటల పాటు గుడారం వేసుకుని కూర్చుని లేచి వచ్చేశాడు. ఆ తర్వాత మూడేళ్ల పాటు యుపిఏ ప్రభుత్వంలో కొనసాగుతూ నిధులు పోగు చేసుకుంటూ కూర్చున్నాడు. ఇప్పుడు రాబోయే పార్లమెంటు ఎన్నికలలో తన పార్టీ మనుగడ ఏమవుతుందోనన్న భయం పట్టుకుని తమిళుల కోసం ఏదో చేసేశానన్న బిల్డప్ యివ్వడానికి యీ ఎత్తు ఎత్తాడు. మన దేశ తమిళులకు యివన్నీ అర్థం కావని అతని ఆశ. 2014 దాకా తను వుంటాడో లేదో, తన తదనంతరం పార్టీ వుంటుందో లేదో, కొడుకులిద్దరూ కలిసి పార్టీ చీల్చేసి జయలలితకు రాష్ట్రం పూర్తిగా అప్పగించేస్తారేమోనని కరుణానిధి బెంగ. బాలచంద్రన్‌ను కేంద్రంగా పెట్టుకుని ఆందోళన మొదలుపెట్టాడు.

అసలు తమిళ ప్రజలకు ఎల్‌టిటిఇ పై ఎంత సానుభూతి మిగిలిందో అది చూడాలి. శ్రీలంక నుండి తమిళులు ఎవరూ శరణార్థులుగా రావటం లేదు. అక్కడి పరిస్థితులు వీళ్లు చెప్పేటంతటి అధ్వాన్నంగా వుంటే యీ పాటికి గుంపులుగుంపులుగా వచ్చి పడాలిగా! ఈ విషయం తమిళనాడు ప్రజలకు అర్థమయిందంటే కరుణానిధి ప్రయాసంతా వేస్టే. కరుణానిధి నాటకాలాడి ఏదైనా సింపతీ వేవ్ సృష్టించినా అది అయినా ఒక ఏడాది తర్వాత వచ్చే పార్లమెంటు ఎన్నికల వరకు నిలిచి వుంటుందన్న గ్యారంటీ ఏముంది?

ఈ విషయం తెలిసే కరుణానిధి వెంటనే, తను బతికి వుండగానే పార్లమెంటు ఎన్నికలు వచ్చేట్లా చేయాలనుకున్నారు. యుపిఏ 2 ప్రభుత్వం పడిపోతే తప్ప అవి రావు. పడగొడదామని ముందే రాజీనామాలు యిచ్చి అడలగొట్టారు. యుపిఏ తెలివిగా ప్రవర్తించింది. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. డిఎంకె ప్రతిపాదించిన తీర్మానాలను ఒక్క పార్టీ కూడా సమర్థించలేదు. 'చైనా యుద్ధంలో భారత్‌కు మద్దతు యిచ్చిన శ్రీలంక ఆంతరంగిక విషయాలలో మనం కలగజేసుకోవడం తప్పు. వాళ్ల దేశంలో ఏదైనా పొరబాటు జరిగితే వాళ్లే సవరించుకోవాలని సూచిస్తే చాలు' అన్నారు. డిఎంకె బయటకు నడిచింది. అయితే ములాయం, మాయా మేమున్నామంటూ వాకిట్లో నిలబడ్డారు. బయటకు వెళ్లిపోయిన మమతా వెనక్కి వచ్చి కావాలంటే మద్దతు యిస్తానని ఆఫర్ యిచ్చింది. మధ్యలో బేణీ ప్రసాద్ వర్మ అధికప్రసంగం వలన ములాయంకు కోపం వస్తే 'మేనమామా, వందనం' అనేసింది సోనియా. చేతులు పట్టుకుని యివి కాళ్లనుకో అంది. అందితే చేతులు, అందకపోతే సిబిఐ వుంది సుమా అని చెప్పినట్లు మర్నాడే స్టాలిన్ యింటిపై సిబిఐ సోదా జరిగింది.

అన్నట్టు.. అంటున్నాను. ఎందుకంటే ఇలా విత్‌డ్రా చేయగానే అలా సిబిఐను ఉసికొల్పడం జరగదు. చిరంజీవి వియ్యంకుడి యింటిపై ఐటీ దాడి జరిగినప్పుడు కూడా రాశాను... డిపార్టుమెంటులో కొందరు తమ పాటికి తాము పని చేసుకుంటూ పోతూంటారు. ఇలాటివి రహస్యంగా జరుగుతాయి. దాడులు జరిగి, సమాచారం సేకరించాక ఫైనల్ స్టేజిలో రాజకీయ బేరసారాలు జరగవచ్చు. స్టాలిన్‌పై ఫైలు నత్తనడక నడుస్తూ నడుస్తూ కాకతాళీయంగా ఆ రోజే పక్కానికి వచ్చి వుంటుంది. అయితే దానిపై మీడియా, డిఎంకె చేసిన అదావుడి చూసి బెదిరిన మన్‌మోహన్, చిదంబరం సిబిఐను వెంటనే వెనక్కి రప్పించారు. కరుణానిధి ముద్దుల కూతుర్నే జైలుకి పంపి నెలల తరబడి కూర్చోబెట్టిన యుపిఏకు అతని కొడుకు యింటికి సిబిఐను సోదా చేయడానికి పంపడం చాలా చిన్న పని. అది అనుకోకుండా జరిగిన పనే అయి వుంటుంది కానీ దీనివలన జరిగిన మేలేమిటంటే ములాయం, మాయావతిలకు వెళ్లవలసిన సంకేతం వెళ్లిపోయింది. సమర్థిస్తారా, లేక సిబిఐని ఎదుర్కుంటారా? అని. కాస్త బెట్టు చేసి వీళ్లు ఎలాగూ సమర్థిస్తారు. మమతా బెనర్జీ నా కోడి కుంపటీ లేకపోతే యుపిఏకు తెల్లారదనుకుంది. ఇప్పుడు రైల్వే శాఖ కూడా ఆవిడ పార్టీ చేతిలోంచి జారిపోయింది. కొత్త మంత్రి రైలు టిక్కెట్ల ధర పెంచారు. ప్రజల్లో తిరుగుబాటు ఏమీ రాలేదు. ఈ మాత్రం దానికి అంత అల్లరి చేయకుండా వుండాల్సింది అనుకుంటోందేమో మమతా. ఒంటరిగా పోటీ చేస్తే పార్లమెంటు ఎన్నికల్లో లెఫ్టును ఎదుర్కో గలనా లేదా అని భయం వేస్తోందేమో.

ఈ మేనమామ లందరికీ ఎన్నికల భయమే. తాము బలపడేవరకూ యుపిఏ పల్లకీని మోయడానికే నిశ్చయించుకున్నారు. మన తరఫున మనం వాళ్లందరికీ వందనాలు చెప్పుకోవాలి. ఎందుకంటే కేంద్రప్రభుత్వం కానీయండి, రాష్ట్రప్రభుత్వం కానీయండి – సాధ్యమైనంత సుస్థిరంగా వుండాలి. వీళ్లు కాకపోతే మరొకళ్లు. బలంగా వుండాలి, లేకపోతే అరాచకమే. పదిపదిహేనుమంది కలిసి అతుకులబొంతగా ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటు చేయడం, రోజుకొకడు బెదిరించడం – యిలా వుంటే పేపరు చదవడానికి ఉత్సాహంగానే వుంటుంది కానీ ప్రజాజీవితం అస్తవ్యస్తమవుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 27 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఉన్నమాటంటే ఉలుకు...**

మమతా బెనర్జీకి వాస్తవాలంటే మంట. అది ఎవరైనా ఎత్తి చూపిస్తే మరీనూ... ఆమె అధికారంలోకి రావడానికి ప్రధానంగా దోహదపడిన అంశం – పరిశ్రమలకై భూమి సేకరించడాన్ని వ్యతిరేకించడం! చాలాకాలం పారిశ్రామికవేత్తలను శత్రువులుగా చూసిన లెఫ్ట్ ఫ్రంట్ తమ రాష్ట్రంలో నిరుద్యోగం దినదినం ప్రబలడంతో పొరపాటు గుర్తించి "మా రాష్ట్రంలో చాలా భూమి వుంది, తక్కువ కూలీలకే కార్మికులు దొరుకుతారు' అంటూ పరిశ్రమలను ఆహ్వానించింది. అది నమ్మి టాటా మోటార్స్ వచ్చి సింగూర్‌లో ఫ్యాక్టరీ పెడతానంటే మమతా మండిపడింది. రైతుల భూమి లాక్కుంటున్నారంటూ సింగూర్, నందిగ్రామ్‌లలో పెద్ద ఆందోళన చేసి, లెఫ్ట్ ఫ్రంట్‌ను రైతు వ్యతిరేకులుగా చిత్రీకరించి ఎన్నికలలో ఓడించింది.

సింహాసనం ఎక్కాక నిరుద్యోగ సమస్య ఆమెనూ వెంటాడింది. తాను తరిమివేసిన పారిశ్రామిక వేత్తలను సగౌరవంగా పిల్చుకుని వస్తే తప్ప దిక్కులేని పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమలను ఎలా ఆహ్వానించాలో చెప్పండి అంటూ మమత ప్రభుత్వం ఒక సలహా సమితిని నియమించింది. సెప్టెంబరులో యుపిఏ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించి, కాబినెట్‌నుండి తన మంత్రులను వెనక్కి రప్పించిన మమత వారిలో సౌగతా రాయ్‌కి ప్రభుత్వ పారిశ్రామిక విధానపు ముసాయిదా తయారుచేసే పని అప్పగించింది. సౌగతా రాయ్ చాలా సీనియర్ నాయకుడు. మేధావిగా పేరుబడినవాడు. బెంగాల్‌లో కాంగ్రెస్ పార్టీ పక్షాన చాలా ఏళ్లుగా రాజకీయాల్లో వున్నాడు. మమతకు, ఆమె పార్టీలోని అనేకులకు సీనియర్. ఆయన అనేక విషయాలు పరిశీలించి ఈ జనవరిలో మమతకు తన రిపోర్టు సమర్పించాడు.

"బెంగాల్‌లో భూమి తక్కువగా వుంది కాబట్టి, పెద్ద పెద్ద పరిశ్రమలను ఆహ్వానించలేము. భూమి ఎక్కువగా అవసరం పడని మధ్యతరహా, చిన్న పరిశ్రమలను ఆహ్వానించి, ప్రోత్సహిస్తే నిరుద్యోగ సమస్య తీరుతుంది, అదే సమయంలో రైతులకు కూడా నష్టం కలగదు" అని దానిలో రాశాడు. ఇదే తరహాలో అభిప్రాయాలు వెలిబుచ్చిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారి సలహాలు, తొమ్మిదిమంది పారిశ్రామికవేత్తల సలహాలు కూడా అనుబంధంగా యిచ్చాడు. నిజానికి యిది తృణమూల్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా వున్న నివేదిక. ఉద్యోగాల కోసం రైతుల పొట్టకొట్టకూడదన్న నినాదంతోనే తృణమూల్ గ్రామీణ ప్రాంతాల్లో లెఫ్ట్ ఫ్రంట్‌ను దెబ్బ కొట్టగలిగింది.

అయితే యీ నివేదిక మమతకు గాని, ఆమె పరిశ్రమల మంత్రిగా వున్న పార్థా చటర్జీకి గాని నచ్చలేదు. ఎందుకంటే వాళ్లు యిటీవల "బెంగాల్‌లో భూమి లేకపోవడమేమిటి? బోల్డంత వుంది. గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకల కంటె ఎక్కువ వుంది. మా దగ్గర పరిశ్రమలు పెట్టాలే గాని అడిగినంత భూమి యిస్తాం, యితర రాష్ట్రాలు యిస్తానన్నదాని కంటె ఎక్కువ యిస్తాం." అని బహిరంగంగా చెప్తున్నారు. అయినా టాటా మోటర్స్ ఉదంతం తర్వాత వాళ్ల మాట నమ్మడానికి పారిశ్రామిక వేత్తలెవరూ సిద్ధంగా లేరు. ఇప్పుడు సౌగతా రాయ్ రిపోర్టు బయటకు వస్తే తాము చెప్పేది అబద్ధమని తేల్తుంది. అందుకని మమతా ఆ నివేదికను తొక్కి పెట్టింది. అయితే యిటీవల ఒక ఫైనాన్షియల్ దినపత్రిక ఆ నివేదికను ప్రచురించింది. అది చూసి అందరూ సౌగతా రాయ్‌ను నిజమేనా అని అడిగారు. అవునన్నాడతను. ఇక గొడవ ప్రారంభమైంది. మమతకు ఒళ్లు మండిపోయింది. సౌగతా రాయ్‌ను పిలిచి బాగా తిట్టిపోసింది. అయితే అతను నేను తప్పు చేశాననలేదు. పూర్తి అధ్యయనం తర్వాతే తయారుచేశాను అంటూ ఆ కమిటీ నుండి తప్పుకుంటున్నట్టు లేఖ రాసి యిచ్చేశాడు.

అసలు సంగతేమిటంటే మమతా బెనర్జీకి సౌగతా రాయ్ అంటే అంత నమ్మకం లేదు. 1998లో ఆమె పార్టీ పెట్టిన దగ్గర్నుంచి విడవకుండా వున్న పార్థా చటర్జీ, ముకుల్ రాయ్ (రైల్వే మంత్రిగా వచ్చి మమత చెప్పినట్టు బజెట్ మార్చేసినవాడు), ఫిరహాద్ హకీమ్, సుబ్రతో బక్షీ వంటి వారంటేనే ఆమెకు గురి. సౌగతా ఆమె పార్టీలో చేరి బయటకు వెళ్లిపోయాడు. మళ్లీ చేరి, మళ్లీ వెళ్లి, మళ్లీ చేరాడు. పార్టీ విడిచి వెళ్లినపుడు మమతాకు వ్యతిరేకంగా పోటీ చేశాడు కూడా. (ఓడిపోయాడు) అటువంటి వాడు ఎంత ప్రాక్టికల్‌గా మాట్లాడినా ఆమెకు ఎందుకు నచ్చుతుంది? మమతా చెప్పినట్టు వల్లించే ఆమె అనుచరుడు పార్థా చటర్జీ "సౌగతాదా ప్రదేశ్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా వున్నపుడు నేను యింకా విద్యార్థినే. అప్పుడెంతో గౌరవించేవాణ్ని. కానీ తనో పెద్ద మేధావి అనుకుంటూ ఆయన చెప్పిన సలహాలు చూడండి ఎలా వున్నాయో! చిన్న పరిశ్రమలు పెట్టాలట. అవి పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా మనగలవు కానీ విడిగా బతకగలవా? బెంగాల్‌లో భూమి లేదా? కలకత్తాలో యివ్వలేము కానీ కాస్త దూరంలో యివ్వగలం కదా! పార్టీ నాయకుడుగా వుంటూ చెప్పవలసిన మాటలేనా యివి!?" అని విరుచుకుపడ్డాడు.

రాష్ట్ర పరిశ్రమల మంత్రి పార్థా, పరిశ్రమల సలహాదారు సౌగతా యిలా కొట్టుకుంటూ వుంటే బెంగాల్‌కు పరిశ్రమలు ఎలా వస్తాయి? **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

**మార్చి 28 వీక్లీకై** **ఎమ్బీయస్ : కర్ణాటక మునిసిపల్ ఎన్నికల పాఠాలు**

కేంద్రంలో యుపిఏ ప్రభుత్వం నిలదొక్కుకోవడానికి పడుతున్న అవస్థ చూస్తూ వుంటే 2014లో వీళ్లు మళ్లీ అధికారంలో రావడం కల్ల అనిపిస్తుంది. అయితే ఎవరు వస్తారు? అయితే ఎన్‌డిఏ, లేకపోతే మూడో ఫ్రంట్. మూడో ఫ్రంట్ అంటూ ముచ్చట్లు చెప్పే లెఫ్ట్

ఫ్రంట్ మూలపడింది. ఇక ములాయం లాటి వాళ్లు బెదిరించడానికి మిగిలిందంతే. అందువలన ఎన్‌డిఏకే ఛాన్సుండాలి. ఎన్‌డిఏ చోదకశక్తి అయిన బిజెపి పార్టీలో విభేదాలు చూస్తూ వుంటే ఆ నమ్మకం సన్నగిల్లుతోంది. పార్టీ నాయకుల గొడవలు ఎలా వున్నా కార్యకర్తలు నిష్టగా పనిచేస్తుంటారు కాబట్టి ఓట్లు పడతాయని అనుకుంటూంటారు కొంతమంది. దక్షిణాదిన బిజెపికి కాలూనడానికి చోటిచ్చినది కర్ణాటక. తమిళనాడు, కేరళలలో బిజెపి స్థానం సున్నకు కాస్త అటూయిటూగా వుంటుంది. బాబు ప్రాపకంలో ఆంధ్రలో చిరువెలుగు వెలిగింది. నాయకులు ఎక్కువ, సీట్లు తక్కువగా తయారయ్యాక తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకుంటే ఓట్లు రాలతాయనే ప్రణాళికతో యిక్కడి నాయకులు రెచ్చిపోయి మాట్లాడసాగారు. దీనివలన కోస్తా, సీమల్లో పరిస్థితి క్షీణించింది. ఒక్క ఎమ్మెల్యే కూడా అక్కడ నుండి లేడు, గెలిచే అవకాశమూ కనబడటం లేదు. కర్ణాటకలో బిజెపి బలపడితే పొరుగున వున్న తెలంగాణ జిల్లాలలో కాస్త ప్రభావం చూపగలుగుతుందేమో అనుకుంటే, అసలు కర్ణాటకలోనే మోసం వచ్చేట్టుంది.

కొద్దినెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కోబోతున్న కర్ణాటకలో నగర, పట్టణ ప్రాంతాల్లో స్థానిక సంస్థలకు (అర్బన్ లోకల్ బాడీస్) మార్చి 7 న ఎన్నికలు జరిగాయి. సాధారణంగా వీటిలో అధికార పార్టీ గెలుస్తూ వుంటుంది. పట్టణ ప్రాంతాల్లో బిజెపి అభిమానులు ఎక్కువగా వుంటారు. అయినా బిజెపి ఘోరంగా దెబ్బ తింది. దానికీ, దేవెగౌడ పార్టీ అయిన జెడియస్‌కి చెరో 18% ఓట్లు వస్తే కాంగ్రెస్‌కు 40% ఓట్లు వచ్చాయి. సీట్ల విషయానికి వస్తే మొత్తం 4952 సీట్లలో కాంగ్రెస్‌కు 1,960 (2007లో 32% ఓట్లు తెచ్చుకుని 1,606 గెలుచుకుంది. అప్పటి కంటె యిప్పుడు 354 ఎక్కువ వచ్చాయి), బిజెపికి 905 (2007లో 23% ఓట్లతో 1180 వచ్చాయి), జెడియస్‌కు 905 (2007లో 30% ఓట్లతో 1,502 వచ్చాయి) వచ్చాయి. పట్టణాల లెక్క ప్రకారం చూస్తే మొత్తం 207 పట్టణ నగర పాలకమండళ్లలో బిజెపి 19 మాత్రం గెలిచింది. జెడియస్ గెలిచినది 21 కాగా, కాంగ్రెస్ గెలిచినది 71 ! ఎన్నికలు జరిగిన యీ ప్రాంతాలలో రాష్ట్రంలోని 35% ఓటర్లు ఉన్నారు, 20% మంది ఓటేశారు. అందువలన ఓటర్లనాడి తెలుసుకోవడానికి యివి ఉపకరిస్తున్నాయి.

ఒకప్పుడు బిజెపికి కంచుకోటగా నిలిచిన దక్షిణ కన్నడ, ఉడుపి, దావణగెరెలలో యిప్పుడది చావుదెబ్బ తింది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరప్ప సొంత జిల్లా షిమోగాలో కూడా కాంగ్రెసే గెలిచింది. ముఖ్యమంత్రి శెట్టార్ సొంత జిల్లా హుబ్లీ ధార్వాడలో కూడా బిజెపి స్పష్టమైన మెజారిటీ తెచ్చుకోలేకపోయింది. కాంగ్రెస్‌కు 4 కార్పొరేషన్లు, 10 సిటీ మునిసిపల్ కౌన్సిళ్లు, 37 టౌను మునిసిపల్ కౌన్సిళ్లు, 18 టౌను పంచాయితీలు దక్కాయి. బిజెపి యీ విధంగా దెబ్బ తినడానికి కారణం యెడ్యూరప్ప పార్టీ విడిచి కర్ణాటక జనతా పార్టీ (కెజెపి) పెట్టుకోవడం అని తొందరపడి నిర్ణయించకూడదు. అతని పార్టీ మట్టి కరిచింది. 5.5% ఓట్లు మాత్రమే పొంది 274 సీట్లలో గెలిచి 5 పట్టణ మండలాల్లో గెలిచింది. షిమోగాలో కూడా యెడ్యూరప్ప గెలవలేకపోయాడు.

హైదరాబాద్-కర్ణాటక ప్రాంతంలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుస్తుందనుకున్నారు. తెలంగాణ సమస్య లాటిదే అక్కడా వుంది. వెనకబాటుతనం ప్రాతిపదికపై తెలంగాణ విడిపోవాలని వాదించే బిజెపి తను పాలించే కర్ణాటకలో మాత్రం విభజన అక్కరలేదంటుంది. కాంగ్రెస్ వారిని ఆకట్టుకుందామని 371 ఆర్టికల్ క్రింద ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్రతిపత్తి నిచ్చి నిధులు కేటాయించింది. అయితే యీ ఎన్నికలలో దాని వలన కాంగ్రెస్ లబ్ధి పొందలేదు. (తెలంగాణకు కూడా యిలాటి ప్రతిపత్తి యిద్దామన్న ఆలోచన ఒకటి వుంది. ఈ పర్యవసానం తర్వాత దాని గురించి పునరాలోచిస్తారేమో) యెడ్యూరప్ప అక్కడ కొన్ని ఓట్లు పట్టుకుని పోవడం వలన కాంగ్రెస్ ఓటమి చెందింది. ఇతర ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ నాయకులు తమ స్వస్థానాల్లో ఓడిపోయారు.

2007 స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెలుచుకున్నా, 2008 అసెంబ్లీ ఎన్నికలలో బిజెపియే నెగ్గింది. జెడియస్ యెడ్యూరప్ప ప్రభుత్వాన్ని కూల్చేసిందన్న సింపతీ బాగా పనిచేసింది. యెడ్యూరప్ప లింగాయత్ కావడంతో లింగాయతులందరూ బిజెపి పక్షాన నిలిచారు. వారికి ఎస్టీ, ఎస్సీ తోడయ్యారు. బళ్లారి ప్రాంతం నుండి జనార్దన రెడ్డి సోదరులు బిజెపి కొమ్ము కాశారు. ఇప్పుడు లింగాయతులు, రెడ్డి సోదరులు దూరం కావడం ఒక మేరకు ప్రభావితం చేసి వుంటుంది. లింగాయతులు యిప్పుడు కాంగ్రెస్ వైపు మొగ్గారంటున్నారు. ముస్లిములు కూడా ! గతంలో బిజెపిని ఎదిరించగల బలమైన సెక్యులర్ పార్టీగా జెడియస్ కనబడేది. అందువలన ముస్లిములు వాళ్లకు ఓటేశారు. ఇప్పుడు వాళ్ల కంటికి కాంగ్రెస్ కనబడి వాళ్ల ఓట్లు యిటు తిరిగాయట. అందువలన జెడియస్ - సుమారుగా 500 సీట్లు పోగొట్టుకుంది. పాత మైసూరు ప్రాంతంలో మాత్రం తన బలం నిలబెట్టుకుని 24 పట్టణ పంచాయితీల్లో గెలిచింది.

కాంగ్రెస్ విజయానికి కారణం - ఢిల్లీ స్థాయిలో గాని, బెంగుళూరు స్థాయిలో కాని పార్టీ పెద్దలు పెద్దగా కలగజేసుకోకపోవడం అంటున్నారు. డబ్బులు కూడా పంపలేదట. నిర్ణయాలన్నీ స్థానికంగానే తీసుకోమన్నారట. దాంతో పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని గెలుచుకున్నారు. ఈ ఫలితాలు వారి ఉత్సాహాన్ని పెంచవచ్చు కానీ వీటి ఆధారంగా మరీ ఆశలు పెంచుకోవడానికి వీలు లేదు. పరిమిత ప్రాంతాల్లో జరిగిన ఎన్నికలలో దక్కిన పరిమిత విజయం యిది. అసెంబ్లీ ఎన్నికలలో గ్రామీణ ఓటర్లు ఎలా స్పందిస్తారో వేచి చూడవలసినదే. ఈసారి ఓటింగు జరిగినది పట్టణ ప్రాంతాలలో మాత్రమే. అవినీతి సమస్యలపై వారి స్పందన ఎక్కువగా వుంటుంది. పదవిలో రావడానికి, ఎమ్మెల్యేలను కొనడం వంటి పనులకు పాల్పడినందుకు, యెడ్యూరప్ప అవినీతికరమైన పాలన సాగిస్తున్నా దాన్ని బిజెపి ఖండించలేకపోవడం, అతను పార్టీని యిష్టం వచ్చినట్టు ఆడిస్తున్నా అతన్ని తీసేస్తే ప్రభుత్వం పడిపోతుందేమోనన్న భయంతో, యిమేజి నిలబెట్టుకోవడం కంటె ప్రభుత్వం నిలబెట్టుకోవడం ప్రధానమనే ఆలోచనతో పార్టీ హై

కమాండ్ అతను చెప్పినట్టల్లా ఆడడం – యివన్నీ వారికి ఆగ్రహం తెప్పించి వుంటాయి. అందుకే బిజెపికి వ్యతిరేకంగా ఓట్లు వేసి వుంటారు. ఆ నిరసనే కాంగ్రెసుకు లాభదాయకంగా పరిణమించింది. ఏమైతే అది అయిందని బిజెపి 2010లో యెద్యూరప్పను పార్టీలోంచి పంపించి వేసి వుంటే ఫలితాలు వేరేగా వుండేవేమో! – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)

మార్చి 29–33 వీక్లీకై ఎమ్బీయస్ : ఒకనాటి సుఖం... జీవితమంతా దుఃఖం

ఒక వూరి వారకాంతల గురించి శ్రీనాథుని చాటుపద్యం వుంది – 'ఒక రాత్రి సుఖం, ఒక యేటి దుఃఖం' అంటూ! వాళ్ల దగ్గరకు వెళితే తగిలే రోగాల నుండి విముక్తి పొందడానికి ఏడాది పడుతుందట. సానియా మీర్జాను పెళ్లాడిన క్రికెటర్ షోయబ్ మాలిక్ 'మీ అభిమానిని, మీతో పడుక్కుంటేనే నా జన్మ ధన్యం' అంటూ ఒకామె వస్తే బలేబలే అనుకుంటూ ఆ రాత్రి ఆమెతో గడిపేశాడు. తర్వాత ఆమె అతని పెళ్లివేళ కేసు పెట్టింది. – 'ఇతను నన్ను పెళ్లాడాడు. వరకట్నం కోసం పీడించాడు' అని. తనతో శయనించిన సాక్ష్యాలు చూపింది. అంతే రచ్చరచ్చ. ఆ రోజు ఏం సుఖం పొందాడో కానీ అదంతా మర్చిపోయి యీ కేసే జన్మంతా గుర్తుండిపోయేట్లా చేసింది. పొరపాటు చేశానని చెంపలు వేసుకుని వేసుకుంటాడు. అలాగే చెంపలు వేసుకోవాల్సిన కేసు ఒకటి యీ నెలలో వెలుగులోకి వచ్చింది.

ఒక మంచి కుటుంబం నుండి వచ్చి, ఇంజనీరింగు చదివిన ఓ యువకుడు ఓ స్నేహితుడి కోరికపై ఓ 26 ఏళ్ల విదేశీయురాలిని టూరిజం కోసం రాజస్థాన్‌కి తీసుకెళ్లాడు. వీళ్లిద్దరికీ కూడా స్నేహం వుంది. ఒకే హొటల్ గదిలో బస చేశారు. ఇద్దరూ కలిసి శయనించారు. ఏం జరిగిందో ఏమో మర్నాటికి ఆమెకు కోపం వచ్చింది. 'ఇతను నన్ను రేప్ చేశాడు' అని కేసు పెట్టింది. విదేశీయ వనిత కదా, గబగబా కేసు విచారణ జరిగింది, శిక్ష వేశారు. ఇతను జైలుకి వెళ్లాల్సి వచ్చింది. జైల్లో అతనితో బాటు వున్న ఖైదీలు అతన్ని నానారకాలుగా హింసించారు. ఇతను తండ్రితో చెప్పి మొత్తుకున్నాడు. తండ్రి తన పలుకుబడి వుపయోగించి అతన్ని అజ్ఞాతంలోకి పంపించివేశాడు. ఇతను కొత్త జీవితం ప్రారంభించాడు. అష్టకష్టాలు పడ్డాడు. మళ్లీ జీవితంలో నిలదొక్కుకుంటూ వుండగా ఏడేళ్ల క్రితం నాటి రాత్రి భూతం లేచి వచ్చింది. తన పిడికిలిలో యితన్ని బంధించింది. అయితే దాన్ని సమాధి నుంచి లేపిన దెవరు? అతని ప్రేమ!? ఒకసారి కామం కారణంగా నష్టపోయిన అతను, యీ సారి ప్రేమ కారణంగా నష్టపోయాడా?

పాండవుల వంటి ప్రజ్ఞాశాలులు మారువేషాలలో అజ్ఞాతవాసంలో గడుపుతూ తమ శక్తియుక్తులను దాచుకోవడం, అనుకోని పరిస్థితుల్లో ఆ ముసుగు తొలగిపోవడం భారతంలో అతి రసవత్తరమైన ఘట్టం. గత దశాబ్దంలో అనేక తెలుగు సినిమాలు యీ థీమ్ మీద తయారయ్యాయి. ఇప్పుడు చెప్పబోయే కథలో ఆ ఛాయలున్నాయి కానీ యిది ఒక ట్రాజిక్ హీరో గాథ.

---

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కూరు వారి మడాయీ బ్రాంచ్‌లో ఏడు నెలలుగా రాఘవ్ రాజన్ అనే 30 ఏళ్ల యువకుడు ప్రొబేషనరీ ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. అతని సొంత వూరు ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి. చిత్రావతి రోడ్డులో సాయి శ్రీ ఎన్‌క్లేవ్‌లో నివాసం. తండ్రి పేరు రాజీవ్ రాజన్, తల్లిపేరు సరస్వతి. అతనికి అక్కడ ఓటరు గుర్తింపు కార్డు కూడా వుంది. హిందుపూరు ఆర్‌టిఓ ఆఫీసువారు అతనికి పుట్టపర్తి అడ్రసు పైనే డ్రైవింగ్ లైసెన్సు జారీ చేశారు. అతను భువనేశ్వర్‌లోని కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ (కెఐఐటి)లో 2001–2005 మధ్య బిటెక్ పాసయ్యాడు. పుట్టపర్తిలో ఓ స్కూలులో టీచరుగా పనిచేశాడు.

ఆ స్కూలు హెడ్‌మాస్టరు ఎస్.వి.రామారావుగారు యితన్ని చాలా వాత్సల్యంతో చూసుకున్నారు. కామెర్లు వచ్చి ఆర్నెల్లపాటు కోలుకోలేకపోతే ఉద్యోగం పోయింది. అప్పుడాయన అక్కణ్నుంచి 15 కి.మీ.ల దూరంలో వున్న కొత్త చెరువు అనే వూళ్లో తనకు తెలిసున్న శ్రీ విద్యా డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా చేర్పించారు. అక్కడ ఏడాదిన్నర పనిచేశాక అతనికి ఎంబిఏ చదవాలని కోరిక కలిగింది. ఎమ్ఏటి పరీక్ష పాసయి కేరళలోని కన్నూరులోని చిన్మయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 2009లో చేరాడు. అక్కడ అనేక పోటీల్లో పాల్గొని బహుమతులు పొందాడు. ఆధ్యాత్మిక గురువుల ప్రసంగాలు వినేవాడు. భజనలు చేసేవాడు. శ్రద్ధగా చదివి 71% మార్కులు తెచ్చుకున్నాడు. రెండేళ్ల చదువు పూర్తయాక తను ఎంబిఏ చదివిన కాలేజీలోనే పార్ట్ టైమ్ లెక్చరర్‌గా పని చేస్తూ కాలేజీలో వుండగానే అతను పాస్‌పోర్టు కూడా తీసుకున్నాడు.

ఆ తర్వాత 2011 అక్టోబరు నుండి 2012 జనవరి వరకు కొల్లమ్ జిల్లాలోని అమృత విశ్వ విద్యాపీఠంలో ఈ–లెర్నింగ్ శాఖలో పనిచేశాడు. భవిష్యత్తు గురించి రామారావుగారిని సలహా అడిగితే ఆయన బ్యాంక్ పరీక్షలకు కట్టమని సలహా యిచ్చారు. పరీక్షలు రాస్తే స్టేటు బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కూరులో ప్రొబేషనరీ ఆఫీసరుగా సెలక్టయ్యాడు. 2012 జూన్‌లో బ్యాంకులో చేరాడు. తిరువనంతపురంలో రెండు నెలల పాటు ట్రెయినింగ్ పూర్తి చేసుకున్నాక అతనికి మడాయీ బ్రాంచ్‌లో పోస్టింగ్ యిచ్చారు. కష్టపడి పనిచేస్తాడని పేరు తెచ్చుకున్నాడు. ఆ వూళ్లో వున్న భగవతీ దేవాలయానికి క్రమం తప్పకుండా వెళ్లేవాడు. తను పనిచేసే చోటుకి 35 కి.మీ.ల దూరంలో వున్న పుదియతెరు అనే వూళ్లో వుండేవాడు. అది బాగా శ్రమగా అనిపించడంతో నెల్లాళ్ల క్రితమే తనతో పనిచేసే అసిస్టెంటు మానేజరు అభిషేక్ కుమార్ లీజుకి తీసుకున్న బాంక్ క్వార్టర్స్‌లో అతనితో పాటు వుండసాగాడు.

---

కథ యిలా నడుస్తూండగా ఈ మార్చి మొదటివారంలో బ్యాంకు రీజనల్ ఆఫీసుకి ఇంగ్లీషులో, అతను పని చేస్తున్న బ్రాంచ్‌కు మలయాళంలో ఆకాశరామన్న ఉత్తరాలు చేరాయి. రెండింట్లో సారాంశం ఒకటే – ''మీ వద్ద రాఘవ్ రాజన్ అనే మారుపేరుతో పని చేస్తున్నతని అసలు పేరు బిత్తిహోత్ర (బిత్తి) మహంతి. ఏడేళ్ల క్రితం 2006లో మార్చి 21 న రాజస్థాన్‌లోని ఆల్వార్‌లో హోటల్లో 26 ఏళ్ల జర్మన్ రీసెర్చర్ వనితను బలాత్కారం చేసిన నేరంపై అరెస్టయ్యాడు. రాజస్థాన్‌లోని ఫాస్ట్ ట్రాక్ కోర్టు మూడు వారాల్లో విచారణ ముగించి అతనికి ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. ఏడు నెలలపాటు జైల్లో వున్నాక తన తల్లికి ఒంట్లో బాగాలేదు చూడాలంటూ 2006 నవంబరు 20 న 15 రోజుల పెరోల్‌పై విడుదలై ఒడిశాలోని తన యింటికి వెళ్లాడు. డిసెంబరు 4 న తిరిగి రావాలి. కానీ ఆ రోజున అతని తండ్రి ఒక అభ్యర్థన పంపాడు – తన కొడుకు మానసికంగా ఆందోళనకు గురయ్యాడు కాబట్టి పెరోల్‌ను పొడిగించాలని. రాజస్థాన్ ప్రభుత్వం పొడిగింపుకు అంగీకరించలేదు. అంతే, యితను పెరోల్ జంప్ చేసి పారిపోయాడు. అప్పటినుండి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. ఆ కేసు రాజస్థాన్ పోలీసు రికార్డుల్లో అపరిష్కృతంగానే వుంది. రాజస్థాన్ పోలీసు వెతుకుతున్న బిత్తి మహంతియే రాఘవ్ రాజన్! కావాలంటే ఆల్వార్ రేప్ కేసు గురించి యూట్యూబ్‌లో ఫలానా లింక్ చూడండి. ఆ సందర్భంలో తీసిన బిత్తి ఫోటోలను మీ ఎదురుగా వున్న రాఘవ్ రాజన్‌తో పోల్చి చూడండి. – ఇట్లు మీ శ్రేయోభిలాషి''

---

రీజనల్ ఆఫీసువారు వెంటనే పోలీసులను పిల్చి వారికి కేసు అప్పగించేశారు. బ్రాంచ్ మేనేజర్ రాఘవ్‌ను పిలిచి ఉత్తరం చూపించి 'దీనికి నీ సమాధానం ఏమిటి?' అని అడిగింది. అతను మహా కోపంతో ఆ ఉత్తరాన్ని గుంజుకుని ముక్కలుముక్కలుగా చింపివేశాడు. సాధారణంగా మితభాషి అయిన రాఘవ్ యిలా ప్రవర్తించడంతో అతని సహోద్యోగులు విస్తుపోయారు. కొందరు యూ ట్యూబ్‌కి వెళ్లి కేసు వివరాలు చూశారు. దానిలోని వ్యక్తికి, రాఘవ్‌కు పోలికలు కనబడడంతో ఆసక్తి పుట్టి దాని గురించిన సమాచారం అంతా చదివారు.

బిత్తి మొహంతి తండ్రి పేరు బిద్యా భూషణ్ మహంతి. ఒడిశా క్యాడర్‌కు చెందిన 1972 బ్యాచ్ ఐపియస్ అధికారి. చాలా సింపుల్ మనిషి. చాలా నిజాయితీపరుడు. సైకిలుపై ఆఫీసుకి వెళ్లేవాడు. ఎవరిచేత వేలెత్తి చూపించుకోలేదు. అతనికి కుమారుడైన బిత్తి కటక్‌లోని స్టీవార్ట్ స్కూలులో, క్రైస్ట్ కాలేజిలో చదివాడు. ఇంజనీరింగ్ భువనేశ్వర్‌లోని కళింగ యిన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో చదివాడు. బిత్తి స్కూలులో కాని, కాలేజీలోని తను ఐపియస్ అధికారి కొడుకునని ఎక్కడా ఎప్పుడూ గర్వం ప్రదర్శించేలేదు.

ఇంత మంచి కుర్రవాడిపై బలాత్కారం కేసు ఏమిటి? అంటే బిత్తి జర్మన్ స్నేహితుడొకడు ఒక జర్మన్ మహిళతో స్నేహంగా వుండేవాడు. ఆమె రిసెర్చి చేసేది. వాళ్లిద్దరూ కలిసి రాజస్థాన్‌లోని ఆల్వార్‌కు విహారయాత్రకై వెళదామనుకున్నారు. అయితే ఆఖరినిమిషంలో ఆ స్నేహితుడికి ఏదో పని పడింది. ఇంజనీరింగు పూర్తి చేసుకుని వచ్చిన బిత్తితో అతను 'నువ్వు కూడా ఆమెకు స్నేహితుడివే కదా, నా బదులు నువ్వు తీసుకెళ్లు అన్నాడు. సరేనని యితను తన కంటె మూడేళ్లు పెద్దదైన ఆ యువతిని ఆల్వార్‌కు తీసుకెళ్లాడు. హోటల్‌లో బస చేశారు. ఆ రాత్రి యిద్దరూ యిష్టపడి రతికార్యంలో పాల్గొన్నారు.

మర్నాటికల్లా ఏమైందో ఏమో కానీ ఆ యువతి పోలీసు స్టేషన్‌కి వెళ్లి 'ఇతను నన్ను బలాత్కారం చేశాడు' అని కేసు పెట్టింది. మూడువారాలు తిరక్కుండా ఏడేళ్ల శిక్ష పడింది. జైలుకి వెళ్లాడు. అయితే జైల్లో అతను సాటి ఖైదీల చేతిలో చిత్రహింసలకు గురయ్యాడు. ఖైదీలు హంతకులనైనా క్షమిస్తారు కానీ రేపిస్టులను క్షమించరు. వారిపై లైంగిక అత్యాచారాలు జరుపుతారు. ఢిల్లీ రేప్ కేసులో అలాటి అత్యాచారాలు భరించలేకనే ఆ బస్సు డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడట. ఈ 23 ఏళ్ల కుర్రవాడు జైల్లోని బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుంటానంటూ తండ్రి దగ్గర ఏడ్చాడు.

తండ్రి నిజాయితీపరుడే. కానీ చిన్న పొరపాటు చేసినందుకు చాలా పెద్ద శిక్ష అనుభవిస్తున్న కొడుకుని చూసి తల్లడిల్లాడు. ఎందరో దుర్మార్గులు పెద్ద పెద్ద నేరాలు చేసి తప్పించుకోవడం తన వృత్తిలో ఎన్నో ఏళ్లగా చూస్తూ వచ్చాడు. ఈ రోజు తన కొడుకు కోసం ఏదో ఒకటి చేయాలనుకున్నాడు. తన భార్యకు ఒంట్లో బాగా లేదంటూ తను గ్యారంటీ యిచ్చి పెరోల్‌పై కొడుకుని తెప్పించుకున్నాడు. ఆ తర్వాత దాన్ని పొడిగిద్దామని చూశాడు. అది కుదరలేదు. ఇక ఏమైతే అది అయిందని కొడుకుకి కొత్త అవతారం యిద్దామనుకున్నాడు. దాని వలన తన పేరుప్రఖ్యాతులకు, పదవికి అఘాతం కలుగుతుందని తెలుసు అతనికి. అయినా కొడుకుని రక్షించుకోవడానికి తండ్రిగా యిది తను చేయవలసినదే అనుకున్నాడు.

పొరుగున వున్న ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నతస్థానంలో పనిచేస్తున్న ఐపియస్ అధికారి సహాయంతో బిత్తిని పుట్టపర్తివాసుడిగా పునస్సృష్టి చేశాడు. అక్కడ కావలసిన డాక్యుమెంట్లు అన్నీ తయారు చేయించాడు. పుట్టపర్తిలోని ఎస్ వి రామారావు వద్దకు తనూ, భార్యా ఒక విఐపి భక్తుడి ద్వారా వెళ్లారు. ''నా పేరు రాజీవ్ రాజన్. నా భార్య సరస్వతి. వీడు మా అన్నయ్యగారబ్బాయి. ఢిల్లీలో ఇంజనీరింగు చదివాడు. వీళ్ల నాన్న వ్యాపారస్తుడు. ఢిల్లీలో వుండగా మా వాడి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. పుట్టపర్తికి తీసుకుని వచ్చి మీ వంటి వారికి అప్పగిస్తే బాగుపడతాడనే ఆశతో వచ్చాం. కాస్త చూసుకుంటూ వుండండి.'' అని కొడుకుని ఆయనకు అప్పగించారు.

తెల్లధోవతి కట్టుకుని నుదుటన విభూతి పూసుకున్న బిత్తిని చూసి రామారావుగారు నమ్మారు. అతన్ని తన స్కూలులో టీచరుగా చేర్చుకున్నారు.

---

కానీ గ్యారంటీ యిచ్చిన వ్యక్తి పారిపోవడం చేత మహంతీకి శిక్ష పడింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ఫిర్యాదు చేస్తే ఆయన ప్రభుత్వం మహంతిని సస్పెండ్ చేసింది. 'నా కొడుకు ఎక్కడికి పారిపోయాడో తెలియదు, చచ్చిపోయాడేమోనని భయపడుతున్నాను.' అంటూ ఆయన యిచ్చిన స్టేటుమెంట్లను ఎవరూ నమ్మలేదు. 'మా తమ్ముడు చేసిన పని చాలా వెధవపని. మా నాన్నగారి పరువు తీశాడు. మా నాన్న పడుతున్న బాధను కళ్లారా చూశాడంటే యిప్పటి చేసుకోకపోయి వుంటే యిప్పుడైనా ఆత్మహత్య చేసుకుంటాడు.' అని అక్క సిఎన్ఎన్ టీవీలో చెప్పింది. కొన్నాళ్లకు 2009లో మహంతిపై సస్పెన్షన్ ఎత్తేశారు. చివరకు 2012లో ఆయన హెూం గార్డ్స్, ఫయర్ సర్వీసెస్ డైరక్టర్ జనరల్‌గా రిటైరయ్యాడు. ఈ కేసు లేకపోతే ఆయన డిజిపి అయ్యేవాడని అందరూ అంటారు.

పబ్లిక్‌గా ఆయన మేన్‌టేన్ చేసిన యిమేజ్ అది. 2011లో "టైమ్స్ నౌ"కి యిచ్చిన యింటర్వ్యూలో ఆయన అన్నాడు – "పెరోల్‌పై వచ్చినపుడు  వాడు చాలా నిరాశలో మునిగి వున్నాడు. ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. నేను చెప్పాను – న్యాయవ్యవస్థపై నమ్మకం పోగొట్టుకోవద్దని. సన్యాసం తీసుకుంటే యింకో జన్మ ఎత్తినట్టే కదా అని వాడు వాడి స్నేహితుల వద్ద అన్నాడట. నా అనుమానం వాడు మానస సరోవరం పారిపోయి అక్కడ సన్యాసిగా గడుపుతున్నాడని!" అని.

పైకి యిలా చెప్తూనే లోపాయికారీగా పెరోల్‌పై పారిపోయిన బిత్తిని పట్టించుకోవద్దని ఆయన రాజస్థాన్ పోలీసు వ్యవస్థలోని మిత్రులను (రాజస్థాన్ డిజిపి ఎఎస్ గిల్ వారిలో ఒకరు) కోరాడు. వాళ్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసరును బదిలీ చేసేసి కేసు సాగకుండా చేశారు. బిత్తి వేలిముద్రల రికార్డు అవీ కూడా తీసేశారు. బిత్తి పుట్టపర్తిలో రకరకాల వుద్యోగాలు చేస్తూనపుడు మహంతి, భార్య కొడుకుని చూసి వస్తూనే వుండేవారు. అతను బుద్ధిగా వుంటూ జీవితాన్ని సక్రమంగా నడుపుకుంటున్నందుకు సంతోషించారు. అయితే ఎంబిఏ చదువుకుంటానన్నపుడు మళ్లీ యిబ్బంది వచ్చింది. వాళ్లు స్కూలు రోజుల నుండి డాక్యుమెంట్లు కావాలన్నారు. బిత్తి మహంతి చదివిన స్కూళ్లనుండి, కాలేజీల నుండి రాఘవ్ రాజన్ పేర దొంగ డాక్యుమెంట్లు సృష్టించి పంపించాడు. వాటి సహాయంతోనే కొత్త అవతారంలో బిత్తి ముందుకు సాగగలిగాడు.

---

తన నిజాయితీని, వృత్తిని పణంగా పెట్టి తండ్రి చేసిన త్యాగం యీ రోజు వృథా కావడానికి కారణం – ఆకాశరామన్న ఉత్తరం. అదెవరు రాశారు అన్నదే యింకా తెలియదు. బిత్తి, రాఘవ్ రాజన్ ఒకరే అన్న సంగతి తెలియడానికి ఎవరికి అవకాశం వుంది? తెలిసినా ఎవరు పని గట్టుకుని బ్యాంక అధికారులకు చెప్పి అతని ఉసురు పోసుకుంటారు? ప్రస్తుతానికి యిది మిస్టరీ.

కానీ ఒక కథనం ప్రకారం – దీని వెనుక ప్రేమగాథ వుంది. ప్రొబెషనరీ ఆఫీసరుగా పనిచేసే రోజుల్లో రాఘవ్ రాజన్ తనతో బాటు ట్రెయినింగ్ అవుతున్న ఒక మలయాళీ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. పోస్టింగు అయిన తర్వాత కూడా ఆమెతో గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడేవాడు. ప్రేమలో మునిగినపుడు ఆమె తన సొంత మనిషని భావించి అతను తన గతం చెప్పి వుండవచ్చు. వీరిద్దరి ప్రేమ ఆ అమ్మాయి తలిదండ్రులకు యిష్టం లేదు. అందువలన వేరే చోట పెళ్లి చేస్తారేమోనన్న భయంతో ఆ అమ్మాయి వెంటనే పెళ్లి చేసుకోమని బిత్తిని కోరింది. అతను వాయిదా వేస్తున్నాడు. అది ఆమెకు కోపం తెప్పించి యీ పని చేసి వుండాలి. లేదా ఆమె ద్వారా విషయాలు తెలుసుకున్న ఆమె తలిదండ్రులు కసితో రాఘవ్‌ను ఎక్స్‌పోజ్ చేసి వుండాలి.

ఏది ఏమైతేనేం? రాఘవ్‌ను యిప్పుడు పోలీసులు బంధించారు. అతను మొదట్లో తనే బిత్తిని అని ఒప్పుకున్నాడు. కానీ పోనుపోను ధైర్యం తెచ్చుకున్నాడులా వుంది, 'బిత్తి ఎవరు? నేను రాఘవ్‌ను' అనసాగాడు. పోలీసులు తమకు తెలిసిన ట్రిక్కులన్నీ ఉపయోగిస్తున్నారు. నిద్రపోతూండగా హఠాత్తుగా లేపి "బిత్తీ" అని పిలుస్తున్నారు. అతను అంత మత్తులో కూడా "బిత్తీ ఎవరు? నా పేరు రాఘవ్" అని చెప్పేసి అటు ఒత్తిగిల్లి పడుక్కుంటున్నాడు. వీళ్లు ఛోటామోటా పోలీసు ఆఫీసర్లు. అతను ఐపియస్ అధికారి కొడుకు. బాల్యం నుండీ పోలీసుల మధ్యనే పెరిగాడు. పైగా గత ఏడేళ్లగా మారుపేరునే తన పేరుగా చేసుకున్న మేధావి!

రాఘవ్ గుట్టు రట్టు చేసినది అతన్ని ప్రేమించి అలిగిన అమ్మాయే అయితే యిది ఒక మంచి సినిమా కథగా తయారవుతుంది. సినిమా మాట అలా వుంచితే యీ కథలో చక్కటి నీతి వుంది – 'మీద పడుతోంది కదా పడతితో పక్క ఎక్కితే ఆ తర్వాత పడరాని పాట్లు పడాలి.' **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2013)**

• • •